# Compass

## Finding The Right Direction...

Finding The Right Direction...





Balachandra
B.Sc., LL.B., F.C.S.

Compass
Finding The Right Direction
Balachandra

# కంపాస్

Finding The Right Direction...

"భావి భారత పౌరులు... భారత భాగ్య విధాతలు
భవ్య భవిష్య నిర్మాతలు... భారత బాల బాలికలకు
అంకితము ఈ దిక్సూచి"

**బాలచంద్ర**

abhaya FOUNDATION
Hyderabad - 500004, TS

# Compass

Finding the Right Direction...

Author: **Balachandra**

Copy Right© **Balachandra**

*All rights reserved. No part of this work may be reproduced in any form without written permission of the publisher*

First Edition : **January, 2023**

Copies : **10000**

Price : **Priceless**

Illustrations & Cover Design
**Mohd. Khurram Uddin Zeeshan**
**Chepuri Ramesh**

Coversion & Layout Design
**Sankar Devalla**
+91 9704640273 / 98497 14042

Published by:
**abhaya FOUNDATION**
6-3-609/140/1, Anandanagar, Khairathabad,
Hyderabad - 500004, Telangana

abhayafoundation@yahoo.com | abhaya@abhayafoundation.org
Mobile: 99592202450 | What's App: 8143707803

www.abhayafoundation.org | www.abhayahome.org
fb: abhayafoundationHyd | fb Page: abhaya Foundation- Home of Happiness
Twitter: abhayaheart | Youtube: abhayaheart

Printed at:
**Dolphin Graphics**
IDA, Uppal, Hyderabad - 500039, TS
dolphingraphicsads@gmail.com
Ph: 8106988009

# మాతృ దేవోభవ – పితృ దేవభవ



Sri Gowra Subbaraya Setty Garu
Smt. Gowra Govindamma Garu

సరస్వతి నమస్తుభ్యం ।
వరదే కామరూపిణి ॥
విద్యారంభం కరిష్యామి ।
సిద్ధిర్భవతుమే సదా ॥
పద్మపత్ర విశాలాక్షి ।
పద్మకేసరి వర్ణిని ॥
నిత్యాం పద్మాలయాందేవీ ।
సామాంపాతు సరస్వతి ॥

నేటి బాలలే రేపటి పౌరులు అని అందరికీ తెలుసును. కానీ ఈ రోజు బాలబాలికలను సరైన మార్గంలో నడిపించే మనుషులు మరియు పుస్తకాలు చాలా తక్కువనే అని చెప్పాలి. మేము అందరము ఉమ్మడి కుటుంబంలో పెరిగిన వాళ్ళము. చాలా భయభక్తులతో పెద్దల ఎడల గౌరవ మర్యాదలతో ఎన్నో జీవిత పాఠాలను నేర్చుకున్నాము. మా తల్లిదండ్రులు కీర్తిశేషులు శ్రీమతి గౌరా గోవిందమ్మ మరియు శ్రీ గౌరా సుబ్బరాయ శెట్టి గార్లు చాలా సంస్కారమంతముగా మమ్ములను పెంచినారు. ఈ రోజు మా అందరి జీవితము కూడా వారిచ్చిన వరమే అని చెప్పాలి. ఆ రోజుల్లో పిల్లలకు ఏదైనా తెలుసుకోవాలంటే ఈరోజు ఉన్నన్ని మార్గాలు ఉండేవి కావు. చెబితే తల్లిదండ్రులు చెప్పాలి లేదా బడిలో ఉపాధ్యాయులు చెప్పాలి కాదంటే మంచి పుస్తకాల ద్వారా విషయాలు తెలిసేవి. కానీ ఈరోజు పిల్లలకు తల్లిదండ్రులు, గురువులు చెప్పే వాటికన్నా చుట్టూతా ఉండే ఎన్నో విషయాలు ప్రధానంగా సామాజిక మాధ్యమాలు, సినిమాలు, టీవీలు, సమాచార పత్రికలు, ఫోన్లు, స్నేహితులు ద్వారా తెలుసుకుంటున్నారు. ఇలా తెలుసుకునే సమయంలో నిజానికి నేటితరం పిల్లలందరూ కూడా పుస్తకాలకు దూరమైపోయారు. పఠనాభిలాష రోజురోజుకు తగ్గిపోతున్నది. అలాంటి ఈ తరుణంలో మా బాలచంద్ర దైవప్రేరణ వలన కొరోన కష్టకాలములో నేటి విద్యార్థుల కోసమై మంచి పుస్తకం వ్రాసారు అని తెలుసుకున్నాము. వారు పుస్తకాన్ని చక్కగా ముద్రించి తెలుగు రాష్ట్రాలలోని ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా అందించాలని చెప్పినప్పుడు చాలా సంతోషం అయింది. మా తల్లదండ్రుల జ్ఞాపకార్థం...వారి కుటుంబ సభ్యులైన మేమంతా ఈ పుస్తక ముద్రణకై మా వ్యాపార సంస్థ నుండి సామాజిక సేవా బాధ్యతతోటి విరాళం ఇవ్వగలిగి నందుకు మేము దేవుడికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము.



ఈ పుస్తకం ద్వారా లక్షలాది మంది పిల్లలకు, తల్లితండ్రులకు, ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం జరగాలని మా అందరి ఆకాంక్ష. మా గురు దేవులు శ్రీ శ్రీ రవి శంకర్ గురూజీ దివ్యాశీస్సులు అందరికీ అందాలన్న ప్రార్థనలతో...అమ్మా నాన్నలకు పదాభి వందనములతో...

శ్రీమతి గౌరా సవిత శ్రీ గౌరా శ్రీనివాస్
Board of Directors, Gowra Ventures Pvt Ltd, Hyderabad

# ముందుమాట

*అందరికీ వందనములతో వ్రాయునది,*

భగవత్ ప్రేరణ వలన గత నాలుగు దశాబ్దముల నుండి, దేశ వ్యాప్తముగా కొన్ని లక్షల కిలో మీటర్లు ప్రయాణం చేసి, ఎన్నో రాష్ట్రాలలో, లక్షల మంది విద్యార్థిని విద్యార్థులను కలిసి, మాట్లాడి, ముచ్చటించి, ఉత్సాహ ప్రోత్సాహములు అందించి... వారిలో ప్రేరణ నింపే భాగ్యం నాకు కలిగింది. ఎక్కడికి వెళ్లినా ఎవరితో మాట్లాడినా నేటి విద్యార్థుల జీవన విధానాలు, విశేషాలు కొంత బాధ కలిగిస్తుంటాయి. ప్రధానముగా విద్యార్థుల చదువు సంస్కారములు ఏ రీతిగా వున్నాయో మరియు పోటీలను, పరీక్షలను వారు ఎలా ఎదుర్కొంటున్నారో గమనిస్తే చాలా దిగులుగా వుంటుంది.

అందువలన నేను ఎక్కడ మాట్లాడినా, ఎన్ని వేల మందితో సంభాషించినా, నాకు తెలిసిందేదో నేను చెప్పడం మానుకుని, విద్యార్థులతో ముచ్చటిస్తూ అసలు వారు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటి, ఎందుకు చదవలేక పోతున్నారు, పరీక్షలలో ఓటమికి కారణం ఏమిటి, జీవితము మీద అవగాహన లేకపోవడానికి కారణాలేమిటి, ఇలా కొంత చర్చించి, వారితోటే కారణాలు చెప్పించడం ద్వారా వారిలో, అయ్యో! ఈ కారణాల వల్లనే కదా నేను ఏమీ సాధించలేకపోతున్నాను, కనీసం ఇప్పటి నుండైనా నా తప్పులు సరిదిద్దుకొని బాగుపడాలన్న వైఖరిని వారిలో తెప్పించే ప్రయత్నం చేస్తుంటాను.

తదనంతరం వాళ్లకు వారుగా ఏకరవు పెట్టిన కారణాలనే ఒక్కొక్కటిగా తీసుకుని, వాటికి సహజమైన, సందర్భానుసారమైన, సవివరమైన, సోదాహరణములతో, నేను నవ్వుతూ వాళ్ళని నవ్విస్తూ వారికి ఆత్మీయుడిలా, అమ్మ తమ్ముడిలా, మామయ్యగా మారి వారికి సరి అయిన సమాధానాలు చెప్తూ వారి గుండెల నిండా స్ఫూర్తి నింపే ప్రయత్నం చేస్తుంటాను.

మాట్లాడేది హృదయ పూర్వకముగా వుంటుంది కాబట్టి, సభ ఏదైనా, స్థలం ఏదైనా, సమయం ఏదైనా, మాట్లాడేది ఏ వయసు వారైతోనైనా, ఎలాంటి పిల్లలతో అయినా నా మాటలు వారిలో స్ఫూర్తి నింపడం నేను చూస్తుంటాను. నయా పైసా ఖర్చు లేకుండా నా దేశ భవిష్యత్తు ను తీర్చి దిద్ద గలిగే అద్భుతమయిన అవకాశం నాకు ఈ ఉపన్యాస కళ ద్వారా కలిగినందుకు ఎన్నోసార్లు భగవంతుడికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ వుంటాను. వంద మంది వుంటే ఒక లాగా, వేల మందుంటే ఇంకో లాగా కాకుండా, విద్యార్థులలో స్ఫూర్తి నింపడమే లక్ష్యంగా చేసుకుని వారి సేవలో తరిస్తున్నాను.

*ఈ నేపథ్యంలో నాతో సంభాషిస్తూ ఎంతోమంది,*

"అయ్యా! మీరు చెప్పే విషయాలన్నీ పిల్లలకి మాత్రమే కాక పెద్దలకు కూడా చాలా ఉపయోగకరముగా వున్నాయి. మీరు ఇలాంటి విషయాలు పుస్తక రూపంలో అందిస్తే బాగుంటుంది" అనే పుస్తక ప్రియులున్నారు.

"మేము, ఉపాధ్యాయులమే అయినా మా జీవితములో ఏనాడూ ఇలాంటి విషయాల గురించి ఆలోచించడం గాని చర్చించడం గాని, చేయలేదు. మీరు చెప్పే విషయాలు విద్యార్థుల కంటే మాకే ఎక్కువగా ఉపయోగ

పడతాయి" అనే అధ్యాపకులున్నారు.

"మీ భావనలు, చెప్పే విధానం, కట్టు, బొట్టు, జుట్టు, ఆకట్టుకునే చతురత, అనర్గళమైన ఉపన్యాస ధోరణి ఇలా అన్నీ ఎంతో స్ఫూర్తి దాయకముగా వుంటాయి. ఎంతో సహజంగా మీరు సామాజిక, సాంఘిక, పౌరాణిక, దేశ భక్తి ప్రబోధితమైన విషయాలను, సంఘటనలను కళ్ళకు కట్టినట్టు చెప్పే విధానం నిజంగా విద్యార్థులకు జీవిత కాలపు స్ఫూర్తిని నింపుతుంది" అనే తల్లి తండ్రులున్నారు.

"సార్, మీరు మాట్లాడేది వింటుంటే అయ్యో ఇన్నాళ్లు నేను చదువునే కాదు, నా జీవితాన్ని కూడా ఎంత వృధా చేసానో తెలుస్తోంది. ఇక నుండైనా నన్ను నేను మంచి మార్గంలో పెట్టుకుని తల్లిదండ్రులకు సాయం చేస్తాను, బాగా చదువుకుంటాను" అనే వేల మంది విద్యార్థినీ విద్యార్థులున్నారు.

ఇలాంటి ఫీడ్ బాక్ ఎన్నో చోట్ల నుంచి వస్తుంటుంది. కానీ నేనెప్పుడూ వాటి గురించి ఆలోచించనే లేదు...చేస్తున్న దివ్య కార్యాన్ని మరింత శ్రద్ధాభక్తులతో చేసుకుంటూ ముందుకు వెళ్ళడం తప్ప ఇంకో ఆలోచన రాలేదు. కొన్ని చోట్ల గంటల తరబడి మాట్లాడుతుంటాను... మరి కొన్ని చోట్ల గొంతు ఒత్తిడికి గురై మాట్లాడలేని సందర్భాలున్నాయి. ఇంకొన్ని చోట్ల చెస్ట్ పెయిన్ వచ్చి ఇబ్బంది పడి వుంటాను. దేహమునకు వయసు పెరిగే కొద్దీ వచ్చే కష్టాలు ఇవన్నీ. మునుముందు నా దేశము కోసం నేనేమి చేయగలనో తెలియదు. ఇప్పుడు ఈ దేహానికి 50 ఏళ్ళు వచ్చేసాయి. నా శక్తి యుక్తులు మునుముందు ఎలా వుంటాయో తెలియదు.

ఇలాంటి పరిస్థితులలో, ఇబ్రహీంపట్నంలోని అభయ ఆనంద నిలయమును వేదికగా చేసుకుని, శ్రీ సత్యసాయిబాబా వారిచ్చిన దివ్యప్రేరణతో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఒక పుస్తకం వ్రాయాలని సంకల్పించాను. అందుకు శ్రీ శార్వరి నామ ఉగాదిని ముహూర్తంగా నిర్ణయించి, విశ్వవ్యాప్తంగా మానవాళిని పట్టి కబళిస్తున్న కోవిడ్ – 19 (కరోనా) భారత ప్రజలకు 68 రోజుల పర్యంతం (స్వీయ నిర్బంధనము) ఏకాంత వాసమును ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, అందరి ప్రయోజనం కోసమై పుస్తకము వ్రాసే కార్యాన్ని సంకల్పించాను. పూర్వం దేశ నాయకులు కారాగారములలో బంధించ బడినప్పుడు వారి సమయాన్ని మంచి పుస్తకాలు చదువుతూనో లేక రచనలు చేస్తూనో గడిపే వారని విన్నాను. అలాగే నేను కూడా ఈ స్వీయ నిర్బంధమును సాకుగా తీసుకుని సమాజానికి పనికి వచ్చే మంచి పని చేయాలని సంకల్పించాను.

ఈ పుస్తకములో విద్యార్థులు, తల్లి తండ్రులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు లేవనెత్తిన పలు సమస్యలకు, సందేహాలకు, విచారములకు, కష్టములకు, అంశములకు... నాకు తెలిసిన విధంగా సమాధానములను ఇచ్చే ప్రయత్నము చేస్తున్నాను. అందుకు రూపమే ఈ పుస్తకము.

ఈ వ్యాసములు వర్తమాన మరియు భావితరాల విద్యార్థులలో కొద్దిమందికి ఉపయోగపడినా, నా జీవితము సార్థకమైనట్లే అని తలుస్తాను. మునుముందు వయోభారము చేత నేను మాట్లాడ లేక పోయినా... నా భావనలు భారతీయులందరి తోటి సజీవంగా వుంటాయని సంతృప్తి పడతాను. రేపు నేను ఈ శరీరం వదిలేసినా... ఈ పుస్తకం ద్వారా నేను అందరితో కలకాలం జీవించినట్లుగానే అనుకుంటాను.

ఈ అద్భుతమైన ఆలోచనలు వ్యాసములుగా మొదట అభయ సమాచార మాస పత్రిక ద్వారా తెలుగులో ధారావాహికలాగా ప్రచురించబడుతున్నాయి. తదుపరి ఆడియో మరియు వీడియో పాఠాలుగా తీర్చి దిద్దబడాలని

ఆశించాను. వీలును బట్టి కనీసం హిందీ మరియు ఆంగ్లభాషలలోకి తర్జుమా చేయబడతాయి. పాఠకులందరికి, ప్రధానంగా తెలుగు చదవ గలిగే వారికి తప్పక ఈ రచనలు స్ఫూర్తి నింపగలవని నా ప్రగాఢ విశ్వాసము.

ఈ రచనా వ్యాసంగములో నా అశయాన్ని గమనించిన కుమారి॥ సోమిశెట్టి లలిత లహరి, రచనల్లో నాకు తోడు నిలవడమే గాక తను కూడా, నాకు లాగానే ఆలోచిస్తూ స్వయంగా కొన్ని వ్యాసాలు నా శైలిలో వ్రాసింది. వాటిని నేను మళ్ళీ సమీక్షించి సరి చేసుకున్నాను.  నిజానికి తిరిగి చూస్తే లలిత లహరి కూడా నాతో పాటుగా ఈ గ్రంధాన్ని వ్రాసి సహ రచయితగా మారిపోయింది అని చెప్పాలి.

ఇక రచనా సమయములో నాకు అభయ ఆత్మ బంధువులు, Dr K సాయిలత, శ్రీ M మహేష్,  శ్రీమతి లక్ష్మి, శ్రీమతి శోభ పట్వారి, CA గౌరా లక్ష్మీప్రసాదు, మరియు ఎంతోమంది విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు ఎంత గానో సాయం చేసారు. ఈ గ్రంథ యజ్ఞము నిజానికి ఒక మహత్తరమైన అనుభూతిగా నిలచి పోయింది. దైవప్రేరణ నిజమే అన్న దానికి నిలువెత్తు నిదర్శనము ఈ గ్రంథము.

ఈ పుస్తకమును అందంగా తీర్చిదిద్దిన మిత్రులు దేవళ్ళ శంకర్, మొహమ్మద్ ఖుర్రమ్ ఉద్దీన్ జీషాన్ మరియు చేపూరి రమేష్‌లకు ఎంతో ఋణపడివుండాలి. అలాగే ఈ పుస్తక ముద్రణ చేసిన డాల్ఫిన్ గ్రాఫిక్స్ (ముద్రణాలయం) బృందానికి కృతజ్ఞతలు. ఎంతో శ్రమకోర్చి ఎందరో వ్యక్తులు ముద్రణలో తప్పులను సరిచేసే ప్రయత్నం చేసారు. కానీ ఇంకా కొన్ని తప్పులు దొరలివుంటాయి. వాటిని మా దృష్టికి తెస్తే తప్పక సరిదిద్దుతాము.

Love & Life for the Country

*Balachandra*

B.Sc., LL.B., F.C.S.



# ఉడుతలా నాకు చేతనైన సహాయమేదో చేద్దామని!

2020 మార్చి, అందరు కొరోనా భయంతో బిక్కుబిక్కు మని ఇంట్లో కూర్చుని... ఆ వంట ఈ వంట చేసుకుంటూనో... లేదా అది ఇది తింటూనో... ఆ పనీ ఈ పనీ చేసుకుంటూనో కాలక్షేపం చేసే సమయం. అటువంటి సమయంలో ఒకరోజు హఠాత్తుగా బాలచంద్ర అంకుల్ కొన్ని అంశాలు నాకు what's app లో పంపించి... ఇవన్నీ కూడా విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలు, సవాళ్లు మనం వీటి మీద పరిశోధన చేస్తూ, ప్రతి అంశాన్ని చర్చిస్తూ సమాధానాలను అందిస్తూ వ్యాసాలు రాయాలి. ఇది నాకు భగవత్ ప్రేరణతో కలిగిన ఆలోచన ఈ కార్యంలో నువ్వు కూడా నాకు చేయందించాలి అని చెప్పారు.

ఇంతటి కార్యంలో నేనేమి చేయగలను అనుకున్నాను. కానీ, ఉడతలా నాకు చేతనైన సహాయమేదో చేద్దామని, ఆయా అంశాల క్రింద వివిధ రకములైన ప్రశ్నలు తయారు చేసే ప్రయత్నం చేసి వారికి పంపించాను. అవన్నీ ఆమోదయోగ్యంగా ఉండడంతో అంకుల్ ఇక ముందుకు వెళదాం అని అన్నారు.

ఎప్పుడో పాఠశాల సమయంలో తెలుగు వ్రాసిన నాకు... తెలుగు వ్రాయడం ఎలా వస్తుందో అని సందేహించాను, కానీ అంకుల్ ఇచ్చిన ప్రోత్సాహం ఆయన ఆదర్శం వాటికి మించిన భగవత్ ప్రేరణ ఈ పుస్తక యజ్ఞములో నన్ను భాగమయ్యేలా చేసింది. నాతో పాటు ఇంకా చాలామందికి ఇలాంటి గొప్ప అవకాశం వారు ఇచ్చారు.

అంకుల్ సూచించిన విధంగా ప్రతి అంశానికి వివిధ ప్రశ్నలు చేర్చి, వాటికి సమాధానాలు, సలహాలు, ప్రేరణ మంత్రములు మరియు స్ఫూర్తి కథలను జోడించాము. అటువంటి సమస్యలు ఎదురైనప్పుడు నిజజీవితంలో కొంతమంది వ్యక్తులు వాటిని ఎదుర్కొని జీవితాన్ని సమర్థవంతంగా ఏ విధంగా ముందుకు తీసుకెళ్లారు అని చెప్పే ప్రయత్నం చేసాము.

ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే నిజంగా ఇదంతా మా చేతుల ద్వారానే జరిగిందా అని అనిపించింది, కానీ తర్వాత బోధపడింది ఏమిటంటే మనం చేసే పనిలో భగవంతుడిని భాగస్వామిగా చేసుకుంటే అది ఎంతటి అద్భుతమైన విజయమైనా సాధించగలదు అని.



ఈ పుస్తకంలో చర్చించిన అంశాలు కేవలం విద్యార్థులకే కాక ప్రతి మనిషి జీవితంలో ఎదురయ్యే ప్రశ్నలకి సమాధానం చెప్పగలవు అని నమ్ముతున్నాను. ఈ పుస్తకం విద్యార్థులతో పాటు అవసరం ఉన్న ప్రతి వ్యక్తికి అందాలి... వారి జీవితాన్ని తీర్చిదిద్దుకునే స్ఫూర్తిని ఈ పుస్తక మిత్రుడు అందించి, ధైర్యాన్ని కలుగజేయాలని కోరుకుంటున్నాము. ఇంతటి మహత్కార్యంలో నన్ను కూడా ఒక సమిధను చేసినందుకు నేను బాలచంద్ర అంకుల్ కి మరియు భగవంతుడికి కృతజ్ఞురాలిని.

S లలిత లహరి
B.Com., LL.B.,
అభయ ఆత్మ బంధువు

# మన కాలపు స్ఫూర్తిపత్రాత

మీ చేతుల్లో ఉన్న పుస్తకం ఒక పెన్నిధి. ఇది మీదాకా వచ్చిందంటే మీరెంతో భాగ్యం చేసుకున్నట్టు. ఇందులో ఉన్న విషయం వల్లనే కాదు, అసలు ఈ పుస్తకం రాసిన మనిషే మన సమాజానికి దొరికిన పెన్నిధి.

సుంకు బాలచంద్ర ని కలుసుకున్నప్పుడు, ఆయన ఇంతదాకా నడిచిన దారి గురించి విన్నప్పుడు నమ్మశక్యం కానంత ఆశ్చర్యం కలుగుతుంది. కాని, ఆశ్చర్యం లేదు. భగవంతుడు ఈ నిష్ఠుర ప్రపంచం మీద తన నిర్హేతుకమైన అనుగ్రహాన్ని వర్షించాలనుకున్నప్పుడు, తన సంకల్పాల్ని నెరవేర్చగల మనుషులకోసం వెతుక్కున్నప్పుడు ఇలాంటి కార్యశూరుల్నే, నిస్వార్థపరుల్నే ఎంచుకుంటాడు. ఒకప్పుడు వివేకానందుణ్ణి ఎంచుకున్నట్టు, నిన్న డా. కలాంని ఎంచుకున్నట్టు.

ఇప్పుడు బాలచంద్ర చేస్తున్న పనుల్నీ, చెయ్యాలనుకుంటున్న పనుల్నీ చూసినప్పుడు ఆయన నా కళ్ళకి మరో వివేకానందుడిలా, మరో కలాంలా కనిపిస్తున్నారు.

ఆయన జీవితం చూడండి. సైన్సు విద్యార్థి. న్యాయశాస్త్ర పట్టభద్రుడు. కంపెనీ సెక్రటరీగా చేస్తున్న ఉద్యోగం వదిలిపెట్టి, తోటిమనుషులకోసం పూర్తిస్థాయి సామాజిక కార్యకర్తగా పనిచేయాలన్న కోరికతో తాను దాచుకున్న పొదుపు డబ్బుతో 2006 లో అభయ ఫౌండేషన్ ప్రారంభించారు. ఇంకా రెండు దశాబ్దాలు పూర్తి కాలేదు, అప్పుడే అభయ 15 రాష్ట్రాల్లో సేవలు అందిస్తున్నది. విద్య, వైద్యం, అత్యవసరసేవలతో పాటు యువత నైపుణ్యాభివృద్ధి మీద, ఉపాధి కల్పన మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టి, ఇప్పటిదాకా వేలాది మంది యువత జీవితాల్లో మార్పు తీసుకువచ్చింది. మూడు రాష్ట్రాల్లో, తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటకలలో ఉచిత నైపుణ్య శిక్షణా కేంద్రాలు నడుస్తున్నాయి. ఇలా అన్ని రకాల కార్యక్రమాల ద్వారా ఇప్పటి దాకా 5 లక్షలమందికి పైగా అభయ ఫౌండేషన్ నుండి ఏదో ఒక రూపేణా సహాయసహకారాలు పొందారంటే అది చిన్న విషయం కాదు.

ఈ సేవాకార్యక్రమాల్ని నడిపిస్తూ ఉండటంతో బాటు, బాలచంద్ర తన చుట్టూ ఉన్న సమాజాన్ని మేల్కొల్పటం కోసం మరో రెండు గొప్ప కార్యక్రమాలు చేపట్టారు.

ఒకటి, 2019 లో ఆయన చేపట్టిన భారతదర్శన్ యాత్ర. ఒకప్పుడు ఆదిశంకరాచార్య ఏ మార్గంలో భారతదేశ సంచారం చేసి ధర్మప్రతిష్టాపన చేసారో, ఆ మార్గాన్నే ఎంచుకుని, నేడు బాలచంద్ర కూడా భారత సంచారం చేయడం నాకు ఒక మహిమాన్విత ప్రయత్నంగా అనిపిస్తున్నది. 4 దేశాలు, 23 రాష్ట్రాలు, 106 దివ్యదేశాలతో పాటు ఎన్నో ఊళ్ళు, నగరాలు, కొండలు, అడవులు, నదులు, సముద్రతీరాల్ని దర్శిస్తూ ఆయన చేసిన యాత్ర ఆయనకి అడుగడుగునా భగవత్కృపతో పాటు యథార్థ భారతదేశదర్శనాన్ని కూడా అందించింది. తాను ఏ అంతర్వాణి పిలుపు విని సేవారంగంలోకి ప్రవేశించారో, ఆ రంగంలో మరింత క్రియాసిద్ధి పొందడానికి ఆయనకి ఈ యాత్ర ఉపకరిస్తున్నది అనడంలో సందేహం లేదు. ఆయన యాత్రా చరిత్ర చదువుతూ ఉన్నాను. అడుగడుగునా ఆయన ఆ యాత్ర తన దేహాన్నీ, మనసునీ, ఆత్మనీ కూడా పునీతం చేసిందనే చెప్తున్నారు.

ఆయన చేపట్టిన రెండో బాధ్యత, రచయిత కావడం. తన స్ఫూర్తిని నలుగురితో పంచుకోవడం. ఇప్పుడు మీ చేతుల్లో ఉన్న ఈ పుస్తకం మొత్తం భారతదేశాన్ని కళ్ళారా చూసిన ఒక దేశభక్తుడు తన జాతి యువతీయువకుల్ని

మేల్కొల్పడానికి రాసిన పుస్తకం. ఒకప్పుడు స్వామి వివేకానందులు భారతదేశాన్ని మేల్కొల్పాలి అని అనుకొన్నప్పుడు యువతమీదనే దృష్టి పెట్టారు.

వివేకానందుడి తర్వాత మనదేశ యువతని అంతే సత్యనిష్టతో మేల్కొల్పినవాడు, బలపరిచినవాడు, దారి చూపినవాడు మహాత్మాగాంధి. ఆయన నడిపిన పత్రిక పేరు యంగ్ ఇండియా! నవ జీవన్ అనే మాట ఆయనకి ఎంతో ఇష్టమైన మాట. ఆయన నిజంగానే ఒక జాతిని నిర్మించాడు.

తిరిగి మన కాలంలో, ఇప్పటి పరిస్థితుల్లో, ఈ గ్లోబలైజేషన్ నేపథ్యంలో యువత పాత్రను పునర్నిర్వచించినవాడు కలాం. ఆయన కూడా వివేకానందుడిలాగా, గాంధీలాగా తన దేశ ప్రజల్ని, ముఖ్యంగా యువతరాన్ని ఉత్తేజితుల్ని చెయ్యడం కోసం ఎన్నో రచనలు చేసారు. ఒక వ్యక్తి తాను పుట్టి పెరిగిన పరిస్థితుల్ని దాటి తన జీవితాన్ని సార్థకంగా ఎలా మలుచుకోవచ్చో కలాం జీవితమే ఒక నిరూపణ.

ఈనాటి యువత చిన్న విద్వేషాగ్నికైనా రగిలిపోగల ఎండుగడ్డిలాగా ఉన్నారు వాళ్ళు. ఒక దేశంలో యువత సరైన దారిన నడవకపోతే, ఆ దేశానికి భవిష్యత్తు లేదనే చెప్పాలి. మనం మన యువశక్తిని దేశనిర్మాణానికి మేల్కొల్పకపోతే, దేశనిర్మాణంలో వారిని భాగస్వాముల్ని చేయకపోతే అంతకు మించిన దేశద్రోహం మరొకటి ఉండదు. యువతని మేల్కొల్పడానికి ఎన్నో మార్గాలున్నాయి. అందులో వారికి స్ఫూర్తినివ్వడం కూడా ఒకటి. ఒకచోట డా. కలాం ఇలా అంటున్నారు:

ఒకటి నిశ్చయంగా చెప్పవచ్చు. మానవుడు సాధించిన అతి పెద్ద విజయం తన జీవితాన్ని తనకై తాను తీర్చిదిద్దుకోవడమే. తోటిమనుషులు తమ జీవితాల్ను తామెలా తీర్చిదిద్దుకున్నారో తెలుసుకోవడంలో ఎంతో ప్రయోజనం ఉంది. ఎందుకంటే మనం మన జీవితాల్లో వారు చేసినంత గొప్ప పనులు చేయగల్గినా చేయలేకపోయినా, వారి అనుభవాలను మన జీవితాలకు కూడా అన్వయించుకుని చూసుకోవచ్చు.

ఈ మాటలు బాలచంద్ర జీవితానికి కూడా వర్తిస్తాయి. తన దేశంకోసం, తన మనుషుల కోసం తాను వీలైనంతగా తన శక్తియుక్తుల్ని సమర్పించాలనే ఈ సంకల్పం ఆయనలో ఎలా ఉదయించిందో గాని, అది ఆయన జీవితాన్ని బలోపేతం చెయ్యడమేకాక, ఆయన చుట్టూ ఉన్న వాళ్ళ జీవితాలని కూడా బలోపేతం చేస్తున్నది.

అటువంటి వ్యక్తి రాసినది కావడం వల్ల ఈ పుస్తకంలో ప్రతి ఒక్క పుటలోనూ నాకు అపారమైన ఆవేదన, స్ఫూర్తి, యువతరాన్ని బలోపేతం చెయ్యాలన్న దృఢనిశ్చయం కనిపిస్తున్నాయి. విజయం గురించీ, జీవితంలో రాణించడానికి పాటించవలసిన మెలకువల గురించీ తెలుగులో పుస్తకాలేమీ తక్కువలేవు. వ్యక్తిత్వ వికాసాన్ని ఒక వృత్తిగా కొనసాగిస్తున్న రచయితలు కూడా తెలుగులో తక్కువ కాదు. కాని తన వ్యక్తిగత జీవితంలోనూ, బహిరంగ జీవితంలోనూ కూడా ఒక్కలానే జీవిస్తూ, తన యావచ్ఛక్తినీ జాతికి సమర్పణ చేస్తూ యువతరాన్ని మేల్కొల్పుతున్న రచయిత సుంకు బాలచంద్ర ఒక్కరే అని మాత్రం చెప్పక తప్పదు.

ఈ పుస్తకం చదవండి. చుట్టూ ద్వేషం, హేట్ స్పీచ్, దూషణ మబ్బులా కమ్మిన ఈ కాలంలో తొలి సూర్యకిరణంలాగా ఈ పుస్తకం నా కళ్ళకు కనిపించింది. ఇందులో బాలచంద్ర తన జీవితం నుంచే ఎన్నో ఉదాహరణలు ఇస్తూ యువతీయువకులకు దారి చూపిస్తున్నారు. వివేకానంద, మహాత్మా గాంధి, లాల్ బహదూర్ శాస్త్రి, సర్దార్ పటేల్, రవీంద్రనాథ టాగోర్, డా.రాధాకృష్ణన్, స్టీఫెన్ విలియం హాకింగ్, థామస్ ఆల్వా ఎడిసన్

లాంటి సుప్రసిద్ధ వ్యక్తుల జీవితాలనుంచి ఉదాహరణలతో పాటు దీపా కర్మాకర్, డా.ఆశుతోష్ చక్రవర్తి, సివిల్ సర్వీసెస్ విజేత జునిద్ అహమద్, హాలీవుడ్ నటుడు రాబర్ట్ డౌనీ జూనియర్, స్వీట్స్ పుల్లారెడ్డి, సునీతా కృష్ణన్ వంటి వారి జీవితాలనుంచి కూడా ఆయన ఎన్నో స్ఫూర్తిదాయకమైన ఉదాహరణలు ఇచ్చారు. ఒక మనిషి స్ఫూర్తి పొందడానికి సుప్రసిద్ధుల జీవితాలే కాదు, పట్టిన పట్టు విడవకుండా విజయాన్ని కైవసం చేసుకోగల ప్రతి ఒక్కరూ స్ఫూర్తిదాయకులే అన్నట్టుగా PS రావు, రామప్రసాద్, డా.సాయిలత, మృదుల, నరసింహ వంటి వారి జీవితాలనుంచి కూడా ఉదాహరణలు ఇచ్చారు. ఆయన ప్రతి అధ్యాయం వెనక పొందుపరిచిన విజయగాథల్లో నన్ను అమితంగా ఆకట్టుకున్నవి మణిపూర్ కు చెందిన మేరీ కామ్, అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి కలిఖో పుల్ జీవిత జయ గాథలు. అంత మారుమూల ప్రాంతాలనుంచి వాళ్ళు నమోదు చేసుకున్న జీవితానుభవాలు నాకు విస్మయం కలిగించడమే కాదు, కొత్త స్ఫూర్తినీ, ఉత్సాహాన్నీ కూడా కలిగించాయి.

63 అధ్యాయాలు. 63 సూత్రాలు. విజయానికి అడ్డదారుల్లేవు. 63 మెట్లూ ఎక్కవలసిందే. కాని విజయసోపానంలో ప్రతి మెట్టూ నిన్ను మరింత ఉన్నతస్థానానికి చేరుస్తుంది, వేసిన ప్రతి అడుగూ నిన్ను మరింత బలోపేతుణ్ణి చేస్తుంది.

బాలచంద్ర ఒక సన్యాసి, ఒక తపస్వి, ఒక నిష్కామ కర్మయోగి. ఈయన ద్వారా భరతమాత మరింత సేవ పొందగలదని ఆశిస్తున్నాను. తన చుట్టూ ఉన్న సమాజానికి స్ఫూర్తిప్రదాత కావడంలో ఈయన మరొక వివేకానందుడు, మరొక మహాత్ముడు, మరొక కలాం కాగలరని నమ్ముతున్నాను. ఆయన స్ఫూర్తి ప్రసరిస్తున్న ఈ గ్రంథం చదువుతున్న మనం కూడా ఎంతో కొంత దూరం ఆ బాటలో పయనించే శక్తి పొందాలని సర్వేశ్వరుణ్ణి ప్రార్థిస్తున్నాను.

హైదరాబాదు
శ్రీ సుబ్రహ్మణ్య షష్ఠి
29-11-2022

వాడ్రేవు చినవీరభద్రుడు, IAS Retd.,
Former Director, Tribal Welfare Dept
Andhra Pradesh



# విద్యార్థుల సందేహాలకు సమాధానం

ఒకరోజు బాలచంద్ర గారితో ఫోన్లో మాట్లాడడం జరిగింది. సంభాషణ ముగిసే లోపు బాలచంద్రగారు విద్యార్థుల జీవితాలను మెరుగుపరిచే ఉద్దేశంతో పుస్తకం రాస్తున్నాను, అది దాదాపుగా పూర్తి కావస్తోందని చెప్పారు.

బాలచంద్ర గారిని ఒక ప్రతిని పంపండి నేను ప్రూఫ్ రీడింగ్ చేయగలనని ఎందుకు అడిగానో కానీ అడిగిన ఐదు నిమిషాలలోపే నా డెస్క్ టాప్ మీద పుస్తకం ప్రత్యక్షమైంది. పుస్తకం విడివి సుమారు 250 పేజీలు... మెల్లగా చదవడం ప్రారంభించాను... మూడు విడతలుగా మొత్తం పుస్తకాన్ని ఒక అక్షరం వదలకుండా చదివాను. అంతా ఆసక్తిగా ఉన్నాయి పుస్తకంలో విషయాలు. పుస్తకంలో పొందుపరిచిన అంశాలన్నీ కూడా విద్యార్థులకు, తల్లిదండ్రులకు, గురువులకు ఎంతో ఉపయోగకరమైనవిగా వున్నాయి.

ఎప్పుడైనా ఏదైనా భావంలో గాని, భాషలో గాని, సందేహం వస్తే సామాన్యంగా నిఘంటువును ఉపయోగించి మన సందేహాన్ని నివృత్తి చేసుకుంటాం కదా. అలాగే విద్యార్థులకు ఈ పుస్తకము ఒక సందేహాన్ని నివృత్తి చేసే నిఘంటువుగా ఉపయోగ పడుతుందని నా అభిప్రాయం. జీవితంలో ఏదైనా సమస్య సందేహం కలిగితే భగవద్గీత పుస్తకంలోని ఏదో ఒక పుట చదవమన్నారు పెద్దలు...అలాగే విద్యార్థులకు ఏవైనా సందేహాలు సమస్యలు వచ్చినప్పుడు వాటిని ఎదుర్కోవడానికి అనుభవ పూర్వకమైన సమాధానం ఈ పుస్తకం ద్వారా దొరుకుతుంది అనటంలో సందేహమే లేదు.

ఈ పుస్తకాన్ని నేను చదవడం కాకుండా ప్రూఫ్ రీడింగ్ చేసే భాగ్యం నాకు లభించడం నిజంగా నా అదృష్టమే. మా స్మైల్ హోమ్ లో పిల్లలకి ఎప్పుడైనా, ఏమైనా సందేహాలు వస్తే సరైన సమాధానం ఇచ్చేందుకు ఈ పుస్తకం నాకు చాలా ఉపయోగపడుతుంది. ఇంత మంచి పుస్తకాన్ని తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు ఉచితంగా ఒక కానుక లాగా ఇవ్వగలగడం వారి పూర్వజన్మ సుకృతమే. అంతేకాదు విద్యార్థులకు కూడా ఇది అభయ ఫౌండేషన్ అందించే అపురూపమైనటువంటి బహుమతి అని చెప్పాలి.

ఈ పుస్తకం ప్రతి ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర విద్యాలయాలకు చేరాలని... దాని ద్వారా ప్రతి ఒక్క విద్యార్థికి మేలు కలగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాను. ఇంత మంచి పుస్తకాన్ని విద్యార్థులకు అందిస్తున్నందుకు అభయా ఫౌండేషన్ కి ధన్యవాదాలు.

గొర్రా లక్ష్మీప్రసాద్
B.Com; LLB; CA
మేనేజింగ్ ట్రస్టీ
స్మైల్స్ ఎన్జీవో
హైదరాబాద్



# దిక్సూచి...జీవిత లక్ష్యాలకి పదును పెట్టే ప్రయత్నం

ఏదైనా పాఠ్య పుస్తకం చదివితే కొంతమేరకు పాఠాలను అధ్యయనం చేయొచ్చు. కానీ జీవితాన్ని అధ్యయనం చేయాలంటే మాత్రం నిరంతర సాధన అవసరం. అందుకు దిక్సూచి (Compass) పుస్తకం ఎంతగానో తోడ్పడుతుంది. సాధారణంగా, ఆయా తరగతులలో చదివిన పుస్తకాలు కేవలం వార్షిక పరీక్షల వరకు మాత్రమే ఉపయోగ పడతాయి. కానీ ఈ Compass పుస్తకం మొత్తము జీవితానికే ఉపయోగము అని చెప్పక తప్పదు.

బాలచంద్ర, గత 3 దశాబ్దాలుగా వేల మంది విద్యార్థులు అడిగిన సందేహాలని నివృత్తి చేస్తూ, పరిష్కార మార్గాలని పరిచయం చేయడం కోసమై, కొరోనా కాలములో (2020) గృహ నిర్భంధమును సద్వినియోగం చేసుకొని, విద్యార్థుల జీవన నౌకలను లక్ష్యము వైపు మళ్ళించే చక్కని చుక్కానిలా ఈ పుస్తకం రచించారు.

ఎన్నో విషయాలను చుట్టూ ప్రపంచం నుంచి నేర్చుకునే మనిషికి, మార్పు తనలో నుండి మొదలవ్వాలన్నది మాత్రం అర్థం కాక పోవడం విచిత్రం. అట్టి జీవిత పరమార్థాన్ని భోధిస్తుంది ఈ పుస్తకం. జీవిత లక్ష్యాలకి పదును పెట్టే ప్రయత్నం చేస్తుంది. మరో మాట చెప్పాలంటే ఇందులోని అంశాలు ఒక కాలానికి, ఒక వయసుకి, ఒక అంశానికి పరిమితము కాకుండా... సత్యమును, సన్మార్గమును, సద్భావనలను, మానవతా విలువలను అందిస్తాయి. తద్వారా మనిషి మహోన్నతుడిగ ప్రకాశింప చేయడానికి ఉపయోగ పడతాయి.

అద్దం మీద పేరుకుపోయిన దుమ్మును తొలగిస్తే బింబము స్పష్టంగా కనిపించినట్లుగా, మనిషిలో మరుగున పడి నిద్రాణమైన చైతన్యాన్ని అజ్ఞానపు పొరల అవలి నుండి బయటికి తీసుకురావడం కోసం బాలచంద్ర దిక్సూచి ద్వారా ప్రయత్నం చేశాడు. బాల్యం, యవ్వనం, వ్యవహారం నుండి వృద్ధాప్యం వరకు జీవితాన్ని నిరంతరం సంస్కరించుకోవడానికి 63 అంశాలను ఇందులో స్పృశించారు. ఆశయాలకు పదును పెట్టుకోవాలనే వారికి అవసరమైన అమృత సందేశాలు ఈ పుస్తకం ద్వారా అందించారు. శిల పైన కప్పబడి వున్న అనవసరమైన రాళ్లను వేరు చేయగలిగితే, శిల్పం బయటికి వస్తుంది. ఆ శిల్పాన్ని సమాజం ఆదరిస్తుంది, అర్చిస్తుంది, ఆరాధిస్తుంది కూడా. అలాగే, మనిషి తనను తాను ఒక అద్భుతమైన వ్యక్తిగా, శక్తిగా, ఆదర్శ మూర్తిగా మలచుకోవడానికి ఈ పుస్తకం ఒక చక్కటి ఉలిగా ఉపయోగపడుతుంది. నిజానికి పుస్తకాన్ని మనసుపెట్టి చదవగలిగితే,

ఒక్కొక్క అంశాన్ని తన ఉన్నతికై ఉపయోగిస్తే ఇక గీతా వాక్యం ఉద్ధరేదాత్మనాత్మనాం సిద్ధించినట్లే. అంధకారం నుండి వెలుగు వైపు వెళ్లడమే జీవితం యొక్క పరమార్థం. అజ్ఞానము నుండి జ్ఞానము దిశగా ఎక్కాల్సిన మెట్లను బాలచంద్ర ఈ పుస్తకం ద్వారా నిర్మాణం చేశాడు. విద్యార్థులు, ఉపాధ్యాయులు రోజూ ఒక అంశం చొప్పున దీన్ని క్షుణ్ణంగా చర్చించగలిగితే, మేధోమధనం చేయగలిగితే, పిల్లల నిజ శక్తి సామర్థ్యాలు ఆవిష్కృతమవుతాయి అనడంలో సందేహం లేదు.

భగవాన్ శ్రీ సత్యసాయి సన్నిధి నుండి, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా సమగ్రమైనటువంటి మానవతా విలువలతో జీవితాన్ని సంస్కరించుకొని అనేక సద్భావనలను పుణికి పుచ్చుకున్న బాలచంద్ర లాంటి యువ సన్యాసుల భావనలు ప్రతి తరానికి ఎంతో స్ఫూర్తినివ్వగలుగుతాయని నేను విశ్వసిస్తున్నాను. ఇంత గొప్ప రచన చేసిన బాలచంద్రను నిండు హృదయంతో అభినందిస్తూ మానవ కళ్యాణమునకు దోహదపడే మరిన్ని అద్భుత రచనలు రాబోయే కాలములో తన నుండి ఆ భగవంతుడు రప్పించాలని మనసారా ఆకాంక్షిస్తూ, ఆశీర్వదిస్తూ, అభినందనలతో...

– డా. చుక్కా రామయ్య

పూర్వ శాసన మండలి సభ్యులు.

విద్యా వేత్త,



# వారి తాపత్రయానికి అచ్చెరువొందాను!

అందరికీ శుభాకాంక్షలతో...

ఆ మధ్య ఎప్పుడో ఒక రోజు, శ్రీ బాలచంద్ర గారు ఫోన్ చేసారు. తనను, తాను పరిచయం చేసుకుని 'అభయ' సంస్థ గత ఒకటిన్నర దశాబ్దం నుండి చేసే సేవా కార్యక్రమాలను గురించి వివరించారు. త్వరలో జరుపుకోబోయే 'అభయ షోడశ కార్యక్రమము' గురించి వివరిస్తూ...

దైవ ప్రేరణతో వారు విద్యార్థుల కోసమై రచించిన, దిక్సూచి (Compass) పుస్తకము గురించి చెప్పారు. నేను వారి భాషను, యాసను గమనించి అడిగాను...అయ్యా మీరు రాయలసీమ వాళ్ళా అని. అప్పుడు అతను చెప్పిన వివరాలు విని చాలా ఆసక్తి కలిగింది. తరవాత మా ఇంటికి వచ్చి, వారు రచించిన వ్యాస సంపుటిని చూపించి, కొన్నింటిని చదివి వినిపించారు. ఇంతటి విలువైన పుస్తకాన్ని ముద్రించి అమ్మకుండా...ఉచితంగా ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాలలో ఉన్న సుమారు 10000 ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా అందించాలన్న వారి తాపత్రయానికి అచ్చెరువొందాను. వారు చేస్తున్న మంచి పనికి ఎందరో దాతలు ముందుకు వచ్చి పుస్తక ముద్రణకు ధన సాయం అందించారని విని మరింత సంతోషించాను. ఇంతటి మహనీయుల ద్వారా రూపు దిద్దుకున్న ఈ పుస్తకం నిజంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మరియు తల్లిదండ్రులకు జీవితములో మంచి మార్గములో నడిపించే దిక్సూచి కాగలదని నా దృఢమైన విశ్వాసము.

విద్యాభివృద్ధికి మాత్రమే గాక, దేశాభివృద్ధికై

శ్రీ బాలచంద్ర వ్రాసిన ఈ పుస్తకం మరిన్ని భాషలలో ముద్రితము కావాలని అభిలషిద్దాం.

వారికి మరియు పుస్తక ప్రచురణకు సాయం చేసిన అందరికీ మంచి జరగాలని ప్రార్థిద్దాం...



కన్నెగంటి బ్రహ్మానందం
చలన చిత్ర నటుడు
హైదరాబాద్

# బాలచంద్ర నీతి – వేల యువతకు స్ఫూర్తి!

నేటి సమాజంలో అవకాశాలు ఎక్కువ, అవగాహన తక్కువ అని చెప్పొచ్చు! గత ముప్పై సంవత్సరాలుగా, వ్యాపార వ్యూహాలు పెంపొందించుకోడం, దాని ద్వారా ఉద్యోగ అవకాశాలు మరింత పెరగడము అయితే జరిగింది గాని, మన మాజీ రాష్ట్రపతి, శ్రీ అబ్దుల్ కలాం గారు సూచించినట్లు, మన దేశంలో  అవకాశాలు ఎన్నో ఉన్నా వాటిని అందిపుచ్చుకునే దీక్ష దక్షత లేకపోవడం శోచనీయం. కారణం? విద్యా వ్యవస్థలో లోపాలు మరియు దిగజారిపోతోన్న విద్యార్థులు మానసిక స్థితి, ఇవి రెండే. దీనిని సరిదిద్దే ప్రయత్నాలు గత 20 సంవత్సరాలుగా, ఎందరో విద్యా సంస్కర్తలు తలపెట్టినా పెద్దగా ఫలితములు ఇచ్చిన దాఖలాలు లేవు. ఇట్టి కార్యము ప్రతి వ్యక్తి తలపెట్టగల సంస్కరణ కాదు.

కానీ, విద్యార్థి మానసిక స్థితిని ఉన్నతంగా తీర్చి దిద్దడం అన్నది ప్రతి విద్యార్థి చేతిలోనే ఉంది. అయితే, వారి వారి మానసిక స్థితిని అనువుగా మార్చుకుని, అవగాహన పెంచుకొని, అవకాశాలు జారవిడుచుకోకుండా, తమ జీవితాలు మార్చుకునే విద్యార్థులు అరుదు. అలా సాధించిన వాళ్ళందరూ కూడా అభినందనీయులు.

మరి, అత్యధిక సంఖ్యలో ఉన్న మిగతా 85% విద్యార్థుల మాట ఏమిటి? వీరిని వారి మానసిక అవమార్గముల నుండి మళ్లించి, విజయమార్గముకు నడిపించే, సదాభిలాషులెవరు? చదువుపై శ్రద్ధ లేని వారు కొందరైతే, చదివినా ఉపయోగించుకోలేని వారు ఎందరో! కేవలం మార్కుల కోసం చదివి, మరునాడు మర్చిపోయే విద్యార్థులు కొందరైతే, చదివినా పరీక్ష పత్రములో రాయడానికి తంటాలు పడే వారు ఎందరో! మరి వీరికి సరి అయిన దృక్పధం ఇచ్చే ధీరులెవరో? అని అనుకొనే తరుణంలో, ఒక పుస్తకం చూడడం జరిగింది.

అదే, Compass - Finding The Right Direction. తమ్ముడు బాలచంద్ర, దీని కర్త. పూవుకు తావి, తావికి  పూవు అబ్బినట్లు, సరి అయిన అంశానికి, సరి అయిన గ్రంధకర్త దొరకడం ఇక్కడ విశేషం. అసలు చదివినది 'జ్ఞాపకం రావడంలేదు ' అన్న అంశము నుంచి, విలక్షణముగా జీవించడం ఎలా అన్న అంశము వరకు, ప్రతి విద్యార్థి, నిత్య జీవితములో ఎదుర్కొనే అంశాలే! వాటినే నేపథ్యంగా తీసుకొని, బాలచంద్ర వ్రాసిన ఈ పుస్తకములో 63 అలాంటి అంశాల గురించి వ్రాస్తూ, తను సోదాహరణంగా సూచించిన పరిష్కారములు అద్భుతం,

అమోఘం.  ఇవి మామూలు సలహాలుగా లేవు! ఒక ఆప్తుడు, ఒక విద్యార్థి పై ఉన్న ప్రేమతో, చేస్తున్న, మార్గనిర్దేశము లా ఉండడం విశేషం. ఇది బాలచంద్ర యొక్క వ్యక్తిత్వానికి ఒక ప్రతిబింబము.

బాలచంద్ర నాకు మూడు దశాబ్దాలుగా  తెలుసు. స్వార్థపూరిత జీవన శైలి మెండుగా ఉన్న ఈ రోజుల్లో, 'బాల' వంటి నిస్వార్థ సేవకులు ఉన్నారు అంటే నమ్మశక్యం కాదు కానీ, అది ఒక అదృష్టము. భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి దీవెన. అవడానికి తనూ 'కంపెనీ సెక్రటరీ' అయినా, ఏమి తెలియని సామాన్యునివలె, భారతీయ సాంప్రదాయ వేషభాషలతో  సమాజానికి, అభయ ఫౌండేషన్ ద్వారా యెనలేని సేవలు చేస్తున్నారు. నాలాంటి ఎందరికో స్ఫూర్తిదాత.

అటువంటి వ్యక్తి ,నేడు, తన ఆలోచనలను సలహాలు, సూచనలు, చిట్కాల రూపములో, పొందుపరిచి, పుస్తక రూపములో వెలువరచడం, ఎందరో విద్యార్థులు చేసుకొన్న అదృష్టము అని నేను నమ్ముతున్నాను. ఈ పుస్తకం చదివిన వారందరికీ కేవలం మస్తక సహితం కాకుండా, క్రియ రూపములో ఉత్తేజుతులవ్వాలని, అందరు సక్రమ మార్గములో నడవాలని, ఆ భగవంతుణ్ణి మనసారా ప్రార్థిస్తూ, బాలచంద్ర ఇటువంటి మరెన్నో స్ఫూర్తిదాయక కార్యములలో కొనసాగాలని అభిలషిస్తున్నాను.

ప్రేమతో...



కోటా శివకుమార్

B.Tech., MBA

CHRO - Oliva Clinics, India

Hyderabad

# ఈ పుస్తకము విజ్ఞాన సర్వస్వము (Encyclopedia)

భగవదనుగ్రహం వలన, 12 సంవత్సరాల క్రితం అభయ సంస్థ ఆర్థిక సాయం కోసమై వచ్చి బాలచంద్ర అంకుల్ ప్రాపకంలో పెరిగి పెద్దయి ఇప్పుడు MBBS ముగించి, అకొలా ప్రభుత్వ వైద్య కళాశాలలో గైనకాలజిలో ఉన్నత చదువులు చదువుతున్నాను. మా బాలచంద్ర అంకుల్ అభయ సంస్థ ద్వారా నా లాంటి పిల్లలను వేలమందిని స్వయంగా చేరదీసి, వారి పిల్లల లాగానే చూసుకుంటూ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. వారి తేజస్సు, ప్రేమ, మాట, చేత, సేవలు చూసి చాలా సంతోషం, ఆశ్చర్యం, ధైర్యం, ఆదర్శం నాలో ఉప్పొంగేవి.

కొన్ని సందర్భాలలో నాకు కూడా వారి యొక్క ఉపన్యాసాలను వినే అదృష్టం దొరికేది. నిజానికి, నాకు ఏ చిన్న సంశయం వచ్చినా, సంప్రదించి వారిచ్చే సమాధానాలతో గుండె నిండా నింపబడిన ఉత్సాహంతో ముందుకు వెళ్లే దాన్ని. ఒక విద్యార్థిగా నేను వారి మాటల ద్వారా అందుకున్న శక్తి, ఆదర్శం, ఆనందం మాటలలో చెప్పలేనిది. అలాంటి మాటలు నా తోటి వారు కూడా వినాలి, అందరిలో మంచి మార్పు రావాలి, అందరూ మంచిగా జీవించాలి అన్న ఆశతో వారి అనుమతి తీసుకుని, నేను చదువుకునే సంస్థలకు వారిని తీసుకుని వెళ్లి అక్కడ ఉపన్యాసం ఏర్పాటు చేసేదాన్ని. నా పూర్వజన్మ సుకృతం వల్ల నేను సముద్ర సమానమైన వారి జీవితములో ఒక నీటి బిందువులా ఆనందంగా ప్రయాణించే అదృష్టం దొరికింది. ఇంకా నాతోటి వారు, పిల్లలు, పెద్దలకు నాకు దొరికినట్టుగా అందరికీ ఆ సదవకాశం దొరికితే బాగుండు అని తపించేదాని. సముద్రంలో దాగి వున్న జ్ఞానం అందరికీ అందాలి అని నిశ్శబ్దంగా ప్రార్థించేదాన్ని. కరోనా కష్ట సమయములో ఒక ప్రక్కన సేవ చేస్తూ ఇంకో ప్రక్కన విద్యార్థుల కోసం ఒక పుస్తకము వ్రాయాలి అని నా లాంటి కొంత మంది విద్యార్థులతో ఆయన చర్చించి నపుడు, మేమంతా చాలా సంతోషించాము. ఒక విద్యార్థినిగా కొన్ని అంశాలలో నేను ఎదుర్కొన్న సమస్యలను, అనుభవాలను, ఆలోచనలను, సూచనలను చంద్రుడికి ఒక నూలు పోగులా వ్రాసి, వారి రచనా ప్రక్రియలో భాగం అయినందుకు ఎంతో ఆనందించాను. ఈ పుస్తకములో బాలచంద్ర అంకుల్ నన్ను, నా కథను కూడా ఒక చిన్న ఉదాహరణగా చూపినందుకు నా జన్మ సార్థకత అయింది.

వారి యొక్క హృదయములో నిక్షిప్తమైన అనంత జ్ఞాన భాండాగారం అందరికీ దక్కాలని, ఎన్నో ఏళ్లుగా తపించిన నాకు ఈ పుస్తకము ఒక సమాధానం లా నిలచింది. ఒక సాధకురాలిగా, ఈ పుస్తకము విజ్ఞాన సర్వస్వము (Encyclopedia) అని చెప్పగలను . ఈ పుస్తకము చదివిన వాళ్లు ఎవరైనా సరే వారి సంశయాలు తీర్చుకొని, వారి వారి వృత్తి మరియు ప్రవృత్తిలో మార్పు తీసుకుని రాగలరని నా ప్రగాఢ విశ్వాసం. ఈ పుస్తక యజ్ఞములో నన్ను కూడా ఒక సమిధలా చేసి, బాలచంద్ర అంకుల్ సాంగత్యంలో చేర్చినందుకు ఆ భగవంతుని చరణాలకు శతకోటి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.



ప్రేమతో... ఎప్పటికీ బాలాచంద్ర అంకుల్ పాప

Dr K సాయిలత

MBBS, (MS-OBGY), అకొల, మహరాష్ట్ర

# విషయ సూచిక


| | |
|---|---|
| **సమస్యలు** | **1** |
| 1. జ్ఞాపకం రావటం లేదు | 3 |
| 2. ఇష్టం లేదు | 6 |
| 3. సమయం లేదు | 9 |
| 4. వినటం లేదు | 13 |
| 5. చదవటం లేదు | 17 |
| 6. మరచిపోతున్నాను | 21 |
| 7. ఆర్థిక ఇబ్బందులు | 25 |
| 8. అనారోగ్య సమస్యలు | 28 |
| 9. భయాందోళనలు | 32 |
| 10. ఒత్తిడి | 36 |
| 11. చేతివ్రాత సరిగ్గా లేదు | 40 |
| 12. చెడు స్నేహం | 44 |
| 13. ప్రేమ వ్యవహారాలు | 48 |
| 14. నిరాసక్తత | 52 |
| 15. నిద్ర-నియంత్రణ | 54 |
| 16. ఆటలు | 58 |
| 17. స్మార్ట్ ఫోన్ | 62 |
| 18. ఇంట్లో గొడవలు | 66 |
| 19. సమయ పాలనము లేదు | 69 |
| 20. వాయిదా వేస్తున్నాను | 73 |
| 21. ఏకాగ్రత లోపం | 77 |
| 22. దుర్వ్యసనాలు / దురలవాట్లు | 81 |
| 23. టీవీ / మూవి / నటులు | 85 |
| 24. పట్టుదల లేదు | 89 |
| 25. పరీక్షలంటే భయం - ఒత్తిడి | 94 |
| 26. ఫెయిల్యూర్‌ని తట్టుకోలేక పోతున్నాను | 97 |

27. సోమరితనం 101
28. లైంగిక వేధింపులు 105
29. హేళన / వివక్ష 109
30. నిరాశ 113
31. నేను అనాథ 116
32. ఆడంబరమే విధానం అయింది 120
33. తోటివారి ఒత్తిడి 123
34. చెత్త సాహిత్యము 128

## సందేహాలు 133

35. లక్ష్యం లేదు 135
36. నా ఇష్టం వేరే వుంది 139
37. స్ఫూర్తి ఇచ్చేవారు లేరు 142
38. చదవకపోయినా బాగుపడొచ్చు కదా? 146
39. మంచి వాడయితే చాలు, చదువు అవసరమా? 150
40. చదివే చదువుకు చేసే పనులకు భేదం వుంది 154
41. ఒక సబ్జెక్టులో వెనకపడ్డాను 157
42. ఆంగ్ల మాధ్యమం 160
43. పోల్చుకోవడం 164
44. వయసుతో పాటు వచ్చే ఆలోచనలు 168
45. అమ్మాయిలకు చదువు అవసరమా? 170
46. పఠనాభిలాష తగ్గుతోంది 176

## సార్! నేనేమి చేయాలి? 181

47. బోధన లేదు 183
48. స్కూల్ నచ్చ లేదు 187
49. అమ్మా నాన్న నేను అడిగింది ఇవ్వలేదు 191
50. ఉపాధ్యాయుల ప్రవర్తన సరిగ్గా లేదు 195
51. యాజమాన్యం ప్రవర్తన సరిగ్గా లేదు 199
52. టెక్నాలజీ 203
53. సామాజిక మాధ్యమాలు 206

54. విద్యా విధానమే సరిగ్గా లేదు 209
55. తల్లిదండ్రులే నిరుత్సాహ పరుస్తున్నారు 215
56. On Line విద్యావిధానం నచ్చటం లేదు 218

సత్య శోధన 223

57. అన్ని చోట్లా పోటీనే 225
58. నిజమైన స్నేహితుడు ఎవరు? 228
59. పరిపూర్ణ మానవుడు 231
60. జీవిత పరమ గమ్యమేది? 237
61. జీవితంలో ఏదైనా సాధించడం ఎలా? 241
62. గొప్ప వాడా? లేక మంచి వాడా? 244
63. విలక్షణంగా జీవించడం ఎలా? 248

# సమస్యలు

# 1. జ్ఞాపకం రావటం లేదు



## సమస్య:

*నేను బాగా చదువుకుని మంచి మార్కులతో పాస్ అవ్వాలని వుంటుంది. ఎప్పటి పాఠాలు అప్పుడే చదువుకుంటాను కూడా. హోమ్‌వర్క్ క్రమం తప్పక చేస్తాను. స్కూల్ లో కూడా ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా వింటాను. కానీ చదివిందేది జ్ఞాపకం వుండదు. నిజంగా నేను సమాధానం చెప్పే ప్రయత్నం చేసినప్పుడు లేదా వ్రాసే సమయంలో చదివింది జ్ఞాపకం రావట్లేదు. జ్ఞాపకశక్తికి మంత్రం ఏదైనా వుందా?*

## వివరణ:

జ్ఞాపకం రావట్లేదు అనేది చాలామందికి ఉండే సహజమైన సమస్య. పరీక్షలలో ప్రశ్నా పత్రం చదవగానే లేదా క్లాసులో టీచర్ అడగగానే ఇదేదో ఉండాలి అని బుర్ర బాదుకుంటుంటారు కొంత మంది విద్యార్థులు. తరచి చూస్తే వందకి సుమారు 30% మంది విద్యార్థులకు ఇలాంటి సమస్య వుంటుంది. ఇది చాలామంది విద్యార్థులు ఎదుర్కొంటున్న సవాల్ అనుకోవాలి. పరీక్షల్లో బాగా రాయాలంటే బాగా జ్ఞాపకం ఉండాలి. బాగా జ్ఞాపకం ఉండాలి అంటే బాగా చదివి ఉండాలి. జ్ఞాపకం ఉండేలా చదవడం ఎలా అనేది విద్యార్థులను ఎక్కువగా వేధించే ప్రధాన ప్రశ్న. ఎప్పుడో చదువుకున్న విషయాలను మేధావులు జీవితకాలమంతా

ఎలా గుర్తుంచుకుంటారు? కాస్త ఆలోచిస్తే సమాధానం దొరుకుతుంది.

సాధారణంగా జ్ఞాపకశక్తి అందరికీ ఒకే విధంగా ఉంటుంది. అయితే గుర్తుంచుకోవడానికి ఒక్కొక్కరు ఒక్కో పద్ధతిని పాటిస్తుంటారు. మనుషులు మొదలుకుని సమస్త జీవులూ తమకు అవసరమైనవి గుర్తుపెట్టుకుంటాయి. చెడుని గుర్తుపెట్టుకోవద్దని అందుకే మన పెద్దలు చెబుతుంటారు. దానిలోనే అవసరమైనవి మాత్రమే గుర్తుపెట్టుకోండన్న సలహా కూడా ఉంది.

పద్ధతిగా చదువుకుంటే ఏ విషయమైనా గుర్తు ఉంటుంది. ఉదాహరణకు ఒక పద్యం నేర్చుకోవడం తీసుకుందాం. మొదట దానికి అర్థం తెలుసుకోవాలి, సాధారణంగా పద్యంలో నాలుగు పాదాలు ఉంటాయి. దేనికదిగా అంతం కాదు. అందువల్ల అర్థవంతంగా తీసుకోవాలి. తరవాత ఒక్కో పాదం మొదట ఒకసారి, తదుపరి మళ్ళీ రెండు సార్లు చదవాలి. అచ్చులో ఉన్నది చూస్తూ చదవాలి. తరవాత పుస్తకం మూసేసి మనకి మనవే అప్పజెప్పుకోవాలి. మధ్యలో గుర్తుకు రాకుంటే, ఆ పదం ఒక్కటి చూడాలి. మళ్ళీ దాన్ని కలిపి అప్పజెప్పుకోవాలి. పద్యం అంతా వచ్చేస్తుంది. ఏ సబ్జెక్టుకైనా ఇదే పద్ధతి. నాలుగైదు వాక్యాలుగా విడదీసుకుని చదవాలి. కొన్ని వ్యాసరూప జవాబులు ఉంటాయి. పేరాలుగా విభజించుకుని చదవాలి. పుస్తకాన్ని సగం మూసి పెట్టుకోవడం, మధ్య మధ్యలో తీసి చదవడంతో ఏదీ సరిగ్గా గుర్తు ఉండదు. చదువుతున్నప్పుడు పుస్తకాన్ని చూసి చదవాలి. దీన్ని ఫొటోగ్రాఫిక్ మెమొరీ అంటారు.

ఉదాహరణకు 'రాముడు అరణ్యానికి వెళ్ళాడు. మారీచుడు అనే రాక్షసుడిని చంపాడు' అని ఉందనుకోండి. మనకు మనం అప్పజెప్పుకొనేటప్పుడు రాక్షసుడి పేరు గుర్తుకు రాలేదు. అప్పుడు మళ్ళీ ఆ ఒక్కటి చదవండి చాలు. అలాగే వ్యాసరూప ప్రశ్నలకు ముఖ్యమైన పాయింట్స్ గుర్తు పెట్టుకోవాలి. వాటిని బట్టి మిగతాదంతా గుర్తుకువస్తుంది.

శ్రవణం, పునశ్చరణ అన్న రెండు పద్ధతులూ పాటించాలి. మొదట జాగ్రత్తగా వినాలి. తరవాత తప్పులు లేకుండా అర్థం చేసుకుంటూ చదువుకోవాలి. తిరిగి పునశ్చరణ చేసుకోవాలి.

ఎంత పాఠమైనా బిట్లుగా విడగొట్టుకుంటే సులువుగా చదువుకోవచ్చు. తరవాత అంతా కలిపి చదువుకోవాలి. సమగ్రరూపం వస్తుంది. సులువుగా గుర్తు ఉంటుంది.

ఒకసారి రాస్తే పదిసార్లు చదివినంత ప్రయోజనం. మనసు ఎక్కడో పెట్టి రాయకూడదు. దానిపైనే లగ్నం చేస్తూ రాయాలి. రాముడు రాయాలనుకోండి. అది రాసేలోపు మనసుపెడితే కనీసం మూడు సార్లయినా మననం జరుగుతుంది. పెద్ద పదం అయితే నాలుగైదు సార్లు జరుగుతుంది. తద్వారా సులువుగా గుర్తుకువస్తుంది. ఏదీ ఆయాచితంగా వచ్చేయదు. తదనుగుణమైన కృషి చేయాలి. అప్పుడే దేనిపైనైనా పట్టు చిక్కుతుంది.

నా చిన్న నాటి స్నేహితుడు చాలా బాగా చదివేవాడు. కానీ ఇంటర్ లో పరీక్ష తప్పాడు. నువ్వెందుకూ పనికి రావని వాడి నాన్నగారు తిట్టలేదు. వంశంలో నువ్వొక్కడివే టెన్త్ తప్పావని తూలనాడలేదు. అయిదు వేళ్ళూ ఒక్కలా ఉండవని చెప్పి, అనునయించారు. ప్రోత్సహించారు.

తల్లిదండ్రులంతా ఇలాంటి విషయాలను గుర్తుంచుకోవాలి. మెడిసిన్లోనో, ఐఐటిలోనే సీటు రానంతమాత్రాన పిల్లల్ని చిన్నబుచ్చవద్దు. వారి తెలివికి తగ్గది మరొకటి చూపండి. ఆ స్థాయిలో చదివే పిల్లలకు మరొక దాన్లో తేలికగానే సీటు వస్తుంది. మార్కులే జీవితం అని చెప్పవద్దు. మానసికంగా వారిని వేధించవద్దు. మొదట చిన్న లక్ష్యాలు పెట్టండి. తరవాత అంతిమ గమ్యం చేరుకునేలా చూడండి. పాతికకు పది మార్కులు వచ్చినప్పుడు మళ్ళీ సారి మరికొంచెం పెంచుకోవాలని చెప్పండి. చివరగా మీరు అనుకున్న లక్ష్యం మెల్లమెల్లగా చెప్పి అక్కడికి చేరుకునేలా తోడ్పడండి.

ఒక మేధావినో లేక అవధానినో లేక చదవరినో తీసుకుంటే రెండు నిమిషాల్లో ఒక పద్యం నేర్చుకుంటున్నారు అనుకుందాం. ఇది మరికొందరికి ఇరవై నిముషాల నుంచి అర్ధ గంట సేపు పట్టవచ్చు. అంతే తప్ప రాకపోవడం అంటూ ఉండదు. మన కృషి ముఖ్యం. మహానుభావుల పాదాలకు దండం పెడితే ఏమీ రాదు. నోటిలో బీజాక్షరాలు రాయించుకున్నా రాదు. అభ్యాసము కూసు విద్య అన్నారు కదా.

ఏ విషయమూ ఎవరికీ ఎల్లకాలం జ్ఞాపకం ఉండదు. జ్ఞాపకం పెట్టుకోవాలి, అంతే. జ్ఞాపకశక్తి అందరికీ ఒకే విధంగా ఉంటుంది. అయితే గుర్తుంచుకోవడానికి కొంత మంది ఒక పద్ధతిని పాటిస్తుంటారు. అదే జ్ఞాపకశక్తిని వృద్ధిచేస్తుంది.

## సూచనలు:

1. *అర్థం చేసుకుని చదవండి*
2. *చదివే సమయంలో వ్రాయండి*
3. *విషయాన్ని చర్చించండి*
4. *అంశము ఏదైనా ఒక కథలా చదవండి*
5. *వీలయితే దృశ్యముగా ఊహించండి*
6. *విషయాలను క్లుప్తంగా వ్రాసుకోండి*
7. *చూడకుండా వ్రాయండి / సరి చూడండి*

## ప్రేరణ మంత్రము:

*You may not think you have a good memory, but you remember what's important to you.*

## స్ఫూర్తి:

ఒక సారి శ్రీ సత్యసాయిబాబా విద్యాలయంలో చదువుతున్న విద్యార్థి, బాబా వారు దర్శన సమయంలో తన దగ్గరగా వచ్చినప్పుడు, ఆతురతతో అడిగాడు.



స్వామీ! నాకు చదివిందేది జ్ఞాపకం ఉండటం లేదు. స్వామి వారు చిరునవ్వుతో అతనిని చూస్తూ సమాధానం ఇవ్వకుండా ముందుకు సాగిపోయారు.

కాసేపు తరవాత, ఆ అబ్బాయి ముందు నుండి తిరిగి వెనుకకు వెళుతూ ఇలా అడిగారు.

నీ birthday ఎప్పుడు? అబ్బాయి ఠక్కున సమాధానం చెప్పాడు.

నీ తల్లిదండ్రుల పేర్లు ఏమిటి? ఆ అబ్బాయి తడుముకోకుండా చెప్పాడు

నీది ఏ ఊరు? అబ్బాయి కాస్త ఆశ్చర్యంగానే తన ఊరి పేరు చెప్పాడు.

అప్పుడు స్వామి వారు నవ్వుతూ... అడిగారు... ఇన్ని ప్రశ్నలకు తడుముకోకుండా సమాధానాలు చెప్పావు కదా...మరి జ్ఞాపకము లేదు అన్నావేమిటి?

తను అన్నాడు, స్వామీ! ఇవన్నీ నాకు ఇష్టమైనవి, నాకు సంబంధించినవి, మరచి పోవడము సాధ్యమే కాదు అని.

అప్పుడు స్వామి చెప్పాడు... బంగారూ ఏదైనా అంతే... నాది అనుకుంటే చచ్చే దాకా గుర్తుండి పోతుంది. అన్నీ నీకిష్టమైనవిగా మార్చుకో...ఇక మరుపుకు అవకాశమే వుండదు.

పిల్లలూ! అర్థం అయిందా...కిటుకు! చదివేదేదైనా మీకు ఇష్టమైందిగా మార్చుకోండి. పాఠాలను ప్రేమించండి అవి కలకాలం గుర్తుండిపోయే గుణపాఠాలుగా నిలిచిపోతాయి.

# 2. ఇష్టం లేదు




## సమస్య:

*నాకు చదువుకోవడం ఇష్టం లేదు. నాకు లలిత కళలు అంటే బాగా ఆసక్తి. నాకు చిత్ర పరిశ్రమలో పని చేయాలని వుంది. ఇంట్లో చదువుకుని ఉద్యోగం చేసే అవసరం లేదు. ఇప్పుడు నాకున్న అక్షర జ్ఞానంతో తప్పక బ్రతకగలను అన్న విశ్వాసం వుంది. ఇష్టం లేని చదువు చదవడం కంటే కష్టమైనా సరే ఇష్టమున్న విషయాన్ని నేర్చుకోవడం మంచిది అని నా అభిప్రాయం...*

## ఆగండి:

పైన పేర్కొన్న సమస్యలు ఒకరికి సంబంధించినవి కావు. వివిధ సమావేశాల్లో ఎంతో మంది విద్యార్థులు నన్ను అడిగిన ప్రశ్నలు, విషయాలు, అంశాలు. అయితే వీటి గురించి చర్చించే ముందు క్రింద పేర్కొన్న అంశాలను కూడా పరిగణ లోకి తీసుకుందాం.

1. చదువు ఇష్టమే లేదు.
2. చదువు అవసరం లేదు
3. నా ఇష్టం వేరే వుంది
4. ఇంట్లో వ్యాపారాలున్నాయి
5. చదువు లేకున్నా బ్రతకగలను
6. చదివినా ఫెయిల్ అవుతున్నాను
7. పాస్ అయినా, వచ్చిన మార్కులు ఉపయోగం కాదు

## వివరణ:

తల్లిదండ్రులు ప్రధానంగా ఈ క్రింది విషయాలు గుర్తుంచుకోవాలి.

ఆకలి లేని వాడికి షడ్రశోపేతమైన భోజనం పెడితే ఏమిటి ప్రయోజనం. అలాగే నకనక లాడుతూ అన్నమో రామచంద్రా అనే వాడికి మంచి భోజనం లభిస్తే ఎలా ఉంటుంది... ఆలోచించండి.

'చదువే వద్దు, నాకు ఇష్టం లేదు' అన్న వాడికి మనము ఏమి చెప్తే ఏమి లాభం? అలాంటి వాడి మనసులో ఏముందో తెలుసుకుని అది మంచిదే అయితే సంతోషంగా ప్రోత్సహించడమే మనము చేయాల్సిన పని.

లేదంటే... పిల్లాడు అలా చదవడు... ఇలా పనీ చేయని వాడిగా మారే ప్రమాదం వుంది. తల్లి తండ్రులు పిల్లలను కనవచ్చు కానీ...వాళ్ళ కలలను కనలేరు కదా. ఇప్పుడున్న వర్తమాన పరిస్థితులలో చదువు లేకుంటే బ్రతకడం కష్టం అనటానికి లేదు. పిల్లాడికి జన్మ తహ వచ్చే తెలివి తేటలే పెద్ద పెట్టుబడిగా పెట్టి అద్భుతాలు సాధించిన వాళ్ళు లేక పోలేదు. కానీ అలాంటివాళ్ళు నూటికో కోటికో ఒక్కరుంటారు. అలాంటి వాళ్ళ స్థాయిలో మన వాడు ఆలోచిస్తున్నాడా లేదా అన్నది గమనించాలి.

ఆమధ్య కాలంలో ఒక ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులతో మాట్లాడటము కోసం వెళ్ళాను. చేవెళ్ల దగ్గరుంది అది. సుమారు 500 మంది విద్యార్థులు గుమికూడారు సభా ప్రాంగణంలో. నేను నా సహజమైన ప్రేమానురాగములతో చాలా క్యాజువల్‌గా ముచ్చటిస్తున్నాను.

ఒక ప్రశ్న వేశాను. ఎంత మందికి చదవడం ఇష్టం లేదు అని...సుమారు పాతిక మంది చేతులు ఎత్తారు. నాకు భలే ఆశ్చర్యం అయింది. అదేంటి ఇంజినీరింగ్ లాంటి విద్య అభ్యసిస్తూ ఇష్టం లేక పోతే ఎందుకు చేరినట్లు అని...ఒక అబ్బాయి దగ్గరకు వెళ్లి అదే మాట అడిగాను.

సార్, నాకు చదువంటే ఇష్టం లేదు. సినిమా పరిశ్రమలోకి వెళ్లాలని నా కోరిక. అమ్మా నాన్నకు ఇష్టం లేదు. నేను ఇంజినీరింగ్ చదవాలని వాళ్ళ కల. నేనేమి చేసేది మీరే చెప్పండి అన్నాడు.

అప్పుడు నేను అడిగాను... ఒరేయ్ బాబూ, మరి ఇంత ఖర్చు పెట్టి ఇంజనీరింగ్‌లో చేరడం ఏంటి...ఇక్కడికి వచ్చి చదవకుండా పోవడం ఏంటి? అని

తను ఇచ్చిన సమాధానాన్ని విని నాకు మూర్ఛ వచ్చినంత పని అయింది.

ఏమి ఖర్చు లేదు సార్...ప్రభుత్వము రీయింబర్సుమెంట్ చేస్తుంది కదా...నాకేమి నష్టం లేదు. ఎలాగూ చదవను... నాలుగేళ్లు టైం పాస్ చేసి... నేను చేయాల్సింది నేను చేస్తాను అన్నాడు.

ఇప్పుడు చెప్పండి... తల్లిదండ్రులు వారి ఇష్టాయిష్టాలను పిల్లల మీద రుద్దితే ఏమవుతుంది?

So, చదువు ఇష్టం లేదన్న వాడికి...అవసరం లేదన్న కుటుంబ నేపథ్యానికి నేనిచ్చే సూచన ఒక్కటే... సంతోషంగా పిల్లలు ఇష్టపడే దారిలో వెళ్ళమని ప్రోత్సహించండి. మీ స్థాయిని బట్టి మీ కుటుంబ స్థితిగతులకు పెద్దగా చదువులు అవసరం లేదని అనుకుంటే... పిల్లాడు కూడా ఆ విషయం అంగీకరిస్తే హ్యాపీగా వాడిని అలా వెళ్లనీయడమే శ్రేయస్కరం.

అసలు చదువుకుని రేప్పొద్దున్న ఎక్కడో పిల్లాడు ఉద్యోగము వ్యాపారము చేసి సంపాదించే దానికంటే కుటుంబ పరంగా అందరూ చేరి సంపాదించేది చాలా రెట్లు ఎక్కువ అయినప్పుడు... ఇక పూర్వం నుండి వస్తున్న వృత్తి వ్యాపారాలలో పిల్లలను తగు విధమైన తర్ఫీదు ఇచ్చి వారిని చక్కగా అనుసంధానించడం కంటే మంచి పని ఇంకేదీ లేదు.

కానీ ఒక్కటి మాత్రం నేను మళ్ళీ గుర్తు చేస్తున్నాను... నేపథ్యం ఏదయినప్పటికీ, వెనుక చరిత్ర ఏదయినప్పటికీ, ఈ రోజుల్లో పిల్లలు కనీసం డిగ్రీ లేదా దానికి సరి తూగే చదువు ఏదో ఒకటి తప్పక చేసే విధంగా మనం చూడాలి. లేదంటే అ ఆ లే రాని వాడికి ఆటవెలది పద్యాలు వ్రాయమని అడిగినట్లు అవుతుంది.

కనీసం డిగ్రీ చదివి ఉద్యోగం చేసినా, వ్యాపారం చేసినా మరింకేమి చేసినా ప్రతి వ్యాసంగములో కావలసిన బుద్ధి చతురత వస్తుంది.

నాకు తెలిసున్న చాలా మార్వాడీ లేక ఆర్య వైశ్య కుటుంబాలలో ఇంట్లో పిల్లల్ని కనీసం డిగ్రీ చేయించి కుటుంబ వ్యాపారాలలో తర్ఫీదు ఇవ్వడం నేను చూశాను. పిల్లలు కూడా ఎంతో ఆనందంగా వాళ్ళ తండ్రులు తాతల కాలం నుండి వస్తున్న వ్యాపారాలని తమ నైపుణ్యముతో చక్కగా వృద్ధిలోకి తెస్తుంటారు. అందరూ పెద్ద పెద్ద చదువులు చదివితేనే దేశం అభివృద్ధి అవుతుందన్నది ఒట్టి మాట. మన దేశములోని యువతీ యువకులందరు కనీసం డిగ్రీ లేక దానికి సరితూగే ఎంకేదైనా కోర్సు చదవాలి అని నా అభిప్రాయం. ఆ తరవాత వివిధ రంగాలలో వాళ్ళు స్థిర పడాలి. ఆ రంగాలలో ప్రధానంగా వ్యవసాయం ఒకటి. అప్పుడు ఆ రంగములో కూడా అత్యంత ఆవశ్యమైన అభివృద్ధి మనము సాధించవచ్చు.

ఒక వేళ డిగ్రీ కూడా పాస్ కాకుండా ఇంకా తక్కువ తరగతుల్లోనే చదువు ఆపి వుంటే...ఇంకెన్నో అవకాశాలు పుష్కలంగా వున్నాయి బ్రతకడానికి.

నాకు తెలిసి అతి చిన్న బ్రతుకు తెరువు అనుకునే ప్రతి వ్యాసంగము లో కూడా ఎంతో అద్భుతమయిన ప్రగతి ప్రతిభ చూపిస్తున్న వాళ్ళున్నారు.

## ప్రేరణ మంత్రము:

*There is nothing like Small Work or Big Work...One has to be only concerned about it... weather the work is Good or Bad.*

## స్ఫూర్తి:

నాకు తెలిసిన ఒక యువకుడు, పేరు దేవేంద్రుడు... చదువు అంతంత మాత్రమే సాగింది. పెద్ద కుటుంబం. అక్క పిల్లల బాధ్యత కూడా వుంది. డ్రైవింగ్‌లో నైపుణ్యం సంపాదించాడు. ఎక్కడా ఉద్యోగం చెయ్యడు. పెళ్ళాం పిల్లలున్నారు...హ్యాపీగా బ్రతుకుతున్నారు. అదేంటి మరి చదువు ఉద్యోగం లేకుండా ఎలా సంపాదిస్తున్నాడు అంటారా? అదేనండి బాబూ Driver on Call... రోజుకి 12 గంటలు పని చేస్తే సుమారు రూ. 1500/- సంపాదన. నెలకు ఆదాయం రూ. 45000/-. పెట్టుబడి లేని వ్యాసంగము. తను ఇష్టముంటే చేసుకుంటాడు లేదంటే మానేస్తాడు. వాడి మాటకారితనం వలన, పనిలో నైపుణ్యం వలన వాడే కావాలని చాలా మంది కస్టమర్లు ఫోన్ చేస్తున్నపుడు నేను స్వయంగా విన్నాను.

ఇలా పాల వ్యాపారం, కూరల వ్యాపారం, చాట్ భండార్, వంట పని, షేర్ ఆటో, సెలూన్, beautician, టైలరింగ్...ఇలా ఏది తీసుకున్నా బాగు పడాలనే తపన వుంటే ఏదైనా సాధ్యమే. ఎంతైనా సంపాదించవచ్చు.

అసలు మనమంతా ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి ఈ దేశములో విద్య నేర్చి నిరక్షరాస్యులుగా బ్రతుకు తున్నవాళ్ళు లక్షల మందున్నారు. అక్షరాలు నేర్చిన ఆజ్ఞానులూ వున్నారు. మనము చిన్నపుడు తప్పక విని వుంటాము ఒక మంచి మాట... మనిషికి చదువు-సంస్కారం వుండాలి అని. చదువు లేకున్నా పరవాలేదు... సంస్కారం లేదంటే మాత్రం అతని వలన సమాజానికి వినాశమే జరుగుతుంది.

చేసే పని మంచిపనా లేక చెడ్డపనా ఇదే మనము చూడాల్సింది. ఈ దేశంలో ఈ విషయం ప్రక్కకు పెట్టి చేసే పని చిన్నపనా లేక గొప్పపనా అని చూసి తప్పుడు మార్గములో వెళ్తున్నారు.

# 3. సమయం లేదు





## సమస్య:

*నాకు చదువుకోవాలని వుంది. కానీ ఒక గంట కూడా చదువుకు కేటాయించలేక పోతున్నాను.*

*ఎన్నివిధాలుగా ప్రయత్నం చేసినా రోజులో సింహ భాగాన్ని చదువుకై కేటాయించడం కష్టం అవుతోంది.*

*ఇంట్లో నేను, అమ్మ నాన్నలకు సాయం చేయాలి.*

*ఇంట్లో అమ్మ లేదు, బాధ్యత నాదే. నేను పార్ట్ టైం జాబ్ చేస్తున్నాను.*

*మాకు బజ్జీల బండి వుంది, సాయంత్రం 3 గంటలు అక్కడ చూసుకోవాలి.*

*నేను ఆటల్లో పడితే ఇక సమయమే తెలియదు.*

*స్నేహితులతో గడపడం ఇష్టం, దాంట్లో పడితే ఇక సమయం తెలియట్లేదు.*

## వివరణ:

దేశంలో సామాన్య పౌరుడికైనా... దేశాన్నేలే ప్రధాన మంత్రికైనా... భగవంతుడు రోజుకు 24 గంటలే ఇచ్చాడు అని అందరం చాలాసార్లు వింటూంటాము. ఆ వున్న 24 గంటలను ఉపయోగించుకునే విధానమే ఎవరినైనా సామాన్యుడిగా కానీ, అసమాన్యుడిగా కానీ చేస్తుంది.

మనము దేనినయినా చేతితో పట్టుకోగలం కానీ సమయాన్ని మాత్రం పట్టుకోలేము. సమయం నీరు లాంటిది, నీటిని మన దోసిళ్ళలో ఒడిసిపట్టినప్పుడు అవి మన దోసిళ్ళ లోనే ఉన్నట్టుగా అనిపిస్తుంది కానీ చూస్తే నీళ్లు అన్ని వేళ్ళమధ్య వున్న స్థలంలో నుండి కారిపోతాయి. అదేవిధంగా సమయం కూడా అలానే గడిచిపోతూ ఉంటుంది.

నిజానికి, మిఠాయి అంగట్లో ఏమి దొరుకుతాయి? మిఠాయిలు కదా దొరకాలి? మినుములు, మెంతులు దొరుకుతాయా? చెప్పండి. విద్యార్థి దగ్గర 24 గంటలున్నాయి అనుకుంటే ఎక్కువ గంటలు దేని మీద పెడితే వాడిని విద్యార్థి అంటారు? చెప్పండి.

ఆటల్లో ఎక్కువ సమయం గడిపితే ఆటగాడు అంటారు... పనులు చేస్తూ ఎక్కువ గంటలు గడిపితే పనివాడు అంటారు... స్నేహితులతో ఎక్కువ సమయం గడిపితే జులాయి అంటారు. వంటింట్లోనే కాలం గడిపితే వంట మనిషి అంటారు. అంతే కదా...మరి విద్యార్థులు అనిపించుకోవాలంటే ఎక్కువ సమయం ఎందులో గడపాలంటారు...చదువుకోవడం, వ్రాసుకోవడం, స్కూల్‌కి వెళ్లడం, పరీక్షలు వ్రాయడం, ట్యూషన్‌కి వెళ్లడం ఇవే కదా మనము ఎక్కువ సమయం కేటాయించాల్సిన అంశాలు.

నిజానికి, ఇంట్లో సమస్యలు ఉన్నప్పుడే... చదువుకు ఎక్కువ సమయం కేటాయించాలి కదా...అప్పుడే కదా ఇంట్లో సమస్యలకు మనం పరిష్కారాలు చూపగలం. బీద పిల్లలయినా... ధనవంతుల పిల్లలయినా చదువుకు ఎక్కువ సమయం ఇవ్వాల్సిందే. మనము బాగు పడాలంటే ఎక్కువ సమయం చదువుకోసం ఖర్చు పెట్టాలి.

మీరు ఒక సారి చుట్టూతా జరిగే విషయాలు పరికిస్తే, ఈ విషయం సుస్పష్టం అవుతుంది. మీరు పేపర్లో చూస్తుంటారు...ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్న అపర సరస్వతి అని. పేదింటి పాప బాగా చదివింది. పై చదువుల కోసం సాయం అడుగుతోంది అని. అలాగే ఒక ప్రభుత్వాధికారి కొడుకు ఉన్నత విద్య ప్రవేశ పరీక్షలో మొదటిస్థానంలో నిలిచాడాని... దీని అర్థం ఏమిటి? బీదైనా... సాదైనా చదువుకు ఎక్కువ సమయం ఇచ్చిన వాళ్ళు ఎప్పుడూ విజయాలు సాధిస్తారు అనే కదా.

అంతెందుకు, అభయ ఫౌండేషన్ సాయం కోసమై వచ్చే పిల్లలను చూస్తే నాకెప్పుడూ గర్వముగా వుంటుంది. ఎవరిని చూసినా అద్భుతంగా చదువుతున్న వాళ్లే. అందులో పైన మీరు ఏకరవు పెట్టిన సమస్యల్లో ఏదో ఒకటి వున్న నేపథ్యమే. కానీ ఎక్కువ సమయాన్ని వారు చదువుకోసం కేటాయించడం వలన ఎంతో ప్రతిభను కనపరచారు. వాళ్ళను ఆదుకోవడం కోసం ప్రభుత్వమే కాదు...ఎవరైనా ముందుకు వస్తారు.

ఇక రోజుకు 24 గంటలు వున్నాయి కదా...ఒక సారి శ్రీ సత్య సాయి బాబా గారు విద్యార్థులతో మాట్లాడుతూ భగవంతుడిచ్చిన 24 గంటలను విద్యార్థి ఎలా వాడుకోవాలి అన్నది చెప్పారు. వాటిని 4 భాగాలుగా విభజించమని చెప్పారు. మొదటి 6 గంటలు నిద్ర, రెండో 6 గంటలు సొంత పనుల కోసం, మూడో 6 గంటలు స్కూల్ కోసం ఇక నాలుగో 6 గంటలు చదవడం కోసం. అప్పుడు మేల్కొని వున్న 18 గంటలలో సింహభాగం చదువు కోసం వెచ్చించిన వాళ్ళమవుతాము కదా. రోజుకు 12 గంటలు విద్యాభ్యాసంలో వెచ్చిస్తే ఆ విద్యార్థి ఎంతైనా సాధించగలడు.

కానీ మనము ఏమి చేస్తున్నాము...రోజులో ఎనిమిది గంటలు నిద్రపోతున్నాం, ఎనిమిది గంటలు స్కూల్లోనో లేదా కాలేజీ లోనే గడిపేస్తున్నాం, ఇక మిగిలిన ఎనిమిది గంటలలో అనేక రకాల పనులల్లో మునిగిపోతాము. మహా అయితే ఒక 2 గంటలు చదువుకుంటాము. అలా చేస్తే నిజంగా మనలను విద్యార్థి అంటారా?

సహజంగా విద్యార్థులు ఇంట్లో చేసేవి లేదా చెప్పే పనులు ఏంటంటే టీవీ, ఆటలు, ఫోన్, స్నేహితులు, షికార్లు, వంట పని, ఇంటి పని, పార్ట్ టైం, ఇలా ఏమి చేసినా పైన చెప్పిన రెండో 6 గంటలలోనే చేసుకోవాలి తప్ప...చదువు కోసం పెట్టిన 12 గంటల నుండి ఒక్క క్షణం కూడా ఖర్చు చేయొద్దు.

సమయాన్ని వృథా చేసేది ఏదైనా మన జీవితాన్ని పాడు చేసేదే అని పిల్లలు గ్రహించాలి. ఆటలు, పాటలు, మాటలు, స్నేహాలు మన జీవితంలో ఒక చిన్న భాగమే తప్ప...జీవితం కాదు. ఇవన్నీ మన ఆరోగ్యాన్ని కాపాడుకునే మందు (Medicine) లాగా ఉపయోగ పడాలి తప్ప మన జీవితాన్ని పాడు చేసే మందు (Drinks) లాగా ఉండరాదు.

ఒక వేళ నిజంగా మీరు పైన పేర్కొన్న విషయాలలో సమయం ఎక్కువ గడుపుతున్న సందర్భాలలో కూడా...వాటిలో మునిగివున్నా సరే...ఏ విధంగా చదువుకు సంబందించిన విషయాలు నేర్చుకోవచ్చు అన్నది గుర్తుంచుకోవాలి.

ఆటలలో భౌతికశాస్త్రం, పాటలలో తెలుగు, తిరుగుడులో సామాజిక అంశాలు, మాటలలో ఒక పాఠం గురించిన చర్చ, ట్రావెల్ లో వుంటే సామాన్య శాస్త్రం, అంగట్లో వుంటే గణిత శాస్త్రం, ఇలా ఎన్నో విషయాలు మన పాఠ్యాంశాములకు అనుగుణంగా తీర్చిదిద్దుకోవచ్చు. మనసుండాలే కానీ ప్రతి విషయంలో కూడా మనము పాఠాలు నేర్చుకోవచ్చు. మనకున్న పరిమితులనే అవకాశాలుగా మలచుకోవచ్చు. ఏమంటారు కాదంటారా?

## ప్రేరణ మంత్రం:

*Time waste is life waste - Bhagavan Sri Sathya Sai Baba*

## సూచనలు:

1. *మీ కంటే ఎక్కువ కష్టాలలో వుంటూ బాగా చదివే వారిని గమనించండి.*
2. *24 గంటలను 4 భాగాలుగా విభజించి రోజులో సింహభాగాన్ని చదువుకోసం కేటాయించండి*
3. *సమయం విలువను ప్రస్తుత కష్టాలతో కాక రేపు మీరు సాధించే విజయంతో ముడి పెట్టండి.*
4. *మీ ఉజ్వల భవిష్యత్తుకు సమయమే ఒక విలువైన పెట్టుబడి అని గ్రహించండి.*
5. *సమయాన్ని గౌరవించిన వాడిని రేపు సమాజమే గౌరవిస్తుంది.*

## స్ఫూర్తి:

మన అందరికీ తెలుసు భారతరత్న Dr APJ అబ్దుల్ కలాం గారి జీవిత కథ. ఉమ్మడి కుటుంబం, బీదరికం, చదువుకోవాలన్న ఆకాంక్ష, పార్ట్ టైం జాబ్, అంతంత మాత్రమే చదివేవాడు...కానీ ఈ నేపథ్యం ఏదీ తన విజయాలను అడ్డుకోలేక పోయింది. తన చేతుల్లో మిగిలి ఉన్న సమయాన్ని పూర్తిగా చదువు కోసం కేటాయించారు. అందరికీ స్ఫూర్తి దాయకమైన జీవితాన్ని అందించారు.

పిల్లలూ... కష్టాలు, నష్టాలు, ఇంటి పనులు, వంట పనులు, స్నేహము ఇలా అందరికీ వుంటాయి కానీ ఎవరైతే విద్యార్థిగా వున్నపుడు ఎక్కువ సమయాన్ని చదువు కోసమై కేటాయిస్తారో వాళ్ళు మాత్రమే తప్పక అద్భుతాలు సాధిస్తారు.

సమయాన్ని చక్కగా వినియోగించుకుంటే ఆ సమయమే మన అభివృద్ధికి బాటలు వేస్తుంది లేదంటే ఆ సమయమే మన జీవిత సౌధానికి బీటలు వేసి కూల్చేస్తుంది. సమయాన్ని వృథా చేసి ఎందుకూ పనికి రాకుండా వున్న ఎంతో మందిని మనం నిత్య జీవితంలో



చూస్తుంటాము. ఈ రోజు మనం సమయము లేదు అంటూ...వున్న విలువైన సమయాన్ని వృధా చేసుకుంటే రేపు మనమే ఒక చెడు ఉదాహరణగా మిగిలి పోతాము.

పిల్లలూ... సమయం అత్యంత విలువైన వనరు భగవంతుడు మనకు ఉచితంగా ప్రసాదించాడు. దానిని మనము నిజంగానే ప్రసాదంగా స్వీకరించి మన ఉన్నతి కోసమై వినియోగించాలి. అప్పుడు ఇక ఏమి చేసినా విజయము మనదే.



# 4. వినటం లేదు



## సమస్య:

*సార్! ఈ కాలం పిల్లలు వినటం లేదు. మా చిన్న తనంలో ఎంతో శ్రద్ధగా వినే వాళ్ళం. ఇప్పుడు తరగతిలో ఉన్న పాతిక మంది పిల్లల్ని కూడా మేము చూసుకోలేక పోతున్నాము. ఏమైనా గట్టిగా మందలిస్తే ఏ అఘాయిత్యం చేసుకుంటారో అన్న భయం. ప్రభుత్వాలు కూడా పిల్లల్ని సుకుమారంగా చూసుకోవాలని చెప్తున్నాయి. పిల్లల్ని ఏమైనా మాట వినటం లేదని అరచినా కొట్టినా తల్లిదండ్రులు చాలా పెద్ద రాద్ధాంతం చేస్తున్నారు. ఏమి చేయాలో పాలు పోవడం లేదు – ఉపాధ్యాయులు*

*అయ్యో! నాకు పాఠాలు వినాలని లేదు. ఏదో మొక్కుబడిగా స్కూల్ కి వెళ్తున్నాను. ఏమీ వినడం లేదు. టీచర్లు చెప్తున్న విషయాలలో ఆసక్తి కలగడం లేదు – విద్యార్థులు*

*బాబూ... మా పిల్లాడు అసలు మాట వినడు. వాడిని సముదాయించడం మా తరం కావట్లేదు. వాడు అడిగింది ఇవ్వడం తప్ప మేము ఏమి చేయలేకపోతున్నాం – తల్లిదండ్రులు*

## వివరణ:

ఈ సమస్యలు ఎదుర్కుంటున్న వాళ్ళు ఎవరైనా...ఒక్కటి మాత్రం అన్నింటా కామన్‌గా వుంది. అదే వినటం లేదు. చాలా సమావేశాల్లో ఇవి ఎక్కువగా ఉపాధ్యాయల నుండి వచ్చే మాటలు. నిజంగానే ఇది చాలా పెద్ద ఛాలెంజ్.

ఈ రోజుల్లో ఎవడికి వాడే యమునా తీరే. మావాడు అసలు మాట వినడు! ఈ మాట మా అమ్మ మా గురించి చెప్తే వింటుంటి. వాళ్ళమ్మ కూడా చెప్పి వుండొచ్చు. అలాగే తరాలు మారినా మాటలు మారలేదు. ఇది ఎప్పుడూ వున్న సమస్యే. ఇప్పుడిక 21 వ శతాబ్దంలో ఈ సమస్య మరింత జటిలమైంది.

మనము అందరం దీనిని చక్కగా విశ్లేషించాలి. పిల్లలు మాట వినకపోవడం అన్నది కేవలం ఉపాధ్యాయుల వైపు నుండి మాత్రమే కాదు... అన్ని వర్గాల వాళ్ళ నుండి వినిపిస్తున్నదే. తల్లి తండ్రులు, గురువులు, ప్రభుత్వము, వృద్ధులు ఇలా అందరూ ఏక కంఠంతో చెప్పే సమస్య ఇదే సుమా.

చిన్ననాడు నేను శ్రీ సరస్వతి విద్యామందిర్‌లో చదువుతున్న రోజుల్లో నేను అనుభవించిన విషయాలను మీతో పంచుకుంటున్నాను...

ఉపాధ్యాయులు అందరూ ప్రేమైక స్వరూపులుగా వుండే వాళ్ళు. భారతీయత వుట్టి పడే వస్త్రధారణ... మూర్తీభవించిన సరస్వతీ మాతలలాగా కనిపించే వాళ్ళు... మమ్ములను విద్యార్థులలా కాదు సొంత పిల్లల్లా చూసే వాళ్ళు. మేము కూడా వారిని 'ఆచార్య' అని పిలిచే వాళ్ళము. వారి ప్రేమకు దాసోహం అయ్యేవాళ్ళము. మాతో పాటు భుజిస్తూ... భజిస్తూ... సంభాషిస్తూ... బోధిస్తూ... దేశభక్తిని ప్రబోధిస్తూ... ఆటలాడుతూ... ఎగురుతూ... గెంతుతూ గడిపేవారు. విరామసమయంలో మమ్మల్ని అధ్యాపకులు భుజాల మీద వేసుకుని గిరగిరా తిప్పేవారు.

ఇక వాళ్ళు ఏమి చెపితే అది వినే వాళ్ళము. తల్లి తండ్రుల తరువాత వాళ్లే మాకు దిక్కు మొక్కుగా వుండే వాళ్ళు. అంతటి ప్రేమానురాగాలు నేను మళ్ళీ ఎక్కడా చూడనే లేదు.

నిజం చెప్పాలంటే... పిల్లలు బంక మట్టి లాంటి వాళ్ళు... ఆరోజైనా ఈ రోజైనా వాళ్ళను తీర్చి దిద్దటం అన్నది అధ్యాపకుల చేతిలోనే ఉన్నది.

ఒకసారి పరిశీలిస్తే టీచర్లను పిలిచే ప్రతి సంబోధనలో వాళ్ళు ఎలా వుండాలో అన్న విషయం గోచరిస్తుంది. శ్రీ సత్యసాయిబాబా వారు చెప్పగా విన్న విషయాలు ఇక్కడ మీతో పంచుకునే ప్రయత్నం చేస్తున్నాను.

'ఉపాధ్యాయుడు' అనగా దరి చేర్చుకుని (ఉప) విద్యార్థి స్థాయికి దిగి వచ్చి బోధించేవాడు (అధ్యాయి)

'అధ్యాపకుడు' అంటే చక్కగా నేర్చుకుని (అధ్యయనం) పిల్లలకు బోధించేవాడని అర్థం



‘బోధకుడు’ అర్థం ఏమనిన తాను మొదట అభ్యసించి ప్రావీణ్యత సంపాదించి, పాఠ్యాంశాములను విద్యార్థులకు చక్కగా భోదించే వాడు.

‘ఆచార్య’ అనగా...మొదట తానాచరించి తరవాత సోదాహరణంగా విద్యార్థులకు వివరించి వారికి దారి చూపు వాడని.

‘గురువు’ అంటే ‘గు’ కారో అంధకారశ్య, ‘రు’ కారో తన్నివారణశ్య.

అనగా తన వద్దకు చేరిన శిష్యుల లోని అజ్ఞాన అంధకారమును తొలగించి జ్ఞాన జ్యోతి వెలిగించేవాడు అని.




ఈ పదములు...పదార్థములు మనము అర్థము చేసుకున్నట్లయితే పరమార్థం బోధపడినట్లే. కానీ ఈ రోజు బోధ గురువుల కంటే భాధ గురువులు ఎక్కువగా సమాజంలో కనిపిస్తారు.

నేను గత 5 దశాబ్దాలుగా చూసిన, వినిన, ఆచరించిన, అనుభవించిన, ఆస్వాదించిన విషయాల ఆధారంగా కొన్ని సూచనలు చేసే ప్రయత్నం చేస్తున్నాను. ఈ సూచనలు ఎవరైనా పాటించవచ్చు. ఒకటి కాకపోతే మరొకటి తప్పక పని చేస్తుంది అని నా నమ్మకం.

## సూచనలు:

***1. ప్రేమతో సాధించవచ్చు:***

*ఆ మధ్య సామాజిక మాధ్యమాలలో ఒక వీడియో చూశాను. తమిళనాడు లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు బదిలీ మీద వెళ్లి పోతున్న తమ టీచర్‌ను పట్టుకుని ఏడుస్తూ... ఆయన వాళ్ళని విడిచి వెళ్లకూడదు అని ప్రాధేయ పడుతున్నారు. ఒక్క సారి మనం ఆలోచించాలి... ఒక టీచర్ ఎంత ప్రేమతో వుంటే విదార్థులను ఇంతగా ప్రభావితం చేయగలడు. ఇక ఆయన చెప్పింది వేదంలా వినని విద్యార్థి వుంటాడంటారా? ఆ పాఠశాలలో. ప్రేమను ఆయుధంగా చేసుకుంటే ఎంతటి కఠినమైన పిల్లాడైనా సరే మైనంలా కరిగి పోతాడు కదా...*

***2. పిల్లల దారిలోనే వెళ్లవచ్చు:***

*ఒక వేళ పిల్లలు చుట్టూతా జరిగే విషయాల ప్రభావం వల్ల తరగతి గదిలో మన మాట వినడం లేదు అనుకుందాము. అప్పుడు వారి ధ్యాస ఎక్కడికి వెళుతోందో చూసుకుని...ఆ అంశము మీద మనము మాట్లాడటం మొదలు పెడితే తప్పక పిల్లలు మన మార్గములోకి వస్తారు.*

*నాకు బాగా గుర్తు... ఒక సమావేశంలో నేను మాట్లాడటానికి గూడూరు అనే గ్రామానికి వెళ్ళాను. అక్కడికి వెళ్లిన తరవాత తెలిసింది... అక్కడ నేను మాట్లాడేది వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో వేదిక మీద ప్రదర్శన ఇవ్వ బోతున్న 10 సంవత్సరాల లోపున్న చిన్నారులతో అని. అదీ ఆ పిల్లలు అందరూ మేక్ అప్ వేసుకుని వారి ప్రదర్శనకు సంబంధించిన దుస్తులతో ఉన్నారు. ఒక రాత్రి అంతా ప్రయాణం చేసి... ఈ చిన్నారులతో మాట్లాడ కుండా వస్తే ఎలా అన్న భావన నాకు భాధ కలిగించింది. ధైర్యం*

చేసి వాళ్ళ మధ్యలో దూరి కూర్చున్నాను. అలా చేయడం ఆ చిన్నారులకు చాలా ఆశ్చర్యం కలిగించింది. అయినా వాళ్ళందరు తాము చేయ బోయే అంశాల గురించి మాట్లాడుకుంటూ ఎవరి ధ్యాసలో వాళ్ళున్నారు. నేను మాట్లాడినా వినే పరిస్థితిలో లేరు. ప్రయత్నం చేస్తున్నా అలాగే. అక్కడ నా ముందే కూర్చున్న అతి చిన్న పిల్లాడు తన ముందున్న ఒక చీమతో ఆటలాడుకుంటుంటే మిగతా చుట్టూతా వున్న అరడజను మంది పిల్లలు తమాషా చూస్తున్నారు. ఆ చీమనే నా బోధనాంశముగా చేసి... సుమారు 45 నిముషాలు మాట్లాడాను. అక్కడున్న వంద మంది ఎంతో ఉత్సుకతగా వారివ్వాల్సిన ప్రదర్శనను కూడా మరచి పోయి... కేరింతలు కొడుతూ నా చుట్టూ చేరిపోయారు. చీమ ద్వారా నేర్చుకో దగిన 10 అంశాలు వాళ్ళతోనే చెప్పించి గాని నేను అక్కడి నుండి కదల లేదు. అంతలా విన్నారు... నేర్చుకున్నారు.

**3. ఒక మంచి కథ చెప్పొచ్చు:**

పిల్లలు మాట వినటం లేదని అర్థం అయినప్పుడు... పాఠం మీద ధ్యాసలేదని గమనించినప్పుడు మనం కోప్పడకుండా ఒక అద్భుతమయిన కథ చెప్పవచ్చు... అది కూడా మనము బోధిస్తున్న విషయానికి సంబంధించినదిగా ఉండాలి. అలా కాని సందర్భములో టీచర్ మాట విని, బాగుపడిన ఒక పాత విద్యార్థి గురించి చెప్పొచ్చు...లేదా తన స్వీయకథనే తనదని చెప్పకుండా చెప్పి, వాళ్ళని ఆశ్చర్యపరచవచ్చు. ఇలా వాళ్ళ ధ్యాసను మనమీదకు తిప్పుకొనవచ్చు.

**4. ప్రయోగము చేయొచ్చు:**

పిల్లలు మాట వినటం లేదు...సబ్జెక్ట్ మీద ఇష్టం లేదని గమనించిన మరుక్షణం, ఆ పాఠాన్ని ప్రయోగాత్మకముగా ఎలా బోధించాలి అని ఆలోచించి స్పందించాలి. టీచరు తానే ఒక ఏక పాత్రాభినయం చేయొచ్చు, ఒక నలుగురు పిల్లల్ని ఎన్నిక చేసి వారితో చిన్న స్కిట్ వేయించొచ్చు, అక్కడ వున్న వాటితోనే చిన్న ఎక్స్‌పెరిమెంట్ చేయొచ్చు, బయట వాతావరణంలో దొరికే వస్తువులను, వాతావరణాన్ని ఆధారం చేసి ప్రయోగం చేయొచ్చు...అప్పుడు పిల్లలు తప్పక నాదస్వరం విన్న మిన్నాగుల్లా హాయిగా వింటూ మైమరచి పోతారు. ఈ విషయాలు అన్ని నేను స్వయంగా చేసినవే... వాటి ఫలితము ఆస్వాదించినవే సుమా.

**5. నాయకత్వం ఇవ్వొచ్చు:**

మాట వినకుండా విసిగిస్తున్న పిల్లలకు మన పాఠములో నాయకత్వం ఇవ్వాలి. వాళ్ళకు పాఠములో భాగస్వామ్యం ఇవ్వాలి. అప్పుడిక వాళ్ళ గోల కాస్తా సద్దుమణిగి...తమ నాయకత్వమునకు తరగతి గదిలో సహచర విద్యార్థుల ముందు మచ్చ లేకుండా చూసుకుంటారు.

**6. చెప్పినట్లు చేయొచ్చు:**

చాలా చోట్ల మన ప్రవర్తనను బట్టే విద్యార్థుల స్పందన ఉంటుందన్నది నగ్న సత్యము. ఉపాధ్యాయులు తాము ఏమి బోధించినా...అది పాఠ్యాంశాము కానీ... ఇతర విషయాలు కానీ... తాము ఆచరించి చూపించి నప్పుడు వాటి ప్రభావం విద్యార్థుల మీద ఒక మేజిక్ లాగా పని చేస్తాయి.

**ప్రేరణ మంత్రం:**

*"The mediocre teacher tells, the good teacher explains, the superior teacher demonostrates and the great teacher inspires."*

# 5. చదవటం లేదు




## సమస్య:

*చదవడం నా వల్ల కావట్లేదు. ఎంత ప్రయత్నించినా, నా చదువు ముందుకు సాగట్లేదు. చాలా బోర్‌గా వుంటుంది. ఎక్కువ సేపు ధ్యాస పెట్టి చదవలేక పోతున్నాను. ఎంత చదవాలని పట్టుదలతో కూర్చున్నా, 10 నిముషాలలో పుస్తకం ఒక పెద్ద శిక్ష లాగా, నా మీద పడిన ఒక పెద్ద గుది బండలా మారిపోతుంది. బద్ధకం ఆవహిస్తుంది. నిద్ర ముంచుకు వస్తుంది. ఎవరైనా కాస్తా మాట్లాడిస్తే చాలు...అదే అదునుగా పుస్తకం పక్కన పెట్టేస్తుంటాను. చదవడం సంతోషముగా ఫలవంతంగా వుండాలంటే నేనేమి చేయాలి?*

## ఆగండి:

మనము వివరంగా మాట్లాడుకునే ముందు ఈ క్రింది విషయాలు కాస్త గమనించి మీ సమాధానాలు సిద్ధంగా ఉంచుకోవడం మరవద్దు.

1. చదవడం మాత్రమే కష్టంగా వుందా లేక ఏ పని చేయాలన్నా ఇలాంటి అనుభవమే ఎదురు అవుతుందా?
2. చదవడానికి ఇబ్బందా లేక చదువుకోవడమే ఒక ఇబ్బందా?
3. చదువుకోవడం కోసం మీరెన్ని మార్గాలలో ప్రయత్నం చేశారు?

4. మీ చుట్టూ ఎలాంటి పరిసరాలు వుంటున్నాయి
5. పరిసరాలు మీ చదువు ముందుకు సాగడానికి ఉపయుక్తంగా వుంటున్నాయా?
6. మీరు చదవ లేక పోవడానికి ఏమైనా కారణాలు వున్నాయా?
7. అనవసరమైన ఆలోచనలు మనసులో పెట్టుకుని చదువుతున్నారా? ఒక కాగితం మీద వ్రాయండి.

## వివరణ:

పైన చెప్పిన అంశాలను మీరు ఒకసారి నిజాయతీగా గమనిస్తే, మీకు మీరుగా మెరుగ్గా అవగాహన తెచ్చుకోగలరు. నిజానికి ప్రపంచములో చదువుకోకూడదు అనే వాడు లేడంటే అతిశయోక్తి కాదు. మీరు చూసే వుంటారు మురికి వాడల్లో తల్లిదండ్రులు పనులకు వెళితే ఇంటి దగ్గరున్న ఏ బ్రిడ్జి కిందో కూర్చుని...ఆడుతూ పాడుతూ కూడా సమాజాన్ని చదవాలనే ఆశతో జీవించే బాల బాలికలు ఎందరో ఉన్నారు.

గత దశాబ్ద కాలం నుండి అత్యంత వెనుకబడిన వర్గాలలో చదవాలన్న ఆకాంక్ష బలంగా వున్న పిల్లలకు సూపర్30 వ్యవస్థాపకుడు ఏ విధంగా ఉచితంగా తర్ఫీదు ఇస్తున్నాడో... ఈ ఇతి వృత్తంతో ఆ మధ్య కాలంలో ఒక హిందీ సినిమా కూడా వచ్చింది. చదవడం అంటే ఏంటో ఆ గ్రామీణ ప్రాంతాల లోని పిల్లల్ని గమనిస్తే తెలుస్తుంది. అత్యంత కష్ట సాధ్యమైన IIT లో సునాయసముగా సీటు తెచ్చుకోగలిగేలా చదివారు.

చదవడానికి కావాల్సింది జీవితములో బాగు పడాలన్న ఒకే ఒక్క సంకల్పం. ఆ సంకల్పమే మిమ్మల్ని ముందుకు నడపాలి. చదవకుండా బాగు పడిన వాళ్ళ చరిత్రలు మీరు సాకుగా చూపుతారేమో... అలాంటి వాళ్ళు కోటికి ఒక్కరు పుడతారు. ఆ కోవకు మీరు చెందిన వాళ్ళని మీకు మీ మీద అపార నమ్మకం వుంటే ఇక ఏ ఆలోచన లేకుండా చదువు ఆపేయవచ్చు. కానీ అలాంటి దృఢ సంకల్పం వుంటే ఈ పాటికి మీరు ఏదో ఒకటి సాధించి వుండాలి. ఏమి లేదని మీకనిపిస్తే కాస్త నోరు మూసుకొని చక్కగా చదవడం ప్రారంభించండి.

అసలు జీవితములో ఏ వృత్తి లో రాణించాలన్నా... కనీసం డిగ్రీ అన్నా చదివి వుండాలి. కారణం ఏమంటే... రేపు మీకు అక్షరాలే చదవడం రాకుంటే ఎలా రాణిస్తారు. మీరు డాన్సర్‌గా స్థిరపడాలన్నా... కనీసం చదవాలి. ముచ్చటగా 3 భాషలు తెలియాలి. ఒకటి మాతృభాష, ఇంకోటి దేశభాష మరియు మరొకటి అంతర్జాతీయభాష. అంటే తెలుగు, హిందీ మరియు ఇంగ్లీష్. రేపు ఎక్కడికైనా వెళ్ళాలి అంటే కనీసం సామాజిక విషయాలు తెలియాలి కదా... కనీస జ్ఞానము వుండాలి కదా. కొంచెం అయినా లెక్కాచారం తెలిసి వుండాలి కదా... దాని కోసం అయినా ఇప్పుడు శ్రద్ధగా చదవాలి. ఇలా ఎరుకతో మనము మన జీవితంలో ఏమి చేయాలన్నా చదువు అవసరం అని నిర్ధారణకు రాగలిగితే ఇక ఎవరూ చెప్పనక్కరలేదు. మీకు మీరే గురువులుగా మారతారు.

చదువు లేకుండా... చదువు అంటే ఇష్టం లేకుండా...





చిన్ననాడు ఎవరి మాట వినకుండా... తిరిగిన వాళ్ళు సమాజంలో కొన్ని కోట్లమంది వుంటారు. ఒకసారి ఓపిక చేసుకుని పరిశీలించి చూడండి. వాళ్ళెలాంటి జీవితం గడుపుతున్నారో మీకే అర్థం అవుతుంది. ఇక అప్పుడు మీరే దిశా నిర్దేశం చేసుకుంటారు.

చదువు లేని వాడు వింత పశువు అన్న సామెత మీరు వినే వుంటారు. పశు పక్షి మృగాదులకు లేని అతి కొన్ని లక్షణాలలో మనిషికున్నది ఏంటంటే చదువుకోవడం. చదువుకోవడం వలన మన నిర్ణయాత్మక శక్తి పెరుగుతుంది. ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితి చేరడం సులభతరం అవుతుంది.

సరే, ఇప్పుడు చదువుకోవాలి అన్న విషయం నిర్ధారణ అయ్యింది అనుకుందాము. కానీ మనసు పెట్టలేక పోతున్నాను అన్నది మన ఉన్నతిని అడ్డుకుంటుంది. దీనిని ఎలా అధిగమించడానికి వీలుందో చర్చిద్దాము. చాలా ప్రధానంగా ఈ అంశాలను గుర్తించి వర్తించండి...

## సూచనలు:

- *చదవడం శిక్ష కాదు అద్భుతమైన శిక్షణ*
- *మనసు దేహం హృదయం శుభ్రంగా పెట్టండి*
- *పరిసరాలను పాజిటివ్ గా పెట్టుకోండి*
- *అనవసరమైన ఆలోచనలు పెట్టుకోవద్దు*
- *చదువు ఉత్తీర్ణతకు కాదు, ఉన్నతికే అనుకోండి*
- *మనలను ప్రక్కకు లాగే ప్రతి దాన్ని దూరం పెట్టండి*
- *చదవడం బరువు కాదు బాధ్యతగా గుర్తించండి*
- *చదువు ద్వారా కొత్త విషయాలు తెలుస్తాయి*
- *చదవడం అంటే పుస్తక పఠనం మాత్రమే కాదు*
- *చదవడం...వ్రాయడం...పలకడం...వినడం అని*
- *చదువును ఉత్సాహ భరితంగా చేయండి*
- *ధ్యాస కుదరక పోతే శ్వాస మీద మనసు పెట్టండి*
- *చదువును ఒక పూజ/యజ్ఞంలా ప్రారంభించండి*
- *అనుకున్నది పూర్తి అయ్యేదాకా మధ్యలో లేవొద్దు*
- *చదవడం కంటే చర్చిస్తే సూపర్‌గా వుంటుంది*
- *అంశాలను ప్రయోగాత్మకముగా నేరిస్తే ఇక మరవరు*
- *మధ్య మధ్య కాస్త ఇష్టమైన సంగీతం వినండి*
- *కొంత సమయం వ్యాయామం చెయ్యండి...*
- *చదవడం ఎవరి కోసమో కాదు నీ కోసమే!*
- *ఇష్టమైనది చదవడం కాదు ఏది చదివినా ఇష్టంతో చదివితే అద్భుతాలు జరుగుతాయి.*

## ప్రేరణ మంత్రం:

*Learning is LIFE!*
*The capacity to learn is the Gift...*
*The ability to learn is the Skill...*
*The willingness to learn is the Choice!!*

## స్ఫూర్తి:

అతని కుటుంబము చిన్న నాటి నుండి చాలా కష్టాలు ఎదుర్కొంది. చాలి చాలని ఆర్థిక వనరులతో ఆ అబ్బాయి చదువుకునే వాడు. కానీ ఏనాడూ చదువుని నిర్లక్ష్యం చేయలేదు. ఇంట్లో చదువుకోవాలంటే కనీస వనరులు, సౌకర్యాలు కూడా వుండేవి కావు. చదువును వదిలెయ్యలేక ఎన్నో మార్గాలు వెతికి చదివేవాడు. సర్వజన సౌకర్యం కోసమై వీధుల్లో ఏర్పాటు చేసిన నూనె దీప స్తంభాల దగ్గరున్న వెలుతురులో చదివేవాడు. అన్ని తరగతుల్లో మంచి మార్కులతో ముందుండేవాడు. ఆ విధంగా డిగ్రీ పూర్తి అయింది. ఇంకా ఉన్నత చదువులు చదవాలన్న పట్టుదలతో విశ్వ విద్యలయములో చేరడం కోసం ప్రయత్నం చేశాడు. సీటు వచ్చినా...కావాల్సిన పుస్తకాలు కొనుక్కోవడానికి కూడా ఆ యువకుడి దగ్గర డబ్బులేదు.






సాహిత్యం (Literature) లో PG చేయాలన్న కోరిక బలంగా వుండేది. ఏమి చేయాలో పాలు పోలేదు. ఎవరూ సాయం చేయలేదు. తనకంటే ముందే PG చేసిన ఒక దూరపు బంధువు ఇంటికి వెళ్ళాడు... అక్కడ అతను PG పూర్తి చేసిన పుస్తకాలు అన్నీ అమ్మి వేయడానికి సిద్ధం చేస్తున్నాడు. కుతూహలంగా అడిగాడు... అన్నా! ఏమి చేస్తున్నావు అని. అతను చెప్పాడు నేను చదివిన వేదాంతము (Philosophy) పుస్తకాలు కట్ట కడుతున్నాను అని. ఆ యువకుడు వెంటనే... అన్నా, ఆ పుస్తకాలు నాకు ఇస్తే నేను పట్టభద్రుడు అవుతాను కదా. అది విన్న బంధువు ఆశ్చర్యంతో అడిగాడు...అదేంటి నువ్వు ఇష్టముగా చేయాలనుకున్నది సాహిత్యం కదా...ఇవి వేదాంతమునకు సంబంధించిన పుస్తకాలు కదా!

అప్పుడు ఆ యువకుడు చెప్పాడు. నిజమే అన్నా, నేనున్న ప్రస్తుత పరిస్థితుల్లో నాకిష్టమైన విషయం చదవడం కాదు...ఏదీ చదివినా ఇష్టముగా చదవడమే ముఖ్యము. అంటూ ఆ పుస్తకాలు తీసుకుని భుజాన పెట్టుకుని విశ్వ విద్యాలయంలో చేరాడు. తదనంతరం ప్రప్రథమ శ్రేణి లో ఉత్తీర్ణత చెందడమే కాదు... తరవాత కాలంలో విశ్వ విద్యాలయనికే ఉపకులపతి గా సేవలందించారు. అనతి కాలంలోనే దేశములోనే కాదు... ప్రపంచ వ్యాప్తంగా పేరిన్నిక గన్న విద్యావేత్తలలో ఒకరుగా కీర్తించ బడినారు. అంతే కాదు సుమా... మన భారత దేశానికి రాష్ట్రపతిగా సేవలందించారు.

ఇంతకూ ఎవరో తెలుసా? వారు... భారతరత్న Dr. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు. వారి జీవితమే ఒక మహాద్భుత సందేశం. పిల్లలూ ఇప్పుడు చెప్పండి... చదవటం, చదువుకోవటం, చదువుకునే అవకాశం ఉండటం ఎంత అదృష్టమో...

పిల్లలూ! ఒకటి గుర్తుంచుకోండి... తల్లిదండ్రులు మీ ఉన్నతి కోసం ఎంతో కష్ట పడుతుంటారు... మీరు బాగా చదువుకోవాలన్న లక్ష్యంతో ఎంత కష్టమైనా భరిస్తూ మరెంతో ఇష్టంగా మీ గురించి శ్రమిస్తున్నారు. వాళ్లకు మన చదువే ఒక బహుమతి! కాదంటారా???

# 6. మరచిపోతున్నాను




## సమస్య:

*ఎప్పటి కప్పుడు విన్నది, చదివింది మరచిపోతున్నాను. అప్పటికప్పుడు ఇక వచ్చేసింది అని అనుకుని పక్కన పెట్టేస్తుంటాను. తీరా తరవాత ఎప్పుడైనా గుర్తుకు తెచ్చుకుందా మంటే విన్నది, చదివింది మరచి పోతున్నాను అని తెలుస్తోంది. విన్నది మరచి పోకుండా వుండాలంటే ఏమి చేయాలి? నేను ఏనాడూ చదువును నిర్లక్ష్యము చేయలేదు...శ్రద్ధగానే చదువుకుంటాను. కానీ మరచి పోతున్నాను.*

*చేయాల్సిన పని సమయానికి చేయకపోవడం లేదా అసలు ఆ పనిని పూర్తిగా మరిచిపోవడం జరుగుతోంది. టైమ్‌టేబుల్ పెట్టుకుంటా, కానీ దానిని విస్మరించి రోజువారీ పనులలో, ఆటలలో, అలవాట్లలో పడి పోతుంటాను. తీరా తేరుకొని చస్తే పుణ్యకాలం పూర్తవుతుంది. వీటన్నిటికీ కారణం మరచి పోవడం. ఏమి చేయాలి?*

## వివరణ:

పెద్ద వాళ్ళు చెప్తుంటే మనము అందరూ వింటూ ఉంటాము. మరుపు మానవ సహజం. ఒక రకంగా చెప్పాలంటే మరుపును దేవుడు ఇచ్చిన వరంగా చెప్పుకోవచ్చు. జీవితంలో జరిగే విషయాలన్నీ

మరచిపోకుండా వుంటే... చాలా ఇబ్బంది పడతాము. కానీ విద్యార్థులకు ఈ వేదాంతము పనికి రాదు. విద్యాభ్యాసంలో మరుపు అన్నది ఉండకూడదు. కారణం చదివే ప్రతి విషయం వాళ్ళు మరచి పోకుండా వుండాలి. అప్పుడే అవసరాన్ని బట్టి వాళ్ళు చదువుకున్న అంశాలను ఉపయోగించే వీలుంటుంది.

## ఉపాధ్యాయులకు:

విద్యార్థులకు చెప్పిన విషయాలు మరచి పోకుండా వుండాలంటే, ఉపాధ్యాయులు పాఠాలు బోధించే సమయంలో కొంత సృజనాత్మకతను జోడించాలి. ప్రయోగ పూర్వకముగా విద్యార్థులను అందులో మమేకం చేయడం ద్వారా వారి మనసులకు కాకుండా హృదయానికి హత్తుకునే విధంగా పాఠ్యాంశాలు భోదించాలి. అంతే కాక దృశ్య, శ్రవణ, సాంకేతికతలను జోడించే ప్రయత్నం జరగాలి.

ఈ రోజుల్లో మరపు రాకుండా ఉండేందుకు చాలా రకాలైన విధానాలు వున్నాయి. సాంకేతికతను మనము నిత్య జీవితంలో జోడించడం నేర్చుకుంటే మంచి ఫలితాలు సాధించ వచ్చు.

ఆ మధ్య ఒక సమావేశంలో, విద్యార్థులతో మాట్లాడుతుంటే, మరుపు అన్న అంశం చర్చకు వచ్చింది. అప్పుడు నేను వినూత్నంగా ఒకటి చేసాను. నాలుగు లైన్ల పద్యాన్ని తీసుకుని కేవలం 3 మార్లు మాత్రమే చెప్తాను ఎవరైనా విని తిరిగి చెప్ప గలిగితే బహుమతి ఇస్తానని ప్రకటించాను. అందరూ చాలా ఉత్సాహంగా సిద్ధమయ్యారు. సుమారు 500 మంది ఉన్నారు.

3 మార్లు వాళ్ళందరితో నేను చెప్తూ వారితో చెప్పించాను. ఆశ్చర్యంగా కేవలం ఒక 10 మంది మాత్రమే ముందుకు వచ్చి చెప్ప గలిగారు. అంటే 0.02% మాత్రమే చెప్పగలిగారు అన్నమాట. వీళ్ళను ఏక సంథాగ్రహులు అనవచ్చు. వీళ్లకు సూచనలు ఏమీ అవసరం లేదు. కానీ అక్కడున్న మిగితా 490 మంది పరిస్థితి గురించి మనం ఆలోచించాలి కదా... నేను ఈ సారి పద్యం చెప్పటంతో పాటుగా దాని అర్థం కూడా చెప్పాను. ఇంకొద్ది మంది చెప్ప గలిగారు. ఇంకో సారి చెప్తున్నప్పుడు పద్యంతో పాటుగా అభినయం కూడా చేసాను...రాగ యుక్తముగా పాడాను. ఒక సారి వేగంగా పాడాను...మరొక్క సారి కేవలము రాగాన్ని మాత్రమే లొల్లాయి పదంలో పాడాను. విద్యార్థులతో పదాలు చెప్పించాను. నేను ఏక్షన్ చేస్తే వారు పదాలు చెప్పాలి...నేను ఒక లైన్ చెపితే వారు రెండోది చెప్పాలి... ఇలా ఒక 10 నిముషాలు తరవాత వాళ్ళందరితో ఆ పద్యాన్ని సామూహికంగా చెప్పించాను. మీరు నమ్మరు... అక్కడున్న వందల మందికి ఆ పద్యం వచ్చేసింది. ఇంత చేసిన తరవాత కూడా కొద్ది మంది చెప్పలేక పోయారు అది వేరే విషయం అనుకోండి.

ఇక్కడ మనము గుర్తించాల్సిన విషయం ఏంటంటే, మనము పాఠం చెప్తున్న సమయంలో పిల్లలకు మొక్కుబడి పాఠంలా కాకుండా మొక్కవోని విధంగా జీవనపాఠంలా భోదించాలి. అప్పుడు మరుపు అన్నది రాదు. పాఠం ఒక అద్భుతమైన కథలా చెప్పగలిగితే ఇక ఎవరు కూడా నాకు చెప్పింది గుర్తుకు రాలేదు అని చెప్పక పోవచ్చు.

ఈరోజుల్లో, ప్రతి పాఠశాలలో అన్ని సబ్జెక్ట్స్‌కు ప్రయోగ శాలలుంటున్నాయి, టీచింగ్ ఎయిడ్స్ ఉంటున్నాయి, Exponential Learning Methods ఉంటున్నాయి, field visits ఉంటున్నాయి, online లో దొరికే వీడియోలు ఉంటున్నాయి... మరి ఇన్ని రకాల బోధనా సామగ్రి మరియు ప్రభావితం చేసే విషయాల ద్వారా మనం భోదిస్తుంటే 90% మంది పిల్లలకు మరుపు అనేది రానే కూడదు. వస్తోంది అంటే మనము చెప్పే విధానంలోనే లోపం వుందని గుర్తించాలి.

మీరు నమ్మడం లేదు కదా...అందరం చిన్నప్పుడు మన అవ్వ తాతల ఒళ్లో కూర్చుని ఊహ తెలియని వయసులో విన్న కథలు ఇప్పటికీ గుర్తున్నాయి కదా...కారణం ఏంటంటారు చెప్పండి. ఆ చెప్పే వాళ్లలో మన మీద ప్రేమ వాత్సల్యం వుంది, మనకు వాళ్ల మీద

అమాయకమైన నమ్మకం వుంది. వాళ్ళు చెప్పే విధానములో అద్భుతమైన సృజన వుంది. వాళ్ళ హావ భావాలను కనులప్పగించి చూస్తూ... వాళ్ళు చెప్పింది ఏదైనా చెవులప్పగించి వింటూ అలా సేదతీరాము కదా... అందుకే మరచిపోలేదు ఇప్పటికి... మరి మనము పాఠాలు చెప్తున్న సమయంలో ఎందుకు ఇట్టి విధానమును పాటించడం లేదు?



## విద్యార్థులకు సూచనలు:

*1. హృదయ పూర్వకముగా వినండి, చదవండి, వ్రాయండి.*

*2. విషయము ఏదైనా చిన్న భాగాలుగా వ్రాసుకోండి.*

*3. మరవకుండా ఉండేందుకు కుటుంబ సభ్యుల/ స్నేహితుల సాయం తీసుకోండి.*

*4. 10 సార్లు చదవడం కన్నా ఒకసారి వ్రాయడం మిన్న*

*5. ప్రయోగాత్మకంగా నేర్చుకోండి.*

## ప్రేరణ మంత్రం:

*Do I forget, or do I refuse to remember?*

## స్ఫూర్తి:

విద్యార్థులకు: ఆమధ్య ఒక సమావేశంలో, విద్యార్థులు వేసిన ఈ ప్రశ్నలకు సమాధానంగా...నేను అప్పుడే విడుదల అయిన ఒక తెలుగు చిత్రంలోని డైలాగ్ వినిపించి...ఇది ఏ చిత్రంలోనిది అని అడిగాను...ముక్త కంఠంతో అందరూ కేరింతలు కొడుతూ సరైన సమాధానం చెప్పేసారు.



అప్పుడు అడిగాను... అదేంట్రా, రోజూ వినే పాఠాలు, చేయాల్సిన పనులు, చదివే విషయాలు మరచి పోతున్నారు... ఒక్కసారి చూసిన సినిమాలో డైలాగ్స్ ఎలా మరచి పోకుండా చెప్ప గలుగుతున్నారు? అందరూ ఆశ్చర్యంగా నవ్వడం మొదలు పెట్టారు.

అప్పుడు నేను ఈ క్రింది విషయాలు వాళ్ల ముందుకు తీసుకుని వచ్చాను. పిల్లలు అలా ఒక్కసారి చూచిన సినిమా లో డైలాగ్‌లు ఎలా గుర్తు పెట్టుకున్నారో అన్న విషయం వివరించే ప్రయత్నం చేసాను.

1. మరచి పోలేనంతగా సినిమాలో ప్రతి బిట్టును చూశారు మీరు.
2. మధ్యలో ఎంత డిస్టర్బన్స్ వచ్చినా కూడా లెక్క చేయకుండా మనసు బుద్ధి హృదయం తో సినిమాలో

లీనం అయ్యారు.

3. సినిమాలోని పాత్రలతో మమేకం అయ్యి...అక్కడ చూపించే ఎమోషన్స్‌లో మీరు నిమగ్నమయ్యారు.
4. చివరికి పక్కన కూర్చున్న స్నేహితులతో, కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడనే లేదు.
5. బయట ప్రపంచంలో వర్షం వచ్చినా... పిడుగులు పడినా... చేతిలో ఫోన్ మ్రోగుతున్నా మనకు కనిపించలేదు... వినిపించలేదు.

ఇప్పుడు చెప్పండి...మీరు పాఠాలు వినే సమయంలో అయినా లేక నేర్చుకునే విషయంలో అయినా ఇలాంటి భావనలతో వున్నారా??? ఒక వేళ వుంటే మరచి పోవడానికి అవకాశం వుందా?

విద్యార్థులందరి నుండి నిశ్శబ్దమే సమాధానం అయింది. అప్పుడు చెప్పాను... పిల్లలూ పాఠాలు వినే సమయంలో మీ కళ్ళు, చెవులు... శరీరంలోని ప్రతి అవయవం కాదు ప్రతి అణువు తరగతి గదిలో వుంచండి. టీచర్ చెప్పే విషయం హృదయం తో వినండి. అప్పుడు చచ్చేదాకా ఇక మరచి పోయే అవకాశమే వుండదు.



# 7. ఆర్థిక ఇబ్బందులు




## సమస్య:

*ఇంట్లో చాలా ఆర్థిక ఇబ్బందులున్నాయి. బ్రతుకు బండి చాలా కష్టంగా సాగుతోంది. ఉన్నత చదువుకు కావాల్సిన వనరులు మా దగ్గర లేవు. నాకు చదవాలని వున్నా కుటుంబములో పరిస్థితులు నన్ను చదవడానికి ప్రోత్సహించడం లేదు. ఎంత చదివినా రేపు ఇంట్లో కూర్చోవడమే కదా...నేను డాక్టర్, ఇంజినీర్, IAS ఇలా ఎన్నో కావాలని అనుకున్నా...అవన్నీ కుదరదు కదా... ఏమి చేయాలి. అప్పు చేసి చదివించే స్థోమత మా తల్లిదండ్రులకు లేదు. ఇంతా చేసి రేపు నాకు సరి అయిన ఉద్యోగం వస్తుందా రాదా అన్నది కూడా సందేహమే...అప్పుడు మొత్తము జీవితమే అధోగతి అవుతుంది. ఎలా చదవాలి.*

## వివరణ:

అసలు డబ్బుకు మన చదువుకు ఏమిటి సంబంధం అన్నది నాకు ఎప్పుడూ అర్థమే కాదు. డబ్బులుంటే మనకు చదువు అబ్బుతుంది లేదంటే మొద్దు సుద్దలు అవుతాము అని ఎవరైనా ఎక్కడైనా నిరూపించి శిలా ఫలకం మీద వ్రాసి పోయారా??? చెప్పండి.

చేతిలో చిల్లి గవ్వ లేకుండా, చాలీ చాలని వనరులతో పూట గడవడమే కష్టంగా, రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబాలకు, చదువు అందని ద్రాక్ష పండా? అది డబ్బులున్నోళ్ల సొత్తా?

## చెప్పండి...

బీదవాడు చదువుకోలేడు అంటారా?

ఆర్థిక ఇబ్బందులున్న వాడికి అపజయమేనా?

పైన సమస్యలు ఏకరువు పెట్టిన విద్యార్థులు కూడా

అవును అన్న సమాధానం చెప్పటానికి కాస్త సంకోచిస్తాడు నిజంగా. ఇది నా స్వీయఅనుభవం ఎన్నో సమావేశాల్లో.

పిల్లలూ... ఒక సారి సింహావాలోకనం చేసుకుంటే అనాది కాలం నుండి మన దేశంలో చదువు సంస్కారం నేర్పబడే గురుకులాలలో అంటే విద్యాలయాలలో నాకు తెలిసినంత దాకా బీద లేక సాదా అన్న దాని మీద ఎప్పుడూ విద్య అందించిన దాఖలాలు లేవు. గురుకులాలలో సహితము రాజకుమారుడైనా, సామాన్యుడి కొడుకునైనా గురువులు ఒకే విధంగా చూసి విద్య అందించేవారు. ఈ రోజుకు కూడా విద్యా విధానంలో బీద సాదా అన్న భేదము ఎక్కడా లేదు.

అసలు, చెప్పాలంటే డబ్బులున్న వాడికంటే కూడా డబ్బులేని వారే ఎక్కువగా ప్రతిభావంతులు అవుతున్నారని చెప్పాలి. బాగా చదివే వాడు బీద వాడు అయితే చేయూత అందించే వాళ్ళు కోకొల్లలు వున్నారు ఈ దేశంలో. ఈ రోజు ప్రభుత్వాలు సైతము Economically Weaker Sections కు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు.

సమస్య బాగా చదివే ఆర్థిక ఇబ్బందులున్న పిలలకి కాదు...బాగా చదవని బీద పిల్లాలకే సుమా. కారణం బాగా చదివే పిల్లాడికి తప్పక ప్రభుత్వ సంస్థలలో ఉచితంగా ఎలాంటి భారం లేని విద్యా సౌకర్యాలు అందిస్తున్నాయి. మంచిగా చదివినా...పిల్లలు ఇంటికి దగ్గరున్న విద్యాలయాల్లోనే చదవాలన్న కోరికతో...అమ్మాయిలను ఎక్కడో ఉన్న విద్యాసంస్థలకు పంపే ఉద్దేశ్యం లేకనా... ప్రైవేట్ సంస్థల్లో చేరిస్తే పిల్లాడు ఇంకా బాగా చదివేస్తాడన్న అపోహతోనో...మొత్తానికి తప్పుడు నిర్ణయాలు తీసుకుని ఆర్థిక ఇబ్బందులలో కూరుకు పోయిన ఎన్నో కుటుంబాలు నాకు తెలుసు. ఇలా ఈరోజు బాగా చదివే పిల్లలు సమస్యల సుడిగుండములో పడిపోతున్నారు.

ఒక వేళ, బాగా చదివినా, ప్రభుత్వ సంస్థల్లో చదవడానికి కూడా కావాల్సిన వనరులు లేవనుకుంటే మాత్రం ఆ సమస్యను మనం పరిష్కరించవచ్చు. నేను చాలా సభల్లో సమావేశములలో ఎన్నో సందర్భాలలో చాలా బాహాటంగా ప్రకటించాను...బాగా చదువుకునే పిల్లలు కేవలం ఆర్థిక ఇబ్బందులలో ఉంటే ఎప్పుడైనా నన్ను సంప్రదించవచ్చు అని. కొన్ని వేల మంది ఆ మాటలు విని వుండొచ్చు. కానీ వాస్తవంలోకి వస్తే మాత్రం గత 2 దశాబ్దాలుగా ఒక వందమంది పిల్లలు కూడా నా దగ్గరికి రాలేదు. ఒకవేళ వచ్చినా వాళ్ళకు అద్భుతమైన ప్రతిభ, సహాయం అందుకునేంత అర్హత లేదన్నది నిజం.

## సూచనలు:

*ఆర్థిక ఇబ్బందుల్లో వున్న విద్యార్థులు ఎవరైనా సరే క్రింద ఇచ్చిన సూచనలు మరియు సలహాలు గమనించి విద్యార్జన చేసే సమయంలో గనక పాటించ గలిగితే...డబ్బు అన్నది చదువుకు ఒక అడ్డంకే కాదు అన్నది తప్పక గ్రహిస్తారు.*

*1. ప్రభుత్వ సంస్థలలోనే చదవండి*

*2 ప్రభుత్వం ఇచ్చే అన్ని సహాయాలు పొందండి.*

*3. వీలయితే హోమ్ ట్యూషన్ చెప్పి కొంత సంపాదించ గలరేమో చూడండి.*

*4. చిన్న పాటి పని ఏదైనా ఇంటికి దగ్గర్లో ఒక 3 గంటలు చేయొచ్చా ఆలోచించండి*

*5. ఏదైనా నైపుణ్యం ఉదాహరణకు మెహంది, డ్రైవింగ్, టెలీమార్కెటింగ్, కేటరింగ్ మొ॥ నేర్చుకుని నెలవు రోజులలో సంపాదించండి*

*6. ఎన్నో స్వచ్ఛంద సంస్థలు బాగా చదువుకునే వారికి ఎంతో నిస్వార్థంగా చేయూతను అందిస్తాయి.*

*7. తల్లిదండ్రులు, పనిచేసే కార్యాలయాల్లో యజమానులు కూడా ఎంతో దయతో స్పందిస్తారు.*

*8. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మరియు స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే పోటీలలో చురుకుగా పాల్గొనండి.*

> *9. నిజంగా మీరు అద్భుతంగా చదివే వాళ్ళు అవుతే మీరు చదివే పాఠశాల లేక కళాశాలల యాజమాన్యంతో సంప్రదించి కూడా సాయం పొందవచ్చు. ఇంతగా ప్రయత్నించినా ఫలితం లేదు అని అంటే వెంటనే నన్ను సంప్రదించడము మరవద్దు.*

## ప్రేరణ మంత్రం:

*Giving up on your Goal because of one setback is like slashing your other three tires because you got a Flat.*

## స్ఫూర్తి:

సాయిలత ఒక మధ్య తరగతికి చెందిన చిన్నారి. అమ్మ మరో చెల్లి ఇదీ తన కుటుంబము. ఏదో టైలరింగ్ చేసి, వడియాలు పెట్టి పిల్లలను ఉన్నంతలో చదివిస్తోంది అమ్మ. తండ్రి వాళ్ళతో లేదు. మిగతా బంధువుల పరిస్థితి అంతంత మాత్రమే... కానీ ఇద్దరు అమ్మాయిలూ చాలా చక్కగా చదువుతారు. అల్లారుముద్దుగా పెంచే అమ్మ నీడలో పెరిగారు. తను పదవ తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా ఒక కార్పొరేట్ విద్యాసంస్థ వాళ్ళు చాలా తక్కువ రుసుముకే చేర్చుకున్నారు. డాక్టర్ కావాలని ఎంతో ఆశతో సైన్సు గ్రూప్ తీసుకుంది. ఇంటర్ మొదటి సంవత్సరం అయిపోయింది. అసలు కష్టం అప్పుడెదురైంది.

రెండో సంవత్సరం రుసుము అందరితో పాటుగా కట్టమని చెప్పారు. ఏమి చేయాలో పాలుపోలేదు. చాలా ప్రయత్నాలు చేశారు. ఎక్కడా అంత పెద్ద మొత్తము సమకూర్చే వాళ్ళు లేరు. తెలిసిన వ్యక్తి ఒకరు...ఆ అమ్మాయికి అభయ సంస్థ గురించి చెప్పాడు. చాలా అమాయకంగా, కళ్ళల్లో ఎన్నో కలలు నింపుకుని హైదరాబాద్‌కు వచ్చింది. ఆ పాపను చూసిన సంస్థ సభ్యులందరు ఎంతో సంతోషంగా ప్రోత్సహించారు. 8 సంవత్సరాలు అయింది... సీన్ కట్ చేస్తే అత్యంత ప్రతిభతో Dr సాయి లత MBBS అయ్యింది. చదువుకు డబ్బులు అడ్డం కాదు అని నిరూపించడమే కాక ఇప్పుడు అఖిల భారత స్థాయిలో నిర్వహించిన PG ప్రవేశ పరీక్షలో అత్యంత ప్రతిభ కనబరిచి ప్రస్తుతం ఉన్నత చదువులు చదువుతోంది. జీవితంలో ఒక కష్టం వచ్చింది అని ఎన్నడూ నిరాశా వాదంతో ఇక జీవితం ఇంతే అని అనుకో లేదు ఆ అమ్మాయి. ఒక టైర్ పంచర్ అయిందని మిగితా 3 టైర్లను వదిలేసుకొని ఇంట్లో కూర్చోలేదు. అన్ని శక్తులు ఒడ్డి అడుగడుగునా ఎదురయ్యే అన్ని సవాళ్ళను ఎంతో స్థైర్యంగా ఎదుర్కొని పోరాడింది... గెలిచింది. పిల్లలూ... ఈ అమ్మాయి ఇంకో 10 మంది కి సాయం చేసే స్థాయిలో వుంది ప్రస్తుతం.

ఇప్పుడు చెప్పండి... చదువుకునే వాడికి ఆర్థిక ఇబ్బందులు ఒక అడ్డా... కాదు... కాకూడదు... కానేరదు. ఎవరైనా సరే చదువుకోవాలంటే కావాల్సింది డబ్బులు కాదు బుద్ధులు.



# 8. అనారోగ్య సమస్యలు



## సమస్య:

- నాకు ఎప్పుడు చూసినా అనారోగ్య సమస్యలు. చదువుకోవాలన్న తాపత్రయం ఎంతో ఉన్నా... తరచుగా వచ్చే అనారోగ్యం వలన చదవ లేకపోతున్నాను.
- నాకు రోగ నిరోధకశక్తి చాలా తక్కువ...చాలా సున్నితమైన బాడీ... ఏమాత్రం శ్రమించినా ఇట్టే అలసి పోతాను. అది చదువు మీద ప్రభావం చూపిస్తుంది.
- ఎంతో శ్రద్ధగా స్కూలుకు వెళతాను, కానీ అంతే శ్రద్ధగా ఎదో ఒక ఆరోగ్య సమస్య వచ్చేస్తుంది.
- నాకు కళ్ళ చూపు మందగించి చదవడానికి ఇబ్బంది అవుతుంది.
- నాకు తల నొప్పిగా వుంటుంది...
- నాకు నెలసరి సమయంలో ఖచ్చితంగా 5 రోజులు బయటకు రాలేనంతగా బడలిక చిరాకు వస్తాయి.
- ఇంట్లో కుటుంబ సభ్యులకు అనారోగ్యం...వాళ్లకు నేనే చేయాలి...ఎలా చదువుకు సమయం కేటాయించాలి?

## వివరణ:

పిల్లలూ మీరందరూ వినేవుంటారు... ఆరోగ్యమే మహాభాగ్యం. అంటే మనిషి ఆరోగ్యముగా ఉంటే ఎన్నో విషయాలు సాధించ వచ్చు అని. కానీ ఆ ఆరోగ్యం మనకు మన చదువుకు సమస్య అయినప్పుడు ఏమి

చేసేది??? నిజంగా ఇది చాలా క్లిష్టమైనదే గాక అతి సున్నితమైన సమస్యగా చెప్పొచ్చు. అట్లా అని అనారోగ్యాన్ని కారణముగా చూపి నేను చదవ లేదు అని ఎవరైనా అంటే మాత్రం నేను ఒప్పుకోలేను.

కారణం...ఎన్నో అద్భుతాలు చేయ గలిగిన మేధో సంపత్తిని మన దగ్గరుంచుకుని దేహ సంబంధమైన అనారోగ్యాన్ని చదువుకోక పోవడానికి కారణం చేయొద్దు.

"విచారణ" చేద్దామా?

అనారోగ్య సమస్యలతో భాధపడే ఎవరైనా సరే "విచారణ" అన్న పదాన్ని గుర్తుంచుకొని ముందడుగు వేయండి. అదేంటీ...ఇదేమన్నా తారక మంత్రమా? అంటారా? కాదు కాని, ఒక గమ్మత్తయిన విషయం వుంది ఇందులో...మనము చదువుకోవడం కోసం. అదే నండీ బాబు... విచారణ చేయాలి.

'వి'ద్యార్థులు
'చా'తుర్యముతో
'రణం' చేయాలి అనారోగ్యంతో
దేవుడు ఇచ్చిన బుద్ధి చతురత తో...అదే దేవుడు మనకు లోపంగా ఇచ్చిన అనారోగ్యంతో యుద్ధం చేసి జయించాలి. చెప్పడం ఈజీయే... ఏదైనా అనుభవిస్తేనే తెలుస్తుంది అంటారు కదా...

నాకు తెలిసిన ఒక వ్యక్తి హైదరాబాద్ లో ఉన్నత చదువుల నిమిత్తమై 3 వ అంతస్తులోని ఒక అద్దె గదిలో ఉంటున్నాడు. ఉద్యోగానికి సెలవు పెట్టి చాలా దీక్షతో కంపెనీ సెక్రటరీ పరీక్షల కోసమై చదువుకుంటున్నాడు. వంట చేసుకుంటే, చదవడానికి సమయం సరిపోదని, తెలిసిన వాళ్ళు తనకు రోజూ భోజనం కూడా పంపుతున్నారు. 3 నెలల శ్రమ. ఇంకో 20 రోజులలో పరీక్షలు అనగా... పై నుండి క్రిందికి దిగుతూ ప్రమాద వశాత్తు మెట్ల మీద జారి పడిపోయాడు. కాలిమడిమ దగ్గర ఎముక విరిగి పోయింది. వెంటనే చూడడానికి వచ్చిన స్నేహితులు అతనిని యశోద హాస్పిటల్‌కి తీసుకెళ్లారు. డాక్టర్లు చూసి, నడుము నుండి కాలి బ్రొటన వ్రేలు దాకా కట్టు కట్టారు. అతనికి ప్రపంచమే అంధకారం అయింది. ఏమి చేయాలో తోచలేదు. 3 లేక 4 వారాలు అసలు కదల కూడదు అని చెప్పారు. పరీక్షలు ఎలా వ్రాస్తాడు?

ఇప్పుడు చెప్పండి పిల్లలూ...అతను ఏమి చేయాలి... అతని స్థానంలో మీరుంటే ఏమి చేస్తారు!

1. ఇంకేముంది మంచం మీద బెడ్ రెస్ట్
2. తల్లిదండ్రులకి కబురు పంపడం
3. తెలిసిన వాళ్ళ సాయంతో ఇంటికి వెళ్లడం
4. పరీక్షలు వ్రాయడము కుదరదు

కానీ అతను ఇవేమీ చేయలేదు. తనకు తానే ధైర్యం చెప్పుకున్నాడు. నిరాశ చెందలేదు. కనీసం మంచం లేదు, WC Toilet లేదు, 3 అంతస్తులు మెట్లమీద, పట్టుకుని కదలడానికి కనీసం రైలింగ్ లేదు.

తను ఏమనుకున్నాడో తెలుసా... భగవంతుడు అద్భుతమైన అవకాశం ఇచ్చాడు... ఇలాగ. నేను



ముందున్న 20 రోజులు చక్కగా చదవడానికి అవకాశం ఇచ్చాడు అనుకుని దీక్షగా చదివాడు. అతి కష్టమైనా అలాగే కాలికి కట్టుతో, పరీక్ష కేంద్రానికి అక్కడి అధికారి ముందు ఏర్పాటు చేసిన ప్రత్యేక సౌకర్యం సాయంతో అతి కష్టమైన పరీక్షలు వ్రాశాడు.

ముందు రెండు పర్యాయాలు తప్పిన పరీక్ష ఇంత అనారోగ్యంతో వ్రాసినప్పుడు ఉత్తీర్ణత సాధించాడు. అప్పుడు చెప్పాడు తల్లి తండ్రులకు, పరీక్షల సమయంలో జరిగిన విషయం

అయితే...ఇలాంటి విషయాలు చాలానే తెలుసును నాకు. మీరు ఎప్పుడైనా మీలాంటి సమస్యలున్న ఫలాని వాళ్ళు ఓడిపోయారు అనొద్దు... వేరే ఎవరు చెప్పనా వినొద్దు. మీకు మీరే ఒకసారి తరచి చూడండి చుట్టూతా...మీకంటే అతి భయంకరమైన అనారోగ్యంతో వున్నా విజయం సాధించిన అతి సామాన్యులు... అసామాన్యులు తప్పక కనిపిస్తారు. వాళ్లనే స్ఫూర్తిగా తీసుకోండి.

అయినా అనారోగ్యమన్నది నిజంగా కాస్తా సున్నితమైన అంశమే, అయితే క్రింద పేర్కొన్న సూచనలు పాటించే ప్రయత్నం చేయండి. తప్పక ఫలితం సానుకూలంగా వుంటుంది. ఇవి అన్ని వివిధ రకాల సమస్యలకు ఉపయోగపడే సూచనలు. అన్ని సూచనలూ ఒకే సమస్యకు కాదు అని గుర్తించండి.

## సూచనలు:

1. *యోగ, వ్యాయామం, నడక, ధ్యానం మొ॥నవి అభ్యాసం చేయండి.*
2. *ఆరోగ్యకరమైన ఆహార విహార నియమాలు పాటించండి.*
3. *వైద్యుడిని సంప్రదించి సరియైన చికిత్స తీసుకోండి.*
4. *అనారోగ్యంతో మనో వ్యధకు గురి కాకుండా వుంటే అదే ఒక పెద్ద విజయ సూత్రం.*
5. *అనారోగ్యంతో అనుభవము ఉంటుంది కాబట్టి, బాగా ఉన్నపుడు రెట్టింపు కష్ట పడండి.*
6. *తరగతులకు గైర్హాజరైనప్పుడు తోటి స్నేహితులు లేదంటే ఉపాధ్యాయులకు సమస్య చెప్పి వారి సాయం తీసుకోండి.*
7. *ఒక వేళ మీ అనారోగ్యం స్థాయి నిజంగా చదువుకు అడ్డంకిగా మారితే అప్పుడు మీ పరిస్థితిని బట్టి మీకు చేతనయిన రంగములో ఇష్టంగా రాణించండి. (ఇంతకూ కథలోని వ్యక్తి ఎవరా అనుకుంటున్నారా??? నేనే పిల్లలూ!)*



## ప్రేరణ మంత్రం:

*What's True Health for a Person? Is it Physical Health or Mental Health...I say its later for a successful life.*

## స్ఫూర్తి:

నేను ఒక కథ చెప్పనా?

కనీసం కదలడానికి సహకరించని శరీరం, చక్రాల కుర్చీకి అతుక్కు పోయిన మనిషి, మాట్లాడటానికి కూడా కంప్యూటర్ సహాయం అవసరం... మోటార్ న్యూరాన్ వ్యాధి శరీరాన్ని కబళిస్తున్నా... చేస్తున్న పనికి శరీరం సహకరించకపోయినా... ఆయనపై ఆయనకున్న నమ్మకం, కలసిరాని విధిని తనకు అనుకూలంగా మార్చుకునే తత్వం, వెరసి ఆయనను నేటి యువతకు ఆదర్శం చేసింది. బాబూ ఇది ఊహాజనితమైన మనిషి అనారోగ్యము కథ కాదు... నిజమైన అనారోగ్యముతో పుట్టి విశ్వవిఖ్యాతి గాంచిన ఒక అద్భుత మానవుడి నిజ జీవిత కథ.



ఇంతకూ ఎవరో తెలుసా ఈ వ్యక్తి?

స్టీఫెన్ విలియం హాకింగ్ సుప్రసిద్ధ ఆంగ్లేయ సైద్ధాంతిక భౌతిక శాస్త్రవేత్త. ఎమియోట్రోఫిక్ లేటరల్ స్క్లెరోసిస్ అనే నాడీమండలానికి సంబంధించిన జబ్బు వల్ల క్రమక్రమంగా దశాబ్దాల తరబడి అతని శరీర భాగాలు చచ్చుబడుతూ వచ్చినా, తన మెదడు పనిచేస్తూండడాన్ని దన్నుగా ఉపయోగించుకుని కృష్ణబిలాలకు సంబంధించిన అనేక అంశాలు మొదలుకొని సైద్ధాంతిక భౌతిక శాస్త్రంలో ఎన్నో పరిశోధనలు చేశాడు. హాకింగ్ రాయల్ సొసైటీ ఆఫ్ ఆర్ట్స్‌లో గౌరవ సభ్యుడిగా, పాంటిఫికల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో జీవితకాల సభ్యునిగా ఉన్నాడు. ఆయన అమెరికా అత్యున్నత పౌర పురస్కారమైన ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్ అందుకున్నాడు. టైమ్స్ పత్రిక వారి 100 మంది అత్యంత గొప్పవారైన బ్రిటీషర్ల జాబితాలో 25వ స్థానం అతనిదే. ఆయన రాసిన "ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్" అన్న పుస్తకం ద బ్రిటీష్ సండే టైమ్స్ బెస్ట్ సెల్లర్ల జాబితాలో 237 వారాల పాటు నిలిచి రికార్డులు బద్దలుకొట్టింది, ఈ పుస్తకపు అమ్మకాలు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులలోనూ స్థానం సంపాదించాయి. శరీరం చాలావరకూ చచ్చుబడి పోయినా ఆయన జీవితాంతం ఒకే ఒక్క దవడ ఎముక కదిలిస్తూ, దానికి అమర్చిన సంభాషణలు – ఉత్పత్తి చేసే పరికరం ఉపయోగించి సంభాషించేవాడు. శరీరం కదల్చడానికి కుదరని స్థితిలోనూ ఆయన చేసిన పరిశోధనా కృషి ప్రపంచ వ్యాప్తంగా ప్రఖ్యాతిని తెచ్చిపెట్టింది.

పిల్లాలూ మీరు ఉదహరించిన ఏ అనారోగ్య సమస్య అయినా పైన పేర్కొన్న వ్యక్తి అనారోగ్యం ముందు తల వంచి ముక్కు నేలకు రాయాల్సిందే కదా?

# 9. భయాందోళనలు



**సమస్య:**

నాకు స్కూల్ కు వెళ్లాలంటే భయం...
ఎవరైనా హేళన చేస్తారని భయం...
చెప్పింది అర్థం కాదన్న భయం...
టీచర్లను చూస్తే భయం...
చదువుకోవాలంటే భయం...
నలుగురిలో కలవాలంటే భయం...
ప్రయోగాలు చేయాలంటే భయం...
పరీక్షలు వ్రాయాలంటే భయం...
జీవితం అంటేనే భయం...

## వివరణ:

ఆ భయం...ఇదిగో భయం...ఈ భయం...అంటున్నారు కదా మొదటి అక్షరాలు ఏంటో చూడండి! ఆ...ఇ... ఈ కదూ, మరి తెలుగు అక్షర మాలలో మొదటి అక్షరం తో "భయం"ను జత చేయండి! ఏమవుతుంది!

'అభయం' కదూ! ఇలాగే దేనిని మన వ్యక్తిత్వంతో జత చేయాలో అది మరచి పోయి లేని పోని భయాలను మనసులో పెట్టుకుని జీవితాన్ని టెర్రర్ మూవీలా చేసుకుంటున్నారు. భయమే మరణము; బలమే జీవనము అని మనము విన్నాము కదా. భయము నిరాశా వాదం అయితే అభయము ఆశయ వాదము అవుతుంది అని గుర్తించండి.

నిజం చెప్పాలంటే భయం వుంటేనే బాధ్యత వస్తుంది అంటారు కదా పెద్దలు. అంటే ఏదైనా పని చేస్తున్నప్పుడు చేయలేమేమో అన్న భయం కలిగినప్పుడు...ఎక్కువ జాగ్రత్తలు తీసుకుని పని విజయవంతం చేయడానికి ప్రయత్నం చేస్తారు ఆశావాదులు. అదే భయంతో చేస్తున్న పనిలో శ్రద్ధ చూపలేక ఒడిపోతారు నిరాశావాదులు. ఇద్దరికీ భయమే వుంది... కానీ వాడుకున్న విధానం వేరుగా వుండటం వలన ఒకడు విజయం సాధిస్తాడు... ఇంకొకడు ఓడి పోతాడు.

మీకు భయమేదైనా, ఎలాంటిదైనా పారి పోవాలంటే కుటుంబంలో ఒక ఆత్మీయుడిని ఒకరి నైనా తోడు తీసుకోండి. అది అమ్మ కావొచ్చు, నాన్న కావొచ్చు, తోబుట్టువు కావొచ్చు, గురువు కావొచ్చు, స్నేహితుడు కావొచ్చు...ఇలా ఎవరైనా కావొచ్చు. వాళ్ళ సాయం తీసుకోండి, మీ భయాలను ఆందోళనల గురించి వివరించండి. చాలా సందర్భాల్లో కేవలం మనసులో వున్న భావాలను ఆత్మీయులతో పంచుకుంటే మనసులోని భయము బరువు తగ్గి తేలికగా అవుతుంది.

ఒక సారి ప్రయత్నం చేస్తే ఏమిటి పోయేది...మన భయం మాత్రమే అని గుర్తుంచుకోండి. నా దృష్టిలో భయం నిజమైన అడ్డంకి కాదు...ప్రయత్నం చేయక పోవడమే నిజమైన అడ్డంకి.

మోహన్ అని ఒక పిల్లాడు వుండే వాడు. మధ్య తరగతి కుటుంబము మరియు చిన్న కుటుంబం. చాలా సిగ్గరి. ఎవరితోనూ కలిసే వాడు కాదు. అమ్మని చాలా ప్రాణంగా ప్రేమించే వాడు. స్కూల్ వదిలిన తక్షణం సరాసరి ఇంటికి వచ్చి అమ్మ ఒడిలో వాలి పోయే వాడు. అమ్మ చెప్పే కబుర్లు వింటూ సేద తీరే వాడు. అంతా బానే వుంది కానీ చీకటి అంటే మహా భయంగా వుండేది అబ్బాయికి. అమ్మ తోడు రాక పోతే అడుగు కూడా వేసే వాడు కాదు.

అమ్మకు ఉన్న పనుల్లో... కొడుకు భయం పోగొట్టడం ఎలాగో తెలిసేది కాదు. వాళ్ళింట్లో పని చేస్తున్న రంభ అనే ఆవిడకు అబ్బాయిని అప్పచెప్పేది. ఆవిడ ఆ చిన్నారి బాలుడి వెన్నంటే వుంటూ అతని బాగోగులు చూసుకునేది. ఆ పిల్లాడిలో ఉన్న భయాన్ని ఎలాగైనా పోగొట్టాలని రామాయణములోని శ్రీరాముడి వీరత్వాన్ని గురించి చెప్తూ...ఎప్పుడు భయం వేసినా రాముడిని తలచుకొమ్మని చెప్పేది. అమాయకంగా ఆ పిల్లాడు రామమంత్రాన్ని భయాన్ని జయించడము కోసమై జపించే వాడు. ఆ రామ మంత్రాన్ని ఇక జీవితంలో విడువనే లేదు. చాలా సమస్యలతో అనునిత్యం పోరాడుతున్నా... రాముడి స్మరణ మానలేదు. మొత్తం దేశ ప్రజలు ఆయన ఏమి చెప్పినా అదే వేదంగా పాటించే వారు. భయమే లేకుండా శ్రీ రామ మంత్రమును తన జీవితములో ముడి వేసి చివరి దాకా బ్రతికాడు. చివరకు ఆయనను ఒక దుండగుడు హత్య చేశాడు...అప్పుడు కూడా రామ మంత్రం జపిస్తూ ప్రాణం విడిచాడు.

చీకటి అంటే భయపడే ఆ చిన్నారి బాలుడు...వందల

సంవత్సరాలు దేశాన్ని బానిసత్వంలోకి నెట్టిన తెల్ల దొరలను భయంతో పారిపోయే విధంగా చేసినాడు. ఎవరు ఈ బాలుడు అర్థం అయిందా పిల్లలూ??? మోహన్ దాస్ కరంచంద్ గాంధీ...అదే నండి మన పూజ్య బాపూజీ... మహాత్మా గాంధీ.

మంత్రాలకు చింత కాయలు రాలుతాయని నా ఉద్దేశ్యం కాదు...కానీ నమ్మకంతో చేసిన ఏపని అయినా తప్పక మన మనసులోని భయాలను ఆందోళనలను దూరం చేస్తుంది.

అమ్మ ప్రసవించడానికి భయపడితే మనం పుట్టే వాళ్ళమా?

నాన్న పోషించడానికి భయపడితే మనము ఇలా బ్రతికే వాళ్ళమా?

చిన్ననాడు నడుస్తే పడిపోతామని భయపడి వుంటే మనము అసలు నడిచేవాళ్ళమా?

కలాం సార్...డబ్బులేదని భయపడి వుంటే... స్ఫూర్తి ప్రదాతగా అయ్యే వాడా?

గాంధీ భయంతో అలాగే పెరిగి వుంటే దేశానికి స్వాతంత్ర్యం వచ్చేదా?

ఎడిసన్ ప్రయోగాలు విఫలం అయ్యాయి అని భయపడి వుంటే వందలాది ఆవిష్కరణలు వచ్చేవా?

పిల్లలూ... భయంతో చేసే పని విఫలం అవొచ్చు కానీ దాని ద్వారా నేర్చిన పాఠం మాత్రం విలువ కట్ట లేని అనుభవం ఇస్తుంది. భయంతో బిక్కు బిక్కు మంటూ క్షణానికి ఒక్క సారి చావడం కంటే ధైర్యంగా బయటకు వెళ్లి భయాన్ని కలిగించే అంశాన్ని ఎదుర్కోవడంలోనే జీవితము అవిష్కృతమవుతుంది. భయాన్ని అధిగమిస్తే విజయం...లేదంటే అనుభవం మనది అవుతుంది. అందుకే ధైర్యే సాహసే లక్ష్మీః అన్నారు కదా. అంటే ధైర్యం ఉన్నవాడికే విజయము మరియు పాఠమూ.

## సూచనలు:

*1. భయము అసలు ఎందుకు వస్తుందో పరిశీలించండి... దాని వల్ల నష్టం ఏమిటో గమనించి ప్రాణం పోదు అని తెలిస్తే ఇక ముందుకు వెళ్ళండి.*

*2. భయమున్నా, అశావాద దృక్పథం ఉంటే మనము తప్పక మెలుకవతో పనులు సాధించగలము.*

*3. FEAR : False Evidence Appearing Real. అని గుర్తిస్తే మనమీద మనకే జాలి కలిగి మన దృక్పథం మారుతుంది.*

*4. FEAR: Fear Everything And Run-away or Face Everything And Raise.*

*5. ఒక మంచి ఆత్మీయుడిని ఎంచుకుని మీ భయాలు ఆందోళనలు పంచుకుని చర్చించండి.*

## ప్రేరణ మంత్రం:

*Nothing in life is to be feared. It is only to be understood.*

## స్ఫూర్తి:

స్వామి వివేకానంద...యువ సన్యాసిగా వున్న సమయంలో గంగానదీ తీరంలో వున్న ఒక సన్నటి దారి గుండా వెళ్తున్నాడు. ఒక ప్రక్క గంగానది ప్రవాహం... మరో ప్రక్క దాటడానికి వీలులేని రాళ్ళ దిబ్బలున్నాయి. నిర్మానుష్యంగా వున్న ఆ ప్రదేశంలో ఉన్నట్టుండి ఒక ముచ్చు కోతి అతనికి ఎదురు పడింది. వివేకానందను చూసిన వెంటనే గట్టిగా అరుస్తూ...మీద పడి రక్కడానికి సిద్ధం అయింది. వివేకానందకు భయంతో ఒళ్ళంతా జలదరించి పోయింది. ఆ నిర్మానుష్యంగా వున్న ప్రదేశంలో ముందుకు, పక్కలకు వెళ్లే దారి లేక వెను



తిరిగి వడివడిగా నడవడము మొదలెట్టాడు. ఆ కోతి కూడా ఆయనను వెంటాడటం మొదలు పెట్టింది. భయంతో బెంబేలెత్తి, స్వామి వారు పరుగెత్తడం మొదలు పెట్టారు. ఆ కోతి నుండి తప్పించుకోవడానికి వేరే మార్గం కనబడటం లేదు. భయంతో అన్ని మరచి తాను మనిషన్నది కూడా మరచి ఆ అల్పప్రాణికి వెరచి పారి పోతున్నాడు... అప్పుడు ఒక సాధువు గట్టిగా అరిచాడు...

ఏయ్! ఆగు... ఆ నీచ ముష్కరాన్ని ఎదుర్కో... వెళ్ళు బలమే జీవనం... బలహీనతే మరణం. వెళ్ళు ఆలస్యం వద్దు... అంటూ కఠిన స్వరంతో ఆదేశించాడు.

వివేకానంద ఆ మాటలతో ఉలిక్కిపడి తాను ఎంత నిర్బలంగా భీతిల్లి పారి పోతున్నాడో అర్థం చేసుకుని... ఒక్క సారి రౌద్రాకారం దాల్చి వెను తిరిగి ఆ ముష్కరాన్ని తీవ్రంగా చూస్తూ సింహనాదం చేసాడు. అంతే... ఇప్పుడు కోతి తోక ముడిచి వెను తిరిగి పారిపోయింది.

నిత్య జీవితములో మన భయాలు అందోళనలు అన్ని ఇలాంటివే... మనం భయపడితే అవి మన నెత్తిన ఎక్కి డాన్స్ చేస్తాయి...ధైర్యంతో ఎదుర్కొంటే తోకముడుస్తాయి.

ఆ భయమా... అభయమా నిర్ణయం మనదే సుమా!

# 10. ఒత్తిడి



## సమస్య:

*బాగా చదవాలని వుంది కానీ విపరీతమైన ఒత్తిడికి లోనవుతున్నాను. చదవాల్సింది పెద్ద కొండ లాగా వుంది ముందు...పరీక్షల సమయం దగ్గర పడుతోంది, ఎలా చదవాలో అర్థం కావడం లేదు. ఇంట్లో ఎవరైనా ఏమైనా అన్నా...స్కూల్‌లో స్నేహితులు గేలిచేసినా వెంటనే కోపం బాధ వస్తున్నాయి. గట్టిగా అరిచేస్తున్నాను. పరీక్షలు దగ్గరయ్యే కొద్దీ నేను పిచ్చివాడిలా అవుతున్నాను, అని చుట్టూ వున్నవారు అంటున్నారు. అరేయ్ వాడితో జాగ్రత్తరా బాబూ అంటున్న మిత్రులను చూస్తున్నాను. School లో ప్రతి రోజూ టీచర్లు చెప్పే విషయాలు... పెట్టే భయాలు చూసి పిచ్చి పడుతుందేమో అనిపిస్తుంటుంది. ఇదేంటి జైలుజీవితం పారిపోదామా ఎట్లైనా... చచ్చిపోదామా అనిపిస్తుంటుంది. నేను ఈ ఒత్తిడినుండి ఎలా బయటపడాలి?*

## వివరణ:

ఎప్పుడైనా...కోడి గుడ్డులో నుండి బయటకు వచ్చే కోడి పిల్లను చూసారా? ఎలా వస్తుంది అది గుడ్డును చాలా కష్టముగా చీల్చుకుని ఎంతో ఓపికగా బయటకు వస్తుంది. అసలు అంత కష్టం ఎందుకు పడాలి అది? అంత ఒత్తిడికి ఎందుకు గురి అవ్వాలి? హ్యాపీగా తల్లి కోడి తన ముక్కుతో పొడిచి పిల్లని బయటకు తీయొచ్చు కదా? ఎందుకలా జరగదు?

పిల్లలూ... గుడ్డు లోపల నుండి ఒత్తిడి వుంటే లోపల వున్న పిల్లకు పుష్టి చేకూరి...రెక్కలు చక్కగా పని చేసే విధంగా...దృఢంగా తయారవుతాయి. అదే బయట

నుండి గుడ్డును పగల కొడితే ఏమవుతుంది? ఆమ్లెట్ అయి కూర్చుంటుంది. మీరు అందరూ గుర్తు పెట్టుకోవాలి. ఇంట్లో ఒత్తిడి...వంట్లో ఒత్తిడి వుంటే నే కదా మనం కూడా దృఢంగా తయారయ్యేది. అసలు మనలోపల బయటా అంతా మహదానందకరమైన వాతావరణం వుంటే ఇక ఏదైనా సాధించాలన్న కసి ఎక్కడి నుండి వస్తుంది చెప్పండి. అతి చిన్న ప్రాణి అయిన కోడి పిల్ల కూడా తాను విజయ వంతంగా జీవంతో బయట పడాలన్న తపనతో ఒత్తిడికి వెరవ కుండా గుడ్డును చీల్చుకుని వస్తుంది. మనము మనుషులము కదా...ఇంకెంత అద్భుతంగా ఎదగడానికి అవకాశం వుంది? చెప్పండి

ఈ చరాచర సృష్టిలో మొత్తము ప్రాణుల జీవితాలన్నీ కూడా ఒత్తిడి మీదనే ఆధార పడినాయి అని ఎప్పుడైనా గమనించారా? లేదు కదా? అయితే క్రింద పేర్కొన్న విషయాలు ఒక సారి గమనించండి:

భూమి లోతుల్లో ఎక్కడో నాటిన విత్తనం ఏ శక్తితో తన కంటే కొన్ని కోట్ల శక్తి వున్న భూమి పొరలను సైతము చీల్చుకుని మొక్క రూపంలో బయటకు వస్తోంది?

మొక్కల కొనలలో చిన్న విత్తుగా మొదలయి చూస్తున్నంతలో అతి అద్భుతమైన పుష్పము మొగ్గ నుండి ఏ శక్తి చేత వికసిస్తుంది?

సీతాకోకచిలుక... అత్యంత సుందరమైన ప్రాణిగా పుప్పొడిలో నుండి దాని పొరలను చీల్చుకుని ఏ శక్తితో బయటకు వస్తుంది?

9 మాసాలు అమ్మ కడుపులో ఆణిగి మణిగి ఉన్న ప్రాణి సమయం వచ్చినప్పుడు ఏ శక్తితో బయటకు వస్తుంది?

ఇలా కదలిక లేని స్థానం నుండి సృష్టిలోని సమస్త ప్రాణులు కదలికతో అత్యంత శక్తి వంతమైన ఒత్తిడిని ఆధారంగా చేసుకునే చలనము లోకి వస్తాయి.

పిల్లలూ...ఒత్తిడి లేకుంటే ఉన్న స్థాయి నుండి ఉన్నత స్థాయికి ఎలా ఎదుగుతారు... ఒత్తిడి అన్నది మన మంచి కోసమే అని గమనిస్తే అది అద్భుత మయిన ప్రేరకముగా ఉపయోగపడి మన జీవితానికి ఎంతో మేలు చేస్తుంది.

నేను ఆ మధ్య కాలంలో కైలాస మానస సరోవర యాత్ర చేశాను. చాలా దుర్భేద్యమయిన ప్రయాణం. భారత దేశము దాటి...నేపాల్ దేశము దాటి...టిబెట్ ప్రాంతం మీదుగా చైనా దేశంలో చేయాల్సిన అతి దుర్లభం అయిన యాత్ర చేస్తూ...54kms దూరం మంచు కొండల్లో నెలకొని ఉన్న కైలాస పర్వతాన్ని పరిక్రమ చేస్తే యాత్ర సమాప్తం అయినట్లు.

హిందూ ధర్మంలో... అత్యంత క్లిష్టమైన దుర్లభమైన యాత్రగా పేరుగాంచిన ఈ యాత్రను చేయాలంటే అన్ని రకాల ఒత్తిడిలకు మనము సిద్ధంగా ఉంటేనే ప్రపంచంలో అతి కొద్ది మందికి మాత్రమే సాధ్యమయ్యే యాత్రను చేయగలం. అలాంటిది నేను 2 పర్యాయాలు చేసాను. నాతో పాటుగా సుమారు 50 మంది వచ్చినా కేవలం పదిమందో లేక పాతిక మందో మాత్రమే యాత్ర పూర్తి చేయగలిగారు.

మిగితావాళ్ళందరూ... దారి పొడుగునా ఒత్తిడిని కొని తెచ్చుకుని నిజంగా మంచు కొండల్లోకి వెళ్లాలనుకున్నప్పుడు అయ్యో మావల్ల కాదని నిలచి పోతారు.

చుట్టూవున్న ఎవరి మాటలో... వ్రాతలో... చేతలో... మనకు ఒత్తిడిని కలిగిస్తున్నాయి అని మనం భయంతో ముడుచుకుని...విసుగును ప్రదర్శిస్తూ... అరుస్తూ.. వ్యతిరేక ప్రవర్తన చూపిస్తే అవి మన ఆశక్తతను నిరూపించి మనలను ప్రక్క దారి పట్టిస్తాయి తప్ప మనలను విజయ పథంము వైపు మళ్లించవు అని గుర్తు పెట్టుకోండి. మీరు ఎప్పుడైనా క్రీడలలో, తమ కంటే 3 రెట్లు పొడవుగా వున్న ఒక పెద్ద వెదురు కర్రను ఆధారంగా చేసుకుని అత్యంత నైపుణ్యంతో అతిఎత్తైన లక్ష్యాన్ని గెంతటం చూసే వుంటారు కదా... కర్ర మీద

తాను వేసే ఒత్తిడినే ఆధారంగా అతి అద్భుతమైన లక్ష్యాన్ని ఛేదిస్తాడు క్రీడాకారుడు. అలాగే మన మీద ఇతరులు పెట్టే ఒత్తిడిని ఆధారం చేసుకుని మనం కూడా ఉన్నత లక్ష్యాన్ని సాధించవచ్చు.

## సూచనలు:

*1. ఒత్తిడి మనలను పుత్తడిలా మార్చే సాధనము అని గ్రహించండి.*

*2. ఎదురుగా ఉన్నది మేరు పర్వతమైనా... మనకు ముందే దాని మూలము శిఖరం గురించిన అవగాహన కలిగేది ఒత్తిడి ద్వారానే.*

*3. ఒక సారి ఎదురుగా ఉన్నది సమున్నత లక్ష్యం అని మనము గ్రహిస్తే వెంటనే కార్యోన్ముఖులు అవడానికి అవకాశం ఉంటుంది.*

*4. ఒత్తిడి మనలను కట్టి పడేసే ముళ్ల కంచె కాదు... సంధించి వదిలే విల్లునారిలా అనుకోండి.*

*5. మన ఎదుట వున్న లక్ష్యాన్ని అన్ని దిక్కులలో నుండి పరికించి...ఎలా సిద్ధం అవ్వాలో తెలుసుకోండి.*

*6. పాఠశాలకు వెళ్లడం అయినా, పరీక్షకు సన్నద్ధం అవడం అయినా, పరీక్షలు వ్రాయడం అయినా...ఇలా ఏదైనా సరే ఒత్తిడి వలన మంచే జరుగుతుంది అని నమ్మండి.*

*7. ఎవరైనా మనలని ఒత్తిడి లోకి నెట్టే ప్రయత్నం చేస్తే రెట్టింపు శక్తిని ఉపయోగించాలి అని తెలుసుకోండి.*

*8. పెద్ద లక్షాలను... చిన్న చిన్న మైలురాళ్లుగా విడగొట్టండి. అప్పుడు ప్రతి మైలు రాయిని దాటుతున్నప్పుడు మీకు మంచి ప్రోత్సాహం లభిస్తుంది.*

*9. జీవితంలో ఒక్క చదువు పరీక్షలకే కాదు... ప్రతి స్థాయిలో కూడా మనం ఈ సూచనలు పాటించవచ్చు.*

## ప్రేరణ మంత్రము:

*A diamond is a chunk of coal that did well under pressure.*

## స్ఫూర్తి:

త్రిపుర రాజధాని అయిన అగర్తల దగ్గరున్న ఒక గ్రామములో నివసించే గౌరీ దులాల్ మధ్య తరగతి కుటుంబం. దులాల్ మంచి దేహ దారుఢ్యముతో వెయిట్ లిఫ్టర్‌గా వుండేవాడు. వాళ్ళ పాపను జిమ్నాస్టిక్స్‌లో రాణింప చేయాలని చిన్ననాడే అనుకున్నాడు. పాపకు 5 సంవత్సరాల వయసులోనే తను ఏ విధమైన కెరీర్ ఎంచుకోవాలో నూరిపోసేవాడు. కానీ ఆ చిన్నారికి సుతారం ఇష్టంగా వుండేది కాదు... చాలా ఒత్తిడికి గురయ్యేది. కానీ తండ్రి మాటలోని సమున్నత లక్ష్యం ముందు తల వంచింది. 6 ఏళ్ల వయసులో శిక్షకుడు బిషేశ్వర్ నంది పర్యవేక్షణలో తన జిమ్నాస్టిక్స్ అభ్యాసం ప్రారంభించింది.

అతి కఠోరమైన సాధన చేసేది. తన వయసు పిల్లలందరూ ఆడుతూ పాడుతూ వుండే సమయంలో తాను మాత్రం ఉదయం సాయింత్రం కలిపి సుమారు 6 గంటలు అభ్యాసం చేసేది. తన ముందు ఉన్న లక్ష్యం అసమాన్య మైనదని గుర్తించింది. తన తోటి వాళ్ళు ఆ అమ్మాయిని చూసి నవ్వినా...బయట వాళ్ళు అమ్మాయిని ఆట పట్టించినా ఎంతో ఒత్తిడికి గురయ్యేది. కానీ కసితో తాను అద్భుతాలు సాధించాలన్న ఏకైక లక్ష్యంతో పని చేసేది.

కష్టనష్టాలకు ఓర్చుకుని, జిమ్నాస్టిక్స్ పోటీలకోసం ఎన్నిక ప్రక్రియకు వెళితే...అమ్మాయి పాదాలు జిమ్నాస్టిక్స్ క్రీడకు ఉపయోగ పడవని...పాదాలు నాజూకుగా వుంటేనే నైపుణ్యం సాధ్యమని చెప్పి వెనక్కి పంపేసారు. చాలా ఒత్తిడికి గుర్రై ఏడ్చేసింది. తన కలలకు కళ్లెం వేసినట్లుగా అనిపించింది. కానీ ఆ ఒత్తిడిని సాకుగా తీసుకుని అతి



కఠోరమైన శ్రమతో అనతి కాలంలోనే ప్రత్యేక వ్యాయామం ద్వారా అతి నాజూకైనా పాదాలు తీర్చుకోగలిగింది. 2007 నుండి 2015 సంవత్సరం మధ్యలో ఆ చిన్నారి సుమారు 80 బంగారు మరియు వెండి పతకాలు గెలుచుకుంది.

తదనంతరం ప్రోదునోవా వాల్ట్ అనే అతి ప్రమాదకరమైన జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ తీసుకుంది. ఇంటా బయటా ఉన్న ఒత్తిళ్లను తట్టుకుంటూ అవిశ్రాంతంగా అభ్యాసం చేసింది. దేశ స్థాయిలో ప్రతిభ కల క్రీడాకారిణిగా పేరు తెచ్చుకుంది. భారత ప్రభుత్వం వాళ్ళు ఇచ్చే 'అర్జున అవార్డు' తన సొంతం అయింది.

ఇక చివరికి 2016 సంవత్సరంలో రియో ఒలింపిక్స్‌లో జరిగిన మహిళా జిమ్నాస్టిక్స్‌లో నాలుగో స్థానంలో నిలచి ప్రపంచానికి భారతీయ మహిళాశక్తిని చాటి చెప్పింది. గత 5 దశాబ్దాల కాలంలో ఒక భారతీయ మహిళ ఇలాంటి ప్రతిభ చూపించడం చరిత్ర సృష్టించడమే కదా... పిల్లలూ, ఈపాటికి ఈ అమ్మాయి ఎవరన్నది మీకు తెలిసే వుంటుంది కదా. ఆవిడే... దీపా కర్మకర్! అవును భారత ప్రభుత్వము ఈ మధ్యనే తనను పద్మశ్రీ అవార్డుతో సత్కరించి గౌరవించింది.

ఇప్పుడు చెప్పండి... ఒత్తిడితో మనము పారిపోదామా లేక ముందుకురుకుదామా?

# 11. చేతివ్రాత సరిగ్గా లేదు



## సమస్య:

*చేతి వ్రాత సరిగ్గా లేదు, ఏమి చేయాలో అర్థం కావడం లేదు. సాధారణంగానే సరిగ్గా లేదంటే... ఇక పరీక్షలో మరీ చాలా ఘోరంగా వుంటోంది. అసలు నేను వ్రాసింది నాకే అర్థం కావటం లేదు. ఎన్ని రకాలుగా ప్రయత్నం చేసినా అందమైన చేతి వ్రాత కుదరటం లేదు. దాని వలన నేను పరీక్ష బాగా వ్రాసినప్పటికి...వ్రాత సరిగ్గా లేక పోవడంతో మార్కులు తగ్గుతున్నాయి...ఏమి చేయాలి?*

## వివరణ:

భావ వ్యక్తికరణలో అతి ప్రధానమైన అంశము వ్రాత. వ్రాత సరిగ్గా లేక పోతే మనకు కెరీర్‌కు వాత పడినట్లే అంటుంటారు పెద్దలు తమాషాగా. ఇక మన చేతి వ్రాతనే మన తల రాతను కూడా మార్చేస్తుంది అని చెప్పొచ్చు. పిల్లాలూ మీరెప్పుడైనా, వైద్యుడి దగ్గరకు వెళ్ళారా? వెళ్ళినప్పుడు డాక్టర్ వ్రాసిన మందు చీటి చూసి వుంటారు కదా... మీకు అర్థం అవుతుందా అందులో ఏమి వ్రాసారో? లేదు కదా? కారణం, వాళ్ళ చేతివ్రాత అలా వుంటుంది. మనకు అర్థం కాదు. మందుల షాప్ వాడి మేధస్సు మీద ఆధారపడి, మనము మందులు తీసుకుని వేసుకుంటాము. అదృష్ట వశాత్తు వాడికి ఆయా డాక్టర్లతో పని చేసిన అనుభవము వుండటం వలన మనము రక్షించ బడుతుంటాము.

మీకు తెలుసా? ఈ మధ్య కాలంలో కేంద్ర ప్రభుత్వము వైద్యులందరికి ఒక ఆదేశం ఇచ్చింది. అదేంటి అంటే, వాళ్ళు వ్రాసే మందు చీటీలు పెద్ద అక్షరాలతో స్పష్టంగా

వ్రాయమని. అంటే ఇంతకు మునుపు ఎంత ఇబ్బంది కలిగిందో అర్థం అయింది కదా.

మనము ఏమనుకుంటున్నామో చెప్పటానికి రెండే మార్గాలు వున్నాయి. ఒకటి మాట్లాడటము రెండోది వ్రాయడం. ప్రపంచానికి మనము మాటల ద్వారా ఏదైనా చెప్తే దాని ప్రభావం కొంతసేపు ఉంటుంది. అదే, వ్రాత ద్వారా చెప్తే శాశ్వతంగా వుండే అవకాశం వుంది. ఇంకో విషయం గమనించారా పిల్లలూ...10 సార్లు చదవడం కంటే ఒక్క సారి వ్రాయండి అప్పుడు మరచి పోవడానికి అవకాశం లేదు. అని చెప్తాము కదా!

పూర్వం కూడా...ఇలాగే శాశ్వతంగా వుండాలని కదా, తాటాకు పత్రాల మీద వ్రాసే వాళ్ళు. అంటే వ్రాతకు అంత విలువ వుంది. మరి అలాంటి వ్రాతలు నిజంగా అందంగా వుంటే భావనను ఇంకెంత ప్రభావితం చేయ గలవో ఆలోచించండి.

నాకు గుర్తు, నేను డిగ్రీ చదువుతున్న రోజుల సంగతి చెపుతున్నాను. చిన్నప్పటి నుండి నా చేతి వ్రాత బాగా ఉండేది కాదు...ఎన్నో రకాలుగా ప్రయత్నం చేసి ఓడి పోయాను. మొదలు పెట్టినప్పుడు ఒక 5 లేక 6 వరుసలు బాగానే వ్రాసే వాడిని పోను పోను చాలా అధ్వాన్నంగా మారి పోయేది. నేను వ్రాసింది నాకే అర్థం అయ్యేది కాదు. ఏదో అదృష్టవశాత్తు డిగ్రీకి చేరుకున్నాను. ఆ రోజుల్లో నేను శ్రీ సత్య సాయి బాబా వారి సంస్థలో చురుకుగా పాల్గొనే వాడిని. గుంతకల్లు లో అమ్మ నాన్న వుండే వారు. నేను అనంతపురం లో డిగ్రీ చేస్తూ సెలవలు వున్నప్పుడు గుంతకల్లుకు వెళ్లే వాడిని. ఆ సమయంలో కీ.శే. శ్రీ V నాగభూషణరావు గారికి...జిల్లా బాలవికాస్ కార్యక్రమాలు చూసుకునే బాధ్యత వుండేది. వారితో చేరి నేను బాబా గారి జీవిత చరిత్రను చిత్ర ప్రదర్శనగా చేసి అందరికీ స్వామి వారి జీవితమును సందేశమును వ్యాప్తి చేయొచ్చు అని చెప్పాను. వారు ఎంతో సంతోషించి...నన్ను ప్రోత్సహించారు. ఇక నెల పాటూ నిద్రాహారాలు మాని...రాత్రి పగలు తేడా లేకుండా... చాలా శ్రద్ధా భక్తులతో...ఒక అద్భుతమైన దీక్షతో చిత్ర ప్రదర్శన తయారు చేసాము. ఆ ప్రదర్శన ద్వారా ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రములలోని ఎన్నో కేంద్రాలలో బాబా వారి సందేశాన్ని వేల మందికి అందించాము. మీరందరూ ఆశ్చర్యపోతున్నారు కదూ... ఈ కథకు పైన సమస్యకు ఏ విధంగా సంబంధం వున్నదని? ఇప్పుడు చదవండి.

నేను సుమారుగా 100 ఛార్టులు వ్రాసాను. మొదట వ్రాసినప్పుడు... గురువు గారు చాలా బాధ పడ్డారు నా హస్త వాసి చూసి. తరవాత ఛార్టుల్లో పెన్సిల్ గీతలు గీసుకుని వాటి మధ్యలో వ్రాయమని చెప్పారు. నాకు సిగ్గుగా అనిపించినా... దాని అంతు చూడాలని పట్టు పట్టి వ్రాయడం మొదలు పెట్టాను. ఒక 10 ఛార్టులు వ్రాసిన తరవాత గీతలు అవసరమే పడలేదు...ఇంకో 10 చార్టులు వ్రాసిన తరవాత, మొదట వ్రాసిన చార్టులను చూస్తే...అబ్బే ఇంత చెత్తగా ఉన్నాయేంటి అనుకుని వాటిని కూడా మళ్లీ వ్రాశాను. అలా ఎంతో ఇష్టంగా వ్రాయడం వలన మనసు, మాట, చేత, వ్రాత మమేకము అయిపోయి...మొత్తము అన్ని చార్టులు వ్రాసిన తరవాత చూస్తే

1. అత్యంత సుందరమైన చేతి వ్రాత నాది అయింది.
2. బాబా వారి సాహిత్యం చదివి...వ్యాసాలుగా వున్న విశేషాలను క్లుప్తంగా వ్రాయడం వచ్చింది.
3. శ్రద్ధతో చదివి, వ్రాయడం వలన బాబా గారి సాహిత్యము కనీసం ఒక వంద పుస్తకాలు చదివే అవకాశం దొరికింది.
4. తద్వారా...ఏ సమయంలోనైనా, బాబా గురించి నేను ఏకబిగిన ఎటువంటి అభ్యాసము లేకుండా ఒక గంట మాట్లాడే చాతుర్యం కలిగింది.
5. ఇక ఆ అలవాటు... నన్ను ఒక అనర్గళమైన ఉపన్యాసాకుడిగా మార్చి వేసింది.

అంటే శ్రద్ధగా వ్రాయడం వలన మనకు ఎన్ని ఉపయోగాలో చూడండి. వ్రాత బాగుంటే చాలా అద్భుత మైన కళ ఒకటి మన చేతిలో ఉన్నట్లే సుమా.

తరవాత కాలంలో హాస్టల్‌లో చదువుకుంటున్న ఇంకో 10 మంది స్నేహితులకు రికార్డులు కూడా నేనే వ్రాసేంత అందంగా నా చేతి వ్రాత కుదిరింది. నా ఖర్చులకు డబ్బులు ఇచ్చి మరీ వ్రాయించుకునే వాళ్ళు.

ఆ తరవాత...నేను ఎక్కడ వున్నా... ఎలాంటి పరిస్థితిలో ఉన్నా ఈ వ్రాయడం అన్నది మాత్రం మాననే లేదు. ప్రతి పండగకు, కొత్త సంవత్సరం వచ్చినప్పుడు, స్నేహితులకు ఉత్తరాలు వ్రాస్తూ, కవితలు వ్రాస్తూ, ఇలా ప్రతి సందర్భంలో చేతి వ్రాత ద్వారా అందరికి అందుబాటులోనే కాదు, ఆ మంచి వ్రాతతోటి ఎంతో మందిని నేను చేరుకోగలిగాను.

చివరకు... హైదరాబాద్‌కు వచ్చిన తరవాత, బాబా గారికి, చాలామంది ప్రముఖులకు, మహాత్ములకు, ముఖ్యమంత్రులకు గాని ప్రత్యేకంగా నాతోనే ఉత్తరాలు వ్రాయించుకుని వెళ్లే వాళ్ళు. నిజానికి నాకున్న చక్కటి చేతి వ్రాత నా నుదుటి వ్రాతను కూడా మార్చివేసింది అని చెప్పక తప్పదు.

## సూచనలు:

*1. తదేక దీక్షతో ప్రయత్నం చేయండి.*

*2. వ్రాయడం అన్నది ప్రతి రోజు చేసే ప్రక్రియ కావాలి.*

*3. ప్రధానంగా తెలుగు, హిందీ, ఇంగ్లీష్ ఇలా అన్ని భాషలలో వ్రాయడం నేర్చండి.*

*4. వ్రాస్తున్నప్పుడు అది చదవ బోతున్న ఎవరైనా సరే ప్రశంసించాలి అన్న ఎరుకతో హృదయం పెట్టి వ్రాయండి.*

*5. సాధ్యం అయితే మీకు ఎలాంటి పెన్నులు బాగా అలవాటో ఆ పెన్నులు మాత్రమే వాడండి.*

*6. ప్రయత్నం చేసి పదాలను కలప కుండా వ్రాయండి.*

*7. మీకు నిజాయతీగా చేతి వ్రాత బాగుండాలన్న లక్ష్యం వుంటే కాపీ బుక్కులలో వ్రాయడం అభ్యాసం చేయండి.*

*8. దైనందిక జీవితంలో భావ వ్యక్తీకరణకు ఎక్కువగా వ్రాయడానికి ప్రాధాన్యత ఇవ్వండి.*

*9. పరీక్షలలో మంచి మార్కులు తెచ్చు కోవాలన్నా లేక జీవితంలో మంచి మార్కులు తెచ్చు కోవాలన్నా చేతి వ్రాత బాగుండాలి.*

*10. పెన్నుని సున్నితంగా పట్టుకొని వ్రాయాలి. గట్టిగా పట్టుకొని వ్రాయడం వల్ల చేయి నెప్పి కలిగి, అలసిపోయి, వ్రాత సరిగా రాదు పైగా ఎక్కువ సేపు వ్రాయలేము.*

*11. Four line note book లో సున్నాలు గుండ్రంగా వ్రాసే ప్రయత్నం చేయండి.*

*12. Youtube లో మంచి చేతి వ్రాత మెళు కువలకు సంభందించిన videos చూడండి.*

## ప్రేరణ మంత్రము:

*I saw that bad hand writing should be regarded as a sign of an imperfect education - Mahathma Gandhi*

## స్ఫూర్తి:

తన జీవిత కాలంలో నేర్చుకోలేక పోయిన ఒకే ఒక విషయం... మంచి చేతి వ్రాత అని చెప్పారు ఒకరు. అతి చిన్న వయసులో ఎవరు చేతి వ్రాత యొక్క ప్రాధాన్యత చెప్పక పోవడం వల్ల అవుతే నేమి లేక దాన్ని బాగు చేసుకోవాలన్న ఆసక్తి లేక పోవడం వలన అయితే నేమి... అతను చిన్నప్పుడే తన చేతి వ్రాతను చక్కదిద్దుకోలేక పోయాడు.

పెద్దయిన తరవాత తను ఏదైనా వ్రాయాలి అనుకుని పెన్ను చేత పట్టిన మరుక్షణం చాలా తల్లడిల్లి పోయే వాడు. అయ్యో నేను చిన్నప్పుడే నా వ్రాత సరి చేసుకోలేక పోయాను కదా అని. అతని చేతివ్రాత అంత ఘోరంగా వుండేది. అతను వ్రాసింది చూసి ప్రక్కవాడు ఏమనుకున్నాడో వదిలెయ్యండి... అతడే చాలా బాధపడేవాడు. చివరకు, తన ఆత్మకథలో వ్రాసుకున్నాడు ఇలా: నేను జీవితములో సాధించలేక పోయింది ఏమైనా వున్నాయి అంటే వాటిలో చక్కటి చేతి వ్రాత ఒకటి. నా దేశంలో పిల్లలకు నేను ఒక విషయం చెప్పాలి అనుకుంటున్నాను... అది చేతి వ్రాత గురించే. పిల్లలూ... మీరు నాలాగా కాకుండా చిన్నప్పటి నుండే శ్రద్ధా భక్తులతో గుండ్రటి అక్షరాలు వ్రాయడము నేర్చుకోండి. దానికి మీరు కాపీ బుక్ వ్రాయడం లాంటివి చేయండి. మీ చేతివ్రాత బాగుంటే... మీ తలవ్రాత బాగున్నట్లే... అది దేశ భాగ్య రేఖను కూడా మారుస్తుంది.

ఇంతకూ చేతి వ్రాత గురించి ఇంత దిగులుతో భారతీయులకు చెప్పిన మహాత్ముడు ఎవరో తెలుసా మీకు??? మహాత్ముడే! అదే నండి మన జాతిపిత మహాత్మా గాంధీ గారు. చేతి వ్రాత బాగుండాలి అంటే ఎంత శ్రద్ధగా ప్రయత్నం చేయాలో తెలిసింది కదా.





# 12. చెడు స్నేహం




## సమస్య:

*నాకు స్నేహితులెక్కువ. వారితోనే సమయం గడిచిపోతుంది. నా స్నేహితుడెవడైనా సరే కష్టాలలో వుంటే అలా వారి దగ్గర వాలిపోతాను అంతే. వారి తోనే సినిమా అయినా షికారైనా. చదువు ప్రాముఖ్యత తెలిసినా స్నేహం ముందు అదంతా నాకు దిగదుడుపే. మిత్రులతో చేరి ముచ్చట్లు పెట్టుకుంటే ఆకలి దప్పిక కూడా వుండదు. ఇంట్లో ఏమో తల్లిదండ్రులు విసుక్కుంటారు. చదవమని పోరు పెడుతుంటారు. చదువుకోవాలి అని వున్నా నా చుట్టూ వుండే స్నేహవలయం నుండి బయట పడలేకపోతున్నాను. నేనేమి చేయాలి?*

## వివరణ:

నీ స్నేహితులెవరో చెప్పు...నీవెలాంటి వాడివో చెప్పొచ్చు అని పెద్దలు చెప్తుంటారు కదా. మన చుట్టూతా వున్న వ్యక్తుల మీద ఆధారపడి మన వ్యక్తిత్వము, మన ప్రవర్తన వుంటుంది అని అంటే మీరు నమ్ముతారా?

అవును పిల్లలూ. అది నిజం. జీవితంలో తల్లి తండ్రులు, చదువు చెప్పే టీచర్ల తరవాత మనలను అత్యంత ప్రభావితం చేసే వ్యక్తులు స్నేహితులే సుమా. జీవితంలో ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి చేరే క్రమంలో స్నేహితులే

ప్రధాన పాత్ర పోషిస్తుంటారు. అలాగే జీవితం అధోగతికి కూడా వారే కారణంగా మారుతుంటారు.

స్నేహితుల కారణంగా సాధారణంగా చదివేవాడు కూడా అద్భుతమైన ప్రతిభ కనపరచవచ్చు. అదే స్నేహితులతో చేరడం వలన అత్యంత ప్రతిభావంతుడైన వాడు అట్టడుగుకు నెట్టి వేయబడనూ వచ్చు. దానికైనా దేనికైనా మనము చేసే స్నేహమే కారణం.

వర్షపు నీరు తను చేసే వివిధ రకాల స్నేహాల వలన తానెలా మారిపోతుంది అన్నది చూడండి.

వర్షపు బిందువులు వేడిగా ఉన్న రాయి మీద పడి క్షణాలలో అవిరిగా మారి పోయి గాలిలో కలిసి తమ వునికినే కోల్పోతాయి.

వర్షపు బిందువులు నేల మీద పడి భూమిలో ఇంకి పోయి దానిని సారవంతమైన భూమిగా మార్చివేస్తాయి.

వర్షపు నీరు నదితో స్నేహం చేసి తన బలాన్ని వేయింతలుగా చేసుకుని తాను పారినంత మేర నాగరికతకు బాటలు వేస్తుంది.

వర్షపు నీరు సముద్రంలో చేరి తన స్వచ్ఛత ను కోల్పోయి లవణ జలమై త్రాగడానికి లేకుండా నిరుపయోగం అవుతుంది.

పిల్లలూ... మీరు వర్షపు నీరయితే ఎవరితో స్నేహం చేస్తారు చెప్పండి. మీరు ఎంచుకునే స్నేహాన్ని బట్టి మీరెలాంటి వారో తప్పక చెప్పవచ్చు.

అసలు స్నేహమంటే జీవితానికి అతిపుష్టిని చేకూర్చే దివ్యమైన ఔషధంలా వుండాలి తప్ప జీవితాన్ని అనావృష్టిలోకి నెట్టేసే మందులా వుండరాదు. స్నేహము పేరుతో చదువుకునే వయసులో మితి మీరుతున్న చేష్టలు మనము చూస్తున్నాము. స్నేహం పేరుతో బైక్ రేస్‌లు చేసుకుంటూ దుర్మరణం పాలయిన విద్యార్థులు ఎంతో మంది వున్నారు. తరచుగా మనము సమాచార పత్రికలలో చూస్తూనే వుంటాము కదా...నలుగురు విద్యార్థులు ఈతకు వెళ్ళి చెరువులో మునిగి చచ్చిపోయారు లాంటి వార్తలు... ఇవన్నీ అనవసరమైన స్నేహాలకు పరాకాష్ఠ అని చెప్పాలి.

మీకు ఒక విషయం తెలుసా...స్నేహం అన్నది మనలని ఉన్న స్థానం నుండి ఉన్నత స్థానం చేర్చే ప్రేరకం కావాలి. ఉదహారణకు మనము కాగితం లాంటి వాళ్ళము అనుకుంటే గాలితో స్నేహము చేస్తే గాలిపటంలా మారి ఆకాశంలో ఎగుర గలము. అదే స్నేహం బురదతో చేస్తే...అప్పటిదాకా నేల మీద తిరుగాడే మనం బురదలో చేరి మురికిగా మారి...అట్టడుగుకు చేరుతాము.

అలాగే కాగితము ఎండు చేపలతో స్నేహం చేసింది అనుకోండి అప్పటి దాకా సామాన్యముగా ఉన్నది... ఇప్పుడు ఈ స్నేహమహిమ చేత అత్యంత దుర్గంధ భూయిష్టమైన కంపు కొడుతుంది. అలా కాకుండా ఆ కాగితం మల్లె పువ్వులతో స్నేహం చేస్తే మనసును ఆహ్లాద పరచే మల్లెల సుగంధ పరిమళాలు కాగితమునకు కూడా అంటుకుని సువాసనలు వెదజల్లుతుంది.

ఒకటి గుర్తు పెట్టుకోండి...స్నేహం కోసమని తరగతులు ఎగ్గొట్టి, చదువు మానేసి, దురభ్యాసములకు గురి అయి, పరీక్షలు తప్పి అంతగా పిల్లలు ప్రవర్తిస్తే ఇక మీమీద ఆశలు పెట్టుకుని మీరు బాగు పడాలనే లక్ష్యంతో మిమ్మల్ని చూసుకునే తల్లిదండ్రులు ఏమవుతారో ఆలోచించండి.

అసలు...చదువుకునే సమయంలో, పిల్లలకు చదువు తప్ప మరో ధ్యాస ఉండకూడదు. ఒక వేళ ఉంటే ఆ వ్యాసంగములు అన్నీ కేవలం ఆట విడుపులా వుండాలి తప్ప...జీవితము అవ్వకూడదు. జ్వరం వచ్చిందని డాక్టర్ దగ్గరికి వెళితే మూడు పూటలా వేసుకొమ్మని టానిక్ ఇచ్చాడు అనుకుందాము. ఇచ్చిన మందును ఆయన చెప్పినట్లు వేసుకుంటే ఆరోగ్యం అవుతుంది. కానీ

# కంపాస్

మొత్తము టానిక్ అంతా ఒకే సారి త్రాగితే అదే విషంగా మారి ప్రాణం తీస్తుంది కదా. అలాగే స్నేహం అన్నది కేవలం ఆరోగ్యం కోసమై వేసుకునే ఔషధం లాగా ఉండాలి... అతిగా మితి మీరిన స్నేహాలు విద్యార్థులకు ఎప్పుడూ శ్రేయస్కరం కాదు.

నేను ఇంటర్ 2 వ సంవత్సరము చదువుతున్న రోజుల్లో జరిగిన ఒక సంఘటన మీతో పంచుకోవాలి అనుకుంటున్నాను. నేను కూర్చునే బెంచిలో కూర్చునే మరో ఇద్దరు పిల్లలతో నేను బాగా స్నేహంగా వుండే వాడిని. ఎప్పుడూ కలిసి మెలిసి అన్నింట్లో పాల్గొనే వాళ్ళం. మిగతా ఇద్దరు మిత్రులు కూడా ఎప్పుడూ తరగతిలో మొదటి స్థానంలో వుండే వాళ్ళు. ఒకరి నాన్న స్కూల్ ఇన్‌స్పెక్టర్, ఇంకొకరి నాన్న టీచర్, మా నాన్న అడ్వకేట్. నా తల్లిదండ్రులు కష్టాలతో పోరాడి...ఇంకో ఊళ్ళో జీవిస్తూ నన్ను బంధువుల ఇంట్లో చదవడానికి వుంచారు. ఇక నాకు ఎవరూ చెప్పే వాళ్ళు లేరు. మేము ముగ్గురం Inter ఫైనల్ పరీక్షలకు కలిసి కంబైన్డ్ స్టడీస్ అని ఇళ్లలో చెప్పి ఒకడి ఇంటికి వెళ్ళి చదివే వాళ్ళం. రేపు కెమిస్ట్రీ పరీక్ష అంటే రాత్రి రెండో ఆటకు ఒక సినిమాకు వెళ్ళాం. ఆ ఏముందిలే వచ్చిన తరువాత చదువుదాం అనుకున్నాం. ఒంటి గంటకు ఇంటికి వచ్చేసరికి...కరెంట్ పోయింది. మా స్నేహము పక్క దారి పట్టడం వలన...పరీక్ష తప్పింది. నాకే కాదు...పాపము తరగతిలో మొదటి స్థానంలో వుండే వాళ్ళిద్దరికి కూడా తప్పింది. పాపము ఒకడి తల్లి వాడిని తిట్టిన తిట్లు ఈ రోజుకూ గుర్తున్నాయి. అప్పుడు అనిపించింది...అరెరె ఎంత పొరపాటు చేశాము అని. మళ్ళీ ఎప్పుడూ అలాంటి తప్పు చేయలేదు. పిల్లలూ... స్నేహం మనలను బాగు చెయ్యాలి అంతేగాని చెడగొట్టకూడదు అని గుర్తుంచుకోండి.

## సూచనలు:

1. *మంచి వాళ్ళతో స్నేహం చేయండి.*
2. *వాడికి చదువు రాకున్నా ఫరవా లేదు కానీ సంస్కారం వుండాలి.*
3. *చదువు బాగా వచ్చినా...వాడికి దుర్లక్షణాలు వుంటే, ఆమడ దూరంలో వుండండి.*
4. *మీరు ఏ రంగములో అయితే రాణించాలి అనుకుంటున్నారో ఆ రంగములో వున్న వాళ్ళతో స్నేహం చేయడము మరవద్దు.*
5. *స్వచ్ఛంద సంస్థలలో చేరండి అక్కడ ఎంతో మంది గొప్ప వాళ్ళు మంచి వాళ్ళు పరిచయము అవుతారు.*
6. *దుడ్డిచ్చయినా దుస్సంగానికి దూరం కావాలి... ప్రాణం ఇచ్చయినా సత్సంగానికి దగ్గరవ్వాలి.*
7. *మనలను చదువుకు దూరంగా తీసుకు వెళ్ళే వాళ్ళు నిజమైన స్నేహితులు కారు అని గుర్తించండి.*
8. *అబ్బాయిలు అమ్మాయిలు పరస్పర వ్యామోహంతో కలిసి తిరగడం వద్దు.*

## ప్రేరణ మంత్రం:

*7 Things, negative friends will do to you. They will...*

1. *•Demean your value*
2. *•Destroy your image*
3. *•Drive you crazily!*
4. *•Dispose your dreams!*
5. *•Discredit your imagination!*
6. *•Deframe your abilities and*
7. *•Disbelieve your opinions!*

*Stay away from such people!*

## స్ఫూర్తి:

పిల్లలూ మీకు నేను ఇద్దరు అద్భుతమైన వ్యక్తుల గురించి చెప్తాను. వాళ్ళు ఎంచుకున్న స్నేహముల వలన వాళ్ళ జీవితంలో ఏమి జరిగిందో తెలుసుకోండి.

కథలో మొదటి వాడు...అద్భుతమైన విలుకాడు. ధనుర్విద్యలో మేటి వీరుడు. పాండవ మధ్యముడు అర్జునుడు. తానెంత వాడైనా సరే జీవితంలో పరమాత్మని నిజ స్నేహితుడిలా చేసుకున్నాడు. ఇక మహాభారత కథ మొదలు అంతిమం దాకా ప్రతి అడుగులో మాధవుడే అన్నీ తానై చూసుకున్నాడు. అర్జునుని విజయుని చేసే దాకా విశ్రమించనే లేదు. ఇది మొదటి ఇద్దరు మిత్రులు, కృష్ణార్జునుల కథ.

కథలో రెండవ వాడు...అద్భుతమైన విలుకాడు. ధనుర్విద్యలో తనకు సాటి లేదని అనుకునే వీరుడు. రాధేయుడు, కర్ణుడు. తానెంత వాడైనా సరే తనను అంగ రాజ్యమునకు పట్టాభిషక్తుడిని గావించిన రారాజు దుర్యోధనుడిని జీవితంలో నిజ స్నేహితుడిలా చేసుకున్నాడు. దుష్టచతుష్టయం (దుర్యోధన, దుశ్శాసన, శకుని మరియు కర్ణుడు) అయినారు. ఇక మహాభారత కథ మొదలు అంతిమం దాకా ప్రతి అడుగులో అన్నీ తానై దుర్యోధనుడి విజయం కోసం శ్రమించాడు. అతన్ని విజయుని చేసే క్రమంలో చివరికి తన ప్రాణాలు సైతం కోల్పోయి చరిత్ర హీనుడిగా మారి పోయాడు. ఇది కర్ణ దుర్యోధనుల కథ.

ఇప్పుడు చెప్పండి పిల్లలూ... స్నేహం ఎలా వుండాలి... ఏ విధమైన వాళ్ళతో చేయాలి...ఎక్కడ దానికి లక్ష్మణ రేఖ గీయాలి? అర్థం అయిందా?





# 13. ప్రేమ వ్యవహారాలు



## సమస్య:

*పిల్లలు చదువుకునే వయసులో ప్రేమలు పెళ్లిళ్లు అనుకుంటూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. వాళ్ళు చేసే చేష్టలతో తల్లిదండ్రులు విసుగెత్తి పోతున్నారు. పిల్లలు చదువుకోవాలని స్కూల్‌కు పంపితే వాళ్ళు ఇలా చేయడం వలన చదువు చట్టుబండలు చేసి వాళ్ళను ఇంట్లో పెట్టేస్తున్నాం. పరువు ప్రతిష్ట కంటే కూడా వాళ్ళు చదువుకునే వయసులో ఇలా పెడ మార్గం పెట్టడమే ఎక్కువగా భాధిస్తోంది – తల్లిదండ్రులు*

*నేను, నా తరగతి లోని ఒకరిని ఇష్టపడ్డాను. ఎప్పుడూ తన గురించిన ఆలోచనలతో సమయం గడిచి పోతుంది. తనను మెప్పించాలని, తన కళ్ళలో పడాలని, తను నా గురించి ఏమి అనుకుంటున్నదా అని ఎప్పుడూ మనసు పరి పరి విధాలుగా వెళ్తుంటుంది. చదువు మీద శ్రద్ధ ఉండటం లేదు – విద్యార్థి*

## వివరణ:

పిల్లాలూ! పైన పేర్కొన్న సమస్యలు ఒకటి తల్లి తండ్రుల వైపు నుండి. మరొకటి విద్యార్థులైన మీ వైపు నుండి. మీ తల్లిదండ్రులు అయినా మీరైనా చదివే సమయంలో పడుతున్న ఇబ్బంది గురించే కదా అడిగారు. ఇద్దరు కూడా చదువుకుంటున్న సమయంలో ప్రేమ అన్న విషయం ఎలా జీవితానికి కంటకంగా మారిందో తెలుపుతున్నారు కదా.

కందుకూరి వేరేశలింగం గారు మరియు రాజా

రామమోహన్ రాయ్ లాంటి దేశ నాయకుల కథలను మనము పాఠాలుగా చదువుకున్నాము కదా? ఎందుకంటారు? ఎందుకంటే వారి జీవితమంతా కూడా సాంఘిక దురాచారాలైన బాల్య వివాహములు, సతీ సహగమనం, వర కట్నం, కన్యా శుల్కము మొదలగు వాటి మీద పోరాడారు కాబట్టి. వాళ్ళు బాల్య వివాహాలు అడ్డుకున్నారు కదా? మీకు వాళ్ళ మీద కోపం రాలేదా?

రాలేదు కదా...కారణం అతి చిన్న వయసులో పెళ్లిళ్లు చేస్తే తెలిసీ తెలియని వయసులో జీవితాన్ని సాగించడం ఒక సవాల్‌గా మారుతుంది. పెళ్లి పేరు మీద చిన్న పిల్లలకు, చదవాల్సిన వయసులో... జీవిత సంఘర్షణకు గురి చేయడం భావ్యం కాదని వాళ్ళు వాదించారు. శారీరకంగా... మానసికంగా... సామాజికంగా, నైతికంగా ఇలా ఎలా చూసినా బాల్య వివాహాలు బాల్యాన్ని కొల్లగొట్టే దురాచారంగా ఎంచి దేశమంతటా నిషేధించ బడ్డాయి కదా... ఇదే కదా మనము చదువుకుంటున్నది.

మరి, పట్టుమని 16, 18 ఏళ్ళు కూడా నిండకుండానే ప్రేమ పేరుతో మనము చదువుకు దూరం అవుతున్నామే... ఎంత విచారకరమో ఆలోచించారా? ఎదో తల్లితండ్రులు బాల్య వివాహాలు చేసి తప్పు చేస్తే ఈ రోజు విచారణ చేసి వాళ్ళకు బుద్ధి చెప్పొచ్చు, దండించ వచ్చు, నియంత్రించేందుకు ప్రయత్నం చేయొచ్చు. పిల్లలే ఇంత అమాయకంగా, ఇష్టంగా, నిర్లక్ష్యంగా, అజ్ఞానంలో ప్రేమ, పెళ్లి అంటూ జీవితాన్ని నాశనం చేసుకుంటుంటే మనలను మార్చ డానికి వీరేశలింగం లాంటి వాళ్ళు ఊరికి ఒకరు వుండాలి.

అర్థం అవుతోందా పిల్లలూ... మీరు ఏమి చేస్తున్నారో? అసలు 13 ఏళ్ల నుండి 19 ఏళ్ల దాకా వున్న వయసుని టీనేజ్ అంటారు. ఎందుకంటే 13 నుండి 19 దాకా ఇంగ్లీష్ పదాలకు చివర teen చేరుతుంది కాబట్టి. టీనేజ్‌లో చిగురించే ఏ ప్రేమా ఫలించిన దాఖలాలు లేవు. కారణం అది ప్రేమ కాదు... పరస్పర ఆకర్షణ మాత్రమే. కానీ ఈ మధ్య చూస్తున్న విషయాలు కొంత ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. ఒక అమ్మాయి చెప్తుంది ...పలాని అబ్బాయిని నేను చిన్నప్పటి నుండి ఇష్టపడ్డాను. అందుకే ఎవరు కాదన్నా వాడినే పెళ్లి చేసుకుంటాను అని. కానీ ఇక్కడ ఆ అమ్మాయికి సరి అయిన మార్గదర్శనం దొరకలేదు అన్నది నిజం. చెప్పే వాళ్ళు లేక పోవడంతో చాలా ఘోరాలు అలవోకగా జరిగి పోతున్నాయి. నిజానికి ప్రేమకూ పెళ్ళికీ సరి అయిన వయసు 21 సంవత్సరాల నుండి 25 సంవత్సరాలు గా తీసుకొండి. కారణం ఏమిటంటే అప్పటికి మీకు పరిపూర్ణమైన జ్ఞానం వచ్చి వుంటుంది. ఎదో ఒక రంగములో స్థిరపడి వుంటారు. నిర్ణయం తీసుకోగలిగే శక్తి మీకు వుంటుంది.

నిజానికి బాల్యములో ప్రేమ అనుకుని ఇంకొకరిని ఇష్టపడుతున్నారు అంటే, ఇంట్లో తల్లి తండ్రుల నుండి ప్రేమను పొందలేక పోవడం కూడా ఒక కారణం కావొచ్చు. బయట వ్యక్తులు ఎవరైనా కాస్త ఎక్కువ చనువుగా, ప్రేమగా, స్నేహంగా మసలుకుంటే...ఇక అదే నిజమైన ప్రేమ అనుకుని కరిగి పోయి...ఎవరికి వారు ఇక వాళ్లే జీవితం అనుకుంటారు.

ఇంకా ప్రధానంగా...ఈ రోజు మనము చూస్తున్న సినిమాలు, టీవీలలో అంశాలు పిల్లలను చాలా తప్పుడు మార్గంలో తీసుకుని వెళ్తున్నాయి అని చెప్పక తప్పదు.

**విద్యార్థులూ ఈ విషయాలను గమనించండి:**

1. మీ ప్రేమకు పర్యవసానం ఆలోచించండి.
2. పెళ్లి దాకా వెళ్తుందని భావిస్తున్నారా?
3. సమాజం హర్షిస్తుందా మీ ప్రవర్తనను?
4. అందరినీ ఎదిరించి మీరు జీవించగలరా?
5. జీవించడానికి కావలసిన వనరులు వున్నాయా?
6. మీ వయసు, చదువు వైవాహిక జీవితానికి ఉపయోగ పడతాయా?
7. ఒక వేళ రేపు అతి చిన్న వయసులో మీకు పిల్లలు

పుడితే వాళ్ళను పోషించే తెలివి తేటలు మీకున్నాయా?

8. తిండికీ, బట్టకూ, గూడుకూ కూడా కష్టం వస్తే మీరు కట్టుకున్న వాళ్ళు మీతోనే ఉంటారని గ్యారంటీ వుందా?
9. ఇలాంటి భవిష్యత్తు మీకు కనిపిస్తే ప్రేమకు కాస్త విశ్రాంతి ఇచ్చి...మొదట చదువు మీద దృష్టి నిలిపి జీవితంలో స్థిర పడటానికి ప్రయత్నిస్తారు కదా.

**తల్లిదండ్రులు ఈక్రింది విషయాలు గమనించండి:**

1. కన్న పిల్లల కోసమై మీరు ఎంత సమయం వెచ్చిస్తున్నారు?
2. వాళ్ళతో ఆత్మీయంగా వాత్సల్యంగా మాట్లాడు తున్నారా?
3. వయసుతో పాటూ వారి శరీరాల్లో, మనసుల్లో, ఆలోచనల్లో వచ్చే మార్పులను గుర్తిస్తూ వారితో చర్చించి గైడ్ చేస్తున్నారా?
4. పిల్లలు స్కూల్‌లో ఎలాంటి ప్రవర్తనతో ఉన్నారు అన్నది తెలుసుకుంటున్నారా?
5. అసలు ఎదిగే పిల్లల ముందు తల్లిదండ్రులుగా మీ ప్రవర్తన ఆమోద యోగ్యముగా వుందా?
6. ఇంట్లో కానీ లేదా స్కూల్‌లో గాని పెద్ద వాళ్ళు నైతికంగా వున్నారా?
7. మీరు మీ పిల్లలకు ఎలాంటి ప్రపంచాన్ని పరిచయం చేస్తున్నారు (టీవీ, మూవీ, సామాజిక మాధ్యమాలు, స్మార్ట్ ఫోన్, డబ్బులు మొ॥)
8. పిల్లలు ఇంట్లో ఒక్కరే వున్నప్పుడు కానీ, రాత్రి వేళల్లో కానీ ఏమి చేస్తున్నారో గమనించారా?
9. అన్నింటికీ అరుపులే కట్టడి చేయవు అని గుర్తించి పిల్లలను ప్రేమగా అక్కున చేర్చుకుని మాట్లాడండి. అవసరం అవుతే అవతల పిల్లలను కూడా వ్యక్తి గతంగా కలవండి. ఉపాధ్యాయుల దృష్టికి తీసుకుని వెళ్ళండి. పిల్లాలూ తల్లిదండ్రులు ఇద్దరు కూడా మానసిక నిపుణులను కలసి వారి సలహాలు తీసుకోండి.

నిజానికి విద్యాలయములలో పిల్లలను ఎంతో ఉన్నతంగా తీర్చి దిద్దవచ్చు. కానీ ఈ రోజులలో అలాంటి పరిస్థితులు కనిపించడము లేదు. నైతిక విలువలు, సామాజిక బాధ్యత, కుటుంబ విలువలు పూర్తిగా లోపించడమే ఈ తరం పిల్లలు పెడ మార్గం పట్టడానికి కారణంగా మారాయి. కేవలం బుక్కులో వున్న పాఠాలు పూర్తి చేసి మా బాధ్యత అయిపోయింది అనే వాళ్ళున్నారు. నిజానికి జీవిత పాఠాలు నేర్పే వాళ్ళు అరుదుగా కనిపిస్తున్నారు. గుణ పాఠాలు నేర్పే వాళ్ళు అసలు కనిపించడం లేదు అనుకోవాలి.

వీలయితే... పిల్లలను మంచి స్వచ్ఛంద సంస్థలలో చేర్చండి ఈరోజు ఏ సంస్థలోనైనా పిల్లల కోసమై ప్రత్యేక కార్యక్రమాలు ఉంటున్నాయి. పిల్లల్లో కరువైన విలువలు ఎన్నో ఇక్కడ భోదించ బడతాయి.

ఉదాహరణకి, శ్రీ రామకృష్ణ మిషన్, శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, ఈషా యోగ, శ్రీ రామచంద్ర మిషన్, Art of Living, విపస్సనా ధ్యాన కేంద్రాలు ఇలా ఎన్నో సంస్థలు పిల్లలను మంచి దారిలో పెట్టే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాయి.

## సూచనలు:

*1. మీకున్నది ప్రేమనా లేక వ్యామోహమా అన్నది తెలుసుకోండి.*

*2. మీ వయసుకు ప్రేమ అవసరమా లేక చదువా ఆలోచించండి.*

*3. ఒకరి మీద ప్రేమ కంటే కన్న వాళ్ళ మీద, దేశం మీద, దేవుడి మీద ప్రేమను పెంచుకోండి.*

*4. మంచి పుస్తకాలు చదవడం మరచి పోకండి. ప్రధానంగా బాల్య వివాహాలు మొదలగు సాంఘిక దురాచారాలు మన మీద ఎంతటి దుష్ట ప్రభావం చూపాయి అన్నది తెలుసుకోండి.*

*5. ఒక వేళ మీరనుకున్నట్లు ప్రేమ నిజమయితే*

*ఒక కాగితం తీసుకుని ఇక ఇప్పుడు ఏమేమి చేయ బోతున్నారు అన్నది వ్రాయండి. ప్రతి అంశమునూ కూలంకుషంగా ఆలోచించి పరిశోధించి వివరంగా వ్రాయండి. మీరు తప్పక మధ్యలోనే ఆగి పోతారు.*

*6. ఈ వయసులో, మీ వయసులో వున్న ఒకరిని ప్రేమిస్తే అది పెళ్లి దాకా వెళ్లడం అన్నది 10% నిజం అనుకుంటే... ఈ వయసులో మనసు పెట్టి చదివితే అది మిమ్మల్ని విజయపథంలో పెట్టగలదన్నది 100% నిజం.*

## ప్రేరణ మంత్రం:

*When you are young...•Develop Love for Nation! which will make you as wonderful Human Beings.*

## స్ఫూర్తి:

ఇది అనంతపురంలో చదువు కుంటున్న మా పాప హైదరాబాద్ లో PG పరీక్ష కోసమై ప్రత్యేక తర్ఫీదుకై చేరిన బోధనా కేంద్రంలో తారస పడిన ఒక అద్భుత మైన భోధకుడి (Dr Ashthosh Chakraborthy) కథ. పేరు మార్చాను.

వైద్య కళాశాలలో చదివే సమయంలో ఆయన జీవితంలో జరిగిన ప్రేమ కథ. ఇద్దరు కూడా MBBS లో వున్నప్పుడే ప్రేమలో పడ్డారు. కలిసి చదువుకున్నారు. కలిసి తిరిగారు. ముఖ్యంగా అబ్బాయికి ఆ అమ్మాయి అంటే పంచ ప్రాణాలు. అంత పిచ్చిగా ప్రేమించి ఎన్నెన్నో కలలు కన్నాడు. నాలుగేళ్ళ MBBS అయ్యే వరకు అంతా బాగానే వుంది. తరవాత ఒక అనుకోని మలుపు.

మాములుగా MBBS పూర్తి అవగానే ప్రతి వైద్య పట్ట భద్రుడు కూడా ఏదో ఒక అంశములో నైపుణ్యాన్ని సాధించాలి. అప్పుడే వాళ్లకి తగిన అవకాశాలు ఉంటాయి. ఇద్దరూ ఎంతో కష్టపడి PG లో సీట్ తెచ్చుకోవటానికి ప్రవేశ పరీక్ష వ్రాసారు. అమ్మాయికి చాలా మంచి రాంక్ వచ్చింది. మెడిసిన్‌లో సీటు సాధించింది. కానీ అబ్బాయికి మాత్రం పెద్ద రాంక్ రాకపోవడం కారణంగా అతనికి non clinical సీట్ వచ్చింది. అమ్మాయికి ఇది నచ్చలేదు. అబ్బాయి చాలా నచ్చ చెప్పాడు..తనకు వచ్చిన అవకాశంతో కూడా వృద్ధి చెందవచ్చు అని భరోసా ఇచ్చినా ఆ అమ్మాయి మాత్రం తనకు అతను సరితూగడని ఇంకా పెద్ద వృత్తిలో వృద్ధి చెందిన వానిని పెళ్లి చేసుకొని ఇతనిని వదిలేసింది.

ఆమె తనను వదిలిసిన బాధతో అబ్బాయి చాలా చాలా మానసిక వ్యధతోటి కృంగి పోయాడు. తన సర్వ శక్తులు కూడ గట్టుకుని జరిగింది అంతా తన మంచికే అనుకుని తాను ఎంచుకున్న బ్రాంచ్ లోనే పట్టు సాధించాడు. బోధననే తన వృత్తిగా ఎంచుకొని చాలా నైపుణ్యాన్ని సాధించాడు. ఇప్పుడు అతడు దేశ విదేశాలు తిరుగుతూ కొన్ని వేల మంది డాక్టర్లకు మెళుకవలు భోదించే ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ కోటానుకోట్ల రూపాయలు సంపాదిస్తూ ఎంతో మంది హృదయాలను అతని టీచింగ్ ద్వారా గెలుచుకున్నారు. చూడండి అతను ప్రేమ విఫలం అయినందుకు దేవదాసులా మారి జీవితాన్ని నాశనం చేసుకోలేదు.ఆ ప్రేమ మత్తు నుండి, మోసపోయిన బాధ నుండి బయటపడి అసమానమైన వ్యక్తిగా వృద్ధి చెందాడు.

అయినా, ఇలా ప్రతిఒక్కరికీ చదువుకునే సమయములో ప్రేమ వ్యవహారాలు అవసరమా? జీవితానికి ఒక జిజ్ఞాశ వుండాలి. ప్రథమ పాత్ర నొప్పు పథము వెనుక.

# 14. నిరాసక్తత



## సమస్య:

*నాకు చదువంటే కొంచెం కూడా ఆసక్తి లేదు. తల్లిదండ్రుల పోరు పడలేక పాఠశాలకు వెళ్తున్నాను. నాకయితే చదవాలని లేదు. ఈ విషయం నేను ఇంట్లో చెప్పినా పట్టించుకోరు. ఇక స్కూల్‌లో నిరాసక్తముగా ఉండటం వల్ల అక్కడ కూడా ఇమడలేక పోతున్నాను. నేను ఏమి చెయ్యాలో అర్థం కావటం లేదు.*

## వివరణ:

ఈ సమస్య చాలా అరుదుగా విన్నాను. కానీ ఇలాంటి పిల్లలు కూడా వుంటారని ఊహించి ఇక్కడ క్లుప్తంగా చర్చిస్తున్నాను. పిల్లలూ మీకు చదువు కోవడం ఆసక్తి లేదని చెప్తున్నారు కదా. మరి దేని మీద ఆసక్తి ఉంది చెప్పగలరా? మీ ఆసక్తికి కనీస అక్షర జ్ఞానం అవసరం వుందా లేదా? ఆలోచించారా? ఒక వేళ మీ ఆసక్తికి చదువే అవసర లేదు అని మీరు నిరూపిస్తే నేను ఒక లక్ష రూపాయలు బహుమతి గా ఇస్తాను. సిద్ధమేనా అని అడిగాను ఒక సమావేశంలో...

కొన్ని ఆసక్తులను ఏకరవు పెట్టారు

నేను డ్రైవర్ కావాలని వుంది, కనీసం10 వ తరగతి పాస్ అవ్వాలని చెప్పాను

నేను ఫాషన్ డిజైనర్ కావాలని వుంది, డిగ్రీ చేస్తే కదా సాంకేతికతను అంది పుచ్చుకోగలవు అన్నాను.

నేను కిరాణా వ్యాపారం చేస్తా, కొలతలు తూకాలకు గణితం కావాలి కదా అన్నాను.

నేను ఫోటో వీడియో ఎడిటర్ కావాలని ఉంది,

కంప్యూటర్‌లో ఎడిటింగ్ చేయాలంటే కంప్యూటర్ బేసిక్ కోర్సు వుండాలి కదా...కనీసం డిగ్రీ చేయాలి కదా...

వ్యవసాయము చేసి రైతు అవ్వాలని ఉంది, పాడి పంటలకు సంబంధించిన విషయ పరిజ్ఞానం సంపాదించాలంటే నీకు కనీస జ్ఞానం వుండాలి కదా.

ఇలా ప్రపంచములో నీవు ఏ రంగములో ఆసక్తి కలిగివున్నా ఫరవాలేదు. కాని అన్నింటిలో కనీసం చదువు అవసరం అని నేను చెప్పాను. అందువల్ల చదువు మీద మాత్రం నిరాసక్తి తగదు అని మాత్రం చెప్పగలను. ఏ రంగాన్ని ఎంచుకున్నా బేసిక్ విషయాలు అయితే చదువుకుంటేనే కదా వస్తాయి. నీకు కలిగిన ఆలోచనలను భాషతోనే ఇతరులకు తెలియపరచగలవు కదా! కనుక చదువుకోవాలి.

నిజంగా ఏదైనా ఆసక్తి వుంటే ఇంటర్, డిగ్రీ అయిన తరువాత తల్లిదండ్రులతో చక్కగా చర్చించి నిర్ణయము తీసుకోండి. అప్పుడు అర్థం వుంటుంది. అంతే కాని ఇంకా 10 వ తరగతిలో వుండగానే మీ ఆసక్తుల గురించి మాట్లాడి అందరినీ భయపెట్టకండి. ఏ రంగములో మనము స్థిరపడాలన్నా... కనీసం డిగ్రీ చేయండి. ఆ తరవాత మీ ఇష్టం.

తల్లి తండ్రులు కూడా పిల్లల ఆసక్తి గమనించి వాళ్ళను ప్రోత్సహిస్తే అందరికీ ఆనందం అవుతుంది. అంతే కాని మేము వాడిని కన్నాము...వాడి కలలను కూడా కొన్నాము అని లాజిక్ లేకుండా మాట్లాడి...పిల్లాడిని ఇంటికే కన్నం పెట్టి పారి పోయే విధంగా చేయొద్దు. చక్కగా పిల్లలు చెప్తున్నది వినండి. ఈ రోజు జీవితంలో అద్భుతమైనవి సాధించాలంటే పిల్లలు అందరూ IIT, IIM, ISB, IISC, Eng, MBBS ఇలాంటి చదువులు మాత్రమే చదవక్కర లేదు అని నా అభిప్రాయం.

పిల్లలను మంచి వారిగా తీర్చి దిద్దండి అంతే కాని వాళ్లను గొప్ప వాళ్ళుగా చేయాలని తపించకండి. ఈ రోజుల్లో దేశానికి అందించాల్సింది మంచి వాళ్లనే. పిల్లాడు మంచి వాడై వాడికంటూ ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకుంటే తల్లిదండ్రులు తప్పక స్వాగతించాలి.

### ప్రేరణ మంత్రం:

*Education is not for Living, but it is for Life.*



# 15. నిద్ర-నియంత్రణ

(ప్రొద్దున్నే లేవలేక పోతున్నాను / రాత్రి మేలుకోలేక పోతున్నాను)



## సమస్య:

*నేను ప్రొద్దున్నే లేవలేక పోతున్నాను? ఎన్ని రకాలుగా ప్రయత్నం చేసినా నిద్ర లేవడం నా వల్ల కావడం లేదు. ఒక వేళ లేచినా, ఆ సమయంలో బద్ధకంతో ఏకాగ్రతగా చదవలేక పోతున్నాను. మళ్ళీ నిద్ర ముంచుకు వస్తుంది. పుస్తకాలు పట్టుకోవడమే తప్ప చదివింది శూన్యం. ఏమి చేయాలో తెలియడం లేదు.*

*నేను రాత్రుళ్ళు చదవాలని విశ్వ ప్రయత్నాలు చేస్తాను. కానీ పుస్తకం పట్టుకున్న కొంత సమయంలోనే నిద్ర వచ్చేస్తుంది. ఒక వేళ బలవంతంగా పుస్తకం పట్టుకుని కూర్చున్నా లోపలికి ఏమి వెళ్ళదు. ఒక ప్రక్క కోపం, మరో ప్రక్క నిద్ర వస్తాయి. చివరికి నిద్ర జయిస్తుంది.*

*అసలు ఏ సమయంలో చదివితే మంచిది. ఎన్ని గంటలు చదవాలి. ఎలా చదవాలి.*

## వివరణ:

ఇలాంటి సమస్యలు పిల్లలు ఏకరువు పెట్టినప్పుడు నేను సామాన్యంగా ఒక శతక పద్యం చెప్తుంటాను.

అనగననగ రాగమతిశయిల్లుచునుండు।
తినగతినగ వేము తియ్యగనుండు॥
సాధనమున పనులు సమకూరు ధరలోన।
విశ్వదాభిరామ వినుర వేమా॥

అర్థం ఏమిటంటే, బాగా అభ్యాసం చేస్తూ వుంటే ఎలాంటి రాగమైనా మన గొంతులో బాగా పలుకుతుంది. అలాగే

తింటూవుంటే వేపాకు కూడా తియ్యగానే వుంటుంది. అదేవిధంగా సాధన చేస్తే, ఈ భూమి మీద ఏ పనైనా సిద్ధిస్తుంది. పిల్లలూ మనము చేస్తున్న పని చదువుకోవడం అయితే ఈ సాధన మరింత అవశ్యం. కారణం ఏంటంటే ప్రొద్దున్నే లేవడం లేక రాత్రి చాలా సేపు చదవడం అన్నది కేవలం పరీక్షల ముందు చేస్తే మీరు చెప్పిన సమస్యలు తప్పక మీకు ఎదురవుతాయి.

విద్యార్థులను అభ్యాసీలు అని కూడా అంటారు. అంటే విద్యార్జన నిమిత్తమై నిరంతరం అభ్యాసం చేయువారు అని అర్థం. పిల్లలూ మీరు నిజాయతీగా చెప్పండి...మీ సాధన నిరంతరం సాగేదా లేక పరీక్షల ముందు సాగేదా...కేవలం పరీక్షల ముందు మాత్రమే చదివే వారికి ఏ సమయం అయినా ఇలాంటి సమస్యలు తప్పక వస్తాయి. విద్యార్థి జీవితములో ఆచరణ, సాధన, కృషి, ప్రయత్నం, అభ్యాసం, చదవడం అన్నది...నిత్య దైనిందినిగా వుండాలి. అప్పుడే మనసు మనము చెప్పినట్లుగా వింటుంది.

మీరు చూసే వుంటారు...కుక్కలు చాలా విశ్వాసముతో ఉంటాయి. వాటికి మనం ఒక రెండు రోజులు ఒకే సమయంలో ప్రేమతో ఆప్యాయంగా అన్నం పెట్టాము అనుకుందాము. ఇక అది రోజూ అదే సమయానికి తోక ఊపుకుంటూ ఇంటి దగ్గరికి వచ్చి తచ్చాడుతూ వుంటుంది. అంటే అది ఒక జంతువు అయినా మనము అన్నం పెట్టిన సమయాన్ని అంత చక్కగా గుర్తుంచుకొని వచ్చేస్తుంది. మరి ఇన్ని తెలివి తేటలున్న మనం, మనుషులం కదా...నిజంగా మనసు పెట్టి క్రమ శిక్షణతో చదవడానికి ఉపక్రమిస్తే ఇక ఎలాంటి ఆటంకములు మనకు రాకూడదు – రావు కూడా. ఇది సత్యము.

ఇక్కడ గుర్తు పెట్టుకోవాల్సిన అంశములు ఏంటంటే

1. మనసు పెట్టుట
2. చదువుకోవడం
3. సమయ పాలనం
4. నిరంతర సాధన
5. క్రమశిక్షణ

ఈ 5 అంశములు మనము గనుక పాటిస్తే ఇక ఏదీ మనకు అడ్డు రాదని గ్రహించండి. వీటిలో ఏది లోపించినా మీరన్నట్లు సమస్యలు మిమ్మల్ని ఇబ్బంది పెట్టక మానవు.

అయినా ఇలాంటి సమస్యలు అందరూ ఎదుర్కొంటూనే వుంటారు కాబట్టి సాధారణంగా అందరికీ ఉపయోగ పడే కొన్ని సూచనలు పంచుకునే ప్రయత్నం చేస్తాను. గమనించి మీకు ఉపయోగంగా వుంటే తప్పక పాటించి విజయం సాధించండి.

## సూచనలు:

*1. చదవడానికి బెస్ట్ టైం ఏంటో మీరే నిర్ణయించండి*
*2. అది ఎప్పుడైనా పరవాలేదు.*
*3. ప్రతి రోజూ చదువుకు నిర్దిష్టంగా 3 గంటలు కేటాయించండి.*
*4. ఇక ఆ సమయం వేరే దేనికీ ఇవ్వొద్దు.*
*5. ఆ 3 గంటలకు మానసికంగా సిద్ధము కండి.*
*6. ఒక వేళ నిద్ర వస్తే, లేచి ముఖం కడుక్కోండి.*
*7. కాసేపు అటు ఇటు తిరగండి.*
*8. చదవడం కంటే వ్రాయడం అభ్యాసం చేయండి*
*9. సమస్యలను ఛేధించడం చదివితే రాదు...వాటిని పూరించాలి. పెన్ను పుస్తకం పట్టుకుని సాధన చెయ్యండి.*
*10. మెత్తటి పరుపులు, సోఫాల మీద కూర్చుంటే నిద్ర వస్తుంది తప్ప చదువు రాదు.*
*11. మధ్యాహ్నం భోజనం చేసి, కాసేపు నిద్ర పొండి.*
*12. వీడియో పాఠాలు వుంటాయి కదా...కాస్తా వాటిని చూడండి మధ్యలో.*
*13. మీ స్నేహితులతో కూర్చుని పాఠ్యాంశాలను చక్కగా చర్చించండి. ఫోన్‌లో కూడా చేయొచ్చు.*

*14. దృఢ సంకల్పంతో చేయాలి ఏమి చేసినా.*

*15. ముందుగానే నిర్ణయం చేయండి... ఏది చదవాలో. పడుకునే ముందు, నిద్ర లేచిన తరవాత, చదువుకు ఉపక్రమించే ముందు అనుకున్న దానిని మననం చేసుకుని మీకిష్టమైన దేవుని ప్రార్థించి చదవడం మొదలు పెట్టండి.*

**ఇది కూడా గుర్తుంచుకోండి:**

ప్రతీ జీవికీ biological clock (జీవ గడియారం) అనేది ఉంటుంది. ఈ జీవ గడియారం రెండు రకాలుగా అలవాటవుతుంది, ఒకటి సహజసిద్ధంగా వచ్చేది ఇక రెండోది మనకై మనం అలవాటు చేసుకునేది. బాగా చదవాలి అనుకునే వాళ్లు తమ స్వంత జీవ గడియారం అలవాటు చేసుకోవాలి. అంటే ఉదయం నాలుగు గంటలకు బలవంతంగా ఒక ఆరు నుంచి ఏడు రోజులు చేసినట్లైతే ఎనిమిదోరోజు నుండి అది ఆటోమేటిగ్గా అలవాటైపోతుంది. లేవగానే కాలకృత్యాలకు వెళ్ళండి. ఇలా ప్రయత్నం చేసినట్లయితే ఎనిమిదో రోజు నుంచి మీ శరీరము వద్దన్నా సరే నాలుగు గంటలకి లేపి మిమ్మల్ని కాలకృత్యాలకు పంపిస్తుంది. ఆ తరువాత స్నానం చేసి మీ చదువును మొదలుపెట్టండి. వీలైనంత వరకు మీ టైం టేబుల్లో చదువుకి ఎర్లీ మార్నింగ్ కేటాయించే ప్రయత్నం చేయండి. ఎందుకంటే, కంప్యూటర్ని రీస్టార్ట్ చేస్తే ఏ విధంగా అయితే ఫాస్ట్‌గా పని చేస్తుందో అదే విధంగా మన మైండ్ రాత్రంతా రిలాక్స్ అయి, ఉదయమే రీస్టార్ట్ అవుతుంది కాబట్టి చాలా అద్భుతంగా పనిచేస్తుంది.

ఒకవేళ మీకు ఎర్లీ మార్నింగ్ టైం టేబుల్ కుదరకపోతే లేట్ నైట్ చదివేటప్పుడు కూడా ఈ biological clock కాన్సెప్ట్ ఉపయోగపడుతుంది. కాబట్టి, మీరు సాయంత్రం వేళలో పుస్తకం పట్టుకొనే ముందు స్నానం చేసి ప్రశాంతమైన వాతావరణంలో కూర్చునే ప్రయత్నం చేయండి. కొన్ని రోజులు నిద్ర వస్తుంది. నిద్ర అధిగమించ డానికి 50 నిమిషాలకు ఒకసారి కొంత నడక లేదా మీ కుటుంబసభ్యులతో మాట్లాడటం గాని చేసే ప్రయత్నం చేయండి. అప్పుడు నిద్ర పారిపోతుంది.

**నిద్రకు దూరమై.. చదువు భారమై!**

అంటూ నిరాశాగీతాలు పాడుకుంటూ చాలామంది విద్యార్థులు చదువుపై దృష్టి సారించలేక పోతున్నారట! పరీక్షా కాలం'లో విద్యార్థులు నిద్రలేమి సమస్యతో సతమతమవుతున్నట్లు తాజా అధ్యయనంలో తేటతెల్లమైంది. పరీక్షలు ముంచుకొస్తున్న తరుణంలో దేశవ్యాప్తంగా దాదాపు 70 శాతం మంది విద్యార్థులు రోజులో కనీసం ఏడుగంటలు కూడా నిద్రకు నోచుకోవడం లేదట! ఢిల్లీ, ముంబయి, కోల్‌కత, చెన్నై, బెంగుళూరు, చండీగఢ్, జైపూర్ వంటి ప్రధాన నగరాల్లో నిపుణులు జరిపిన సర్వేలో పలు ఆందోళనకర అంశాలు వెలుగుచూశాయి. చదువు వలన ఒత్తిడి పెరిగి 18 శాతం మంది విద్యార్థులు మూడు నుంచి అయిదు గంటలు మాత్రమే నిద్ర పోతున్నారని సర్వేలో వెల్లడైంది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో మాట్లాడేందుకు కూడా సమయం లేకుండా పోతోందంటూ చాలా మంది విద్యార్థులు వారి అంతరంగాన్ని సర్వే సందర్భంగా ఆవిష్కరించారు. నిద్రకు మాత్రమే కాదు, మంచి ఆహారపు అలవాట్లు, ఆరోగ్య పద్ధతులకు కూడా చదువుల పుణ్యమా అని విద్యార్థులు దూరం అవుతున్నారు.

ముందు నుంచీ ప్రణాళికాబద్ధంగా చదవకపోవడం, పరీక్షలు దగ్గరకొచ్చే సరికి సిలబస్ భారీగా మిగిలిపోవడంతో నిద్రాహారాలకు దూరమై పుస్తకాలను పట్టుకుంటున్న విద్యార్థుల సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. జీవన విధానంలో మార్పులు, తగినంత వ్యాయామం లేకపోవడం వల్ల కూడా పాఠ్యాంశాలపై ఏకాగ్రత చూపలేకపోతున్నారు. సర్వే సందర్భంగా సుమారు 6,500 మంది విద్యార్థులను విచారించగా, కంటి నిండా కునుకు ఉండడం లేదన్న సమాధానం ఎక్కువగా వినిపించింది.



## స్ఫూర్తి:

అబ్దుల్ కలాం గారు ప్రతిరోజూ ఉదయం నాలుగు గంటలకు లేచి స్నానం చేసి మ్యాథమేటిక్స్ చేసేవారట. మ్యాథమెటిక్స్‌లో ప్రాబ్లం సాల్వ్ చేయాలంటే ప్రశాంతమైన మైండ్ అవసరమని గుర్తించి, తను ఎర్లీ మార్నింగ్ లేవగానే చేసే పని ఏమిటంటే మ్యాథమేటిక్స్ లో ప్రాబ్లం సాల్వ్ చేయడం అని ఎన్నో సందర్భాల్లో స్కూళ్ళల్లోవారు స్వయంగా చెప్పారు.



# 16. ఆటలు




## సమస్య:

*నాకు ఆటలంటే బాగా ఇష్టం. చిన్నప్పటి నుండి క్రీడాకారుడవ్వాలని ఆశ. చదువు కుంటున్నాను. కానీ ప్రథమ శ్రేణిలో వుండను. తల్లిదండ్రులు బాధ పడుతున్నారు. ఆటలు అన్నం పెట్టవు అని అంటారు. ఎంత చెప్పినా అర్థం చేసుకోరు. నేను ఫెయిల్ అయ్యే విద్యార్థి కాదు. తప్పక పాస్ అవుతాను. కానీ ఆటలంటే చాలా మక్కువ. నాలా ఆటల్లో రాణించే పిల్లలు మా స్కూల్ లోనే కాదు చుట్టు ప్రక్కల గ్రామాలలో కూడా లేరు. నేనేమి చేయాలి?*

## వివరణ:

ఇంతకు మునుపు విషయం వేరు...ఇప్పుడు పరిస్థితులు వేరు అని చెప్పొచ్చు. నా చిన్న తనంలో ఆటలు అంటే ఇంట్లో అరచి కొట్టేసే వారు అంటే ఆశ్చర్యపోనక్కర లేదు. కానీ గత దశాబ్ద కాలంలో క్రీడారంగమును అద్భుతమైన విషయంగా చూస్తున్నారు అందరూ. వివిధ క్రీడల్లో రాణించిన వ్యక్తులను దేశం అంతా అభిమానంగా చూస్తున్నారు.

అసలు దేశ నాయకులు, సినిమా నటులు, ఆధ్యాత్మిక గురువులతో సమానంగా క్రీడాకారులను గౌరవించడం మనము చూస్తున్నాము. ఎన్నో క్రీడలు...ప్రతీ క్రీడాంశములో అత్యంత ప్రతిభ చూపిన వాళ్ళను మనం చూస్తున్నాము. ఇంతకు మునుపు కేవలం క్రికెట్టు క్రీడాకారులను మాత్రమే మనం ఎరుగుదుము కానీ ఇప్పుడు అలా కాదు...

మనిషి పేర్లు వింటే చాలు వాళ్ళు ఏ క్రీడకు సంబంధించిన వాళ్ళో చెప్పగలిగే స్థాయి అవగాహన పెద్దలకు మాత్రమే కాదు పిల్లలకు కూడా వుంది.

కపిల్ దేవ్, సునీల్ గవాస్కర్, రాహుల్ ద్రావిడ్, అజారుద్దీన్, సచిన్ టెండూల్కర్, M S ధోని, వీరేంద్ర సెహ్వాగ్, VVS లక్ష్మణ్, గౌతమ్ గంభీర్, సిద్ధూ... వీళ్ళంటే క్రికెట్టు క్రీడాకారులు కాబట్టి అందరికి తెలుసు అనుకోవచ్చు. కానీ క్రింద పేర్కొన్న పేర్లు గమనిస్తే... దేశంలో ఎన్నో క్రీడలకు తమ పేరునే అడ్రస్‌గా చేసినవాళ్ళు కోకొల్లలున్నారు.

| | |
|---|---|
| మహేష్ భూపతి | (టెన్నిస్) |
| విశ్వనాథన్ ఆనంద్ | (చదరంగం) |
| సానియా మీర్జా | (బ్యాట్మింటన్) |
| PT ఉష | (పరుగుల రాణి) |
| పుల్లెల గోపి చంద్ | (బాట్మింటన్) |
| కరణం మల్లీశ్వరి | (వెయిట్ లిఫ్టింగ్) |
| కోనేరు హంపి | (చదరంగం) |
| సైనా నెహ్వాల్ | (బ్యాట్మింటన్) |
| మేరీ కొం | (బాక్సింగ్) |
| దీపా కర్మకర్ | (జిమ్నాస్టిక్స్) |
| PV సింధు | (బ్యాట్మింటన్) |
| మలావత్ పూర్ణ | (శిఖరారోహణం) |
| మిథాలి రాజ్ | (మహిళా క్రికెట్) |
| విరాట్ కోహ్లీ | (క్రికెట్) |




పిల్లలు మరియు తల్లిదండ్రులు అందరూ కూడా నేను చెప్పిన విషయాన్ని గ్రహిస్తారు కదా. చదువుకుంటే మంచిదే... మీకు సంతోషం, తల్లిదండ్రులకు గర్వం కానీ ఇష్టమైన క్రీడలో రాణిస్తే మొత్తము జాతి యావత్తూ మనకు బ్రహ్మరథం పడుతుంది. దేశంలో కోట్ల మంది చదువుకుని ఉద్యోగాలు చేస్తున్నారు. హ్యాపీ గా జీవిస్తున్నారు. కానీ 140 కోట్ల జనాభా లో కొన్ని వేల మంది మాత్రమే క్రీడలను తమ జీవిత కాలపు కార్యంగా ఎంచుకున్నారు. అలాగని వాళ్లేమీ చదువు లేని దద్దమ్మలు కాదు. ఒక ప్రక్క చదువుకున్నారు కూడా.

చదువు అన్నది అక్షర జ్ఞానం కోసం మరియు ప్రపంచ జ్ఞానం కోసం మాత్రమే...కానీ లక్షలు సంపాదించే అర్హత కాదు. జీవితాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలి అని నేర్పుస్తుంది. అందుకే "Education is not for living, but for Life" అని చెప్తూంటారు. అందరం ఒక విషయం గమనించాలి. పిల్లల్లో క్రీడల మీద ఆసక్తి వుంటే తప్పక ప్రోత్సహించండి. ఈరోజుల్లో వాళ్ళు చదివే విద్యాలయాలు కూడా ఎంతో ప్రోత్సహించి అలాంటి వారికి ప్రత్యేక శిక్షణ కూడ అందించే ప్రయత్నం చేస్తున్నారు. ఇక ప్రధానాచార్యులయితే ఇలాంటి క్రీడాకారులను గుర్తించి వాళ్లకు ప్రత్యేకంగా వారి క్రీడలకు ఇబ్బంది కలుగ కుండా... పాఠాలు చెప్పే లాగా కూడా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇక, అలాంటి క్రీడలకు ధన వనరుల గురించి కూడా తల్లిదండ్రులు దిగులు చెందనక్కర లేదు. క్రీడల్లో రాణించే వారికి ప్రభుత్వ మరియు ప్రయివేట్ సంస్థలు ఎన్నో ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. అంతెందుకు మొత్తం జీవితానికి కావాల్సిన అన్ని సౌకర్యాలు కలిగిస్తున్నారు. రేపు ఇలాంటి పిల్లలు అద్భుతమయిన ప్రతిభ చూపిస్తే ఇక బ్రహ్మ రథమే. వాళ్లకు లేని వైభోగం లేదు అనే అంతగా అందరూ స్పందిస్తూ వుండటం చూస్తారు.

అసలు, దేశంలో అత్యంత ప్రతుభావంతులైన

క్రీడాకారులను ఎవరిని తీసుకున్నా అందరిదీ మధ్యతరగతి నేపథ్యమే అని తెలుస్తుంది. కానీ తదనంతరం వారి స్థాయి దేశములోనే వెళ్లమీద లెక్క బెట్టే వాళ్ళ సరసన ఉంటుంది. ఆలోచించండి తల్లిదండ్రులూ. మీ పిల్లలు చదివి ఏ ఉద్యోగం లోనో చేరి...మీకు సంతోషం కలిగించవచ్చు కానీ వాళ్లలో ఉన్న క్రీడా ప్రతిభను మీరు గుర్తించి సాన పెట్టగలిగితే దేశానికి మీరు ఒక బంగారు కొండనే ఇచ్చినట్లు అవుతుంది. చరిత్రను తిరగరాసే అద్భుత ప్రతిభ మన పిల్లల్లో దాక్కుని వుంటుంది అని గమనిస్తే... దాన్ని మొగ్గలోనే తుంచి వేయకండి. ప్రేమతో వాత్సల్యంతో ఆ చిన్నారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సాహించండి.

మనం రోజూ వివిధ క్రీడా రంగాల్లో ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగిన వాళ్లని చాలామందినే చూస్తుంటాము, నిజానికి వాళ్ళు10% మంది మాత్రమే. మిగత 90% మంది అవకాశాలు లేక, ఏమి చెయ్యాలో తెలియక, రెక్కాడితే గానీ డొక్కాడని విధంగా అగమ్య గోచరంగ జీవితం సాగిస్తుంటారు.

చదువులో కన్న క్రీడా రంగాల్లో మరియు ఇతర కళారంగాల్లో రాణించడం చాల కష్టం అని గుర్తించండి. అక్కడ ఎదురయ్యే సవాళ్లు రెట్టింపుగా వుంటాయి. పూలబాట అనుకుంటారు, ముళ్లబాటగా వుంటాయి పరిస్థితులు. ఇక విద్యార్థులకు కనీస గుర్తింపు కూడా ఉండదు ఒక్కో సారి. ఆది నుండి అంతం దాకా మనకు మనమే అవకాశాలు సృష్టించుకోవాలి. క్రీడల్లో పడి చదువుల్లో సాధారణంగా వుంటాము కాబట్టి ఉన్నత ఉద్యోగాలు ప్రభుత్వ కొలువులు దొరకవు. ఇంకా మనలను తీర్చి దిద్దే గురువులు కుడా అరుదుగా వుంటారు.

కాబట్టి పిల్లలూ, క్రీడా రంగాన్ని ఎంచుకునే ముందుగా ఆలోచించి, ఫ్యాన్సీగా అనిపించి ఎంచుకుంటున్నారా? లేక నిజంగా, నిజాయతీగా ఆ రంగం పట్ల ఆసక్తి మరియు అమితమైన ప్రేమ ఉందా అని ఆలోచించి నిర్ణయం చేయాలి. ఒక వేళ అలాంటి కృతనిశ్చయం వుంటేనే అన్నిటికీ సిద్ధపడి ముందడుగు వెయ్యాలి సుమా.

ఇదంతా మిమ్మల్ని భయపెట్టాలని కాదు చెప్పేది. అన్ని రకాలుగా సమస్యను విడమరచి చెప్పే ప్రయత్నం చేస్తున్నాను. నన్ను అర్థం చేసుకుంటారు కదూ.

## స్ఫూర్తి:

జీవితంలో ఎదగాలన్న తపనే ఉంటే అటు కుటుంబ జీవితంలోను, ఇటు లక్ష్య సాధనలోనూ అద్భుతాలు సాధించవచ్చని నిరూపించిన మహిళా క్రీడాకారిణి మేరీ కోం.

మేరీ కోం మణిపూర్ లోని కన్గెతే అనే మారుమూల గ్రామంలో జన్మించింది. ఆమె తల్లిదండ్రులు పొలం పనులు చేసుకునే కూలీలు. మేరీ కోం కూడా పూట గడిచేందుకు తరచూ ఆ పొలం పనులకు వెళ్లి తల్లిదండ్రులకు సాయపడాల్సి వచ్చేది.

మేరీకోంకు చిన్నప్పటి నుంచి ఆటలంటే ఇష్టంగానే ఉండేది. ఆ ఇష్టము జీవిత పరమావధి కావడానికి కారణం వుంది. తన రాష్ట్రానికే చెందిన డింగ్కో సింగ్ ఎప్పుడైతే ఆసియా క్రీడలలో బాక్సింగ్‌లో బంగారు పతకాన్ని తీసుకువచ్చాడో, అప్పటి నుంచి తాను కూడా బాక్సింగ్లో రాణించాలని నిర్ణయించేసుకుంది.

మేరీ ఆశయాన్ని ప్రపంచమంతా ఎగతాళి చేసింది. బాక్సింగ్ అనేది పురుషుల ఆట అనీ, ఆడవాళ్లకు తగిన సున్నితమైన ఆటని వెతుక్కోమని హెచ్చరించింది. ఆఖరికి మేరీ తల్లిదండ్రులు కూడా ఆమె ఆసక్తిని తీవ్రంగా వ్యతిరేకించారు. అయినా మేరీ తన పట్టు వీడలేదు. మణిపూర్ రాజధాని ఇంఫాలును చేరుకుంది. అక్కడ అరిజీత్ సింగ్ అనే బాక్సింగ్ శిక్షకుడి వద్దకు తనకు బాక్సింగ్ నేర్పమంటూ ప్రాధేయపడింది.

తొలుత అరిజిత్ సింగ్ మేరీని తేలికగా తీసుకున్నాడు. కానీ ఇతరులకంటే ఆమెకున్న తీవ్రమైన ఆమె సంకల్పాన్ని గ్రహించిన తరువాత తన శిక్షణా పటిమనంతా ఆమెకు అందించాడు. అరిజిత్ ఆశలకు అనుగుణంగా రాష్ట్ర స్థాయి నుంచి ఒకో పోటీలో గెలుస్తూ 2001 నాటికి ప్రపంచ బాక్సింగ్ పోటీలలో రజతాన్ని సాధించే స్థాయికి చేరుకుంది. ఆ తరువాత మరో ఐదు సార్లు ప్రపంచ బాక్సింగ్ పోటీలలో బంగారు పతకాన్ని గెల్చుకుని, ఆ పోటీలలో ఆరు పతకాలను గెల్చుకున్న ఏకైక మహిళగా రికార్డు సాధించింది.



2001లో మేరీ, ఆన్లర్ కామ్‌ను కలుసుకుంది. మేరీ ప్రతిభతో ముగ్ధుడైన ఆన్లర్ ఆమెతో ప్రేమలో పడిపోయాడు. 2005లో ఆ జంట వివాహం చేసుకుంది. మేరీ వివాహం చేసుకుంటే ఆమె కెరీర్ నాశనం అయిపోతుందని అరిజిత్ సింగ్ వంటి పెద్దలంతా భయపడ్డారు. వారు ఊహించినట్లుగానే మేరీ 2006-08 వరకు కెరీర్‌కు దూరమయ్యింది. ఈ మధ్యలో ఆమెకు కవల పిల్లలు కూడా జన్మించారు.

అందరి భయాలనూ తిప్పికొడుతూ మేరీ 2008లో తన ప్రస్థానాన్ని తిరిగి ప్రారంభించింది. మళ్లీ ఒకదాని తరువాత ఒక పోటీని నెగ్గుకుంటూ పతకాల పంటని ప్రారంభించింది. ఒక పక్క గుండెజబ్బుతో బాధ పడుతున్న పిల్లవాడిని గమనించుకుంటూ, ఆ బాధని దిగమింగుకుంటూనే రికార్డుల మోత మోగించింది. ఈ సందర్భంగా ఆమె భర్త ఆన్లర్ కామ్ అందించిన ప్రోత్సాహం కూడా అసామాన్యం. 2011లో ఆమె ఆసియా కప్‌లో స్వర్ణాన్ని సాధించి వచ్చేనాటికి ఆమె పిల్లవాడికి ఆపరేషన్ కూడా విజయవంతంగా పూర్తయ్యింది.

ఇంతటితో చరిత్ర ముగిసిపోలేదు. 2012లో ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన తొలి భారత మహిళగా రికార్డు నెలకొల్పడమే కాదు, ఆ ఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని సాధించి తన పతకాల రికార్డుని మరింత పదిలం చేసింది. మేరీకోమ్ ప్రతిభను గమనించిన కీర్తి ఆమె వెంటపడింది.

భారత పద్మము, పద్మవిభూషణ్ వంటి ప్రతిష్టాత్మక పురస్కారాలు ఎన్నో ఆమెను వరించాయి. మేరీకోం జీవిత చరిత్ర ఆధారంగా 2013లో 'అన్‌బ్రేకబుల్' అనే పుస్తకాన్నీ, ఆ పుస్తకం ఆధారంగా ప్రియాంక చోప్రా ముఖ్యపాత్రతో చలనచిత్రాన్ని రూపొందించారు.

మేరీకోం ప్రతిభను, పోరాట పటిమను గమనించిన కేంద్ర ప్రభుత్వం ఆమెను రాజ్యసభకు ఎంపికచేసింది. అయినా మేరీకోం ప్రస్థానం ఇక్కడితో ఆగేట్లు లేదు. బ్రెజిల్లో జరగనున్న ఒలింపిక్స్‌లో అర్హత సాధించడం మీదే ఆమె దృష్టంతా!

పిల్లలూ... చూశారు కదా! Time Pass కోసమై ఆటలు ఆడితే చమటే పడుతుంది. Time ఇచ్చి ఆటలు ఆడితే మన చేవను దేశమే గుర్తించే స్థాయికి ఆట తీసుకుని వెళ్తుంది.

# 17. స్మార్ట్ ఫోన్



## సమస్య:

*అయ్యో! నా చేతిలో ఫోన్ వుండటమే ఒక శాపం అయింది. అది చేతిలో ఉంటే నా చుట్టూతా ఏమి జరుగుతుందో కూడా తెలియడం లేదు. నా చేతిలో ఉన్న మరో ప్రపంచంలో పడి ఇక అసలు చదువు కోవడం అవటం లేదు. ఒక వేళ ఇంట్లో వాళ్ళు వద్దని చెప్పినా విసుగు వస్తున్నది. బలవంతంగా నా చేతుల్లో నుండి ఫోన్ ఎవరైనా లాక్కుంటే వాళ్ళను చంపేద్దాం అన్నంత కోపం వస్తుంది. స్కూల్‌కి తీసుకుని రాకూడదన్న నిషేధం వున్నా సరే...ఎవరికీ తెలియకుండా నేను ఫోన్‌ను నాతో పాటు తీసుకుని వెళ్తున్నాను. గంటలు రోజులు ఎలా కదిలి పోతున్నాయో తెలియదు. నేనెలా నన్ను నేను నియంత్రించుకుని చదవాలి...చెప్పండి.*

## వివరణ:

ప్రపంచములో 20 వ శతాబ్దపు అత్యద్భుత ఆవిష్కరణ Smart Phone. నాకు ఇంకా గుర్తు, ధీరూభాయి అంబానీ సుమారు 2 దశాబ్దములకు ముందు తమ కంపెనీ నుండి విడుదల చేయబోతున్న Relience Phone గురించి చేసిన ప్రకటన... "కర్లో దునియా ముట్టి మే" దాని అర్థం ప్రపంచాన్ని మన పిడికిలిలో పెట్టేద్దాం అని. కానీ ప్రపంచాన్ని మన పిడికిలిలో పెట్టేది అటుంచితే మన ప్రపంచమే తనదిగా మార్చి వేసింది స్మార్ట్ ఫోన్. ఇంకా చెప్పాలంటే మనలనే తన గుప్పిట్లో పెట్టేసింది. ఇది మనమందరం ఒప్పుకోవాల్సిన

సత్యము. ఒకానొకప్పుడు వీధి మొత్తానికి ఒకటో రెండో ఫోన్లు వుండేవి. మిగితా ఇళ్ల వాళ్లకు ఆ ఫోన్ ఉన్న ఇల్లు ఒక్కటే ఒక న్యూక్లియస్‌గా వుండేది. తమకు కావాల్సిన వాళ్లకు మాత్రం...ఆ ఫోన్ నంబర్ ఇచ్చి PP నంబర్ అని చెప్పే వాళ్ళు. అంటే ఒక వేళ ఫోన్ చేస్తే ఆ ఇంటి వాళ్ళతో బహు మర్యాదతో మాట్లాడి... వాళ్లకు కావాల్సిన వ్యక్తిని పిలవమని చెప్పి ఫోన్ పెట్టేసి కాసేపు తరవాత ఫోన్ చేసి అప్పటికే సిద్ధంగా వేచి ఉన్న తమ బంధువులతో చాలా క్లుప్తంగా మాట్లాడి పెట్టేసే వాళ్ళు. అంటే కేవలం సమాచారం ఇచ్చి పుచ్చు కోవడానికి మాత్రమే ఉపయోగించే వాళ్ళన్న మాట. ఎప్పుడైనా రాత్రి ఎవరైనా ఫోన్ చేస్తే గుండెలు గుభేల్ మనేవి తెలుసా... ఎవరికైనా ఏమన్నా అయిందో ఏమో అని వణుకుతూ పరిగెత్తిన ఇంట్లో పెద్దలను నేను స్వయంగా చూసాను. ఇది 50 ఏళ్ల క్రితం మాట. మీకు తమాషాగా వుంది కదా పిల్లాలూ.

తరవాత ప్రతి ఇంట్లో ఫోన్ వచ్చేసింది. ఆ ఫోన్‌లో వున్న అవతలి వ్యక్తితో మాట్లాడటానికి నాకు కావాలంటే నాకు ఫోన్ కావాలని కొట్టుకొనే వాళ్ళం.

అనతి కాలంలో మొబైల్ విప్లవమని మన జీవితాల్ని అత్యంత ప్రభావితం చేసిన మొబైల్ ఫోన్ వచ్చేసింది. సుమారు 20 సంవత్సరాల క్రితం చాలా సాదాసీదాగా వచ్చేసి మనలను మన జీవితాలను చాలా సులభంగా ఆక్రమించి... ఇప్పుడొక దయ్యంలా మనల్ని పట్టి పీడుస్తున్న ఒక మహమ్మారిగా మారింది. చాలా ఇళ్ళల్లో ఉన్న వాళ్ళకు...ప్రధానంగా పిల్లలకు.

అతి సర్వత్రా వర్జయేత్ అన్నట్లు...ఏదైనా నియంత్రణలో వుంటేనే బాగుంటుంది. అతిగా చేసేది ఏదైనా సరే మనలను నాశనం చేస్తుంది. అదే జరుగుతోంది మొబైల్ ఫోన్ల వలన. ఇంట్లో ఒక మొబైల్ వుంటే బాగుండు అన్నస్థాయి నుండి ఇంట్లో ఉన్నవాళ్ళందరికి స్మార్ట్ ఫోన్లు వచ్చేశాయి. ఇప్పుడు ఇంట్లో నలుగురు ఉంటే 6 ఫోన్లు వుంటున్నాయి. ఇక దీని దుష్ప్రభావం వలన మన అందరి జీవితాలు వికారము... విషమయము... వినాశము... వైపుగా పయనిస్తున్నాయి.

ఇవి పెద్దలను మాత్రమే కాదు... పిల్లల్ని పట్టి పీడించే వ్యసనములుగా మారి జీవితాలను ఛిద్రం చేస్తున్నాయి. చాలా క్లిష్టమయిన సమస్య... జాగ్రత్తగా దీని నుండి బయటపడకపోతే చాలా దుష్పరిణామాలు సంభవిస్తాయి.

స్మార్ట్ ఫోన్‌ను డాక్టర్ చేతిలో కత్తి లాగా లేదా పిచ్చోడి చేతిలో కత్తిలా చెప్పొచ్చు. కాబట్టి పిల్లాలూ! మీరు కాస్త స్వీయ నియంత్రణ పాటిస్తే తప్ప ఈ మహమ్మారిని మనం జయించలేము. దీనిని మన నియంత్రణలో పెట్టక పోతే ఇది ఆ మధ్య కాలంలో మనం ఎదుర్కొన్న కరోనా కంటే కూడా వేయి రెట్లు భయంకరమైన వైరస్‌గా మారుతుంది. మనలను బ్రతికి ఉండగానే జీవచ్ఛవాల లాగా చేస్తుంది.

ఆ మధ్య సమాచార పత్రికలలో చూశాను. తల్లి తండ్రులు మొబైల్ ఫోన్ కొనివ్వలేదని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న విషయం.

మొబైల్ ఫోన్ ద్వారా తోటి స్నేహితులను అసభ్యకరముగా చిత్రీకరిస్తూ దొరికిపోయాడు మరో విద్యార్థి.

మొబైల్ ఫోన్లలో చూడకూడని విషయాలు చూస్తున్న వాళ్లలో ఎక్కువ శాతం టీనేజ్ పిల్లలే అన్నది సర్వేలు చెప్తున్న విషయం.

అన్నం తిననని మారాం చేసే అతి చిన్న పిల్లాడికి చేతిలో మొబైల్ పెడితే వాడు ఇక మైకంలో ఉన్నట్లు దాన్ని చూసుకుంటూ అన్నం తినటము మనమూ చూస్తున్నాము.

ఏదైనా పని మొదలు పెట్టేటప్పుడు కీడెంచి మేలెంచమని చెప్తారు కదా పెద్దలు... అందుకే మొదట ఇలా దుష్ప్రభావం గురించి చెప్పాను పైన.

ఇప్పుడు కొన్ని మంచి సూచనలు చూద్దాము. చదివే

## కంపాస్

పిల్లలు స్మార్ట్ ఫోన్‌ని ఏ విధంగా తమను తాము తీర్చి దిద్దుకోవడానికి ఉపయోగించడానికి వీలుందో తెలుసుకుందాం

### సూచనలు:

*1. అసలు 10 వ తరగతి అయ్యే దాకా చేతిలో ఫోన్ అవసరం లేదు. ఈ నిర్ణయం మీరు తీసుకో గలిగితే మీకంటే గొప్ప వాళ్ళు ఇక వుండరు.*

*2. ఒక వేళ ఫోన్ చేతిలో వుంటే...నియంత్రణ మీరే పెట్టుకోవాలి.*

*3. చదివే సమయంలో, లైబ్రరీలో వున్నప్పుడు, పాఠశాలలో ఉన్న సమయంలో మొబైల్‌కి దూరంగా ఉండండి. వీలయితే Aeroplane Mode లో వుంచండి. ఇంట్లో వాళ్లకు కూడా ఆ విషయం చెప్పండి.*

*4. స్మార్ట్ ఫోన్‌ను మీరు చదువుకి, వృత్తికి సంబంధించిన విషయాలు నేర్చు కోవడానికి ఉపయోగించండి.*

*4. ఏది చూడవచ్చో / చూడకూడదో, ఏది వినవచ్చో / వినకూడదో / ఎంత మోతాదులో మాట్లాడవచ్చో / మాట్లాడకూడదో... కాస్త ఆలోచించి నిర్ణయం చేయండి.*

*5. నిగ్రహమే మిమ్మల్ని మంచి విగ్రహంగా తయారు చేస్తుంది. అది లేకుంటే ఇక మిమ్మల్ని ఏ గ్రహమూ బాగు చెయ్యలేదు.*

*6. సాధ్యమైనంతగా మీరు చదివే పాఠాల గురించిన విశేషాలు తెలుసుకోండి.*

*7. సామాజిక మాధ్యమాల్లో 18 ఏళ్ల దాకా ఎంత తక్కువగా వుంటే చదువు తలకు అంత ఎక్కువగా ఎక్కుతుంది.*

### ప్రేరణ మంత్రం:

*While using Smart Phone...Just think who is SMART? Is it you? Or is it Phone? and then use it.*

*If you are a SMART Student, Be*

***S**pecific to your usage*
***M**aintain distance, when studying*
***A**ware of consequences of misuse*
***R**ight things to be done with phone*
***T**imely usage of phone is needed*

### ఇంకొన్ని జాగ్రత్తలు:

1. చిన్నపిల్లలకు ఖాళీ సమయం దొరికితే, ఫోన్‌కు బదులు కార్టూన్లతో కూడిన హాస్యం లేదా నీతి కథల పుస్తకాలు చూపించి చెప్పటమో లేక చదివించే ప్రయత్నమో చేయాలి.

2. చిన్నపిల్లలకు ఫోన్ ఇచ్చేటప్పుడు youtube ని block చేసి, youtube kids ని download చేసి Parent lock పెట్టి ఇవ్వడం మంచిది.

3. పెద్దపిల్లలు smart phoneకి addict అవుతున్నారు అనిపించినప్పుడు, వారి ఇష్టాలను అభిరుచులను గుర్తించి, వాటిని ప్రోత్సహించండి. డబ్బు ఖర్చు అవుతుండవచ్చు, కానీ డబ్బు గురించి ఆలోచిస్తే పిల్లలే పాడైపోతారు అని తెలుసుకోండి.

4. తల్లిదండ్రులకు పిల్లలకు మధ్య వచ్చే గ్యాప్‌ని smart phone పెంచుతుంది. కావున పెద్దపిల్లలను వీలైనంతవరకు తమదగ్గరలో వుండే విధంగానో లేక, తమతో తీసుకెళ్ళే ప్రయత్నమో చేయండి. అప్పుడు మీ మధ్య ప్రేమ చిగురించి... మంచి మిత్రులవుతారు.




అంటే, టెక్నాలజీ కత్తి లాంటిది, ఫలాలు కోసి తినొచ్చు లేదా మనల్ని మనం పొడుచుకోను వచ్చు. ఎలా ఉపయోగిస్తే బాగుంటుంది అనేది మన చేతిలోనే ఉంది.

అయితే ఇక్కడ చాలామంది అడిగే ప్రశ్న ఏమిటంటే? మేము టెక్నాలజీని దూరం పెట్టుకొని అవసరం వచ్చినప్పుడే వాడుదాం అనుకుంటాం కానీ అనుకోకుండా దాన్ని అవసరానికి మించి వాడుతూ ఉంటాము సమయాన్ని వృధాచేస్తూ ఉంటాము అని అంటారు. దీనికి పరిష్కార మార్గం ఏమిటంటే మీరు చదువుకునేటప్పుడు మీ ఫోను వీలైనంత దూరంగా పెట్టడం లేదా సైలెంట్లో లేదా స్విచ్చాఫ్ లో పెట్టడం చేస్తూ ఉండాలి. అలా మీకు మీ మొబైల్ కి దూరాన్ని పెంచుకుంటూ పోతూ ఉండాలి. అవసరం వచ్చినప్పుడు మాత్రమే దాన్ని తీసి వాడే ప్రయత్నం చేస్తూ ఉండాలి.

## స్ఫూర్తి:

2018 లో ప్రకటించిన సివిల్ సర్వీసెస్ ఫలితాలలో 'జునిద్ అహ్మద్', మూడవ ర్యాంక్ సాధించాడు. అతని మొబైల్లో వున్న ఇంటర్నెట్ సౌకర్యంతో యూట్యూబ్‌లో సబ్జెక్టుకు సంబంధించిన వీడియోలు చూడడం మరియు గూగుల్‌లో సబ్జెక్టును వెతికి చదువుకోవడం మొదలగునవి తనకు మంచి ర్యాంకు రావడంలో దోహదపడ్డాయి అని చెప్పాడు.



# 18. ఇంట్లో గొడవలు



## సమస్య:

సార్, మా ఇంట్లో అమ్మ నాన్న ఎప్పుడూ గొడవ పడుతుంటారు. పోట్లాట మాటలతో మొదలై కొట్టు కోవడం దాకా వెళ్తుంది. ఇంట్లో భయోత్పాత వాతావరణం ఉంటుంది. ఏదో చదివి బాగుపడదాం అని అనుకునే మాలాంటి పిల్లలకు ఇది ఒక శాపం. అసలు ఇంట్లో మనశ్శాంతి వుండదు. ఇంట్లో పెద్దవాళ్ళు చదువుకోలేదు. చదువు విలువ తెలియదు. చదువుకున్న తల్లిదండ్రులు కూడా గొడవలు పడుతూ దెబ్బలాడుకుంటూ ఉంటారు.

అన్ని వున్నా అల్లుడి నోట్లో శని అని... తల్లిదండ్రులకు ఆర్థిక ఇబ్బందులు లేవు. బాగా ఉన్న కుటుంబం అయినా ఏదో ఒక గొడవ. ఈగోలకు పోయి మాటకు మాట అనుకుని ఎడముఖం పెడ ముఖం పెట్టి ఇంట్లో వాతావారణాన్ని కలుషితం చేస్తారు.

నేను చదువుకోవాలని కూర్చున్న మరుక్షణం ఎవరో ఒకరు ఏదో ఒక పని చెప్పడం, చేయను అంటే పెద్ద రాద్ధాంతం చేయడం దాని వలన నాకు మనసు విరిగి పోవడం ఇలా తరచుగా జరిగి నాకున్న ఆత్మ స్థైర్యాన్ని దెబ్బ తీస్తున్నాయి. నేనేమి చేయాలి?

## వివరణ:

ఇంట్లో గొడవను ఈశ్వరుడైనా తీర్చలేడు అంటారు. పిల్లలు మీరేమి చేయగలరు. ఇంట్లో గొడవలకు సాధారణంగా ఆర్థిక కారణాలు, మనస్పర్థలు, వ్యసనాలు, ఆస్తి గొడవలు, నేనే గొప్ప అనే అహంకారం ఇలా ఎన్నో కారణాలు! ఇంట్లో గొడవలు తప్పక పిల్లల చదువుల మీద ప్రభావం చూపుతాయి. ఇంకా చెప్పాలంటే వాళ్ళ జీవితాల మీద మరియు ప్రవర్తన మీద ఎంతో దుష్ప్రభావం చూపుతాయి.

తల్లి తండ్రులు బీదైనా లేక సాదైనా వాళ్ల మధ్య వచ్చే గొడవలు తప్పక చదువుకునే పిల్లల మనసును గాయ పరుస్తాయి. చదివే పిల్లలున్న ఇళ్లల్లో గొడవలు లేని ప్రశాంత వాతావరణం పిల్లలకు ఇవ్వగలిగితే అదే పెద్ద మేలు అవుతుంది. తల్లిదండ్రుల మధ్య అన్యోన్యత, పరస్పర ప్రేమానురాగాలు ఇవి గనుక ఉంటే పిల్లలకు ఆ ఇల్లే ఒక సరస్వతీ నిలయంగా ప్రకాశించగలదు.

తల్లిదండ్రులు ఎందుకు గొడవ పడుతున్నారు వాళ్ళను ఎలా కట్టడి చేయాలన్నది మనం ఇక్కడ చర్చించలేము. కానీ సమస్యలు పిల్లల ద్వారా వచ్చాయి కాబట్టి కొద్దిగా చర్చించాల్సి వచ్చింది. కొన్ని సూచనలు మాత్రం తప్పక ఇద్దరికి చేయాలి.

మొన్నా మధ్య, హైదరాబాద్ కు దూరంగా వున్న ఒక గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో వున్న 10 వ తరగతి విద్యార్థులకు ప్రొద్దున్నే ప్రత్యేక తరగతుల కోసమై ఒక 3 మాసాలు బ్రేక్ ఫాస్ట్ సర్వ్ చేశాము, అభయ ఫౌండేషన్ ద్వారా. ఆ క్రమంలో విద్యార్థులతో, ఉపాధ్యాయులతో చాలా సార్లు ముచ్చటించాను. వాళ్లకు 10 వ తరగతి పరీక్షలు రేపు మొదలవుతాయి అనంగా... నాకు ప్రధానోపాధ్యాయుడు ఫోన్ చేసాడు. సార్ ఒక అమ్మాయి బాగా చదువుతుంది. ఇంట్లో తన అమ్మ నాన్న తరచుగా కొట్లాడుతుంటారు. వాళ్ళ నాన్న ఇంట్లో ఉండటం లేదు. నిన్న వచ్చి వాళ్ళ అమ్మతో గొడవ పడి ఆ అమ్మాయిని పరీక్ష రాయక్కర్లేదు అని తీసుకుని వెళ్ళాడు అని చెప్పి నా సలహా అడిగారు. నేనేమి చెప్పాలో అర్థం కాలేదు. ఆలోచించి పోలీస్‌కు చెప్పమని చెప్పాను. అయినా వాళ్ళ జీవితములోకి ఇంకెవరైనా ఎలా ప్రవేశించగలరు?

మరో స్నేహితుడు. చాలా డబ్బులున్న వాళ్ళు. పెళ్ళై సుమారు పాతిక సంవత్సరాలు అయింది. ఇద్దరు బిడ్డలు. ఒక పాప ఇంజినీరింగ్ ఇంకో పాప 10 వ తరగతి. ఉన్నట్టుండి తల్లిదండ్రుల మధ్య తీవ్రమైన మనస్పర్థలు వచ్చాయి. ఇద్దరు పిల్లలు జీవితంలో అతి ప్రధానమైన మలుపులో వున్నప్పుడు ఈ క్లిష్టమైన సమయం వచ్చింది. ఇక ఆలోచించండి...తప్పు తల్లిదా లేక తండ్రిదా అన్న విషయం ప్రక్కన పెడితే...పిల్లల మీద ఎంత ప్రభావము చూపిస్తుందో ఇలాంటి విషయం. ఎవరైనా ఏమైనా చెప్పడానికి అవకాశం వుందా? చెప్పినా వాళ్ళిద్దరి మధ్య అగాధం పెద్దగా మారుతుంది తప్ప దగ్గర కాలేదు. తల్లేమో పుట్టింట్లో, ఒక అమ్మాయి కాలేజి హాస్టల్‌లో... ఇంకో అమ్మాయి తల్లి దగ్గర... తండ్రేమో ఏ దిక్కు లేకుండా తన ఇంట్లో. ఇప్పుడు ఆలోచించండి... ఆ పిల్లల భవిష్యత్తు ఎలా వుంటుందో?

ఒక దేశ భక్తుడిగా నేను చెప్పగలిగింది ఒక్కటే... తల్లిదండ్రులకు. మీరు పిల్లల్ని కంటే మాత్రం ఒక ఆదర్శ దంపతులుగా జీవించండి. వాళ్లకు తల్లి తండ్రి ఇద్దరి ప్రేమలు సమపాళ్లలో అందించండి. అప్పుడు వాళ్ళు మొదట ఇంట గెలుస్తారు. ఆ తరువాత బయట గెలవడానికి శక్తి కూడగట్టుకుంటారు.

## సూచనలు:

**తల్లిదండ్రులకు**

1. ఇంట్లో పిల్లలున్నప్పుడు సంయమనం పాటించండి.
2. పిల్లలు చిన్న వారైనా చాలా సునిసితముగా గమనిస్తారు అని తెలుసుకోండి.
3. పిల్లల ముందు సరదాగా, ప్రేమగా వుండండి.
4. వాళ్ళ భవిష్యత్తు మీ చేతుల్లోనే వుందని గుర్తించండి.
5. వాళ్ళను కట్టడి చేసే స్థాయిలో మీరుండాలి తప్ప వాళ్ళు మీరు పోట్లాడుతుంటే కట్టడిచేసే స్థాయిలో ఉండొద్దు.
6. వీలయితే కౌన్సెలింగ్ తీసుకోండి.
7. అసలు ఇద్దరి మధ్య పొసగటం లేదు అనుకుంటే పిల్లలకు నిజాయతీగా వివరించి విడిపోవడం మంచిది.

**విద్యార్థులకు**

1. ఇంట్లో ఘర్షణ వాతావరణం వుంది అని గ్రహించి నప్పుడు... ఎక్కువ సమయం స్కూల్‌లో గడపండి.
2. ఒక వేళ అది కుదరకపోతే తల్లికో, తండ్రికో చెప్పి గ్రంథాలయంలోనో, స్నేహితుల ఇళ్లలోనో, బంధువుల ఇళ్ళల్లోనో చదువుకోవడం చేయండి.
3. అదీ కుదరని సమయంలో, విద్యాలయాలకు అనుబంధంగా వసతి గృహాలుంటాయి. అందులో చేరండి.
4. మీ దగ్గర డబ్బులు లేకుంటే, స్వచ్ఛంద సంస్థల సహకారము తీసుకోండి.
5. సాధ్యమని అనిపిస్తే అమ్మ నాన్నల మధ్య సయోధ్యకు ప్రయత్నం చేయండి.
6. ఏది ఏమైనా చదువును మాత్రం నిర్లక్ష్యం చెయ్యవద్దు. అందరూ తల్లిదండ్రుల సహకారంతో చదివే దానికంటే కూడా రెట్టింపుగా చదివే ప్రయత్నం చేయాలి... ఇంట్లో పరిస్థితుల కారణంగా.
7. మీకు డబ్బుతో ఇబ్బంది అయితే అమ్మమ్మ లేక నానమ్మల దగ్గరికి వెళ్లి అక్కడ వాళ్ళ ఆశ్రయంలో కొన్ని మాసాలు ఉండండి.

# 19. సమయ పాలనము లేదు




## సమస్య:

*నేను ఎన్నో విధాలుగా చదవాలని ప్రణాళిక రచిస్తాను. కానీ నాకు తెలియకుండానే ఉన్న సమయం అంతా మంచులా కరిగి పోతుంటుంది. సమయ పాలనము చేయలేక పోవడంతో నేను చాలా సందర్భాల్లో చేయాల్సింది చేయలేక పోతున్నాను. ప్రధానంగా సమయం మీద నియంత్రణ లేక పోవడంతో చదువులోను...జీవితంలోనూ చాలా కోల్పోతున్నాను. నేను ఏమి చేయాలి?*

## వివరణ:

సమయం అన్నది భగవంతుడు. ఆ సమయాన్ని మనం ఎంత చక్కగా ఉపయోగించుకో గలిగితే, అంత చక్కగా జీవితం ఉంటుంది. కాలం ఎవరికోసం ఆగదు, తన పాటికి తను కదులుతూ ముందుకు సాగుతుంటుంది. అది మన కోసము నిలబడదు... మనమే దానితో పరిగెత్తాలి. కారణము, మనిషి జీవితం అంతా కాలంతో ముడిపడి వుంది. ఆ ముడిని విప్పడం ఎవరితరం కాదు. కావున పిల్లలూ సమయాన్ని మనము జాగ్రత్తగా వినియోగించుకోవాలి.

సమయంతో పోటీ పడటమొక్కటే మనము చెయ్యాలి, జీవితములో ఏదైనా సాధించాలంటే. రోజుకు 24 గంటలు అని తెలుసు కదా? మరి ఆ సమయాన్ని

మనము ఎంత వరకు చదువు కోసం కేటాయిస్తే విజయావకాశాలు అంత పుష్కలముగా వుంటాయి. మనము సమయ పాలనమునకు ఇచ్చే గౌరవాన్ని బట్టి మన జీవితానికి గౌరవం సిద్ధిస్తుంది. ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన వ్యక్తుల జీవితాలు ఒక సారి పరీక్షించండి... అందరిలో వుండే అద్భుత లక్షణాలలో ఒక్క లక్షణం ఖచ్చితంగా సమయ పాలనము అవుతుంది.

ఈ ప్రపంచంలో సమయ పాలన పాటించిన వారే విజేతలుగా ఎదిగారు. వారు జీవితంలో తమకు లభించిన అనేక అవకాశాలను చేజిక్కించుకుని ఉన్నత స్థానానికి వెళ్ళారు. దూరంగా...సుదూరంగా కనిపించని మసక వెలుతురు కన్నా చేతికి అందేంత దగ్గరలో చిరుదివ్వెలా ఉన్న అవకాశాల్ని వినియోగించుకోవడమే విజ్ఞుల కర్తవ్యం. ప్రస్తుతమే ప్రధానం. మిగిలినవన్నీ అప్రస్తుతమే. సమయ పాలనే మార్గం. అదే ఏ మనిషికైనా ముఖ్యం. ఇంతకు మించి విజయసాధనకు రహస్య మేమీ లేదు.

మీ మొత్తం మేధస్సును, ఉత్సాహాన్ని, ధైర్యాన్ని కూడగట్టుకుని పెట్టుబడిగా పెట్టి ఏరోజు చేయవలసిన పనిని ఆ రోజు చిత్తశుద్ధితో చేయడమే. అలా పూర్తి చేస్తే మానసిక ఆనందం లభిస్తుంది. దీని కోసం మీరు చిన్న చిన్న లక్ష్యాలను నిర్ణయించుకోండి. ఒకే సారి ఈ ప్రపంచాన్ని మార్చేస్తామని, ఏదో జరుగుతుందని ఊహాలోకాల్లో విహరించవద్దు. చిన్న చిన్న లక్ష్యాలను పూర్తి చేసి క్రమంగా ఆత్మ విశ్వాసాన్ని పెంచుకోండి.

సాధారణంగా ఒక పని మనసులోకి రాగానే దానిని చేయాలని తలపెడ్తాం. మరో గంటలో మన మనసు మరో పని గురించి ఆలోచిస్తుంది. మొదట నిర్ణయించుకున్న పనిని వదిలేసి మరో పని వెంట పడ్తాం. వెంట వెంటనే నిర్ణయాలు మార్చుకున్నందువల్ల ఏ పనీ కాదు. పైగా సమయం చాలా వృధాఅవుతుంది. అందువల్ల తలపెట్టిన ఒక పనిని క్రమం తప్పకుండా క్రమశిక్షణతో చేసుకుంటూ పోతే విజయం వరిస్తుంది.

ఒక పని గురించి నిర్ణయించుకున్నప్పుడే, అన్ని విషయాలనూ పరిగణనలోకి తీసుకోవాలి. మన మనసునూ అదుపులో ఉంచుకోవాలి. దానిని అటూ ఇటూ గెంతనియ్యవద్దు.

ప్రణాళికాబద్ధంగా చేసుకునే పనులతో ప్రగతి చేతికి అందుబాటులోకి రావడమే కాకుండా సమయం వృధా కాదు. రోజువారి జీవనం నానాటికీ వేగవంతమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతిపనికి ప్రణాళిక అవసరం. అంతేకాకుండా ప్రణాళికాబద్ధంగా చేసే పనులు మాత్రమే మనకు సమాజంలో ఒక గుర్తింపును తీసుకు వస్తాయి. అంతేకాకుండా మన విలువైన సమయాన్ని వృధా చేయకుండా ఉండేందుకు మీ ఇంట్లోని కుటుంబ సభ్యులకు మీరు చేయవలసిన పనులను గురించి తెలియ చేయండి. అప్పుడు మిమ్మల్ని వారు ఇబ్బంది పెట్టరు.

అన్ని పుస్తకాలను మీరు ఒకేసారి చదువలేరు. కానీ చదవాలన్న ఆత్రుత తో మీరున్న గది నిండా చిందర వందరగా పుస్తకాలను పరచి వుంటారు కదా. అంతేకాకుండా కావాల్సిన పుస్తకం ఎక్కడో మర్చిపోయి దాని కోసం గంటల తరబడి వెతుకుతారు. ముఖ్యంగా పుస్తకాలు పెట్టుకునేందుకు ప్రత్యేకంగా ఒక స్థలాన్ని నిర్ణయించాలి. అప్పుడు ఏది అవసరమో అది తీసుకుని చదవవచ్చు.

ఎక్కడైనా వరసలో నిలబడవలసిన చోటికి, వెయిట్ చేయవలసిన చోటికి వెళ్ళేటపుడు ఖాళీ చేతులతో వెళ్లకుండా, ఏదైనా పుస్తకం తీసుకెళితే చక్కగా చదువుకోవడం కోసం సమయం లభిస్తుంది. మీకు సమయం వృధా కాదు. ఈ ప్రపంచంలో దేన్నైనా పొందగలమేమోకాని గడిచిన సమయాన్ని మాత్రం తిరిగి పొందలేం. మనకు ఎదురవుతున్న సమస్యలను దేవుడో, కర్మ సిద్ధాంతమో ఇచ్చినట్లు తప్పును ఎవరి మీదకో నెట్టేసి, పలాయన వాదంతో బ్రతకడం వల్ల ప్రయోజనం, ఫలితం లభించదు.

పిల్లలూ మనము సమయపాలనము ఖచ్చితంగా పాటించడం అన్నది కేవలం 10 వ తరగతిలో మొదలు పెడితే మొదటికే మోసం అవుతుంది. సమయపాలనము అన్నది అతి చిన్న వయసు నుండే పాటించాలి. అది అతిసహజమవ్వాలి. అప్పుడు అది మనకు ఒక ఆయుధంగా ఉపయోగపడుతుంది. తల్లిదండ్రులు కూడా పిల్లలను తగిన విధంగా ప్రోత్సహించండి.

## సూచనలు:

*1. సమయ పాలనము అన్నది కేవలం చదువుకు సంబంధించింది కాదు. అది మన జీవితానికి సంబంధించినది.*

*2. నిద్ర లేవడం నుండి రాత్రి పడుకునే దాకా ఒక దైనందిని (డైలీ షెడ్యూల్) తయారు చేయండి.*

*3. మీకు మీరు స్వీయ నియంత్రణతో...క్రమ శిక్షణతో సమయపాలనము చేయండి.*

*4. చదువు కోసం కనీసం 6 గంటలు అయినా సమయం ఇవ్వండి*

*5. ఆరు నూరైనా... అటు సూర్యుడు ఇటు పొడిచినా... మీ నిర్ణయాలను మార్చు కోవద్దు.*

*6. మనకు తెలియకుండానే వృధా అయ్యే సమయం ఎక్కడో గుర్తించండి...(నిజానికి అదేమి పెద్ద బ్రహ్మ విద్య కాదు) సమయాన్ని పూర్తిగా తినివేసే బ్రహ్మ రాక్షసులు ఎవరు అన్నది జగ మెరిగిన సత్యం...టివి, మూవీ, ఆటలు, ముచ్చట్లు, ఫోన్లు, సంగీతం ఇత్యాదులే కదా...వాటిని మీరు దూరం పెట్టండి.*

*7. అమ్మాయిలు కాస్త తమ స్వీయ అలంకరణ కోసం కూడా కొంత సమయాన్ని తెలియకుండానే వృధా చేస్తున్నారేమో గమనించండి.*

*8. ఆటలను ఆటవిడుపు కోసం ఉపయోగించు కోవాలి తప్ప వాటికి మన జీవితముతో అటాడుకునే అవకాశం ఇవ్వద్దు.*

*9. ఇంట్లో పెద్దలకు మీ సమయపాలనము గురించి వివరించి వాళ్ళ సహకారం తీసుకొండి.*

## ప్రేరణ మంత్రం:

*Lack of direction, not lack of time, is the problem. We all have twenty-four hours in a day*

## స్ఫూర్తి:

ఒక విషయం గుర్తుంచుకోండి పిల్లలూ... ఎంత కష్టం అయినా సరే జీవితములో సమయపాలనమును ఒక లక్షణముగా చేసుకోండి. ఇప్పుడు నా జీవితంలో సమయపాలనము విషయంలో అత్యంత ప్రభావితము చేసిన ఒక వ్యక్తి గురించి చెప్తున్నాను.

వీరిని నేను గత పాతికేళ్ళ నుండి ఎరుగుదును. దక్షిణ భారత దేశములో పేరెన్నికగన్న వృత్తి నిపుణుడు. చాలా యుక్త వయసులోనే అద్భుతమయిన చదువులు చదివారు. సమయానికి తనకు తాను ఇచ్చుకునే దానికంటే కూడా ఎక్కువ విలువని ఇస్తారు. వారు ఒక ప్రక్క వృత్తిపరమైన పని చేస్తూ కూడా వందల మందికి బోధనా తరగతులు నిర్వహిస్తారు.

నేను, ప్రత్యక్షంగా వారి తరగతిలో ఒక విద్యార్థిగా చూసింది చెప్తున్నాను. ఆరు నూరైనా వారు తరగతికి లేట్‌గా వచ్చింది నేను చూడలేదు. 7 గంటలకు క్లాస్ అవుతే, 5 నిముషాలు ముందుగానే వచ్చి తరగతి గదిలో వుండే వారు. లేట్‌గా వచ్చే వారికి ఒక చెంప పెట్టులా వుండేది. అసలు వర్షం పడిన రోజుల్లో కూడా వారు ఆలస్యంగా రావడము నేను చూడలేదు. తన గొంతు నెప్పి, మెడ నెప్పి, జ్వరం ఇలా వారికి నలతగా

ఉన్నప్పుడు కూడా వారు తరగతికి రాకుండా వున్నది నేను చూడలేదు. అసలు ఒక వ్యక్తి ఇలాంటి స్థాయిలో వున్నప్పుడు కూడా ఇంత సమయపాలన చేయవచ్చా అన్నది వారిని చూసి నేర్చు కోవాల్సిందే.

ప్రతి రోజు ఉదయమే, 4 గంటలకు నిద్ర లేచి, నిత్య విద్యార్థిగా క్రమం తప్పకుండా పాఠాలు చదువుకుంటారని విన్నాను. ఆ తరవాత వ్యాయామం, స్నాన సంధ్యలు ముగించి, ఒక 3 గంటల పాటు విద్యా బోధన చేసి, అటు వెంటనే తన కార్యాలయమునకు వెళ్లే వాళ్ళు. ఎక్కడ కూడా సమయం వృథా చేసే వారు కాదు. ఎవరికైనా సమయం ఇస్తే ఆరు నూరైనా ఆ సమయంలో వారు వుండటం నేను చూసాను. ఒకవేళ ఏదైనా సందర్భంలో తను చెప్పిన సమయానికి వారికి ఫోన్ రావడం లేక ముందే ఉన్న సమావేశం వలన ఆలస్యం అవుతే ఎంతో నిజాయతీగా తన కోసం వేచి వున్న వాళ్ళకు సారీ చెప్పడం నేను చూసాను.



ఇంతకూ వారెవరో తెలుసా... నాలాంటి వేలమందికి విద్యాబోధన చేసి అద్భుతమయిన వృత్తి నిపుణులుగా తీర్చిదిద్ది... ఒక్కొక్కరు లక్షల రూపాయలు సంపాదించే మార్గాన్ని చూపించిన CS P S రావు, కంపెనీ సెక్రటరీ, హైదరాబాద్. వారు స్వయంగా సుమారు 500 మంది వృత్తి నిపుణులకు జీవితం ఇచ్చి వుంటారు.

ఒక విజయవంతమైన వ్యక్తి సమయ పాలనము మీద చూపించే శ్రద్ధ భక్తి ఇంతగా వుంటే... అసలు విజయం సాధించాలి అనుకునే విద్యార్థులు ఇంకెంత భక్తి శ్రద్ధలతో సమయాన్ని పూజించాలి, ఆచరించాలి అన్నది ఆలోచించండి.

మన గదిలో మంచి గడియారం ఒకటి పెద్దదిగా ఉన్నది పెట్టుకోండి. దానిని చూసినప్పుడల్లా మనకు సమయం విలువ గుర్తుకు రావాలి. దేవుడి ఫోటో కంటే మనకు ప్రధానంగా కావాల్సింది గడియారం.

గడియారము భోదించే విషయాలు ఒక్క సారి చూడండి విద్యార్థులూ. శ్రీ సత్యసాయి బాబా వారు చెప్పారు. మన సమయం మాటలలో, చేతలలో, ఆలోచనలలో వృథా చేస్తే మన వ్యక్తిత్వం ఎలా పాడవుతుందో వారి మాటలు చెప్తాయి.



# 20. వాయిదా వేస్తున్నాను




## సమస్య:

*అయ్యో! నాకున్న పెద్ద సమస్య వాయిదా వేయడం. ఎన్నో చేయాలి అనుకుంటాను... కానీ ఏదైనా సరే మొదలు పెట్టక మునుపే ఏదో ఒక కారణం చేత మళ్ళీ చేద్దాములే అనుకుంటూ... ఎప్పటి కప్పుడు వాయిదా వేసేస్తాను. ప్రధానంగా చదువు విషయంలో ఈ అలవాటు నన్ను మరింత ఇబ్బంది పెడుతుంది. ఎంతగా ప్రయత్నం చేసినా ప్రయోజనం ఉండటం లేదు.*

## వివరణ:

వాయిదా వేయడం అన్నది వంద మందిలో కనీసం 50% మందికి వుండే దుర్లక్షణం. దీని వలన విద్యార్థులు ప్రధానంగా చాలా వాటిని కోల్పోతారు. అసలు చదవడం కానీ నేర్చుకోవడం కానీ వాయిదా వెయ్యడానికి కారణాలు ఏమై వుండవచ్చు ఒక్కసారి పరిశీలిస్తాము.

1. ఇంకా సమయం వుంది అనే భావన
2. మరేదో మైమరిపించే విషయం
3. ఇంట్లో సమస్యలు మరియు కష్టాలు
4. రేపు చేద్దాములే అనే ఆలోచన
5. మనసు బాగా లేక పోవడం
6. మనసు చాలా సుఖంగా వుండటం

ఇలా కారణాలు ఏవైనా సరే, పిల్లలు చాలా సులభంగా ఎస్కేప్ బటన్ నొక్కేసి కూర్చుంటారు. క్షణికమైన విషయాలకు లోనై...ఏదైతే చెయ్యాలో దానిని గాలికి

వదిలేసి, గాలి గాళ్ళలా తయారై పోతారు. చూస్తుండగనే పుణ్యకాలం కాస్తా వచ్చేసి... మనము ఏమరుపాటుగా వున్నప్పుడు ముంచేసి వెళ్తుంది. పిల్లలూ! మీరు సాధారణంగా హిందీ పాఠాలు చదివి నప్పుడు కబీర్ దోహ చదివే వుంటారు కదా

కల్ కరేసో ఆజ్ కర్। ఆజ్ కరేసో అబ్ కర్॥
పల్‌మే ప్రళయ్ హోయేగీ। బహురీ కరేగా కబ్॥

దీని అర్థం ఏమిటంటే, అయ్యా! రేపు చేయాలి అనుకున్నది ఈరోజే చెయ్యి. ఈరోజు చెయ్యాలి అనుకున్నది ఇప్పుడే చెయ్యి. అంతే కాని వాయిదా వేయొద్దు. క్షణంలో ఏమైనా జరగవచ్చు జీవితం ఎప్పుడు ఏ మలుపు తిరుగుతుందో తెలియదు. అందుకే ఏరోజు పనులు ఆరోజే చెయ్యాలి.

నేను నా జీవితంలో నమ్మిన బలమైన సిద్ధాంతము ఇదే అని చెప్పాలి. కారణం ఏమిటంటే చిన్నప్పటి నుండి కూడా... నాకు ఒక భావన వుంది... నాకు ఊహ తెలిసినప్పటి నుంచీ అనుకుంటున్నాను. రేపటి గురించి ఆలోచించవద్దు... ఈరోజు పని ఈరోజే చెయ్యాలి అని. అందుకే ఎంత కష్టం అయినా సరే నా 24 గంటలను సంపూర్ణంగా సద్వినియోగం చెయ్యాలని తపిస్తాను. ఎంతో మంది చెప్తుంటారు నాకు...అయ్యా ఎందుకిలా ప్రతి నిముషము కౌంట్ చేసి మరీ సేవలు చేస్తుంటారు...ఇలా చేస్తే ఎక్కువ రోజులు చెయ్యలేరు కదా అని. అయితే నేను నవ్వుతూ చెప్తుంటాను బాబూ, ఎక్కువ రోజులు చేస్తానో లేదో నాకు తెలియదు...కానీ ఉన్నన్ని రోజులు తప్పక చేస్తాను. నేను ఎప్పుడు పోతానో తెలియనప్పుడు ఏరోజు సేవ ఆరోజు చేయాలి కదా. ఎన్ని రోజులు బ్రతికాము అనే దానికంటే కూడా ఎలా బ్రతికాము అన్నదే ప్రధానం.

తరవాత చాలా ఏళ్లకు రాబిన్ శర్మ పుస్తకంలో చదివాను. బుద్ధి వున్న వాడెప్పుడు ప్రతి రోజును తన చివరి రోజుగా అనుకుని పనులు చెయ్యాలంట. నాకెందుకో ఈ భావనలు మన భారతీయుల రక్తంలో అనాదిగా వున్నవి అనిపిస్తుంది.

పిల్లలూ, మీరు మహానుభావుల జీవితాలను పరిశీలించండి... వాళ్ళు తమ దైనందినిని ఎంత ప్రభావ వంతముగా తీర్చి దిద్దుకుంటారో తెలుస్తుంది. ఒక్క నిముషము కూడా వృథా చెయ్యరు. పైగా పనులను ఎప్పుడూ వాయిదా వెయ్యరు. అందుకే వాళ్ళు చరిత్రను సృష్టించ గలిగారు. ఈ రోజును మనం పరిపూర్ణముగా చదువు కోసం వినియోగించే దారి వెతుక్కుంటే ఇక రేపటి గురించి చింతించే పని లేదు.

నేను చాలా మంది పిల్లలను చూస్తుంటాను... చాలా సమయం చేతిలో వున్నప్పుడు పనికిరాని విషయాల్లో తల పెట్టి మొత్తము ప్రపంచ భారం అంతా మోస్తుంటారు. ఇక పరీక్షలు ఒక నెల లేక రెండు నెలలున్నప్పుడు వున్నకాల దుమ్ము దులిపి కూర్చున్నప్పుడు, ఇక ఎన్నో అడ్డంకులు ఎదురై చదవలేక ఫెయిల్ అయిన విద్యార్థులను చాలా మందిని చూసాను. అయ్యో! చేతిలో సమయం ఉన్నప్పుడు నేను చదవలేక పోయానే అని బాధ పడే పిల్లలను కూడా చూసాను. కాబట్టి కాలాన్ని దృష్టిలో పెట్టుకోకుండా, సద్వినియోగం చేసుకోకపోతే జీవితంలో సరిదిద్దుకోలేనంత తప్పు అవుతుంది. ఎందుకంటే గడచిన కాలం మళ్ళీ తిరిగిరాదు.

ఒకరికి జ్వరం వస్తుంది...ఇంకొకరికి ఎప్పుడు లేనిది ఇంట్లో అమ్మకు తీవ్ర అనారోగ్యం చేస్తుంది...మరొకరికి అనుకోకుండా ఇంట్లో అక్క పెళ్లి కుదురుతుంది...ఇలా గడిచిన నిమిషాలు తిరిగిరావు, వచ్చే నిమిషం మనది కాకుండ అయిపోతుంది. 10 నెలలు చదువు వాయిదా వేసి 11వ నెల పుస్తకాలు ముట్టడానికి మనసు ససేమిరా అంటుంది...ఇలా బోలెడన్ని కారణాలతో చదువు సాగదు. అందుకే ముందే జాగ్రత్త వహించి మనము ఒక సరి అయిన ప్రణాళికతో చదువు మీద దృష్టి పెట్టాలి. లేదంటే ఓటమి మన మీదే దృష్టి పెట్టి మనలను కిడ్నాప్

చేసేస్తుంది. ఆ అలవాటుతో జీవితంలో ఏమి చేసినా, ఏ ఉద్యోగం చేసినా ఆందోళన, ఒత్తిడి కలుగుతుంది. ఒత్తిడి వల్ల అతి పిన్న వయసులో BP, Sugar, గుండె సమస్యలు..మందులు. అలా ప్రతి విషయంలో ఓటమి మన మీదే దృష్టి పెట్టి మనలను క్రింద పడేసి తొక్కేస్తుంది.

## సూచనలు:

1. *చదువుకోవడాన్ని ఎప్పుడూ వాయిదా వేయొద్దు.*
2. *ఇంట్లో ఎంత కష్టం ఉన్నా సరే, విద్యార్థులు చదువుమీదనుంచి దృష్టి మరల్చొద్దు.*
3. *ఒక వేళ ఏదైనా తప్పించుకోలేనంత కారణం వలన చదువుకు భంగం అవుతే... ఆ తరువాత ఆ పోగొట్టుకున్న సమయాన్ని ఎక్కువ గంటలు చదవడం ద్వారా భర్తీ చేయాలి.*
4. *రేపు అన్నది లేదన్న భావంతోనే పిల్లలు ప్రతిరోజూ చదువుకోవాలి.*
5. *వాయిదా వేయాల్సి వచ్చింది అంటే అది ఇక మీరు పోతేనే తప్ప వేరే కారణం వలన కాకూడదు.*

## ప్రేరణ మంత్రం:

*Never do tomorrow what you can do today. Procrastination is the thief of time.*

## స్ఫూర్తి:

చాలా కాలం క్రితం జరిగిన ఒక విశేష సంఘటనను మీతో పంచుకునే ప్రయత్నం చేస్తున్నాను. ఇది హైదరాబాద్ పిల్లలుగా పిలువబడే శ్రీ సత్యసాయి బాబా వారి భక్తులైన కొద్ది మంది యువకులకు సంబంధించిన విశేషం.

సుమారు పాతిక సంవత్సరాల క్రితం హైదరాబాద్ నుండి కొద్ది మంది యువకులు సైకిళ్ళ మీద బెంగళూరు లోని శ్రీ సత్య సాయి బాబా ఆశ్రమానికి వెళ్లారు. దారిలో చేతనయిన సేవలు చేసుకుంటూ వెళ్లడం వలన బాబా గారు, వారి భక్తి విశ్వాసాలకు ఎంతో ఆనందించి, ఆ పిల్లలు ఆశ్రమంలో వున్న రోజులలో ఎంతో ప్రేమతో తమ గదికి పిలిచి మంచి విషయాలెన్నో చెప్పేవారు. అలా పిలిచిన ఒక రోజు జరిగిన విషయం ఇది.

అప్పటికే సుమారు ఒక గంటకు పైగా బాబా వారు ఆ యువకులతో మాట్లాడి... గోడ మీద గడియారం చూపిస్తూ...బంగారూ ఇక వెళ్ళండి... దర్శనానికి టైం అయింది అని చెప్పారు.

కానీ, ఆ యువకులెవరు కూడా వెళ్ళడానికి సుముఖముగా లేరు. స్వామిని విడచి వెళ్లడం భారంగా ఎంచి కదలడం లేదు. అప్పుడు బాబా వారు... పిల్లలూ మళ్ళీ రేపు పిలుస్తాను వెళ్ళండి, అని బలవంతంగా అందరిని బయటకు పంపించి వేసారు. తలుపు వేసారు. ఆ పిల్లలందరూ ఎంతో దిగులుగా నడుస్తూ బాబా మందిరం దాటుతున్నారు. అప్పుడు వెనక నుండి బాబా గారు గట్టిగా కేక వేసి ఏయ్, బాయ్స్ కమ్‌బాక్! అని పిలిచారు. చాలా సంభ్రమాశ్చర్యములతో మళ్ళీ అందరూ వచ్చి గదిలో కూర్చుంటే స్వామి వారు ఇలా చెప్పారు.

నాయనా! నేను ఒక విషయం చెప్పటం మరచాను. అది చెప్పాలని పిలచాను. మీకు ఎప్పుడైనా చెడ్డ సంకల్పము వస్తే ఎన్ని గంటలు వాయిదా వేయగలరో అన్ని గంటలు వాయిదా వేయండి. ఎన్ని రోజులు వాయిదా వేయగలరో అన్ని రోజులు వాయిదా వేయండి. ఎన్ని నెలలు వాయిదా వేయగలరో అన్ని నెలలు వాయిదా వేయండి. ఎన్ని జన్మలు వాయిదా వేయగలరో అన్ని జన్మలు వాయిదా వేయండి. అంతే కాని చెడ్డ సంకల్పాన్ని మాత్రం క్రియా రూపంలోకి తీసుకునిరావద్దు.

పిల్లలు అనుకున్నారు...ఈ విషయం బాబా గారు

మరుసటి రోజు చెప్పొచ్చు కదా...ఎందుకు శ్రమ తీసుకుని మళ్ళీ అందరిని పిలచారు అని!

బాబాగారు, ఇంకా చెప్పారు. బంగారూ, అదే ఒక్క మంచి సంకల్పము వస్తే మాత్రం ఒక్క క్షణం కూడా వాయిదా వేయొద్దు. వెంటనే చేసేయ్యండి. ఆలస్యం చేయొద్దు. అందుకే నేను మళ్ళీ రేపటికి ఈ మంచి విషయం చెప్పడం వాయిదా వేయకుండా ఇప్పుడే పిలిచి చెప్పేసాను. నాకు చాలా ఆనందంగా వుంది ఇప్పుడు అన్నప్పుడు...బాబా వారినుండి ఆ పిల్లలు జీవితానికి కావాల్సిన సత్యమును గ్రహించారు.

పిల్లలూ... అలాగే మనము చదువు కోవాలి అన్నది మంచి సంకల్పము... దానిని ఎట్టి పరిస్థితులలో వాయిదా వేయొద్దు. మిగతా విషయాలు అన్నీ ఎన్ని రోజులు వాయిదా వేసినా నష్టమేమీ లేదు.



# 21. ఏకాగ్రత లోపం



## సమస్య:

*సార్, తరగతిలో పాఠాలు భోధిస్తున్నపుడు ఏకాగ్రత లోపిస్తోంది. ఎంత శ్రద్ధగా విందామని నిర్ణయం చేసినా ఏదో ఒక కారణం చేత ఫోకస్ మిస్ అవుతోంది. ఇక చదువుదామన్నా, వ్రాద్దామన్నా అసలు ఏకాగ్రత వుండదు. చూస్తుండగానే మనసు ఏటో వెళ్లి పోతుంది. మళ్ళీ తెలివి తెచ్చుకునే సరికి క్లాస్ కూడా అయిపోయి వుంటుంది. ఏమి చెయ్యాలో అర్థం కావడం లేదు.*

## వివరణ:

ఏకాగ్రత అంటే ఒకే పని మీద చిత్తము పెట్టటం అని అర్థము. దీనినే ధ్యాస అంటారు. ధ్యాసను శ్రద్ధతో కలిపి ఏ పని చేసినా అది మన శరీరంలోని అణువణువులో చేరి జీవిత కాలం గుర్తుండి పోతుంది.

మీకు తెలుసును కదా, అర్జునుని కథ...కౌరవ పాండవులకు గురువైన ద్రోణాచార్యుడు, అందరికి అస్త్ర శస్త్రాలలో నైపుణ్యం, కౌశలం నేర్పే ప్రయత్నంలో ఒక పరీక్ష పెట్టాడు. చెట్టు మీద చిటారు కొమ్మ మీద ఒక పక్షి బొమ్మను వుంచి, తన శిష్యులందరిని పిలిచి ఒక్కొక్కరిని బాణాన్ని సంధించి పక్షి కన్నుకు గురి పెట్టమని ఆదేశించాడు.

ధనుస్సు, బాణము ఎక్కు పెట్టిన వాళ్ళను అడిగారు... నాయనా నీకు ఏమి కనిపిస్తుంది అని:
గురుదేవా, నాకు నీ పాదాలు కనిపిస్తున్నాయి!

ఆచార్యా, ఇక్కడున్న అందరూ కనిపిస్తున్నారు!
అయ్యా, చెట్టు మొత్తము కనిపిస్తోంది!
స్వామీ, నాకు చెట్టు మీదున్న పళ్ళు కనిపిస్తున్నాయి!
గురువుగారు, ప్రకృతి రమణీయంగా కనిపిస్తోంది

ఇలా చెప్తున్నారు. వారందరినీ మందలించి వారు ధనుర్విద్యకు పనికి రారు అని పక్కకు తొలగమని చెప్పారు.

ఇలా వరుసలో, అర్జునుడి వంతు వచ్చింది. అతనికి కూడా విల్లు విల్లంబు ఇచ్చి గురి పెట్టమని అదేశించి అందరిని ఆడిగినట్లే ఏమి కనిపిస్తోంది అని అడిగారు.

గురుదేవా! నాకు పక్షి కన్ను మాత్రమే కనిపిస్తోంది అని చెప్పాడు. నాయనా ఇంకా ఏమి కనిపిస్తోంది అని అడిగారు…స్వామీ, పక్షి కన్ను తప్ప నా దృష్టికి మరేదీ కనిపించటం లేదు అని చెప్పాడు. బాణం విడువ మన్నాడు. అర్జునుడు విడిచిన బాణం సరాసరి పక్షి కన్నును కొట్టింది.

ఈ కథ సాధారణంగా అందరూ వినే వుంటారు. కానీ అందరూ కథలా విని మరచిపోతారు. ఒక్కసారి ఈ కథను లోతుగా పరిశీలన చేద్దాము. అర్జునుడు సవ్యసాచి (అన్ని దిక్కులలో రెండు చేతులతో బాణాలు సంధించ గలిగిన నేర్పు వున్న వాడు అని అర్థం) గా మారడం వెనుక వున్న కారణాలను చూద్దాం…

1. అర్జునుడి చిరకాల వాంఛ ధనుర్విద్య
2. సాధించాలనుకునే పట్టుదల
3. గురువు చెప్తున్న దాని మీద శ్రద్ధ
4. చేస్తున్న పని మీద భక్తి
5. తన చూపు మొత్తము లక్ష్యం మీద
6. ఏకాగ్రమైన మనసు
7. అసాధారణమైన కౌశలం.

ఇవే కదా మనకు కనిపించే అంశాలు. ఇప్పుడు చెప్పండి పిల్లలూ, ఈ రోజు మనము ఏమి సాధించాలన్నా వుండాల్సిన లక్షణాలు ఇవే కదా. ఈ కథ నేను సమావేశాల్లో చెప్పినప్పుడు చాలా మంది ప్రభావితం అయినట్టే వుంటుంది. ఒక్కొక్కప్పుడు కొద్ది మంది పిల్లలకు సమాధాన పడే ఉద్దేశ్యం లేక అయ్యా…ఈ కథలో అర్జునుడిలా చెయ్యాలని వుండే వాళ్ళు ఇప్పుడెక్కడున్నారు? మాకు అంత శక్తి సామర్థ్యాలు లేవు అని చెప్తుంటారు.

అప్పుడు, నేను అలా అడిగిన విద్యార్థులకు మాత్రమే కాక, మిగితా అందరికీ ఉపయోగ పడే నిత్య జీవితములో జరిగే ఒక చిన్న సందర్భాన్ని ప్రస్తావిస్తూ వుంటాను. అదే ఇక్కడ కూడా మీకు చెప్తాను

మీరందరూ చాలా తరచుగా మీకిష్టమైన సినిమానో లేక టీవీ కార్యక్రమం చూస్తున్నారు అనుకుందాము. ఒక సారి మీరు కళ్ళు మూసుకుని ఆలోచించండి. ఉదాహరణకు మీరు ఆ మధ్య భారత చలన చిత్ర పరిశ్రమలోనే కాదు విశ్వ చలనచిత్ర రంగములోనే చరిత్ర సృష్టించిన బాహుబలి సినిమా చూస్తున్నారు. ఏమి జరుగుతుందో ఒక్క సారి పరిశీలిద్దాం.



1. ముందుగానే online లో టికెట్స్ బుక్ చేస్తాం

2. షో సమయం కంటే ముందే థియేటర్‌కి వెళ్తాము.
3. సినిమా పేర్ల నుండి శుభం దాకా చూస్తాము
4. మధ్యలో ఎవరైనా మీ సీటు ముందు ఒక్క నిమిషం నిలబడితే విసుక్కుంటాం
5. సౌండ్ సరిగ్గా లేక పోతే పెద్దగా కేకలు వేస్తాము.
6. పక్క వాడు 10 నిమిషాలు లేటుగా వచ్చి మనలను గిల్లి కథ అడిగితే వాడికి జస్ట్ ఇప్పుడే మొదలయింది అని చెప్పి, ఇక వాడి వైపు చూడం.
7. ప్రక్కన కూర్చుంది ప్రాణ స్నేహితులైనా సరే సినిమా మొదలు అయిన తరవాత నీ లోకం నీది.
8. ఒక వేళ తమ్ముడో చెల్లెలో ఇబ్బంది పెడితే వాళ్ళను కొట్టేంత కోపం వస్తుంది.
9. అసలు థియేటర్ బయట ఏమి జరుగుతోంది అన్నది కూడా మన దృష్టిలోకి రాదు.
10. తరవాత చూసిన సినిమాను చచ్చేదాక ఇక మరచి పోము కదా.

పిల్లలూ... పైన చెప్పిన అంశాలలో కనీసం మీకు 6 నుండి 8 పాయింట్లు అవును కదా అని అని పిస్తే ఇక మీకు అద్భుతమైన ఏకాగ్రత ఉన్నట్లు. మరి చదువు కోవడానికి ఆ ఏకాగ్రత ఎందుకు పనికి రావడం లేదని అనుకుంటున్నారా??? ఏమీ లేదు...సినిమా మీద వున్న శ్రద్ధ, భక్తి, ఏకాగ్రత, తాదాత్మ్యము ఇవన్నీ చదువు మీద లేవు అంతే. ఇంకా అర్థం కాలేదా... పిల్లలూ ఇప్పుడు పైన చెప్పుకున్న అంశాలను మనం చదువుతో ముడి పెడితే ఎలా వుంటుంది ఒక సారి ఆలోచించండి.

1. ముందుగానే మనము ఏమి చేయాలో నిర్ణయం చేస్తాం
2. అనుకున్న సమయం కంటే ముందే చదువు కోసం సిద్ధం అవుతాం
3. మొదటి నుండి చివరి కంటా అది క్లాస్‌లో అయినా, హోమ్‌లో అయినా, చదవడంలో అయినా ఏదైనా సరే కదలకుండా కూర్చుంటాము.
4. మధ్యలో మీరు చేస్తున్న దానికి ఎవరైనా ఒక్క నిమిషం అడ్డు పడినా విసుక్కుంటాం
5. సౌండ్ సరిగ్గా లేక పోతే వెంటనే కేక వేసి టీచర్‌కు చెప్తాము చెప్పేది వినబడటం లేదని.
6. పక్క వాడు 10 నిమిషాలు లేటుగా వచ్చి మనలను గిల్లి ఏమిటి జరిగింది అని అడిగితే వాడికి జస్ట్ ఇప్పుడే మొదలయింది అని చెప్పి ఇక వాడి వైపు చూడం.
7. ప్రక్కన కూర్చుంది ప్రాణ స్నేహితులైనా సరే చదువు మొదలు అయిన తరవాత నీ లోకం నీది.
8. ఒక వేళ ఎవరైనా ఇబ్బంది పెడితే వాళ్ళను కొట్టేంత కోపం వస్తుంది.
9. అసలు తరగతి గది బయట ఏమి జరుగుతోంది అన్నది కూడా మన దృష్టిలోకి రాదు.
10. తరవాత చదివిన/ విన్న / చేసిన ఏ అంశము / పాఠము అయినా చచ్చేదాక ఇక మరచి పోము.

## సూచనలు:

*1. చదవటం కంటే వ్రాయడం లో ఏకాగ్రత కుదురుతుంది. కారణం వ్రాస్తున్నప్పుడు మనసు, మాట, చేత మూడూ ఏకం అవుతాయి.*

*2. మీరు ఏం చేస్తున్నారో దానిపై మీ ధ్యాస పూర్తిగా ఉంచినప్పుడు, మీ మనసుని మీ లక్ష్యం పైనే కేంద్రీకరించినప్పుడు.. ఏకాగ్రత ఎప్పుడూ తప్పదు*

*3. వీలయితే, చదువుకోవడం కోసం ఉపక్రమించే సమయం లో కనీసం కొన్ని నిముషాలు మౌనంగా, కళ్ళు మూసుకుని ధ్యానం చేయండి.*

*4. మనలను ఏమార్చే ఏ వస్తువును/ మనిషిని కూడా మనతో వుంచవద్దు.*

*ఇంత కంటే సూచనలు ఏకాగ్రత కోసం ఏమీ ఉండవు.*

## ప్రేరణ మంత్రం:

*Distraction wastes our energy, concentration restores it.*

## స్ఫూర్తి:

పిల్లలూ, మీకు ఈ విషయం తెలుసా,

అక్కడ స్నేహితులందరూ ధ్యానం చేస్తున్నారు. అకస్మాత్తుగా అక్కడికి ఒక పాము వచ్చింది. పిల్లలందరూ ఒక్కసారిగా పాము..పాము.. అని అరుస్తూ, పరుగు లంఘించుకున్నారు. కానీ ఒక్క పిల్లవాడు మాత్రం అలాగే ధ్యానంలో ఉండిపోయాడు. ధ్యానం పూర్తిగానే మామూలుగానే కళ్ళు తెరిచి చూసాడు. జరిగిన సంఘటన అతని ఏకాగ్రతని ఏ మాత్రం భంగపరచలేక పోయింది. ఆ పిన్న వయసులోనే అంతటి ఏకాగ్రత కలిగిన బాలుడు ఎవరోకాదు. నరేంద్రుడు. మన వివేకానందుడే.

ఒకసారి పాఠశాలలో ఉపాధ్యాయుడు పాఠం చెబుతూండగా పిల్లలు అది వినకుండా ఒకరితో ఒకరు మాట్లాడకుంటూ అల్లరి చేస్తున్నారు. నరేంద్రుడు కూడా వారితో ఛలోక్తులు ఆడుతూ, మరొక వంక ఉపాధ్యాయుడు చెప్పిన పాఠం వింటున్నాడు. దాంతో ఉపాధ్యాయుడికి కోపం వచ్చి నేనేం చెపుతున్నానో అసలు మీరెవరైనా వింటున్నారా? ఏదీ ఒక్కొక్కరే లేచి చెప్పండి అని గద్దించి అడిగారు. పిల్లలందరూ బిక్కమొహం వేసుకుని నీళ్ళు నములుతూ కూర్చుండి పోయారు. అయితే నరేంద్రుడు లేచి పాఠం అంతా గడగడా అప్పగించేశాడు. బాల్యం నుండే ఇంతటి ఏకాగ్రత కలిగిన ఆ బాలుడు వివేకానంద.

ఒకరోజు అమెరికాలో నలుగురు యువకులు... నీటిలో తేలియాడుతున్న గుడ్ల పెంకులను తుపాకీతో షూట్ చేయాలని తెగ ప్రయత్నిస్తుంటారు. ఇది గమనించిన స్వామి వివేకానంద.. వారి వద్ద నుంచి తుపాకిని తీసుకొని 12 సార్లు కాలుస్తారు. అయితే, కాల్చిన ప్రతి బుల్లెట్ గుండు గుడ్ల పెంకులను తాకుతుంది. దాంతో, అక్కడున్న యువకులు.. ఇంత గొప్పగా కాల్చడం మీకెలా సాధ్యమైందని ప్రశ్నించగా... స్వామి వివేకానంద మాట్లాడుతూ... 'చూడండి పిల్లలూ! నేను ఇదే మొదటిసారి గన్ పేల్చడం. మీరు ఏం చేస్తున్నారో దానిపై మీ ఏకాగ్రతను పూర్తిగా ఉంచినప్పుడు, మీ మనసుని మీ లక్ష్యం పైనే కేంద్రీకరించినప్పుడు.. గురి ఎప్పుడూ తప్పదు', అని చెప్పారు.



# 22. దుర్వ్యసనాలు / దురలవాట్లు



## సమస్య:

*సార్, నాకున్న ఒక దురలవాటును నేను మానుకోలేక పోతున్నాను. దాని వలన చదువు మీద మనసు పెట్టి చదవ లేక పోతున్నాను. ఈ అలవాటు ఎలా అయిందో తెలియదు. ఇప్పుడు వదిలించుకుందాము అన్నా కుదరటం లేదు. ఈ అలవాటుకు బానిసను అయ్యాను...ఇప్పుడు ఏమి చేయాలి.*

## వివరణ:

పిల్లలూ మీరే చెప్తున్నారు కదా... దురలవాటు అని! అంటే తప్పని తెలుసును అన్న మాట. తెలియని వాళ్ళకు ఎంతైనా శ్రమించి బోధించగలము. తెలియనట్లు నటించే వాళ్లకు ఆ బ్రహ్మ దేవుడొచ్చినా చెప్పగలడా?...ఒక వేళ చెప్పినా మనకు ఎక్కుతుందా? చెవిటి వాడి ముందు శంఖమూదినట్లే కదా!

పిల్లలూ... మీకున్న దురలవాట్లు లేక దూర్వ్యసనాలు ఏముంటాయి?
అబద్ధాలు, చెడు స్నేహం, ధూమ పానం, మద్యపానం మొబైల్ ఫోన్.
ఇంతేగా... కాదు కాదు, ఆ మధ్య కొద్ది మంది పెద్ద పెద్ద కాన్వెంట్స్ లో చదువుతున్న పిల్లలను అడిగాను. వాళ్ళు అయ్యో మీరెక్కడున్నారు uncle, మా స్కూల్స్ లో...మాకు తెలిసి ఇంకా చాలా దురలవాట్లు దుర్వ్యసనాలు వున్నాయి అని క్రింద పేర్కొన్న విషయాలు చెప్పారు.

మత్తు పదార్థాలు, సహజీవనాలు, బైక్ రేస్‌లు, కార్ రేస్‌లు, డబ్బుతో పేకాట (జూదం), అసభ్య ప్రవర్తన,

దొంగ తనాలు, గూండా గిరి అని చెప్పినప్పుడు, నేను చాలా పాత కాలం మనిషిని అని పించింది. కరెక్ట్... ఈ కాలం పిల్లలు నిజంగానే చాలా వేగంగా పరిగెత్తుతున్నారు దుర్వ్యసనాలలో! పొరపాటున ఎక్కడైనా ఆగాలి అనుకున్నా ఆగలేనంత వేగంతో వెళ్తున్నారు. ఒక వేళ బ్రేక్ వేసినా... వెళ్తున్న బండి ఏదైనా సరే తలక్రిందులుగా పడి నుజ్జునుజ్జు అయ్యేంత వేగం అది. చాలా భయంకరమైన వేగం. అసలు 15 ఏళ్ల పిల్లలనుండి ఊహించనంత వేగం. దుర్వ్యసనాలకు లోనైన వారు పెద్దలు చెప్పినా, అమ్మనాన్నలు చెప్పినా, నేను వినను అంటారు. అనుభవంతోనే తెలుసుకుందామంటే జీవితాలు నాశనమవుతాయి.

భారతదేశంలో హక్కులు ఏవైనా సరే అమ్మాయిలకు 18 ఏళ్ళు...అబ్బాయిలకు 21 ఏళ్ళు నిండిన తరువాత వర్తించే విధంగా రాజ్యాంగం నిర్ణయించింది. అంటే ఆ వయసు వాళ్ళకు జీవితం మీద సంపూర్ణ అవగాహన కలిగి వుంటుంది అని అర్థం కదా. అతి చిన్న వయసులోనే మొత్తము జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకునే ఈ తరం వాళ్ళను తీర్చిదిద్దడం ఎవరి తరం?

పిల్లాలూ, ఇది మీకు మీరుగా సాధించాల్సిన విషయం. తప్పు అని తెలిసి కూడా చేస్తున్నారంటే ఇక ఆపడం ఎవరికి సాధ్యం చెప్పండి.

చెడు అలవాటుకి కారణం మనసు నుండి వచ్చే చెడు ఆలోచన అని గ్రహించాలి. తరువాత దానిని క్రియా రూపంలో పెట్టాలా వద్దా అన్న విషయాన్ని బుద్ధి (విచక్షణ) నిర్ణయిస్తుంది. ఆ బుద్ధి పటిష్టంగా ఉంటే చెడ్డ ఆలోచనను కార్య రూపంలోకి అమలు చెయ్యనీయదు. బలహీనంగా ఉన్న బుద్ధి దానిని చేయొచ్చు అని దానిని చేసేయ్యమని ఒత్తిడి చేస్తుంది. చేసే దాకా ఊరికే వుండదు. అలాంటి చెడ్డ పనిని, పదే పదే చేస్తే, అది ఒక అలవాటుగా మారుతుంది. సగటున మనిషి ఏదైనా పని కనీసం 8 నుండి 21 సార్లు చేస్తే అది కాస్తా అలవాటుగా మారుతుంది. 90 రోజులు చేస్తే ఇక అది మనిషి జీవన శైలిగా మారుతుంది. ఇక ఒక్కసారి అలవాటుగా మారిందంటే బుద్ధి విచక్షణను కోల్పోతుంది. ఒక చక్రం లాగా మారి జీవనశైలిలా మారిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి మొదట చెడు ఆలోచనను రానివ్వకుండా చూసుకోవాలి.

నేను ఇక్కడ కొన్ని విషయాలు మీతో పంచుకునే సాహసం చేస్తున్నాను. మీకు చాలా ఇష్టమైన పాయసం అమ్మ మీగురించి ఇంట్లో చేస్తుంది అనుకుందాము. మీరు కూడా చాలా ఆతురతతో పాయసం అరగించాలని వెయిట్ చేస్తున్నారు అనుకుందాం. అమ్మ ప్రేమగా మీకోసం చేసిన పాయసం కప్పులో వేసుకుని మీకిచ్చింది. మీరు కూడా లొట్టలు వేసుకుంటూ... సరిగ్గా త్రాగే సమయంలో, మీ చెల్లెలు లోపల నుండి పరిగెత్తి వచ్చి... అన్నయ్యా ఆ పాయసంలో బల్లి పడింది అని అన్నది, మరి మీరు ఏమి చేస్తారు...ఒక్క ఉదుటున చేతిలో కప్పును క్రింద పడేస్తారా లేక ఆ ఏముంది అందులో అని గుట గుటా త్రాగేస్తారా? చెప్పండి.

మీరు వ్యక్త పరచిన ప్రతి దురలవాటు లేక దుర్వ్యసనం ఏదైనా బల్లి పడిన పాయసం లాగానే అని తెలుసుకున్నప్పుడు, ఇక త్రాగాలా లేక వద్దా అన్నది నిర్ణయించాల్సింది మీరే.

మీరు వినే వుంటారు. బైక్ రేస్‌లని, కార్ రేస్‌లని అతి చిన్న వయసులో పిల్లలు ఇంట్లో తల్లి తండ్రుల ప్రేమను ఆసరాగా చేసుకుని విచ్చల విడిగా రోడ్ల మీద పరుగులెత్తుతూ ఎంత దారుణమైన చావును కొని తెచ్చు కున్నారో...ఈ మధ్య కాలంలో ఇదొక వ్యసనంలా తయారయ్యి యుక్తవయసు కూడా రాని పిల్లలు ఏ విధంగా తల్లిదండ్రులకు గర్భశోకం మిగులుస్తున్నారో తలచుకుంటే కళ్ళనీళ్ళొస్తాయి. అసలు డ్రైవింగ్ చేయడానికి కావాల్సిన వయసు కూడా లేని పిల్లలు వాహనాలను నడపడం... మృత్యు వాత పడటం మనం చూస్తున్నాం కదా. వీటికి కారణం వ్యసనాలకు బానిసలుగా మారడమే అని చెప్పొచ్చు. కానీ పైన చెప్పిన

అలవాట్లకు బానిసలుగా మారిన పిల్లలు బాగు పడడానికి కొన్ని సూచనలు చేసే ప్రయత్నం చేస్తున్నాను.

## సూచనలు:

1. *మీ అలవాట్లు చెడ్డవిగా గుర్తించారా?*
2. *వాటి నుండి దూరం అవ్వాలని వుందా?*
3. *పూర్తిగా దూరం కావడం సాధ్యం కాదు*
4. *సంపూర్ణమైన ఎరుకతో కొద్ది కొద్దిగా అలవాట్లకు దూరం అయ్యే ప్రయత్నం చేయాలి.*
5. *ఆ అలవాటు మీద నుండి దృష్టి మరల్చడానికి ఇంకేదైనా మంచి విషయం మీద ఎక్కువ దృష్టి పెట్టండి.*
6. *వీలయితే దురలవాట్లను, దూర్వ్యసనాలను మాన్పించే కేంద్రాలకు వెళ్ళండి. అక్కడ వున్న వాళ్ళ గురించి తెలుసుకోండి. ఎంత నష్ట పోతున్నారో కూడా అర్థం అవుతుంది.*
7. *మంచి పుస్తకాలు చదవండి.*
8. *ఒంటరిగా వుండటం కంటే మిమ్మల్ని ప్రేమించి... మీ యోగ క్షేమాలు సదా కోరుకునే కుటుంబ సభ్యుల మధ్యలో గడపండి*
9. *మీకు కనిపించేవి...వినిపించేవి... స్ఫూర్తి దాయకమైనవిగా వుంచుకోండి.*
10. *హాబిట్ జర్నల్ ను వ్రాయడం మొదలు పెట్టి ప్రతి రోజు మీలో కలిగే మార్పులను, ఉత్సాహాన్ని, పొరపాట్లను వ్రాయండి. వాటిని పరిశీలిస్తూ ఇంకా మెరుగుగా దురలవాట్లను దూరం చేయడానికి ప్రయత్నించండి.*

ఇది మెల్లగా దురలవాటును దూరం చేసుకునే ప్రణాళిక పద్దతి. ప్రతి రోజు చిన్న లక్ష్యాలు పెట్టుకోవాలి (ఉదా॥ మీరు తాగే సిగెరెట్లు రోజుకు ఎన్ని తగ్గినాయి) ఒకవేళ మనం నిర్దేశించుకున్న లక్ష్యం చేరుకోగలిగితే మనకు మనమే ప్రశంసించుకుని ఆ సూచనలను నిత్య నూతనంగా మరుసటి రోజుని ఆదర్శవంతంగా తీర్చుకోవటానికి మరలా పాటించాలి.

ఒక వేళ ఆ రోజు మనం అనుకున్న వాటిని చేరుకోలేక పోతే ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలి...ఏ విషయాలు మిమ్మల్ని ఆపుతున్నాయి.. పరిసరాలా? ఒత్తిడా? ఆందోళనా? అని కొన్ని వారాల పాటుగ కానీ, కొన్ని నెలల పాటుగ కానీ ఒక పట్టిక ద్వారా మన పురోగతిని బేరీజు వేసుకోవాలి. అది పురోగతిలో వెళు తుంది అంటే మన ఆత్మవిశ్వాసం, ఆదర్శం పెరుగుతుంది. లేదంటే చెడు అలవాటును తగ్గించుకోవాలి అన్న కోరికను మరింత దృఢంగా పెంచుకొని ఆత్మ పరిశీలనతో, క్రమశిక్షణతో ప్రయత్నం చేయాలి. నా స్వభావం ఇంతే, నా రక్తంలో ఉంది, నేను మారను, మారలేను అనుకుంటే ఇక మనం పశువుతో సమానం. ఎందుకు అంటే దానికి బుద్ధి లేదు మనకు బుద్ధి ఉండి కూడా (మార్చుకోలేక ) సంస్కరించుకోలేక పోతున్నాం.

మన కథ ఒక పట్టుపురుగు లాగా అయిపోతుంది. అది మల్బరీ ఆకులను తింటూ నోటినుండి దారం వదులుతు తన చుట్టు తనే ఒక గూడు చుట్టుకుంటుంది. తరువాత ఆకులు తినదు. పైగా ఆహా ఎంత బాగుంది నా ఇల్లు... మెత్తగా హాయిగా వుందని పడుకుంటుంది. దారం ఇచ్చే దాకా ఎవ్వరూ ఏమి చెయ్యరు.ఇక దారం ఇవ్వటం ఆపటంతో దారం తెగిపోకుండా దాన్ని వేడి నీళ్లలో వేసి తీసుకుంటారు. అది ఎలాగైతే తాను కట్టుకున్న పట్టు గూడు నుండి బయటికి రాలేక గిల గిల కొట్టుకొని చచ్చిపోతుందో అలా వ్యసనానికి వశపడి అలవాటు అనే చక్రంలో పడి అన్ని వదిలేసి ఎప్పుడయితే బానిసగా మారుతామో అప్పుడు ఇక పతనం మొదలయినట్లే. తస్మాత్ జాగ్రత్త!!!

## ప్రేరణ మంత్రము:

*Good or Bad, habits always deliver results.*



## స్ఫూర్తి:



పిల్లలూ, నేనొక మహా నటుడి గురించి మీకు చెప్తాను. చాలా చిన్న వయసులోనే మద్య పానానికి బానిస అయ్యాడు. చిన్న చిన్న దొంగతనాలు చేసి జైలు పాలయ్యాడు. ఒకసారి కోర్టులో జడ్జ్ అడిగిన ప్రశ్నలకి చలించిపోయి, తనను తాను మార్చుకోవడం మొదలుపెట్టాడు ఆ తర్వాత ఎంతో కృషి పట్టుదలతో నటనలో తన జీవితాన్ని మొదలుపెట్టాడు. మూడు పదుల వయసులో నటించడం మొదలుపెట్టి... కఠోర శ్రమ వల్ల ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగాడు. హాలీవుడ్ ప్రపంచంలో ప్రముఖ సంస్థ మార్వెల్ ఆయనను చాలా సినిమాలకు కాంట్రాక్ట్ చేసుకుంది. అందులో ఐరన్ మ్యాన్, అవెంజర్స్ అనే చిత్రాలు ప్రపంచ స్థాయిలో ఎంతో గొప్పగా హిట్ అయ్యాయి. అంతే కాక అతనికి చాలా మంచి గుర్తింపు తెచ్చాయి హాలీవుడ్లో హైయెస్ట్ పెయిడ్ యాక్టర్స్ లో ఇతను కూడా ఒకడు అయ్యాడు అంతేకాక ప్రపంచమంతా అభిమానులను సంపాదించుకున్నాడు. ఈ పాటికి నేను ఎవరి గురించి చెప్తున్నానో మీకు తెలిసింది కదా...ఆయనే రాబర్ట్ డౌనీ జూనియర్.

నిజానికి పిల్లలూ, ఒక్కటి గుర్తుంచుకోండి. మంచి అలవాట్ల కోసం మారడం అన్నది ఏనాడు అయినా మొదలు పెట్టొచ్చు. వయస్సు అనేది దానికి ఏమాత్రం అడ్డంకి కాదు మీరు మంచిగా మారాలనుకునే దృఢ నిర్ణయం చేసుకుంటే శ్రమతో తప్పక ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చు.

**తల్లిదండ్రులకు విజ్ఞప్తి లేక సూచన:**

తమ పిల్లలు ఎలా ఉంటున్నారో, వారికి ఏ అలవాట్లు అలవడుతున్నాయో, ఎవరితో స్నేహం చేస్తున్నారో గమనించుకుంటూ ఉండాలి. పిల్లలకు ఏవైనా చెడు అలవాట్లు అలవడకముందే బాల్యమునుంచే వారికి మంచి గుణాలను, మంచి అలవాట్లను గురించి బోధిస్తూ ఉండాలి. ప్రహ్లాదుని గుణగణాలను వివరించి చెప్పి, అటువంటి గుణాలను అలవరచుకునేలా చూడాలి. నైతిక విలువలగురించి తెలియపరచాలి. దుర్గుణాల వలన, దురలవాట్ల వలన ఎంత నష్టపోతారో తెలియపరచాలి. పొరపాటునో, స్నేహితులవల్లనో, పరిస్థితుల ఒత్తిడిని తట్టుకోలేకో పిల్లలు దురలవాట్లకు గురి అయితే, అది తెలిస్తే, వెంటనే వారిని మందలించి, అది దుర్వ్యసనముగా మారకముందే సామ దాన భేద దండోపాయములతో వారిని సరిదిద్దాలి. వారి జీవితాలను బాగుచేయాలి.

# 23. టీవీ / మూవీ / నటులు




## సమస్య:

*సార్, చదువుకోవాలన్న ఆలోచన ఇంటికి వస్తూనే టీవీ ముందు కూర్చుంటే ఏటో వెళ్లి పోతుంది. అందులో వచ్చే కార్యక్రమాలు నన్ను ఆకర్షించి అలాగే కూర్చో బెట్టేస్తాయి. చూస్తుండగానే సమయం అలా గడిచి పోతుంది. టీవీ ఒక వ్యసనం అయిపోయి నన్ను భాధిస్తోంది.*

*నాకు సినిమాలు అంటే బాగా ఇష్టం. ఏదైనా కొత్త సినిమా వస్తే మొదటిరోజే చూసెయ్యాలి. లేకపోతే ఏదో కోల్పోయినట్లు అనిపిస్తుంది. నాకు ఇష్టమైన నటుడి సినిమా ఎన్ని సార్లు ఎక్కడ వచ్చినా నేను చూడాల్సిందే...ఇలా చూడటంలో ఎంతో ఆనందాన్ని అనుభవిస్తాను. నాకిష్టమైన నటుడి గురించే ఆలోచనలు. ఎవ్వరైనా నా కిష్టమయిన నటుడి గురించి విమర్శగా మాట్లాడితే భరించలేనంత కోపము వస్తుంది. మూడ్ అంతా పాడై పోతుంది.*

*వీటన్నింటిలో పడి... చదువులో వెనకబడి పోతున్నాను. ఎలా చదువుకోవాలి?*

## వివరణ:

ప్రపంచ దేశాలన్నింటి లోకి మన భారత దేశంలోనే సినిమా మోజు ఎక్కువ అని చెప్పాలి. నచ్చిన నటుడి సినిమా విడుదల అయితే కరెన్సీ నోట్లు సినిమా హాల్లో విసిరెయ్యడం...నటులు కట్ ఔట్స్‌కు గజ మాలలు వేయడం... వాటికి పాలతో అభిషేకాలు చెయ్యడం...ఇలా ఇక ఏ దేశంలోనూ చూడని... వినని వింతైన

అభిమానాలు... ఆచారాలు మన వారి స్వంతం. అందులోనూ మన దక్షిణ భారతదేశంలో సినిమా పిచ్చి పట్టిందనే చెప్పాలి.

తాము ఇష్టపడే నటులంటే చచ్చేంత అభిమానం అంటే ఏమో అనుకుంటాం...నిజంగానే అభిమాన నటుల కోసం చచ్చి పోయిన వాళ్ళ కథలు మనము చూస్తున్నాం. పిల్లలూ, ఒకటి చెప్పండి...ఇంత అభిమానం మనకు ఏమన్నా కొంపా కూడు గుడ్డా ఇస్తాయా? మన చదువుని నిర్లక్ష్యం చేసి మరీ ఈ పిచ్చి పట్టించుకుంటున్నారు కదా! ఏమి వస్తుంది అంటారు? ఏమీ రాదు. అవును నిజమే మనము అభిమానమనే పిచ్చిలో పడి మతి పోగట్టుకోవడం...సమయం వృధా చేసుకోవడం... జీవితాన్ని నాశనం చేసుకోవడం తప్ప ఇంకేమి వస్తుంది చెప్పండి.

మన రాష్ట్రాల్లో అయితే ఇది ఒక మానసిక రుగ్మత కింద మారిపోయిందనే చెప్పాలి.

ఇక టీవీల విషయం చూస్తే...ఇంతకు ముందయితే టీవీ కేవలం ఒక హాల్లో మూల వుండేది. ఎప్పుడో అప్పుడు కాస్త దుమ్ము దులిపి చూసే వాళ్ళం. ఇప్పుడు టీవీ నట్టింట్లో తిష్ట వేసింది. దీని మోజులో పడి నిద్రాహారాలు మానేసి అలా కూర్చున్న మనకు ఎవరైనా వచ్చి దుమ్ము దులిపి లేపే దాకా మనము కూర్చుండి పోతున్నాం.

ఒక్క టీవీకే ఇంతలా బానిసలయిన పరిస్థితి! అలాంటిది, ఇంట్లో ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్‌లో ఒక టీవీ ప్రత్యక్షం అయిపోయింది. ఇంతకు మునుపు మనకు నచ్చనిది ఏదైనా వస్తే టీవీ ముందు నుండి లేచి వెళ్లే వాళ్ళం...ఇప్పుడలా కాదు...ఎవరికి నచ్చింది వాళ్ళు చూసుకునే సౌలభ్యం...ఎక్కడ పడితే అక్కడ చూసే సౌకర్యం...ఎంత సేపైనా చూడగలిగే సామర్థ్యం.. ఆఖరికి ఈ ఫోన్ లోనే ఇంత దరిద్రం రావడం మొదలయిన తరువాత, ఇంట్లో వాళ్ళు మనసు విప్పి మాట్లాడు కోవడం బంద్, పిల్లలు చదువుకోవడం బంద్, అమ్మ నాన్న ఇంటి విషయాలు చర్చించడం బంద్. నిద్ర లేచింది మొదలు పడుకునే దాకా ఇవి మన జీవితంలో అంతర్భాగం అయిపోయి మనలను శాసిస్తున్నాయి. వద్దనుకున్నా... వదలలేని వశీకరణ వస్తువైంది.

పిల్లలూ, ఇవన్నీ మీకు తెలియనివి అంటారా? తెలుసు...కానీ చదువుకోవడం...బాగుపడటం కంటే ఈ మూవీ టీవీల మోజులో పడి చెడిపోవడము లోనే మీకు ఎక్కువ ఆనందం వుంది కదా?

తప్పు అని తెలిసినా చేస్తున్నారు అంటే ఏమిటి చెప్పేది...

సుమారు 24 సంవత్సరాల క్రితం జరిగిన విశేషం చెప్తున్నాను వినండి. అప్పుడు నా వయసు 26 ఏళ్ళు. శ్రీ సత్యసాయి బాబా వారి సమాజ సేవలలో చాలా చురుకైన పాత్ర పోషించే రోజులవి. ఒక సారి బాగా సేవలు చేసే నాతోటి వారిని 7 మందిని స్వామి వారు తన గదికి పిలిచి మాట్లాడుతున్నారు. ఎంతో ప్రేమగా ఎన్నో విషయాలు మాకు చెప్తున్నారు.

ఉన్నట్టుండి, అన్నారు. బంగారూ! నాకు ఒక మాట ఇస్తారా అని అడిగారు. మేమంతా కాస్త ఆశ్చర్యంతో ఆనందంతో వెంటనే ముక్త కంఠంతో సరే స్వామి అని చెప్పాము. అప్పుడు ఆయన అన్నారు...బంగారూ మీరెప్పుడైనా టీవీ చూడండి ఫరవాలేదు...కానీ తింటున్నప్పుడు మాత్రం చూడొద్దు. మీ ఇళ్ళలో ఇప్పటి దాకా మూలన వుండే టీవీ కాస్త మీరు భోజనం చేసే గదిలో ఉంచేస్తున్నారు. ఇక భోజన సమయములో ఆ టీవీలో వచ్చే నానా చెత్త చూస్తూ భోజనము చేయటం వలన మీరు తినే పదార్థాలతో పాటుగా ఆ చూచే దృశ్యాలు అన్ని కూడా మీ శరీరంలోకి ప్రవేశిస్తున్నాయి. దాని వలన మీరు చాలా మానసిక రుగ్మతలకు గురవుతున్నారు. ఇది విన్న అందరూ మిన్నకుండి పోయారు. కానీ నాకు మా ఇంట్లో ఆ మధ్య కాలంలో జరిగిన సంఘటన గుర్తుకు వచ్చి నేను స్వామిని అడిగాను.

స్వామీ! మీరు చెప్పింది నిజమే...కానీ ఇంట్లో అందరూ టీవీ ఉన్న గదిలోనే భోజనాలు చేయడానికి

కూర్చుని...టీవీ చూస్తూ తింటున్నారు. అయ్యో స్వామి ఇలా చెప్తుంటారని తెలిసిన నేను తలదించుకుని టీవీ చూడకుండా భోజనం చేస్తుంటే ఇంట్లో వాళ్ళందరూ నన్ను ఆట పట్టిస్తున్నారు...అబ్బో వచ్చేశాడు సన్యాసి అని...అంతగా చూడద్దు అనుకుంటే వెళ్లి ఆ పక్క గదిలో కూర్చుని తినొచ్చు కదా అని కోపగించుకుంటున్నారు. ఏమి చేయాలో తోచలేదు స్వామి అని చెప్పాను.

నాయనా! నీకు పాము తెలుసా? పాము కాటు వేస్తే ఆ విషం వలన నువ్వు చచ్చి పోతావని తెలుసా? తెలిస్తే...ఆ పాము మీదకి నీకు అయిన వాళ్ళు ఒక నలుగురు బలవంతంగా తోసే ప్రయత్నం చేసారనుకో... అప్పుడు అయ్యో పాపం నా వాళ్ళు నన్నెంతో ప్రేమతో ముందుకు తోస్తున్నారనుకుని ఆ పాము మీద పడటానికి ప్రయత్నం చేస్తావా లేక నీ శక్తియుక్తులు అన్నీ ఉపయోగించి ఆ పాము ముందుకు వెళ్లకుండా పక్కకు వెళతావా? నాతో పాటు అందరూ... నవ్వుతూ ఒకే సమాధానం చెప్పారు... స్వామీ, తప్పక తప్పించుకునే ప్రయత్నమే చేస్తాము. అపుడు స్వామి వారు వివరించి చెప్పారు...నాయనా టీవీ అంటే ఏమిటో తెలుసా? అని అడిగారు. టెలి విజన్ అని చెప్పాము.

కాదురా! తేలు విషం (TV)... అది విషము చిమ్మే పురుగు కంటే భయంకరమైన వస్తువు. ఇప్పుడు చెప్పండి...ఆ విషాన్ని మీరెంతగా మీ శరీరంలోకి ఎక్కించుకుంటున్నారో? మా నోట మాట రాలేదు.

ఒక్కసారి ఆలోచిస్తే అడవుల్లో తిరిగే పాములు ఈ రోజుల్లో కేబుల్ వైర్ల రూపంలో మన నివాస గృహాలలో ప్రవేశించి... తమ పడగలను టీవీ బాక్సుల రూపంలో విప్పి... యథేచ్ఛగా విషాన్ని కక్కుతూనే ఉన్నాయి. పాతిక సంవత్సరాల క్రితమే మన ఇళ్ళలో అంతర్భాగంగా మారిన ఈ టీవీ, మూవీలు ఇంత వినాశనం సృష్టిస్తే... ఇక ఇప్పుడు స్మార్ట్ ఫోన్ రూపంలో వున్న ఒక విషకీటకాన్ని అరచేతిలో పెట్టుకుని తిరిగినట్లే కదా? పిల్లలూ, మీరు ఎంతో దీక్షతో ఈ టీవీ మూవీలకు దూరం కావాలి. లేదంటే మీరు వర్తమాన కాలంలో ప్రతిభ చూపించలేని శవాలుగా మారిపోవడం తథ్యం. నిజంగా ఈ దూర్వ్యసనానికి దూరం అవ్వాలనుకుంటే ఈ క్రింది సూచనలను పాటించండి.

ఇంకో విషయం గమనించండి... రోజూ కాసేపు ఆటలు పాటలు ఎందుకు అంటారు? మనిషిని మనసును ఆరోగ్యంగా ఉంచడానికి అని పెద్దలు చెపుతారు కదా? అదే ఆటలు పాటలలో 18 గంటల పాటు గడిపితే ఏమవుతుంది...పిచ్చి పట్టిందని హాస్పిటల్ లో చేర్చాల్సి వస్తుంది. మరి టీవీ మూవీలలో అన్ని గంటల పాటు గడిపితే జీవితం ఏమవుతుందో ఆలోచించండి... నాశనం కాదా?

## సూచనలు:

1. *వారానికి ఒక సినిమా చూసే అలవాటు చేసుకోవచ్చును. ప్రయత్నం చేయండి.*
2. *కనీసం చదవాలనుకున్న సమయంలో మనము టివి, ఫోన్ లేని ప్రదేశంలో కూర్చోగలమా?*
3. *తల్లిదండ్రులు ఇంట్లో టీవీ కేబుల్ కనెక్షన్ తీసేయొచ్చు (కనీసం పరీక్షల ముందు 3 నెలలు)*
4. *టీవీ చూసే సమయాన్ని ఇంట్లో అందరూ నియంత్రించుకోగలరా?*
5. *ఏదైనా మూవీ చూస్తే ఒక జీవిత కాలం ఆ దృశ్యాలు మనసులో నిక్షిప్తము అవుతాయని మీకు తెలుసా?*
6. *టీవీలో కూడా ఇంగ్లీష్ వార్తలు, డిబేట్స్, వర్తమాన సమాచారాలు చూస్తే...వాటి వలన తెలివి తేటలు లౌక్యం తెలుస్తాయి కదా?*
7. *చూసే సినిమాల నుండి వ్యక్తిగత, కుటుంబ, సామాజిక బాధ్యత, దేశభక్తి లాంటి సారాంశాలను గ్రహించండి. కనీసం దాని వలన కాస్త ఉపయోగం ఉంటుంది.*
8. *మీరు బాగా ఇష్టపడే నటులు ఏమి చదివారు,*

*ఎక్కడ చదివారు, ఎన్ని భాషలు మాట్లాడతారు, ఎంత వయసులో ఏమి సాధించారని కాస్త యోచన చేస్తే మీరేమి చేయాలో బోధ పడుతుంది.*

*9. ధారావాహికలు అసలు చూడొద్దు.*

*10. ముఖ్యంగా తినేటప్పుడు టీవీ మూవీలు అసలు చూడకూడదు. అవి మనసును చాలా సులభంగా ప్రభావితం చేస్తాయి.*

## ప్రేరణ మంత్రం:

*What ever makes you weak physically, mentally and intellectually...reject that like a poison.*

## స్ఫూర్తి:

మహబూబ్‌నగర్‌లో అభిషేక్ అనే అబ్బాయి, తన చదువంతా ప్రభుత్వ విద్యాలయాల్లోనే కొనసాగించాడు. అతనికి సినిమాలు చూడటం అంటే చాలా ఇష్టం. ఇక క్రికెట్ మ్యాచ్ ఉంది అంటే ఒక్క నిమిషం కూడా టీవీ వదిలిపెట్టే ప్రసక్తే ఉండదు. వినోదం అనేది తన జీవితంలో అతి ముఖ్యమైన అంశంగా కొనసాగేది. వాళ్ళ నాన్న ఎప్పుడూ తిట్టేవాడు అందువల్ల అభిషేక్‌కు కోపం మరియు చిరాకు వచ్చేది. తండ్రి కొడుకులు ఇద్దరూ ఎప్పుడూ గొడవ పడుతూ ఉండేవారు.

అవి ఇంటర్మీడియట్ చదువుతున్న రోజులు, ఒకరోజు తన స్నేహితుడు వాళ్ళ ఇంటికి పరుగు పరుగున వచ్చి ఒరేయ్ నాకు ఆర్మీలో జాబ్ వచ్చింది, లైఫ్ సెటిల్ అయిపోయింది అని సంతోషంగా చెప్పాడు. ఆ అబ్బాయికి ఆర్మీలో జాబ్ రావడం చూసి అభిషేక్ వాళ్ళ నాన్నతో పాటు అందరూ అతనిని పొగడటం చూసి అభిషేక్ చాలా ఆత్మన్యూనతా భావానికి గురయ్యాడు. కొన్ని రోజులు చాలా మానసిక వ్యధతో బాధ పడి, ఒకరోజు తన స్నేహితుని దగ్గరికి వెళ్లి అరే నాకు టీవీలు సినిమాలు చూడడం చాలా ఇష్టం వాటి వల్ల నేను చాలా సమయం కోల్పోతున్నాను, ఈ అలవాటు నుండి బయటకి రాలేకపోతున్నాను. వీటినుండి బయట పడాలంటే ఏం చేయాలి అని అడిగాడు. అప్పుడు ఆ స్నేహితుడు అరేయ్ నీవు రోజుకి సగటున ఎన్ని గంటలు టీవీ లేదా సినిమా లేదా క్రికెట్ చూడడానికి వెచ్చిస్తున్నావో అందులో ప్రతి రోజూ 10 నిమిషాలు మాత్రమే తగ్గించి, ఈ తగ్గించిన 10 నిముషాలలో ఒక మంచి పని చేయడం అలవాటు చేసుకో అని చెప్పాడు. అభిషేక్ న్యూస్ పేపర్ చదవడం రన్నింగ్ చేయడం అంటే నాకు ఇష్టం చెప్పాడు. అప్పుడు తన స్నేహితుడు సరే నీకు ఈ రెండూ ఇష్టమైతే ఒక ఐదు నిమిషాలు న్యూస్ పేపరు ఇంకో ఐదు నిమిషాలు రన్నింగ్ చేసే ప్రయత్నం చెయ్యి. తర్వాత రోజూ ఐదు నిమిషాలు కాస్త పది నిమిషాలు చేసే ప్రయత్నం చెయ్ అంటే పది నిమిషాలు న్యూస్ పేపరు మరియు పదినిమిషాలు రన్నింగ్ చేసే ప్రయత్నం చెయ్యి అని చెప్పాడు. అలా ప్రతి రోజూ కొంత సమయాన్ని పెంచుతూ పో అని చెప్పాడు.

స్నేహితుని మాట కూడా బాగానే ఉంది, అవి కూడా నాకు ఇష్టమే కదా అని ప్రతి రోజూ పేపరు చదవడం మరియు రన్నింగ్ చేయడం మొదలు పెట్టాడు అభిషేక్. ఈ మంచి అలవాట్లు అతని జీవితంలో ముఖ్యమైనవిగా మారిపోయాయి... దాంతో పాటుగా దురలవాటుకు సమయం పూర్తిగా తగ్గి పోయింది.

అలా న్యూస్ పేపర్ చదవడం రన్నింగ్ చేయడము అతనని ఒక సబ్ ఇన్స్‌పెక్టర్‌గా తయారు చేయగలిగింది. ఈరోజు అభిషేక్ SI గా తన ఊరికి దగ్గర్లోనే ఉద్యోగం కొనసాగిస్తూ చాలా సంతోషంగా జీవిస్తున్నారు, చాలా మందికి స్ఫూర్తి ఇస్తున్నారు. పిల్లలూ... ఏదీ అసాధ్యం కాదు... అన్నీ సాధించడం అంత సులభము కూడా కాదు. కసితో ప్రయత్నం చేయడమే...ఫెయిల్ అయితే సాలీడు లాగా మళ్ళీ ప్రయత్నించడమే.

# 24. పట్టుదల లేదు




**సమస్య:**

*చిన్నప్పటి నుండి, జీవితములో ఏదైనా సాధించాలన్న పట్టుదల లేదు. అందు వలన జీవితాన్ని చాలా సులభంగా తీసుకోవడం జరుగుతుందని నా అనుభవం చెప్తోంది. నేను కూడా పట్టుదలగా చదవాలని నాకు అప్పుడప్పుడు అనిపిస్తుంది. కానీ ఏమి చేయాలో తెలియడం లేదు.*

## వివరణ:

ఈ రోజుల్లో చాలా మందికి పట్టుదల ఉన్నా లేకున్నా బట్టతల మాత్రం తప్పక ఉంటోంది. పట్టుదలకు కావాల్సింది ఆలోచించే తల... బట్టతలకు కావాల్సింది ఒక తల. పిల్లలూ! నిజంగా మీకు జీవితం మీద కసి లేకుంటే, పట్టుదల ఎక్కడి నుండి వస్తుంది చెప్పండి. సాధించాలన్న కసి వుంటేనే పట్టుదల వస్తుంది. లేదంటే జీవితమే వృథా అవుతుంది.

ఈ అంశము క్రింద నేను ఒక కథ చెప్పి వదిలేస్తున్నాను. మీరు కథను పూర్తిగా చదివి మీరేమి తెలుసుకున్నారో వ్రాసుకోండి. నిజంగా తెలుసుకున్న విషయాలు మీలో నిద్రాణమై వున్న చైతన్యాన్ని మేలుకొలిపితే నా ప్రయత్నంలో నేను విజయం సాధించినట్లే.

ఆరేళ్లకు అనాథలా మారాడు, పదేళ్లకు కార్పెంటర్ అవతారమెత్తాడు, పదకొండేళ్లకు తొలి సారి బడిలో అడుగుపెట్టాడు... ఆపైన నైట్ వాచ్‌మెన్‌గా పనిచేశాడు... చివరికి బతకలేక ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించాడు. తరువాత... అదే కుర్రాడు పీజీ పూర్తి చేశాడు. ఎమ్మెల్యే అయ్యాడు. 22ఏళ్ల పాటు మంత్రిగా

బాధ్యత నిర్వహించాడు. అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాడు.

కలిఖో పుల్... పాతాళం నుంచి పర్వతం అంచుల దాకా సాగిన ఆయన ప్రయాణం, పట్టుదలకు నిలువెత్తు నిదర్శనం. అందరి జీవితాలకూ కొత్త పాఠాలు తప్పక నేర్పిస్తుంది.



కలిఖో పుల్, ఆ పేరుకు అర్థం మంచి భవిష్యత్తు' అని. ఏరికోరి తల్లి అతనికి ఆ పేరు పెట్టుకున్నా, ఊహ తెలిసినప్పట్నుంచీ అతనికి చీకట్లు తప్ప, రేపటిపైన ఆశ ఎప్పుడూ కనిపించ లేదు. పుల్ పదమూడు నెలల చిన్నారిగా ఉన్నప్పుడు తల్లి అనారోగ్యంతో కన్నుమూసింది. మరో ఐదేళ్లకు అల్లారు ముద్దుగా చూసుకుంటూ వచ్చిన తండ్రి కూడా అనారోగ్యంతో చనిపోయాడు. అలా ఆరేళ్ల వయసులో తల్లిదండ్రుల్ని పోగొట్టుకొని అనాథలా మిగిలాడు పుల్. చుట్టుపక్కల వాళ్లెవరూ పట్టించుకోలేదు. చుట్టాలెవరూ దగ్గరకు తీయలేదు. ఎటెళ్లాలో తెలీక దిక్కుతోచని స్థితిలో ఉన్న పుల్‌ను పక్క వూళ్లో ఉండే అతడి అత్తయ్య తీసుకెళ్లింది. అదీ అతడి మీద ప్రేమతోనో, చదివించి పెద్ద చేయాలనో కాదు సుమా! ఇంట్లో పనులకు పనికొస్తాడని.

## పదేళ్లకు వడ్రంగిగా:

ఆరేళ్ల వరకూ పుల్ బడి మొహాన్ని చూడలేదు. ప్రతిరోజూ అడవికెళ్లడం, కట్టెలు కొట్టుకొని రావడమే అత్తయ్య వాళ్ళింట్లో అతని పని. పుల్ కట్టెలు తీసుకొస్తేనే అతడికి ఆ రోజు అన్నం దొరికేది. ఆటల్లో పడో, ఆరోగ్యం బాలేకో అడవికి వెళ్లలేకపోతే ఆ పూటకి పస్తులే. కనీసం కడుపు నింపుకోవాలన్న పట్టుదలతో పని చేసేవాడు. దాంతో చదువుకీ, అందమైన బాల్యానికీ దూరంగా అడవి చెట్ల మధ్యే పెరిగాడు.

పదేళ్ల వయసొచ్చేసరికి పక్క ఊళ్ళోని హవాయి క్రాఫ్ట్ సెంటర్‌లో వడ్రంగి పని నేర్చుకోవడానికి వెళ్లాడు. అక్కడ రోజుకి రూపాయిన్నర స్టైపెండ్ అందేది. అత్తయ్య కుటుంబం మీద ఆధారపడకుండా ఆ డబ్బులతోనే ఎలాగోలా బండి నడిపించేవాడు. పనిలో నైపుణ్యం సాధించే కొద్దీ స్టైపెండ్ కూడా పెరుగుతూ వచ్చింది. దాంతో అక్కడే ఉంటూ కుర్చీలూ మంచాలతో మొదలుపెట్టి రెండేళ్ల పాటు చెక్కతో రకరకాల కళాకృతులు తయారు చేసేవరకు నైపుణ్యం పెంచుకున్నాడు. అతడి ప్రతిభ ఆ శిక్షణా కేంద్రం నిర్వాహకులనూ ఆకర్షించింది. అక్కడుండే ట్యూటర్ సెలవు మీద వెళ్లడంతో శిక్షణ పూర్తయ్యాక పుల్‌కు మూడు నెలల పాటు జీతమిచ్చి శిక్షకుడిగా పనిచేసే అవకాశం కల్పించారు. పట్టుదలతో పని నేర్చుకున్నందుకు సాధించిన మొదటి బహుమతి అది.

## నేరుగా ఆరులోకి:

పుల్ పనిచేస్తోన్న హవాయి క్రాఫ్ట్ సెంటర్కు ఎక్కువగా ఆర్మీ, పారా మిలటరీ, ప్రభుత్వ అధికారులు వస్తుండేవారు. వాళ్లందరూ హిందీ, ఇంగ్లిష్లోనే మాట్లాడేవాళ్లు. పుల్ కి అస్సామీస్ తప్ప మరో భాష రాదు. వినియోగదారులు చెప్పేది తనకు అర్థమవ్వాలంటే హిందీ కానీ, ఇంగ్లీష్ కానీ నేర్చుకోవాల్సిందే అనుకున్నాడు. దాంతో పదకొండేళ్ల వయసులో ఓ నైట్ స్కూల్లో ఒకటో తరగతిలో చేరాడు పుల్. ఇతర సబ్జెక్టులతో తనకు అవసరం లేదనీ, హిందీ ఇంగ్లీష్ మాత్రమే బాగా నేర్పించమనీ టీచర్లని అడిగేవాడు. చాలా పట్టుదలతో

కసితో భాష మీద పట్టు సాధించాడు.

ఓరోజు పుల్ చదువుతోన్న స్కూల్‌కు ఆ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, డిప్యూటి కమిషనర్ తనిఖీకి వచ్చారు. అందరికంటే పెద్దవాడు, చురుగ్గా ఉంటాడు కాబట్టి వాళ్లని ఆహ్వానించే బాధ్యతని స్కూల్ పుల్‌కే అప్పగించింది. స్కూల్లో చదువు ఎలా చెబుతున్నారంటూ మంత్రి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పిన పుల్, చివర్లో ఓ ప్రార్థన గీతాన్నీ పాడాడు. చెక్క పని నేర్చుకునే పిల్లాడు అంత బాగా మాట్లాడటం, పాడటం డిప్యూటీ కమిషనర్ దృష్టిని ఆకర్షించింది. వెంటనే అతడి గురించి ఆరా తీశాడు. విషయం తెలుసుకొని ఆయనే చొరవ తీసుకుని పుల్‌ని డే స్కూల్‌కు మార్పించి, నేరుగా ఆరో తరగతిలో అడ్మిషన్ ఇప్పించాడు. అదే పుల్ జీవితానికి కీలక మలుపు. పొద్దున చదువుకుంటూనే రాత్రుళ్లు హస్తకళల కేంద్రంలో శిక్షకుడిగా పనిచేసేవాడు.

## ఆత్మహత్య వైపు అడుగులు:

తరగతులు మారే కొద్దీ పుల్‌కి ఖర్చులూ ఎక్కువయ్యాయి. అతడు పనిచేసే చోట వచ్చే డబ్బులు బతకడానికీ చదువుకీ సరిపోయేవి కావు. దాంతో తెలిసిన వాళ్ల ద్వారా అతికష్టమ్మీద ఓ ప్రభుత్వ కార్యాలయంలో నైట్ వాచ్‌మెన్‌గా ఉద్యోగం సంపాదించాడు. సాయంత్రం ఐదు గంటలకు ఆ కార్యాలయంలో జాతీయ జెండాను అవనతం చేయడం, ఉదయం ఐదింటికి జెండా ఎగరేయడం, ఆ మధ్యలో కార్యాలయానికి కాపలా కాయడం అతడి పని. నెలకు రూ.212 జీతం వచ్చేది. రాత్రి ఉద్యోగం, పొద్దున స్కూలుతో రోజుకి నాలుగైదు గంటలకు మించి నిద్ర ఉండేది కాదు. ఆ జీతం కూడా సరిపోకపోవడంతో ఖాళీ సమయంలో సిగరెట్లూ, పాన్లూ అమ్ముతూ ఎంతో కొంత సంపాదించుకునేవాడు. కానీ దురదృష్టం పుల్‌ని మరోసారి దెబ్బకొట్టింది.

అనుభవిస్తోన్న పేదరికానికి తోడు కడుపులో అల్సర్ల సమస్య అతడిని మరింత బాధపెట్టింది. వైద్యం చేయించుకోవడానికి డబ్బుల్లేక ఆరేళ్లపాటు అలానే భరించాడు. కానీ చివరికి ఆపరేషన్ చేయించుకోకుంటే సమస్య పూర్తిగా ముదిరిపోయే పరిస్థితి వచ్చింది. డబ్బుల కోసం బంధువుల్ని ఆశ్రయిస్తే ఒకరు రెండు రూపాయలూ, మరొకరు ఐదు రూపాయలూ చేతిలో పెట్టారు. ఆ క్షణం తనకంటూ ఎవరూ లేరనీ, తాను బతికి సాధించేది ఏమీ లేదనీ పుల్‌కి అనిపించింది. ఆత్మహత్య చేసుకుందామని దగ్గర్లోని ఓ నదిమీదున్న బ్రిడ్జి పైకెక్కాడు. కానీ చుట్టూ మనుషులు ఉండటంతో దూకడానికి అతడికి ధైర్యం సరిపోలేదు. దాదాపు నలభై నిమిషాలు అక్కడే ఎదురు చూశాక, చనిపోవడం తనవల్ల కాదనిపించి వెనుతిరిగాడు.

చదువుకుంటూనే పని. జీవితంలో డబ్బు ఎంత అవసరమో బంధువుల ప్రవర్తనతో పుల్‌కి అర్థమైంది. ఎలాగైనా ఆపరేషన్ చేయించుకోవాలనీ, బతికి సాధించి తానేంటో నిరూపించాలనీ అనుకున్నాడు. నేరుగా తనని స్కూల్లో చేర్పించిన డిప్యూటీ కమిషనర్ నేగి దగ్గరకు వెళ్లి తన పరిస్థితి వివరించాడు. అతడిని చూసి జాలిపడ్డ నేగి చేతిలో రెండువేల ఐదొందలు పెట్టి పంపించాడు. ఆ డబ్బుతో చికిత్స చేయించుకున్న పుల్, తరవాత ముఖ్యమంత్రికి అభ్యర్థన పెట్టుకొని, దాన్నుంచి వచ్చిన మెడికల్ గ్రాంట్‌లో నుంచి డబ్బులు తిరిగిచ్చేసి జీవితాన్ని మళ్లీ కొత్తగా మొదలుపెట్టాడు. క్రమంగా పుల్ ఆరోగ్యం మెరుగు పడింది. చేతిలో ఎంతో కొంత నైపుణ్యం ఉంది. చదువును కొనసాగిస్తూనే డబ్బులు సంపాదించడానికి వచ్చే ఏ ఒక్క అవకాశాన్నీ వదిలిపెట్టకూడదని నిర్ణయించుకున్నాడు. పుల్‌కు వెదురుతో ఫెన్సింగ్ నిర్మించడం, గుడిసెలు అల్లడం బాగా వచ్చు. అదే విషయాన్ని తనకు పరిచయమున్న వాళ్లందరికీ చెబుతూ, ఏదైనా అవసరముంటే కబురుపెట్టమనేవాడు. అలా ఓ జూనియర్ ఇంజినీర్ ఇంటిచుట్టూ వెదురుతో ఫెన్సింగ్ నిర్మించే పని దొరికింది. మూడ్రోజుల పాటూ ఒక్కడే అడవికి వెళ్లి వెదురుని

నరుక్కొని వచ్చి ఆ నిర్మాణాన్ని పూర్తిచేశాడు. దానికి అతడికి దక్కిన మొత్తం నాలుగొందల రూపాయలు. ఆ తరవాత ఆరొందల రూపాయలకు ఓ గుడిసె నిర్మించే పని దొరికింది. కొన్ని రోజులకు రెండు వేల రూపాయలకు ఓ వెదురు ఇంటిని నిర్మించే పనీ ఒప్పుకున్నాడు. అలా చదువుకుంటూనే ఓ చిన్నస్థాయి కాంట్రాక్టర్గా మారాడు. పనికీ, చదువుకీ మధ్య పుల్ నిద్రనీ, వ్యక్తిగత జీవితాన్నీ త్యాగం చేశాడు తప్ప పుస్తకాలని ఏ రోజూ పక్కకి పెట్టలేదు. ఓవైపు ఇంటర్ చదువుతూనే మరోపక్క తాను సంపాదించుకున్న డబ్బులతో నాలుగు సెకండ్ హ్యాండ్ ట్రక్కులనీ కొని వాటిని అద్దెకి తిప్పేవాడు.

## పాతికేళ్లకే ఎమ్మెల్యే!:

చిన్న కాంట్రాక్టర్గా మొదలుపెట్టి డిగ్రీకి వచ్చేనాటికి పక్కా ఇళ్లు నిర్మించే కాంట్రాక్టులు చేసే స్థాయికి పుల్ ఎదిగాడు. చదువూ, కాంట్రాక్టులకి తోడు కాలేజీ విద్యార్థి సంఘానికి జనరల్ సెక్రటరీ బాధ్యతలతో పుల్ క్షణం తీరికలేకుండా గడిపేవాడు. డిగ్రీ చివరి సంవత్సరానికి వచ్చేనాటికి పుల్ మూడు లక్షల ఖర్చుతో ఓ సొంత ఇంటినీ నిర్మించుకున్నాడు. అల్సర్ నుంచి బయటపడ్డ నాటి నుంచీ అతడి సంపాదనలో సగం సొంతానికీ, మిగతా సగం పేద రోగుల వైద్యానికీ కేటాయిస్తూ వస్తున్నాడు. కాంట్రాక్టర్గా మారాక ప్రభుత్వాసుపత్రులకు వెళ్తూ రోగుల అవసరాలు తెలుసుకొని ఆర్థిక సాయం చేసేవాడు. అలా క్రమంగా అతడి ఔదార్యం గురించి ఆనోటా ఈనోటా అందరికీ తెలియడం మొదలుపెట్టింది. విద్యార్థి సంఘం నాయకుడిగానూ మంచి పేరు సంపాదించాడు. డిగ్రీ పూర్తయ్యాక, లా కాలేజీలో చేరాడు. మరోవైపు కాంట్రాక్టర్గా ఎదుగుతూ 37 ప్రభుత్వ భవనాలూ, డజనుకు పైగా బ్రిడ్జిలూ, వందల కిలోమీటర్ల రోడ్లూ నిర్మించాడు. అతడు నిర్మించిన భవనాల నాణ్యత నచ్చడంతో ప్రభుత్వం టెండర్లు లేకుండానే అతడికి పనులను అప్పజెప్పేది. చిన్న వయసులోనే స్థానికంగా పుల్ సంపాదించిన పేరు కాంగ్రెస్ పార్టీ దృష్టిని ఆకర్షించింది. అతడు పార్టీలో సభ్యుడు కాకపోయినా తమ తరఫున పోటీ చేయాలంటూ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది. ప్రభుత్వ కాంట్రాక్టులనే ప్రజా సేవగా భావిస్తూ చేస్తూ వచ్చాడు పుల్. అలాంటిది నేరుగా ప్రభుత్వం తరఫునే పనిచేసే అవకాశం వచ్చేసరికి ఆనందంగా ఒప్పుకున్నాడు.

## మంత్రిగా 22ఏళ్లు:

తొలి ఎన్నికల్లో పుల్ అద్భుతమైన మెజారిటీతో విజయం సాధించి, పాతికేళ్లకే మంత్రిగా మారాడు. ఆ తరవాత జరిగిన అన్ని ఎన్నికల్లో ప్రత్యర్థులపైన 90శాతం కంటే ఎక్కువ ఓట్ల మెజారిటీతోనే గెలుస్తూ వచ్చాడు. మంత్రిగా ఉన్నప్పుడే పెళ్లి చేసుకున్నాడు. ఒకప్పుడు ఆపరేషన్ కోసం ప్రభుత్వానికి అర్జీ పెట్టుకుంటే ముఖ్యమంత్రి అపాంగ్ రెండువేల ఐదొందలు గ్రాంట్ ఇచ్చారు. అదే వ్యక్తి ఈ రోజు నా పెళ్లికి అతిథిగా హాజరవడాన్ని నమ్మలేకపోతున్నా' అంటూ పుల్ తన పెళ్లిలో కన్నీటి పర్యంతమయ్యారు. 23ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో 22ఏళ్లు పుల్ మంత్రిగా పనిచేశారంటేనే ప్రజలకూ అధికార పక్షానికీ ఆయనపైన ఎంత నమ్మకమో అర్థమవుతుంది.

ఈటానగర్లోని పుల్ అధికార నివాసం ఓ ఆస్పత్రినే తలపిస్తుంది. నిత్యం ఆయన సాయం కోరి వచ్చే రోగులు



ఉండటానికి ఆయన ఇంట్లోనే కొన్ని గదులు కేటాయించారు. ఇరవై నాలుగ్గంటలూ అక్కడ వైద్యులను అందుబాటులో ఉంచి వచ్చిన వాళ్లను పరీక్షించే ఏర్పాట్లు చేశారు. ఇరవై ఏళ్లుగా రాజకీయంగానూ బలపడుతూ వచ్చిన పుల్, అరుణాచల్ ప్రదేశ్లో అనిశ్చితి కారణంగా కొనసాగిన రాష్ట్రపతి పాలనకు తెరదించారు. ఇతర ఎమ్మెల్యేల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఆ రాష్ట్రానికి తొమ్మిదో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

భారత్-చైనా సరిహద్దుకు రెండు వైపులా నివసించే కమన్ మిష్మి అని ఓ చిన్న తెగలో కలిఖో పుల్ పుట్టారు. కుటుంబంలో బడికెళ్లి చదువుకున్న మొదటి వ్యక్తి ఆయనే.

పుస్తకాలు చదవడం, పర్యటనలకు వెళ్ళడం, స్నేహితులతో చదరంగం ఆడటాన్ని బాగా ఇష్టపడతారు. ఖాళీ దొరికనప్పుడల్లా తన పిల్లలను అనాథ శరణాలయాలకు తీసుకెళ్ళడం, వాళ్ళతో కలిసి స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం అలవాటు.

విద్య, వైద్యం, ఆర్థిక, న్యాయ, విద్యుత్, సాంఘిక శిశు సంక్షేమం లాంటి అన్ని ప్రధాన శాఖల్లో ఆ రాష్ట్ర క్యాబినెట్ మంత్రిగా పనిచేసిన అనుభవం పుల్ సొంతం....

నాకు దేవుడిపైన నమ్మకం లేదు, ఎందుకంటే నేను కష్టాల్లో ఉన్నప్పుడు ఆయన ఒక్కసారి కూడా నాకు సాయపడలేదు. కానీ కష్టమే దేవుడని నమ్ముతా. అదే జీవితంలో ఎదురుదెబ్బలు తగిలిన ప్రతిసారీ నన్ను నిలబెట్టింది. ఇప్పుడు నా కారుమీద ఎగిరే జెండాను



చూస్తున్నప్పుడల్లా ఒకప్పుడు చౌకీదార్లా నేను రోజూ జెండాను ఎగరేసిన రోజులు గుర్తొస్తుంటాయి.

ఇప్పటికీ నా తొలిరోజుల్నాటి చెక్క పనిముట్లు నా దగ్గర భద్రంగా ఉన్నాయి. నా ఐదుగురు కొడుకులకూ వాటిని చూపిస్తూ నా గతాన్ని గుర్తు చేస్తా. నన్ను మంత్రిగా కాకుండా ఓ మామూలు కార్పెంటర్గా, కాంట్రాక్టర్గానే చూడమని వాళ్ళకు చెబుతా. ఒకప్పుడు రోజుకు పన్నెండు గంటలు ప్రభుత్వ వాచ్మెన్గా పనిచేసిన నేను ఇప్పుడు ఇరవై నాలుగ్గంటలూ ప్రభుత్వాన్ని నడిపించే స్థాయికి చేరుకున్నా....

నేను సాధించినప్పుడు మీరెందుకు సాధించలేరు' అంటూ యువతను ప్రశ్నిస్తారు పుల్. నిజమే... ఎందుకు సాధించలేరు...? మీరందరూ జీవితంలో విజయం సాధించాలన్న పట్టుదల మీదవ్వాలని నేను కోరుకుంటున్నాను.

# 25. పరీక్షలంటే భయం-ఒత్తిడి




## సమస్య:

*అయ్యా నేను మంచి విద్యార్థిని. చక్కగా పాఠాలు వింటాను. సంవత్సరం అంతా బాగా చదువుకుంటాను కూడా. కానీ పరీక్షల సమయం దగ్గర పడే సరికి నాకు భయం పట్టుకుంటుంది. కొండలాంటి సిలబస్ చూస్తే భయం వేస్తుంది. నేను నిర్దిష్ట సమయంలో చదవగలనా లేదా అని. మునుపటి ప్రశ్నాపత్రాలు చూస్తే ఇంకా భయం వేస్తుంది పరీక్షకు నిర్దేశించిన సమయంలో నేను ఇన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయగలనా అసలు అవి నాకు గుర్తుకు వస్తాయా అన్న ఒత్తిడి మరియు భయం నన్ను చదవనివ్వవు. వీటి వల్ల నేను నిర్వీర్యమై పోతున్నాను.*

*పరీక్షల వేళ ఒత్తిడిని అధిగమించడం ఎలా? మంచి ర్యాంకు సాధించడం ఎలా? ఎలాంటి ప్రణాళికతో ముందుకు వెళ్ళాలి? రోజులో ఎన్ని గంటలు చదవాలి? ప్రశ్నాపత్రాన్ని పూరించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి? పరీక్షకు హాజరయ్యే రోజు ఎలా ఉండాలి?*

## వివరణ:

పిల్లలూ విద్యార్థి దశలో పరీక్షల ముందు ఒత్తిడి లేదా భయం అన్నవి సర్వసాధారణమే. కొంతమంది పిల్లలు ఒత్తిడి భయం పరిమిత స్థాయిలో వుండటం వల్లనే చక్కగా చదువుకుని మంచి మార్కులతో పాస్ అవుతూ

ఉంటారు. కానీ అదే ఒత్తిడి భయం మితి మీరినట్లయితే అవి విద్యార్థుల జీవితాలను తలక్రిందులుగా చేసే విధంగా మారుతాయి.

మీరు తెలుసుకోవాల్సింది ఏమిటంటే ఒత్తిడి లేదా భయం అనేది ఎప్పుడు కలుగుతాయి అంటే మనం వర్తమానం గురించి కాక భవిష్యత్ లో జరిగే దాని గురించి ఆలోచించి దాని నుండి ఏదో పొందాలని ప్రయత్నం చేసినప్పుడు. కాబట్టి ప్రప్రథమంగా మీరు చేయవలసినది ఏమిటంటే భవిష్యత్తు గురించి ఆలోచించకుండా వర్తమానంలో బ్రతకడమే.

ఇంకొక విషయం, మీరు జీవితాంతం గుర్తుంచు కోవాలి అది ఏమిటంటే భయం లేదా వత్తిడి అన్నవి ఏమాత్రం నిజాలు కావు అది కేవలం మన మనస్సు మెదడు సృష్టించిన కల్పితాలే, అని మీకు మీరు గుర్తు చేసుకో గలిగితే మీకు భయం లేదా వత్తిడి నుండి బాధ తప్పుతుంది. అది చదువులో అయినా లేక జీవిత విషయంలో అయినా సరే.

పరీక్షల సమయం – మార్చి వచ్చిందంటే అప్పటిదాకా చదివి నేర్చుకున్న పాఠాలు, విషయాలను పేపరు మీద పెట్టి మంచి మార్కులు సంపాదించే సమయం వచ్చినట్టే. కానీ, ఈ సమయంలో ఎంత చదివినా ఎక్కడో ఏదో వదిలేసామనే భావన విద్యార్థుల్లో ఉంటుంది. పరీక్ష ఎలా రాస్తామో? అనే ఆందోళనా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎలా చదవాలి..? పరీక్షలు ఎలా రాయాలి..? ఎలాంటి ప్రణాళికలు అవలంబించాలి..? అనే విషయాలను తెలుసుకుందాం.

## గెలవాలంటే! ఆందోళన వద్దు:

పరీక్షకు ముందు విద్యార్థులు అనవసర ఆలోచనలతో ఆందోళన చెందుతుంటారు. పరీక్షల్లో గట్టెక్కుతామో లేదో, ప్రశ్నల సరళి, పరీక్షకు పోటీ పడుతున్న అభ్యర్థుల గురించి ఆలోచిస్తు ఆందోళన చెందుతారు. పరీక్ష మొదలయ్యేముందు కొన్ని క్షణాలు నిశాబ్దంగా కూర్చొని మీ మనస్సును స్థిమితపరుచుకోవాలి. శులువైన ప్రశ్నలను, విభాగాలను ముందుగా పూర్తి చేయాలి.

**వైఫల్యం తప్పేమీ కాదు**

విజయం అంటే ఒక వైఫల్యం నుంచి మరో వైఫల్యానికి ఉత్సాహాన్ని కోల్పోకుండా చేసే ప్రయాణం. ఏ పరాజయమూ శాశ్వతం కాదు. పరాజయానికి కారణమైన ప్రతి నిర్ణయం అభ్యర్థిదే. కావున ఓటమిని అంగీకరించి తర్వాత సాధించబోయే విజయానికి సరైన వ్యూహం మరియు ప్రమాణాలున్న శిక్షణ తీసుకుని సన్నద్ధం అవ్వాలి.

## సూచనలు:

1. *మీరు ఒక ప్రణాళిక తయారు చేసుకుని దానిని అనుసరించుకుంటూ చదవడం మొదలు పెట్టాలి.*
2. *ఏ నాటికి నిర్దేశించిన పాఠ్యాంశాలు ఆనాడు ముగించేయాలి*
3. *పూర్వ ప్రశ్నపత్రాలు తీసుకుని వాటికి సమాధానాలు రాసి మీ అధ్యాపకులకు చూపించి, వారు చెప్పిన విధంగా సరిదిద్దుకోవాలి. దాని వలన మీకు చదివింది ఎంతవరకు గుర్తు ఉంది అనేది కూడా తెలుస్తుంది.*
4. *అప్పుడప్పుడు ఆటవిడుపు కోసం ఒక ఫ్రెండ్ ఇంటికి వెళ్ళడం లేదా మంచి ఆటలు ఆడడం చేయాలి. గుర్తుంచుకోండి ఇది దినచర్య అవకూడదు.*
5. *ధ్యానం లేదా యోగా వంటివి అలవర్చు కోవాలి. వాటి వలన మన తనువే కాక మనసు కూడా ఎంతో ఆరోగ్యంగా ఉంటుంది. మీకు అనవసరమైన వత్తిడిని భయాన్ని లేక ఆత్మన్యూనత భావాలని దూరం చేసేందుకు చాలా తోడ్పడతాయి.*
6. *కాలేజీ లెవెల్ కి వచ్చాక బట్టీ పట్టే విదానం*

తగ్గించి, అర్థం చేసుకొని చదివే విధానం అలవర్చుకోవాలి. దాన్ని ప్రశ్నల రూపంలో తయారుచేసుకుని అభ్యాసం చేసినప్పుడే మంచి మార్కులు సాధించవచ్చు.

7. ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవడానికి క్రమం తప్పకుండా రివిజన్ చేయాలి.

**స్ఫూర్తి మంత్రం:**

*FEAR*

*F False*
*E Evidence*
*A Appearing*
*R Real*



# 26. ఫెయిల్యూర్‌ని తట్టుకోలేకపోతున్నాను




## సమస్య:

*సార్! చిన్నప్పటి నుండి పుట్టి పెరిగిన కుటుంబ నేపథ్యం వలన ఎప్పుడూ ఫెయిల్యూర్ ని తట్టుకోలేక పోతున్నాను.*

*చిన్నప్పటి నుండి చదువులో ఎప్పుడూ నేనే ఫస్ట్... కానీ ఈ మధ్య నాకంటే బాగా చదివే వాళ్ళు తరగతికి వచ్చేసారు. నేను మొదటి 10 స్థానాలలో వుంటున్నాను కానీ మొదటిస్థానంలో లేను. ఇది భరించలేక పోతున్నాను.*

*అయ్యా! ఆటలలో, పాటలలో, చదువులో, మేధస్సులో దేనిలోనయినా నేను ఫెయిల్యూర్‌ని అందుకోవడానికి సిద్ధంగా లేను. దీని వలన ఇబ్బంది పడుతున్నాను.*

## వివరణ:

చిన్నప్పుడు... అంటే ఇంకా నడక కూడా సరిగ్గా రాని వయసులో అనుకోండి... మీరు రోడ్డు మీద నడుస్తున్నప్పుడు పొరపాటున కింద పడ్డారు అనుకోండి... కాలుకి కాస్తా చిన్న గాయమై మీరు ఏడుస్తున్నారు అనుకోండి, అప్పుడు అమ్మ ఏముంటుంది?

నూటికి 90 మంది భారతీయ మాతృ మూర్తులు, అయ్యో, నాన్నా కింద పడ్డావా? లే, దెబ్బ తగిలిందా...లేదులే అమ్మా ఏడవద్దు, ఎక్కడ పడ్డావు... ఇక్కడే కదా...

ఉండు దాని సంగతి చెప్తాను అంటూ నేలను కోపంగా ఉరిమి చూస్తూ కాలితో నేలను తంతూ... ఆయ్! మా బాబును ఎందుకు కష్టపెట్టావు... నీకిలా కావాల్సిందే అంటూ... మీ వైపు చూసి, ఇక ఉరుకో నాన్న దానికి శాస్తి జరిగిందిలే...పద' అంటారు.

ఇదే కదా మీకైనా...నాకైనా...ఇంకెవరికైనా కొద్దిగా అటో ఇటోగా కనిపించే దృశ్యం! ఇలాగ చిన్నప్పటి నుండి మన ఫెయిల్యూర్‌కి ఎదుటి వారిని కారణం చేయడమే తెలిసే విధంగా తల్లిదండ్రులు పెంచి పోషించారు.

నిజానికి, చిన్న నాడు మీరు క్రింద పడింది దెబ్బ తగిలింది మీ పొరపాటు వల్లనా లేక నేలతల్లి పొరపాటా? అని ఎప్పుడైనా ఎవరైనా ఆలోచించారా?

ఇంకా... ఆ రోజు కింద పడినప్పుడు, అమ్మ నిన్ను లేపి చేయి పట్టుకుని నిలబెట్టి... నాయనా నడవటం ఇలా కాదు... ఇలా ఏదైనా ఆసరాగా చేసుకుని నడవాలి. అప్పుడు అడుగులు తప్పు పడవు, నీవు కింద పడవు అని చెప్పి వుంటే మీ జీవితంలో ఫెయిల్యూర్‌ను ఎదుర్కోవడం అలవాటు అయ్యేది. జీవితంలో ఏది జరిగినా దానికి కారణం మీరే అన్న సత్యం మీరు గుర్తించాలి.

పిల్లలూ, ఇంకొక దృశ్యం ఊహించండి... ఈ కాలం పిల్లలు ఎంత గానో అల్లరి చేస్తుంటారు కదా? 100 మందిని సునాయాసముగా కంట్రోల్ చేసే తల్లి తండ్రులు ఆ పిల్ల వాడి గోల భరించ లేక వాడి చేతిలోని రిమోట్ లాగేసుకుంటే...వాడు ఏడుపు లంఘించుకుంటాడు కదా? వాడి ఏడుపు మాన్పించడానికి ఆ తల్లిదండ్రులు చేసేదేంటి? ఏదైతే తీసుకున్నారో అది ఇచ్చేసి వాడి ఏడుపు ఆపినందుకు బ్రతుకు జీవుడా అంటూ నిట్టూరుస్తారు. ఇలా ఎవ్వరు కూడా పిల్లలను జీవితములో ఫెయిల్యూర్‌ను ఎదుర్కొనేలా తయారు చేయలేకపోవడం వలన... ఎక్కడ చూచినా పిల్లలు నిర్బలులుగా తయారై జీవచ్ఛవములలాగా తయారవుతున్నారు.

ఈ రకమైన మానసిక ప్రవృత్తి పిల్లలను అతి చిన్న ఫెయిల్యూర్‌లకే అత్యంత ఘోరమైన నిర్ణయాలు తీసుకుంటూ జీవితాలను నాశనం చేసుకునే మానసిక రుగ్మత వైపు తీసుకుని వెళ్తోంది.

పిల్లలందరూ, చిన్న నాటి నుండి ఓటమిని ఎదుర్కోవడం లేదా అధిగమించడం నేర్చుకోవాలి తప్ప...ఓటమికి మరొకరిని కారణంగా చూపడం లేదా పలాయన వాదం లేదా అఘాయిత్యం చేసుకోవడం వంటి పనులు ఏ మనిషి వ్యక్తిత్వానికి కూడా శోభించవు.

నేను, అభయ ఆశ్రమంలో వుంటున్నాను. చుట్టూ అడవి ప్రాంతం, రకరకాల పక్షులు కనిపిస్తాయి. జన సంచారం ఎక్కువగా వుండని ప్రాంతం కాబట్టి చిన్న పిచ్చుకలు కూడా ఎంతో స్వేచ్ఛగా ఎగురుతూ ఆహ్లాదంగా కనిపిస్తాయి. నేను ఉన్న గదికి 2 కిటికీలు వుంటాయి. ఆ కిటికీకి వున్న జాలీ కారణంగా గాలి వెలుతురు వస్తుండటంతో నేను కిటికీలు మూయడం తెరవడం చేయక పోవడం వలన చిన్న పిచ్చుక కిటికీ దగ్గర గూడు కట్టడం మొదలు పెట్టింది. అది చూసిన సిబ్బంది దానిని తీసివేసి శుభ్రం చేశారు. అది మళ్ళీ మరుసటి రోజుకు గూడు కట్టడం... వీళ్ళు తీసేయ్యడం జరిగింది... ఈ ప్రయత్నం అలా జరుగుతూనే వుంది. ఆ చిన్న పిచ్చుక కూడా అంత పట్టుదలతో మనిషిని కూడా ఎదుర్కొనే ప్రయత్నం చేస్తున్నది కదా అని ఆశ్చర్యం కలిగింది నాకు.

కానీ, మనుషులు మాత్రం చిన్న ఓటమికే ప్రాణాలు తీసుకుంటున్నారు. పిల్లలూ చావే వచ్చినా ధైర్యంగా ఎదుర్కొని జీవించే కసి వున్న మానవ జాతి మనది. అలాంటిది బంగారం లాంటి జీవితాలను బుగ్గి పాలు చేసుకునే రుగ్మతకు గురైనారు ఈ రోజు కొద్ది మంది విద్యార్థులు.

పిల్లలూ... ఎంతటి సమస్య ఎదురైనా మనము ధీరులుగా మారి పోరాడి గెలవాలి తప్ప...చిన్న అడ్డంకులకే బెదిరి పోయి పారి పోకూడదు.

## సూచనలు:

1. *ఓటమి కూడా మన మంచికే అన్నది నమ్మండి.*
2. *ఒక్కోసారి ఓటమి వలన జీవిత కాలానికి కావలసిన ప్రేరణ కలుగుతుంది.*
3. *ఓటమి వచ్చినప్పుడు ప్రయాణానికి కామా ( , ) నే గాని ఫుల్ స్టాప్ కాదు అని ఎరిగి తప్పులను సరిదిద్దుకోండి.*
4. *మీకంటే ప్రతిభ వున్న వాళ్ళు తారస పడితే వాళ్ళు మీ అభివృద్ధికి సాధించే ఘనతకు గీటు రాళ్లుగా భావించి మీ ప్రయత్నం మరింత దృఢంగా చేయండి.*
5. *పోటీలేని ఏ పరీక్షయినా విలువ లేనిదిగా ఎంచి పోటీని స్వాగతించండి.*
6. *ఓటమే లేక పోతే గెలుపు మజా ఎలా తెలుస్తుంది.*
7. *ఓటమి మన చుట్టూ వున్న కూటమిని పగల గొట్టి నిజమైన స్నేహితులను మిగులుస్తుంది.*
8. *ఓటమిని తట్టుకోలేక మానసిక వ్యధ వుంటే నిపుణులను సంప్రదించండి.*
9. *ప్రపంచములో ఏ మహానుభావుడి చరిత్ర తీసుకున్నా ఓటమి కథలే అని తెలుసుకుని... వాళ్ళ కథలు చదవండి.*
10. *మీ మేధస్సుకు మరింత పదును పెట్టండి. మీరు కోల్పోయిన స్థానాన్ని మళ్ళీ సాధించి చూపండి.*

## ప్రేరణ మంత్రం:

*Failures are stepping stones for Success and SUCCESS can't be spelt without U.*
*It's fine to celebrate success but it is more important to heed the lessons of failure.*

## స్ఫూర్తి:

చిన్న పట్టణం, సామాన్య కుటుంబ నేపథ్యం. తండ్రి ప్రభుత్వ ఉద్యోగి (స్కూల్ ఇన్స్పెక్టర్) వారి ఇంట్లో నలుగురు పిల్లల్లో రెండవ వాడు. చిన్నప్పటి నుండి ప్రభుత్వ పాఠశాలలో చదువు. అత్యంత ప్రతిభ కల పిల్లాడు. ఎప్పుడైనా సరే తరగతిలో ప్రథమ స్థానంలోనే వుండే వాడు. అలాంటిది జీవితంలో మొదటి సారి ఇంటర్ 2వ సంవత్సరం లో ఫెయిల్ అయ్యాడు. తల్లిదండ్రులు చాలా బాధ పడ్డారు. తనుకూడా ఎంతో మానసిక క్షోభను అనుభవించాడు. చాలా కసి కలిగింది. ఆ రోజుల్లో తప్పింది ఒక పేపర్లో అయినా...విద్యార్థులు మొత్తం పేపర్లు వ్రాసి పాస్ అయితే ఫెయిల్ అన్న మార్కు లేకుండా చేసే సదుపాయం వినియోగించి మొత్తము 6 పేపర్లు మళ్ళీ వ్రాశాడు. కాలేజీకి ప్రథమస్థానంలో నిలిచాడు.

తరవాత, డిగ్రీ పూర్తిచేసిన వెంటనే, అందరూ ఎన్నో ఆశలతో తమ భవిష్యత్తుకు ప్రణాళికలు వేసుకుంటున్న సమయంలో, సంతానం లేని వాళ్ళ చిన్నాన్న తనకు వ్యాపారంలో తోడుండమని పిల్లాడి తల్లి తండ్రులను ఒప్పించి హైదరాబాద్‌కు తీసుకుని వెళ్ళాడు. అంత డబ్బున్న కుటుంబానికి దత్త పుత్రుడు అనుకున్నారు అందరూ...ఆ పిల్లాడు చిన్నాన్నకు తోడు నిల్చొని ఎంతో ఓర్పుతో, నేర్పుతో వ్యాపారాలను అభివృద్ధి చేసాడు. అతని మిగితా స్నేహితులందరూ పై చదువులు, వ్యాపారాలు, చేస్తూ జీవితంలో స్థిరపడిపోతున్నారు.

ఉన్నట్టుండి, చిన్నాన్న అతనిని పిలిచి తన అవసరం ఇక లేదని కొంత డబ్బులు చేతికిచ్చి వెళ్లిపొమ్మన్నాడు. ఊహించలేని ఎదురు దెబ్బ. పెళ్ళి కావాల్సిన సమయంలో ఒక పెద్ద ఓటమి ఇది. ఇంకొకరు అయితే మానసికవ్యథతో జీవితాన్ని చిందర వందర చేసుకునే వాళ్ళు. కానీ ఇతను ఎంతో ఓపికగా వాళ్ళ ఊరికి వెళ్ళి, ఏజెన్సీ ఒకటి ప్రారంభించాడు...తమ్ముడు స్థిర పడాలన్న

నెపంతో, మళ్ళీ ఉద్యోగ ప్రయత్నం చేశాడు. శ్రీరాం చిట్స్‌లో అధికారిగా పని చేసాడు. కానీ అక్కడ కూడా ఎన్నో ఏళ్ళు పని చేయలేదు. మధ్యలో బ్యాంక్ పరీక్షలు వ్రాస్తూ... సుమారు 30 ఏళ్ల వయసులో వైశ్యా బ్యాంక్‌లో తన ప్రతిభ మరియు కొద్ది మంది సహాయంతో ఉద్యోగం సంపాదించాడు. మధ్యలో వివాహం అయింది. సుమారు ఒక దశాబ్ద కాలం బ్యాంక్‌లో ఎన్నో ఒడి దుడుకులు ఎదుర్కొంటూ ఉన్నత స్థానానికి చేరాడు. 40 ఏళ్ల వయసులో మళ్ళీ ప్రయత్నం చేసి తన ప్రతిభ ఆధారంగా ఆక్సిస్ బ్యాంక్ లో చేరాడు. ఇప్పుడు అతనికి 50 ఏళ్ళు. ఆక్సిస్ బ్యాంక్, SME వింగ్‌కు వైస్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. నెలకు 3 లక్షల పైనే జీతం. తన దగ్గరికి సాయం కోరి ఎవరు వచ్చినా తనకు చేతనైన సాయం చేస్తూ కుటుంబంలో అందరికీ చేదోడు వాదోడు గా వుంటూ... జీవిస్తున్నాడు. ఇతని పేరు, సుంకు రామప్రసాద్, తాడిపత్రి, అభయ ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యుడు.



పిల్లలూ... ఓటమి వస్తే కుంగి పోయే వాళ్ళు ఒక్కసారి మీ చుట్టూతా ఉన్న వ్యక్తులను చూడండి ఇలాంటి వ్యక్తులు చాలా మందే ఉంటారు. అప్పుడు మీరెలాంటి మానసిక స్థితిలో ఉన్నారో అర్థం అవుతుంది.

# 27. సోమరితనం



## సమస్య:

*అయ్యా చెప్పడానికి సిగ్గుగా ఉన్నా! నిజానికి నేను ఒక సోమరిని, నాకు ఏమి చేయాలన్నా ఓపిక మరియు ఆసక్తి ఉండవు. మరీ ముఖ్యంగా క్లాస్‌కి వెళ్ళాలి అన్నా, పాఠం వినాలన్నా, తర్వాత ఇంటికి వచ్చి చదువుకోవాలన్నా అస్సలు ఆసక్తి ఉండదు. ప్రశాంతంగా కూర్చుని టీవీ చూస్తూ లేక సినిమా చూస్తూ హ్యాపీగా సమయం గడపాలని ఉంటుంది. అసలు పుస్తకాల జోలికి వెళ్ళబుద్ధి కాదు ఒకవేళ వెళ్ళినా వాటిని చదివి అర్థం చేసుకుని గుర్తుపెట్టుకునే అంత ఓపిక నా దగ్గర లేదు. నాకు చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలనే ఉంటుంది, కానీ నా సోమరితనం అందుకు సహకరించదు. ఈ సోమరి తనాన్ని ఎలా వదిలించుకోవాలో కాస్త చెప్పండి. చదువు మాత్రమే కాదు... ఇంకేమి చేయాలని వుండదు.*

## వివరణ:

పిల్లలూ... మీరిలా సోమరితనం వల్ల ఎదుర్కొంటున్న సమస్యలు చెప్తుంటే నాకు చిన్నప్పుడెప్పుడో విన్న కథ గుర్తుకొచ్చింది. తమాషాగా ఉంటుంది. చదవండి.

ఒక సోమరివాడు సముద్రం ఒడ్డున ఒక పెద్ద చెట్టు నీడలో కాలు మీద కాలు వేసుకుని హాయిగా పడుకుని సముద్రంలో అలలు ఆకాశంలో పక్షులను చూస్తూ అలా గోళ్లు గిల్లుకుంటూ హ్యాపీగా వున్నాడు.

సముద్రపు ఒడ్డు మీద నడుస్తూ ఏదో పని మీద ఆటే వెళ్తున్న ఆ ఊరి కిరాణా కొట్టాయన పని పాట లేకుండా సోమరిగా పడుకున్న వీడిని చూసి కోపం వచ్చి...

వీడికెలాగైన బుద్ధి చెప్పాలి అని నిర్ణయం చేసుకుని దగ్గరగా నిలబడి అడిగాడు.

ఏమయ్యా...మహానుభావా! ఇలా సోమరిగా కూర్చునే బదులు ఏదైనా చక్కగా పని చేయొచ్చు కదా?

అప్పుడు, మన వాడు అడిగాడు...అయ్యా పని చేస్తే ఏమొస్తుంది??

నీ తల కాయరా...పని చేస్తే దండిగా డబ్బులు సంపాదించ వచ్చు కదా?

అయ్యా? డబ్బులు సంపాదించి ఏమి చేయాలి?

పెద్దాయనకు బాగా కోపం వచ్చి చెప్పాడు, ఏమి చేయడం ఏంటి... ఇదిగో ఈ సముద్ర తీరంలోనే బీచ్ సైడ్ facing లో మంచి ఇల్లు కట్టుకోవచ్చు సుఖంగా...

ఎందుకు కట్టుకోవాలి ఇక్కడ ఇల్లు???

చిర్రెత్తి పోయి...ఆ పెద్దాయన చెప్పాడు...ఓరి కొరివి, ఎందుకంటావేంట్రా? హ్యాపీగా కాలు మీద కాలేసుకుని, ఇక్కడ సముద్ర తీరంలో దర్జాగా సేద తీరుతు లైఫ్ ని ఎంజాయ్ చేయొచ్చు!

అప్పుడు మన వాడు అన్నాడు...అయ్యా! ఇప్పుడు నేను చేస్తుంది అదే కదా...ఇంత దానికి అంత జీవితం తగలెయ్యడం అవసరమా చెప్పండి?

పెద్దాయన అక్కడే పడి పోయాడు...ఇప్పటికి లేవలేదు.

బాగుంది కదా...ఇదే నా మీ కథ కూడా???

పిల్లలూ! నిజానికి సోమరితనం ఒక వ్యాధి అని చెప్పుకోవచ్చు, శారీరకమైన వ్యాధి కాదు మానసికమైన వ్యాధి.

ఒకటి చెప్పండి...

కాళ్ళున్నా నడవ లేని వాడిని ఏమంటారు
చెవులున్నా వినపడని వాళ్లనేమంటారు
కళ్ళున్నా చూడలేని వాడిని ఏమంటారు
మీకు తెలుసు కదా?

మరి, ప్రాణం వున్నా పని చేయని వాడిని ఏమంటారు...జీవచ్ఛవం అంటారు తెలుసా? అంటే బ్రతికి వున్న శవం అని అర్థం.

ఏదైనా పని చేయడానికి శక్తి లేని వాడిని అసమర్థుడని అనవచ్చు. సోమరితనంతో ఏ పని చేయని వాడిని



ఏమనాలో మీరే నిర్ణయించుకోండి. నిజానికి సోమరితనం మీ జీవితాన్ని బుగ్గిపాలు చేస్తుంది.

పిల్లలూ! స్నేహితులు క్రికెట్ ఆడదాం అని పిలిస్తే అప్పుడు బ్యాట్ బాల్ తీసుకుని పరిగెత్తుతారా లేదా?

అమ్మను నీకిష్టమైన వంటకం చేయమని అడిగినప్పుడు దానికి కావలసిన సరుకులు ఇంట్లో లేవని చెబితే అప్పుడు మీరు నేను తీసుకొని వస్తాను అని వెంటనే డబ్బులు పుచ్చుకుని పరుగులు తీయరా?

సినిమాకి వెళ్ళాలి అంటే ఎంత గాఢ నిద్రలో ఉన్నా లేచి చకచకా తయారై బయలుదేరుతారు కదా?

అంతెందుకు, టీవీ ముందు కూర్చుని ఎంతో తదేకంగా గంటల తరబడి చూస్తూ కూర్చుంటారు కదా?

అప్పుడు మీ సోమరితనం ఏమైనట్టు??? సోమరి అంటే అసలు పని చేయని వాడు...మొదటికథలో చెప్పిన సోమరి అన్న మాట. మీరంతా సోమరితనం అంటున్నారు కదా...అదే వుంటే అసలు బ్రష్ చేయడం, దొడ్డికెళ్ళడం, స్నానం చేయడం, బట్టలేసుకోవడం, భోంచేయడం...ఇలా ఏమీ చేయకూడదు కదా...అలా కూర్చున్న చోటు నుండి కదల కుండా వుంటే, నేను ఒప్పుకుంటాను. మీరు ఇక ఏమి చదవక్కర లేదని. చెప్పండి మీరలాంటి సోమరియా???

నిజానికి సమస్య సోమరితనం కాదు... మీ నిరాసక్తి మరియు అఇష్టం. మీకు ఇష్టమైన విషయాలు చేయవలసినప్పుడు మీ సోమరితనం మటు మాయమైపోయి చురుకుగా పరుగులెత్తుతారు. అదే చదువులో అయితే సోమరితనం నెత్తిమీద తాండవం చేస్తూ మిమ్మల్ని చదవ నీయకుండా చేస్తుంది. కాబట్టి మీ చదువు మీద ఆసక్తి మరియు ఇష్టం పెంచుకోవడం చాలా అవసరం అని గుర్తించాలి.

ఆసక్తి వుంటే ఏ శక్తీ మిమ్మల్ని అడ్డుకోలేదు. ఇష్టం ఉంటే ఎంత కష్టమైన పనినైనా సునాయాసంగా చేసేస్తాం. చదువు మీ జీవితంలో ఎంతో ఉపయోగపడుతుంది. అది కేవలం డబ్బునే కాదు సమాజంలో గుర్తింపును, గౌరవాన్ని కూడా ఇస్తుంది. అన్నింటికన్నా ముఖ్యంగా, సంస్కారాన్ని, జీవిత నైపుణ్యాలను ప్రసాదిస్తుంది. చదువు మేలు చేసినంతగా మీకు వేరే ఏ మనిషీ, వేరే ఏ అంశమూ మేలు చేయలేదు.

ఇలాకాక ఒకవేళ మీరు జీవితంలో ప్రతి అంశంలోనూ సోమరిపోతులు అయితే కొద్దిగా క్లిష్టమైన సమస్య ఎందుకంటే ఇది శారీరకమైనది కాదు మానసికమైనది కాబట్టి. కానీ దీనికి కూడా కొన్ని మార్గాలు ఉన్నాయి ఉదాహరణకు ఒక్కోరోజు మీరు కొద్దికొద్దిగా మీ సోమరితనాన్ని తగ్గించుకోవచ్చు. ఎలా అంటే కనీసం ఒక రోజులో అరగంట అయినా చదువుకోవడం లేదా కొద్దిగా వ్యాయామం చేయడం మొదలు పెట్టాలి. అలా రోజురోజుకు ఆ సమయాన్ని మరియు మీరు చేసే పనులను పెంచుకుంటూ పోవాలి.

ఒక్కోసారి ఏదైనా చేసి సాధించినప్పుడు పరులనుండి వచ్చే మెప్పు మనకు ఎంతో సంతృప్తినిస్తుంది. కాబట్టి ఒక్కసారైనా ఏదైనా మంచి విషయం లో ఉత్తీర్ణత సాధించండి. ఆ ఒక్క విషయం మీ జీవితాన్ని మార్చగలదు. గుర్తుంచుకోండి సోమరితనం కేవలం మీ చదువుని కాదు మీ ఆరోగ్యాన్ని మరియు మీ కుటుంబాన్ని కూడా దెబ్బ తీయగలదు. ఎందుకంటే ఒక మనిషి సోమరిగా బ్రతకడం వలన తన జీవితాన్నే కాదు తన చుట్టూ ఉన్న, ఆధారపడిన తనవాళ్ళ జీవితాలను కూడా నిర్వీర్యం చేయగలడు.

**సూచనలు:**

*1. సోమరితనం మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నదని నమ్ముతున్నారా?*

*2. అవును అయితే... దాని నుండి దూరం అవ్వాలి అనుకుంటున్నారా?*

3. నిర్ణయం తీసుకోండి... 40 రోజుల దీక్ష, ప్రతిరోజూ ఏమి చేయాలో దైనందిక చర్యను వ్రాసుకోండి. ఇంట్లో వాళ్ళ సాయం తీసుకోండి.
4. నిజాయతీగా ఆ ప్రణాళికను పాటించండి. ముందే ఇంట్లో వాళ్ళకు చెప్పి మీ ప్రయత్నాన్ని ప్రోత్సహించమని... మీకు సాయం చేయమని చెప్పండి.
5. మీ మనసులో మీరే స్థిర నిర్ణయం తీసుకోండి, గమ్యాన్ని సాధించేవరకు సోమరితనాన్ని దరి చేర్చక కృషి చేయాలి అని.
6. మీ దిన చర్యను నిజాయతీగా వ్రాసుకుని దైనిందినితో బేరీజు వేసుకోండి. వ్యత్యాసం వుంటే మరుసటి రోజు సరిదిద్దుకోండి.
7. చాలా చురుకుగా వున్న స్నేహితులను మీ చుట్టూరా ఉంచుకోండి. వాళ్ళతో పాటుగా మీరూ చురుకుగా తయారవుతారు.
8. గమ్యాన్ని చేరినప్పుడు వచ్చే మానసిక సంతృప్తి మిమ్మల్ని మరెన్నో అద్భుతాలు సాధింప చేస్తుంది. ఇక ఏముంది మీ సోమరితనం ఇట్టే మాయమైపోతుంది.

**స్ఫూర్తి మంత్రం:**

*Laziness leads many people to astray.*

## స్ఫూర్తి:

కోతి నుండి మనిషి రూపాంతరం చెందాడు అన్న సిద్ధాంతాన్ని కనిపెట్టిన చార్లెస్ డార్విన్ గురించి మనం తెలుసుకుందాం. గమ్మత్తయిన విషయం ఏమిటంటే ఆయన చాలా సోమరివాడట, తన సొంత విషయాలు తను స్వయంగా ఎప్పుడు చూసుకునేవాడు కాదట అదేవిధంగా ప్రతి విషయంలోనూ ఎంతో సోమరితనం ప్రదర్శించే వాడట.

కానీ అదే చార్లెస్ డార్విన్ కోతి నుండి మనిషి రూపాంతరం చెందాడు అన్న సిద్ధాంతాన్ని కనిపెట్టారు. ఎలాగో తెలుసా ఆసక్తి, జిజ్ఞాస, ఇష్టం మరియు కుతూహలం వలన. కాబట్టి పిల్లలూ! ఆసక్తి ఉంటే ఎంతటి సోమరిపోతు అయినా అద్భుతాలు చేయించగలదు. నిజానికి మీకు ఇంకో గమ్మత్తయిన విషయం సోమరులు చాలా విషయాలకి సులభమైన పద్ధతులు కనిపెట్టగలరని నిరూపించారు. ఎందుకంటే వాళ్ళకు కష్టపడటం ఇష్టం లేదు కాబట్టి. మనిషిలోని సుఖపడాలనే కోరిక, కష్టపడి పనిచెయ్యటం ఇష్టంలేని సోమరితనం వల్లే మానవులు బద్ధకస్థులు కనుక సుఖపడటానికే బల్బులను, మిక్సీలు, గ్రైండర్ల వంటి వాటిని, ఫ్యాన్, లిఫ్ట్, రేడియో, టి.వి, రైలు, విమానం లాంటి వాటన్నింటినీ కనిపెట్టారట. బాగుందికదా! కాబట్టి పిల్లలూ! మీ సోమరితనాన్ని కూడా మీరు మంచి మార్గంలో ఉపయోగించి తద్వారా గొప్ప లాభాలు సంపాదించాలి, సమాజానికి మేలు చేయాలి!



Charles Darwin.

# 28. లైంగిక వేధింపులు



## సమస్య:

*సార్ నన్ను ఒక వ్యక్తి లైంగికంగా వేధిస్తున్నాడు. అతని చేష్టలు నన్ను శారీరకంగా మరియు మానసికంగా ఎంతో కుంగదీస్తున్నాయి, ఆవేదన పడిన తర్వాత ప్రతిసారీ నన్ను నేను మామూలు స్థితికి తెచ్చుకోవడానికి చాలా సమయం పడుతుంది. ఎంతో మానసిక సంఘర్షణ అనుభవించడం వలన నేను చదువు మీద మనసు పెట్టలేక పోతున్నాను. ఎంతో కాలం నుండి ఇది సాగుతోంది నేను ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి, ఎవరికైనా చెబితే నన్ను అసహ్యంగా చూస్తారేమో, వెలి వేసినట్టు ప్రవర్తిస్తారేమో అని భయం. అంతేకాక ఆ వ్యక్తి ఎవరు అనేది కూడా నేను బయటికి చెప్పలేను కారణం దాని వలన తనకంటే నాకే ఎక్కువగా నష్టం జరగవచ్చు. నా కష్టానికి ఒక పరిహారం చూపించండి.*

## వివరణ:

లైంగిక వేధింపులు అనేవి ఇవాళ్టి కాలంలో చాలా కీలకమైన సమస్య. పేద, ధనిక, మధ్యతరగతి పిల్ల వాళ్ళందరికి ఈ సమస్య ఎదురవవచ్చు. ఇందులో పిల్లలు ముఖ్యంగా తెలుసుకోవాల్సింది ఏమిటంటే జరిగినది ఏదైనా, చేసిన వ్యక్తి ఎవరైనా, అందులో నీ తప్పు ఉండరాదు. లైంగిక వేధింపులు చిన్న పిల్లల నుండి పెద్దల దాకా ఎవరికైనా జరగవచ్చు వీటికీ ఆడ మగ కూడా తేడా లేదు. మీకు జరిగిన అపరాధం చాలా దయనీయమైనదే కానీ దాని నుండి మిమ్మల్ని మీరే కాపాడుకోవాలి.

ఈ రోజుల్లో పిల్లలు అందరూ సామాజిక మాధ్యమాలలో వుండటం వలన, అన్ని విషయాలలో కూడా సునిశితమైన అవగాహన లేక పరిశీలన తప్పక వుంటుంది. ఎదుటి వ్యక్తి మిమ్మల్ని చూసే విధానం లోనే కొన్ని సార్లు మీకు అవగవతము అవుతుంది.

కొన్ని సందర్భాలలో పరస్పర ఆకర్షణతో కూడా కొంత తప్పు జరగవచ్చు. ఏదో ఆశించో, కుతూహలంతోనో, తెలుసుకుందామన్న ఆత్రం తోనో తప్పులు చేస్తున్నారు పిల్లలు. అలాంటి వారిని ఎవరు రక్షించ గలరు? ఒక వేళ ఎప్పుడైనా ఎదుటి వారు నచ్చనప్పుడు...అప్పటి దాకా చేసిందంతా లైంగిక వేధింపులుగా గా పేర్కొన్న వాళ్ళు కూడా లేక పోలేదు.

లైంగిక వేధింపులు...సాధారణంగా అమ్మాయిలకు ఎక్కువగా వుంటాయని చెప్పొచ్చు. అందుకే ఈ రోజుల్లో కూడా అమ్మాయిలు తమ గ్రామంలో చక్కగా చదివే వారైనా సరే, ఉన్నత చదువులకు తల్లి తండ్రులు వేరే ఊళ్లకు పంపించే సాహసం చేయలేక బడి మాన్పిస్తుంటారు. హాస్టల్ లో కూడా ఈ రోజుల్లో జరిగే సంఘటనలు తల్లి తండ్రులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. కేవలం ఇలాంటి కారణాల చేతనే ఎన్నో వేల మంది అమ్మాయిలను చదువు మాన్పించేస్తున్నారు.

సుమారు 18 సంవత్సరాల క్రితం అనుకుంటాను...నేను ఒక ఆధ్యాత్మిక క్షేత్రానికి వెళ్ళినప్పుడు...నాతో పాటుగా బస్సులో ప్రయాణం చేసిన ఒక కుటుంబము పరిచయం అయింది. తల్లీ తండ్రి ఇద్దరు అమ్మాయిలు ఒక అబ్బాయి. చాలా సరదాగా సమయం గడిపే వాళ్ళం. ఆనాటి నుండి నన్ను వాళ్ళందరూ చాలా ఆత్మీయంగా చూసేవాళ్లు. ఆ చిన్నారులు ఇప్పుడు జీవితాలలో స్థిరపడ్డారు కూడా. అయితే, రెండో అమ్మాయి ఉన్నత చదువులకై ఇంకో రాష్ట్రానికి వెళ్ళింది. చాలా ఏళ్ల తరవాత ఒక రోజు నాతో మాట్లాడుతూ చెప్పిన విషయం విని చాలా భాద కలిగింది. ఆడ పాప అని, తల్లిదండ్రులు ఆలోచించి తెలిసిన వాళ్ళింట్లో వుంచారు. చాలా దగ్గరి వాళ్లే. ఆ ఇంట్లో వున్న పెద్దాయన ఎంతో ఆత్మీయంగా వున్నాడు. కానీ ఒక రోజు ఈ అమ్మాయి వాష్ రూమ్ లో స్నానం చేస్తున్నప్పుడు దేవుడిని స్మరిస్తూ పైకి చూసి దండం పెడుతుంటే... పైన అమార్చబడిన సెల్ ఫోన్ చూసింది. భయంతో చచ్చిపోయి...దాన్ని చూస్తే అది ఆ ఇంట్లో పెద్దాయన ఫోన్. మొత్తం డిలీట్ చేసింది. బయటకు వచ్చి గొడవ చేస్తే...సరైన సమాధానం చెప్పలేక ఆ వ్యక్తి తల దించుకుంటే...ఆయన భార్య ఏదో తమాషాకు చేశాడని భర్తను రక్షించే ప్రయత్నం చేసింది. ఆ పాప మాత్రం ఇద్దరి మీదా ఉమ్మేసి ఆ వెధవను రెండు పీకి...ఒక హాస్టల్ చూసుకుని బయటకు వెళ్లి పోయింది. ఎలాంటి భయాందోళనలు లేకుండా ధైర్యంగా చదువు పూర్తి చేసి తన సొంత రాష్ట్రానికి చేరింది. ఆ అమ్మాయిని చూస్తే చాలా గర్వముగా అనిపించింది.

ఇక్కడ మనము గమనించాల్సింది ఏమిటి? ఏ విషయం బాగా నచ్చింది?

ఆ అమ్మాయి ఫోన్ చూసిందా?

ఫోన్ లో దృశ్యాలు డిలీట్ చేసిందా?

బయటకు వచ్చి ధైర్యంగా వాడిని పీకిందా?

భయంతో ఇంటికి వెళ్ళిపోవడమా?

హాస్టల్ చూసుకుని చదువు సాగించడమా?

నాకయితే, ఆ అమ్మాయి భయం లేకుండా... షాక్ నుండి తేరుకుని ధైర్యంగా హాస్టల్‌కు మారిపోయి తన ఉన్నత చదువులు పూర్తి చేసింది, బాగా నచ్చింది. మీరేమంటారు???

విషయం చిన్నదైనా...పెద్దదైనా చదువు మాత్రం విడువ వద్దు. కసిగా చదవండి. తపనతో సరస్వతి మాతనే సాక్షాత్కారం చేసుకోండి.

పిల్లలూ... మీరు చాలా జాగ్రత్తగా మసలు కోవాలి. ఈ రోజుల్లో అమ్మాయిలు అబ్బాయిలు కలిసి మెలసి తిరుగుతుంటారు... ఆడుతుంటారు... పాడుతుంటారు...

కానీ మీరొక లక్ష్మణ రేఖను గీసుకోవాలి. అది దాటి వెళ్లొద్దు. చదువుతో పాటు సంస్కారం కూడా మనము నేర్చుకోవాలి. అది మరచి ఎప్పుడూ ప్రవర్తించవద్దు.

If wealth is lost, nothing is lost
if health is lost, something is lost
but, if character is lost, everything is lost

శీలము అంటే సద్గుణములు. సత్ప్రవర్తన మంచి నడవడినిస్తాయి.

విద్యార్థులు ఎప్పుడు కూడా స్వయం నియంత్రణలో వుంటూ చదువుకు న్యాయం చేయాలి. విశృంఖలత అన్నది ఎప్పుడైనా మనకు చేటు చేస్తుందని గుర్తించి వర్తించాలి

## సూచనలు:

*ఇక మిమ్మల్ని మీరు కాపాడు కోవడానికి ఈ క్రింది సూచనలు పాటించండి*

1. *ఇంట్లో పెద్ద వారితో ఎంత కష్టమైనా సరే ముందుగా నిజం ఏమిటో చెప్పాలి.*
2. *ఎంత క్రమశిక్షణగా, కఠినంగా ఉండే తల్లిదండ్రులు అయినా ఈ విషయంలో వాళ్ళ పిల్లలకు వాళ్ళు ఖచ్చితంగా సహాయం చేస్తారు అని తెలుసుకోండి.*
3. *మీ తల్లిదండ్రులకు చెప్పుకోలేక పోయినట్లయితే కనీసం మీ ఇంట్లో తోబుట్టువులకు లేదా మంచి స్నేహితులకు లేదా ఎవరైనా మంచి చెప్పే పెద్దలకైనా మీ సమస్యని తెలియ జేయండి వారి ద్వారా మీ తల్లిదండ్రులకి తెలియజేయండి.*
4. *చట్టపరంగా కూడా మీకు ఎంతో సాయం ఉంటుంది, ఒకవేళ ఆ వ్యక్తి దుండగుడు, దుర్మార్గుడు అయితే పోలీసులను కూడా మీరు ఆశ్రయించవచ్చు.*
5. *ఈ మధ్యకాలంలో చాలా సంస్థలు హెల్ప్ లైన్ నెంబర్స్ ద్వారా చాలామందికి సహాయం చేస్తున్నాయి.*
6. *పోలీస్ నంబరు సిద్ధంగా ఉంచుకోండి.*
7. *సిగ్నల్ ప్రెస్ చేస్తే మీ ఇంట్లో వాళ్లకు కాల్ వెళ్లే విధంగా ఫోన్ ఉంచుకోండి*
8. *SHE Police సాయం తీసుకోండి.*
9. *మానసిక వేదన తగ్గించుకొనుటకై ఎవరైనా సైకియాట్రిస్ట్ దగ్గర కౌన్సెలింగ్ కూడా తీసుకోవచ్చు.*
10. *మిమ్మల్ని మీరు రక్షించుకోగలిగే పోరాట పద్ధతులను గుర్తించుకోండి.*
11. *చిన్న విషయమే కదా అని వదిలెయ్య వద్దు. చిన్న పామైనా పెద్ద కర్రతో కొట్టాలి అని తెలుసుకోండి.*
12. *రక్షణ పరికరాలు (కత్తి, బ్లేడ్, కారం, pepper spray మొ॥) మీ దగ్గర ఎల్లవేళలా బ్యాగులో సిద్ధంగా పెట్టుకోండి.*
13. *ఎటువంటి పరిస్థితులలోను ధైర్యం కోల్పోవద్దు.*

## ప్రేరణ మంత్రం:

*You are not a victim*
*for sharing your story.*
*You are a survivor setting*
*the world on fire with your truth.*
*You never know who needs*
*your light, your warmth*
*and raging courage.*

## స్ఫూర్తి:

ఎనిమిదేళ్ళ చిరుప్రాయంలోనే సామూహిక లైంగిక దాడికి గురయ్యారు. యాసిడ్ దాడిలో తన శరీరం బాగా దెబ్బతింది. అంతేకాక జీవితమంతా ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నారు కానీ ఆ అమ్మాయి తనకి జరిగిన అన్యాయానికి కృంగిపోలేదు. మొదట మానసికంగా శారీరకంగా తనను తాను తీర్చి దిద్దుకుంది. ఎంతో కష్టపడింది. ఆ తరువాత తనకు జరిగిన అన్యాయం మరొక మనిషికి జరగకూడదు అన్న దృఢనిశ్చయంతో ప్రజ్వల అనే సంస్థని స్థాపించారు. ఈ సంస్థ వేశ్యల పిల్లలని మరియు ఎన్నో విధాలుగా లైంగిక వేధింపులకు గురైన వారిని చేరదీసి ఆదుకొని వారికి చదువు, నీడ మరియు జీవితంలో బ్రతికేందుకు ఒక మార్గాన్ని చూపిస్తున్నారు. ఎన్నో వందల మంది ఆడపిల్లలను మరియు పసిపిల్లలను ఆవిడ వేశ్య గృహాల నుండి కాపాడారు. చాలాసార్లు ఆవిడ పిల్లల్ని కాపాడేందుకు వెళ్ళినప్పుడు ఎన్నో దెబ్బలు కూడా తిన్నారు. ఆవిడ మీద హత్యాయత్నాలు కూడా జరిగాయి. కానీ ఆవిడ ఏనాడు తన యజ్ఞం కొనసాగించడంలో వెనకడుగు వేయలేదు దేనికీ భయపడలేదు కూడా. ఇంతకూ అవిడెవరో తెలుసా... సునీతా కృష్ణన్. ఆ మధ్య ఒక సమావేశంలో నేను కలిసినప్పుడు... ఆవిడను చూసాను. ఎంతో ఆనందమయింది.

పిల్లలూ! ఎన్నో సార్లు మన జీవితంలో ఏం జరుగుతుంది అన్నది మన చేతుల్లో ఉండదు మనం ఎంత ప్రయత్నించినా దాన్ని మనం అదుపు చేయలేము, కానీ మనకు జరిగిన దాన్ని గురించి మనం ఎలా స్పందించామో, దాని నుండి మనం ఎటువంటి వ్యక్తిగా మారాము అన్నది జీవితం. గొప్ప వాళ్లందరూ కూడా అసాధారణ పరిస్థితుల్లోనే గొప్పవారుగా మారారు అన్నది మీరు గుర్తుంచుకోవాలి.



# 29. హేళన / వివక్ష



## సమస్య:

*సార్, నా తోటి విద్యార్థులు నన్ను చాలా హేళన చేస్తున్నారు. నేను అనాకారిగా వున్నానని నవ్వుతుంటారు.*
*నా కులం గురించి హేళనగా మాట్లాడతారు.*
*నేను నల్లగా వుండటం తోటి వాళ్లకు వింతగా వుంటుందేమో.*
*చదువులో వెనక బడ్డానని టీచర్లు తమాషా చేస్తుంటారు.*
*తోటి వాళ్ళు నా మీద వేసే జోకులు విని తట్టుకోలేక పోతున్నాను ఒక్కోసారి అవి నన్ను ఎంతో ఆత్మన్యూనతా భావానికి గురిచేస్తాయి. స్కూలుకు/కాలేజీకి వెళ్ళాలంటే కూడా నాకు భయమేస్తుంది, వీళ్ళ మాటలు పడలేక. ఇవన్నీ, చదువు మీద ప్రభావం చూపించి నన్ను మరింత కుంగుబాటుకు గురిచేస్తున్నాయి.*

## వివరణ:

పిల్లలూ! నిజానికి ఈ సమస్యలతో సిగ్గు పడవలసినది మీరు కాదు. ఎవరైతే మిమ్మల్ని హేళన చేస్తున్నారో వాళ్ళు సిగ్గుపడాలి. ఎందు కంటే ఒక మనిషి శరీరాకృతిని చూచి కించపరచడం అన్నది చాలా బాధాకరమైన విషయం. మనిషికి రంగు రూపం అనేవి దేవుడిచ్చినవే కాబట్టి అది ఏదైనా సరే మనం గౌరవించాలి తప్ప అవహేళన చేయకూడదు. అయినప్పటికీ మీరు తెలుసుకోవాల్సిన విషయం

ఏమిటంటే మనిషికి రూపం అనేది కేవలం ఒక వస్త్రం లాంటిది మాత్రమే నిజానికి మనిషి నిజరూపం తన స్వభావమే! మనం ఎదుటి వ్యక్తిలో చూడవలసింది ఏమిటో తెలుసా వారి గుణము, స్వభావం మరియు పని మాత్రమే! రూపం కాదు.

ఇలాంటి సమస్యలు ఈ రోజువి మాత్రమే కాదు...ఎన్నో ఏళ్ళ నుంచి మనుషులు తమ తోటి వాళ్ల ఆకారం విషయంలో హేళన చేస్తూనే ఉన్నారు. కొందరు ఎదురుగానే చేస్తే...ఇంకొందరు వెనక అనుకుంటారు. నిపుణులు చెప్పేదేమిటంటే అలా అవహేళన చేసే వాళ్ళు, వాళ్ళ ఆత్మన్యూనతా భావాన్ని కప్పిపుచ్చు కోవడానికి అవతలి వారిని కించపరిచి మాట్లాడుతుంటారని. ఇది ఒక మానసిక రుగ్మత అని చెప్పాలి. కాబట్టి మిమ్మల్ని ఎవరైనా హేళన చేస్తే...మొదట వాళ్ళ రుగ్మతను గుర్తించి జాలి పడడం నేర్చుకోండి. అప్పుడు వాళ్ళను క్షమించే స్థాయి కలుగుతుంది.

అలాగే, ఎవరైనా సరే మీ రంగు, ఒడ్డు, పొడుగు, చదువు, మాట, కులం గురుంచి హేళనగా మాట్లాడితే మీరు ధైర్యంగా వాళ్ళకు చెప్పండి అవును నేను కేవలం భౌతికంగానే అనాకారిని...కానీ మీరు మానసికంగా అనాకారులు...మిమ్మల్ని చూసి జాలి పడుతున్నాను. అందమైన మీ ఒంట్లో వికృతమైన మనసు వుండటం వలన మీరు కూడా నాకు అంద వికారంగానే కనిపిస్తున్నారు. గొడవ పడద్దు... తగువులాడద్దు... వాదులాడద్దు. కేవలం చిన్న చిరునవ్వుతో మరియు ఆత్మ విశ్వాసంతో సమాధానం ఇవ్వండి. ఎదుటివారు ఏమీ మాట్లాడలేకపోతారు.

ఒక్కటి గమనించండి...ప్రపంచంలో ఇప్పటి దాకా ఎవరు అద్భుతాలు సాధించినా వాళ్ళరంగు... కులము... జాతి...ఒడ్డు...పొడవు...వీటిని బట్టి సాధించలేదు. వాళ్ళ ప్రతిభ ఆధారంగానే ఉన్నత శిఖరాలు అధిరోహించారు.

ఒక సమావేశంలో నేను ఈ విషయమై మాట్లాడుతుంటే... వెంటనే ఒక తుంటరి పిల్లాడు...సార్ అందాల పోటీలలో చాలా అందంగా వున్న వారికే కదా కిరీటం పెడతారు అని నవ్వుతూ చెప్పాడు. నేను కూడా నవ్వుతూ...నాయనా, అందాల పోటీలలో అన్నింటికీ మించి పోటీ దారులలో మానసిక పరిపక్వతను కూడా పరిగణలోకి తీసుకుంటారు. అందం వున్నా...ఈ అంశములో రాణించలేక వెను తిరిగిన వాళ్ళు బోలెడు మందున్నారు. అంతే కాదు...మనము నల్లని రంగు వాళ్ళను చూసి హేళన చేస్తున్నాం కదా...నువ్వు చెప్పిన అదే అందాల పోటీలలో విశ్వ సుందరిగా ఆఫ్రికా మహిళ కూడా నిలచిన సందర్భాలున్నాయి...నీకు తెలుసా? అని అడిగాను.

ఇంకొన్ని సమావేశాలలో... పిల్లలు ఎంతో మంది అతి కొద్ది సమయంలో నా మాటలకు ప్రభావితం అయిపోతారు. కానీ కొద్ది మంది తుంటరి పిల్లలు మాత్రం నన్ను ఆట పట్టించే ప్రయత్నం చేస్తుంటారు. నేను వాళ్ళను విడువను...వాడు ఒక్కటంటే...నేను రెండంటా. చివరికి వాడు కూడా దాసోహం కావాలి. అంతే తప్ప నేను తగ్గను.

పక్కవాడు నలుపని హేళన చేసే మనం పూర్వం మనలను 300 ఏళ్ళు పాలించిన వాళ్ళను తెల్ల వాళ్ళు అని పిలిచే వాళ్ళం. అప్పుడు నల్లవాళ్ళు ఎవరు...మొత్తం మన జాతి అంతానే కదా... మరిప్పుడేమో ఇలా అన్నవాడు ఒక్కడే తెల్లవాడా? అంటే పరాయి దేశం వాడా అని అడగండి...వాడు తప్పక నోరు మూస్తాడు.

నలుపు అంటే బంగారు లేడి PT ఉషను తలవండి
నలుపు అంటే సూపర్ స్టార్ రజనీకాంత్‌ను చూపండి
బుద్ధి మాంద్యం అంటే ఐన్‌స్టీన్‌ను చూపండి
పొడవంటే... అమితాబ్‌బచ్చన్, సింధుల కథ చెప్పండి
అనాకారి అంటే– శ్రీ కస్తూరి శివరావు గారిని చూపండి. గొప్ప సినిమా యాక్టర్‌గా పేరుతెచ్చుకున్నారు. (గుణసుందరి అనుకుంటా–సినిమాపేరు)

"Though I am not handsome, I want to give my hand (helping hand) to some" అన్నారు Dr. అబ్దుల్ కలాంగారు. భౌతిక/శారీరక అందం కంటే మానసిక అందం చాలా గొప్పది.

కులం అంటే...బాబా అంబేద్కరును తలవండి

జాతి వివక్షనా...జాతిపితను గుర్తుంచుకోండి.

అనారోగ్యం అంటే హాకింగ్స్‌ని చూపండి

వీళ్లందరికీ ఏదో సమస్య వుంది... కానీ వాళ్లందరికీ అత్యంత అద్భుతమైన ప్రతిభ వుంది అని గ్రహించండి. మీరు పాయసం త్రాగే సమయంలో పాయసం రుచి చూస్తారా లేక కప్పు రుచి చూస్తారా...లోని కంటెంట్ బాగుంటే ఇక కంటైనరు గురించి తాపత్రయం ఎందుకు చెప్పండి?

పూర్వం అమ్మ కడుపులో వున్నప్పుడే, తండ్రి చెప్పే సకల శాస్త్రాలు వింటూ పెరగసాగాడు వీడు. ఒక రోజు తండ్రి వల్లించే పాఠాములలో తప్పు ఎత్తి చూపిస్తూ కడుపులో నుండే తప్పు సరిదిద్దాడు. అందుకు తండ్రి ఆగ్రహించి, నా పాఠాలకే వంకర పెడతావా అని...అష్ట వంకరలతో జన్మించు అని శపించాడు. ఆ కారణం చేత అతను అనాకారిగా పుట్టి, అష్టావక్రుడిగా పిలువ బడ్డాడు. రాజసభలో వేద చర్చలో పాల్గొనడానికి వెళ్ళిన వారిని చూచి అందరూ నవ్వితే...అయ్యా నేను ఇది పండిత సభ అనుకున్నాను...నాకు భౌతికంగా ఆకారంలో వంకర వుంది... కానీ ఇక్కడున్న మీ బుద్ధికి చాలా వంకరలున్నాయి అన్నాడు. అందరూ సిగ్గుతో తల దించుకున్నారు. ఆయన అష్టావక్రమహర్షి, బ్రహ్మజ్ఞాని. వేదవేదాంగవేత్త.

నాకు బాగా గుర్తు, నేను డిగ్రీ చదివిన తరువాత, బెంగళూరులో కంపెనీ సెక్రటరీ చదవడానికి వెళ్ళిన రోజులు (1990) ఒక్క తెలుగు తప్ప ఏమీ వచ్చేది కాదు. కన్నడ, ఆంగ్లము, హిందీలో మాట్లాడటం అసలు వచ్చేది కాదు. ప్రత్యేకించి CS కేంద్రములో నిర్వహించే తరగతులలో నన్ను చూసి... నా అచ్చమైన తెలుగు చూసి అందరూ నవ్వే వారు. నేను చాలా స్నేహంగా వచ్చి రాని ఇంగ్లీష్‌లో మాట్లాడే వాడిని. భోధకులు చెప్పున్న ప్రతి విషయం ఎంతో శ్రద్ధగా పుస్తకంలో వ్రాసుకునే వాడిని. కారణం ఆ ఇంగ్లీష్ ముక్కలు అర్థం అయ్యేవి కాదు. అందరూ పడి పడి నవ్వే వారు. కానీ, న్యాయ శాస్త్రం యూనిట్ టెస్ట్‌లో తెచ్చుకున్న మార్కులు, అక్కడ చదివే 40 మందికంటే నాకే ఎక్కువ వచ్చాయి. ఇంకెవరూ మళ్ళీ నన్ను హేళన చేయలేదు. ప్రతిగా నాకు చదువులో సాయం చేసేవారు.

పిల్లలూ, మీరు జాగ్రత్తగా గుర్తుంచుకోవాల్సిన విషయాలు చూడండి.

## సూచనలు:

1. *ఎదుటి వాళ్ళు హేళన చేస్తే...అలా చేయడం వారి రుగ్మత అనుకోండి.*
2. *శృతి మించినప్పుడు స్నేహితుల సహాయం లేక ఉపాధ్యాయుల సహాయం తీసుకోండి.*
3. *ఒకవేళ ఉపాధ్యాయులే మిమ్మల్ని కించపరిచినట్లు అయితే సున్నితంగా ఒకసారి మీ ఉపాధ్యాయులతో ప్రైవేట్‌గా మాట్లాడి ఇది మీకు నచ్చడం లేదు అని తెలియజేయండి*
4. *అవసరం అనుకుంటే తల్లిదండ్రులకు లేకపోతే కళాశాల యాజమాన్యం వారికి తెలియ చేయండి.*
5. *మిమ్మల్ని మీరుగా గౌరవించే వాళ్ళనే స్నేహితులుగా ఎన్నుకోండి*
6. *వివక్ష చూపించే ఉపాధ్యాయుల అభిప్రాయాలను తేలికగా తీసుకుని వాళ్ళు చెప్పే పాఠాలు వినండి.*
7. *మీ నైపుణ్యంతో దేనికైనాసరే పదును పెట్టండి*

*అది ఆటైనా, పాటైనా, మాటైనా, విద్యయినా, ఏదైనా సరే, అందరి కంటే ప్రావీణ్యం తెచ్చుకోండి తద్వారా అందరూ మిమ్మల్ని అభిమానంతో చూస్తారు.*

*8. ఒకవేళ మీరు చదువులో వెనకంజలో ఉన్నారు అని మీరు అవహేళనకు గురి అయినట్లు అయితే అదే సాకుగా తీసుకుని గొప్పగా చదవాలని దీక్ష పూనండి. చాలా సార్లు మనిషికి నొప్పి తగిలినప్పుడు గట్టివాడుగా మారతాడు. వేరొకరి సహాయం తీసుకుని అయినా సరే పట్టుదలతో చదవండి. అలా మీరు పట్టుదలతో మంచిగా చదువుకొని ఉత్తీర్ణత సాధించినట్లైతే అందరూ ఆశ్చర్యానికి గురి అవుతారు, అభినందిస్తారు.*

## ప్రేరణ మంత్రం:

*I wish to live in a nation where I will not be judged by the color, creed, caste, religion, reason, season, language...but by the content of my character.*

## స్ఫూర్తి:

బాల్యంలోనే అడుగడుగునా బాధలకు, అవమానాలకు గురియై, బీదరికాన్ని ఎదుర్కొంటూ స్వయంకృషితో, స్వీయప్రతిభతో స్వతంత్ర భారతదేశంలో కేంద్రమంత్రి పదవిని అలంకరించిన మహామనీషి. భారతరత్నము అయిన వారు.

తరగతి గదిలో లో ఒక మూల కూర్చొనే వాడు.
నీళ్లున్న కుండ కూడా ముట్టుకోలేని దురవస్థ.
దాహంతో బావి నీళ్లు త్రాగితే తన్ని పంపేవారు
ఎడ్ల బండి వాడు, డబ్బిచ్చినా తోలేవాడు కాదు.
తనకిష్టమైన సంస్కృతం చదవలేక పోయాడు
అతను దీక్షతో చదివి డాక్టరేట్ సంపాదించాడు
నౌకర్లు కూడా వారిని గౌరవంగా చూడలేదేనాడు
విదేశాలలో ఉన్నత విద్యలు చదివాడు
హిందూ మతంలో దురాచారాలు ఖండించేవాడు
మను స్మృతిని కూడా అంగీకరించలేదు
అస్పృశ్యత నివారణకు నడుం బిగించాడు
స్వాతంత్ర్య సంగ్రామ సైనికుడయ్యాడు
న్యాయశాఖ మంత్రిగా మన్ననలందుకున్నాడు
రాజ్యాంగ నిర్మాతగా భావితరాల మార్గదర్శకుడయ్యాడు
భారతరత్న బిరుదుతో గౌరవించబడ్డాడు.

తెలుసు కదా ఈ మహనీయుడు ఎవరన్నది...

**భారతరత్న Dr. బాబా సాహెబ్ భీంరావ్ అంబేద్కర్.**

హేళన...వివక్ష అని ఏడుస్తున్న పిల్లలందరూ...

ఇట్టి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుంటే ఇక మహాద్భుతాలు సృష్టించవచ్చు.



# 30. నిరాశ




## సమస్య:

*అయ్యా నేను ఎంత చదివినా నాకు అంతంతమాత్రంగానే ఫలితాలు వస్తున్నాయి. ఎన్నో సార్లు కష్ట పడినా కానీ పెద్దగా ఫలితం రాలేదు. దానితో నాకు నిరాశ కలుగుతుంది, ఇక ఇంకోసారి ఎప్పుడైనా గట్టిగా ప్రయత్నం చేద్దాము అని అనిపించినా, ప్రయత్నం చేస్తే మాత్రం వచ్చేది ఏముంది అని నిరాశ కలుగుతుంది. ఇలా అనుకుని అనుకుని, నిరాశావాదిగా మరిపోతానని భయమేస్తుంది! అలా అని ఆశావాదిని అయ్యే ప్రయత్నం చేస్తే, మంచి ఫలితాన్ని ఆశించి అది రానప్పుడు వచ్చే నిరాశని తట్టుకోలేకపోతున్నాను, దయచేసి ఈ నా సమస్యకు సరి అయిన సొల్యూషన్ ఇవ్వండి.*

## వివరణ:

పిల్లలూ! నిజానికి చాలామంది ఆశావాదం అంటే అంతా మంచే జరుగుతుంది అని అనుకోవడం అని అనుకుంటారు. కానీ నిజం ఏమిటో తెలుసా ఆశావాదం అంటే, ఏది జరిగినా మన మంచికే అని అనుకోవడం. ఈ చిన్న కిటుకు తెలియక చాలామంది మల్లగుల్లాలు పడుతున్నారు. పెద్ద వాళ్ళెప్పుడూ చెప్తుంటారు...ఏదైనా పని ప్రారంభించడానికి ముందు కీడెంచి మేలెంచాలి అని. కారణం ఏమిటంటే అప్పుడు మనము దుర్భరమైన పరిస్థితులను కూడా ముందే ఊహించడము వలన కష్టాన్ని నష్టాన్ని ధైర్యంగా ఎదుర్కోవచ్చు. అలాగే... ఒకసారి పని మొదలు పెట్టామంటే... ఇక ఏమి జరిగినా అన్నీ మన మంచికే అన్న దృక్పథంతో ముందుకు

సాగాలి. అప్పుడు అపజయాలను కూడా సోపానాలుగా మార్చుకుంటూ విజయ పథంలో పయనించే సామర్థ్యం మనదవుతుంది.

మీరు మొదటిసారి ప్రయత్నించినప్పుడు ఫలితం రాలేదు, రెండోసారి కఠోర శ్రమ చేశారు అయినా ఫలితం రాలేదు, అని మూడోసారికే నీరసం పొందారు, ఇది ఏమాత్రం సరైనది కాదు. ఒక్క అడుగు వెనక్కి పడినంత మాత్రాన మన మేమి వెనక బడినట్టు కాదు...బాణాన్ని చెవిదాకా సంధించి విడిచినట్లు...వెనక అడుగు వేయడం అన్నది తెలుసుకోవాలి. సింహం రెండడుగులు వెనక్కి వేసి రెట్టింపు వేగంతో పరుగెత్తుకొచ్చి, దాని లక్ష్యాన్ని పట్టుకుంటుంది.

కొన్ని కొన్ని సార్లు కేవలం కఠోర పరిశ్రమ మనకు మంచి ఫలితాలను ఇవ్వదు, మనము సూక్ష్మంగా పరిశీలన చేయాలి మనం ఏ అంశంలో వెనుకబడి ఉన్నాము అని! చదవడంలోనా, సమస్యను అర్థం చేసుకోవడంలోనా లేక, సమాధానం గుర్తు పెట్టుకోవడంలోనా లేక దాన్ని నిత్య జీవితంలో అనుష్ఠించలేకపోవడమా అని! అలా మన సమస్య ఎక్కడుంది అనేది మనం గ్రహించుకుని దానికి తగ్గట్టుగా మనం ప్రయత్నం చేయాలి.

ఒకవేళ మీ వలన అది సాధ్యం కాకపోతే పెద్దల సహాయం తీసుకోవాలి. ఏదైనా సరే మొత్తానికి మంచి ఫలితాలు సాధించే వరకు మీరు పట్టు విడవకూడదు.

నిజానికి నిరాశ కేవలం చదువులోనే కాదు జీవితంలో కూడా ఎప్పటికీ రాకూడదు. ఎందుకంటే అది ఒక మబ్బులా మీ కళ్ళను కప్పేసి మీకు నిజాన్ని తెలియనివ్వకుండా చేస్తుంది. గుర్తుపెట్టుకోండి పిల్లలూ ఇప్పుడే కాదు జీవితంలో ఎప్పుడైనా నిరాశని దరి చేర్చుకోకండి. మీ మనసులో నిరాశ జాడలు ఎక్కడైనా కనిపిస్తే వాటిని వెంటనే తుంచి పడేయండి.

ప్రతి చిన్న విషయానికి మీరు నిరాశా నిస్పృహలకు లోనైతే...మీ వ్యక్తిత్వమే కాదు... మీ చుట్టూ వున్న ప్రపంచమే మీకు రుచించదు అని గుర్తుంచుకోండి.

## సూచనలు:

1. *వ్యక్తిత్వవికాస పుస్తకాలు చదవండి*
2. *జీవితంలో ఓటమి తోనే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వారి జీవితాలను పరిశీలించండి*
3. *ఆశతో కాదు ఆశయంతో బ్రతకడం నేర్చుకోండి*
4. *నిరాశ మీ శక్తిని తుత్తినియలు చేస్తుంది.*

## ప్రేరణ మంత్రం:

*Hope is being able to see that there is light despite of the darkness.*

## స్ఫూర్తి:

పంతొమ్మిదవ శతాబ్దంలో, ఒక పిల్లాడి తల్లికి, పాఠశాల యాజమాన్యం నుండి ఒక లేఖ వచ్చిందట. ఆ లేఖ సారాంశం ఏమనగా "మీ పిల్లవాడు మానసికంగా ఎదగలేదు, మేము చెప్పే పాఠాలు అతను అర్థం చేసుకునే పరిస్థితిలో లేడు. కాబట్టి మీ పిల్లవాడిని బడికి పంపకండి. ఎందుకంటే ఏ పాఠశాల మీ పిల్లవాడికి బోధన చేయలేదు."

ఆ లేఖ చదివిన తల్లి కంటతడి పెడుతూ వుంటే...ఆ చిన్న పిల్లవాడు చాలా అమాయకంగా ఏమైందమ్మా అని అడిగాడు. ఆ తల్లి ఇలా చెప్పిందట "నాయనా నువ్వు గొప్ప విద్యార్థి అట నీకు బోధించే సామర్థ్యం ఆ స్కూల్ వాళ్ల దగ్గర లేదట అందుకు నిన్ను పాఠశాలకు పంపవద్దు అన్నారు!" అని!

ఆమె తనకు తెలిసిన పాఠాలు ఇంట్లోనే భోదించడము ప్రారంభించింది. ఇంతకీ ఆ చిన్న పిల్లవాడు పెరిగి పెద్దయిన తరవాత ఏమయ్యాడో తెలుసా...ప్రపంచ

ప్రఖ్యాత శాస్త్రవేత్త అయ్యాడు. అతనే థామస్ అల్వా ఎడిసన్.

విద్యుత్కాంతి కనుగొని, కొన్ని దశాబ్దాలుగా కోట్ల మంది ప్రజల జీవితాల్ని, తద్వారా ప్రపంచాన్ని మార్చగలిగారు థామస్ అల్వా ఎడిసన్.

ఇంకో గమ్మత్తయిన విషయం ఏమిటంటే, 1000 సార్లు ప్రయత్నించి విఫలం అయిన తరువాత గాని ఆయన బల్బుని కనుగొనలేకపోయాడు. అయిన విఫల ప్రయత్నాల గురించి, ఆయన తమాషాగా ఇలా చెప్పేవారట. నేను బల్బు 1000 మార్గాలలో ఎలా తయారు చేయలేనో కనుగొన్నాను అని. అంటే తన వైఫల్యాలను కూడా ఎంతో ఆశా వాహ దృక్పథముతో సమర్ధించుకున్నారు. ఒకసారి ప్రెస్ రిపోర్టర్ వచ్చి, మీ విజయానికి కారణం ఏమిటి? అని అడిగితే, ఆయన 99% Perspiration and 1% Inspiration అని చెప్పారట.

ఇప్పుడు చెప్పండి పిల్లలూ మీ లాగే రెండో ప్రయత్నానికి మూడో ప్రయత్నానికి విఫలం చెంది... ఆయన కూడా నిరాశ చెంది నిస్పృహతో అన్నీ వదిలేసి ఉండి ఉంటే ఇవాళ మనం ఆయన అద్భుతమైన అవిష్కరణలను అనుభవించే వాళ్ళమా?

అదేవిధంగా ఆయన తల్లి... ఎవరో స్కూల్ వాళ్ళు రాసిన ఒక లేఖను పట్టుకుని ఆ పిల్లవాడిని ఒక మూల కూర్చో పెట్టి ఉంటే, అయన అంత గొప్పవాడు అయ్యే వాడా? కనుక ఎప్పుడూ ఆత్మస్థైర్యంతో, పట్టుదలతో ముందుకు సాగాలి. అప్పుడే విజయం వరిస్తుంది.

జీవితంలో గెలుపు ఓటములు అన్నవి సహజమే, గెలుపు వచ్చిందని పొంగి పోవడం లేదా ఓటమి వచ్చింది అని కుంగి పోవడం రెండూ తప్పే. అన్నిటినీ సమపాళ్ళలో తీసుకుని ముందుకు వెళ్ళడమే జీవితం. మీ నిరాశానిస్పృహలకు స్వస్తి చెప్పి, స్థిరమైన చిత్తంతో... దృఢమైన సంకల్పంతో... మడమ తిప్పని ధోరణితో ప్రయత్నం మొదలు పెట్టండి. విజయం తప్పక మీ వెంట పడుతుంది.



# 31. నేను అనాధ



## సమస్య:

*సార్ నేను అనాధను*
*నాకు తల్లి లేదు... తండ్రి చూసుకోడు*
*నాకు తండ్రి లేదు... తల్లిని నేనే చూడాలి*
*అనాధ... చెప్పే వాళ్ళు ఎవ్వరూ లేరు*
*నేను అనాధను, నన్ను చిన్న చూపు చూస్తారు.*
*మంచి చెడు చెప్పే వాళ్ళెవ్వరు లేరు*
*నేను చదివినా చదవకున్నా తేడా ఏమీ లేదు*
*నాకు చదువుకోవడం వృధా అనిపిస్తోంది*

## వివరణ:

పిల్లలూ! మీరు అనాధలుగా వున్నందుకు చదవలేక పోతున్నాము అని చెప్పడం కాస్తా భాధ కలిగించే విషయమే. కానీ, అనాధలు అంటే అన్నం తింటున్నారా? లేదా? శ్వాస తీసుకుంటున్నారా? లేదా?

పిల్లలూ, ఒకటి చెప్పండి...అనాధలు మనుషులు కాదా? అంటే కన్న వారు, కనిపెట్టుకుని వుండే వారు లేకపోతే ఇక జీవితం నాశనం అయినట్లేనా? అవును అంటే మాత్రం నేను ఒప్పుకోను. అనాధలైనవాళ్ళే ఇంకా

ఎక్కువగా బాగుపడడానికి అవకాశం వుంది. ఎలా అంటారా?

- అన్నీ తనే చూసుకునే అవకాశాలు వున్నాయి
- కష్టసుఖాలను ఎదుర్కోవడం వలన జీవితంలో నైపుణ్యాలు పెరుగుతాయి.
- తల్లిదండ్రులు లేక పోవడం వలన స్వంతంగా ఆలోచించే నిర్ణయాత్మక శక్తి పెరుగుతుంది.
- చుట్టూ ఉన్న సమాజంలో ఎదుర్కొంటున్న అంశాలు పరిపూర్ణమైన విషయ పరిజ్ఞానాన్ని పెంచుతాయి.
- జీవితంలో తోడు నిలిచే వాళ్ళను గుర్తించడం సాధ్యం అవుతుంది.
- అనాధలకు చేయూత నందించే అద్భుత వ్యక్తులు మరియు సంస్థల గురించిన అవగాహన కలుగుతుంది.

ఇలా...నిన్ను నీవు ఒక అద్భుత వ్యక్తిగా తీర్చి దిద్దుకునే అవకాశం కలుగుతుంది. మన చుట్టూ ఉన్నది మాత్రమే ప్రపంచం... మనకు కనిపించే వాళ్ళే మనకు హితము చేస్తారని అనుకోవద్దు. మన జీవితంలో ఒక తలుపు మూసివుందని నిత్యము మనలని మనము నిరాశావాదంలోకి దించటం కంటే... దేవుడు మనకు ఇంకో వైపు తెరచిన ఇంకా ఎన్నో తలుపులను గుర్తించడం నేర్చుకోవాలి.

తల్లిని పోగొట్టుకుని తండ్రి నీడ లో పెరిగి అద్భుతాలు సాధించిన వాళ్ళు లేరంటారా? తండ్రిని కోల్పోయి, తల్లి పోషణలో విజయాలు సాధించిన వాళ్ళు మీకెప్పుడు తారస పడలేదా? అసలు తల్లి తండ్రి ఇద్దరు లేకున్నా జీవితములో తమను తాము తీర్చి దిద్దుకుంటూ పది మందికి స్ఫూర్తి నందించిన వాళ్ళు దేశంలో లేరంటారా?

కొన్ని సందర్భాలలో అనాధగా ఉండడం కూడా అదృష్టం అనిపిస్తుంది. ఎలా అంటే, తాగుబోతు తండ్రితో బాధ ఉండదు, తల్లిదండ్రుల కలలను బలవంతంగా భరించ వలసిన అవసరం ఉండదు, మనకు నచ్చిన లక్ష్యాన్ని నిర్దేశించుకోవచ్చు, సక్రమమైన మార్గంలో స్వేచ్ఛగా స్వచ్ఛముగ బతకవచ్చు.. ఇలా చెప్తూ పోతే అనేక రకాలుగా మీరు కూడా అదృష్టవంతులే...

పిల్లలూ...అయినా మనం, మన చుట్టూ వున్న వారికి వినోదం పంచే వస్తువు కాకూడదు...స్ఫూర్తినిచ్చే వాళ్ళుగా నిలవాలంటే, ఖచ్చితంగా ధైర్యంతో, స్థైర్యంతో ముందడుగు వేయాలి. చుట్టూతా ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కోలేక పారిపోవడం కంటే, ధైర్యంగా ఎదుర్కొని సాధించి నిలబడితేనే జీవితం సార్థకం అవుతుంది.

దానికి తోడు, అసలు జీవితంలో ఏదైనా సాధించగలరో లేదో ఒక సారి మీకు మీరే నిర్ణయం చేయండి. అప్పుడు దాన్ని సాధించడమే పెద్ద లక్ష్యంగా పెట్టుకుంటే మిగితా చిన్న చిన్న సవాళ్లు ఏవైనా పట్టించుకోకుండా ముందుకెళ్ళొచ్చు.

ఎవరు వెక్కిరించినా...వెటకారం చేసినా...హేళన చేసినా, ఎప్పుడూ కూడా వాటి గురించి పట్టించుకొని, మీదారి తప్పి, మీ జీవితంలో ఓడి పోవద్దు. నీవు చేసేది మంచి అయినప్పుడు ఇక ఎవరి గురించీ నీవు భయపడే అవసరం లేదు.

## సూచనలు:

*1. తల్లిదండ్రులు లేకుండా స్వతంత్రముగా జీవించడం చాలా కష్టమే, కానీ మీరు దేవుడిని మీ తోడుగా తీసుకుని ముందుకెళ్లండి. అప్పుడిక తప్పు చేయడానికి అవకాశం వుండదు.*

*2. చదువును ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకుండా... దానిని మీ జీవిత పురోభివృద్ధికి ఒక సోపానంలా తయారు చేయండి.*

*3. ఆత్మ విశ్వాసముతో జీవించడం మరియు*

నిర్ణయాలు తీసుకోవడం నేర్చుకోండి. ఒక వేళ నిర్ణయాలు తప్పయితే... అనుభవం మిగులుతుంది.

4. మీ పనులు మీరే చేసుకోవడం నేర్చుకోండి. వంట చేయడం, ఇల్లు సర్దుకోవడం, బట్టలు ఉతకడం, సరుకులు తెచ్చుకోవడం ఇలా ప్రతి పనీ మిమ్మల్ని ఎంతో ప్రతిభా వంతుడిగా చేస్తుంది.

5. నెల నెలా మీరు సంపాదించేది ఏమిటి, ఖర్చులు ఎలా వున్నాయి అన్నదాని మీద కూడా అవగాహన ఉండాలి.

6. తల్లిదండ్రులు లేకున్నా... దగ్గరి బంధువులు తప్పక వుంటారు, అలాంటి వాళ్ళతో తరచు కలుస్తూ వారి సూచనలు సలహాలు తీసుకోండి. మంచి సంబంధ భాంధవ్యాలు ఉంచుకోండి. కానీ వాళ్ళు మీ కష్టాన్ని ఆసరాగా చేసుకుని తప్పుడు మార్గంలో నెట్టాలనుకుంటే మాత్రం ఊరుకోవద్దు

7. మీ జీవితంలో మంచి స్నేహితులను సంపాదించండి. ఎల్లప్పుడు కూడా వాళ్ళ ప్రేమకు పాత్రులయ్యే విధంగా మసలుకోండి.

8. మీరు సంపాదించడం మొదలు పెట్టినప్పుడు, అది మీ కుటుంబాన్ని చూసుకునే విధంగా వుంటే, పెళ్ళి చేసుకోండి. అప్పుడు మీకొక కుటుంబం ఏర్పడుతుంది.

9. మీకంటూ ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని జీవితములో దానిని సాధించడం కోసం శ్రమించండి.

10. వినయ విధేయతలు, నేర్చుకోవడం, తెలుసుకోవడం అన్నవి మీ జీవితములో భాగం అవ్వాలి.

11. వీలయితే, మంచి స్వచ్ఛంద సంస్థలలో చేరి మీకు చేతనయిన సాయం చేయండి. అక్కడ మీకు ఉన్నత మైన వ్యక్తిత్వం వుండే వాళ్ళు పరిచయం అవుతారు.

12. సర్వమానవాళినీ, సమస్త ప్రాణికోటినీ మీ కుటుంబంగా భావించండి, ప్రేమించండి. "ఉదారచరితానాంతు వసుధైవ కుటుంబకమ్"॥

## ప్రేరణ మంత్రము:

*I'm an orphan. But the public has adopted me, and that has been my only family.*

## స్ఫూర్తి:

తెలంగాణ రాష్ట్రములోని, మహేశ్వరం మండలంలోని ఒక మారు మూల కుగ్రామం కొండ పలకల. ఓ 8 ఏళ్ళ అమ్మాయికి... ఒక రోజు నిద్ర లేస్తూనే, మంటల్లో కాలి పోతున్న తల్లి కనిపించింది. అతి చిన్న వయసులో తాగుబోతు తండ్రి, హింసించే నానమ్మలతో వేగలేక, ఏటో పోయి బ్రతకడమే మేలని నిర్ణయించుకుంది. తెలిసిన బంధువుల దగ్గరికి వెళ్ళింది, వాళ్ళు అమ్మాయికి మంచి మాటలు చెప్పి, తన ఒంటి మీద బంగారు తీసుకుని ఇళ్ళల్లో పనికి పంపించారు. చాలా దుర్భరమైన జీవితం అతి చిన్న వయసులో అనుభవించింది.

అక్కడి నుండి పారిపోయి, వీధుల్లో తిరుగుతుంటే పోలీసులు రక్షించి హైదరాబాద్ లోని అంకురం అన్న స్వచ్ఛంద సంస్థలో చేర్చారు. అక్కడ తను విద్యాభ్యాసం చేసింది. చిత్రకళలలో మంచి పట్టు సంపాదించింది. తనను సంరక్షించే అంకురం సంస్థ చేయుతతో ప్రఖ్యాత JNTU ప్రవేశ పరీక్షలో ఉన్నతమైన రాంక్ సంపాదించింది. Bachalor In Fine Arts లో సీట్ సంపాదించింది. ఇది 2012 లో జరిగిన సంఘటన.

రంగారెడ్డి కలెక్టర్ 18 ఏళ్ల అమ్మాయిని స్వయంగా పిలిపించుకుని ప్రశంసించారు. సమాచార పత్రికలలో చదివాను ఈ విషయం.

ఆ అమ్మాయి పేరు అరుణ జ్యోతి. మురికి కాగితంలా మారిన తన అనాథ జీవితాన్ని అందమైన చిత్రంలా మార్చుకున్న జ్యోతి కథ మనకు స్ఫూర్తి నందించాలి.





# 32. ఆడంబరమే విధానం అయింది



## సమస్య:

*ఎక్కడ చూసినా ఆడంబరమే కనిపిస్తోంది. సామాన్యంగా ఉండటం ఒక వింతగా వుంటోంది. రిచ్‌గా వుండాలని, నాజూకుగా కనిపించాలని, అందరిలోనూ ప్రత్యేకంగా కనిపించాలని ఉవ్విళ్లూరుతుండటం నేను చూసాను. అయ్యా! ఎలా వుంటే విద్యార్థులకు మంచిది...మాకు తెలియ జేయగలరు.*

## వివరణ:

పిల్లలూ... మన దేశ చరిత్రను ఒక్క సారి పరిశీలిస్తే నిరాడంబరంగా జీవించి... యావద్ జాతికి స్ఫూర్తి నింపిన అద్భుత మైన వ్యక్తులను చూడొచ్చు. వారి నిరాడంబరత... సామాన్య జీవన విధానం మాత్రమే మనకు నేటికీ మరుపు రానిదిగా నిలిచింది. అసలు జీవితంలో సామాన్యముగా వుండటం మన సుగుణము. లేదు అందరూ ఆడంబరముగా వుంటున్నారు, నేను కూడా అలా వుండాలన్న ఆలోచన పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లుగా వుంటుంది. నమ్మండి.

ఈ మధ్య ఒక సర్వేలో తేలింది ఏమిటంటే గత తరం వాళ్ళ కన్నా, మన తరం వాళ్ళు ఐదు రెట్లు ఎక్కువగా వస్తు వినియోగం చేస్తున్నారంట. అది బట్టలు అయినా సరే మరి ఏ ఇతరములైనా సరే. అయితే దాంట్లో తప్పేముంది అని మీరు అనుకోవచ్చు, శరీరానికి మితిమీరిన ఆహారం ఎంత చెడ్డ చేస్తుందో అదేవిధంగా...మితి మీరిన వస్తు వినియోగము భూమికి విపరీతమైన చెడు ప్రభావాము కలుగ జేస్తుంది. ఎందుకంటే మనం వాడే ప్రతి వస్తువూ భూమి నుంచి

వచ్చినదే...అది మనమే ఖరీదు చేసి వుండొచ్చు అయినా సరే వాటికి కావలసిన ముడిసరుకు భూమి నుండి వస్తుంది. మనము అతి వినియోగం చేస్తే ఈ ధరిత్రిని మనమంతా బాధించిన వాళ్లమవుతాం.

దురదృష్టవశాత్తూ ఈ కాలంలో విజయం లేదా సంతోషానికి చిహ్నం ఏమిటంటే అది ఆడంబరమే అని చెప్పాలి. ఖరీదైన నగలు, బట్టలు, చెప్పులు, ఫోన్లు, వాహనాలు, విందులు, వినోదాలు ఇలా ఏది చేసినా బాగా రిచ్‌గా కనపడాలని తపన. మన ఆడంబరాన్ని బట్టి గౌరవము వస్తుందన్న ఒక దురభిప్రాయం మనలో నాటుకుపోయింది.

మీరొక విషయం పరిశీలించండి... పిల్లలూ, స్కూల్లో అందరికీ ఒకే రకమైన దుస్తులు (Uniforms) ఎందుకంటారు...నాకన్పించేది ఏంటంటే, లేని పోని ఆడంబరాలకు పిల్లలు వెళ్లొద్దు. అందరూ సమానమే... బీదా, సాదా, పేదా, ధనిక అన్న భావన లేని వ్యక్తిత్వము చిన్ననాటి నుండి అలవడాలనే.

నిజానికి విజయం అంటే ఏమిటో తెలుసా ఏమి ఉన్నా లేకున్నా మనం సంతోషంగా ఉండడమే అసలైన విజయం. పిల్లాలూ... మనకు వున్న దాంట్లో హ్యాపీగా బ్రతుకుతూ చేతనవుతే పక్కోడికి సాయం చేయగలిగితే ఎంత ఆత్మ సంతృప్తి వుంటుందో తెలుసా?

మీకు ఇది అంగీకరించడానికి కష్టంగా ఉండొచ్చు కానీ ఇప్పుడు నేను చెప్పే వ్యక్తుల గురించి కాస్త తెలుసుకునే ప్రయత్నం చేయండి.

ఫేస్‌బుక్ స్థాపకుడు, అధినేత అయిన ప్రముఖుడు మార్క్ జూకర్‌బర్గ్ కేవలం బ్లూ చొక్కా మరియు బ్లూ జీన్స్ మాత్రమే వేసుకుంటారు. అవి కూడా ఆయన దగ్గర 6 జతలు మాత్రమే ఉంటాయి.

ప్రపంచంలోని ధనవంతుల్లో ఒక్కడైనా వారెన్ బఫెట్ దగ్గర ఇంతవరకూ ఒక్క సెల్ ఫోన్ కూడా లేదు అదేవిధంగా ఆయన 50 సంవత్సరాల ముందు ఏ ఇంట్లో అయితే ఉన్నారో అదే ఇంట్లో ఇప్పటికీ ఉంటున్నారు. అది కేవలం సాధారణ రెండు బెడ్రూం ఫ్లాట్ మాత్రమే.

అంతెందుకు, మన భారతరత్న Dr ఏపీజే అబ్దుల్ కలాం గారి జీవితాన్ని ఒక్క సారి పరిశీలిస్తే... చిన్నతనంలో రామేశ్వరం నుండి... ఢిల్లీలో రాష్ట్రపతి భవనం దాకా సాగిన ఆయన ప్రస్థానం ఎంత నిరాడంబరంగా వుండేదో తెలుసు కదా?

వీళ్ల కన్నా మనం గొప్పవాళ్ళ మంటారా? లేక గొప్పదనం కేవలం మనము వాడే వస్తువుల్లో ఉందంటారా? మనము వాడే వస్తువులను బట్టి మన విలువ పెరగదు, మన వ్యక్తిత్వం మాత్రమే మన విలువ పెంచేది.

## ప్రేరణ మంత్రము:

*Simple Living High Thinking are the two essentials for a good human being.*

ఆ మధ్యకాలంలో ఒక మహావ్యక్తి శతజయంతి ఉత్సవాలు దేశమంతా జరుపుకుంది. వారి గురించి నేను తెలుసుకున్నది ఇక్కడ మీతో చెప్తున్నాను.

నెహ్రూలా నేపథ్యం లేదు...
ఇందిరలా బలం లేదు...
రాజీవ్‌లా బలగం లేదు...
వారసత్వపు ముద్రల్లేవు...
కుటుంబాల అండదండల్లేవు...
కూటముల సాయం లేదు...
తను నమ్మింది కృషి...
ఆయనో రాజకీయ ఋషి...

బహుముఖ ప్రజ్ఞాశాలి... ఎన్నో భాషల్లో నిష్ణాతుడు... రాజకీయ సోపానంలో ముఖ్యమంత్రిగా... కేంద్రమంత్రిగా... ప్రధానమంత్రిగా... ఏ పదవి చేపట్టినా... ఆయనది మునీశ్వర తత్వమే. కర్మయోగిలా

తన పని చేసుకుంటూ వెళ్లడమే ఆయన నైజం. భారత రాజకీయ యవనికపై తనదైన ముద్రవేసి, ప్రగతి ఫలాల కోసం చెట్లు నాటి మనకు అందించిన దార్శనికుడు. స్వతంత్ర భారతావనిని ఆధునిక ప్రపంచంతో అనుసంధానించి... మార్పులు, సంస్కరణలు తెచ్చిన ప్రగతిశీలవాది.

## తెలుగు వారి కీర్తి కిరీటం:

కాషాయం ధరించి, మహర్షి కావాలనుకున్న ఆయన... అనూహ్య పరిస్థితుల్లో రాజర్షిగా పంచె బిగించి ప్రధానిగా రంగంలోకి దిగారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అల్లకల్లోల పరిస్థితుల్లో... దేశం దివాళా అంచుల్లో ఉన్నవేళ గుండె జబ్బును సైతం మరచి... దేశానికి సరికొత్త ఊపిరిలూదారు. ఆయనే స్వతంత్ర భారతానికి ఆర్థిక సంస్కరణల ప్రదాత.. పాములపర్తి వెంకట నరసింహారావు!

భారత జాతిని సగౌరవంగా నిలబెట్టి.. తెలుగుఖ్యాతిని దశదిశలా చాటిన మన ఈ మహానుభావుడు ఎవరో తెలుసా? మన మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు. ఈ ఆధునిక ఆర్థిక సంస్కర్త ఎంత నిరాడంబరంగా ఉండే వారో వారి గురుంచి తెలిసిన వారిని...లేదా చూసిన వారిని అడగాలి.

## దొరతనాన్ని వదులుకొని:

స్వతహాగా సంక్రమించిన పిత్రార్జితమే బోలెడు. అందునా దత్తత పోవడం ద్వారా కలిసొచ్చిన భూములు వందల ఎకరాలు... ఇంకేముంది ఆ ఆస్తినంతా చూసుకుంటూ ఆయన దర్జాగా బతకాలన్నది కుటుంబ పెద్దల అభిమతం. కానీ, ఈ ఆస్తులతోపాటే వచ్చిన దొరహోదాను పీవీ ముందు నుంచీ ఆకళింపు చేసుకోలేకపోయారు. ఓ మధ్యతరగతి వ్యక్తిగా జీవితాన్ని సాగించడమే ఆయనకు ఇష్టం. ఆ ధోరణినే జీవితాంతం ప్రదర్శించారు. అందుకే 1200 ఎకరాల ఆసామి అయినా.. ముఖ్యమంత్రి పీఠం అధిరోహించిన తర్వాత భూసంస్కరణలు తీసుకొచ్చి పరిమితికిమించి ఉన్న భూమిని వదులుకున్నారు. పుట్టిపెరిగిన పరిస్థితులకు భిన్నంగా కూడా వ్యక్తులు ఎదుగుతారని.. సంపద ఉన్నా దానిపై వ్యామోహం ప్రదర్శించని పీవీ జీవితాన్ని నిశితంగా గమనిస్తే అర్థమవుతుంది.

పీవీకి ఇంగ్లాండ్ వెళ్లి ఖగోళశాస్త్రం చదవాలన్న ఆసక్తి ఉండేది. కానీ, డిగ్రీ పూర్తయ్యాక స్వగ్రామానికి తిరిగిరావాలని.. ఆస్తిపాస్తులు చూసుకోవాలనీ నరసింహారావుపై కుటుంబం నుంచి ఒత్తిడి పెరిగింది. ఎంతో మానసిక సంఘర్షణ తర్వాత పీవీ నాగ్‌పూర్‌లో న్యాయశాస్త్రం చదవడానికే మొగ్గు చూపారు. ఆస్తి ఉన్నా.. తాత్కాలిక ఉద్యోగం చేసి వచ్చేదాంతోనే నెలంతా గడిపేవారు.

ఇది కదా పిల్లాలూ మనము నేర్చుకోవాల్సింది? జీవితంలో ఎంత ఆడంబరముగా బ్రతకాలో కాదు...ఎంత అద్భుతముగా...ఆనందంగా బ్రతకాలో నేర్చుకుందాము.



# 33. తోటివారి ఒత్తిడి



**సమస్య:**

చుట్టూ వున్న వాళ్ల ప్రవర్తన నన్ను చాలా ప్రభావితం చేస్తోంది. నేను చదువుదామని అనుకుంటాను...కానీ స్నేహితులు అందరూ బయట తిరుగుదామంటారు... వాళ్ళ ప్రవర్తన నాపై ప్రభావం చూపిస్తోంది. వాళ్లేమనుకుంటారో అన్న మొఖమాటంతో నా చదువును పక్కన పెట్టేస్తున్నాను... వారితో పాటు నేనూ జత కట్టేస్తున్నాను.

తోటి వాళ్ళ వేష భాషలూ, కట్టూ బొట్టు జుట్టు, ఇవన్నింటిలో అందరితో పాటు నేనుండాలి... వాళ్ళ లాగే విభిన్నంగా కనిపించాలి అనుకుంటాను. అంతేకాక, నా స్నేహితులందరికీ బాయ్ ఫ్రెండ్/ గర్ల్ ఫ్రెండ్ ఉన్నారు కానీ నాకు ఎవరూ లేరు. దాంతో వాళ్ళు నన్ను ఒక పాత కాలపు మనిషిలాగా చూస్తున్నారేమోనని అనిపిస్తుంది.

నా స్నేహితులకైతే మద్యపానం ధూమపానం మరికొందరికి అశ్లీల చిత్రాలు చూసే అలవాట్లు కూడా ఉన్నాయి. వాళ్ళు నన్ను కూడా అప్పుడప్పుడు వారితో చేరమంటారు. ఒప్పుకోకుంటే అందరూ హేళన చేస్తుంటారు. నేనేమి చేయాలి?

## వివరణ:

తోటి వాళ్ళ వల్ల ఏర్పడే ఒత్తిడిని Peer Pressure అని అంటారు. ఇది నిజానికి చాలాకాలం నుండి ఉన్న సమస్యే. కేవలం విద్యార్థులలోనే కాక ప్రతి వయసు వారిలోనూ ఏదో ఒక రూపంలో ఈ సమస్య కనిపిస్తూనే ఉంటుంది. అయితే ఈ సమస్యకు మూలం ఏమిటో? సమాధానం ఏమిటో? చర్చించుకుందాం.

పిల్లలూ... నేను మిమ్మల్ని కొన్ని విషయాలు అడుగుతాను సమాధానం చెప్తారా?

నేను చదువుదామని అనుకుంటాను... కానీ స్నేహితులు అందరూ బయట తిరుగుదామంటారు... వాళ్ళ ప్రవర్తన ప్రభావం చూపిస్తోంది. ఇక వాళ్లేమనుకుంటారో అన్న మొఖమాటంతో నా చదువును పక్కన పెట్టేస్తున్నాను... వారితో పాటు నేనూ జత కట్టేస్తున్నాను.

పైన సమస్య అడిగిన పిల్లలు చెప్పాలి ప్రధానంగా...

1. మీ చుట్టూ బాగా చదివే వాళ్ళెవ్వరు మీకు కనబడటం లేదా?

2. చదువరులు మిమ్మల్ని ఏ విధంగానూ ప్రభావితం చేయటం లేదా?

3. మీ తల్లి తండ్రులు మీ పై ఎంత ఆశ పెట్టుకుని బ్రతుకుతున్నారో తెలియటం లేదా?

ఇదే విషయమై నేను చాలా సమావేశాల్లో ప్రశ్నించాను. నాకెవ్వరూ సమాధానం చెప్పలేదు.

అసలు ఎవరు ఎవరిని అనుసరించాలి తెలుసా?

ఆదర్శవంతుడైన విద్యార్థి మాత్రమే ఉత్తమ సమాజ నిర్మాణంలో భాగస్వామి కాగలుగుతాడు. అటువంటి వారిని చూసి ఇతర విద్యార్థులు స్ఫూర్తి పొంది, వారు కూడా ఆ మార్గాన్ని ఎంచుకుని ముందుకు సాగుతారు. భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ చెప్పినట్టు

యద్యదాచరతి శ్రేష్ఠః స్తత్తదేవే తరోజనః।
సయత్ప్రమాణం కురుతే। లోకస్తదనువర్తతే।।

ఉత్తములు దేనిని ఆచరిస్తారో దానినే ఇతరులు కూడా అనుసరిస్తారు. యువతీ యువకులు ప్రవర్తన ఉత్తమమైనప్పుడే ఈ ప్రపంచంకూడా ఉత్తమ ఆదర్శాన్ని అనుభవిస్తుంది.

ఈనాటి విద్యార్థులు చెడిపోవడానికి మూలకారణం, తోటి వారి ఒత్తిడియే అని చెప్పాలి. వాడెవడో సినిమాలు చూస్తున్నాడని, చెడు పుస్తకాలు చదువుతూ ఎంజాయ్ చేస్తున్నాడని, తోటి వారి విపరీత ధోరణి ప్రవర్తన మిమ్మల్ని ప్రభావితము చేస్తుందని మీరంటే నాకు ఆశ్చర్యంగా వుంది.

ఇవాళ్టి యువతతో వచ్చిన చిక్కేమిటంటే వీటన్నిటి పేరు చెప్పుకొని వింత పోకడలు విచిత్ర పోకడలు మరియు విపరీత పోకడలకు పోయి, వాళ్ళని వాళ్ళే సమస్యల్లోకి నెట్టుకుంటూ వెళ్ళుచున్నారు.

వేషము... కట్టు...జుట్టు: వస్త్రం లేదా వేషం అన్నది ఎప్పుడూ మనకు నచ్చేలా ఒప్పేలా మాత్రమే ఉండాలి, దానికి కొంత ఆధునికతను జోడించి మీ అందానికి మెరుగులు దిద్దుకోవచ్చు. వస్త్రధారణ మరియు అలంకరణలో మీరు పాటించవలసిన నాలుగు అంశాలు ఏమిటంటే సమయం, సందర్భం, స్థలం, మర్యాద(Time, Occasion, Place and Etiquette).

నేను ఇంటర్ చదివే రోజుల్లో జరిగిన ఒక సంఘటన చెప్తాను. కల్లూరు (RS) అనే గ్రామంలో నాన్న గారు ఒక ఫేక్టరీ లో పని చేసే వారు. చాలా చిన్న గ్రామం. నేను సెలవులు గడిపేందుకై వెళ్ళాను. ఆ గ్రామంలో వున్న హనుమంతుని గుడిలో జరుగుతున్న శ్రీరాముల వారి కల్యాణానికి వెళ్ళాను. అక్కడ నా తోటి వారంతా గోడల కింద నిలబడి పిచ్చా పాటి మాట్లాడుతున్నారు. నన్ను చూసి ఆహ్వానించారు. కానీ వాళ్ళలో నేను





ఇమడలేక పోయాను. నా దృష్టి అంతా అక్కడ గేట్ దగ్గర వేస్తున్న చెత్త చెదారం మీదనే వుంది. అంతే కాక అక్కడికి వచ్చే భక్తులందరూ... చాలా నిర్లక్ష్యంగా పాదరక్షలను ఇష్టం వచ్చినట్లు విడుస్తున్నారు. అందరికీ ఇది సహజంగా తోచింది.

నేనేమో తోటి స్నేహితుల మధ్యలో వుండి... వారి ప్రవర్తనతో నన్ను నేను ముడి వేసుకుని ఉండ లేక పోయాను. ఒక చీపురు తీసుకుని, ఆ గుడిలో అశుభ్రంగా వున్న ప్రాంతాన్ని అంతా శుభ్రం చేయడం మొదలెట్టాను. నిజం చెప్తున్నాను పిల్లాలూ... అక్కడున్న పిల్లలు పెద్దలు అందరూ నోరవ్వగించి చూడ్డం మొదలెట్టారు. కొద్ది మంది పడి పడి నవ్వారు కూడా...

అదే సమయంలో ఆలయ ధర్మ కర్తలూ, నాన్న గారు పని చేస్తున్న పరిశ్రమ యాజమాన్యం వారి కుటుంబసభ్యులూ అలయంలోకి వచ్చారు. నాకు వారెవరో తెలియదు...కానీ ఆ బృందంలోని ఒక మహిళ నన్ను చూసి, బాబూ నువ్వెవరు? ఎవరి అబ్బాయి... ఎందుకు ఇలాంటి పని చేస్తున్నావ్?అని అడిగారు... నేను చెప్పాను. వారెంతో ఆనందించారు. ఎంతో స్ఫూర్తి పొందారు. నన్ను చేరదీసినారు, సాయం చేసారు. అటు తర్వాత ఆ మాతృమూర్తి మూడున్నర దశాబ్దాలుగా నా చేయి పట్టి నడిపిస్తూనే వున్నారు. స్ఫూర్తిని అందిస్తూనే వున్నారు. ఆవిడ పేరు సుజాతా సారథి.

పిల్లలూ... ఏ తోటి వాళ్లవుతే నన్ను ప్రభావితం చేయడానికి ఒత్తిడి తెచ్చారో... ఆ తరవాత కాలంలో నా పనుల వలన స్ఫూర్తి పొంది నన్ను అనుసరించారు. ఆ చిన్న గ్రామంలో నన్ను అందరూ బాలస్వామి అని పిలిచే వాళ్ళు.

తప్పని తెలిసినప్పుడు వేయి మంది వచ్చి మనలను చేయమని ఒత్తిడి తెచ్చినా... సాక్షాత్తు ఆ దేవుడే వచ్చి కాని పని చేయమన్నా చేయొద్దు. తోటి వారి ఒత్తిడికి లోనైతే మనము గొర్రెల మందలో ఒక గొర్రెగా

మారినట్లే.

నాకు గుర్తు, ఇంటర్ లో అమ్మాయిల్ని కామెంట్ చేసే తోటి వారి వల్ల ప్రభావితం చెందక...రక్షా బంధన్ రోజు...తరగతి లో ఉన్న ఆడ పిల్లలందరితో రాఖీలు కట్టించుకున్న ఘటన, నన్ను తరగతి మొత్తంలో హీరోను చేసింది.

డిగ్రీలో నేను అనంతపురం వైశ్యా హాస్టల్‌లో వుండే వాడిని. సీనియర్స్ అందరూ... జూనియర్లను భయంకరంగా ఏడిపించేవాళ్లు. తాగి తందనాలు ఆడటం కూడా నేను చూసాను రూముల్లో. అందరూ జడిసి చచ్చేవాళ్ళు ర్యాగింగ్‌కి. ఒక వేళ సీనియర్లలో మంచి వాళ్ళున్నా... తోటివాళ్ళ ఒత్తిడిలో పడి కొట్టుకుని పోయేవాళ్ళు.

నా వంతు వచ్చింది. అప్పటికే నా మంచితనాన్ని గురించి అందరూ మాట్లాడు కోవడం వలన...మొత్తం సీనియర్లు అందరూ ర్యాగింగ్ పక్కన పట్టి నన్ను పిలుచుకొని ఎన్నో మంచి విషయాలు ముచ్చటించి పంపించేసారు.

కానీ మిగతా పిల్లల పరిస్థితి ఘోరంగా వుండేది. మరుసటి సంవత్సరం ఇక నా తోటి వాళ్లకు ర్యాగింగ్ చేసే అవకాశం వచ్చేసింది. వాళ్ళు పొందిన అనుభవాలను మరచి తోటి వాళ్ళ ఒత్తిడికి లోనై...ప్రవర్తించే వాళ్ళు. అప్పుడు నేను చాలా నచ్చ చెప్పి...నాలా ఆలోచించే మిత్రులూ యాజమాన్యం చొరవతో ర్యాగింగ్ అనేది లేకుండా చేయ గలిగాను. ఇప్పుడు అదే విధానం నడుస్తోందో ఏమో నాకు తెలియదు. Peer Pressure వలన మనము బాగు పడాలే కానీ చెడిపోకూడదు. ఇది తెలుసుకోండి.

## వైవిధ్యం:

మనం ఆలోచిస్తే, మన దేశంలో ప్రతి నాయకునికీ ఒక విభిన్నమైన శైలి ఉంటుంది. సన్యాసులూ స్వామీజీల నుండి దేశ నాయకుల దాకా ఎవరి శైలి వారిదే. అంతెందుకు, మన గౌరవ ప్రధానమంత్రి వస్త్రధారణ కూడా ఎంతో విభిన్నంగా, ఆకర్షణీయంగా ఉంటుంది. ఆయన వేసుకున్న కోటు దేశంలో యువతను ఎంతో ప్రభావితం చేసింది. ప్రపంచ వ్యాప్తంగా మోదీ కోటుకి బ్రాండింగ్ వాల్యూ వచ్చింది. కానీ దాని కన్నా గొప్పది ఆయన వ్యక్తిత్వం. ఆయన నాయకత్వ సామర్థ్యం మాత్రమే. అది మాత్రమే విశ్వ మానవులను ప్రభావితం చేస్తోంది.

## భాషణలు..సంభాషణలు:

తోటివాళ్ళు అసభ్యమైన భాష మాట్లాడతారు. అదే భాష మనమూ మాట్లాడాలని ప్రభావితము చేస్తుంటారు. మనము ఏ నేపథ్యం నుండి వచ్చినా సరే మన భాషా యాసా ఏదైనా సరే మనం మధురంగా మర్యాదగా మాట్లాడవచ్చు. మన భాషే మన సంస్కారాన్ని తెలియజేస్తుంది. మీరు ఎంత అందంగా ఆకర్షణీయంగా ఉన్నా మీ నోటి నుండి దుర్భాష వస్తే మీకు ఏ మాత్రం విలువ ఉండదు సమాజంలో. ఇలాంటి వాళ్ళను చుట్టూరా చేర్చుకోవద్దు! మనం ఎలాంటివాళ్ళమో మన స్నేహితులను చూస్తేనే తెలుస్తుంది.

## బాయ్ ఫ్రెండ్ / గర్ల్ ఫ్రెండ్:

ఇప్పటి పిల్లలకు ఎవరో ఒక బాయ్ ఫ్రెండ్ లేదా గర్ల్ ఫ్రెండ్ ఉండడం ఒక ట్రెండ్‌గా మారిపోయింది. ఒకవేళ ఇలాంటి వాళ్ళు ఎవరూ లేకపోతే మిగతా పిల్లలు వీళ్లను పనికిమాలిన వాళ్ళలా ముద్ర వేస్తున్నారు. ఇలాంటి అవహేళనలను తట్టుకోలేని పిల్లలు చెడు స్నేహాలూ, చెడు సంబంధాలు పెట్టుకుంటారు. ఇంకేముంది? పతనం అక్కడి నుంచే మొదలవుతుంది.

ఒక్క విషయం గుర్తు పెట్టుకోండి. ఏ మిత్రుడైనా, ఎవరైనా, చివరకు తల్లిదండ్రులైనా, మనతో చివరి వరకూ ఎవరూ ఉండలేక పోవచ్చు. మనతో జీవితాంతం ఉండేది మనమే! అందువల్ల మొదటగా మనల్ని మనం

ప్రేమించుకోవాలి... అంతకు మించిన గొప్ప ప్రేమ భావన మరేదీ లేదు. మనల్ని మనం ప్రేమించినప్పుడే మన కుటుంబాన్నీ తోటి వారిని ప్రేమించగలం. ఈ తెలిసీ తెలియని వయసులో మీకు పరాయి వాళ్ళ ప్రేమ అనవసరం. మీ కుటుంబపు ప్రేమ చాలు. ఒకవేళ మిమ్మల్ని నీ తోటి పిల్లలు ఇలా బాయ్ ఫ్రెండ్ లేదు గర్ల్ ఫ్రెండ్ లేదు అని హేళన చేసినా పెద్దగా పట్టించుకోకండి. మీకు మీ కుటుంబపు ప్రేమ చాలని చెప్పండి. వింటే వింటారు. వినకుంటే వారి మానాన వారిని వదిలేయండి. మీ అభిప్రాయానికి విలువనివ్వని స్నేహితులను పట్టించుకునే పనిలేదు. దూరంగా ఉండడమే మంచిది.

## సినిమాలు షికార్లు:

తోటి పిల్లలూ స్నేహితులతో సరదాగా సినిమాలకి షికార్లకు వెళ్ళడం మామూలే. మీ చదువుకు మీ పురోగతికీ భంగం కలిగించనంత వరకు, వాటితో ఇబ్బందేమీ లేదు. మీ అభివృద్ధికి కేటాయించిన సమయాన్ని ఎప్పుడూ వాటికి వెచ్చించకూడదు. వాడు ఏదో చేస్తున్నాడు నేను అదే చేయాలి అని మీరు ప్లెషర్ తీసుకుంటే రేపు పొద్దున మీ రిజల్ట్ చూసి ప్రెషర్ తీసుకోవాల్సి వస్తుంది.

## దురలవాట్లు:

నలుగురు స్నేహితులు కలిసినప్పుడు ముగ్గురికి దురలవాట్లూ దుర్వ్యసనాలు ఉండి నాలుగో వాడికి లేకపోతే అరె బావా! మేమందరం మందు తాగుతున్నాం, సిగరెట్ తాగుతున్నాం. నువ్వు మాత్రం మాతో ఉండి కూడా దూరంగా ఉంటున్నావ్.అంటే మేం పిచ్చోళ్ళమూ నువ్వొక్కనివే మంచోడివా...అరె..రారా ఈ ఒక్కసారికి మాతో కలువు అంటారు. ఇంకేముంది మీరు ఆ మాటలకి ఆహా మా వాళ్ళకి నా మీద ఎంత ప్రేమ ఉందో! అని కరిగిపోయి అన్నీ మొదలు పెడతారు. ఇలా సరదాగా మొదలు పెట్టి, మీ కథ చివరికి క్యాన్సర్ హాస్పిటల్ లో ముగిస్తుంది.

15 ఏళ్ల సమయంలో తాడిపత్రిలో నాకు కలిగిన అనుభవం చెప్తాను వినండి. నేను రోజూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో జరిగే శాఖకు వెళ్లేవాడిని. ఒక ప్రాంతానికి నాయకుడిగా వ్యవహరించే వాడిని. నాలాంటి కొద్ది మంది నాయకులను జట్టుగా ఏర్పరచి... దగ్గరలో ఉన్న చుక్కలూరు అనే గ్రామానికి ప్రతి ఆదివారం వెళ్లి అక్కడ శాఖ నిర్వహణ చేయమనే వాళ్ళు. అందరం ఒకే వయసు వాళ్లమే. సైకిళ్ల మీద వెళ్లే వాళ్ళం. అందులో ముగ్గురు పిల్లల ప్రవర్తన నాకు చాలా ఆశ్చర్యం కలిగించేది. ఊరు వదిలిన వెంటనే ఏదో చెట్టు చాటుకు చేరి పొగతాగే వాళ్ళు. నన్ను కూడా తాగి చూడమని ప్రెషర్ చేసే వాళ్ళు. నాకు భలే కంపరం కలిగేది వారి మాటలకు. ఆ తరవాత వాళ్లతో కలవడం తగ్గించాను. వారి ప్రవర్తన వారి దారుణమైన పతనానికి దారి తీసింది. ఎవరితో వున్నా మన నిజమైన వ్యక్తిత్వాన్ని మార్చుకోవద్దు.

పిల్లలూ.... మీకు మీరు మంచిగా చదువుకుని ఉన్నత వ్యక్తిత్వాన్ని అలవర్చుకుని అన్నింట్లోనూ ముందుండి తోటి వారికి స్ఫూర్తిగా నిలవగలిగితే కొంతమందైనా మిమ్మల్ని చూసి మారుతారు. అప్పుడే మీరు మంచి మిత్రుడయినట్టు!

ఆదర్శంగా నిలుస్తారు కదూ...

# 34. చెత్త సాహిత్యము



## సమస్య:

*అయ్యా! పిల్లలు ఈ మధ్య పాఠ్యపుస్తకాలు కాక వేరే ఏవో పుస్తకాలు చదువుతున్నారు అని గమనించాను. అలాంటి పుస్తకాలు చదివితే వాళ్ళ ఆలోచనలు, మాటలు, చేతలు అసాంఘికమైనవిగా మారతాయని భయం అవుతోంది.*

*అంతర్జాలంలో కూడా అశ్లీల సాహిత్యం అందుబాటులో ఉండడం ఎక్కువైంది. దానితో పిల్లలు ఫోన్లో ఏం చూస్తున్నారు... వింటున్నారు ..చదువుతున్నారు ఏం చేస్తున్నారో కూడా మాకు అర్థం అవ్వట్లేదు. దీన్ని ఎలా నివారించాలో వివరించండి.*

## వివరణ:

బాల బాలికలలో వయసు రీత్యా అన్ని ముందే తెలుసుకోవాలి అనే ఉత్సుకత ఎక్కువగా ఉంటుంది. దాని వలన పిల్లలు పక్కదారి పట్టి చెత్త పుస్తకాలు చదివే ప్రమాదం ఎంతైనా ఉంది. దానిని నివారించడం కష్టమే అయినా ప్రయత్న పూర్వకముగా బాగు చేయడం లేక బాగు పడటం అన్నది మన చేతిలోనే ఉంది.

ప్రపంచంలో మంచి పుస్తకాలు ఎన్ని ఉన్నాయో చెత్త పుస్తకాలు కూడా అన్నే ఉన్నాయి. లైంగిక వ్యాసాలు, అసాంఘికమైన కథలు, హింసను ప్రేరేపించేవి మరియు విపరీత పోకడలను నూరిపోసే పుస్తకాలు బయట చాలా విరివిగా లభిస్తున్నాయి అని చెప్పాలి. పిల్లలు వీటికీ చాలా సులువుగా ఆకర్షితులవుతున్నారు. ఆ మాటకు వస్తే

పెద్దలు ముందుగా వీటి వలలో పడుతున్నారు. పెద్దలా లేక పిల్లలా అనేది ప్రక్కన పెట్టి మనముందున్న సమస్యను ప్రస్తుతము చర్చించుకుందాము.



అన్నీ తెలుసుకోవాలన్న ఉత్సుకత, తోటి స్నేహితుల ప్రోత్సాహం, ఇక ఇంటా బయటా ప్రయత్నమే లేకుండా వాళ్లకు గోచరించే అనేకానేక సంఘటనలు, ప్రచార చిత్రాలు, పత్రికలు, కుటుంబ సభ్యుల ప్రవర్తన, సినిమాలు, టీవీ షోలు, సామాజిక మాధ్యమాల గోల ఇలా ఒక్కటేమిటి అన్ని కలిసి అత్యంత దారుణమైన కలుషిత ప్రభావాన్ని చిన్నారుల మీద చూపుతున్నాయి.

నాకు బాగా గుర్తు, నేను 8 వ తరగతి పరీక్షలు వ్రాసి ఇంట్లో వున్న సమయంలో...మా బంధువుల కొడుకు, నా కంటే ఒక సంవత్సరం చిన్నోడు, ఒక సారి నన్ను తీసుకుని వాళ్ళ ఇంటి మేడ మీదికి తీసుకుని వెళ్ళాడు. ఒక మూలగా పెట్టిన బండల క్రింద చేయి పెట్టి కొన్ని పుస్తకాలు బయటకు తీసాడు. అవన్నీ కూడా చిన్న చిన్న నవలలు, డిటెక్టివ్ పుస్తకాలు, జానపద కథల పుస్తకాలు. ఒకటి కాదు రెండు కాదు సుమారు 20 – 30 పుస్తకాలు బయటకు తీసాడు. నిజానికి అప్పటి దాకా నాకు అలాంటివి...మరీ అరచేతిలో పట్టేంత పుస్తకాలు వుంటాయని కూడా తెలియదు. వాడి అలవాట్లలో మార్పు వలన (ఇంట్లో డబ్బులు దొంగిలించి బజారులో ఇలాంటి పుస్తకాలు కొని తెచ్చుకున్నవి) ఈ పుస్తకాలు చదివేవాడని అర్థం అయింది. వాడేమో అదేదో నిధి దొరికినట్లుగా అమాయకంగా ఇస్తున్నట్లు నాకు కూడా కొన్ని పుస్తకాలను కానుకగా ఇచ్చాడు... పైగా ఈ విషయం ఎవ్వరికీ చెప్పొద్దని చెప్పాడు. అవేమిటో కూడా తెలుసుకోకుండా ఆయాచితంగా వచ్చాయని వాటిని చదవడం మొదలు పెట్టాను. అది కూడా ఇంట్లో ఎవ్వరూ చూడకుండా. కొన్నాళ్లకు ఈ పుస్తకాలు చదవడం వ్యసనం అయిపోయింది. ఇక సుమారు కొన్నేళ్ల పాటుగా ఆ చెత్త పుస్తకాలు చదువుతూ నాపై చదువును నిర్లక్ష్యం చేసే స్థాయికి వెళ్లిపోయాను.

చేసేది తప్పని తెలిసినా...ఆ చెత్త సాహిత్యాన్ని చదవకుండా ఉండాలని అనుకోలేదు. క్లాస్ పుస్తకాలలో ఇలాంటి పాకెట్ బుక్స్ పెట్టుకుని, మేడ మీదకు వెళ్లి, పైకి వెళ్లే మెట్ల మీద కూర్చుని, చివరకు మరుగు దొడ్లో కూర్చుని చదివిన రోజులున్నాయి. అంతే కాదు అలా పుస్తకాలతో మొదలయిన ప్రయాణం నన్ను చెడు స్నేహితులకు దగ్గర చేసింది. ఇంట్లో వాళ్లకు చెప్పకుండా సినిమాలకు వెళ్లడం, డబ్బు లేక పోతే సినిమా హాల్స్ గోడలు దూకి లోపలికి వెళ్లడం...అన్ని ఒక దాని తరవాత ఒకటిగా జరిగి పోయాయి.

ఆ తరువాత, శ్రీ సత్య సాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో నడుపబడే బాల వికాస్ తరగతులకు వెళ్ళినప్పుడు... అప్పటి దాకా నేను నా సమయాన్ని ఎలా ఈ చెత్త

సాహిత్యము చదువుతూ గడిపానో తెలిసినది. నా మనసును బుద్ధిని వికసింప జేసే అద్భుతమయిన పాఠాలు అక్కడ నేర్చుకోవడం మొదలయింది. జీవితములో నైతికత ఎంత ప్రధానమో అక్కడ తెలియ వచ్చింది. చాలా నిదానంగా ఆ వ్యసనం నుండి బయట పడ్డాను. బాగు పడ్డాను. ఆ తరవాత కాలంలో ఈ వ్యసనం ద్వారా అలవాటైన చదవడం అన్న ఒక మంచి లక్షణం నాతో ఎన్నో వందల మంచి పుస్తకాలు చదివించేలా చేసింది. చెత్త సాహిత్యముతో మొదలయిన నా ప్రస్థానం ఈ రోజు కనీసం కొన్ని వేల పుస్తకాలను చదివించడమే కాక, నా సొంతంగా ఒక 3000 పుస్తకాలను సేకరించి పెట్టుకునే విధంగా తీర్చి దిద్దుకున్నాను.

చుట్టూరా నాతో వున్న మంచి స్నేహితులతో సరి సమానంగా చదువుకోక పోయినా...నా శక్తి మేర చదివి జీవితములో B.Sc., LL.B., FCS., చేయగలిగాను. చివరకు ఒక్క సారి వెనక్కి తిరిగి చూసుకుంటే ...మా ఇంట్లో ఉన్న 30 మంది కజిన్స్ లోకీ...3 డిగ్రీలు చేయగలిగింది నేనొక్కడే అని అర్థం అయింది.

ఇక, ఎవరైతే ఇలాంటి వ్యసనాలను నాకు పరిచయం చేసాడో... అతడు మాత్రం చదువు పూర్తి చేయలేక... జీవితములో స్థిర పడలేక... పెళ్లై... భార్యాపిల్లలతో అతి భారంగా బ్రతుకు బండి నెట్టుకొస్తున్నాడు.

పిల్లలూ... ఒక్క విషయం గమనించండి. జీవితములో చెత్త సాహిత్యం జోలికి మీరు వెళితే మన జీవితమంతా చెత్తగా మారిపోతుంది. అందుకే బాబా గారు పిల్లలకు చెప్పిన విషయం ఇక్కడ మీతో పంచుకుంటున్నాను.

బాల బాలికలు అందరూ కూడా 3 విషయాలకు అతి దూరంగా వుండాలి. ప్రధానంగా విద్యార్థులు ఈ విషయాలను దరికి చేర్చక జీవించ గలిగితే వారి జీవితము విశేషముగా మారుతుంది. పిల్లలెవరైన చెత్త సాహిత్యము, టీవీ, మూవీ, అంతర్జాలం మరియు రాజకీయాలకు దూరంగా వుండాలి అని బాబా వారు చెప్పారు. ఇది సుమారు 30 ఏళ్ల క్రితము అనుకుంటాను... వారు చెప్తున్న సమయంలో ఆ సభలో నేను కూడా వున్నాను... విన్నాను. అప్పటి నుండి ఎంతో ప్రయత్నం చేత వీటికి దూరంగా వుండే ప్రయత్నం చేసాను.

## సూచనలు:

1. *పిల్లలకు మంచి సాహిత్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలి.*
2. *ఇళ్లలో, పాఠశాలలలో, గ్రంథాలయాల్లో మంచి పుస్తకాలని అందుబాటులో వుంచాలి*
3. *తీరిక చేసుకుని ఆ పుస్తకాలను తీసి వాటిలో కొన్ని అంశాలను పిల్లలకు చదివి వినిపించి చక్కగా ఆ అంశాన్ని పిల్లలతో కలిసి చర్చించి వాళ్లకు ఆసక్తిని కలిగేలా చేయాలి.*
4. *పుస్తకాల ద్వారా గొప్ప వాళ్ల గురించి మంచి వాళ్ళ గురించి తెలియజేయాలి.*
5. *మంచి-చెడును కూడా ఉదాహరణలతో చెప్పాలి.*
6. *సాంకేతికతను పిల్లల జీవితాభివృద్ధికి ఎలా వాడుకోవచ్చో చెప్పాలి*
7. *పిల్లల ముందు మనము చెత్త సాహిత్యాలు చదవడం మానుకోవాలి.*
8. *విజ్ఞానం మరియు సాహిత్యం వంటి అంశాల్లో కొత్తకొత్త విషయాలను ఎలా తెలుసుకోవాలో తెలియ చేయాలి.*
9. *చెత్త పుస్తకాలు చదువుతున్న విషయాన్ని మీరు గమనించినట్లయితే వాళ్లను కోపంతో దూషించకుండా ప్రేమతో ఓపికతో అలాంటి పుస్తకాల వలన కలిగే నష్టాన్ని వివరించాలి.*
10. *చెత్త పుస్తకాలు చదివితే కలిగే దుష్ప్రభావం గురించి వాళ్లకు తెలియ చేయాలి.*

## సలహాలు:

ఓ చెత్త పుస్తకము లేక చెత్త సాహిత్యము వల్ల ప్రభావితము అయ్యి ఉన్మాదులుగా, తీవ్ర వాదులుగా, ఉగ్ర వాదులుగా మారి వారి కుటుంబానికి, సమాజానికి, దేశానికి చివరకు ప్రపంచానికి హాని కలిగించే వాళ్ళని ఈ మధ్య మనం చాలా మందిని చూస్తున్నాం కదా.

అదేవిధంగా మంచి పుస్తకాలు చదివి ప్రేరణ పొంది ఎంతో ఎత్తుకు ఎదిగి ఎంతో సాధించిన వాళ్ళని కూడా చూస్తున్నాం. కాబట్టి మీరు ఏ కోవకు చెందిన వాళ్ళవ్వాలి అనుకుంటున్నారో మీరే నిర్ణయించుకోవాలి పిల్లలూ.

మీకు నిజంగా ఏ సమస్య అయినా వచ్చి, దానికి సమాధానం ఎక్కడా దొరకనప్పుడు మీరు పుస్తకాలనే అనుసరించాలి అనుకుంటే మంచి పుస్తకాలు తీసుకొని సమాధానం వెతకవచ్చు. ఉదాహరణకి భగవద్గీతనే తీసుకుంటే, ఒక మనిషికి, ఏ వయసులో అయినా ఏ కాలంలో అయినా ఎటువంటి సమస్యకైనా సమాధానం ఇచ్చే అద్భుతమయిన గ్రంథం అది. ఇది నేను చెప్పిన మాట కాదు ఎంతో మంది మేధావులు మరియు నిపుణులు చెప్పిన మాట.

ఒకవేళ మీకు భగవద్గీత, బైబిల్, ఖురాన్ లాంటి మతానికి సంబంధించిన పుస్తకాలు చదివే ఆసక్తి లేకపోతే, మీరు ఏ భాషలో అయినా ఏ దేశంలో అయినా వెతికితే ఎంతో మంది గొప్ప కవులు, రచయితలు మంచి మంచి పుస్తకాలను రాశారు మనిషిని ప్రేరేపించడానికి మంచి దారిలో పెట్టడానికి ఆ పుస్తకాలను ఏవైనా సరే మీరు చదువుకుని అనుసరించవచ్చు.

### ప్రేరణ మంత్రము:

*A good book can make you while bad one can break you.*

## స్ఫూర్తి:

అరుణిమ సిన్హా ప్రపంచంలోని అత్యున్నత శిఖరం ఎవరెస్టును అధిరోహించిన మొదటి దివ్యాంగ మహిళ. ఆమె దుండగుల దురాగతంలో తన కుడికాలు పోగొట్టుకున్న జాతీయస్థాయి వాలీబాల్ మాజీ క్రీడాకారిణి. మౌంట్ ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన భారతదేశపు మొట్టమొదటి దివ్యాంగ వ్యక్తిగా గుర్తింపు పొందింది ఆమె తన 25వ యేట ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించింది. ఆ అమ్మాయి అత్యంత దారుణ మైన పరిస్థితులలో ఉన్నప్పుడు స్వామి వివేకానంద Call to the Nation అన్న పుస్తకం చదివి...తన జీవితాన్ని పునః ప్రారంభించుకుంది. తదాదిగా పర్వతారోహణము చేసి యావద్దేశానికి స్ఫూర్తి గా నిలిచింది. భారత ప్రభుత్వము ఆ అమ్మాయికి పద్మశ్రీ బిరుదు ఇచ్చి గౌరవించింది.

పిల్లలూ... మంచి పుస్తకాలు చదివినప్పుడు అచేతనంగా పడున్న వాళ్ళు కూడా లేచి పరిగెత్తే ఉత్సాహం వస్తుంది. చెత్త పుస్తకాలు చదివితే బాగున్న వాడు కూడా అచేతనమై...మానసిక రోగిగా మారి అసాంఘిక ప్రవర్తనతో జీవితాన్ని నాశనం చేసుకుంటాడు.



# సందేహాలు

# 35. లక్ష్యం లేదు




## సమస్య:

*ఎవరు చూసినా...నువ్వేమి కావాలని అను కుంటున్నావు అని అడుగుతుంటారు. ఇక ఇంట్లో అయితే పాప పుడితే ఇలా చేయిస్తాము...బాబు పుడితే అలా చేయిస్తాము అని చెప్తుంటారు తల్లిదండ్రులు. అసలు నాకయితే ఎలాంటి లక్ష్యము లేదు. చదువుకుంటున్నాను అంతే. ఏమవ్వాలో నాకు తెలియదు. దాని వలన నేనేమి చెప్పాలో నాకు తెలియట్లేదు. చదువుకుంటే లక్ష్యముండాలంటారు అందరూ. నాకు లక్ష్యమేలేదు అంటాను. మీరేమంటారు.*

## వివరణ:

ఎవరైనా ఏమవ్వాలి అనుకుంటున్నావు అని అడిగితే మంచి వాడిని అవ్వాలి అనుకుంటున్నాను అని చెప్పండి. అడిగిన వాళ్ళ నోళ్లు తప్పక ఆశ్చర్యంతో తెరుచుకుంటాయి లేదా మాట రాక నోళ్లు మూత బడతాయి. ఏదో ఒకటి గ్యారంటీ. అయినా నాకు తెలియక అడుగుతాను...

పిల్లాలూ ప్రొద్దున్నే మీరు ఎన్ని గంటలకు నిద్ర లేస్తున్నారు?

లేచి ఏమి చేస్తున్నారు?

ఇదేమి ప్రశ్నలు అనుకుంటున్నారా? Please కొద్దిగా సమాధానాలు చెప్పండి...

అయ్యా! ప్రొద్దున్నే 6 లేక 7 గంటలకు లేస్తాను. లేచిన వెంటనే కాలకృత్యాలు తీర్చుకుంటాను...దంత ధావనం

చేస్తాను. కాసేపు తరవాత స్నానం చేస్తాను.

Ok. ప్రొద్దున్నే ఎందుకు లేవాలి?

ఇంకెందుకు లేస్తాము...ఎదో పనీ పాట వుంటుంది కదా? ఇలా అడుగుతారేంటి అంటారు కదా?

పోనీ మీకు జీవితంలో లక్ష్యమే లేదని ఏడుస్తున్నారు కదా...మరి ఎందుకు లేవడం, లక్ష్యం లేనప్పుడు ఇక ప్రొద్దున్నే లేచి చేసేది ఏముంది? అది కాక అసలు కాలకృత్యాలు తీర్చుకోక పోతే ఏమవుతుంది? ఏమి కుక్కలు నక్కలు పక్షులు పశువులు పొద్దున్నే లేచి కాల కృత్యాలు తీర్చుకుని చక్కగా పళ్ళు తోముకుని రోడ్డు మీద తిరుగుతున్నాయా? చెప్పండి.

ఈ ప్రశ్నలు విని నాకు కొద్దిగా పిచ్చి పట్టిందేమో అన్న సందేహము కూడా వస్తుంది కదా పిల్లలూ? సరే...మీరు నేను అడిగే ప్రశ్నలకు జవాబులు చెప్పలేరు. నేనే చెప్తాను చూడండి.

**ప్రొద్దున్నే ఎందుకు లేవాలి?**

మనిషి అన్న తరవాత 24 గంటలు నిద్ర పోతే వాడికి రోగం వచ్చి చస్తాడు. కాబట్టి నిద్ర లేవాలి. వ్యాయామం చెయ్యాలి. శరీరానికి తగినంత చలనం ఇవ్వాలి. ఇది ఒక లక్ష్యమే కదా?

**కాలకృత్యాలు ఎందుకు తీర్చుకోవాలి?**

శరీరం అంతా కూడా ఉదయం నుండి రాత్రి దాకా ఏ పని చేయకున్నా వాతావరణ ప్రభావం చేత, చెమట చేత దుర్గంధపు కంపు కొడుతుంది. ఏది తిన్నా త్రాగినా అరిగింది పోగా, మిగతాది మల రూపంలో, మూత్ర రూపంలో కడుపులో స్టాక్ అవుతుంది. దానిని ఉదయమే బయటకు పంపక పోతే అనారోగ్యం వస్తుంది. స్నానం చేస్తే శరీరం కంపు పోవడమే గాక తేజోవంతమవుతుంది. శుభ్రమవుతుంది.

**దంత ధావనం ఎందుకు చేయాలి?**

రాత్రంతా నిద్ర పోయినప్పుడు, నోటికి కూడా పని లేదు కాబట్టి...నోటిలో సూక్ష్మ క్రిములు అన్నీ చేరి ఆడుకుంటాయి. దాని వలన నోరు దుర్గంధముతో కంపు కొడుతుంది. తిన్న ఆహారమునకు సంబంధించిన అవశేషాలు దంతాల మధ్యలో ఇరుక్కుని వాటిని దెబ్బ తీస్తాయి.

ఇలా నిత్య జీవితములో ఏ చిన్న పని చేసినా ఎదో ఒక లక్ష్యము వుంది. మరి 100 ఏళ్ళు జీవించే మనిషికి ఒక లక్ష్యం వుండొద్దా? మీకు తెలియనంత మాత్రాన లక్ష్యము లేదు అనుకోకండి. పుట్టిన ప్రతి ఒక్క జీవికీ చచ్చే లోపుగా సాధించే ఒక లక్ష్యాన్ని దేవుడు కూర్చి పంపుతాడు. ఒక్కొక్కరికి ఒక్కో సమయంలో వారి వారి జీవితంలో ఆ లక్ష్యం తప్పక అవిష్కృతమవుతుంది. ఆ లక్ష్యం 25 సంవత్సరాల లోపు తప్పక గోచరం అవుతుంది. చింత పడ నక్కర లేదు. ఒక వేళ మీకు మీరుగా లక్ష్యం ఏర్పరచుకోలేక జీవిస్తుంటే...మీ చుట్టూ వున్న ప్రకృతి పరిసరాలు మీ మెడలు వంచి మీ లక్ష్యాన్ని మీకు అప్ప చెప్తాయి.

ఒక్క విషయం గుర్తుంచుకోండి పిల్లలూ... మీకు ఏ లక్ష్యం లేక పోతే ఎవరైతే లక్ష్యంతో పని చేస్తున్నారో వారికోసం పని చేయాల్సి వస్తుంది. లక్ష్యం వుంటే లక్షణంగా వుంటుంది జీవితం. లక్ష్యమే లేకుంటే ఇక చుట్టూ వున్న సమాజానికి ఒక అవలక్షణముగా మారిపోతారు.

అసలు ఏ లక్ష్యమూ లేకుండా ఎవరి జీవితమూ ఉండదు. మీ లక్ష్యం ఏంటో గుర్తించండి. అది తెలిసే దాకా జీవితంలో మీరు ప్రభావితమయ్యే ప్రతి అంశమును పరిశీలించండి. మీ చుట్టూ ఉన్న ప్రకృతిని, పరిసరాలను, మనుషులను, సంఘటనలను గమనిస్తూ... మీ కేదైనా సందేశం కనిపిస్తోందా? లేక మీ లక్ష్యాన్వేషణలో అవి ఉపయోగమా? చూడండి.




## సూచనలు:

1. ఏ లక్ష్యమూ లేకుండా ఎవరూ జన్మించరు.
2. జీవిత లక్ష్యము పుట్టుకతో ఎవరూ గుర్తించలేరు.
3. చదువుకుంటున్న సమయంలో మీ ఇష్టా ఇష్టములు పరిగణనలోకి తీసుకుని మీ లక్ష్యము ఏమిటో గుర్తించండి.
4. వీలయితే తల్లిదండ్రులను... ఉపాధ్యాయులను... ఇంట్లో పెద్దలను సంప్రదించండి.
5. స్ఫూర్తి నింపే కథలు చదవండి...ఎలా వాళ్ల జీవితాలు సందేశాలు అయ్యాయి తెలుసుకోండి
6. ఏ లక్ష్యము తీసుకున్నా...అది తప్పు లేక నేరం కానంత వరకు ఎలాంటి చింత అక్కర లేదు అని తెలుసు కోండి.
7. ఒక లక్ష్యాన్ని నిర్ణయం చేసుకుని దానినే ఇక జీవిత పరమావధిగా ఎంచండి.

## ప్రేరణ మంత్రం:

*Take up one idea. Make that one idea your life, dream of it, think of it, live on that idea. Let the brain, body, muscles, nerves, every part of your body be full of that idea, and just leave every other idea alone. This is the way to success, and this is the way great spiritual giants are produced.*

## స్ఫూర్తి:

సుమారు 15 ఏళ్ల క్రితం అనుకుంటా, ఆదిలాబాద్‌లో శ్రీ సత్య సాయి సంస్థల వాళ్ళు 10వ తరగతి విద్యార్థుల కోసమై ఒక బృహత్ అవగాహనా సదస్సు ఏర్పాటు చేసారు. దానికి నేను మరి కొంత మంది వాలంటీర్స్‌తో హైదరాబాద్ నుండి వెళ్ళాను. అక్కడ 20 ప్రభుత్వ మరియు ప్రయివేటు పాఠశాలల నుండి సుమారు 2000 మంది విద్యార్థులు వచ్చారు. ప్రారంభ సమావేశానికి

ఆదిలాబాద్ జిల్లా సంయుక్త కలెక్టర్ గారు కూడా వచ్చారు. మరికొంత మంది ప్రముఖులు కూడా వచ్చారు. అందరూ మొక్కుబడిగా ఏవో కొన్ని మాటలు చెప్పారు. అలాగే కలెక్టర్ గారు కూడా కొన్ని మంచి మాటలు చెప్పి తనకు వేరే కార్యక్రమం వుందని చెప్పి బయలు దేరుతున్నారు.

ఆ సమయంలో నేను, సభా మధ్యమంలో నిల్చుని ప్రాంగణం నుండి నిష్క్రమిస్తున్న కలెక్టర్ గారిని, సార్ మీరు మాట్లాడింది అంత స్ఫూర్తి దాయకముగా లేదు. మా పిల్లల తరఫున ఒక ప్రశ్న అడుగుతాను దయ వుంచి సమాధానం చెప్పి వెళ్ళండి అని అడిగాను. వారు ముందు నేను అలా అడిగే సరికి కాస్తా నిర్ఘాంత పోయినా అంత మందిలో అడిగాను కాబట్టి...మధ్యలో ఆగిపోయారు. సరే అడగండి అన్నారు.

అప్పుడు నేను అడిగాను. అయ్యా మీరు మొత్తము ఆదిలాబాద్ జిల్లాకు ప్రథమ పౌరుడు కదా!...మీరు ఎప్పుడు కలెక్టర్ కావాలని నిర్ణయించారు...ఆ లక్ష్యం ఎలా సాధించారు?

వారు చాలా సంతోషించి...అలాగే పిల్లల మధ్యలో నిలుచుని చెప్పారు.

నేను మా గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నప్పుడు అనుకుంటాను. మా బడిలో ప్రధానాచార్యుడి గది ముందు ఒక పెద్ద నల్ల బోర్డ్ మీద వ్రాసిన ఒక విషయం నన్ను ఆకర్షించింది. అదేమిటి అంటే... "ఈ ప్రభుత్వ పాఠశాలకు ఉత్తరాధికారి జిల్లా కలెక్టర్."

నేను, మా ఉపాధ్యాయుడిని అడిగాను. సార్ జిల్లా కలెక్టర్ ఈ స్కూల్‌కి అధికారా? అని. అప్పుడు వారు వివరించారు... బాబూ... ఈ స్కూల్ ఒక్కటే కాదు ఈ జిల్లాలో ఉన్న మొత్తము స్కూల్స్‌కి వారే ఉత్తరాధికారి. అంతే కాదు... ఈ జిల్లాకే ఆయన ప్రథమ పౌరుడు అని చెప్పారు. అప్పుడు, సార్ మరి అలా అవ్వాలంటే నేను ఏమి చేయాలి అని అమాయకంగా అడిగాను. IAS చేయాలి నాయనా అని చెప్పారు.

ఆ మాటే మంత్రంలా తీసుకున్నాను. 7వ తరగతి నుండి అను క్షణం అహరహం నేను IAS అవాలన్న ఏకైక లక్ష్యంతో శ్రమించాను... బాగా చదువుకున్నాను. ఇక వేరే ఆలోచన చేయనే లేదు. దాని అంతు చూసే దాకా విశ్రమించలేదు. తుదకు నేను అనుకున్నది సాధించాను. ఇప్పుడు ఆదిలాబాద్‌కు సంయుక్త కలెక్టర్ అయ్యాను.

ఇక చూడండి... వారి మాటలు విన్న అక్కడున్న వేల మంది పిల్లల్లో ఒక అద్భుతమైన స్ఫూర్తి నిండి అందరూ జోరుగా చప్పట్లు కొడుతూ వారికి ధన్యవాదాలు తెలుపుకున్నారు. పిల్లలూ ఎవ్వరు కూడా పుట్టుకతో ఒక లక్ష్యంతో పుట్టరు. వయసు పెరిగే కొద్దీ మన లక్ష్యాన్ని మనము వెతుక్కుని పట్టుకోవాల్సిందే.

# 36. నా ఇష్టం వేరే వుంది




## సమస్య:

*నాకు చిన్నప్పటి నుండి ఒక ఇష్టం వుంది. ఒక లక్ష్యంతో బ్రతుకుతున్నాను. కానీ ఇంట్లో ఎవరూ నన్ను అర్థం చేసుకోరు. పైగా నేను చిన్న పిల్లని...నాకేమి తెలియదు. వాళ్ళను చూడు...వీళ్ళను చూడు ఎలా బ్రతుకుతున్నారో తెలుస్తుంది అని చెప్పి నన్ను అస్తమానం విసిగిస్తు వుంటారు. నేనేమి చెయ్యాలి? నా ఇష్టాన్ని నేనెలా సాధించాలి?*

## వివరణ:

ఇక్కడ మీరు చదువు అంటే ఇష్టం లేదు అని చెప్పడం లేదు. కానీ చదువుకంటే కూడా ఇంకో దాని మీద ఎక్కువ ఇష్టం వుంది అని చెప్పడం గమనించాలి. దీనిని ఎవరూ అర్థం చేసుకోలేదు అన్నది పిల్లలు చెప్తున్న విషయము. ఎన్నో విషయాల మీద పిల్లలకు ఇష్టం వుండొచ్చు. కేవలం చదువు పేరు చెప్పి వారిని, ఆ ఇష్టమైన వ్యాపకం, వ్యాసంగం, పని నుండి గాని దూరం చేయ కూడదు. చదువు కావాల్సిందే కానీ చదువు మాత్రమే కావాల్సింది కాదు అన్నది పిల్లలు మరియు పెద్దలు అందరూ గుర్తించాలి.

ఉదాహరణకు, పిల్లలకు సంగీతం, సాహిత్యం, చిత్ర లేఖనం, క్రీడలు, నాట్యం, కరాటే, వ్యాయామం, యోగ, వర్తమాన విషయాలు, రాజకీయాలు, సైక్లింగ్, పర్యాటకం, ధ్యానం, వ్రాయడం, మాట్లాడటం, సేవ చేయడం, NCC, NSS, స్కౌట్స్ & గైడ్స్, ఆధ్యాత్మికత, నవ్వించడం, బ్లాగ్ వ్రాయడం, క్రికెట్, రేడియో, టీవీ

చూడటం, షార్ట్ ఫిలిమ్స్ ఇలా ఎన్నో వ్యాసంగాలు వుంటాయి. వీటిలో ఒకటో రెండో ప్రతి ఒక్కరికి ఇష్టమైనవిగా వుండొచ్చు. నిజానికి ఇవన్నీ కూడా పిల్లల వ్యక్తిత్వాన్ని మరింతగా తీర్చి దిద్దేవి. అవి అద్భుతమైన సృజనాత్మకతను వెలికి తీస్తాయి.

పిల్లలు చదువు కోవడమే ప్రధానం అని తల్లి తండ్రులు వాళ్లకు ఇంకేమీ నేర్పించకుండా నియంత్రిస్తే వాళ్ళు చదువరులుగా మారతారు తప్ప... పరి పూర్ణమైన వ్యక్తులుగా తయారవరు. ఒక వ్యక్తి తన జీవిత నైపుణ్యాలను, ఏకాగ్రతను, నైతికతను, నిశిత దృష్టిని, పరిశీలనను, సేవాదృక్పథాన్ని మరెన్నో సద్గుణాలను చదువుతో పాటుగా తాను ఇష్టముగా చేసే పనుల ద్వారా నేర్చు కోవడానికి అవకాశం వుంది. అందుకే పిల్లలను పెద్దలు వారి ఇష్టాయిష్టాలను గుర్తిస్తూ మంచిని ప్రోత్సహించాలి.

పెద్దలకు తెలుసు...ఎప్పుడైనా బోరు కొడుతోందని అనిపిస్తే ఏమి చేస్తాము... ఏ సినిమాకో షికారుకో వెళతాము కదా, అంత మాత్రాన మనం ఉద్యోగం సరిగ్గా చేయటం లేదని అర్థము కాదు కదా. ఒక మూసలో పోతున్న జీవితములో ఇలాంటివి ఆటవిడుపు మాత్రమే. అవి మనలోని సోమరి తనాన్ని, బద్ధకాన్ని తొలగించి నూతనోత్తేజాన్ని కలిగిస్తాయి. అలాంటి సమయాల్లో మనసు ఎంతో సేద తీరుతుంది. మనము సాధారణంగా చేసే పనులలో ఇంకా చురుకుగా పాల్గొంటాము. ఇదే కదా మన అనుభవం.

అలాగే, పిల్లలు కూడా నూతనోత్తేజమును, వారికి ఇష్టమైన వ్యాపకములలో మునిగి తెచ్చుకునే ప్రయత్నం చేస్తారు. పిల్లలు ఒక గంట లేక రెండు గంటలు ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొంటే ఎంతో ఉత్సాహంగా వారి రోజువారీ పనుల మీద దృష్టి పెట్టి రెట్టింపు ఫోకస్‌తో పరిగెత్తుతారు. మామూలుగా గంటలో చేయల్సిన హోమ్ వర్క్ అర్ధ గంటలో ముగించేస్తారు. పిల్లలని నిరుత్సాహ పరచి వారిలో పొంగి పొరలే శక్తి యుక్తులని అడ్డుకుని ఆనకట్ట వేయొద్దు. వీలయితే వాళ్ళతో పాటూ మీరూ చేరండి. వాడికి మీమీద ప్రేమ గౌరవం మర్యాద రెట్టింపు అవుతాయి. మీ మాటే వేదంలా స్వీకరిస్తాడు. ఇది నిజం.

కానీ, ఇష్టం ఏదైనా అవి మంచిగా వుండాలి తప్ప... తప్పులుగా వుండొద్దు. తప్పుడు అలవాట్లకు మనము ఇష్టం అన్న సాకుతో బ్రతుకు బస్టాండు చేసుకోకూడదు. ఈ విషయంలో తల్లి తండ్రులు జాగ్రత్తగా వుండాలి. వీలయితే తప్పుడు మార్గాలలో వెళ్లే పిల్లలకు సరి అయిన దిశానిర్దేశం చేయాలి.

## సూచనలు:

*1. చదువు – ఇష్టాలు వేరు వేరు అని గ్రహించండి*

*2. చదువుకు ఇబ్బంది కలగని విధంగా ఇష్టము వుండాలి.*

*3. అవసరం వచ్చినపుడు ఇష్టమైన వాటి మీద కూడా కాస్త ఎక్కువ సమయం పెట్టడానికి వెనుకడుగు వేయొద్దు.*

*4. ఇష్టమైన పని చేస్తున్నాము అని చదువులో వెనుక బడటాన్ని ఎవరూ ఒప్పుకోరు. అయినా మీరు ఇష్టంగా చేస్తున్న ఏ పని అయినా చదువు మీద రెట్టింపు ప్రభావం చూపుతుంది తద్వారా ఇంకా మంచి ఫలితాలు పొందే అవకాశం ఉంది.*

*5. కనీసం డిగ్రీ చేసిన తరువాత, నిజంగా మీకు ఇష్టమైన మార్గంలోనే అద్భుతాలు సాధించ వచ్చు అని తలిస్తే ఇక సంతోషంగా ముందుకెళ్ళొచ్చు.*

## ప్రేరణ మంత్రం:

*ఇష్టంతో చేసే ఏ పనిలోనైనా కష్టం కనిపించదు. అందులోనే వ్యక్తి అద్భుతాలు సృష్టించగలడు.*






## స్ఫూర్తి:

అబ్బాయికి 16 సంవత్సరాల వయస్సు (2022), 12 వ తరగతి చదువుతున్నాడు. తను ఐదు సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు వాళ్ళ నాన్న కంప్యూటర్ ముందు కూర్చొని అంకెలతో మరియు అక్షరాలతో ఏదో మ్యాజిక్ చేస్తున్నాడు అని భావించి, నాకు కూడా నేర్పించండి అని మారాం చేయడం మొదలు పెట్టాడు.

సరే! వీడికి ఇంట్రెస్ట్ ఉన్నప్పుడు ఏదో చిన్న చిన్న లాజిక్స్ నేర్పిద్దాం అని కూడికలు, గుణింతాల లాంటి వాటికీ సంబంధించిన చిన్న చిన్న లాజిక్స్ మరియు కోడింగ్ నేర్పడం మొదలు పెట్టాడు. అలా ఐదు సంవత్సరాల వయసు నుండే కోడింగ్ నేర్చుకోవడం మొదలు పెట్టిన పిల్లాడు, ఇప్పటివరకు ఆపిల్ లాంటి కంపెనీకి చిన్న చిన్న అప్లికేషన్స్ తయారు చేశాడు. ప్రస్తుతం తను IBM కంపెనీకి ఫ్రీలాన్సర్ గా పనిచేస్తూ, బాగా డబ్బులు సంపాదిస్తూ, తన చదువు తాను చదువుకుంటున్నాడు.

IBMలో జాబ్ సంపాదించటం అంటే మాములు విషయం కాదు. IIT చదివిన చాలామందికి అదొక గొప్ప లక్ష్యం. అలా పిల్లలకు మంచి ఆలోచనలు మరియు ఇష్టాలు ఉంటే వాటిని ప్రోత్సహించండి. ఇంతకూ ఆ అబ్బాయి పేరు తెలుసా? తన్మయ్ బక్షి. తండ్రి పేరు పునీత్ బక్షి. వీరు కెనడా దేశంలో స్థిర పడిన భారతీయులు. పిల్లలూ... చూశారు కదా! మన మంచి అలవాట్లకు మన జీవితాన్నే మార్చే శక్తి వుంటుంది. మీ ఇష్టప్రకారం నడుచుకోవడంలో ఎటువంటి తప్పులేదు కాని ఆ ఇష్టం ఏ మాత్రము తప్పుగా వుండకుండా చూసుకోవడమే మీ బాధ్యత.

# 37. స్ఫూర్తి ఇచ్చేవారు లేరు



## సమస్య:

*అయ్యో! నన్ను ఇంట్లో ఎవరూ పట్టించు కోరు. నేను మంచి చేస్తే మెచ్చుకునే వారు లేరు...కానిపని చేస్తే దండించే వాళ్ళు లేరు. నేనెవరి కోసం బ్రతకాలి అన్నది తెలియదు. మంచి చెప్పే వాళ్ళు లేరు...ప్రోత్సహించే వాళ్ళూ లేరు. తల్లి దండ్రులకు ఏమీ తెలియదు...స్ఫూర్తి నిచ్చే వారు లేరు. నేను ఏమి చేయాలో తెలియదు. నాకు నేను ఉత్సాహంగా ఎలా చదువుకోవాలి చెప్పండి.*

## వివరణ:

పిల్లలూ... ఒక విషయం అడుగుతాను చెప్పండి.

సాలీడుకు తన ఇల్లు అల్లుకోమని ఎవరన్నా స్ఫూర్తినిచ్చారా?

పక్షికి గూడు కట్టమని పదిమంది ఎవరైనా ప్రోత్సహించారా?

చేపకు నీళ్ళల్లో ఈదమని ఇంకెవరైనా చెప్పారంటారా?

మిమ్మల్ని ఈ వయసులో కూడా అన్నం తినమని ఎవరైనా రోజూ ఉత్సాహ పరుస్తారా?

అతి చిన్న ప్రాణి నుండి మనిషి వరకు ఏదైనా పని చేయాలంటే కావాల్సింది బయట నుండి వచ్చే శక్తి కాదు లోపల నుండి వచ్చే ప్రేరణ ప్రధాన కారణంగా ఉంటుంది. ఎవరైనా చెప్తే అది మీకు నచ్చొచ్చు లేక నచ్చకపోవచ్చు. అదే మీకు మీరే చెప్పుకుంటే అనంతమయిన శక్తి ఉదయిస్తుంది కదా. అంతెందుకు...పైన చెప్పిన సాలీడు ఇల్లు అల్లినా... పక్షి గూడు కట్టినా... చేప ఈదినా... చివరికి నువ్వు అన్నం

తిన్నా దేని వలన చేస్తావు... బ్రతకాలి అనే ఒకే కారణం వల్లనే కదా? బాగుపడాలి అనే ఆలోచన వల్లనే కదా?

ఆకలి లేనప్పుడు...మనముందు మృష్టాన్న భోజనము పెట్టినా లాభం ఏమిటి? ఒక వేళ ఆకలి లేకున్నా తింటే ఎంత రుచి కరమైన ఆహారమైనా సరే మనకు రుచించదు. అలాగే మనకు సాధించాలన్న బలమైన ఆకాంక్ష, లక్ష్యం, ధ్యేయం ఇవి లేకుంటే ఇక ఎంత మంది వచ్చి చెప్పినా చెవిటి వాడి ముందు శంఖం వూదినట్లే కదా.

స్ఫూర్తినిచ్చే వారు లేరు, అనే వాళ్ళు అందరూ ఒకటి గుర్తించాలి. స్ఫూర్తిని ఎవరూ బోర్డ్ పెట్టి ఇదిగో స్ఫూర్తి ఇక్కడ దొరుకుతుంది అని చెప్పరు కదా! అయినా స్ఫూర్తి ఏమైనా అంగట్లో దొరికే వస్తువా కొని తెచ్చు కోవడానికి? స్ఫూర్తి ఒకరు ఇచ్చేది కాదు. మనకు మనమే తెచ్చుకునేది. సృష్టిలో కెల్లా మనిషి జన్మ అద్భుతమైనది కదా... మీరెప్పుడైనా దీన్ని గుర్తించారా? గుర్తించి వుంటే... మనిషిగా జన్మించడమే ఒక స్ఫూర్తిగా నిలిచేది. దేవుడు ఇచ్చిన తెలివి తేటలతో మనము మన జీవితమే కోట్ల మందికి ఒక స్ఫూర్తి అవ్వాలి...అలా ఆలోచిస్తే మీరు చేసే ప్రతి పనిని ఎంతో నిజాయతీగా... నిబద్ధతతో... నిర్ణయాత్మకముగా చేస్తారు.

ప్రేమ, తమిళనాడు నుండి వాళ్ళ తల్లి తండ్రులతో పాటుగా బ్రతుకు తెరువు కోసమని మహారాష్ట్రలోని ముంబయి పట్టణానికి తన చిన్ననాడే వచ్చేసింది. తల్లి చిన్న పనులు చేస్తే, తండ్రి ఆటో నడిపే వారు. ఒక మారు మూల ఉన్న బస్తీలో ఒకే గదిలో వుండే వారు. చిన్నప్పటి నుండి తల్లిదండ్రులు ప్రేమను మరియు తన తమ్ముడిని ఎంతో కష్టపడి చదివించే వాళ్ళు. ఆ పిల్లలు కూడా చదివేది ఏ తరగతిలో అయినా శ్రద్ధా భక్తులతో చదువుకుంటూ మంచి మార్కులతో ముందుకు వెళ్లే వాళ్లు. ప్రేమ కామర్స్‌లో డిగ్రీ చేసింది. ఇంట్లో తల్లిదండ్రులను చూస్తూ తనెలాగైనా సరే బాగా చదివి వాళ్లకు తోడుండాలని తపన పడేది. ఇంట్లో ఎవ్వరూ ఏ గుణ పాఠం చెప్పే వాళ్ళు లేరు. జీవిత సత్యాలు నిత్యం భోదించే వాళ్ళు లేరు. ఒక్కో సారి నెలలోపే వనరులు అయిపోయి సమస్యలు వచ్చేవి. అయినా పట్టు వదల లేదు. డిగ్రీలో విశ్వవిద్యాలయములోనే ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. దేశములో అత్యంత దుర్లభమైన ఛార్టర్డ్ అకౌంటెన్సీ చదవాలని ఆశ పడింది. ఆ తరవాత 2012 లో అనుకుంటాను...ఆటో డ్రైవర్ కుమార్తెకు CA లో మొదటి రాంక్ వచ్చింది అని పేపర్లో వచ్చింది. అప్పుడు ఈ అమ్మాయి గురించి తెలుసుకున్నాను. ఇప్పుడు ఆ అమ్మాయి చాలా అద్భుతమైన స్థాయిలో వుండొచ్చు... సందేహం లేదు.

పిల్లలూ! ఇప్పుడు చెప్పండి ప్రేమకు స్ఫూర్తి ఇంట్లో ఎవరు ఇచ్చారంటారు...నిజానికి ఆమె స్ఫూర్తిని ఎంతో మంది నుండి తీసుకుంది. అదే అమ్మాయిని విజయ పథములో నడిపించింది. ఈ రోజుల్లో తమ పిల్లలు CA



సాధించడం కోసం లక్షలు ఖర్చు పెట్టే తల్లిదండ్రులను నేను చూస్తున్నాను. మరి వాళ్లందరికీ ఎందుకు అంతటి విజయం రావటం లేదు? కారణం ఎవరు చూసినా ఎవరో ఒకరు స్ఫూర్తినివ్వాలి అనుకుంటున్నారే కానీ... కళ్ళ ముందు కనిపించే దేవుళ్ళు అయిన తల్లిదండ్రుల ఆశలను, కష్టాలను గుర్తించలేదు. గుర్తించివుంటే వాళ్ళే స్ఫూర్తిదాతలుగా మారే వాళ్ళు.

నిజానికి, మీరు స్ఫూర్తినిచ్చే వాళ్ళ కోసం వెతకడం కంటే, చూసే ప్రతి దాని నుండి స్ఫూర్తిని పొందే

ప్రయత్నం చేయండి. ఉదాహరణకు ఇల్లు అల్లుకునే సమయంలో వందసార్లు ఓడిపోయినా మరొక్కసారి ప్రయత్నం చేసే సాలీడు మనకు స్ఫూర్తి కదా? చదువు సంధ్యలు ఏమి లేకున్నా ఆత్యంత చాకచక్యంగా గూడు కట్టుకునే పక్షి స్ఫూర్తి కాదంటారా? చివరి నిముషం దాకా నీటిలో ఈదుతూ బ్రతికే చేప స్ఫూర్తి నింపదంటారా?

శ్రీ దత్తాత్రేయ స్వామి వారిలో స్ఫూర్తి నింపింది ఎవరో తెలుసా మనుషులు కాదు... ప్రకృతిలో కనిపించే 24 అంశాలను స్ఫూర్తిగా తీసుకున్నారు. అందులో చీమ, చేమ, భూమి, సూర్యుడు, ప్రవహించే నది, సముద్రం ఇలా ఎన్నో. ప్రతిదీ ఒక అద్భుతమైన జీవిత పాఠం నేర్పించేదే! ఒక్క సారి మీరు కూడా పరిశీలించి చూస్తే ఈ సత్యం గోచరమవుతుంది.

మన చుట్టూ వున్న ప్రతి అంశమును కూడా చూసే కన్నులతో చూడగలిగే మనసుతో చూస్తే ఎంతో స్ఫూర్తిని పొందవచ్చు.

కప్పుకు వేలాడుతూ తాను గిర్రున తిరుగుతూ గదిలో కూర్చున్న వారికి చల్లటి గాలి నిచ్చే ఫ్యాన్

ఇంట్లో అందరూ బయటకు వెళితే, ఇంటి భద్రత కోసం ఇంటి తలుపుకు తానే బంధముగా మారిన తాళంకప్ప

తెల్లవారుతూనే ఇంటి గడప ముందు ప్రత్యక్షం అయ్యే అబ్బాయి.. పాలవాడు

మనము నిద్ర లేవకుండగానే, తన ఇంట్లో చంటి పిల్లను వదిలేసి బ్రతుకు తెరవుకోసం మన ఇంట్లో పనిచేసే పనిమనిషి. ఇలా నిశితంగా గమనిస్తే ప్రతిదీ కూడా స్ఫూర్తినందించేదే కదా!

### ప్రేరణ మంత్రం:

*Let's have at least one Mentor... We will become No.1 in Life*

### సూచనలు:

1. *మన చుట్టూ జరిగే విషయాలను సునిశితంగా గమనించండి.*
2. *ప్రతి అంశములో స్ఫూర్తిని తీసుకోవచ్చు.*
3. *మీ స్ఫూర్తి ఎంత గొప్ప వాళ్ళనుండి పొందారు అనే కంటే ఎంత గొప్ప స్ఫూర్తిని చిన్న అంశాన్ని గమనించి తీసుకున్నారు అన్నది ప్రధానం.*
4. *ఒకసారి స్ఫూర్తిని పొందారు అంటే ఇక జీవితములో మీరు దేశానికి స్ఫూర్తినిచ్చే దాకా విశ్రమించనే వద్దు.*
5. *మీ స్ఫూర్తిని దృశ్య రూపంలోనో, మాటల రూపంలోనో, సంగీతం రూపంలోనో మీ కళ్ళ ముందు కనిపించే విధంగా చూసుకోండి.*
6. *మీ వ్యక్తిత్వంలో ఆ స్ఫూర్తిని సదా ప్రకటితం చేస్తూ వుండండి.*

### స్ఫూర్తి:

మృదుల ఒక మధ్య తరగతి కుటుంబానికి చెందిన అమ్మాయి. సాధారణంగా చదివే అమ్మాయి. ఇంజినీరింగ్ లో 2వ సంవత్సరం చదువుతున్న సమయంలో కారణాంతరాల వలన పార్థుని పెళ్లి చేసుకోవాల్సి వచ్చింది. తను కూడా బాగా చదువుకునే కుర్రాడే. కానీ ఇంట్లో ఇబ్బందులున్నాయి. పెళ్లి చేసుకున్న అమ్మాయిని చక్కగా చూసుకోవాలి అనుకుని, తన చదువుని మధ్యలో ఆపేసి కట్టుకున్న భార్యను చదువుకొమ్మని చెప్పాడు. అంతే... ఈ సంఘటన మృదులను మేల్కొలిపింది. తన భర్తనే స్ఫూర్తిగా తీసుకుంది. ఇక మిగిలిన 2 ఏళ్ళు చాలా శ్రద్ధగా చదివింది. చదువు అయిన తరువాత శ్రీ ఇందు కాలేజీలో అధ్యాపకురాలిగా పని చేసింది. ఒక ప్రక్క భర్త చేస్తున్న చిన్న ఉద్యోగంతో తన సంపాదన జత చేసింది. భర్త అంతటితో ఊరుకోలేదు. మృదులను

M Tech చేయమన్నాడు. ఆమె దాన్ని కూడా విజయ వంతంగా ముగించింది. ఒక ప్రక్క పార్ట్ టైం జాబ్ చేస్తూనే ఉంది. ఒక బాబు పుట్టాడు. ఇల్లుకొన్నారు. ఆనందంగా జీవిస్తున్నారు.



ఇంతలో పార్థుకు చాలా అరుదైన అనారోగ్యం వచ్చి ప్రాణాలతో పోరాడటం మొదలైంది. ఇద్దరు యుక్తవయసులో ఉన్నారు, చిన్న పిల్లాడు. లక్షలు ఖర్చు పెట్టేశారు. నయం కాలేదు. కానీ మృదుల తన శాయశక్తులా భర్తకుతోడు గా నిల్చుంది. ప్రతి నిముషం తన భర్త నుండి తాను తీసుకున్న స్ఫూర్తితో సమస్యలను ఎదుర్కొంటూ...ఇంకో ప్రక్క ఉద్యోగం చేస్తూ...చాలా తీవ్రమైన కృషితో సుమారు 6 సంవత్సరాలు పోరాటం చేసి భర్తకు మళ్ళీ జీవం పోసుకుంది...మరో సావిత్రిలా.



కథ అక్కడితో అవలేదు... తన భర్త తనకు స్ఫూర్తిగా నిలిస్తే తన బాబుకు తానే అన్ని అయి చూసుకుంది ఆ తల్లి. భర్తకు అందించిన ప్రోత్సాహముతో ఆయన మళ్ళీ మాములు మనిషిలా... మళ్ళీ విద్యార్థిగా మారి కళ్ళకు అద్దాలకు సంబంధించిన నైపుణ్యాన్ని సాధించాడు. ఒక Optical Shop ను ప్రారంభం చేశారు. కానీ తన భార్య ఇంకా ఉన్నతమైన చదువులు చదవాలన్న కాంక్షతో తనను ఇంకా ప్రోత్సహించాడు. ఈ కథ సుమారు పుష్కర కాలం జరిగిన కథ. ఇప్పుడు మృదుల Ph D చేస్తోంది. అతి త్వరలో డాక్టర్ పట్టా కూడా అందుకోబోతోంది.



అమ్మాయీ నీకెవరు స్ఫూర్తి అని అడిగితే పార్థు అని అబ్బాయీ నీకేవరు స్ఫూర్తి అంటే మృదుల అని బాబూ సాత్విక్ (13) నీకు అని అడిగితే... అమ్మా నాన్నలని happyగా చెప్తూ నవ్వుతాడు. తన తరగతిలో వాడే ప్రథముడు.



పిల్లాలూ... మనకు స్ఫూర్తి కావాలంటే మూడు కోట్ల దేవతలు అవసరం లేదు...140 కోట్ల జనము అఖ్ఖర లేదు. మన చుట్టూ వుండే ఒక్కరు చాలు జీవితంలో అనితర సాధ్యమైనవి సాధించడానికి.

# 38. చదవకపోయినా బాగుపడొచ్చు కదా?




## సమస్య:

*అసలు చదవక పోయినా బాగు పడొచ్చు కదా? చదువుకున్న వాళ్లకేమీ అక్కడ స్వాగతం చెప్పి ఎవరూ ఉద్యోగాలు ఇవ్వటం లేదు కదా? దేశంలో చదువుకున్న నిరుద్యోగులు ఎక్కువగా వున్నారు కదా? చదివి సాధించేది ఏముంది? చదవకుండా బ్రతక లేనా? ఏమీ చదవని వాడైనా ధీరుభాయి అంబానీ ప్రపంచ ప్రఖ్యాత కుబేరులలో ఒక్కడు అయ్యాడు కదా? చదివి సాధించేది ఏమీ లేదని నా అభిప్రాయం.*

## వివరణ:

భలేగా అడిగారురా పిల్లలూ... కరెక్ట్‌గానే చెప్పారు. చదివినోడి కన్నా చదవని బట్టలుతికే వాళ్ళు మిన్న అని అందుకే కదా అన్నారు.

మేము చిన్నప్పుడు చూసిన విషయం చెప్తాను వినండి. చదివిన వాళ్ళు తమ బట్టలను ఎంచుకుని పుస్తకంలో వ్రాసుకుని ఇస్తే చదువుకోని బట్టలు ఉతికే వాడు మాత్రం అన్ని బట్టలు హ్యాపీగా మూట కట్టుకుని వెళ్తాడు. ఇలా 10 ఇళ్లలో తీసుకెళ్తాడు. మరుసటి రోజు బట్టలు శుభ్రపరచి ఎవరి ఇంటిలో తీసుకున్న బట్టలు వాళ్ళింట్లో ఎలాంటి పొరపాటు లేకుండా చాలా ఖచ్చితత్వముతో ఇచ్చేస్తాడు. కాబట్టి మనము చదువుకోవడం దండగ. మనకంటే చదవని వాడు కూడ మేలే.

చదువుకున్నంత మాత్రాన అక్కడెవరు పిలిచి ఉద్యగాలు కూడా ఏమీ ఇవ్వరు. కరెక్ట్‌గా చెప్పారు పిల్లలూ. నేను

కూడా చూస్తున్నాను దేశంలో నిరుద్యోగం ఎక్కువగా వుంది. పెద్ద పెద్ద చదువులు చదివిన వాళ్ళకే ఉద్యోగాలు దొరకడం కష్టంగా వుంది. ఇక చదువుకోవడం వృథా.

ఇంకోటి తెలుసా చదువుకోకుంటే మనము ఏపనైనా హాయిగా చేసుకోవచ్చు. చదివి ఉద్యోగం లేకుండా తిరగడం కంటే, లారీకి క్లీనర్‌గానో, ఆటో డ్రైవర్‌గానో, జొమాటో బైక్ నడిపో, ఓల టాక్సీయో, డెలివరీ బాయ్స్ లాగానో, ఫుట్‌పాత్ మీద చిన్న చిన్న బండ్లు పెట్టుకునో... ఏదో ఒక లాగా బిడియం, సిగ్గూ లేకుండా బ్రతికేయచ్చు. అదే చదువుకుంటే అనవసరంగా లేని పోని నామోషీ... గౌరవం... మర్యాద అడ్డు వచ్చి చిన్నా చితకా పనులు చెయ్యడానికి సిగ్గు పడిపోతాము.

ఇంకో విషయం గమనించాను...మీరు చెప్పింది అక్షరాలా నిజమే చదువు లేక పోయినా ధీరుభాయి అంబానీ బాగు పడలేదా ఏంటి. భలే గమనించారు. అసలు చదువుకోని కోట్ల మందిలో ఆయనొక్కడే అంత స్థాయికి వెళ్ళాడు. కాబట్టి మనము కూడా చదవకుండా అలా అద్భుతాలు సాధించవచ్చు.

ఇవే కదా మీ భావనలు. ఇలాంటి భావనలు ఉన్నాయంటే మనమంతా తప్పక ఏ పనికిరాని పనికిమాలిన వాళ్ళమవుతాము. అదేంటి ఇలా అనేశాను అనుకుంటున్నారు కదూ... ఇప్పుడు మీ భావనలు ఒక్క సారి పరిశీలించి మనము ఎక్కడ పొరపాటు చేస్తున్నామో చూద్దాం.

1. చదువుకోనివాడు కాబట్టే... 10 మంది చదువుకున్న వాళ్ళ ఇళ్ళకు వెళ్ళి బట్టలు తీసుకెళుతున్నాడు. చదివి వుంటే చక్కగా ఒక మంచి లాండ్రీ పెట్టుకుని ఇంకొంత మందికి ఉపాధి కల్పించే వాడేమో కదా?

2. పుస్తకాలు చదవకపోయినా వారి వృత్తివిద్యని నేర్చుకున్నాడు కదా! చాకలైనా, కుమ్మరైనా, కమ్మరైనా, వడ్రంగి అయినా మరొకరైనా వృత్తివిద్యలు నేర్చుకుంటున్నారు. వాటితోపాటు చదివే, ఉంటే మరింతగా రాణిస్తారు.

3. చదువుకున్నా ఉద్యోగాలు దొరకని ఈ దేశములో చదువుకోకుండా ఏమి చెయ్యగలమంటారు?

4. ఒక వేళ చిన్నా చితక పనులు చేసినా చాలి చాలని సంపాదనతో ఎలా జీవితం సాగిస్తారు?

5. రేపు మీకు పెళ్లవుతుంది అనుకుందాము... నెలకు 10 వేలు సంపాదిస్తే చాలుతుందా?

6. చదవకుండా బాగు పడిన వాళ్ళు ఎవరన్నా వున్నారు అంటే...వాళ్ళు చదువుకునే స్థోమత లేక చదవలేదు తప్ప పుట్టినప్పుడో...లేక చిన్నప్పుడో నేపధ్యం ఏదైనా చదువుకోవడం వద్దు అనుకోలేదు.

7. ఇక ధీరుభాయి Fans గురించి...దేశంలో ఉన్న 140 కోట్లమందిలో ఇప్పుడు కూడా చదువుకోని వాళ్ళు ఒక 30 కోట్ల మంది ఉన్నార నుకుంటే ...ఒక్క ధీరుభాయి మాత్రమే ఉన్నాడు. మరి మిగితా వాళ్ళ పరిస్థితి ఏమిటి?

పిల్లలూ! చదువుకోవడం అన్నది కేవలం సంపాదన కోసం కాదు...చదువు అన్నది జ్ఞానం సంపాదించటం కోసం. చదువువలన వినయం, వివేకం కలుగుతాయి.

"విద్యయొసగును వినయంబు, వినయమునను।
బడయు పాత్రత, పాత్రత వలన ధనము॥
ధనము వలనను ధర్మంబు, దానివలన।
నైహికాముష్మిక సుఖంబులందు నరుడు॥

చదువు అన్నది జీవితం కోసం అని మనం అందరూ గుర్తించాలి. కొన్నైనా అక్షరం ముక్కలు వస్తే కదా, మనము చుట్టూతా ఏమి జరుగుతుందో తెలుస్తుంది. చదువు వలన సంస్కారం రావడానికి తప్పక అవకాశం వుంది. చదువుకోవడం చేతకాని వాళ్ళు ఎలా బ్రతుకుతున్నారు అని తెలుసు కోవాలంటే ఒక్క రోజు వేరే ఏమీ పనులు పెట్టుకోకుండా ఉదయం నుండి రాత్రి

దాకా ఇంటి నుండి రోడ్డు మీద వున్న ప్రతి మనిషిని, వాళ్ళు చేస్తున్న పనులను గమనించండి. చదవని వాడి సంపాదన గురించి ప్రస్తావించి వాడి జీవిత విధానం తెలుసుకోండి. ఒక సర్వే లాగా నిజాలు నిజాయతీగా వ్రాసుకోండి. వంద మంది చదువుకోని వ్యక్తుల జాబితా తీసుకుంటే కేవలం ఒక 5% మంది మాత్రమే బాగా బ్రతికే వాళ్ళుంటారు. ఇది సత్యం.

పిల్లలూ ఎదో ఒకరిని చూసి చదవక పోయినా ఫలనా అంబానీ బాగు పడ్డాడని...చదవక పోవడాన్నే లక్ష్యం చేసుకోవద్దు. అలాంటి వాళ్ళు దేశంలో ఒక్కరో, ఇద్దరో ఉంటారు. మనము కనీసం డిగ్రీ లేక, దానికి సమానమైన చదువైనా చదవాలి. అది ఏదో ఉద్యోగము కోసం కాదు సుమా...లోక జ్ఞానం కోసం, సమాచారం తెలుసుకోవడం కోసం, వ్రాయడం కోసం, లౌక్యం తెలుసుకోవడం కోసం, రేపు పెళ్ళైన తర్వాత తన పిల్లలను తీర్చి దిద్దడం కోసం, కనీసం 3 భాషలైనా నేర్చుకోవడం కోసం, నిర్ణయాలు తీసుకోవడం కోసం... ఇలా ఎన్నో అవసరాల కోసం చదువుకోవాలి. చదువు ఉద్యోగం కోసమే కాదన్న సత్యాన్ని మనం అందరూ గుర్తించాలి.

నేను దేశ వ్యాప్తంగా వందల గ్రామాలు తిరిగాను. కొన్ని వేలమంది గ్రామీణ యువతి యువకులతో మాట్లాడాను. పల్లెల్లో పరిస్థితి చాలా ఘోరంగా వుంది... నేను చూసిన పరిస్థితులు మీకు వివరిస్తున్నాను.

1. 80% మంది చదువుకోలేదు.
2. ఇంటి పట్టునే ఉంటున్నారు.
3. ఒకటో లేక రెండు ఎకరాల పొలం ఉంటుంది.
4. పొలం పనులు ఇంట్లో అందరికి ఉండవు. ఉన్నా పొలం నుండి వచ్చే ఆదాయం చాలదు.
5. చిన్న వయసులో పెళ్లి చేసుకుంటున్నారు
6. చాలా చిన్న పనులు చేసుకుని బ్రతుకుతున్నారు
7. సంపాదించేది ఏ మూలకూ చాలదు.
8. ఆర్థిక ఇబ్బందులలో బ్రతికేస్తుంటారు
9. రోగమొస్తే ఇక అంతే, మొత్తము కుటుంబం ఛిన్నాభిన్నం అవుతుంది.
10. గ్రామాలలో తల్లిదండ్రులుంటే యువత పట్టణాలకు వలస వచ్చి కూలీలుగా పని చేస్తున్నారు.
11. దుర్వ్యసనాలకు బానిసలై పోయారు.
12. ఇంటా బయటా అప్పులు చేసి వడ్డీ కూడా తీర్చలేని దరిద్రంలో బ్రతుకుతున్నారు.
13. వీటిని ఆసరాగా తీసుకుని...రాజకీయ నాయకులు వాళ్లకు ఆశలు చూపించి మిగిలిన జీవితాలు కూడా నాశనం చేస్తున్నారు.
14. ప్రభుత్వాలు కూడా ఏమి చేయలేక, చదువుకోని వాళ్ళకు సంపాదన మార్గాలు సృష్టించ లేక నిరుద్యోగ భృతి ఇచ్చేసి చేతులు దులుపు కుంటున్నారు. దాని కోసం యువత బారులు తీరి గొర్రెల్లాగా నిల్చుంటున్నారు. ఈ నిరుద్యోగ భృతి కూడా ప్రభుత్వాలు ఈ మధ్యనే ప్రారంభించి ఇస్తున్నారు.
15. ఆశలు బారెడు...ఆదాయం మూరెడు అన్నట్టుంది పరిస్థితి.

పిల్లలూ... పట్టణాలలో సైతము ఇంచు మించు ఇదే పరిస్థితులుంటున్నాయి. ఇప్పుడు చెప్పండి...చదవకుండా కూడా బాగు పడొచ్చు అంటారా? ఎవడో ఒకడు బాగు పడ్డాడని మొత్తము మీలాంటి పిల్లలు వేలల్లో చదువు అవసరం లేదని నిర్ణయం చేస్తే దేశము మరో 50 ఏళ్ళు వెనక పడి పోతుంది సుమా!

కనీస చదువుతోనే ఏ రంగములో నైనా రాణించవచ్చు. చదువుకు, ఎంచుకున్న ఉద్యోగరంగానికి సంబంధం లేకపోవచ్చు...కానీ ఆ చదువే మీరెంచుకున్న రంగంలో మిమ్మల్ని మరింత అభివృద్ధి పథం లో నడిపిస్తుంది.

**ప్రేరణ మంత్రం:**

*Education is complementary for any field one chooses to live in life. But it is not mandatory for life!*

## స్ఫూర్తి:



ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తెలుగు వారి మిఠాయిలు, పుల్లారెడ్డి స్వీట్స్. వాటిని తయారు చేసే పుల్లారెడ్డి గారు ఒక రోజు కూకట్‌పల్లిలోని ఒక కాలేజీలో ప్రసంగం చేస్తూ చదువు యొక్క ప్రాముఖ్యత గురించి మాట్లాడారు ఆయన చెప్పిన విషయం ఏమిటంటే, నేను చిన్న బడ్డీ కొట్టులో స్వీట్స్ తయారు చేస్తున్నప్పుడు ఒకానొక చదువుకున్న మిత్రుని సలహా మేరకు కర్నూలులో షాపు ఓపెన్ చేశాను. అదేవిధంగా మీలాంటి చదువుకున్న మిత్రుని సలహా మేరకే నా స్వీట్స్‌ని రాష్ట్రాలు దాటించాను అన్నారు. ఇప్పుడు వారు జీవించి లేరు. కానీ చదువుకున్న వారసులు మాత్రం, కీర్తిని శేషంగా మిగిల్చి వెళ్లిన పుల్లారెడ్డిగారి మిఠాయిలను దేశ విదేశాలకు విస్తరింప చేశారు. ఒక్క హైదరాబాద్ లోనే వారికి సుమారు 15 శాఖలున్నాయి.

ఇవన్నీ వ్యాపార సంబంధమైన విజయాలు. కానీ ఏమీ చదువుకోని మన పుల్లారెడ్డి గారు మాత్రం దేశం బాగు పడాలంటే విద్యాధికుల వల్లనే అవుతుందని... అద్భుతమైన విద్యా సంస్థలు ఏర్పాటు చేశారు. దక్షిణ భారత దేశంలోనే వాటిని అగ్రగామి సంస్థలుగా తీర్చి దిద్దటంలో వారి దార్శనికత ఎంతో వుంది.

చదువు అన్నది మనిషిని మనీషిగా తీర్చిదిద్దుతుంది.

G PULLA REDDY
Estd. 1948

# 39. మంచివాడయితే చాలు, చదువు అవసరమా??




## సమస్య:

*అయ్యా! మంచి వాడుగా వుండటం ప్రధానం కదా...చదువు కోవడం కంటే? ఈ రోజు ప్రపంచంలో మంచి వాళ్ళకు కొదవ చాలా వుంది. నేను చదువుకుని చావు తెలివి తేటలు సంపాదించడం కంటే మంచి వాడిగానే బ్రతుకుదాం అనుకుంటున్నాను. నా కుటుంబాన్ని బాగా చూసుకుంటాను. 10 మందికి నాకు చేతనయిన సాయం చేస్తాను. ఇది చాలు కదా?*

## వివరణ:

నిజానికి ఇలాంటి ప్రశ్నలు నన్ను ఎవరూ అడగలేదు. కానీ నాకు నేనే ప్రశించుకుని జవాబు చెప్పే ప్రయత్నం చేస్తున్నాను. కారణం ఈ అంశము చాలా ప్రాధాన్యత ఉన్నది కాబట్టి. పిల్లలూ ఇక్కడ నేను చెప్పేది జాగ్రత్తగా గమనించండి.

చాలా సమావేశాలలో కొన్ని లక్షల మందిని ఓపెన్‌గా ప్రశ్నిస్తుంటాను. అరేయ్ మీరు ఏమవ్వాలి అనుకుంటున్నారు? అని!

నేను టీచర్, నేను పోలీస్, నేను ఇంజినీర్, నేను డాక్టర్, నేను కాంట్రాక్టర్, నేను రైతు, నేను కలెక్టర్, నేను సివిల్ సర్వెంట్, నేను వ్యాపారి, నేను సింగర్, నేను యాక్టర్, నేను డైరెక్టర్, నేను అది, నేను ఇది అనే వాళ్ళు నూటికి నూరు మంది కనిపిస్తారు. నిజాయతీగా చెప్తున్నాను. ఇలాంటి సమాధానాలే తల్లిదండ్రుల దగ్గరనుండి కూడా వస్తూంటాయి... నాకు చాలా బాధగా వుంటుంది ఇలాంటి సమాధానాలు విన్నప్పుడు.

ఒక వ్యక్తి తాను జీవితములో ఏమి చేయాలన్న విషయంలో తర్జన భర్జన పడిన మీదట...తేల్చుకోలేక ప్రపంచములో దేనికి బాగా డిమాండ్ వుందో తెలుసుకుని ఆ విధమైన రంగాన్ని ఎంచుకుందాం అనుకుని బాగా తెలిసి ఉన్న ఒక పెద్దాయన దగ్గరికి వెళ్ళాడు. వారికి నమస్కరించి! తన విషయం చెప్పుకుని, అయ్యా! జీవితంలో నేనేమయితే బాగుంటుంది అని అడిగాడు. ఆ పెద్దాయన! ఒక్క క్షణం అతని ముఖంలోకి చూసి...చెప్పాడు. నాయనా నువ్వు మంచి వాడవు అయితే బాగుంటుంది అని.

ఆ సలహా విన్న యువకుడు నిర్ఘాంత పోయాడు. కారణము, అలా సలహా ఇచ్చిన వాళ్ళను అతను జీవితంలో ఎప్పుడూ చూడలేదు. అడిగాడు... అయ్యా మీరెందుకు ఇలా చెప్పారో దయవుంచి వివరించండి అని.

ఆ పెద్దాయన ప్రేమతో చెప్పాడు... నాయనా ఈ ప్రపంచంలో అన్నింటి విలువలు పెరిగి పోతున్నాయి... కానీ ఒక దాని విలువ మాత్రం రోజు రోజుకు తరిగి పోతోంది, అదేంటో తెలుసా మనిషి విలువ. విలువలతో బ్రతికే మనుషులు చాలా మృగ్యము అయ్యారు. నిజానికి దేశంలోనే కాదు...ప్రపంచములోనే మంచి మనుషులు కనుమరుగవుతున్నారు. అలాంటి మనుషులకు లోకంలో డిమాండ్ ఎక్కువగా వుంది, అందుకే నిన్ను మంచి వాడవమని చెప్పాను. అప్పుడు, మొదట నీవు మంచి వాడవుతే ఇక నువ్వేమి చదివినా లేక చదవకున్నా అద్భుతాలు సాధించగల శక్తి యుక్తి పుష్కలంగా వుంటాయి.

మానవత్వమున్న మనిషి ఒక ప్రక్క కనుమరుగు అవుతుంటే...మరో పక్క పెద్ద పెద్ద చదువులు చదివి మృగాలలా, రాక్షసులలా, పిశాచాలలా ప్రవర్తిస్తున్న వాళ్ళు ఎక్కువై పోతున్నారు. ఇదే కదా మనం చూస్తున్నది.

పిల్లలూ... ఇప్పుడు చెప్పండి ఈ రోజు మంచి వాళ్ళు కావాలా లేక చదువుకున్న వాళ్ళు కావాలా? నన్నడిగితే విద్యాధికుల కంటే కూడా మంచి వాళ్ళే కావాలంటాను. విద్య నేర్చిన ప్రతి వాడికి అక్షరాలు రావచ్చు కానీ... సంస్కారములు రావడం కొంత కష్టమే అని చెప్పాలి.

చదవ వ్రాయ నేర్చిన విద్యార్థులందురా? వాడిలోన సంస్కారముండవలయును కదా.

తరచి చదువు చదవ తర్కవాదమే గానీ<br>
పూర్ణ జ్ఞానంబెవడు పొందలేడు<br>
చదువు చదివి చదివి చావంగ నేర్చిరి<br>
చావులేని చదువు చదువ వలయు

అన్నారు శ్రీ సత్య సాయి బాబా వారు.

మీరు విన్నారో లేదో పెద్ద వాళ్ళు కొన్ని జంట పదాలు వాడుతుండటం నేను విన్నాను.

చదువు – సంస్కారం<br>
విద్యా – బుద్ధి<br>
కాయ – కష్టం<br>
శ్రద్ధా – భక్తి<br>
Education - Empowerment<br>
శీలేన శోభతే విద్యా

ఒక సారి నేను ఒకాయనను అడిగాను. అయ్యా ఎందువలన ఇలా జంట పద ప్రయోగము చేస్తున్నారు? వారు చెప్పారు...నాయనా ఈ సమాజానికి ఎవరైనా సరే ఉపయోగ పడాలి అంటే వాళ్ళు కేవలం విద్యావంతులు మాత్రమే అయితే ప్రయోజనం లేదు. చదువు తో పాటుగా సంస్కారం వుండాలి. విద్యతో పాటుగా బుద్ధి కూడా మారాలి. శరీరంతో పాటుగా కష్టపడి పనీ చేయడం తెలియాలి. శ్రద్ధ మాత్రమే వుంటే సరిపోదు...భక్తి కూడా కావాలి. కేవలము పట్టాలు తెచ్చుకొని జీవించడం కాదు, సాధికారతతోటి బ్రతకటమే నిజమైన జీవితము. చివరిగా విద్యార్థి శీలవంతుడయితేనే దేశానికి క్షేమము. జనాలకు సంక్షేమము. లేదంటే కేవలము పుస్తకపఠన విద్యాధికులు అధికంగా వుంటే అది క్షామమే.

చదువులెన్నో చదివి చాలా వివేకియై
మదిని తన్నెరగడు మంద మతుడు
ఎంత చదువు చదివి ఏ రీతిగున్నను
హీనుడవగుణంబు తను మాన లేడు

పిల్లలూ! ఇప్పుడు అర్థం అయిందా...కేవలం మంచి వాడుగా వుంటే చాలదు, చదువు కూడా వుండాలి. సంస్కారం లేని చదువు శోభించదు. చదువులేని సంస్కారం రాణించదు. రెండూ ఉంటేనే అద్భుతాలు జరుగుతాయి అని నా విశ్వాసం.

## ప్రేరణ మంత్రం:

*The function of education is to teach one to think intensively and to think critically. Intelligence plus character - that is the goal of true education.*

## స్ఫూర్తి:

పిల్లలూ! ఇప్పుడు నేను చెప్పే విషయం భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారు తమ ప్రసంగములో ఒక సారి చెప్పగా నేను విన్నది. జాగ్రత్తగా చదవండి.

చాలా కాలం క్రితం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లోని ఒక గ్రామంలో ఒక కుటుంబము నివసించేది. తల్లిదండ్రులు ఇద్దరు కుమారులు వుండే వారు. పిల్లలద్దిరిని బాగా చూసుకునే వారు. ఇద్దరు కూడా ఉన్నత చదువుల నిమిత్తమై పెద్దయిన తరువాత లక్నో పట్టణానికి వెళ్లి అక్కడ హాస్టల్ లో వుండి ఉన్నత పాఠశాలలో చదువుకునే వాళ్ళు.



ఒకసారి, తల్లిదండ్రులు ఇద్దరు వేరే ఊరికి వెళ్తూ, రైలు మార్గ మధ్యములో లక్నోలో ఆగుతుందని తెలుసుకుని, కుమారులు ఇద్దరికి తెలియచేశారు. తాము ఇద్దరిని చూడదలిచినామని చెప్పినారు. స్టేషన్‌కు వచ్చి కలవమని చెప్పినారు. ఇద్దరు కుమారులు స్టేషన్‌కు వచ్చినారు. తల్లిదండ్రులను చూచిన తక్షణం చిన్న కుమారుడు పరుగెత్తి వాళ్ళ కాళ్ళకు దండం పెట్టి క్షేమ సమాచారాలు తెలుసుకున్నాడు. పెద్ద అబ్బాయి మాత్రం గాలిలో చేయి ఊపి వారిని పలకరించాడు. వెళ్తున్నపుడు చిన్నవాడు తల్లిదండ్రులను ఆలింగనం చేసుకుని వాళ్ల ఆశీర్వాదాలు తీసుకున్నాడు. పెద్దవాడు టాటా బై బై చెప్పాడు.

ఆ తండ్రి గారికి పెద్దవాడి ప్రవర్తన ఆందోళన కలిగించింది. భార్యతో అన్నాడు, 'చిన్నవాడి మంచి ప్రవర్తన ఎంత సంతోషం కలిగించిందో, పెద్దవాడి ప్రవర్తన అంత భాధ కలిగించింది. పెద్ద అయిన తరువాత వాడి సంస్కారం లేని చదువు ఎక్కడికి తీసుకుని వెళ్తుందో' అని.

అప్పుడు తల్లి అయ్యో, అక్కడ స్టేషన్‌లో అంత మంది ముందు సిగ్గు పడి వుండొచ్చును కదా పిల్లాడు. పోనీ లెండి నేర్చుకుంటాడు. ఇప్పుడేమిటి, మీకు పోయిందేమి

లేదు కదా. అనవసరంగా ఆందోళన చెందుతున్నారు అని సాంత్వన చేకూర్చి, అనునయించింది.

వాస్తవానికి ఆ తండ్రి సూక్ష్మ దృష్టి నిజమే అయింది. చదువుతో పాటుగా సంస్కారం కూడా అలవరచుకున్న చిన్న కుమారుడు న్యాయమూర్తిగా ఉన్నత న్యాయ స్థానంలో ఉత్తమ అసనంలో కూర్చుని అందరితో నమస్కారాలు పెట్టించుకుంటు వుంటే... పెద్దవాడు సంస్కారం లేని చదువుతో ఏమి సాధించ లేక...తమ్ముడు అధికారిగా వున్న అదే న్యాయస్థానంలో బిళ్ళ బంట్రోతుగా స్థిరపడినాడు. వచ్చే వారికి పోయే వారికి వంగి వంగి దండాలు పెడుతూ వుండటమే తన ఉద్యోగం అయింది.

పిల్లలూ ఆ చిన్నవాడే, ప్రఖ్యాత న్యాయమూర్తి ప్రేమచంద్ర. చాలా గొప్ప వాడుగా కీర్తించబడినారు. చదువుతో పాటుగా సంస్కారం వుండటం వలన ఎంతో ఆదర్శమైన జీవితము అందరికి అవిష్కరింప బడుతుంది.



# 40. చదివే చదువుకు చేసే పనులకు భేదం వుంది



## సమస్య:

*ఈ రోజుల్లో చదివే చదువుకు చేసే పనులకు ఏమైనా సంబంధం వుందా? నాకయితే చుట్టూ ఉద్యోగాలు చేస్తున్న వాళ్ళను చూస్తుంటే ఇది బాగా ప్రస్ఫుటముగా కనిపిస్తోంది. ఏ చదువులు చదివినా రేపు చేసే ఉద్యోగానికి పనికి రావు అనిపిస్తోంది. అందుకే చదవాలి అనిపించడం లేదు.*

## వివరణ:

నిజానికి చదువు సంస్కారంతో ముడి పెట్టబడాలి కానీ దురదృష్టవశాత్తు ఉద్యోగంతో ముడి పెట్టబడుతున్నది. ఎన్నో సమావేశాల్లో ఇలాంటి ప్రశ్నలు వింటున్నప్పుడు, మన చదువులు చట్టుబండలు కావడానికి కారణం స్పష్టంగా కనిపిస్తూ వుంటుంది. అసలు చదువు అన్నది జీవిత పరమావధి నిమిత్తమే కానీ జీవనోపాధి నిమిత్తము కాదని పెద్దలు ఎందరో అనాది కాలం నుండి చెప్తూనే వున్నారు. కానీ తరాలు మారుతున్నాయి... అంతరాలు చెరిగి పోతున్నాయి...కానీ తల రాతలు మారడం లేదు. ఎందుకంటే ఈ కాలం పిల్లలు కూడా చదువుకు ఉద్యోగాన్ని ముడి పెట్టడమే. చదువు అన్నది జ్ఞానార్జనకు, జీవితముకోసమే.

పిల్లలూ, చదువు కునేది ఫలానా ఉద్యోగం చేయడానికి మాత్రమే అని ఎందుకు అనుకుంటున్నారు? అది నిజం కాదు. భారత దేశంలో కేవలం కొన్ని ప్రత్యేక వృత్తులకు తప్ప మిగతా ఏ పనులకూ నిర్దేశించిన చదువులు లేవు. డిగ్రీ లేక దానికి సమానమైన ఏ చదువైనా రేపు మనము నిర్దేశించుకునే పనులకు, ఉద్యోగాలకు, వృత్తులకు,

వ్యాపారాలకు, వ్యవహారాలకు కేవలం ఒక ఆధారంగా పని చేస్తుంది తప్ప ఆ చదువే దేనికీ ప్రామాణికం కాదు అని గుర్తించండి.

ఉదాహరణకు, మనము చిన్న తనంలో పుట్టిన వెంటనే లేచి పరిగెత్తామా? లేదు కదా? పుట్టిన దగ్గర నుండి లేచి పరిగెత్తడానికి మధ్యలో సుమారు 3 సంవత్సరాల కాలం కావాల్సి ఉంటుంది. అందులో కూడా, మొదట కాళ్ళు అల్లాడించాలి, వెల్లకిలా పడాలి, దేకాలి, పాకాలి, సాయంతో లేచి నిలబడాలి, స్వంతంగా అడుగులు వెయ్యాలి, అప్పుడే కదా పరిగెత్తగలము. అట్లా అని పుట్టిన దగ్గర నుండి పరిగెత్తే దాకా మధ్యలో మనము చేసిన విన్యాసాలు జీవితంలో పనికి రానివి అనగలమా... పరిగెత్తాలి అంటే ఆ 3 ఏళ్ల సమయంలో చేసిన ప్రతి విన్యాసం ప్రధానమైనదే అని మనం గుర్తించాలి. అలాగే, జీవితములో మనము ఏది సాధించాలి అన్నా కనీస విద్యాభ్యాసం తప్పనిసరిగా ఉండాలి. రేపు నేను చేసే ఉద్యోగానికి ఈ చదువు అవసరం లేదని అనుకోవద్దు.

ABCD లు రాని వాడికి English పాఠాలు భోధించగలమా... చెప్పండి.

ఇక్కడ పిల్లల ప్రశ్నలను తీసి వెయ్యడానికి కూడా లేదు. కారణం కొంత వరకు లోప భూయిష్టమైన విద్యా విధానంలో కూడా ఉన్నది అని చెప్పాలి. పూర్వం గురుకులాలలో పిల్లలను పరిపూర్ణ మానవుడిలాగా తీర్చి దిద్దే వాళ్లు. కానీ ఈరోజు స్కూల్స్ కేవలం చదవడం వ్రాయడం నేర్పడానికే పరిమితం అవుతున్నాయి. పిల్లలకు జీవిత నైపుణ్యాలు, కౌశలములు, నైతికత, సామాజికత, దేశభక్తి, దైవ భక్తి, జీవిత పరమావధి మొదలగు అంశాలను స్పృశించే వారు లేక పోవడం వలన వారు అసలు విద్యావిధానాన్నే ప్రశ్నించే స్థాయికి చేరుకున్నారు.

పిల్లలు అడిగే ప్రశ్నలు కూడా సరి అయినవే. నేను చాలా సందర్భాలలో ఉద్యోగాలు చేస్తున్న యువతను చూస్తున్నాను. నిజమే! వాళ్ళు చదువుకున్న దానికి చేసే ఉద్యోగానికి సంబంధం ఉండదు చాలా మంది విషయంలో...అరె ఏంటిది అలా ఎందుకు చేస్తున్నారు...చక్కగా మీరెంచుకున్న రంగములోనే స్థిరపడొచ్చు కదా అని అడిగితే క్రింద పేర్కొన్న జవాబులు వస్తాయి.

1. అప్పుడు సీటు దొరక్క నేను ఇంకో రంగంలో డిగ్రీ చేశాను...ఇప్పుడు నాకు నచ్చిన రంగంలో స్థిర పడుతున్నాను.
2. నేను ఎంచుకున్న రంగంలో ఉద్యోగాలు లేవు, అందు వల్ల దొరికిన ఉద్యోగం చేస్తున్నాను.
3. నాకు ఇల్లు వదిలి బయట ఊళ్ళకు వెళ్లే అవకాశాలు లేవు, కాబట్టి ఇంటికి దగ్గరలో ఉన్న ఉద్యోగం చేస్తున్నాను.
4. చిన్నప్పటి నుండి నాకు ఉద్యోగం కంటే వ్యాపారం మీదనే ఇష్టం వుండే... కానీ ఇంట్లో వాళ్ళ పోరు పడలేక చదివాను. ఇప్పుడిక నాకు ఇష్టమైన వ్యాపారం చేస్తున్నాను.
5. పెళ్ళైన తరవాత నన్ను కట్టుకున్న వాడి ఇష్ట ప్రకారం స్థిర పడ్డాను.
6. నేను డిగ్రీ చేసినా నా లక్ష్యం ఇంకా పై చదువులు చదవాలని. కనుక ప్రయత్నం చేస్తున్నాను.
7. నేను ఎంచుకున్న రంగం నా ఒంటికి సరిపడలేదు...అందుకే వేరే ఉద్యోగంలో నెట్టుకొస్తున్నాను.
8. నేను ఎంచుకున్న రంగములో పని చేస్తుంటే...మిగితావారు నన్ను చిన్న చూపు చూస్తున్నారు...చివరికి పెళ్ళి సంబంధాలు కూడా రావటం లేదు.

ఇలా ఎన్నో కారణాలు చెప్తున్న వాళ్ళను చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. మరి ఇలాంటి వాళ్ళను నిత్యము చూస్తున్న పిల్లలమీద వీళ్ళు ఎంత దారుణమైన ప్రభావం

చూపుతున్నారో అర్థం కావాలంటే వీళ్ళ ప్రశ్నలు చూస్తే చాలు.

అయినా సరే...ఇక్కడ పిల్లలు అర్థం చేసుకోవాల్సింది ఏంటంటే, చదువన్నది రేపేదో ఉద్యోగం చేయడానికి మాత్రమే కాదు. మనము భాష నేర్వడానికి... వ్రాయడానికి... చదవడానికి... ఇతరులతో మాట్లాడటానికి... సమాచారం తెలుసుకోవడానికి... ఇతర రాష్ట్రాలకి వెళ్ళినప్పుడు బ్రతక నేర్వడానికి... అంతర్జాతీయ పర్యటనలలో బాసటగా చేసుకోవడానికి... ఇలా ఎన్నో అంశాలున్నాయి. ఉద్యోగము... పని... వ్యాపారం అన్నవి చదువు యొక్క ఎన్నో ఉపయోగములలో కొన్ని ఉపయోగములు మాత్రమే.

కనీసం 10 వ తరగతి వరకు అందరూ అన్ని విషయాలు తెలిసుకుని...ఆ తరవాత నుండి అసలు జీవితములో ఏమయితే అవ్వాలి అనుకుంటున్నామో ఆ రంగం మీద మాత్రమే మనము దృష్టిపెట్టాలి. 16 వ సంవత్సరం నుండి 21 దాకా అంటే సుమారు 6 ఏళ్ళు మనము ఒకే విషయము మీద దృష్టి నిలిపితే ఇక మనకు సాటి ఎవరు చెప్పండి. నేను ఎప్పుడూ చెప్తుంటాను... పని చేస్తున్నప్పుడు చిన్న పని...పెద్ద పని అని మనము చూడద్దు...కేవలం మంచి పనా లేక చెడ్డ పనా అని చూడాలి. కానీ ప్రస్తుతం మన ఆలోచనా విధానం ఇందుకు విరుద్ధంగా వుంది.

అసలు, ఈ పరిస్థితికి కారణం ఒక్కరో ఇద్దరో కాదు...అందరూ కారణమే. లోప భూయిష్టమైన విద్యా విధానము, ప్రభుత్వ ప్రాధాన్యత, రాజకీయ ఏకాభిప్రాయం, తల్లిదండ్రుల ఆలోచనా దృక్పథం, ఉపాధ్యాయుల దార్శనికత లోపము... వీటివలన సరస్వతీ నిలయాలుగా భాసిల్లాల్సిన పాఠశాలలు నేడు కేవలం లక్ష్మీ నిలయాలుగా మారి పోయి...పిల్లలను నిర్బలులుగా చేసే పరిశ్రమలుగా మారాయి.

అయినా...పిల్లలూ, మీరు ప్రస్తుతము మీ ముందున్న పరిసత్థులను చక్కగా పరిశీలించిన తరువాతనే ఇలాంటి ప్రశ్నలు వేశారు కాబట్టి...జాగ్రత్తగా చదువుకు, చేయబోయే ఉద్యోగ వ్యాపారములకు ఏ విధంగా సంబంధం పెట్టుకోగలరో ఆలోచించండి.

# 41. ఒక సబ్జెక్టులో వెనకపడ్డాను




## సమస్య:

*సార్! నాకు ప్రతి పాఠ్యాంశములో కూడా ప్రతిభ చూపించే నైజం వుంది... కానీ ఒక్క సబ్జెక్టులో మాత్రం ఎంతో ఇబ్బంది పడుతున్నాను.*

*పరీక్షలలో కేవలం ఒక సబ్జెక్టులో బలహీనముగా వుండటం వలన మొత్తము మార్కుల యొక్క విలువ మీద దెబ్బ పడుతోంది.*

*ఒక్క సబ్జెక్టులో బాగా చదవలేక పోవడం వలన పొందే ఒత్తిడి వలన మిగితా విషయాలలో సైతం దాని ప్రభావం పడుతోంది.*

*అన్ని సబ్జెక్టులలో బాగా చదివే నేను, ఒక్క సబ్జెక్టులో సందేహాలు టీచర్‌ను అడిగితే అందరూ నవ్వుతారని ఇంకో భయం.*

## వివరణ:

అన్ని విషయాలు అందరికీ తెలియాలన్న నియమము ఏమీ లేదు. ప్రతి పాఠ్యాంశములో మనము ప్రతిభ చూపించాలి అన్నది ఆదర్శము అవుతుంది కానీ అది కొందరికి మాత్రమే సాధ్యం అవుతుంది. అంత మాత్రం చేత పిల్లలు ఎవరూ చింత పడనక్కర లేదు. ప్రపంచములో ప్రతి సమస్యకు ఒక పరిష్కారం తప్పక ఉంటుంది. అలాగే ఈ విషయంలో కూడా.

ఒక పాఠ్యాంశములో మీరు వెనక బడ్డారు అనుకుంటే

2 కారణాలు. ఒకటి మీకు ఇష్టం లేదు లేక బోధన సరిగ్గాలేదు అని అంతే కదా? ఇష్టం లేదంటే చింతించే అవసరం లేదు...వంద మార్కులు తెచ్చుకోలేక పోయినా తొందరేముంది. జీవితంలో రేపు ఉన్నత చదువుల్లో మీకిష్టమయిన అంశాన్ని ఎంచుకుంటారు. ఇప్పుడెందుకు ఆందోళన.

ఒక వేళ, బోధన సరిగ్గా లేదా...ఉపధ్యాయుడికి చెప్పండి...యాజమాన్యానికి చెప్పండి. ప్రత్యేక శిక్షణ తీసుకోండి.

పిల్లలూ! మీరు ఈ విషయంలోనే కాదు...ఏ విషయంలో కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు అని మొదట గుర్తించాలి. ఇంటర్ వరకు అన్ని సబ్జెక్టులలో మీకు ప్రవేశం వుండాలని నిపుణులు సుమారు 6 పాఠ్యాంశాములు ప్రవేశ పెడతారు. మునుముందు మనము ఎంచుకో బోయే ఏ రంగములో నైనా ప్రత్యేక ప్రతిభ చూపించేందుకు అవి దోహదం చేస్తాయన్న దార్శనికత అంతే తప్ప, ప్రతి పాఠాన్ని ఈ రోజు మీరు ఔపోసన పట్టే అవసరం లేదు.

ఒక్క సబ్జెక్టులో కాస్త బలహీనంగా ఉన్నందు వలన మన జీవితానికి వచ్చిన చేటు ఏమి లేదు అని గ్రహించండి. అసలు ప్రతి విషయానికి భయాందోళనలు చెందడం మానేసి ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవడం నేర్చుకోవాలి.

పూర్వం ఒకసారి, గంగానది ప్రవాహం దాటడానికి బోటులో ప్రయాణం చేస్తుంటే ఆ బోటు నడిపే వ్యక్తి రామకృష్ణ పరమహంస శిష్యుణ్ణి గమనించి, అదే పనిగా వారి గురువుగారిని దూషణ చేయడం మొదలు పెట్టాడు. అప్పుడా శిష్యుడు, దాని వలన ఎంతో బాధను అనుభవించి కూడా, అన్నీ విడచిపెట్టి అందరిని క్షమించే నా లాంటి సాధకుడు ఇలాంటివి పట్టించుకోరాదని అనుకుని చాలా మౌనంగా బోటులో కూర్చుని నదిని దాటాడు. అతనిని చూచి బోటు వాడు విజయ గర్వంతో నవ్వుకున్నాడు.

ఆశ్రమానికి వచ్చిన తరువాత, విషయం అంతా రామకృష్ణుల వారికి తెలిసి శిష్యుణ్ణి పిలిచి ఎంతో కోపంగా మందలించారు. గురువును దూషిస్తుంటే దద్దమ్మలాగా కూర్చుని వచ్చావు...సిగ్గు లేదా ఇదేనా నీవు గురువుకు ఇచ్చే గౌరవం!...అసలు అలాంటి వాళ్లకు బుద్ధి చెప్పకుండా రావడం నీ వెర్రితనము అని చెప్పారు.



ఈ విషయము అంతా గమనించిన స్వామి వివేకానంద మరుసటి రోజు అదే బోటులో ప్రయాణము చేశాడు. మళ్ళీ బోటు వాడు దూషించడం మొదలు పెట్టాడు. ఇక అంతే వాడిని నాలుగు పీకి వాడి నోరు మూయించి ఆశ్రమానికి వచ్చాడు. గురువు గారికి విషయం తెలిసి ఆయనను పిలిచి ఈసారి కూడా బాగా

మందలించారు... ఏమయ్యా అన్నీ వదిలేసి వచ్చి సన్యాసం తీసుకున్నావ్ కదా... ఇదే నా నీ ప్రవర్తన... సిగ్గుగా లేదా, వాడేవడో తెలియక వాగితే నువ్విలా ప్రవర్తించడం తప్పు కదా...ఛీ, మీరు ఏ విధంగా పనికి వస్తారు ఇలా చేస్తే...

అప్పుడు, వివేకానంద అడిగారు... అయ్యా! నిన్న వాడిని ఏమి అనకుండా వచ్చినందుకు మందలించారు... ఈ రోజు నేను వాడికి బుద్ధి చెప్పి వచ్చినందుకు మందలిస్తున్నారు. నాకు ఏమీ బోధ పడటం లేదు.

అప్పుడు, రామకృష్ణుల వారు... నాయనా! వాడు ధైర్యమనే సబ్జెక్టు లో వెనక బడ్డాడు కాబట్టి వాడి టైరులో గాలి కొట్టాల్సి వచ్చింది. నీకు అది బాగా ఎక్కువై నీ టైరు పగిలి పోయే ప్రమాదం ఉండటంతో కొద్దిగా గాలి తీయాల్సి వచ్చిందని చెప్పారు.

పిల్లలూ ఇక్కడ మనము గమనించాల్సింది ఏమిటంటారు...ఎక్కడ బలహీనంగా వున్నామో అందులో బలంగా తయారవ్వాలి.

ఇప్పుడిక కొన్ని సూచనలు గమనిద్దాము.

## సూచనలు:

1. *వెనక బడిన సబ్జెక్టు క్లాస్‌లో ముందు వరుసలో కూర్చోండి.*
2. *బోధించే విషయాలను ఆసక్తిగా వినడం, వ్రాసుకోవడం చేయండి. ఇష్టముగా చేయండి*
3. *వీలయితే, ప్రత్యేక తర్ఫీదు తీసుకోండి.*
4. *అన్ని అంశాలకు ఒక గంట కేటాయిస్తే వెనక బడిన వాటికి 2 గంటలు కేటాయించండి.*
5. *బలహీనంగా వున్న విషయాన్ని ఆ అంశములో బాగా ప్రావీణ్యం వున్న స్నేహితులతో చర్చించండి.*
6. *ప్రయోగాత్మకముగా నేర్చుకునే ప్రయత్నం చేయండి అప్పుడు ఇక మరచిపోవడం జరగదు.*
7. *పరీక్షల ముందు మరింత శ్రద్ధ ఆ సబ్జెక్టు మీద చూపి మంచి మార్కులు సంపాదించే ప్రయత్నం చేయండి.*
8. *ఏదైనా విషయం అర్థం కాకుంటే, ఎలాంటి భయమూ సిగ్గూ లేకుండా నిజాయతీగా టీచర్ ను అడిగి తెలుసుకోండి. వాళ్ళు తప్పక మిమ్మల్ని అభినందించి సందేహ నివృత్తి చేస్తారు.*

## ప్రేరణ మంత్రము:

*Learning is not attained by chance, it must be sought for with ardor and diligence.*

# 42. ఆంగ్ల మాధ్యమం




## సమస్య:

*సార్! నేను తెలుగు మాధ్యమములో చదువుకున్నాను... ఇంగ్లీష్ సబ్జెక్టు నాకు బాగా కష్టముగా ఉంటున్నది. మిగతావి ఎదో ఒక లాగా నెట్టుకొస్తున్నాను. కానీ ఆంగ్లభాష ఇబ్బంది అవుతోంది.*

*నేను 10 వ తరగతి దాకా తెలుగు మీడియంలో చదివి ఆ తర్వాత ఇంగ్లీషు మీడియంలో చేరాను. క్లాస్‌లో పాఠాలు చెప్తుంటే అసలు అర్థం కావటం లేదు. ఏమి చెయ్యాలో తోచడం లేదు.*

*నాకు ఆంగ్లము మాట్లాడటం, వ్రాయడం, చదవడం, చివరికి వినడం కూడా కష్టముగా ఉంది. ఏదైనా సలహా ఇవ్వండి.*

## వివరణ:

గ్రామీణ నేపథ్యంలో, చిన్న పట్టణాలలో, ప్రభుత్వ పాఠశాలలో చదవడం వలన చాలా మంది పిల్లలు ఎదుర్కొంటున్న సమస్య ఇది. ఇంకా చెప్పాలంటే చాలా పెద్ద పట్టణాలలో చిన్న చితకా కాన్వెంట్లలో చదివే వారికి కూడా ఈ సమస్య ఉంటుంది. అంత మాత్రం చేత కొంపలేమి మునిగిపోవు అని పిల్లలు తెలుసు కోవాలి.

ఏదైనా భాష ఎలా వస్తుంది అని, ఒకసారి ఆలోచిద్దాము ఇప్పుడు; అమ్మ కడుపులో ఉన్నప్పుడే మనము మాటలు వింటాము. పుట్టినది మొదలు అసలు మనకు భాషే రాని... కాదు కాదు మాటలే రాని వయసు నుండి మన చుట్టూ వున్న వారంతా మాతృభాషలో మాట్లాడుతుంటారు. అలా మనతో పాటు భాష పెరిగి

పెద్దదై మన భావనలకు వాహకముగా లేక రూపముగా నిలుస్తుంది. ఇక బడికి వెళ్లే 5 సంవత్సరాల వయసుకు ముందే మనము చాలా మాటలు నేర్చుకుని వుంటాము. బడికి వెళ్లి ఫార్మల్‌గా నేర్చుకుంటాము అక్షరాలు అన్ని...పాఠాలు ఆ తరవాత నేరుస్తాము. కావున మాతృభాష తప్పక సులభంగా అనిపిస్తుంది. అందులోనూ మాతృభాషలోనే బోధన వుంటే ఇక అంతా happy గానే ఉంటుంది.

ఎటొచ్చి, ఇంగ్లీష్ సబ్జెక్ట్, ఆంగ్ల మాధ్యమములో చదవడం మాత్రమే మనకు సమస్యగా వుంటుంది. నిజమే...సహజంగానే, ఇది మనమందరం ఎదుర్కొనే కష్టం. పిల్లలూ! మీ సమస్య నాకు అర్థం అయింది... కారణం నేను కూడా 1వ వ తరగతి నుండి 10 వ తరగతి దాకా తెలుగు మీడియం లోనే చదివాను అదీ గాక ప్రభుత్వ పాఠశాలలోనే చదివాను. ఇక అందరి లాగానే తెలుగు లో బహుదిట్ట ఆంగ్లములో తాటి మట్ట.

10 వ తరగతి తరువాత ఇంటర్‌లో తల్లిదండ్రులు ఆలోచించిన మీదట నన్ను ప్రభుత్వ కళాశాలలో ఇంగ్లీష్ మీడియంలో చేర్చారు. ఇక దానితో బాగా కష్టం అయింది. ముందయితే ఒక్క ఇంగ్లీష్‌లో తప్ప మిగతా సబ్జెక్ట్స్‌లో ఏదో యావరేజ్‌గా పాస్ అయ్యేవాడిని (10 వ తరగతిలో నాకు 52/100 మార్కులు వచ్చాయి) ఎప్పుడూ మార్కుల గురించి చింత పడలేదు. నాకు ఊహ తెలిసిన దగ్గర నుండి...చదువును బరువుగా తీసుకోలేదు... అలాగని దాని మీద జీవితాన్ని ఫణంగా పెట్టనూ లేదు ఏదో అలా గడిచి పోయింది. కానీ ఇంటర్ నుండి నాకు ఆంగ్ల మాధ్యమం వలన చాలా సవాళ్ళు ఎదురయ్యాయి.

1. నా చుట్టూ ఉన్న వాళ్ళు పాఠాలు బాగా అర్థం చేసుకునే వాళ్ళు.
2. పరీక్షలలో ఒక్క తెలుగులో తప్ప అన్నింటిలో తక్కువ మార్కులు వచ్చేవి.
3. చాలా సార్లు పక్క వాళ్ళు నా ఇంగ్లీష్ భాషా పరిజ్ఞానం చూసి నవ్వే వాళ్ళు. (ఈ రోజుకి కూడా చాలా సార్లు నేను చదివించే పిల్లలు నా భాషను సరి దిద్దుతుంటారు అంటే మీరు నమ్ముతారా?)
4. ఉన్నత విద్యాభ్యాసం కోసమై నేను చిన్న పట్టణము తాడిపత్రి విడచి, జిల్లా కేంద్రమైన అనంతపురం, తమిళనాడు రాజధాని చెన్నై మరియు కర్ణాటక రాజధాని అయిన బెంగళూరుకు వెళ్ళినప్పుడు తెలుగు ఒక్కటే రావడం వలన ఎన్ని ఇబ్బందులు ఉంటాయో తెలిసింది.
5. ఉన్నత విద్యాలయాలలో చదువుకునే సమయంలో నన్ను చూసి నవ్వే వాళ్ళు... నా ఆంగ్ల భాష పరిజ్ఞానం చూసి జోకులు వేసే వాళ్ళు.
6. Law మరియు CS కోర్సు చేస్తున్నప్పుడు మొత్తము బోధన అంతా ఆంగ్లములో వుండటం వలన చాలా కష్టముగా వుండేది.
7. బయట వాళ్ళతో మాట్లాడటం అన్నది పూర్తిగా స్తంభించి పోయింది. మాటలే రాని మూగవాడిగా మారిపోయాను.
8. కనీసం బస్సుల మీద ఉన్న బోర్డులు కూడా చదవ లేక పోయాను.
9. హైదరాబాద్ (1996) కు వచ్చినప్పుడు ఇక మొత్తం అందరూ నా ఇంగ్లీష్ విని పడి పడి నవ్వే వారు.

ఇలాంటి పరిస్థితుల (1986 నుండి 1996) లో కూడా నేను ఎక్కడా ధైర్యం కోల్పోయింది లేదు. ఎన్నో విధాలుగా నేను భాష మీద పట్టు సాధించే ప్రయత్నాలు చేసేవాడిని. ఈ రోజుకి (2022) కూడా ఇంకా ప్రతి రోజు నేర్చుకుంటూనే వున్నాను. ఇది నిజం. ఒక్కటి మనం అందరూ గుర్తుంచుకోవాలి...మాతృభాష ఏదైనా సరే పరవాలేదు, అందులో భావప్రకటన శ్రేష్ఠముగా వుంటే ఇక మరే భాషలోనైనా మనము చక్కగా మాట్లాడవచ్చు.

బెంగుళూరులో నేను Law మరియు CS చేస్తున్నప్పుడు,

తెలుగులో నా భావ ప్రకటన సామర్థ్యం చూసి ముచ్చటేసి కర్ణాటకలోని శ్రీ సత్యసాయి ట్రస్ట్ వాళ్ళు నన్ను ఒక ఇంగ్లీష్ కోర్సులో చేర్పించి ప్రత్యేక తర్ఫీదు ఇప్పించారు. తెలుగులో అనర్గళంగా మాట్లాడే నేను ఇక ఇతర ఏ భాషలో నైనా మాట్లాడగలిగే సత్తా ఉన్నదని గ్రహించిన పెద్ద వాళ్ళు నన్ను ఆంగ్లములో పట్టు సాధించమని ప్రోత్సహించారు. సుమారు 3 నెలల పాటు నేను Spoken English Classes కు వెళ్ళాను.

ఇప్పుడు నేను, తెలుగు, ఇంగ్లీష్, కన్నడ, హిందీ మరియు సంస్కృత భాషలలో ప్రావీణ్యత సంపాదించే ప్రయత్నం చేస్తున్నాను. ఎన్నో ఆలోచనలు, అనుభవాలు, కవితలు, సమాచార పత్రికలు, వ్యాసాలు, కథలు, పుస్తకాలు మొ॥ వ్రాసే చాతుర్యము వచ్చింది. ప్రతి సారీ నేను ప్రకటించడానికి ఉపయోగించే భాష ఏదైనా సరే ఎంతో మంది ముగ్ధులై నన్ను మెచ్చుకున్న సందర్భాలు చాలా తరచుగా ఎదురవుతూనే ఉంటాయి.

నేను వివిధ సంస్థలలో గత 3 దశాబ్దముల కాలం పని చేస్తున్నప్పుడు...మిగతా పనులు ఎలా వున్నా, నా భావప్రకటన సామర్థ్యానికి ఎప్పుడు 100 / 100 మార్కులే వచ్చేవి. అంత పట్టు ఆంగ్ల భాష మీద నేను సాధించ గలిగానంటే అతిశయోక్తి కాదు.

పిల్లలూ... ఇదంతా ఎందుకు చెప్తున్నాను అంటే...ఎవరూ కూడా పుట్టుకతో నేర్పరులు కారు. ప్రతిదీ నేర్చుకోవాలి... నేర్పరులయ్యే ప్రయత్నం నేర్పుతో ఓర్పుతో చేయాలి. యోగి వేమన చెప్పాడు ఈ సాధన గురించి మన అందరికి:

అనగననగ రాగ మతిశయిల్లుచు నుండు।
దినగ దినగ వేము తీయగనుండు॥
సాధనమున పనులు సమకూరు ధరలోన।
విశ్వదాభిరామ వినుర వేమ॥

ఈ సాధన మార్గములో మనం తప్పక గుర్తుంచుకొని పాటించాల్సిన సూచనలు క్రింద పేర్కొంటున్నాను. ఇవన్నీ నేను స్వయంగా తెలుసుకుని, ఆచరించి, ఫలితములు అనుభవించి చెప్తున్నవే అని పిల్లలు గుర్తుంచుకోవాలి. నా లాంటి వాడే ఇంతగా బాగుపడితే...ఇక ఈ కాలం పిల్లలు ఇంకెంతగా లబ్ది పొందుతారో ఆలోచించండి.

## సూచనలు:

1. *ఆంగ్లభాషలో పట్టు సాధించాలన్న నిర్ణయం తీసుకోండి.*
2. *తరగతిలో చెప్పేది ఏదైనా సరే శ్రద్ధగా వినడం మొదలు పెట్టండి. కష్టమైన పదాలను వ్రాసి అర్థం తెలుసుకోండి.*
3. *ఒక రఫ్ నోట్‌బుక్‌లో టీచర్లు చెప్పే పాఠాలు మీకు చేతనయినంతగా నోట్ చేసుకోండి.*
4. *ప్రతి రోజు కనీసం ఒక పేజీ అయినా ఇంగ్లీష్ వ్రాయండి.*
5. *ఇతరులు నిరుత్సాహ పరచినా సరే సాధ్యమైనంతగా ఇంగ్లీష్‌లో మాట్లాడండి.*
6. *ఒక చిన్న పుస్తకం మీ పాకెట్‌లో వుంచుకుని, రోజూ మీకు ఎదురుపడే కొత్త పదాలను వ్రాసుకుని అర్థం తెలుసుకుని నేర్చుకోండి.*
7. *ఒక ఆంగ్ల భాష నిఘంటువు పెట్టుకుని అవసరం అయితే ఉపయోగించడము మరవద్దు.*
8. *ఏది వ్రాయలన్నా సరే... అది చదువుకు సంబంధం లేకున్నా సరే ఇంగ్లీషులోనే వ్రాయడం అలవాటు చేసుకోండి.*
9. *ప్రతి రోజు కాసేపు ఇంగ్లీష్ సమాచార పత్రికలు చదవండి.*
10. *వీలయితే ఇంగ్లీష్ వార్తలు వినండి.*
11. *చిన్న చిన్న కవితలు ఆంగ్లములో వ్రాయండి.*
12. *వ్యాసాలు కూడా ఇంగ్లీష్ లోనే వ్రాయండి.*
13. *ఎక్కడికైనా వెళ్ళి వస్తే...మీ అనుభవాలను*

*కూడా ఇంగ్లీష్ లోనే వ్యక్త పరచండి.*

*14. పాఠ్యాంశములు ఏవైనా సరే, వాటితో ఇంగ్లీష్ లోనే స్నేహం చేయండి.*

*15. మీ దినచర్యని కూడా, ఒక డైరిండిని (Diary) పెట్టి ఇంగ్లీష్‌లో వ్రాయండి.*

*16. రోడ్డు మీద ఎప్పుడు వెళ్ళినా...చూసే ప్రతిచోటా... ఇంగ్లీష్ పదాల కోసమే వెతకండి.*

*17. తరగతి లోనే కాదు ఎక్కడ అవకాశం వచ్చినా ఎప్పుడూ ఇంగ్లీష్ లోనే మాట్లాడండి.*

రాదు రాదు అని జీవితాంతము కష్టపడడం కంటే, ఇబ్బందిగా వున్నా, చిన్న వయసులో నేర్చుకోవడం మంచిది

ఆంగ్లంలో 26 అక్షరాలు. తెలుగులో 56 అక్షరాలు... అదే నేర్చుకోగలిగాము అంటే ఇక ఆంగ్ల భాష నేర్చుకోలేమా!

పీవీ నరసింహారావు గారు 16 భాషలలో ప్రావీణ్యత సాధించారు. ఆయన మన లాంటి మనిషే...మన తెలుగు వాడే... ఆయన నేర్చుకోగలిగాడంటే మనము నేర్చుకోవచ్చు కదా!

**గమనిక:**

ఆంగ్లము నేర్చుకోవాలని అనుకునే వాళ్ళు ఎవరైనా ప్రశ్న అడిగినప్పుడు దానికి సమాధానం ఆంగ్లంలోనే ఆలోచించి సమాధానం కూడా ఆంగ్లంలోనే ఇవ్వాలి. సహజంగా, ఆంగ్లం నేర్చుకునే వారు తెలుగులో ఆలోచించి దాన్ని ఇంగ్లీష్‌లోకి తర్జుమా చేసుకొని అప్పుడు ఇంగ్లీష్‌లో సమాధానం ఇచ్చే ప్రయత్నం చేస్తుంటారు. దీనివలన వ్యాకరణ దోషాలు మరియు ఉచ్చారణ సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఆంగ్లంలో ఆలోచించడం ఎలా అనేది మీకు అర్థమైతే మంచిది, లేకపోతే మీ యొక్క ఇంగ్లీష్ టీచర్‌ని అడిగి తెలుసుకునే ప్రయత్నం చేయండి. ఒకవేళ మీ టీచర్‌కు కూడా తెలియకపోతే యూట్యూబ్‌లో చూసి నేర్చుకునే ప్రయత్నం చేయండి.

**ప్రేరణ మంత్రం:**

*Practice makes a man perfect.*

## స్ఫూర్తి:

పిల్లలూ! మీకు మీరే స్ఫూర్తిగా నిలవాలి ఈ విషయంలో. మీరెలా ఆంగ్ల భాషా ప్రావీణ్యత సంపాదించారు అన్నది తెలుసుకోవాలని వుంది నాకు. మీరు మీ అనుభవాలను ఇంగ్లీష్ లో వ్రాసి నాకు మెయిల్ చేయండి చూస్తాను (balachandra70@yahoo.com)



# 43. పోల్చుకోవడం



## సమస్య:

అయ్యా నేను నా వంతుగా బాగానే చదువుకుంటాను గొప్పగా కాకపోయినా మంచి మార్కులు వస్తాయి. నాశక్తి కొలదీ ఏదో ఒకటి చేసే ప్రయత్నం చేస్తుంటాను, ఫలితం వచ్చినప్పుడు సంతృప్తికరంగా ఉన్నా, నా తోటి వాళ్ళు నా కన్నా ఎక్కువగా మంచి ఫలితాలు సాధించినప్పుడు లేదా నా కన్నా ఎక్కువగా ఏ విషయంలో అయినా వాళ్ళు మెరుగ్గా ఉన్నప్పుడు నాకు ఈర్ష్య కలుగుతుంది అది కాస్తా ఇబ్బందిగా తయారవుతుంది. దానితో నాకు సంతోషం ఉండదు.

చిన్నప్పటి నుండి ప్రతి విషయంలోనూ నేను ఏం చేసినా మా అమ్మనాన్నలు పక్కింటి పిల్లల్ని లేదా తెలిసిన వాళ్ల పిల్లల్ని ఎవరినైనా చూపించి అదిగో వాళ్ళని చూసి నేర్చుకో, నీ కన్నా బాగా చేస్తున్నారు, నీ కన్నా బాగా చదువుతున్నారు, నీ కన్నా బాగా ఉంటారు, నీ కన్నా అందంగా ఉంటారు, నీ కన్నా బాగా మాట్లాడతారు అని నన్ను పోల్చడం వలన అదే అలవాటు నాకు కూడా వచ్చిందనిపిస్తుంది. ఇప్పుడు వాళ్లు నన్ను పోల్చక పోయినా నేనే, నన్ను నేను ఎదుటి వాళ్ళతో పోల్చుకొని బాధపడుతూ ఉంటాను. దయచేసి నా ఆలోచనా విధానం సరైనదో కాదో నాకు తెలియజేయండి.

## వివరణ:

పిల్లలూ! నిజానికి ఈ సమస్య చూడటానికి చిన్నగా కనిపించినా చాలా తీవ్రమైనది ఎందుకంటే ఈ సమస్య విద్యార్థి దశతోనే ఆగదు జీవితాంతం మనతో పాటుగా వుండి పోతుంది. దాదాపు 90 శాతం మంది ఇలా వారిని, వాళ్ళు మరొకరితో పోల్చుకుని ఏదో విధంగా బాధపడుతూనే ఉంటారు. పక్క వ్యక్తి తన కన్నా అందంగా ఉన్నాడని, మంచి ఉద్యోగంలో ఉన్నాడని, ఎక్కువగా సంపాదిస్తున్నాడని, మంచి ఇంట్లో ఉన్నాడని, లేదా మంచి జీవిత భాగస్వామి దొరికాడని ఇలా ఏదో ఒక విధంగా వాళ్ళని ఇతరులతో పోల్చుకుని కించ పరుచుకుంటారు.

ప్రతి దానిలో పక్క వాళ్ళతో పోల్చుకోవడం అన్నది మానసిక రుగ్మత అని తెలుసుకోవాలి. అయితే ఇలా పక్కవారితో పోల్చుకునే అవసరం విద్యార్థులకు ఒకరకంగా ఉపయోగమే! అదెలాగంటే... తాను వేగంగా వెళ్ళాలనుకునే విద్యార్థి పక్క విద్యార్థితో సరిపోల్చుకుంటాడు. పక్క విద్యార్థి సామర్థ్యం ఏంటి? లోపాలేంటి? అన్న విషయాలను గమనించి, అలాంటి లోపాలను తాను చేయకుండా, మరింత శక్తివంతంగా ముందుకెళ్తాడు. కాబట్టే... ప్రతి విద్యార్థికి, పక్క విద్యార్థులతో సరిపోల్చుకోవడం అవసరమవుతుంది.

అయితే! చాలాసార్లు ఏమవుతుందంటే... అవసరమైన ప్రమాణాలతో కాకుండా ఒక విద్యార్థిని మరో విద్యార్థి వ్యక్తిత్వంతో సరిపోల్చుతుంటారు. ఇది సరైనది కాదు. నిజానికి ఒక విద్యార్థిలో ఉండేది కేవలం ఒక్క చదువు మాత్రమే కాదు. అతడిలో ఉన్న ఎన్నో నైపుణ్యాలలో చదువు కూడా ఒకటి మాత్రమే.

చదువులో మార్కులు తక్కువగా వస్తే... బాగా మార్కులు వచ్చిన విద్యార్థితో పోల్చుతూ... నువ్వు దేనికీ పనికిరానివాడివంటూ ముద్ర వేస్తుంటారు. ఇలాగ పోల్చడంవల్ల ఆ విద్యార్థి మానసికంగా గాయపడతాడు కాబట్టి అలా చేయకూడదు. చదువును చదువుతోనే పోల్చాలి, చదివే విధానాన్ని పోల్చాలి. అంతేగానీ మొత్తం వ్యక్తిత్వంతో పోల్చడం వల్ల ఆ విద్యార్థుల్లో మానసిక స్థైర్యం దెబ్బతింటుంది.

పరీక్షా ఫలితాలలో వ్యత్యాసాలు కనిపిస్తే... వాటికి సరైన కారణాలను పరిశీలించి, లోపాలు ఉంటే వాటిని సరిదిద్దుకునేలా విద్యార్థులను ప్రోత్సహించాలి. అలా కాకుండా, కేవలం పోల్చి చూపించి వదిలి వేయటం వల్ల ఎలాంటి ఫలితమూ ఉండదు. చదివే విధాన లోపాలను సవరించుకుని, ప్రయత్న లోపం లేకుండా కష్టపడి చదవాలి.

కాబట్టి పిల్లలూ...! మీరు సాటి విద్యార్థులందరి తోనూ సరిపోల్చుకోవడం కూడా సరైన పద్ధతి కాదు. అలాగే ఎప్పుడూ ఒకే విద్యార్థితో పోల్చి చూసుకోవడం వల్ల మీలో సామర్థ్యం మెరుగుపడకపోగా, ఆ విద్యార్థి పట్ల ద్వేషం పెరిగే ప్రమాదం పొంచి ఉంటుంది. కాబట్టి... మీలోని లోపాలను సవరించుకుని నైపుణ్యాన్ని పెంచుకోవడం, సందేహాలను నివృత్తి చేసుకోవడం లాంటి పనులే... మీ ఉన్నతికి దోహదపడతాయి.

పిల్లలూ, మనం రోజూ రోడ్డు మీద చూస్తుంటాం ఎంతోమంది పిల్లలు కనీసం తినడానికి తిండి లేక అడుక్కుంటూ ఉంటారు లేదా ఏదో ఒక దుకాణంలో పని చేస్తూ ఉంటారు వాళ్లకన్నా మీరు మెరుగైన పరిస్థితిలో ఉన్నారు కదా. మన భారతదేశంలో ఇప్పటికీ ఎంతో మంది పిల్లలకి కనీసం ఒక పూట భోజనం దొరకడం కూడా కష్టమే అన్న దానితో పోల్చుకుంటే మనం ఎంతో మంచి జీవితం గడుపుతున్నట్టే కదా? నాకన్నా మంచి పరిస్థితుల్లో ఉన్న వ్యక్తితో పోల్చుకుంటే నా జీవితం బాగోలేదు అని మీరు అనవచ్చు. కానీ నిజానికి సూక్ష్మంగా చూస్తే పోల్చుకోవడానికి హద్దు అదుపు అన్నది లేదు. ఒక లక్షాధికారిని చూసి పోల్చుకుని లక్షాధికారి

అవడానికి పాకులాడి, ఆ తర్వాత ఒక కోటీశ్వరుని చూసి కోటీశ్వరుడు అవడానికి పాకులాడి, ఆ తర్వాత అంబానీ లాంటి దిగ్గజం కనిపిస్తే వారిని చూసి అలా అవ్వాలని... ఇలా జీవితం అంతా ఎవరినో చూసి మనం పరుగులు పెడుతూనే ఉంటే ఇక జీవితాన్ని ఆస్వాదించేది ఎప్పుడు? ఎప్పుడో చనిపోయేముందు, నేను జీవితంలో ఏం చేశాను అని మీరు తలుచుకుంటే ఎవరినో ఒకరిని చూసి వాళ్ళతో పోల్చుకుంటూ జీవితాంతం ఏడుస్తూనే ఉన్నాను అనిపిస్తే అప్పుడు అది మీరు నిజంగా బ్రతికినట్లా చెప్పండి.

కాబట్టి పిల్లలూ! మనం ఏ విషయంలోనూ ఎవరితోనూ పోల్చుకోకూడదు, ఎవరినైనా చూసి స్ఫూర్తి పొందవచ్చు కానీ పోల్చుకుని మన మనసులను కాల్చుకోకూడదు. ఎందుకంటే అది దుఃఖ కారణం. కానీ నేను మిమ్మల్ని అభివృద్ధి చెందకండి అని చెప్పట్లేదు నిన్నటి కన్నా మిమ్మల్ని మీరు ఈరోజు అభివృద్ధి చేసుకోవడం ఎంతైనా అవసరం. నీకు నీవే పోల్చుకోవాలి కానీ ఇంకెవరిని చూసి పోల్చుకుని బాధపడ రాదు అన్నది మీరు గుర్తుంచుకోవాలి.

ఒకవేళ మిమ్మల్ని మీ తల్లిదండ్రులు చీటికిమాటికి వేరే ఎవరితో అయినా పోల్చి తిట్టినట్టుగా లేదా బాధపడుతున్నట్టుగా అయితే, మీరు స్పష్టంగా చెప్పండి వాళ్ళకి, అమ్మ/నాన్న వాళ్ళ జీవితం వేరే, నా జీవితం వేరే! నిన్నటి కన్నా నేను మెరుగ్గా ఉన్నానా లేదా అనేదే నాకు అవసరం తప్పించి వేరే వాడు జీవితంలో ఏం చేస్తున్నాడు అన్నది నాకు అనవసరం ఇది మీకు అర్థం అయితే మంచిది అని స్పష్టంగా చెప్పేయండి.

ఈ భూమ్మీద ప్రతి మనిషి, అంతెందుకు ప్రతి జీవి విభిన్నమైనదే అని మీకు తెలుసా? మన వేలిముద్ర మరి ఎవరికీ ఉండదు...వేలి ముద్ర కాదు... చెట్టుకు వుండే ఆకులు కూడా ఒక దాన్ని పోలి ఒకటి ఉండవు. మరెవరికో ఉన్న జీవితం మనకు ఉండదు. మనమందరం భిన్నమైన వాళ్ళమే. నిజానికి ఇది చాలా గొప్ప విషయం దీనికి మనం ఆనందించాల్సింది పోయి, వేరెవరి లాగానో మన జీవితం లేదని పోల్చుకోవడం సరి అయినది కాదు.

## ప్రేరణ మంత్రం:

*Comparison is the death of joy. Everyone is unique and great in his own way*

## స్ఫూర్తి:

నాకు తెలిసిన ఒక పేరు మోసిన No.1 వ్యాపారి ఉండేవాడు. ప్రతి ఏడాదికి తాను సాధించాల్సిన ఆదాయం ఎంతో ముందే నిర్ణయం చేసేవాడు. ఒక సారి అతని శ్రమకు, అనుకున్న దాని కంటే రెండింతల ఆదాయం ఎక్కువగా వచ్చింది. కానీ ఇంకో వ్యాపారి అతనికంటే ఎక్కువ సంపాదించి ఆ సమయంలో No.1 గా నిలబడ్డాడు. కానీ మొదటి వ్యాపారి తాను అనుకున్న దానికంటే రెండితల ఆదాయం వచ్చిందని అతని శక్తి సామర్థ్యాలు తలుచుకొని ఆనంద పడతాడా? లేక పక్క వ్యాపారి తన కంటే ముందుకెళ్ళాడని బాధ పడతాడా? నేను అతను ఏమి చెప్తాడో చూద్దాం అని ఇదే విషయాన్ని వారిని అడిగాను. అయ్యా! నేను చాలా సంతోషంగా ఉన్నాను. కారణం నేను అనుకున్న దానికంటే ఎక్కువ ఆదాయం సంపాదించినందుకు. అంతే కాదు, నా కంటే మంచిస్థానంలో ఉన్న వ్యక్తిని చూసి ఇంకా ఆనందిస్తున్నాను, రేపు అతనినే మార్గదర్శిగా తీసుకుని ముందుకు వెళ్తాను కదా! అదీ ఉత్సాహం. అలా ఉండాలి.

చూడండి, పిల్లలూ... ఇలా ఎల్లప్పుడూ పక్క వారి గురించి, వాళ్ళను ఎలా అధిగమించాలి, అని నిత్యం పోల్చుకుంటూ ఉంటే మనలో ఆత్మ సంతృప్తి, ఆనందం ఉండదు సరికదా, పైగా కుళ్ళు, కుతంత్రాలు ఏర్పడుతాయి...ఒక వేళ No1 స్థానంలోనే ఉన్నా, ఎక్కడ తోటి వాళ్ళు ముందుకు వెళ్ళిపోతారో అన్న భయం,



అభద్రత భావాలు ఏర్పడతాయి. మనలో వున్న విశేషము, నైపుణ్యం, ఆనందం, ఆత్మ సంతృప్తి మర్చిపోవడము అటుంచి మన ప్రవర్తన ఒత్తిడి, ఆందోళన, అనారోగ్యమునకు దారితీస్తాయి.

ఇలాగే మనం ఇప్పుడు పరీక్షలలో మార్కులతో కూడా బాధ పడుతుంటాం. మొదట మన దృక్పథాన్ని మార్చుకోవాలి. అసలు ఏది నిజమైన సంపద? ఏది నిజమైన విజయం? పెద్ద బ్యాంక్ బాలన్స్, ఉన్నత స్థాయి, పెద్ద డిగ్రీ..వీటిని ఆశించటం, సాధించటం తప్పు కాదు. కానీ వాటిని సాధించే సమయంలో మన నిజమైన సంపదను కోల్పోకూడదు. మనలో వుండే నిజమైన ఖజానా ఏమిటి? సంతోషంగా జీవించటం కదా?

నిత్యమూ ఎవరితోనో ఒకరితో పోల్చుకుంటూ... మన నిజమైన మనలను మరచి జీవితాన్ని అధోగతి పాలు చేసుకోవద్దు. నిన్నటి కన్నా మనము ఎంత బాగు పడ్డమో గమనిస్తూ...జీవితాన్ని పండుగలా గడిపేద్దాం.

# 44. వయసుతోపాటు వచ్చే ఆలోచనలు



## సమస్య:

యుక్తవయసు అన్నది అనుభవించడానికే కదా? ఆడి పాడి సరదాగా స్నేహితులతో తిరగాల్సిన వయస్సు మాది. ఎదుటి వ్యక్తి పట్ల చాలా ఆకర్షణగా ఉంటుంది. వాళ్ళ గురించి తెలుసుకోవాలనే కుతూహలం ఉంటుంది. వాళ్ళ సాన్నిహిత్యం పొందాలని మరియు ప్రేమకు దగ్గరవ్వాలని ఎంతో ఆత్రుతగా ఉంటుంది. ఒక్కోసారి ఒక మనిషి పట్ల ఉన్న ఆకర్షణ వలన మరి ఏ విషయం మీదా శ్రద్ధ పెట్టడానికీ మనసు ఉండదు. ఇవన్నీ వయసుతో వచ్చే ఆలోచనలు అని నాకు కూడా తెలుసు అంతేకాక ఇందులో తప్పేమీ లేదు అన్నది నా అభిప్రాయం. దీనికి మీరేమంటారు తెలియజేయండి.

## వివరణ:

బాలస్తావత్ క్రీడాసక్తః।
తరుణాస్తావత్ తరుణీసక్తః॥
వృద్ధస్తావచ్చింతాసక్తః।
పరే బ్రహ్మణి కోఽపిన సక్తః॥

ఇది శ్రీ ఆది శంకరాచార్యుల వారు కొన్ని వేల సంవత్సరాల క్రితమే చెప్పిన సంస్కృత శ్లోకము. ఇది మన జీవితములలో జరిగే తంతు. అర్థం ఏమిటంటే బాల్యంలో ఆట పాటలు, యువ్వనంలో పరస్పర వ్యామోహాలు, వార్ధక్యంలో చింత ఇలా జీవితమంతా ఎదో ఒక ఆసక్తితో గడిచి పోతుంది. చివరకి దేవుడి మీద ఆసక్తికి సమయమే ఉండదని అర్థం. కానీ, ఈ సూత్రమునకు లోబడకుండా చేసిన ఏ పని అయినా మనిషిని అద్భుతమైన స్థాయికి చేరుస్తుంది అనటంలో ఎట్టి సందేహం లేదు. అయినా మీరు చెప్పింది కూడా నిజమే పిల్లలూ! మీ వయసులో మీకు హార్మోన్ల ప్రభావం చాలానే ఉంటుంది. కానీ మీకు భగవంతుడు హార్మోన్లతో

పాటు బుద్ధిని, మేధస్సును కూడా ఇచ్చాడు, మీ పైన ఉన్నది హార్మోన్ల ప్రభావం అని మీరు తెలుసుకోగలిగినప్పుడు మీకు కలిగే ఆకర్షణ వికర్షణలు కేవలం తాత్కాలికం అని మీరు ఎందుకు తెలుసుకోలేక పోతున్నారు? ఒకవేళ కేవలం ఆకర్షణ వికర్షణకి లోనై మీరు ప్రవర్తిస్తే ఇక మీకు జంతువులకి తేడా ఏముందంటారు?!

పిల్లలూ! నిజంగా మీ వయసు వాళ్ళతో వచ్చిన చిక్కేమిటంటే అన్నీ మాకు తెలుసు అనుకుంటారు కానీ నిజానికి మీకు తెలిసింది గోరంత తెలుసుకోవాల్సింది కొండంత. టీనేజ్‌లో మీకు ఒక వ్యక్తి పట్ల ఆకర్షణ కలగడం సహజమే, కానీ ఆ ఆకర్షణ కేవలం బాహ్యమైనదే. నిజానికి దానికి ఎటువంటి విలువ లేదు, ఆ చిన్న విషయాన్ని మీరు గ్రహించగలిగితే మీకు కలిగే ఆకర్షణలకు చిన్న చిరునవ్వుతో సమాధానం చెప్పి దాన్ని వదిలించుకో గలరు.

మరీ ముఖ్యంగా నేను చెప్పదలచుకున్నది ఏమిటంటే, మీ వయసులో వాళ్ళు ఎవరితోనూ ప్రేమ బంధం ఏర్పరుచుకోకూడదు, ఎందుకంటే మీది చాలా లేత వయసు, ఆనందంగా చదువుకుంటూ, ఆటపాటలతో ఉండాల్సిన వయసు. కాబట్టి అంత చిన్న వయసులో ఎవరినైనా ఇష్టపడి వాళ్ళని అప్పుడే పెళ్ళి చేసుకోవాలని అనుకోవడం లేదా, వాళ్ళతో అప్పుడే జీవితాన్ని పంచుకోవాలనుకోవటం, అది మీకు లేనిపోని చిక్కులు మరియు కొండంత బాధ్యత తెచ్చిపెడుతుంది. అంతేకాక ఒక వ్యక్తి మీ జీవితాన్ని పంచుకోవడానికి సరియా, కాదా అని తెలుసుకునే పరిపక్వత మీకు ఉండదు. అంతేకాక మీకు శారీరక సంబంధాల మీద కూడా ఆసక్తి ఆరాటం ఉంటే, వాటిని మీరు వెంటనే కట్టడి చేయడం మంచిది. ఎందుకంటే చదువుకునే పిల్లలకి అలాంటి ఆలోచనలు ఎంత మాత్రం సరి అయినవి కాదు. ఒకవేళ మీరు అలా కాక కేవలం మీ కోరికలు, మీ దేహమును, మీ మనసును, మీ బుద్ధిని, ఆశ్రమించి వాటికి అనుగుణంగా నడుచుకుంటే ఇక అంతకన్నా నీచమైనది మీ జీవితంలో మరి ఏది ఉండదు. అప్పుడు ఒక మనిషికి పశువుకి తేడా అనేది ఏమీ ఉండదు.

## సూచనలు:

*ప్రేమకథలకు మరియు సినిమాలకు ఎంత వీలైతే అంత దూరంగా ఉండండి, ఒకవేళ వాటిని చూసినా, అవన్నీ కల్పితమే మరియు అవన్నీ సినిమాలకే పరిమితం నిజజీవితంలో అవి ఏవీ సాధ్యం కాదు ఒకవేళ అయినా అది మనకి తప్పక కీడుచేస్తుంది అన్న విషయాన్ని గ్రహించండి.*

*ఇంకొక ముఖ్యమైన సూచన ఏమిటంటే అడల్ట్ కంటెంట్‌కి మీరు దూరంగా ఉండండి, ఇవాళ రేపట్లో స్మార్ట్ ఫోన్ పుణ్యమా అని చెప్పి ఎక్కడ చూసినా అవే కనిపిస్తుంటాయి! కానీ అది ఒక విషవలయం అని తెలుసుకోండి. వాటికి మీరు బానిస అవుతే అది క్రమక్రమంగా మిమ్మల్ని పశువులుగా, మృగాలుగా మారుస్తుంది.*

*అంతేకాదు అలాంటి వాటికి ఆకర్షితులై, వాటిని అనుసరించడం వలన కేవలం మీ జీవితాలే కాదు ఎంతో మంది జీవితాలు నాశనం అవుతాయి. ఎందుకంటే చిన్న పిల్లల్ని మరియు ఆడపిల్లల్ని అపహరించుకుని పోయి, దేశాలు తీరాలు దాటించు కొనిపోయి వాళ్ళని ఇలాంటి వాటికి ఉపయోగిస్తూ ఉంటారు.*

*ఇప్పుడు చెప్పండి వినడానికి హానికరంగా లేనట్లనిపించే నీ సమస్య నిజానికి ఎంత హానికరం అయినది అని...! అందుకే పూర్వకాలంలోను, మొన్నమొన్నటిదాకా కూడా మన పెద్దలు ఆడపిల్లలను సంప్రదాయబద్ధమైన మంచి వాతావరణంలో తమ హద్దులను తెలుసుకుంటూ సిగ్గు బిడియములు కలిగి, ఆత్మస్థైర్యంతో పెరిగేలా శిక్షణనిచ్చేవారు. అవసరం లేకుండా ఆడపిల్లలు మగపిల్లలతో మాట్లాడరాదు.*

# 45. అమ్మాయిలకు చదువు అవసరమా?




## సమస్య:

*అయ్యా! నేను చదువుకోవాలని చాలా ఆశగా వుంటుంది. కానీ ఇంట్లో వాళ్ళు ఆడ పిల్లలకు చదువెందుకు అంటూ నిరుత్సాహ పరుస్తున్నారు. ఇంట్లో డబ్బుకు కొదవ లేదు. పరపతి దండిగా వుంది. ఆధునికతకు అద్దం పట్టే జీవన శైలి కూడా ఉంది. కానీ నా విషయంలో మాత్రం ఎందుకో ఇలా జరుగుతోంది. చాలా చోట్ల మహిళా సాధికారత కేవలం మాటలలోనే జరుగుతోంది అని పిస్తుంది. మీరేమంటారు ? ఆడ పిల్లలకు – అమ్మాయిలకు చదువు అవసరము లేదంటారా?*

## వివరణ:

ఈ సమస్య, మన దేశానికి స్వాతంత్రం వచ్చిన 75 ఏళ్లకు కూడా ఇంకా అక్కడక్కడా కనిపిస్తోందంటే కాస్త ఆశ్చర్యము కలుగుతుంది. ప్రధానంగా ఇలాంటి సమస్యలు అమ్మాయిలు అడుగుతుంటే హృదయం ద్రవించి అయ్యో! చదువు గురించి ఇంతగా తపించే అమ్మాయిలు, సమాజం నుండి సరి అయిన సహాయ సహకరములు అందితే ఎంత అద్భుతమైన వ్యక్తులుగా మారతారో కదా అనిపిస్తుంది.

పిల్లలూ! ప్రపంచము 21వ శతాబ్దములో అడుగిడుతున్న ఈ సమయం లోకూడా ఇంకా చాలా దేశాలలో అమ్మాయిలకు చదువెందుకు అన్న అంశము మీద భేధాభిప్రాయలు వ్యక్తమవుతుండటం శోచనీయము. కానీ మిగితా దేశాలతో పోలిస్తే భారత దేశములో ఆడ పిల్లల చదువు విషయములో పురోగతి ఉన్నదనే చెప్పాలి.

విద్య అనేది ప్రతి మనిషి యొక్క జన్మ హక్కు. విద్య తమను తాము సాధికారత గావించుకునే సువర్ణ సాధనం. చదువు మన ఆలోచనా విధానాన్ని మారుస్తుంది. విద్య తమ తమ అభిరుచులను తెలుసుకోవడానికి, తమ గమ్యాలను ఏర్పరుచు కోవడానికి, తద్వారా తమ జీవితాలను ఉద్ధరించు కోవటానికీ అవకాశం కల్పిస్తుంది.

చదువు అనేది కేవలం పొట్ట కూటికోసం కాదు, జీవన పరమావధిని తెలుసుకోవడము కోసము, అన్నది మనమందరం గుర్తించాలి. పైన చెప్పిన విషయాలన్నీ కూడా మగ పిల్లలకు మాత్రమే కాదండోయ్ !! ఆడ పిల్లలకు కూడా, అన్నది నిర్వివాదాంశము.

నిజానికి నేటి కాలంలో అబ్బాయిల కంటే కూడా అమ్మాయిలే అన్ని రంగాలలో రాణిస్తున్నారని చెప్పాలి. విద్యలో రాంకులను సాధించటంలోను, ఇంటా బయటా బరువు బాధ్యతలు తీసుకోవడంలో కూడా అమ్మాయిలదే అగ్రస్థానమని చెప్పాలి.

సాధారణంగా చాలా ఇళ్ళల్లో బాబు పుడితే పండగ అని పాప పుడితే దండగ అనీ అనుకుంటారు. కానీ, బాబు అయినా పాప అయినా పెంపకం సరిగ్గా వుంటే వాళ్ళు ఏదైనా సాధిస్తారన్న విషయం సత్యం. నిజానికి ఆడపిల్లలకు అమ్మనాన్నల మీద ప్రేమ ఎక్కువగా ఉంటుంది. ఈ విషయాన్ని గుర్తించలేక అమాయకమైన మనస్తత్వాలతో తల్లి తండ్రులు చిన్నారి పాపలను నిర్లక్ష్యం చేస్తుంటారు. నిజానికి ఏమాత్రం చదువుకోక పోయినా, ఇంటి బాధ్యత భుజాల మీద వేసుకున్న అమ్మాయిలు నాకెంతో మంది తెలుసు. అభయ సంస్థ ద్వారా సాయం తీసుకునే వందలాది మంది విద్యార్థుల్లో అమ్మాయిలే ఎక్కువ మంది ఉన్నారు. వాళ్ళ జీవితాలను ఎంత చక్కగా సంస్కరించుకుంటున్నారో తలచుకుంటే ఎంతో గర్వముగా ఉంటుంది. కేవలం చదువు విషయంలోనే కాదు సుమా ! అభయ సంస్థ ద్వారా చేపట్టిన ప్రతి కార్యములో మహిళలే ముందుంటున్నారు. గత దశాబ్ద కాలము నుండి మన అభయ సంస్థ ద్వారా సుమారు 10000 మంది యువతకు ఉపాధి శిక్షణ అందించారు. అందులో సుమారు 75% మంది మహిళలున్నారు అంటే మీరు ఆలోచించండి. బాగు పడాలన్న ఆకాంక్ష ఎవరికి ఎక్కువగా ఉందో!

తల్లి తండ్రులకు నేను శిరసు వంచి, వాళ్ళ పాదాలకు నమస్కరించి వేడుకునేది ఒక్కటే ! ఇంట్లో పిల్లలను ఆడపిల్ల తక్కువ, మగపిల్లవాడు ఎక్కువ అన్న తేడాతో చూడకండి, వివక్ష చూపకండి. వాళ్ళకు ప్రేమతో చదువు సంస్కారం అందించే ప్రయత్నం చెయ్యండి. అమ్మాయిలు రేపు మీ జీవితాలకు ఆశా జ్యోతులవుతారు. ఇది నిజమని నమ్మండి.

జీవితంలో కుమార్తె పెళ్ళిని అంతిమ లక్ష్యంగా పెట్టుకొని కొన్ని ఏళ్ళ తరబడి డబ్బు ప్రోగు చేసి లక్షల కొద్దీ ఖర్చు చేయడానికి ప్రణాళిక చేస్తారు. దానిలో 10% చదువు కోసం పెట్టినా, ఆడ పిల్లలు ఎక్కడికెళ్ళినా, ఎలాంటి సమస్యలొచ్చినా, మొగుడు అసమర్థుడైనా, పిల్లలు రాణించకున్నా, కట్టుకున్న వాడు పోయినా లేక వదిలేసినా, జీవితంలో చదువుకున్న అమ్మాయి / అద్భుతంగా రాణించవచ్చు. కొంతమంది తల్లిదండ్రులు ఆడపిల్లలు వేరే ఇంటికి వెళ్తారు, వాళ్ళ పెళ్ళిళ్ళకు ఖర్చవుతుందనీ, మగపిల్లలైతే వంశం నిలబెడతారని మగపిల్లల మీద చూపించే శ్రద్ధ ఆడపిల్లల మీద చూపించరు. తమ కూతురు కొద్ది కాలం వరకే తమ దగ్గర ఉంటుంది. కొడుకులైతే తాము ఉన్నంత కాలం తమను – తల్లి తండ్రులను చూసుకుంటారు అన్న భ్రమలో పడి పుత్రులకు ప్రాముఖ్యతను ఇచ్చి తమ కుమార్తెలను సరిగ్గా పట్టించుకోని వాళ్ళు కూడా ఉన్నారు. అటు వంటి తల్లిదండ్రులు మత్తులో నుండి మేల్కొని సత్యాన్ని గుర్తించాలి. అమ్మాయిలు చదివితే దేశ భవిష్యత్తు సురక్షితమైనట్లేనన్నది గుర్తిస్తే ఇక దేశాభివృద్ధికి ఎలాంటి అడ్డంకులు ఉండవు.

ప్రతి అమ్మాయి జీవితములో ఒక కూతురుగా, భార్యగా, కోడలుగా, తల్లిగా, అక్కగా, చెల్లిగా ఎన్నో పాత్రలు

పోషించాల్సి వస్తుంది. చదువుకున్న మహిళ ఏ దశలో ఏ పాత్ర పోషించినా అది అద్భుతమైన ఫలితాన్ని ఇస్తుంది. దేశాభివృద్ధిలో అతి కీలకమైన బాధ్యత స్త్రీలకే ఎక్కువగా ఉంటుంది. ఒక కుటుంబ గౌరవం కానీ, దేశము యొక్క గౌరవం కానీ స్త్రీల మీద ఆధారపడి ఉంటుందన్నది సత్యము. ఆడపిల్లలు చదువుకున్న వారయితే వాళ్ళు నేర్చుకున్న విలువలతో, గుణములతో తాము ఎక్కడున్నా సరే అందరిని పెంచి పోషించి తమ పిల్లలను మంచి దేశపౌరులుగా, దేశ సైనికులుగా, భరతమాత పనిముట్లుగా తీర్చిదిద్దగలరు.

స్వామి వివేకానంద ఇలా చెప్పారు – If a man is educated, he alone is educated. But if a woman is educated, the whole family is educated.

మునుపు, చదువు ఖర్చుతో కూడిన విషయమని, ఇంట్లో పిల్లలందరిని చదివించడం భారమని, మగ పిల్లలను మాత్రమే చదివించే వాళ్ళు. ఇప్పుడలా కాదు. చాలా మార్పు వస్తోంది. పిల్లలు, తల్లిదండ్రులు, ప్రభుత్వము, నాయకులు అందరూ మారుతున్నారు. ఆడ పిల్లల కోసమై ఎన్నెన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమ్మాయిలు చదువుకునే విషయంలో ఎన్నో ప్రణాళికలు, పథకాలు, ప్రోత్సాహకాలు అందిస్తూనే వున్నారు. ఇప్పుడు చదివి బాగు పడాలనే ఆశ ఉన్న ఆడ పిల్లలు ఆకాశమే హద్దుగా ఎదగవచ్చు.

నూటడెబ్బై ఏళ్ళ క్రితం ఆడపిల్ల బయటకు రావడమే చాలా కష్టంగా ఉండేది. అలాంటి రోజుల్లో ఒకావిడ ఆడపిల్లల కోసం ప్రత్యేక పాఠశాలను పెట్టింది. మొదట్లో ఎందరో వ్యతిరేకించారు. ఆవిడ మీద బురద జల్లారు. తిట్టిపోశారు. అయినా సరే ఆవిడ జంకలేదు. తన లక్ష్యాన్ని సాధించింది. దేశములోనే మొదటి మహిళా అధ్యపకురాలిగా చరిత్ర సృష్టించింది. మన దేశంలో ఆడపిల్లల చదువు, వాళ్ల అభివృద్ధి గురించి మాట్లాడుకోవాలంటే ఎవరైనా ముందుగా గుర్తు చేసుకోవాల్సింది ఆవిడనే. పశ్చిమ మహారాష్ట్రలోని నయగావ్ అనే గ్రామంలోని ఒక రైతు కుటుంబంలో 1831 జనవరి 3న పుట్టింది. అప్పటి సంప్రదాయం ప్రకారం తొమ్మిదో ఏటనే ఆమెకు పెళ్లయింది. పెళ్లయినప్పటి నుంచే ఆమె సామాజిక కార్యక్రమాల్లో భర్తకు అన్ని విధాలుగా తోడుగా నిలిచారు. మనదేశంలోని మహిళలందరికీ సంపూర్ణ మానవ హక్కులు అందుబాటులోకి రావాలని ఆవిడ భర్త కలలు కనే వారు. అది సాధ్యం కావాలంటే ఆడవాళ్ళందరూ చదువుకోవడం తప్ప మరో మార్గం లేదని వారు నమ్మారు. ఈ పరిస్థితుల్లో తమ భార్యనే మొదట ప్రోత్సహించి చదువు నేర్పించారు. తదనంతర కాలంలో బాలికల కోసం స్కూల్స్ ప్రారంభించాలని ఆ దంపతులు నిర్ణయించుకున్నారు.

1848లో పూణేలోని ఒక ఇంట్లో ఆడపిల్లలు చదువుకోవడానికి ఒక ఆడపిల్లల స్కూల్‌ను ఆ పుణ్య దంపతులు ప్రారంభించారు. తొమ్మిది మంది పిల్లలతో మొదటి బృందం ప్రారంభమైంది. ఆవిడే ఆ స్కూల్ కు ప్రధానోపాధ్యాయురాలుగా ఉన్నారు. కేవలం ఆర్నెల్లపాటు కొనసాగిన స్కూల్ మూతపడింది. కొన్ని నెలల తరువాత మరో భవనములో స్కూల్ మొదలు అయింది. అయితే ఆ దంపతులు మొదలు పెట్టిన ఈ మంచి పనికి అప్పట్లో చాలా మంది నుంచి వ్యతిరేకత వచ్చింది. ముఖ్యంగా కొన్ని వర్గాల వారు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆడ పిల్లలకు చదువు చెప్పడానికి ఆవిడ స్కూల్ కు వెళుతుంటే ప్రతిరోజూ ఆమెను వేధించే వారు. గల్లీల్లో నడిచి వెళుతుంటే ఛాందసవాదులు ఆమెపై రాళ్లు, మట్టి, బురద విసిరేసే వాళ్ళు. మగవారు ఆమెను తిట్టేవాళ్లు. ఎవరు ఎన్ని అవరోధాలు కల్పించినా, ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టినా ఆ తల్లి ఏరోజూ ధైర్యం కోల్పోలేదు. అన్నింటినీ ధైర్యంగా ఎదుర్కొన్నారు. నా ధర్మాన్ని నేను నెరవేరుస్తున్నాను. భగవంతుడు మిమ్మల్ని క్షమించి ఆశీర్వదిస్తాడు అని ఎంతో సహనంతో

తనను ఇబ్బంది పెట్టిన వాళ్ళకు బదులిచ్చేది.

తరువాత కాలంలో ఆవిడ ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. ఆ తరంలోని అనేక మంది ఉద్యమ నాయకులు డాక్టర్ ఆనంది బాయి ఘోష్, పండిత రమాబాయి, తారాబాయి షిండే, రమాబాయి రానాడే వంటి వారు ఆవిడ నుంచి స్ఫూర్తిని పొందారు. ఆడపిల్లలపై ఆమె ప్రభావం బలంగా ఉండేది. ఇంతకూ ఆ తల్లి ఎవరో తెలుసా? సావిత్రీభాయిపూలే!




## సూచనలు:

1. చదువు అందరి హక్కు అని గుర్తించండి.
2. తల్లిదండ్రులకు భారం అయితే సాయం కోసం పథకాలున్నాయి.
3. మగ పిల్లలు మాత్రమే రేపు ఉద్ధరిస్తారు అనుకోవడం వెర్రితనం
4. ఇంట్లో పిల్లలను చదివించడం ప్రాథమిక బాధ్యత
5. ఇంట్లో ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అమ్మాయిలు దూసుకుని వెళ్ళాలి.
6. ఎవరు ప్రయోజకులు అవ్వాలన్నా అది కేవలం చదువు సంస్కారంతోనే సాధ్యం అవుతుంది.
7. ఎవరెన్ని అడ్డంకులు పెట్టినా చదువును మాత్రం వదలకండి.

### తల్లిదండ్రులకు సూచనలు:

1. నేటి కాలంలో చాలా సర్వేలలో వృద్ధాప్యంలో తల్లిదండ్రులను బాగా చూసుకునేది అమ్మాయిలే అని తేలింది.
2. పెళ్లయిన తర్వాత కొడుకు అమెరికా లేదా విదేశాలు, పట్టణాలు అని తన జీవిత లక్ష్యాల కోసమో లేదా సుఖాల కోసమో తల్లిదండ్రులను వదిలేసి వెళ్తున్నాడు. కాబట్టి వృద్ధాప్యంలో కొడుకులే మమ్మల్ని చూసుకుంటారని గ్యారెంటీ లేదు.
3. కూతుళ్లకు అవకాశాలు పెరిగాయి కాబట్టి సరైన ప్రోత్సాహం అందిస్తే వారు జీవితంలో మంచి ఉన్నత స్థాయికి చేర్చుకోవడమే కాకుండా, తల్లిదండ్రులకు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు సహాయసహకారాలు కూడా అందిస్తారు అనేది గుర్తించాలి.
4. సగటు మధ్య తరగతి తండ్రి లాగా ఆలోచించి చూసినా కూడా కూతురిని చదివించినట్లైతే, తను జాబ్ చేస్తున్నట్లైతే తక్కువ కట్నం లేదా అసలే కట్నం కూడా లేకుండా కూడా పెళ్లి చేయడానికి అవకాశం ఉంటుంది.
5. అన్నిటికి మించి కూతుర్ని ఒక రకంగా, కొడుకును మరొక రకంగా చూస్తే అది మీ అజ్ఞానం, అవివేకం మరియు దౌర్భాగ్యం.

## ప్రేరణ:

*Can you better the condition of your women? Then there will be hope for your well-being. Otherwise you will remain as backward as you are now.*

## స్ఫూర్తి:

ప్రపంచం మొత్తం మీద విద్యావకాశాన్ని కోల్పోయిన 5,70,00,000 బాలబాలికల తరఫున 40 లక్షల మంది సంతకాలు చేసిన మహాజరును తన ఉపన్యాసం తరువాత ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి మలాలా అందచేసింది. ఒక్క పాకిస్థాన్లోనే చదువుకు నోచుకోని బాలబాలికలు 50 లక్షలు. ఇప్పుడు స్వాత్ లోయలో ప్రతి బాలిక, గొంతు విప్పుతోంది. ఇక్కడ ప్రతి బాలిక మలాలాయే అని అక్కడి బాలికలంతా ముక్తకంఠంతో చెప్పారు.

'సాటి మనిషిని ప్రేమించడమే నా కుటుంబం నాకు నేర్పిన సంస్కారం. నా మీద తూటాలు కురిపించిన



తాలిబన్ వచ్చి నా ఎదురుగా నిలిచినా అతడిని నేను క్షమిస్తాను. గాంధీజీ, మార్టిన్ లూథర్ కింగ్, మదర్ థెరిసాలే నాకు ఆదర్శమ' ని మలాలా చెప్పింది. తాలిబన్లకు చదువు లేదు, అందుకే ఇలాంటి దుష్ట కార్యాలకు పాల్పడుతున్నారని నిష్కర్షగా చెప్పింది. ఆ ఉపన్యాసంలో ఆమె ప్రపంచ పెద్దలను ఉద్దేశించి పలికిన మాటలు చరిత్రాత్మకం.

మలాలా ఆశయం వైద్యవృత్తి. తండ్రి ప్రోత్సాహంతో చదువుకోవాలని నిర్ణయించింది. ఆ చైతన్యం ఫలితమే 2008 సెప్టెంబరులో పెషావర్ ప్రెస్ క్లబ్‌లో ఇచ్చిన ఉపన్యాసం. అక్కడే మలాలా వేసిన ప్రశ్న చదువుకోవడానికి నాకు ఉన్న హక్కుని లాక్కోవడానికి తాలిబన్లు ఎవరు?' ఇదే ప్రశ్న చానెళ్ల ద్వారా స్వాత్ లోయ మొత్తం ప్రతిధ్వనించింది. అప్పటి నుంచే ఆమె, ఆమె కుటుంబ సభ్యులు తాలిబన్లకు శత్రువులయ్యారు.

పిల్లలూ! చదువు కోసమై ప్రాణాలను సైతము లెక్క చేయక, మొక్కవోని, చెక్కు చెదరని ధైర్యంతో ముందడుగు వేసిన మలాలా మన అమ్మాయిలకు ఆదర్శమవాలి.

సుధ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పట్టాను బి.వి.బి. సాంకేతిక కళాశాల నుండి తరగతి మొత్తానికి ప్రథమురాలిగా నిలిచి కర్ణాటక ముఖ్యమంత్రి నుండి స్వర్ణ పతకం అందుకొని పూర్తిచేసింది. తర్వాత కంప్యూటర్‌లో మాస్టర్ డిగ్రీని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నుండి తరగతిలో ప్రథమురాలిగా నిలిచి స్వర్ణపతకం అందుకొని పూర్తిచేసింది.

విద్యాభ్యాసం పూర్తి చేసుకొని భారతదేశ అతిపెద్ద ఆటో పరిశ్రమ ఐన టెల్కోలో మొట్టమొదటి మహిళా ఇంజనీర్‌గా ఉద్యోగం సాధించింది. అప్పటికి ఈ సంస్థలో కేవలము పురుషులకే స్థానం కల్పించేవారు. దీనిని ప్రశ్నిస్తూ ఆవిడ ఆ సంస్థ అధ్యక్షుడికి ఒక పోస్టు కార్డు రాసింది. దానికి స్పందించిన ఆయన, ఆవిడకు ప్రత్యేకంగా Interview నిర్వహించి, అప్పటికప్పుడు

నియామక ఉత్తర్వులు అందించాడు. ఆ సంస్థ పూనా శాఖలో పనిచేస్తున్నపుడే ఆవిడకు ఎన్.ఆర్.నారాయణ మూర్తితో పరిచయమై తర్వాతి కాలంలో వారిద్దరు వివాహం చేసుకోవడానికి దారితీసింది. పిల్లలూ! నేనెవరి గురించి చెప్పానో మీకు అర్థం అయింది కదా!

ఆవిడే Infosys సహ వ్యవస్థాపకులు శ్రీమతి సుధామూర్తి. చదువైనా, ఆటలైనా, పాటలైనా, యోగమైనా, ఉద్యోగమైనా, సద్యోగమైనా, సైన్యమైనా, రక్షక దళమైనా, దేశ భద్రత అయినా, నాయకత్వమైనా, మార్గదర్శనమైనా, రాజకీయమైనా, తత్వదర్శనమైనా, దైవ దర్శనమైనా, ఏదైనా సరే, అమ్మాయిలు దేనిలోను వెనక బడిలేరు అన్నది అమ్మాయిలే నిరూపించాలి.





# 46. పఠనాభిలాష తగ్గుతోంది



## సమస్య:

*రోజు రోజుకు మాలో పఠానాభిలాష తగ్గుతోంది. పుస్తకాలు పట్టి చదవడం అంటేనే కుదరటం లేదు. ఏదైనా సరే చూడాలి, వినాలి అన్న ధ్యాస తప్ప పుస్తకము తెరచి చదవాలి అన్న ఆలోచన రావటం లేదు. వచ్చినా చాలా సమయం చదవలేక పోతున్నాం. ఈ సమస్య కేవలం పాఠ్యపుస్తకాలకు మాత్రమే పరిమితం కావటం లేదు అన్ని రకాల పుస్తకములకు వర్తిస్తుంది. స్వామీ, మేము పుస్తకాభిలాషను మరియు పఠానాభిలాషను మాలోను మరియు పిల్లల లోనూ ఏ విధంగా పెంపొందించుకోవాలి చెప్పండి.*

## వివరణ:

నాకు బాగా గుర్తు చిన్ననాడు పుస్తకాలు పట్టుకొని చదవండి అంటూ గద్దించే తల్లిదండ్రులు ఉండేవారు. గత అర్ధ శతాబ్దంలో మన జీవిత నిఘంటువులో నుండి పుస్తకములు, గ్రంథములు, పత్రికలు అన్న పదాలు తొలగించబడినాయేమో అన్న సందేహం కలుగుతుంది. కారణం సాంకేతిక విప్లవం అని చెప్పాలి. ఇంకా మనలో మృగ్యం అవుతున్న ఆసక్తి అని చెప్పొచ్చు.

మునుపు ఇంటికి ఉదయమే సమాచార పత్రికలు వస్తే, ఇక కుటుంబ సభ్యులు చాలా ఆసక్తిగా కాఫీ లేక టీ త్రాగుతూ తలా ఒక పేజీ తీసుకొని మార్చి, మార్చి చదువుకునే వాళ్ళు నాకు బాగా గుర్తు ఈ దృశ్యం. అసలు సమాచారాన్ని తెలుసుకోవడానికి మరే ఇతర సామాజిక మాధ్యమాలు లేని రోజుల గురించి నేను చెప్తున్నాను.

కానీ ఈరోజు సాంకేతికత పుణ్యమా అని పుస్తకాలు ఉండాల్సిన చేతుల్లో స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్లు, కంప్యూటర్లు నిలచిపోతున్నాయి. ఏది కావాలంటే అది కేవలం నోటితో చెప్పే మాట ద్వారా చేతిలో వున్న పరికరంలో మన ముందు అంతర్జాలంలో ఆవిష్కరించబడుతోంది. ఉదాహరణకి నాకు శివాజీ గురించిన సమాచారం కావాలి అని అడిగితే... క్షణాలలో అడిగిన అంశానికి సంబంధించిన పూర్తి సమాచారం ఫోటోలలో, ఆడియోలలో, వీడియోలలో, పిడిఎఫ్ ఫార్మాట్లో, వర్డ్ డాక్యుమెంట్లలో మన ముందు ప్రత్యక్షమైపోతాయి. ఇక భౌతికంగా పుస్తకము చేతిలో పట్టుకుని చదవాల్సిన అవసరమే లేకుండా పోతుంది. ఇది చాలా దిగులు పడాల్సిన విషయం.

సమాజంలో మనిషి తలరాతను మార్చేది చదువు మాత్రమే! పఠనమునకు బాల్యంలోనే బలమైన పునాదులు పడాలి. అలా జరిగినప్పుడే భావిపౌరులు దేశానికి భాగ్యవిధాతలు కాగలుగుతారు.

విద్యార్థుల మీద ర్యాంకుల కోసం ఒత్తిడి విపరీతంగా పెరిగింది. సిలబస్సు పూర్తిచేయడం, పరీక్షలకు సిద్ధం కావడం వరకే విద్యార్థుల జీవితాలు పరిమితమైనాయి. సిలబస్సు వెలుపల ఏమున్నదో పిల్లలను కన్నెత్తి చూడనివ్వని కట్టుదిట్టమైన కాపలాతో వర్ధిల్లే ప్రైవేటు రెసిడెన్షియల్ స్కూళ్ల ఘనత చెప్పాలంటే, ఒక గ్రంథమే అవుతుంది.

సిలబస్ ఒత్తిడిలో నలిగిపోయిన పిల్లలు విజ్ఞాన వినోదాలను పంచిపెట్టే పుస్తకాలకు క్రమంగా దూరమయ్యే ధోరణి మొదలైంది. దేశవ్యాప్తంగా దాదాపు ఇదే పరిస్థితి! తెలుగునాట ఈ పరిస్థితికి పర్యవసానమే పిల్లల పత్రికలు మూతబడటం. కొన్నితరాల పాటు ఆబాల గోపాలాన్నీ ఉర్రూతలూగించిన 'చందమామ, బాలమిత్ర' వంటి పత్రికలు చరిత్రలో కలిసిపోయాయి. కొన ఊపిరితో మనుగడ సాగించిన ఒకటీ అరా పిల్లల పత్రికలు సైతం కోవిడ్ మహమ్మారి దెబ్బకు మూతబడ్డాయి.

టీవీలు, స్మార్ట్‌ఫోన్‌లు పిల్లలను చదువులకు దూరం చేస్తున్నాయనే వాదనలో నిజం లేకపోలేదు. కొరోనా లాక్డౌన్ కాలంలోనైతే, దాదాపు 65 శాతం పిల్లలు పూర్తిగా స్మార్ట్‌ఫోన్‌లకు, ట్యాబ్లకు బానిసలుగా మారినట్లు జైపూర్ వైద్యనిపుణులు నిర్వహించిన ఒక అధ్యయనంలో వెల్లడైంది.

స్మార్ట్‌ఫోన్‌లు, ట్యాబ్‌లు వంటి పరికరాల్లో తెరపై ఆడే ఆటలకు బానిసలుగా మారిన పిల్లలు కనీసం అరగంటసేపైనా ఈ పరికరాలను విడిచిపెట్టి ఉండలేకపోతున్నారనీ, ఈ అలవాటును మాన్పించేందుకు తల్లిదండ్రులు వీటిని దూరంగా ఉంచినా, పిల్లలు హఠం చేసి సాధించుకునే పరిస్థితికి చేరుకున్నారనీ ఈ అధ్యయనంలో వెలుగులోకి రావడం ఆందోళనకరమైన పరిణామం.

మొన్నా మధ్య, ఒక 15 ఏళ్ళ బాబు ఇంట్లో సెలవు దినాలలో అమ్మ చేతిలోని స్మార్ట్ ఫోన్ వాడుతూ దాని బానిసగా మారిపోయాడట. ఓ రోజు తల్లి బయటకు వెళుతూ...ఫోన్ కావాలని అడిగింది. వాడేమో నేనివ్వను అని మొండికేస్తే అమ్మ వాడిని మందలించి పుస్తకం తెరచి చదువుకొమ్మని చెప్పి, వాడి చేతిలో ఫోన్ బలవంతంగా తీసుకుని బయటకు వెళ్ళింది. అంత చిన్న అబ్బాయికి పట్టరాని కోపం వచ్చేసింది. కట్టలు తెంచుకున్న ఆవేశం వాడిని ఉన్మాదిగా మార్చేయగా... వాడు ఇంట్లో వున్న ప్రతి వస్తువును తల్లి తిరిగి వచ్చే లోపుగా సర్వ నాశనం చేశాడు. చివరికి చాలా బలంగా వుండే refrigerator, furniture, toilets కూడా పగలగొట్టేసాడు. ఇలాంటి పరిణామాలకు ఎవరు కారణం అంటారు. మనమందరము అనే చెప్పాలి.

ఎవరిలో అయినా పుస్తక పఠనాసక్తి పెంపొందించాలి అంటే ఈ క్రింది సూచనలు గమనించాలి.

# కంపాస్



## సూచనలు:

1. పిల్లలను ఓపికగా దగ్గర కూర్చోబెట్టుకుని కథలు చదివి వినిపించడం, వాళ్ల చేత చిన్ని చిన్ని పాటలు పాడించడం చేయాలి
2. తల్లిదండ్రులు పిల్లల ముందు ఎప్పుడూ కూడా స్మార్ట్ ఫోన్ మరియు ఇతర మాధ్యమాలలో తలమునకలు అవొద్దు
3. ఇంట్లో తప్పక కొంత సమయాన్ని అందరు పుస్తకాలు చదవటం కోసమై నిర్దేశించుకోవాలి.
4. అన్ని పాఠశాలలు పుస్తక పఠనం కోసమే ఒక పీరియడ్ నిర్వహించాలి.
5. అన్ని పాఠశాలల్లో పిల్లలకు తగిన పుస్తకాలతో కూడిన లైబ్రరీలు ఏర్పాటు చేయాలి
6. పిల్లలు పుస్తకాలు చదువుకోదగ్గ వాతావరణమును మనము ఇంట్లో మరియు బడిలో కల్పించాలి
7. టీవీలు, స్మార్ట్‌ఫోన్‌లకు బానిసలుగా మారిన పిల్లలకు స్కూళ్లలో బోధించే పాఠాలు ఎలా తలకెక్కుతాయి... ఇది గమనించి ఇంట్లో సమూలమైన మార్పులు చేసుకోవాలి
8. ఇంట్లో అందరూ చేరి ఆ వారములో చదివిన పుస్తకాల సమీక్ష చేయాలి. అప్పుడు అందరికీ ఒక విధమైన ప్రోత్సాహం లభిస్తుంది.
9. పిల్లలు చదివిన విషయాలను మళ్ళీ వాళ్ళ చేత చక్కగా క్లుప్తంగా వ్రాయించ గలిగితే మనం విజయం సాధించినట్లే.
10. బాలసాహిత్య సృజనను, ప్రచురణలను ప్రోత్సహించాలి.

పిల్లల చదువుల తీరుతెన్నులపై ఐదేళ్ల కిందట నిర్వహించిన సర్వేలో దేశంలో 6-17 ఏళ్ల వయసు వరకు గల పిల్లల్లో కేవలం 32 శాతం మందికి మాత్రమే సిలబస్సు వెలుపలి పుస్తకాలను చదివే అలవాటు ఉంది అన్నది తేల్చారు. పిల్లల్లో చదివే అలవాటు తగ్గుముఖం పడుతుండటానికి ముఖ్యంగా పాఠశాలల నిర్వాహకులనే తప్పుపట్టాలేమో.

## చివరగా ఒక మాట:

పిల్లల్లో చదివే అలవాటును ప్రోత్సహించడానికి అందరం నడుం కట్టాలి. పాఠశాలల లైబ్రరీలను పటిష్ఠపరచడం, పఠనోత్సవాలను నిర్వహించడం వంటి చర్యల ద్వారా పిల్లల్లో చదివే అలవాటును ప్రోత్సహించాలి. ఇలాంటి కార్యక్రమాలు సత్ఫలితాలను ఇవ్వాలంటే ఇంకొంత కాలం వేచి చూడక తప్పదు. ఇలాంటి కార్యక్రమాలు ప్రారంభించిన వెనువెంటనే సత్వర ఫలితాల కోసం ఆత్రపడకుండా, మొక్కవోని దీక్షతో కొనసాగిస్తే, తప్పకుండా సత్ఫలితాలే లభిస్తాయి. దేశంలో పిల్లల్లో పఠనాభిలాషను, చదివే అలవాటును పెంపొందించే కార్యక్రమాలను చిత్తశుద్ధితో చేపడితే, కొన్నేళ్ల తర్వాతనైనా సంపూర్ణ విజ్ఞానవంతులైన తరం తయారవుతుంది. పిల్లల్లో పఠనాభిలాష పెంచేందుకు అందరం ముందుకు రావాలి. ఈ తరం పిల్లలకు స్మార్ట్‌ఫోన్‌లు, ట్యాబ్‌లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనివార్యంగా మారిన విషయం వాస్తవమే అయినా, పుస్తకాలను మింగేసేంతగా వీటి వినియోగం పెరిగిపోయే పరిస్థితులను నిరోధించవలసిన బాధ్యత పూర్తిగా పెద్దల మీదే ఉంది. ఈ విషయంలో ప్రభుత్వాల కంటే ఎక్కువగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే గురుతర పాత్ర పోషించాల్సి ఉంటుంది. ఎందుకంటే, భావిపౌరుల భవితవ్యాన్ని తీర్చిదిద్దాల్సింది వాళ్లే!

### ప్రేరణ మంత్రము:

*పఠనం మనిషిని పూర్తి మానవుడిగా తీర్చిదిద్దుతుంది; చర్చ సంసిద్ధ మానవుడిగా తీర్చిదిద్దుతుంది; రాత ఖచ్చితమైన మానవునిగా తీర్చిదిద్దుతుంది' అని పదహారో శతాబ్దినాటి బ్రిటిష్ రాజనీతిజ్ఞుడు ఫ్రాన్సిస్ బేకన్ అన్నాడు.*



# సార్! నేనేమి చేయాలి?

# 47. బోధన లేదు



## సమస్య:

*మా స్కూల్‌లో ఉపాధ్యాయులు నాణ్య రహితమైన బోధన చేస్తున్నారు. వాళ్ళ దృష్టి అసలు బోధించడం మీద కాక వాళ్ళ సొంత పనుల మీదే వుంటుంది. బోధన సిబ్బంది కొరత వుంది. బోధించేది మా బుర్రకు ఎక్కడం లేదు. అసలు కొన్ని అంశాలలో బోధనే జరగదు. ఎవరికి చెప్పాలో తెలియదు. ఒక వేళ పై అధికారులకు చెప్పినా సిబ్బందిని ఏర్పాటు చేసే సమయానికి పుణ్య కాలం కాస్త అయిపోతుంది. ఏమి చేయాలి? ఎవరూ బోధించ కుండా మాకు మేముగా చదవడం ఇబ్బందిగా వుంది.*

## వివరణ:

బోధన సిబ్బంది గురించి చాలా సమావేశాలలో అడిగిన ప్రశ్నలు ఇవి. ఒక్కో చోట ఒక్కొక్క సమస్య. ఇవన్నీ కూడా అధ్యాపకులకు సంబంధించిన అంశాలు. ఆంగ్ల మాధ్యమంలో అదీ కాక ఈ సమస్యలన్నీ కేవలం ప్రభుత్వ పాఠశాలలకు మరియు కళాశాలలకు మాత్రమే ముడి పడినవి. ప్రైవేట్ స్కూళ్లలో ఇలాంటి సమస్యలు చాలా వరకు ఉండవు అనుకోవచ్చు. కానీ కొన్ని ప్రయివేటు స్కూల్స్ లో యాజమాన్యం వాళ్ళు డబ్బుకు ఆశ పడి, అసలు అర్హత లేని వారిని కూడా అధ్యాపకులుగా నియమించడం కూడా జరుగుతుంది.

ఇక,మనము సమస్యల గురించి కాస్త ఆలోచిస్తాము. బోధన అన్నది చాలా సున్నితమైన అంశము. నేను కొన్ని

చోట్ల ఒక విషయాన్ని గమనించాను. ఉదాహరణకు ఈ ప్రశ్న అడిగిన విద్యార్థి ఒక స్కూల్ వాడు అనుకుంటే... వాడితో పాటుగా వచ్చిన వాడి స్నేహితులందరిని ఒక సారి అడుగుతాను.

అరే అబ్బాయిలూ...మీ తరగతిలో ఎంత మంది 10కి 8 పాయింట్లు సంపాదిస్తున్నారు అని...అప్పుడు వాడి బృందంలో ఉన్న 40 మందికి 30 మంది చేతులెత్తారు. దాని అర్థం ఏంటి? బోధన బాగా లేదనుకోండి...ఒక 10 మంది మాత్రమే చేయి ఎత్తే వాళ్ళు కదా. 40 మంది పిల్లలున్న తరగతిలో కేవలం ఒక్కడికో ఇద్దరికో బోధన బాగా లేదంటే...సమస్య పిల్లల్లో ఉన్నట్టా లేక టీచర్ల లో ఉన్నట్టా? ఆలోచించండి.

ఒక వేళ బోధన నిజంగా బాగా లేక పోతే 40 మందికి 35 మంది ఎలా ఉత్తీర్ణత సాధిస్తారు. పిల్లలకు ఈరోజు రేపట్లో చదువులు బాగా చెప్పి తమ పాఠశాలకు మంచి పేరు తీసుకుని రావాలని ఏ ఉపాధ్యాయుడైనా ప్రయత్నిస్తాడు. ప్రభుత్వము కూడా వివిధ మార్గాలలో సాంకేతికతను అనుసంధానించడం ద్వారా బోధనను & బోధనా సిబ్బందిని చక్కగా నియంత్రణ (supervision) చేస్తున్నారు. ఇంతకు ముందులా లేదు ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో స్థితి గతులు.

ఇప్పుడు... పొరపాటున నిజంగానే ఒక అంశములో బోధన బాగాలేదని అనుకుందాము. అప్పుడు మొత్తము తరగతిలో ఆ అంశములో తప్ప మిగతా అన్ని సబ్జెక్ట్స్ లో కూడా మంచి మార్కులు తెచ్చుకున్నారా ఒక సారి పరిశీలించండి... అప్పుడు అక్కడ కూడా మీకు తెలుస్తుంది. బోధన బాగలేని విషయం అయినా...బాగా వున్న విషయం అయినా మీ మార్కులు అటు ఇటుగా ఒకే మాదిరిగానే ఉన్నాయంటే బాగాలేనిది బోధననా లేక మీరు చదివే విధానమా???

మిమ్మల్ని తిక మక పెట్టడం నా ఉద్దేశ్యం కాదు. కానీ వివిధ రకాలైన పరిస్థితులను మీ ముందు ఉంచుతున్నాను. అంతే తప్ప మిమ్మల్ని తప్పు పట్టటం నా ఉద్దేశ్యం కాదు.

సరే, ఇప్పుడు నిజంగానే బోధన బాగాలేదు (లేక) బోధనా సిబ్బంది కొరత (లేక) ఆంగ్ల మాధ్యమంలో బోధన ఇబ్బందిగా వుంది (లేక) తదితర బోధన సంబంధమైన సమస్యలు ఉన్నాయి అనుకుందాము. అప్పుడు క్రింద పేర్కొన్న సూచనలు కాస్త ఉపయోగంగా ఉంటాయేమో గమనించండి.

## సూచనలు:

*1. జీవితంలో అన్నీ ఎవరో చెప్తేనే నేర్చుకున్నారా?*

*2. తరగతిలో ఉన్న 40 మంది విద్యార్థులలో కాస్త విషయ పరిజ్ఞానం వున్న వాడితో చేరి పాఠాలు చర్చించవచ్చు కదా.*

*3. Text Books లేక Guides వున్నాయి కదా వాటిని ఆధారం చేసికొని పాఠ్యాంశాలను విషయాలను వేరే అధ్యాపకుల సాయంతో నేర్చుకోవచ్చు.*

*4. మీ కంటే ముందు స్కూల్లో బాగా చదివిన పిల్లలుంటారు కదా... వాళ్ళని కలసి వాళ్ళ తీరిక సమయంలో పాఠాలు చెప్పమని అడగవచ్చు.*

*5. మీ ప్రధానోపాధ్యాయుడిని కలిసి ఒక వినతి పత్రం ఇచ్చి తగిన చర్యలు తీసుకొమ్మని చెప్పొచ్చు. తల్లిదండ్రులు కూడా ఈ విషయం మీద గట్టిగానే మాట్లాడవచ్చు. అధికారులు దీనిని చాలా గట్టిగా తీసుకుని సరయిన బోధనా సిబ్బందిని నియమించాలి కూడా.*

*6. ఇంకా కొన్ని స్వచ్ఛంద సంస్థల సేవకులు కేవలం ఇలాంటి పాఠ్యాంశాలు బోధన చేసేందుకే ఉచితంగా వచ్చి సాయం చేస్తారు. అలాంటి వారితో సంప్రదించండి.*

*7. ఇంకా కొన్ని సంస్థలు మీలాంటి పిల్లలకు మంచి జరగాలి అని డబ్బులు ఖర్చు పెట్టి ప్రత్యేకంగా*

*ఒక టీచర్ ను కూడా ఏర్పాటు చేస్తారు.*

*8. ఇవేవీ కుదరలేదా... మీ చేతిలో వున్న స్మార్ట్ ఫోన్‌ను స్మార్ట్‌గా ఉపయోగించి మీరు నేర్చుకోవాలన్న అంశాల మీద యూట్యూబ్‌లో పాఠాలు వున్నాయా అని చూడండి.*

*9. ఒక వేళ దూర ప్రాంతంలో మంచి టీచర్ ఉన్నట్లయితే స్కైప్ ద్వారా వాళ్ళు పాఠాలు చెప్తుంటారు.*

*10. పైవి ఏవీ కుదరక పోతే పిల్లలు అందరూ చేరి తలా ఇంత డబ్బు పోగు చేసుకుని తమ చుట్టు ప్రక్కల ఊళ్లలో నుండి ఎవరైనా మంచి టీచర్‌ను పిలిచి ట్యూషన్ పెట్టించుకోవచ్చు.*

## ప్రేరణ మంత్రం:

*Focus on the possibilities for learning rather than complaining.*

## స్ఫూర్తి:

అడవిలో భిల్ల జాతికి సంబంధించిన యువకుడు. చాలా చురుకైన వాడు. అతి తెలివైన వాడు. గూడెంలో అందరూ అతని మీద ఆధార పడి బ్రతికే వారు. అడవిలో పెరిగాడు కాబట్టి అన్ని రకాల యుద్ధాలలో ఆరి తేరినాడు. కానీ ఒక్కటే తక్కువైంది. అతనికి ధనుర్విద్య నేర్చుకుని మంచి విలుకాడు కావాలన్న కోరిక బలంగా వుండేది. ఏవరో చెప్పారు హస్తినాపురంలో ద్రోణాచార్యుల వారు చాలా గొప్పగా విలు విద్య నేర్పిస్తారని. వారు రాజ పుత్రులకు విద్య నేర్పించే రాజ గురువు కూడా అని చెప్పారు. ఇంకేమి. ఎంతో ఆశతో అడవిని వదిలి ఆయన దగ్గరికి వెళ్లి మోకరిల్లాడు. అతని వర్ఛస్సు చూసి ఆచార్యుల వారు అచ్చెరువొందారు. కారణాంతరాల వలన అతనికి విద్య నేర్పలేనని ఎంతో బాధతో చెప్పి వెనక్కి పంపించి వేశాడు. తాను గురువు పాదాల దగ్గర సాగిల పడి మ్రొక్కి ఆశీర్వాదాలు తీసుకుని వెను తిరిగాడు.

అతను బాగా వ్యధ చెందాడు. తాను ఎంతో ఆశతో ఆశయంతో ఆదర్శము నిరూపించాలని... మేటి విలుకాడినవ్వాలని ఎన్ని కలలో కన్నాడు. ఆ కలలన్నీ కల్లలు అయ్యాయి. కానీ నిరాశ చెందలేదు. ఒక నిర్ణయం చేశాడు. తాను ఆ విలు విద్య నేర్వనిదే తన గూడెంకి కూడా వెళ్ల కూడదని. అడవిలో ఒక నిర్జన ప్రదేశం చేరుకున్నాడు. బంక మట్టితో గురుదేవుని పోలిన బొమ్మ చేసుకున్నాడు. ఇక విల్లు అమ్ములు తీసుకుని స్వంతంగానే నేర్చు కోవడం మొదలు పెట్టాడు. చుట్టూరా వున్న ప్రకృతి పులకరించి పోయింది అతని తపన చూసి. పంచ భూతాలు కూడా అతని వశం అయిపోయాయి.

గురుకులంలో ఏది ఒప్పు ఏది తప్పు అన్నది గురువు చెప్తాడు కదా. మరి గురువు లేనప్పుడు ఇక వందసార్లు తప్పులు చేయడం పరిపాటి. అంతే కాదు పిల్లలూ అదే కదా మన భయం కూడా...మనకు ఏదైనా అంశములో బోధించటానికి టీచర్ లేక పోతే తల్లడిల్లి పోవడం పరిపాటి. కారణం గురువు బరువు బాధ్యత తీసుకుని ఏదైనా అంశాన్ని సులువుగా నేర్పిస్తాడు అన్న ధీమా.

మరి అదే గురువు లేకుంటే వందసార్లు చేసే ప్రయత్నంలో ఒకసారి తప్పక విజయం సాధిస్తాము... అప్పుడు 99 సార్లు చేసిన ప్రయత్నాలు అన్నీ మనకు అద్భుతమైన నైపుణ్యమును ఇస్తాయి.

అలాగే అతను కూడా అవిశ్రాంతంగా సాధన చేసాడు. అన్నింటిని అవలీలగా కాదు అతి కష్టము మీద నేర్చుకున్నాడు. అనతి కాలంలోనే అవిక్ర పరాక్రమమైన విలుకాడుగా మారిపోయాడు.

చివరికి గురువు అయిన ద్రోణాచార్య వారినే కాదు వారి శిష్యులైన రాకుమారులను...అందులోనూ ఆయన మేటి విలుకాడుగా తీర్చి దిద్దిన అర్జునుడిని కూడా ధనుర్విద్యలో మించిపోయాడు.



అతనే ఏకలవ్యుడు... ఇది మహాభారత కథ. పిల్లలూ తరువాత జరిగింది ఏమైనా... ఏకలవ్యుడి కథ మాత్రం యుగ యుగాలుగా మీలాంటి పిల్లలకు స్ఫూర్తి నింపుతూనే వుంటుంది.

బోధన లేదని బాధ వలదు... మీకు మీరుగా ఎలాంటి ప్రక్రియల్లో నేర్చుకోవచ్చో తెలుసుకుంటే ఇక మీకు చదువులోనే కాదు సుమా... జీవితంలో కూడా ఎదురుండదు అని గమనించండి.

# 48. స్కూల్ నచ్చలేదు




**సమస్య:**

*నాకు స్కూల్ నచ్చటం లేదు*
*అక్కడి వాతావరణం నాకు సరి పోలేదు.*
*నా స్నేహితులు ఇంకో స్కూల్‌కి వెళ్తున్నారు...*
*ఇంట్లో నన్ను అక్కడకి వద్దని ఇక్కడ చేర్పించారు.*
*అసలు స్కూల్‌కి వెళ్లాలంటేనే చిరాకుగా వుంది.*
*స్కూల్‌లో కనీస సౌకర్యాలు కూడా లేవు.*
*స్కూల్‌లో ఆడుకోవడానికి మైదానం లేదు...*
*స్కూల్ అంటేనే ఇష్టం లేదు*
*నేనెలా చదవాలో చెప్పండి.*

## వివరణ:

చాలా సమావేశాలలో ఇలాంటి ప్రశ్నలు కూడా కొద్ది మంది విద్యార్థులు అడుగుతుంటారు. నిజమే కదా...పిల్లలూ మీకు కూడా ఏదో ఒక సారైనా ఇలాంటి ఆలోచనలు వచ్చి వుంటాయి. అప్పుడు ఏమి

చేయాలో...ఎవరికి చెప్పుకోవాలో తెలియక తల్లడిల్లి పోయింటారు కదా. సరే...ఇప్పుడు ఇక్కడ ఏమి చెప్తున్నానో కాస్త చదవండి.

నిజానికి, భారత దేశంలో ఎన్నో రాష్ట్రాల్లో నేను తిరుగుతున్నప్పుడు చాలా స్కూల్స్ చూశాను. ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ స్కూల్స్, కాన్వెంట్లు, ఇంటర్నేషనల్ స్కూల్స్, గురుకులాలు, విద్యా మందిరాలు ఇలా ఎన్నో చూశాను. అప్పుడు నాకు ఒక విషయం అర్థం అయింది. దేశానికి ఆదర్శ మైన పౌరులను తయారు చేసే ఒక కర్మాగారం బడి అనుకుంటే...అది ఎంత ఆదర్శముగా వుంటే పిల్లలు కూడా అంతే ఆదర్శ మూర్తులు కావడానికి అవకాశం వుంది.

మరి, ఆదర్శ పాఠశాల అంటే ఎలా వుండాలో నేను పరిశీలించాను? ఒక్క సారి చూడండి...

1. చక్కటి భవన సముదాయం
2. ఆహ్లాదంగా వాతావరణం
3. విశాలమైన ఆట మైదానం
4. బోధన మరియు బోధనేతర సిబ్బంది
5. మంచి విద్యార్థులు
6. చుట్టూ చెట్లు, మొక్కలు
7. బడికి ప్రహరీ మరియు గేటు
8. సహకరించే తల్లి తండ్రులు
9. ప్రభుత్వ శాఖాధికారులు
10. ప్రయోగ శాలలు
11. గ్రంథాలయము
12. నైతిక తరగతులు
13. గోడల మీద స్ఫూర్తి చిత్రాలు
14. త్రాగు నీటి సౌకర్యం
15. మరుగు దొడ్లు
16. ఆట సామానులు / ఆటలు
17. సామాజిక సేవా బృందం
18. భౌతిక పుష్టికై వ్యాయామం
19. దృశ్య శ్రవణ కేంద్రము
20. నిఘా వ్యవస్థ
21. మంచి ఫలితాలు
22. ప్రోత్సాహకాలు
23. పర్వదినాచరణ
24. భక్తి శ్రద్ధలు
25. బాధ్యతాయుత ప్రవర్తన
26. స్థానిక, జాతీయ, అంతర్జాతీయ భాష బోధన
27. నాయకత్వ నైపుణ్యాలు
28. రాజకీయ అవగాహన
29. వృత్తి విద్యా నైపుణ్యములు
30. ప్రకృతి వనరులు

ఇప్పుడు చెప్పండి పిల్లలూ, ఇలాంటి పాఠశాలలు ఉన్నాయంటారా? వుండవచ్చు కానీ మీ దృష్టిలో లేక పోవచ్చు. అంతే కాదు ఈ రోజు చాలా పాఠశాలలు ఒక పాత శాలల్లాగా వుంటున్నాయి. అన్ని రకాలుగా ఆదర్శమైన బడులు ఈ రోజు ఎక్కడా లేవు. కానీ ప్రభుత్వ వైఖరిలో మార్పు కనిపిస్తోంది... ప్రభుత్వం చొరవ తీసుకుని ఆదర్శవంతంగా బడులను తీర్చిదిద్దుతోంది. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నడుస్తున్నాయి.

ఇప్పుడు, మనము మీరడిగిన ప్రశ్నలు చూద్దాం. మీరు బాగా చదువుకోవడానికి ప్రధానంగా కావాల్సింది ఏమిటి??? సవాల్ చేస్తాను చెప్పండి.

మీరు పైన ఉదహరించిన వాటిలో ఎదో ఒకటి చెప్తారు కదా? అప్పుడు మీరు నేను పెట్టిన పరీక్ష తప్పినట్టే సుమా! కారణం మీరు బాగా చదువుకోవాలంటే ప్రధానంగా కావాల్సింది అవన్నీ కాదు...చదువుకోవాలనే తీవ్రమైన తపన...దృఢ సంకల్పం. అదొక్కటి వుంటే మీరు ఆదర్శ పాఠశాలలో చదివినా చదవకున్నా బాగు పడతారు అని నమ్మండి. నేను మీకు గారంటీ ఇస్తాను. చదవాలన్న విశ్వాసంతో మీరుంటే ఇక ఆ చదువుల తల్లే తన ఒడిలో కూర్చోబెట్టుకొని మీతో చదివిస్తుంది.

నేను అంత ఉన్నత కుటుంబంలో నుండి రాలేదు. మధ్య

తరగతి కుటుంబం. అమ్మ నాన్న చాలా ప్రేమగానే పెంచారు. కానీ (నలుగురు పిల్లలు) ఇంటర్ దాకా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివాము. తాడిపత్రి (అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్) లో చదివాము మేమంతా. మా బంధువుల పిల్లలు మంచి స్కూల్స్‌కి వెళ్ళేవాళ్ళు. మా చిన్నాన్న పిల్లలయితే అరోబిందో స్కూల్‌లో చదివే వాళ్ళు. నాకు తెలిసి మేమెప్పుడు కూడా అయ్యో మేము ప్రభుత్వ బడిలో చదువుకుంటున్నామే అని అనుకోలేదు.

నేను ధనలక్ష్మి బడి (ధనలక్ష్మిబట్టల షాప్ వున్న సందులో ఉన్న స్కూల్) లో 2వ తరగతి లో చదువుతున్నప్పుడు... కూర్చునే నేల బండల మధ్యలో నుంచి ఎలుకలు, జెర్రులు వచ్చేవి. ఆ సందులో మరుగు ఉండటం, అందరూ అక్కడే మూత్రవిసర్జన చేసేవాళ్ళు. మొత్తము చాలా కంపు కొడుతూ వుండేది. ఏనాడు కూడా వాటి గురించి భయ పడింది కానీ, అసౌకర్యమని తలచింది కానీ లేదు. ఆ బడిని ఈ రోజున ప్రభుత్వ బడులతో పోలిస్తే నక్కకు నాగలోకానికి ఉన్నంత వ్యత్యాసం వుంటుంది. అలాగని మేము బాగు పడలేదా? మా అన్నయ్య ఛార్టర్డ్ అకౌంటెంట్, అక్కయ్య డిగ్రీ, నేను కంపెనీ సెక్రెటరీ & లాయరు, తమ్ముడు డిగ్రీ. సంతోషంగా బ్రతుకుతున్నాము. ఎంతో మంది డబ్బులున్న వాళ్ళ కంటే ఆనందంగానే జీవిస్తున్నాం.

పిల్లలూ! ఒకటి గుర్తుంచుకోండి...స్కూల్ నచ్చలేదని



చెప్తున్నారు కదా... టీచర్ నచ్చట్లేదు కదా... వాతావరణం అనుకూలంగా లేదు... మా స్నేహితులతో మేము లేము...మాకు స్కూల్ ఇష్టం లేదని కదా మీరు కంప్లైంట్ చేస్తున్నారు...అసలు వీటికి మీరు చదువుకోవడానికి సంబంధం ఉందంటారా?

బడి గోడలకు కలరుంటే మన జీవితం హరివిల్లు
బడిలో సౌకర్యాలు మన చదువుకు సోపానాలు
స్నేహితులుంటేనే చదువు బాగా సాగుతుంది

ఇలా అనుకుంటారా, ఎవరైనా? అనుకుంటే మాత్రం మీకు కొద్దిగా పిచ్చి వుందేమో చూపించాలి. కారణం చదువు అనేది మన తపన మీద ఆధార పడి వుంది.

కాశ్మీర్ లోని హర్క బహదూర్ అనే కొండ ప్రాంతంలో ఒక స్కూలు వుంది. దానికి ఒక పక్క కొండ ఉంటే, మరో పక్క చిన్న పాటి పల్లం ప్రాంతం వుంది. అటువైపు అడ్డు గోడ లేకపోవడంతో పిల్లలు ఆడుకుంటూ పొరపాటున ఆ పల్లం లోకి జారి పడిపోయేవారు. లేదంటే పడిపోయిన బంతులు, బాట్లు కోసం అందులోకి జారి చిన్న పాటి దెబ్బలు తగిలించుకుని వచ్చేవారు. ఆ ప్రాంతంలో అసలు స్కూలు నడపడమే చాలా కష్టం, ఇక గోడ కట్టించమని ఎవరిని అడుగుతారు. పాపం! ఎవ్వరినీ అడగలేక పోయారు. అలా అని వాళ్ళ ఇబ్బందిని అలాగే ఉంచుకోలేక పోయారు. బడిలో అసౌకర్యం కంటే చదువుకోవాలి... ఆడుకోవాలి అన్న ఆలోచనతో పిల్లలందరూ పూనుకున్నారు. వెదురు బుందులు, ఖాళీ ప్లాస్టిక్ బాటిల్స్ సేకరించారు.వెదురు బుందులతో దడి లాగా కట్టి దానికి సీసాలు వేలాడ దీసి, వాటికి చక్కగా జెండా రంగులు వేసి, ఒక గొడలాగా మరుగు ఏర్పాటు చేశారు. దాంతో పిల్లలు పడిపోవడం తగ్గింది. ఆ ప్రాజెక్టుకి జాతీయస్థాయిలో 50,000/- ప్రథమ బహుమతి కూడా దక్కించుకున్నారు. చూశారా! నాకు బడి నచ్చలేదు... సౌకర్యాలు లేవు...నేను చదువుకోలేక పోతున్నాను అనే వాళ్ళందరూ ఒక నిముషం ఆలోచించండి.

అసలు బడికే వెళ్లలేని కోట్ల మంది పిల్లల కంటే మనము ఎంతో అదృష్టవంతులము కదా! మనము బడికి వెళ్తున్నాము అంటే అది ఒక వరం. అలాంటి వరాన్ని కేవలం మీ తెలివిలేని ఆలోచనలతో పోగొట్టుకోకండి.

## ప్రేరణ మంత్రం:

*In some parts of the world, students are going to school every day. It's their normal life. But in other parts of the world, we are starving for education... like a precious gift. It's like a diamond. - Malala Yousafzai*

## స్ఫూర్తి:

ఉత్తరప్రదేశ్‌లోని మారు మూల గ్రామంలో ఒక సాధారణ కుటుంబంలో పుట్టాడు ఈ అబ్బాయి. చాలా బలహీనంగా వుండేవాడు. ఒక తమ్ముడు. నాయన చిన్నప్పుడే చని పోయారు. కానీ తల్లి చిన్న పనులు చేసుకుంటూ ఇద్దరి పిల్లలను ఎంతో ప్రేమగా చూసుకునే వారు. కానీ పూట గడవడం కష్టంగా ఉండేది. ఆవిడ తండ్రిగారు పరిస్థితిని గమనించి తన ఇంటికి తీసుకెళ్ళాడు. వారిది కూడా అంత ఉన్న కుటుంబమేమీ కాదు. అయినా సరే, చిన్న పిల్లల్ని చాలా గారాబంగా పెంచారు. ఊళ్ళో వున్న ప్రభుత్వ బడికి వెళ్ళి చదువుకునే వాళ్ళు. అమ్మ ఎప్పుడూ చెప్తుండేది. నాయనా మన కుటుంబ పరిస్థితి బాగుపడాలంటే చదువుకోవడం ఒక్కటే మార్గం అని. చిన్నప్పటి నుండి చాలా శ్రద్ధగా చదివే వాడు. కొన్నేళ్ళకు ఉన్నత పాఠశాలకు వెళ్ళాల్సి వచ్చింది. కానీ ఆ స్కూల్ కి వెళ్ళాలంటే మధ్యలో నది దాటి వెళ్ళాల్సి వచ్చేది. బోటుకు డబ్బులు అవసరం అయ్యేవి. ఇంట్లో అడగాలంటే బాధ...స్కూల్ నచ్చలేదు ఎందుకంటే వెళ్ళడం కష్టం. కానీ తన కుటుంబ పరిస్థితులు ఆ చిన్నారిని ఆలోచింప చేశాయి. ఈత నేర్చుకున్నాడు. రోజూ ఆ నదిని ఈదుకుంటూ దాటి బడికి వెళ్ళేవాడు. ఆ తరవాత బెనారస్ విశ్వవిద్యాలయం లో ఉన్నతవిద్యను అభ్యసించినారు. నిరాడంబరతకు నిలువెత్తు రూపంగా... జాతికి స్ఫూర్తి నింపే అత్యుత్తమ దేశ నాయకుడిగా... మనకు రెండవ ప్రధానమంత్రిగా సేవలు అందించారు. ఎవరో తెలుసా... భారతరత్న శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి గారు. పిల్లలూ ఇప్పుడు చెప్పండి... చదువుకునేందుకు మీరు పైన పేర్కొన్న సమస్యలు...అంశాలు... ఫిర్యాదులు సరైనవి అనే అనుకుంటున్నారా?





# 49. అమ్మా నాన్న నేను అడిగింది ఇవ్వలేదు




## సమస్య:

*ఇంట్లో ఎప్పుడు చూసినా అన్నింటికీ నియంత్రణే ఉంటుంది. అవసరమైంది అడిగింది ఏదైనా సరే ఇవ్వరు. బాగా కోపంగా ఉంటుంది. ప్రతి దానికీ అరచి రాద్ధాంతం చేయాల్సిందే. నేను చేయాలన్న ప్రతి దానికీ అడ్డు పడతారు. తల్లిదండ్రులెప్పుడూ నన్ను అర్థం చేసుకోరు... ప్రోత్సహించరు...మేము అడిగింది ఇవ్వరు. అలాంటప్పుడు మమ్మల్ని ఎందుకు కన్నారో అర్థం కాదు. చివరికి ఒక పెన్ను, పుస్తకం కొందామన్నా తెచ్చివ్వడానికి అదేదో ఎవరెస్ట్ ఎక్కినంత కష్ట పడతారు. ఇలాంటి పరిస్థితులలో అసలు చదవటం అవసరమా...కనీసం మంచి బట్టలు కూడా ఉండవు... స్నేహితులతో బయటకు వెళ్ళడానికి లేదు... సినిమా లేదు...షికారు లేదు... అంతెందుకు సైకిల్ కూడా లేదు! అసలు నాకు చచ్చి పోవాలని వుంది. చదవాలని నాకెంత మాత్రం లేదు.*

## వివరణ:

పిల్లలూ! ఏమివ్వాలంటారు? మీరు ఉండటానికి ఇల్లు...తినడానికి తిండి...కట్టుకోవడానికి బట్ట, చదువుకోవడానికి స్కూల్...వాళ్ల గుండెల్లో మీరు ఎదగాలన్న ఆపేక్ష. ఇంకేం కావాలి? మీకు అసలు తెలుస్తుందా మీరు ఎంత అదృష్టవంతులో! అసలు అతి బీద వాళ్ళ పిల్లలు ఎలాంటి పరిస్థితుల్లో బ్రతుకుతున్నారో తెలుసా... పాలు త్రాగే పసి బిడ్డలను ఇంట్లో వదిలి పనికి వెళితే, వాళ్ళు ఏడిస్తే...అల్లరి చేస్తే...

చూసుకునే వాళ్ళు  ఎవరు లేరని ఆ పిల్లలకు కల్లు త్రాగించి మత్తులో పడుకోబెట్టి ఇల్లు గడవడానికి కష్టపడే తల్లి తండ్రులను చూశాను.

పెట్టే బేడా నెత్తినేసుకుని ఎక్కడ పని దొరికితే అక్కడికి వెళ్ళే వలస కార్మికులను ఎప్పుడైనా చూశారా? వేరే రాష్ట్రాల వాళ్ళు కూడా ఉంటారు. మీకైనా ఇల్లో గూడో ఉంటుంది...వాళ్ళకు పూరి గుడిసెలు కూడా ఉండవు. ఒక్కో సారి నిర్మాణంలో ఉన్న భవనాల మధ్యలో జీవనం సాగిస్తూ ఉంటారు. వాళ్ళ పిల్లల గతి ఏమిటో మీకు తెలుసా? కనీసం తినడానికి తిండి...కట్టడానికి బట్ట కూడా ఉండదు వారి పిల్లలకు. ఎక్కడ పడితే అక్కడ దుమ్ములో తిరుగుతూ...ఏది దొరికితే అది తింటూ... ఆడుతూ... పాడుతూ... చాలా అపరిశుభ్రంగా... చిన్నప్పుడే జీవితమంతా కోల్పోయి బ్రతికేస్తుంటారు.

అవసరాలకు... ఆడంబరాలకు వ్యత్యాసం పిల్లలందరూ గుర్తించాలి. ఉన్నత తరగతి, మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి, బీదరికము, అతి బీదరికముల మధ్యనున్న వ్యత్యాసం కూడా మనము గుర్తించాలి. మన మధ్య / ఎగువ తరగతి పిల్లలకు చదువుకోగలగడం నిజంగా ఒక వరంగా చెప్పుకోవాలి.

దేశంలో సుమారు 7 దశాబ్దాల స్వాతంత్రం తరవాత కూడా కొన్ని లక్షల మంది పిల్లలకు చదువు ఈ రోజుకు కూడా అందని ద్రాక్ష పండే అంటే మీరు నమ్ముతారా? ఇప్పటికీ కనీస సౌకర్యాలకు నోచుకోక అతి కష్టముమీద చదువుకునే పిల్లలున్నారు అంటే మీరు నమ్ముతారా?

మొన్న ఆ మధ్య పేపర్ లో వచ్చింది...ఒక మారు మూల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాలికలకు కనీసం మరుగు దొడ్లు కూడా లేని దుస్థితి. ఒకే ఒక మరుగుదొడ్డి పేరుకు. కానీ దానికి మరుగు ఏమాత్రం లేదు...అంటే వుండాల్సిన డోర్ కూడా లేదు. అమ్మాయిలు తమ దుప్పట్టాలను ఇద్దరు ఆ వైపునుండి ఈ వైపుకు పట్టుకుంటే ఒక అమ్మాయి మరుగు దొడ్డి ఉపయోగించే దుస్థితి.

మేము అభయ సంస్థ నుండి డెక్కన్ ఎంట్రప్రైసెస్ వారి సామాజిక సేవా బాధ్యత క్రింద భాగ్యనగరానికి అతి సమీపంలో పటన్ చెరువు దగ్గరలో బాహ్య వలయ రహదారిలోనున్న సుల్తాన్ పూర్ గ్రామంలో సేవలు చేస్తున్నాము. స్కూల్ ని సందర్శిస్తే తెలిసింది...సుల్తాన్ పూర్ లాంటి గ్రామంలో ప్రతి గ్రామస్థుడు భూములు అమ్ముకుని దర్జాగా ఇళ్ళు కట్టుకుని బ్రతుకుతున్న ఈనాటి పరిస్థితుల్లో కూడా సమీపము లో 5 కిలోమీటర్ల దూరంలో విసిరి వేయబడినట్టుగా వుండే చిన్న తండాల నుండి చదువుకునే ఆశతో సుమారు 50 మంది చిన్నారి బాల బాలికలు నడుచుకుంటూ వస్తున్నారు. బాహ్య వలయ రహదారి దాటి సైకిల్ మీద వచ్చేంత నైపుణ్యం ఇంకా ఆ పిల్లల్లో లేదు. ఇప్పుడు వాళ్లకు అవసరం ఏంటి... కావాల్సింది ఏంటి? చెప్పండి పిల్లాలూ! ఇది గమనించిన సుల్తాన్ పూర్ గ్రామ సర్పంచ్ ఎంతో దయతో బోల్డంత వనరులు ఖర్చు చేసి కొన్ని ఆటోలు మాట్లాడి అందులో పిల్లలను బడికి వచ్చే ఏర్పాటు చేశారు.

అలాగే, తల్లి తన పుట్టినరోజు పండుగకు అడిగిన డ్రెస్ కొనలేదని... తండ్రి తనకు స్మార్ట్ ఫోన్ ఇవ్వలేదని... ఇంట్లో తనకు ఇష్టమైన ఛానల్ చూడనివ్వలేదని... తన వయసుకు సరిపోని స్నేహం వలదన్నారని... తనకు నచ్చని కూర చేశారని... TV చూడవద్దు అన్నారని... ఇలా అతి చిన్న విషయాలకే అఘాయిత్యము చేసుకుంటున్న పిల్లలను చుట్టూతా సమాజములో మీరు కూడా చూసే ఉంటారు. చెప్పండి మనము ఇంత దిగజారి పోయామా పిల్లలూ. ఇంత చిన్న విషయాలే మనలను అంతలా ఏడిపిస్తే రేపు నిజంగా పెద్ద సవాళ్ళు ఎదురయితే ఏమి అవుతుందో ఆలోచించండి.

ఇక్కడ మనము చూడాల్సింది...ఏ విషయం. పిల్లలకు కావలసినవి ఏమిటంటారు?...ఖరీదైన బట్టలు, పుస్తకాలు, పెన్నులు, సైకిళ్ళు, స్మార్ట్ ఫోన్లు ఇలాంటివా లేక చదువు కోవడానికి కనీస అవసరాలా? చెప్పండి.

పిల్లలూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సమస్తము ప్రభుత్వమే చూసుకుంటోంది. చదువుకునే పుస్తకాలు, ఏక రూప వస్త్రాలు, మధ్యాహ్న భోజనం, అమ్మాయిలకు శానిటేషన్ సామగ్రి ఇలా ఇంకెన్నో సమకూరుస్తోంది. తల్లిదండ్రులకు కూడా సాధ్యం కానివెన్నో చేస్తోంది. అయినా ఇంకేదో కావాలి అని చిన్న పనులు, ఉద్యోగాలు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న తల్లిదండ్రులను డిమాండ్ చేయడం ఏ విధంగా చూసినా హర్షించదగినది కాదు.

## సూచనలు:

1. *ఇంట్లో వున్న పరిస్థితులను గమనించండి.*
2. *అసలు ఇంట్లో ఆదాయ వ్యయాలను తెలుసుకోండి.*
3. *మీరు అడుగుతుంది అవసరమా లేక ఆడంబరమా నిజాయితీగా గుర్తించండి.*
4. *ఒక వేళ అవసరమే అయినా... ఇంట్లో తల్లి తండ్రులకు అది తీర్చే స్థోమత వుందా?*
5. *ఆ అవసరాన్ని నువ్వే నీ స్థోమతతో తీర్చుకో గలవా? ఆలోచించు*
6. *నువ్వు కూడా తీర్చుకోలేక పోతే... అది నిజంగా అవసరమా లేక అది లేకపోతే నీ చదువు ఆగి పోతుందా గమనించు.*
7. *చదువుకు సంబంధం లేదంటే హ్యాపీగా ముందుకు సాగు.*
8. *లేదంటే ఆర్థిక ఇబ్బందులు అంశము క్రింద చేసిన సూచనలు పాటించు.*

## ప్రేరణ మంత్రం:

*Never complain about what your parents couldn't give you. It was probably all they had.*

## స్ఫూర్తి:

ఈ కథలో అబ్బాయి మెదక్ జిల్లా లోని ఒక మారుమూల గ్రామం నుండి హైదరాబాద్ కు వచ్చాడు. తల్లిదండ్రులకు పెళ్ళైన చాలా కాలానికి పుట్టడం వలన, తనకు 15 ఏళ్ళు వచ్చే సమయానికి నాన్నకు 60 అమ్మకు 50 వచ్చేశాయి. కుటుంబం అంతా వలస వచ్చేసి, గాంధీనగర్ లోని ఒక అపార్ట్మెంట్‌లో వాచ్‌మాన్‌లాగా బ్రతకడం మొదలు పెట్టారు. పిల్లాడు ఇంటికి దగ్గరున్న ప్రభుత్వ పాఠశాలలో చదువుకునేవాడు. బాగా శ్రద్ధగా చదివే వాడు. చురుగ్గా ఉండేవాడు. అమ్మ నాన్నల వయసు రీత్యా వేరే ఏ పని చేయలేక పోయే వాళ్ళు. తనకు అవసరమైనది కావాలని అడిగినా, వాళ్ళకు అది శక్తికి మించిందే అని గ్రహించాడు. అంత చిన్న వయసులో అపార్ట్మెంట్ సెల్లార్ లో పార్క్ చేసిన ఫ్లాట్స్ వాళ్ళ బండ్లు తుడిచే వాడు... నీళ్లు తెచ్చి ఇచ్చేవాడు... అలా నెలకు 300 సంపాదించే వాడు. తనకు కావాల్సిన అవసరాలు తీర్చుకునేవాడు. ఆడంబరాలకు ఎప్పుడూ వెళ్ళలేదు. తల్లిదండ్రులను ఎప్పుడు అది కావాలి ఇది కావాలి అని అడగలేదు. వీలయితే వాళ్లకే తను ఏదైనా మందులు తెచ్చి ఇచ్చేవాడు.

10 వ తరగతి చాలా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. మారేడ్ పల్లి లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితముగా ప్రవేశం దొరికింది. కాలేజ్



వదలగానే దగ్గర్లో వున్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఒక 2 గంటలు నీళ్ళ బాటిళ్ళు వచ్చి పోయే రైళ్ళలో వాళ్ళకు అమ్ముతూ...రోజుకు 200 సంపాదించేవాడు. ఒక 50 తన అవసరాలకు పెట్టుకుని మిగతాది ఇంట్లో ఇచ్చేసేవాడు.

తరవాత అభయ సంస్థకు సాయం కోసం వచ్చాడు. అతనిలో వున్న నిజాయతీ, నిరాడంబరత, పట్టుదల, కష్టించే తత్వము చాలా ముచ్చటేసి అభయ వాళ్ళు అతనికి చేయూతనిచ్చారు. ఇక వెను తిరిగి చూడలేదు. కళాశాలలో మొదటి స్థానంలో నిలచి, కాలేజ్ లో నిర్వహించే ఉద్యోగ నియమాకాలలో ADB సంస్థలో 18 సంవత్సరాలకే ప్రవేశం సంపాదించాడు. 5 ఏళ్ళు అద్భుతంగా పని చేశాడు. ఒక మంచి అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. తల్లి తండ్రులను పని మాన్పించేసి ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. తదుపరి IBM లో ఉద్యోగం. ఒక ఇల్లు కట్టుకున్నాడు. సుఖ సంతోషాలతో బైరంగుడా లో జీవనం సాగిస్తున్నారు. అభయకు ప్రతి నెలా తన వంతు సాయం అందుస్తున్నాడు.

అవసరం ఏది... ఆడంబరము ఏది అని తెలిసి ప్రవర్తిస్తే జీవితం ఎలా విజయ పథంలో నడుస్తుంది అనడానికి ప్రత్యక్ష నిదర్శనం ఆరోల్ల నరసింహ.





# 50. ఉపాధ్యాయుల ప్రవర్తన సరిగ్గా లేదు



**సమస్య:**

అయ్యా!
బడిలో కొందరి ఉపాధ్యాయుల తీరు బాగాలేదు.
తరగతిలో కొందరి మీదనే దృష్టి పెడతారు
సందేహాలు అడిగితే హేళన చేస్తారు
రెండోసారి అడిగితే కోపగించుకుంటారు
తరగతిలో పక్షపాత ధోరణితో ఉంటారు
ఆడ పిల్లలతో వారి ప్రవర్తన ఆక్షేపణీయంగా ఉంది
చెప్పింది చెయ్యకపోతే కక్ష సాధింపు ఉంటుంది
మనసులో ఏదో పెట్టుకుని మార్కులు వేస్తారు
చిన్న చిన్న పొరపాట్లకే చేయి చేసుకుంటున్నారు
మా హాస్టల్‌లో పరిస్థితి ఘోరంగా ఉంటుంది
ఉపాధ్యాయుల ప్రవర్తన వలన మా చదువులకు విఘాతం అవుతోంది.

## వివరణ:

వ్యక్తుల వృత్తులను నియంత్రణ చేయవచ్చును కానీ ప్రవృత్తులను ఎవరు నియంత్రణ చేయగలరు? చాలా సందర్భాలలో పిల్లలు అందరూ ఉన్నప్పుడు కాకుండా, ప్రత్యేకంగా నా దగ్గరకు వచ్చి ఈ సమస్యలు ఏకరవు పెట్టినప్పుడు ఎంతో బాధ అవుతుంది. ఇలాంటి ఉపాధ్యాయులు కూడా వున్నారని తెలుసుకున్నప్పుడు ఆ పిల్లల మీద జాలి కలుగుతుంది. అయ్యో, ఇంత క్లిష్టమయిన పరిస్థితుల్లో కూడా పిల్లలు ఎలా చదవాలో అన్న ఆలోచన చేస్తున్నారు కదా అనిపిస్తుంది. ఇలాంటి సమస్యలను పిల్లలు ఏ విధంగా ఎదుర్కోవాలో కొంత తప్పక చర్చిద్దాం. అయితే ఉపాధ్యాయులను మీరేమైనా తప్పుగా అర్థం చేసుకుంటున్నారా అన్నది ముఖ్యంగా గమనించాలి. ఎందుకంటే చాలా సందర్భాల్లో పిల్లల ప్రవర్తన మూలంగానే ఉపాధ్యాయులు ప్రతిస్పందిస్తుంటారు.

మన సంస్కృతిలో తల్లిదండ్రుల తరవాత స్థానం గురువులదే... ఆ తరవాతనే దేవుడు అని చెప్పారు. అంటే అంత ప్రముఖమైన స్థానాన్ని ఉపాధ్యాయులకు ఇచ్చింది మన ధర్మం. కారణం తల్లిదండ్రులు కూడా చేయలేని మహత్కార్యాన్ని ఉపాధ్యాయులు మాత్రమే చేయగలరు. దేశ భవిష్యత్తును మార్చి వ్రాయగల సామర్థ్యం వారిది. వారు తలుచుకుంటే ఏమీ లేని మెదడులో కూడా ఏమైనా ఎక్కించగలరు.

ఇంట్లో తల్లులు బాగా లేకుంటే... కేవలం ఆ తల్లి పిల్లలే తప్పుడు మార్గం పట్టే అవకాశం ఉంది. అదే తరగతిలో ఒకే బెంచిలో కూర్చునే నలుగురు పిల్లల్లో ఒక పిల్లాడు అల్లరి వాడయితే, తప్పక మిగితా ముగ్గురు పిల్లలు వాడి వలన ప్రభావితం అవుతారు. ఇక ఒక తరగతిలో ఉపాధ్యాయుడు సరిగ్గా లేకపోతే వారు స్కూల్‌లో వెళ్ళే ప్రతి తరగతిలోని విద్యార్థులు కూడా పెడమార్గం పట్టడానికి అవకాశం వుంది. సరాసరి 200 మంది విద్యార్థులు సంవత్సరానికి వీరి వలన తప్పుడు మార్గములోకి వెళ్ళే అవకాశము లేక పోలేదు. ఒక ఉపాధ్యాయుడి దుష్ప్రవర్తన ప్రభావం వారు ఉద్యోగం చేసే 30 సంవత్సరాలలో ఇలా ఒక 6000 మందిని ప్రభావితం చేయొచ్చు. ఆ ఆరువేల మంది ఎన్ని వేల, లక్షల మందిని దుష్ప్రభావితం చేసే అవకాశం ఉన్నదో గమనించాలి.

ఉపాధ్యాయులు అందరూ ఈ విషయాలను గమనించి ప్రవర్తించాలి. ఈ రోజుల్లో సామాజిక మాధ్యమాలు చాలా చురుకైన పాత్ర పోషిస్తున్నాయి. ఉపాధ్యాయులు చేసే ప్రతి తప్పుడు పనిని ఎవరో ఒక పిల్లాడు నిలదీస్తే... ఇక వారి ప్రవర్తన దేశంలోని అన్ని మూలలకు 10 నిముషాలలో ప్రాకి పోతుంది. ఇలాంటి ప్రవర్తన వలన ఎంతో గొప్ప ప్రతిభ వున్న ఉపాధ్యాయులు అయినా చరిత్ర హీనులుగా మారి పోవాల్సిందే.

అనాది కాలం నుండి భారత దేశంలో గురువులకు ఒక విశిష్టమైన స్థానం వుంది. గురువులు విద్యార్థులందరినీ తమ స్వంత పిల్లల్లాగానే చూసుకునే వారు. రాజైనా, పేదైనా అందరికి సమానంగా బోధించే వారు. కానీ వర్తమాన కాలంలో బోధనా విధానం అంతంత మాత్రమే వుంది... దానికి తోడు ఇలాంటి ఉపాధ్యాయుల ప్రవర్తన తోటి చాలా చోట్ల విద్యార్థులు మంచి దేశ పౌరులుగా పరివర్తన చెందలేక పోతున్నారు.

### సూచనలు:

*1. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి మొ॥ వారి ఫోన్ నంబర్లు మీ దగ్గర ఉంచుకోండి.*

*2. తరగతి గదిలో ఎవరి తీరు లేక ప్రవర్తన బాగా లేకపోయినా వెంటనే పై అధికారులకు తెలియ చేయండి. ఉపేక్షించవద్దు.*

*3. ఏది జరిగినా దాయకుండా ఎప్పటికప్పుడు*

ఇంట్లో వాళ్ళకు తెలియ చేయడం మరవద్దు
4. పక్ష పాత వైఖరి, కొద్ది మందిని మాత్రమే ప్రత్యేకించి చూడటం, అనవసరంగా దండించడం లాంటి ప్రవర్తన ఆమోద యోగ్యం కాదు. వెంటనే స్పందించడం మరవద్దు.
5. మితి మీరిన ప్రవర్తన ఏదైనా దండనార్హమే అని గుర్తించి జాగ్రత్తగా మసలుకోవాలి.
6. మీలో నిద్రాణమై వున్న చైతన్యాన్ని నిద్ర లేపి, నాయకత్వ పటిమకు పదును పెట్టండి. తప్పు చేసినట్లు తెలిస్తే ఎవరినీ ఉపేక్షించవద్దు.
7. ప్రస్తుత పరిస్థితులలో చాలా జాగ్రత్తగా మసలుకోవాలి.
8. మీకు నెప్పి కలిగిందని... మీకు అవమానం కలిగిందన్న నెపంతో చదువు మానేయడం వలన మీరు సాధించిందేమి లేదు...రెట్టింపు పట్టుదలతో ఇంకా బాగా చదవాలి. అలా కాకపోతే ఎవరో ఆడిన ఆటలో మీరు ఓడినట్లు అవుతుంది.

## ప్రేరణ మంత్రము:

*O Teacher! if you run, the students will walk, if you walk, the students will sit, if you sit, the students will sleep, if you sleep, the students will die, the whole nation will die.*

## స్ఫూర్తి:

పిల్లలూ, ఒక సారి ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు కొందరు తరగతి గదిలో ఉపాధ్యాయుడు లేని సమయంలో మాట్లాడుకుంటూ పల్లీలు తిన్నారు...తిని ఆ పల్లీల పొట్టును అక్కడే పడేసారు. ఉపాధ్యాయుడు వచ్చిన తరవాత పల్లీల పొట్టును చూసి ఎవరు ఆ పని చేసింది చెప్పమని అడిగాడు. ఎవరూ ఏమీ మాట్లాడ లేదు. ఆయనకు కోపము వచ్చేసింది. బెత్తం తీసుకుని మొత్తం విద్యార్థుల చేతులు చాపమని కొట్టడం మొదలెట్టాడు. కానీ ఒక విద్యార్థి వంతు వచ్చేటప్పటికి...ఆ పిల్లాడు ధైర్యంగా...అయ్యా ఆ పల్లీలు నేను తినలేదు...పొట్టు నేను చల్ల లేదు. అటువంటప్పుడు నన్ను ఎందుకు శిక్షిస్తారని అని అడిగాడు. ఉపాధ్యాయుడికి పట్టరాని కోపం వచ్చింది. బలవంతంగా బెత్తంతో చేతి మీద కొట్ట బోయాడు. ఆ పిల్లాడు ఎంతో ధైర్యంగా ఆ బెత్తాన్ని గాలిలోనే పట్టుకుని, నిర్భయంగా చెప్పాడు... నేను తప్పు చేయనప్పుడు శిక్ష వేయడం అధర్మం అని. ఆ బాలుడి ధైర్యానికి అచ్చెరువొందిన ఉపాధ్యాయుడు ఏమీ అనలేక మౌనంగా వుండి పోయాడు. అంత చిన్న వయసులోనే ఉపాధ్యాయుడి తప్పును సహించలేక ధైర్యంగా నిలచిన ఆ బాలుడెవరో తెలుసా... స్వరాజ్యం నా జన్మ హక్కు అని ఎలుగెత్తి చాటిన బాలగంగాధర తిలక్.



ఇలాంటి సంఘటనలు... ఉపాధ్యాయుల తీరు సరిగ్గాలేనప్పుడు సరి అయిన రీతిలో ఎదుర్కొన్న వారిలో చాలా మంది మహానుభావులున్నారు. దేశ నాయకుల కథలను తెలుసుకోండి... ఎంతో స్ఫూర్తి కలుగుతుంది.

పిల్లలూ, మీకందరికీ ప్రహ్లాదుని కథ తెలుసును కదా... చండా మార్కులు ఆచార్యులై హిరణ్యకశిపుడి ఆదేశం ప్రకారం ముక్కుపచ్చలారని ప్రహ్లాదునికి విద్య గరిపే

రీతి సరిగ్గా లేనప్పుడు...అతి చిన్న వాడైనా ప్రహ్లాదుడు వారికి ఏ విధంగా బుద్ధి చెప్పాడో తెలుసు కదా! హిరణ్యకశిపుడే భగవంతుడు అనీ, అతనికే పూజలు చెయ్యమని చెప్పినపుడు ప్రహ్లాదుడు 'తల్లిదండ్రులు ప్రత్యక్షదైవములు కనుక నా తండ్రిని తండ్రిగా గౌరవిస్తాను. తండ్రిరూపములోనున్న దైవముతో భక్తి కలిగి ఉంటాను. కానీ, మీకు, నాకు, సర్వజగత్తుకు శ్రీహరే భగవంతుడు. శ్రీమన్నారాయణుడినే దైవంలా ప్రార్థిస్తానని చెప్పాడు.

రోల్ మోడల్స్: నిజానికి ఎందరో విద్యార్థులు వారి ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకొని ఎన్నో రంగాలలో విశేష కృషి చేసి, పరిశోధనలు చేసి పేరు తెచ్చుకున్నారు. దేశానికి కీర్తిని కలిగించారు. విద్యార్థులకు తమ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు రోల్‌మోడల్స్‌గా ఉంటారు.

స్వామి వివేకానందకు ఆయన గురువు శ్రీ రామకృష్ణ పరమహంస ఆదర్శము. ఎందరికో శ్రీ రమణ మహర్షి ఆదర్శము. మనందరికీ జగద్గురువులు ఆదర్శము.

ఆ మధ్యకాలంలో, డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో సమావేశం... కదిరిలో అనుకుంటాను. ఒక విద్యార్థి అడిగింది. స్వామీ మీ రోల్ మోడల్ ఎవరు అని?

నేను చాలా సరదాగా చెప్పినా... సరి అయిన విధంగా సమాధానం చెప్పాను.

అమ్మాయీ... పుట్టిన వెంటనే అమ్మ, పెరుగుతున్నప్పుడు నాన్న, చదువుతున్నప్పుడు పాఠం చెప్పిన గురువు, పెరిగి పెద్దవతున్న సమయంలో మంచి పనులు చేస్తున్న నాయకులు, యువకుడిగా ఎదుగుతున్న సమయంలో కేవలం నటనే కాక సమాజ సేవలో వున్న చిత్ర నటులు, మలి దశలో దేశ సేవ చేస్తున్న దేశ నాయకులు, చివరి దశలో సమాజంలో మార్పు కోసం శ్రమించే ఆధ్యాత్మిక వేత్తలు ఇలా ఎందరో వున్నారు. అందుకే ఎప్పటికప్పుడు నేను సరి అయిన జీవిత పాఠాలు మరియు గుణ పాఠాలు నేర్చుకో గలుగుతున్నాను.

ఆ మాటలు విని అందరూ చాలా ఉత్సాహంగా చప్పట్లు కొట్టేసారు. నా అభిప్రాయం ఏమిటి అంటే...జీవితములో ప్రతి దశలోనూ ఆదర్శ మూర్తులు వుండాలి అని.

# 51. యాజమాన్యం ప్రవర్తన సరిగ్గా లేదు




## సమస్య:

*సార్, నేను చదువుతున్న పాఠశాల ప్రయివేటు వ్యక్తులు నడుపుతున్నారు. వారికి విద్యార్థులు అంటే కేవలం డబ్బులు ఇచ్చే వస్తువులే తప్ప ప్రాణం ఉన్న మనుషులు కాదు. బడికి వెళ్ళడం ఆలస్యమైనా... చదవలేక పోయినా మమ్మల్ని బండ కేసి బాదడం... మమ్మల్ని మార్కులు తెచ్చుకునే మర మనుషుల్లాగా చూడటమే తప్ప...పిల్లల ఆట పాట మాట నీతి గతి స్థితి ఇలా ఏమీ ఎవ్వరికీ పట్టదు. అసలు ఇలాంటి స్కూల్‌లో చదవడం కంటే చావడం మేలన్న భావం కలుగుతుంది.*

## వివరణ:

పూర్వం ఋషి కులాలు వుండేవి. అక్కడ అత్యంత రమణీయమైన ప్రకృతి వనరులు, మనసును ఆహ్లాద పరచే అవాసాలు, వాత్సల్యముతో బోధించే గురువులు, అందరినీ సమానముగా చూసే దృక్పథం, విద్య జీవిత పరమావధికే గాని జీవించుటకు కాదన్న ఆదర్శము, సర్వ శాస్త్ర బోధన, సకల శాస్త్ర ప్రావీణ్యత ఇలా ఎంతో అద్భుతమైన ఆదర్శములతో విద్యాభ్యాసం జరిగేది. అందుకే ఆనాడు అందరూ సర్వోత్తమమైన స్థాయిలో ఉండేవాళ్ళు.

కానీ, ఈ రోజు... ఋషికులాలు కాస్తా స్కూల్స్ లా మారిపోయి, విద్యాబోధన అంతా యాజమాన్యానికి ధనార్జనే ధ్యేయంగా సాగుతుంటే...విద్యాభ్యాసం కోసం వచ్చే పిల్లలు అందరూ చదువు తప్ప ఇంకేమి నేర్చుకోలేక...జీవితాల్లో సుఖ సంతోషాలు కోల్పోయి వివాదాలతో సర్వోన్నత న్యాయస్థానానికి చేరుతున్నారు. అప్పుడు పిల్లలు పెద్దవాళ్ళుగా మారక ముందే సుప్రీం

స్టేజికి చేరే వాళ్ళు... ఇప్పుడు పిల్లలు పెద్దయిన తరవాత వివిధ రకాలైన వ్యాజ్యాలతో సుప్రీంకోర్టుకు చేరుతున్నారు. దీనికి ప్రధానమైన కారణం పాఠశాలల యాజమాన్యము ప్రవర్తన మాత్రమే అని చెప్పక తప్పదు.

ఈ పరిస్థితికి కేవలం యాజమాన్యం తీరునే ఆక్షేపించలేము... ఒకింత తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకోవాలి. అసలు పిల్లలలో ఆరోగ్య కరమైన ఎదుగుదల గురించి ఆలోచించడం మానేసి...అన్నీ రెడీ మేడ్ గా జరిగి పోవాలని ఆశిస్తున్నారు. పుట్టిన పిల్లాడిని ఇంకా అమ్మ కడుపులో వుండగానే... వాడి తలరాతను బలవంతంగా వ్రాసేసి, ఇక వాడి ఇష్టాఇష్టాలు, తీరు తెన్నులు, తెలివి తేటలు, జీవన శైలి... ఇవేవీ పట్టించుకోకుండా... ఏ కళాశాల ట్రాక్ రికార్డ్ ఎలా వుందో తెలుసుకుంటూ పిల్లాడికి ఖచ్చితంగా అక్కడే చేర్పించాలని పరుగులెత్తుతారు. ఇలాంటి తల్లిదండ్రులకు ఆశలు చూపించి, ఇక ఆ పిల్లాడిని తీర్చి దిద్దే క్రమంలో వాడిని ఒక వస్తువు కింద లెక్కేసి... చెక్కేసి... రక్కేసి... రాసేసి... కిందేసి... మీదేసి చదువు పేరుతో నానా రకాలుగా ఒక అద్భుతముగా మార్చే ప్రయత్నం చేస్తుంటారు కళాశాలల యాజమాన్యాలు.

ఈ సమస్యకు పరిష్కారం తల్లిదండ్రుల ఆలోచనలో మార్పు వస్తేనే వస్తుంది.

యాజమాన్యాలు తల్లిదండ్రుల expectationsని చేరుకోవడానికి academics ని రూపొందిస్తున్నారు.

**ఉదాహరణకు:** ప్రైవేటు రెసిడెన్షియల్ కాలేజీల్లో లేదా స్కూళ్ళల్లో చదువుతున్న విద్యార్థుల గురించి తల్లిదండ్రులు ఫోన్ చేసి అడిగే విషయం ఏంటంటే మా పిల్లల్ని బయటకి పంపకూడదు!, ఆదివారం కూడా పరీక్షలు పెడుతున్నారా? మరీ ముఖ్యంగా మా వాడికి మార్కులు ఎక్కువ రావడం లేదు ఎందుకు? వాడిని రాత్రి 9 లేదా 10 వరకు చదివిపిస్తున్నారా?? అని అడుగుతారు. వీటిని చేరుకోవడానికి పిల్లలను యంత్రాలుగా చేసి జీవితాన్ని యాంత్రికంగా మార్చేస్తున్నారు యాజమాన్యం. మధ్యతరగతి వారు పోటీ ప్రపంచంలో కొట్టుకుపోతున్నారు కానీ తమ పిల్లలే పోటీని సృష్టించేలా చేయడం లేదు.

ఫలాని పాఠశాలలో యాజమాన్యం ప్రవర్తనతో విసిగి పారి పోయిన పిల్లాడి సమాచారం

బోధనా సిబ్బంది క్రమశిక్షణ కు తాళలేక ఆత్మ హత్య చేసుకున్న విద్యార్థి ఫ్లాష్ న్యూస్

హాస్టల్ వార్డెన్ పెడుతున్న బాధలు భరించలేక పోలీసు ఫిర్యాదు చేసిన విద్యార్థిని దీన గాథ

మంచిగా చదివే పిల్లలకు వల వేసి మొదటి సంవత్సరం చేరినప్పుడు డిస్కౌంట్ అని చెప్పి... ఆ తరవాత సంవత్సరం నుండి రెట్టింపు ఫీజు తీసుకునే యజమానుల విష సంస్కృతి.

ఫీజు కట్టలేదన్న నెపంతో పిల్లలను రకరకాలుగా హింసించే వాళ్ళ తీరు

చదువు తప్ప వేరే ప్రపంచానికి ముక్కు పచ్చలారని పిల్లలను ఏ విధంగా దూరం చేస్తున్నారో ఆ మధ్య సామాజిక మధ్యమాలలో ఎంతో మంది తమకు తోచిన విధంగా ఎన్నో విషయాలు చెప్పటం కూడా మనం చూస్తూనే వున్నాం.

ఇలా ఇవన్నీ కూడా క్షమించరాని తప్పులే... కానీ వీటన్నింటికి కారణం ఎవరు? అతి గొప్ప ఆశలతో, తమ పిల్లలను ఫలాన పాఠశాలలో చేరిస్తే విజయం తథ్యం అని ఉరికెత్తుతున్న తల్లిదండ్రులదా లేక వారి ఆశలు నిజం చెయ్యడానికి నిరంతరం తమదైన రీతిలో శ్రమిస్తున్న యాజమాన్యందా?

ఆ మధ్య కాలంలో దేశ వ్యాప్తంగా విడుదల అయిన 3 ఇడియట్స్ సినిమా చాలా మటుకు మీరు చూసే వుంటారు. అందులో కథానాయకుడు చదువుకునే సమయంలో తన కళాశాలలో ఎంతగా ఇబ్బందులు

పడతాడు అన్నది యాజమాన్యం, ఆచార్య బృందం, తోటి స్నేహితులు ఇలా అందరూ చేరి వర్తమాన విద్యావిధానం గురించి చాలా హాస్యాస్పదంగా చూపించారు.

మొదటి భాగంలో నేటి విద్యా విధానం మీద సునిసిత విమర్శలు చేసిన దర్శకుడు...మలి భాగంలో ఒక ఆదర్శమైన విద్యా విధానం ఎలా వుండాలో కూడా చూపించే ప్రయత్నం చేస్తాడు. నిజానికి ఈ సినిమా అందరి మన్ననలు అందుకుని...చాలా భాషలలో కూడా అనువదించబడింది. కానీ అందరూ వినోదంగా చూసారు కానీ...ఇంటికి వచ్చి మళ్ళీ మామూలుగానే తమ పిల్లలను చాకిరేవులకే పంపించారు.

పిల్లలూ, మీరంతా ఒక్కటి గుర్తుంచుకోండి... అద్భుతమైన జీవితాన్ని మీరు ఆస్వాదించాలి అనుకుంటే...రేపు ఉత్తమ పౌరులుగా ఎదగాలంటే, మీరు చదువుకోవాలని అనుకునే విద్యాలయాలను ఆసాంతం గమనించి, యాజమాన్యం ప్రవర్తన పరిశీలించి, లోతుగా అధ్యయనం చేసిన తరువాతే నిర్ణయాలు తీసుకోండి.

ఒక వేళ, మీకు తెలియకుండా నాణ్యత లేని విద్యాలయంలో చేరినట్లు అయితే... కొంచెం కూడా సంకోచించకండి, తల్లిదండ్రులకు అర్థం అయ్యే విధంగా చెప్పి సరైన నిర్ణయాలు తీసుకోండి. మీ భవిష్యత్తుకు విఘాతం కలిగించే ఎవరినీ క్షమించవద్దు.

మితి మీరి మరీ ప్రవర్తిస్తున్న యాజమాన్యమును ప్రశ్నించడానికి వెనుకాడవద్దు. వారి గురించి ఎప్పటికప్పుడు ఇంట్లో వాళ్లకు తెలియ జేయటం మరువద్దు. శృతి మించితే పై అధికారులకు లేక పోలీసు వారికి ఫిర్యాదు చేయడానికి కూడా భయపడవద్దు.

విద్యార్థులు ఇలాంటి సందర్భములలో ఒక ముఖ్యమైన విషయం గుర్తు పెట్టుకోవాలి యాజమాన్యాన్ని విమర్శించేటప్పుడు ఆ విమర్శలు ఎప్పుడూ అవమానకరంగా లేక వ్యక్తిగతంగా ఉండకూడదు... నిర్మాణాత్మకముగానే ఉండాలి వినాశకారకముగా ఉండకూడదు. అదేవిధంగా యాజమాన్యాన్ని ఎదిరించే విషయంలో విద్యార్థులు భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకుని మెలగాలి.

మీకు నోబుల్ ప్రైజ్ ని సాధించిన రవీంద్రనాథ్ ఠాగూర్ స్థాపించిన శాంతినికేతన్ (విశ్వ భారతి విద్యాలయం) గురించి తెలుసా...శ్రీ దేవేంద్రనాథ్ ఠాగూర్ స్థాపించినది. ప్రపంచంలోని ఎంతో మంది మేధావులు ఒక మహాద్భుత ప్రయోగమని ప్రశంసించినది.

## ప్రేరణ మంత్రం:

*"She is our own, the darling of our hearts, Santiniketan.*
*In the shadows of her trees we meet in the freedom of her open sky.*
*Our dreams are rocked in her arms.*
*Her face is a fresh wonder of love every time we see her,*
*for she is our own, the darling of our hearts."*

*- Rabindranath Tagore*

## స్ఫూర్తి:

1862లో శ్రీ దేవేంద్రనాథ్ ఠాగూర్, భూబంధంగా అనే ప్రాంతాన్ని సందర్శిస్తూ అక్కడి సహజ సౌందర్యమైన ప్రకృతిని చూసి మంత్ర ముగ్ధులై అక్కడ ఒక నివాస స్థానం ఏర్పర్చుకున్నారు. ఆ తరువాత 1925 సంవత్సరంలో రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రయోగాత్మకంగా అక్కడ ఒక గురుకులమును ప్రారంభించారు. ఆ గురుకులానికి 'తపోవన్' అని పేరు పెట్టారు. ప్రాథమికంగా అక్కడ ప్రాచీన భారతీయ విద్యా విధానం మరియు బ్రహ్మచర్యం పద్ధతులు ఉండేవి. ఆ తరువాత మన భారతీయ విద్యావిధానానికి మరియు పాశ్చాత్య విద్యా విధానాన్ని మేళవించి ఒక కొత్త విద్యా విధానాన్ని తర్వాత కాలంలో ప్రారంభం చేశారు. అక్కడి విద్యా

విధానం విద్యార్థులకు ఎంతో అనుకూలంగానూ వాళ్ళ మెదడుకు మేత వేసేలా... మరియు వాళ్ళ నైపుణ్యానికి పదును పెట్టేలా...ఇంకా సంపూర్ణంగా వ్యక్తిత్వ వికాసం పొందేలా ఉండేది. అక్కడ ఇప్పటికీ పిల్లలు చాపల మీద కూర్చుంటారు చెట్ల కింద పాఠాలు చెప్తారు. ఖాళీ సమయంలో వేరే ఏ పాఠశాలలో లేనట్టుగా పిల్లలు అక్కడ చెట్లతోపులలో, అడవిలో తిరగవచ్చు ఆనందంగా ఆహ్లాదంగా ఆడుకోవచ్చు. తరువాతి కాలంలో ఆ పాఠశాల పేరు "శాంతినికేతన్" గా మారింది. శాంతినికేతన్‌లో ఉండే విద్యా విధానం ప్రపంచంలో ఎక్కడా కనిపించదు. ఒక మనిషికి విద్య అంటే కేవలం పట్టా కాదు విద్య అంటే జీవితంలో ముందుకు తీసుకెళ్ళే ఒకే ఒక వెలుగు అని ప్రపంచానికి చాటిచెప్పిన ఒకే ఒక్క విద్యా సంస్థ శాంతినికేతన్. నిజానికి అన్ని విద్యా సంస్థలు శాంతినికేతన్ నుండి స్ఫూర్తి పొంది వాళ్ళ విద్యా విధానాలను కొంతైనా మార్పు చేసుకోవాలి.





# 52. టెక్నాలజీ




## సమస్య:

*సార్, రోజు రోజుకు పెరుగుతున్న సాంకేతికత నన్ను ఇబ్బందికి గురి చేస్తోంది. ఎప్పటికప్పుడు సమయమంతా కూడా చేతిలో ఉన్న సాంకేతిక వస్తువుల వలన వృథా అయ్యి ఏకాగ్రతకు భంగం కలిగిస్తున్నాయి. ఎంత ప్రయత్నించినా నా చేతిలో ఉన్న ఫోను, నా ముందున్న టాబ్లెట్ లేదా, వీడియో గేమ్స్ లేదా టీవీ లేదా ఇతర టెక్నికల్ గ్యాడ్జెట్స్ ఇవన్నీ చాలా సమయాన్ని వృథాచేస్తున్నాయి. ఇవన్నీ కూడా నా చదువుకు భంగం కలిగిస్తున్నాయి. నేను ఏమి చేయాలో పాలుపోవడం లేదు.*

## వివరణ:

పిల్లలూ! ఒక మాట చెప్పండి అసలు ఎవరు ఎవరిని పట్టుకున్నారు, టెక్నాలజీ మిమ్మల్ని పట్టుకుందా లేక మీరు టెక్నాలజీని పట్టుకున్నారా? ఏ వస్తువైనా సృష్టిలో మనిషిని పట్టుకోగలదా? లేదు కదా మరి పట్టుకున్న వస్తువుని వదిలేయడం ఎంత సులభమైన పని చెప్పండి! కానీ పిల్లలే కాదు పెద్దలు కూడా ఇంత సులభమైన పని చేయలేక పోతున్నారు. అదే సమస్య, ఈ సమస్య వల్ల మన చదువుసంధ్యలు చంకనాకి పోతున్నాయి... మన జీవితం చాకిరేవు అవుతోంది. కొత్త వింత పాత రోత అన్న సామెతను మీరందరూ గుర్తు ఉంచుకునే

ఉంటారు. ఏదైనా ఒక కొత్త వస్తువు, కొత్త విషయం లేక ఓ కొత్త ఆలోచననో మనకు ఎదురైనప్పుడు ఎక్కువ సమయం వాటితోనే గడపడం సహజమే, కానీ విద్యార్థి వయసులో మనం దేనిమీద ఎక్కువ సమయం గడపాలి? సహజంగా చదువు మీదే కదా? కానీ మనము ఈ సాంకేతిక వస్తువుల మీద మోజుతో మన సమయాన్నే కాకుండా మన జీవితాన్ని సైతం పాడు చేసుకుంటున్నాం.

ప్రధానంగా నేటి తరం పిల్లలు సాంకేతికతను అమ్మ కడుపు నుండే అందిపుచ్చుకొని పుట్టేస్తున్నారు... కారణం పిల్లాడు కడుపులో ఉన్నప్పుడు తల్లి చూసేది, వినేది, వాడేది ఏదైనా సరే అన్ని సాంకేతికతతో ముడిపడిన అంశములే. ఇక పుట్టిన పిల్లాడు అతి సహజంగా కళ్ళు తెరవక ముందునుంచే సాంకేతికతకు అలవాటు పడి పోతున్నాడు. ఈ సాంకేతికతను మన జీవితంలో నుండి తొలగించడం లేక నివారించడం అసాధ్యమే అని చెప్పాలి.

కానీ కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఈ సాంకేతికతను నివారణ కాకున్నా నియంత్రణ చేసుకోవచ్చు. స్వీయ నియంత్రణ అన్నది పిల్లలందరికీ చాలా ఉపయోగమైన అంశము అని గ్రహించాలి.

*"Technology has made life so easy, but I would like to say that too much technology is turning kids lazy."*

ఉదయం నిద్ర లేచిన దగ్గర్నుంచి రాత్రి పడుకునే దాకా సాంకేతికత మన జీవితాలలో విడదీయరాని అంశమై నిలచిందనటంలో ఎట్టి సందేహం లేదు...అలారమ్, క్యాలెండర్, సుప్రభాతం, నడక, పరుగు, యోగ, ధ్యానం, డైట్, టాక్సీ, డ్రైవర్, ఆఫీసు, నిత్యావసరాలు, స్నేహితులు, స్నేహాలు, సామాజికత, ప్రయాణం, పర్యాటకం, ప్రయోగం, ఫోటోలు, వీడియోలు, ఆడియోలు, కొనడం, అమ్మడం నుండి అమ్మ ఒడి కూడా ఈ రోజు సాంకేతికత తోటే ముడి పడి వుంది.

ఇక పాఠశాలల్లో కూడా సాంకేతికతను జోడించి పాఠాలు భోదిస్తుంటే... పిల్లలు ఎలా వీటిని జాగ్రత్తగా వాడగలరు లేక నియంత్రించుకో గలరు అన్నది జవాబు లేని ప్రశ్నే!

కానీ, పిల్లలూ మీరొకటి గుర్తుంచుకోవాలి... చదువుతో ముడి పడిన సాంకేతికతను మనం ఎప్పుడూ ఎలాంటి నియంత్రణ లేకుండా తప్పక వినియోగించుకోవచ్చు. కానీ అలా వినియోగించుకునే సమయంలో అత్యంత జాగ్రత్తగా వుండాలి. చేతిలో వున్న సాంకేతికత వైద్యుడి చేతిలో వున్న కత్తిలా ఉపయోగపడాలి తప్ప పిచ్చివాడి చేతిలో ఉన్న కత్తి లాగా మారకూడదు. టెక్నాలజీని మన మాట వినే బానిసలాగా చేసుకోవాలి తప్ప దాని ట్రిక్స్‌కు వశమయ్యి మనమే దానికి బానిసలుగా మారకూడదు. అప్పుడు అది ట్రిక్నాలజీ అయిపోతుంది.

గత దాశబ్ద కాలంలో జరిగిన సాంకేతిక పురోగతి మానవ చరిత్రలో మునుపెన్నడూ కూడా ఎవరూ చూడలేదని చెప్పాలి. ఇందులో పిల్లలకే కాదు యావత్ విశ్వమునకే మంచి లేక చెడు చేసే అంశాలు రెండూ పుష్కలంగానే వున్నాయి.

అందుకే, పిల్లలూ కాస్త ధ్యాస పెట్టి కొంత సాధనతో కూడిన జీవన విధానంతో ఈ సాంకేతికతకు ముకుతాడు వేయాల్సి వుంది.

## సూచనలు:

1. *ఎంతటి సాంకేతికత అయినా దాన్ని చదువుకు సంధానం చేయండి.*
2. *సాంకేతిక అంశాన్నేదైనా సరే మీరు ముట్టుకుంటే... ఇది నా చదువుకు సంబంధించినదేనా అని ప్రశ్నించుకోండి.*
3. *ఒక వేళ చదువుకు సంబంధించినది కానప్పుడు దాని వలన మీరు ఏమైనా అభివృద్ధి చెందుతున్నారా? గమనించండి.*
4. *మీకున్న మంచి అభిరుచులకు సాంకేతికతను*

ఉపయోగించడం తప్పు లేదు. కానీ ఆ అభిరుచి మీ విద్యాభ్యాసమునకు అడ్డు రాకూడదు.

5. తల్లిదండ్రులు పిల్లలు సాంకేతికతకు బానిసలు అవుతున్నారు అని గమనిస్తే వెంటనే వారిని మానసిక నిపుణుల వద్దకు తీసుకుని వెళ్ళాలి.
6. ఇంట్లో చదువుతున్న పిల్లలున్నప్పుడు అందరూ సాంకేతికత విషయంలో స్వీయ నియంత్రణ పాటించాలి.
7. సాంకేతికత మోజులో పడి, పిల్లలూ! మీరు చుట్టూ వున్న ప్రపంచాన్ని ఆస్వాదించడం మరచిపోయారా? గమనించండి.
8. మీరు సాంకేతికత ఉపయోగించడం వలన మీ వ్యక్తిత్వము, మీకున్న తెలివితేటలు మరింతగా శోభించాలి తప్ప తిరోగమనం ఉండరాదు.
9. అతిగా ఉపయోగించేదేదీ కూడా విద్యార్థులకు మంచి చేయదన్న సత్యాన్ని గుర్తించండి.

## ప్రేరణ మంత్రం:

*"It has become appealingly obvious that our technology has exceeded our humanity."*



# 53. సామాజిక మాధ్యమాలు



## సమస్య:

*అయ్యా! సామాజిక మాధ్యమాలలో పడి, చదువులో వెనకబడిపోయాను. సమయం అంతా తెలియకుండానే గడిచి పోతోంది. చదువు కోవలన్న ఆకాంక్ష బాగా వున్నా...ఎప్పటికప్పుడు చుట్టూ జరుగుతున్న విశేషాలలో పడి, ఆ ప్రభావానికి తల ఒగ్గి, కాసేపాగి చదువుదాములే అనుకుంటూ... ఏ రోజు కారోజు సమయం అంతా అలా గడిపేస్తున్నాను. ఇంట్లో వాళ్ళు చెప్పినా వినలేని పరిస్థితి వచ్చేసింది. ఈ సోషల్ మీడియాలో నుండి ఎలా బయటపడాలో తెలియట్లేదు.*

## వివరణ:

21వ శతాబ్దములో చిన్నా పెద్దా తేడా లేకుండా అందరిని చుట్ట చుట్టి పాతాళానికి విసిరేస్తున్న అతి భయంకరమైన వైరస్ ఏమిటో తెలుసా? సామాజిక మాధ్యమాలు. అన్ని వైపుల నుండి, మానవాళిని చుట్టు ముట్టి మరో లోకములో విహరింప చేస్తూ... నిజ జీవితాన్ని మట్టి పాలు చేస్తున్నది ఈ విషం.

పూర్వం అంటే ఒక 20 సంవత్సరాల క్రితం, సమాజంలో ఏమి జరుగుతుందో అన్నది కేవలం సమాచార పత్రికలు, ప్రసార మాధ్యమాల (ఫోన్, పేజర్, టీవీ, రేడియో మొ॥) ద్వారా మాత్రమే తెలుసుకునే వాళ్ళం. ఇంకొక ఆధారం లేదు. కానీ గత దశాబ్ద కాలంలో జరిగిన ఆవిష్కరణల్లో మానవ జీవితాన్ని అత్యంత ప్రభావితం చేసిన వాటిలో ఈ సామాజిక మాధ్యమాలు ప్రధానంగా చెప్పుకోవచ్చు.

మునుపు, సినిమా పాటలు చూడాలి అంటే ప్రతి

శుక్రవారం దూరదర్శన్ చానెల్‌లో వచ్చే చిత్రలహరి కోసం వేచి చూసే వాళ్ళం. నాకింకా గుర్తు నేను చదువుకునే హాస్టల్ లో వున్న సుమారు 200 మంది విద్యార్థులు ఒక హాల్లో ఉన్న టీవీ ముందు మూగి కూర్చునే వాళ్ళం. ఇక మిగితా సమయం అంతా కూడా కాలేజ్, చదువు, ట్యూషన్, వారానికొక సినిమా ఇలా సాగిపోయేది. ఆ కాసింత డీవియేషన్‌కే పరీక్షలలో తప్పే వాళ్ళం. చాలా భయంకరమైన అనుభవాలు అవన్నీ.

నేడు, ఒక సారి చుట్టూ చూస్తే...దేనికీ ఎదురు చూడనక్కర లేదు, ఎవరి కోసం వేచి వుండక్కర్లేదు. అసలంతా కన్నుమూసి కన్ను తెరిచే లోపుగా క్షణాల్లో మన ముందు ప్రత్యక్ష మవుతుంది. నీకేమి కావాలంటే అది నీ ముందు వాలిపోతుంది. మరో లోకంలోకి తన్నుకుని తీసుకెళు తుంది. ఇక సాంకేతిక సంస్థల వాళ్ళు తమ వంతుగా గంట గంటకు ఒక విన్నూత్న ప్రయోగంతో అందరిని వెర్రెత్తించి పిచ్చి వాళ్ల లాగా మార్చేస్తున్నారు.

ఫేస్‌బుక్, ఇన్స్టాగ్రామ్, వాట్స్ అప్, టెలిగ్రామ్, పబ్జి, టిక్ టాక్, ఫేస్ టైం, అమెజాన్, మూవీస్ online... ఇలా ఒకటేమిటి సమయం ఉండాలి కానీ రోజుకు 30 గంటల పాటు ఈ మాధ్యమాలలోనే మన జీవితం గడిపేయొచ్చు. వీటి నుండి బయట పడటం అటుంచి... వీటితో పాటు మన ఫోకస్‌ని విడవకుండా జీవించడం కూడా ఒక సవాలే. పిల్లలూ... సామాజిక మాధ్యమాలు వర్తమాన విద్యార్థులు ఎదుర్కుంటున్న అతి పెద్ద సమస్య. మేధావులు సైతం వీటికి దాసోహం అవుతున్న సంఘటనలు చూస్తున్నాం. ఇక చెప్పేదేవరు... దారి చూపించేదెవరు?

ముక్కు పచ్చలారని పిల్లలు ఈ సామాజిక మాధ్యమాల మోజులో పడి ప్రాణాలు సైతం విడిచేస్తున్నారు. తనకు తాను అందంగా కనిపించాలన్న అభిలాషతోనో... తన గురించి ఇతరులు ఏమనుకుంటున్నారో అన్న కుతూహలంతోనో...తాను చేసిన చిన్న పనైనా 10 మందితో పంచుకోవాలనో... అసలు చుట్టూ సమాజంలో ఏమి జరుగుతోందో అన్న ఉత్సుకత తోనో...తన స్నేహితులు ఏమి చేస్తున్నారనో... ఇలా ఇంతకు మునుపు మన ఊహకు కూడా అందని విషయాల గురించి ఇప్పుడు మనము 24 గంటలు ఆలోచిస్తున్నాం.

పెద్దలను చూసిన పిల్లలు...స్నేహితులను చూచి సహ విద్యార్థులు... ఇలా ఒకరిని చూచి ఒకరు ఈ సామాజిక మాధ్యమాల ప్రవాహంలో పడి కొట్టుకుని పోతున్నారు. దీని దుష్ప్రభావం గుర్తించిన పిల్లలు చాలా నియంత్రణతో ముందుకు సాగుతూ అద్భుతాలు సాధిస్తుంటే...దీనికి బానిసలుగా మారి పోయిన పిల్లలు మాత్రం తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఈ విషవలయం నుండి బయట పడటం ఎలాగా?

ఒక వేళ ఇది పిల్లలకు తగదని పెద్ద వాళ్ళు ఎవరైనా వాళ్ళను దూరంగా ఉంచడానికి ప్రయత్నం చేస్తే చాలా విషాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ఫేస్‌బుక్‌లో వుండద్దు అని అమ్మ అరిస్తే చిన్నారి పాప... చదువుకునే పాప ఆత్మహత్య!

ఫేస్‌బుక్‌లో స్నేహం చేసి చదువులో మేటిగా వెలిగే విద్యార్థిని ఇల్లు వదిలేసి వెళ్లిన సంఘటన

సెల్ఫీ మోజులో పడి... ప్రమాదకర విన్యాసం చేస్తూ కింద పడి దుర్మరణం పాలైన విద్యార్థి

ఇంట్లో చెప్పి సరదాగా నలుగురు స్నేహితులతో చెరువుకు షికారుకు వెళ్లి లోతు తెలియక ఫోటోలు తీసుకుంటూ మునిగి పోయిన సంఘటన

యూట్యూబ్‌లో వీడియోలు చూసి...నేర ప్రవృత్తిని అలవరచుకున్న విద్యార్థి.

తరగతిలో తోటి విద్యార్థినులను అసభ్యంగా చిత్రీకరిస్తూ పట్టు బడ్డ విద్యార్థి

టీచర్లను కూడా వదలకుండా అసభ్యమైన పదజాలంతో పోస్టులు పెడుతున్న నేటి యువత.

సామాజిక మధ్యమాలలో చూడకూడని... చదవకూడని

అంశాలు చూస్తూ తమను తాము నాశనం చేసుకుంటున్న విద్యార్థులు.

ఇలా చాలా భయంకరమైన సమాచారాలు... పర్యవసానాలు మనము చూస్తున్నాం. పిల్లలకు కూడా ఈ విషయాలన్నీ తెలుసును. కారణం వర్తమాన కాలంలో ఏదీ ఎవరికీ తెలియకుండా దాచలేము.

అయినా సరే...పిల్లలు మనసు పెడితే దేనినైనా సాధించవచ్చు అని నమ్మిన వాడిని కాబట్టి ఇక్కడ ఈ విషయాలు చర్చిస్తున్నాను. ఇందులో విషం వుందని గ్రహించగలిగితే ఇక ఏ విషయమూ కూడా చెప్పక్కర్లేదు. ఇక్కడ కొన్ని సలహాలు మీకు అందిస్తున్నాను. అవి మీరు స్వీకరించి మంచి మనసుతో ఆచరిస్తే మీరు కూడా అద్భుతాలు సాధిస్తారు.

## సూచనలు:

*సామాజిక మాధ్యమాలలో...*

*ఎంత సమయం వెచ్చిస్తున్నారో తెలుసా?*

*వాటి వలన మీరు పొందిన లాభం ఏమిటి?*

*అన్ని గంటల సమయంలో నేర్చుకున్నది ఏమిటి?*

*ఇన్ని గంటల సమయం మనము ఇంకో ఉపయోగకరమైన విషయం మీద పెట్టవచ్చా?*

*సామాజిక మాధ్యమాలలో వుండటం వలన మనము బాగు పడగలమా?*

1. *మీరు నిజంగా సామాజిక మాధ్యమాల దుష్ప్రభావాల నుండి బయట పడాలి అనుకుంటే... వెంటనే మీ వ్యక్తి గత అకౌంట్స్ అన్నింటికీ స్వస్తి పలకండి.*
2. *వాటికి ముగింపు పలుక లేనప్పుడు...స్వీయ నియంత్రణ విధించుకోవాలి.*
3. *విద్యాభ్యాసం చేస్తున్నప్పుడు రోజుకు గరిష్టంగా 1 గంట సామాజిక మాధ్యమాలలో సమయం వెచ్చించే ప్రయత్నం చేయండి.*
4. *సామాజిక మాధ్యమాలలో మీరు ఏమేమి చూడాలో కూడా ముందే నిర్ణయం చేసుకోండి.*
5. *చదువుకునే సమయంలో అసలు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండండి.*
6. *చేతిలో ఫోన్ కాదు పిల్లలకు ఉండాల్సింది... కేవలం పుస్తకాలు మాత్రమే అని గుర్తించండి.*
7. *ఒక వారం పాటు పైన పేర్కొన్న సూచనలు పాటించడం ద్వారా పొందిన లాభాలను గమనించి రివ్యూ చేయండి.*
8. *సామాజిక మాధ్యమాలలో .మనము అత్యంత ఇష్టంగా తెలుసుకునే ఏ విషయం అయినా జీవిత కాలం గుర్తుండి పోతుంది...మరి అదే విధంగా మనము చదువు మీద మనసు పెడితే ఇంకెంత లాభ దాయకంగా ఉంటుందో ఆలోచించండి.*

## ప్రేరణ మంత్రం:

*What is more important in life is not using facebook...But, making your face on the book.*

# 54. విద్యా విధానమే సరిగ్గా లేదు




## సమస్య:

అయ్యా! మన భారతదేశంలో విద్యా విధానమే సరిగ్గా లేదు ఎంతసేపూ ఒక విద్యార్థిని బండెడు పుస్తకాలు ఇచ్చి దాంట్లో ఉన్నది బట్టీ పట్టి చదవమని వత్తిడి చేసి కేవలం మార్కులు పరమావధిగా చదివిస్తున్నారు.

ప్రస్తుత విద్యా విధానం వల్ల మాకు మేలు కన్నా నష్టమే ఎక్కువగా జరుగుతోంది. ప్రయోగాత్మకముగా... అనుభవ పూర్వకముగా నేర్చుకున్నది ఏమి లేదు

నల్ల బోర్డు లేక డిజిటల్ బోర్డ్ మీద నాలుగు రాతలు రాసి మమ అనిపించుకోవడము తప్ప ఉపాధ్యాయలు మనస్ఫూర్తిగా మాకు నేర్పించే ప్రయత్నం చేయట్లేదు.

ప్రస్తుత విద్యా వ్యవస్థలో ఉన్న పాఠ్యాంశములు సరి అయినవి కాదు.. అవి విద్యార్థిని ఏమాత్రమూ సమర్థుడిగా తీర్చిదిద్ద లేకపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మేము ఏమి చేయాలి.

సార్! ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో విద్యా విధానం సరిగ్గ లేదని అనిపిస్తోంది. మేము చదవనప్పటికి, మా తల్లిదండ్రులు చదవనప్పటికి...ఇప్పుడు మా పిల్లలు చదివి నప్పటికి, వారి పిల్లల చదువులకు మధ్యలో అంతరం సుమారు 100 ఏళ్ళు వుంటుంది. నేటి విద్యా విధానం పునరుత్తేజం తెచ్చు కోవాలేమో అనిపిస్తోంది. ప్రస్తుత విద్యా విధానం ఎలా ఉండాలంటారు...మీ అభిప్రాయాలు చెప్పండి.

## వివరణ:

**తరం మారితే అంతరం పెరుగుతోంది:**

గత 100 ఏళ్ల విద్యా విధానాన్ని పరిశీలిస్తే మౌలికంగా... తాతయ్యలు చదివిన విధానం, తండ్రులు చదివిన విధానం, మనము చదివిన విధానం, ఇప్పుడు మన పిల్లలు చదివిన విధానము... అన్నిటి మధ్యా ఎంతో భేదం కనిపిస్తాయి. నేను ఈ నాలుగు తరాలను చూసాను. నా కళ్ళ ముందు 100 ఏళ్లున్న మా పెద్ద నాన్న పోవడం చూశాను. వాళ్ళ తల్లి కాలం చేయడం చూశాను.

మా పెద్ద నాన్న చదివింది కేవలం 6 వ తరగతే...కానీ వారి గ్రాహ్య శక్తి, జ్ఞాపక శక్తి, చేతి వ్రాత, సేవా దృక్పథం, అర్థ శాస్త్ర మెళుకువలు, సంఘ నీతి, కుటుంబ వ్యవస్థ...నిజంగా చాలా అద్భుతంగా ఉండేది. తండ్రి గారు పోయిన తరవాత 10 మంది తోబుట్టువులను నిలబెట్టిన పెద్దనాన్న విధానం అంతా కూడా అంతు పట్టదు.

వారు చదివింది కేవలం 6వ తరగతి... కానీ వారి తెలివితేటలు...జీవితావగాహన ఇవన్నీ కనీసం 3 డిగ్రీలు చేసిన ఈ నాటి పట్ట భద్రులలో కూడా కనిపించవు.

ఆనాడు వాళ్ళు చదువుతో పాటుగా పుష్కలంగా జీవిత నైపుణ్యాలను నేర్చుకున్నారు. అంతే కాదు అత్యంత కఠినమైన సవాళ్ళను ఎదుర్కొన్నారు. దైవ భక్తి, దేశ భక్తి, సంఘ భక్తి, మాతృ భక్తి మొదలగునవి చాలా సహజంగా వాళ్లకు నేర్పించ బడినాయి.

ప్రార్థనలు, సుభాషితాలు, నీతి శతకాలు, పురాణేతిహాసాలు, శాస్త్రాలు అన్ని విలువలతో కలిపి నేర్చుకున్నారు.

వారు ఆరో తరగతికే అంత అద్భుతమైన వ్యక్తిగా మారటానికి కారణం ఏమిటి? ఆనాటి విద్యా విధానమే కదా? అదే భారతీయ విద్యా విధానం ఇప్పుడు మనకు కావాలి

**భారతీయ విద్యా విధానం శ్రేయోదాయకం:**
**ప్రపంచ దేశాల్లో ఆదర్శ విద్యా విధానం:**
**మన విద్యా విధానం ఎలా వుండాలి?**

నేను చిన్నప్పటి నుండి చూసిన వందలాది గురుకులాలు, విద్యా సంస్థలు, ఆశ్రమాలు మరియు ప్రస్తుత విద్యా విధానం, విద్యార్థులు వారి తల్లిదండ్రులను చూచినప్పుడు... నాలో నేడు కూడా భారతీయ విద్యా విధానం వుంటే బాగుంటుంది కదా! అన్న ఆలోచనలకు ఆధారం అయ్యాయి.

క్రింద పేర్కొన్న అంశాలను నేటి భారతీయ విద్యా విధానంలో పొందు పరిస్తే ఇక విశ్వ విజేతలు మన పిల్లలే అవుతారు...ఇలాంటి పిల్లలను కన్న మన భారతావని విశ్వగురువుగా నిలబడటం తధ్యం అవుతుంది.

ఎన్నో అంశాలను ఆధారంగా చేసుకోవడం వలన చాలా క్లుప్తంగా వివరించే ప్రయత్నం చేశాను.

### 1. Holidays...Holy Days (శెలవులు – పవిత్రతా సెలవులు)

నిజానికి, పాఠశాలల్లో సెలవులు ఎందుకిస్తున్నారో పిల్లలకే కాదు...ఉపాధ్యాయులకు కూడా తెలియడం లేదు. ఎండా కాలం...చలి కాలం సెలవులు గురించి నేను చెప్పడం లేదు. పర్వదినాలు, జాతీయ నాయకుల దినములు, జాతీయతా పర్వదినములు ఇలా...అసలు ఆయా రోజుల విశిష్టతను కూడా తెలియని విధంగా సెలవులు గడిపేస్తున్నారు. అవి సెలవులు కావు...జీవితానికి స్ఫూర్తి నిచ్చే సెలవులు అని చెప్పే విధంగా పాఠశాలలో పిల్లలను తీర్చి దిద్దాలి. పర్వదినాలను బడిలోనే చేసుకోవచ్చు లేదా ఇందుకు సంబంధించిన విశేషాలను తెలియ పరచడం ద్వారా పిల్లలందరికీ ప్రేరణ అందించవచ్చు.

## 2. Education is for Life, but not for living (విద్య జీవిత పరమావధికే)

విద్య కేవలం జీవించడం కోసమే అన్న తప్పు అభిప్రాయాలతో అందరూ తప్పుడు మార్గంలో పయనించడం చూస్తున్నాను. విద్య జీవిత పరమావధి కోసమే అన్నది మన విద్యా విధానంలో పాదుకొల్పాలి. అప్పుడు నేటి బాలలే రేపటి విశ్వ విజేతలుగా నిలవడానికి అవకాశం ఉంటుంది. మెకాలే విద్యావిధానమును మార్చి, మన సనాతన ధర్మమును, మన సభ్యత, సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే, నైతిక విలువలను వృద్ధిపరచే విద్యావిధానం రావాలి. మన భారతదేశ చరిత్రలోని యదార్థమును విద్యార్థులకు తెలియపరిచే విద్యాగ్రంథాలు ప్రచురింపబడాలి.

## 3. End of the Education is Character (విద్యయొక్క పరమావధి శీలమే)

విద్య యొక్క పరమావధి శీలమే కదా...మరి భూతద్దంలో చూసినా నేటి విద్యార్థులలో ఈ గుణగణములు కనిపించటం లేదు. ఇట్టి పరిస్థితిని మనము విద్యావిధానంలో మార్చలేక పోతే మన జాతి ఉనికికే ప్రమాదం ఏర్పడుతుంది. విద్యార్థులను శీలవంతులుగా మార్చడమే విద్యా సంస్థల లక్ష్యం అవ్వాలి.

## 4. Guru Devo Bhava (గురు దేవోభవ)

ఆచార్య దేవో భవ అన్న ఆర్యోక్తికి అర్థమే లేకుండా పోయింది. అసలు గురువును దేవుడిగా చూడటం అటుంచి, కనీసం మనుషులుగా కూడా చూడటం లేదు. పిల్లలే కాదు సమాజం అంతటా కూడా ఇలాంటి పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. దీనికి కారణం అధ్యాపకులు కూడా అని చెప్పాలి. అసలు ఒక గురువు ఎలా వుండాలి? కేవలం కావలసిన డిగ్రీలు వుంటే సరిపోతుందా? నేటి విద్యా విధానంలో అతి పెద్ద లోపాలలలో గురువులు కూడా భాగస్వాములే. కాబట్టి ఆదర్శ ఉపాధ్యాయులు కావాలి. వారి నుండి విద్యను అర్థించే విద్యార్థులు కావాలి.

## 5. Livelihood Skills - Life Skills (జీవనోపాధి నైపుణ్యాలు – జీవిత నైపుణ్యాలు)

జీవనోపాధి నైపుణ్యాలు మాత్రమే నేర్పించే కర్మాగారాలు చాలానే ఉన్నాయి పాఠశాలల రూపంలో...కానీ నైతిక విలువలను, జీవిత నైపుణ్యాలను బోధించి పిల్లలను ధీరులగా మార్చే విద్యావిధానం లేదు. డబ్బులు సంపాదించ గలిగిన వ్యక్తులకంటే బుద్ధులు నేర్పి...జీవితాన్ని ఆదర్శముగా తీర్చిదిద్దగలిగే విద్యా సంస్థలు వుండాలి. అప్పుడే దేశం అభివృద్ధి సూచిలో పరుగులెడుతుంది.

## 6. Self Dependent - Self Reliant (స్వీయ అభివృద్ధి – స్వీయ సామర్థ్యం)

పిల్లాడు పుట్టిన దగ్గరనుండి ఇతరుల పైన ఆధారపడి బ్రతకడం కంటే...వాడి ఊహ తెలిసిన దగ్గరనుండి తనకు తానుగా బ్రతకడం ఎలాగో మనము నేర్పగలిగే విధానాన్ని తీసుకుని రాగలిగితే ఒక అద్భుత ప్రపంచానికి నాంది పలికిన వాళ్ళమవుతాము.

## 7. Class Room - Exponential Learning (తరగతి గది – ప్రయోగాత్మక విద్య)

పిల్లలు కేవలం తరగతి గది పాఠాలకు మాత్రమే పరిమితం కావడం వలన...వారికి లోక జ్ఞానం పూర్తిగా కొరవడింది. పాఠ్యాంశాలను పరీక్షలలో వ్రాయడానికి వినే విధంగా ఉన్నాడు తప్ప...చెప్పే పాఠ్యాంశాల మూలమును గుర్తెరిగే పద్ధతిలో లేదు. అందువలన ప్రతిదీ ప్రయోగాత్మకముగా తెలుసుకునే విధంగా వుండాలి. అప్పుడు ఆ సిద్ధాంతాలను నిత్య జీవితంలో అనుష్ఠించే సామర్థ్యం వస్తుంది.

## 8. Extra Curricular Activities (ఇతరేతర వ్యాపకాలు)

వర్తమాన కాలంలో... కొన్ని విద్యాసంస్థలలో మాత్రమే చదువుతో పాటుగా ఆటా... పాటా...మాటా...మంతి... సంస్కృతి... సంప్రదాయం... వ్యక్తిత్వ వికాసము... నాయకత్వం తదితర అంశాలను కూడా దైనందినిలో

భాగం చేశారు. చదువుతో పాటుగా నేర్చుకోవాల్సిన ఎన్నో విషయాలను మూలన పడ వేయడం వలన రేపు వాళ్ళు ఏ మూలనో కూర్చుని ఎందుకూ పనికి రాని వారిగా మారుతున్నారు.

### 9. Social Service (సామాజిక సేవ)

సామాజిక సేవ పాఠ్యాంశాములలో తప్పక చేర్చ వలసిన విషయం. తద్వారా బాధ్యత, సామాజిక దృక్పథం, సాంఘిక జీవనము, దేశ భక్తి, సేవా నిరతి ఇత్యాది ఎన్నో విషయాలు తెలుసుకుని...పెద్దయ్యే కొద్దీ, తమ నిత్య జీవితములో సేవను ఒక సాధనంగా మలచుకుంటారు.

### 10. Politics (రాజకీయాలు)

ఈ రోజు జాతి మొత్తము సమర్థ మైన నాయకత్వ లేమితో విలవిలలాడుతోంది. రాజకీయాలు కేవలం కొన్ని కుటుంబాలకు మాత్రమే వారసత్వ సంపద లాగా వస్తోంది. కారణం నేటి రాజకీయ వ్యవస్థలో నైతికత లేకపోవడము – ప్రజలెవరికి కూడా రాజకీయాల మీద ఆసక్తి కానీ, ఇష్టం కానీ లేకపోవడమే! చిన్ననాటి నుండి రాజకీయాల గురించిన చర్చ, పాఠాలు, గోష్టులు లేక పోవడం వలన విద్యార్థులు కేవలం వర్గ, వర్ణ, కుల, ప్రాంత, భాషా, రాష్ట్ర, మత ప్రాతిపదికన విడిపోయి గొర్రెలలాగా జీవించేస్తున్నారు. దేశ భవిష్య యవనిక మారాలంటే పిల్లలకు చిన్న వయసు నుండే గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర, దేశ, విదేశ రాజకీయాల గురించిన అవగాహన కల్పించాలి.

### 12. Indian Culture Heritage (భారతీయ సంస్కృతి – సంప్రదాయాలు)

భారతీయ సంస్కృతి సంప్రదాయాలు విశ్వమునకే దారి చూపే జ్యోతి స్తంభాలు. పాశ్చాత్య సంస్కృతికి దాసోహం అయిన మన వాళ్లే మనలను భారతీయతకు దూరంగా పెట్టేయడం వలన పిల్లలు పాశ్చాత్య విష సంస్కృతులే బీజములుగా వేసుకుని విశృంఖలతకు చేరువవుతున్నారు. అద్భుతమైన అదర్శమైన మన సంస్కృతిని పిల్లలకు వారసత్వంగా ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా వుంది.

### 13. Science & Spirituality (విజ్ఞానము – ఆధ్యాత్మికత)

శాస్త్రీయమైన ఆలోచనలంటూ వెర్రి పోకడలు వెళ్తున్న యువతీ యువకుల ధోరణికి మూలం ఏమిటో చూస్తే...వారు చిన్న నాటి నుండి నేర్చుకున్న సైన్సే కారణమని చెప్పాలి. ఆధ్యాత్మిక దృక్పథం వాళ్ళకు మనము భోధించనే లేదు. విద్య జీవితానికి కాదు జీవిత పరమావధికే అన్న సత్యం ఎప్పుడూ వాళ్లకు చూపించలేదు. Spirituality starts where science ends అన్నారు. అందుకే శాస్త్రీయ విద్యా భోధనతో పాటుగా వ్యాకరణ, తర్క, మీమాంస, న్యాయ, అర్థ శాస్త్రములు అధ్యాత్మికతో జోడించి చెప్పాల్సిన సమయం వచ్చింది.

### 14. Yoga Meditation (యోగ – ధ్యానము)

అతి ప్రాచీన భారతీయ యోగ మరియు ధ్యాన పద్ధతులు అతి చిన్న వయసు నుండే పిల్లలు నేర్చుకునే విధానం వుంటే...రేపు అత్యంత సామర్థ్యం కలిగిన దేశ పౌరులుగా తయారవుతారు. ప్రపంచానికే యోగాను కానుకగా ఇచ్చిన మన దేశం తన పిల్లలకు యోగ ధ్యానపద్ధతులు నేర్పించలేకపోవడం శోచనీయము.

### 15. Infrastructure (మౌలిక సదుపాయాలు)

ఒక ఆదర్శ పాఠశాల ఎలా వుండాలి... అన్న అంశము మీద వ్రాసిన సవివరమైన అంశాలు సూచనలు ఇక్కడ చేర్చాలి (48. స్కూల్ నచ్చలేదు–చదవండి)

### 16. Morals in every subject (నైతిక విలువలు)

నేను ఎన్నో దశాబ్దాల నుండి చూస్తున్నాను...ఎన్నో వందల విద్యాసంస్థలకు వెళ్ళాను. అన్ని చోట్లా నైతిక విలువలు మరియు మానవతా విలువలు ఒక సబ్జెక్ట్ లాగా భోదిస్తున్నారే కానీ, ప్రతి సబ్జెక్ట్ లోని పాఠ్యాంశాములలో నైతికత మానవీయత జోడించి చెప్పే వాళ్ళను ఎక్కడా చూడలేదు. అసలు భారతీయ విద్యా

విధానములో విలువలకే పెద్ద పీట వేసారు పూర్వం. అది మళ్ళీ విద్యావిధానంలో ఇమిడినప్పుడు దేశ సౌభాగ్యానికి ఎట్టి ఢోకా ఉండదు.

## 17. Sarva Matha Sama Bhavana (సర్వమత సమభావన)

చిన్ననాటి నుంచి పిల్లలందరు కూడా తాము ఏ మతంలో పుట్టారో, ఆ మతానికి చెందిన వారమని గ్రహిస్తారు. వారు తమ మతము యొక్క గొప్పదనమేమిటో, తమ మతము అసలు ఏమి బోధిస్తున్నదో దానిని – మూలములను గ్రహించేలా పెద్దలు, తల్లిదండ్రులు, గురువులు వారికి బోధించాలి. తమ మతాచారములను, సంప్రదాయములను అందరూ తప్పక పాటించాలి. ఇతర మతములు ఏమి బోధిస్తున్నాయో కూడా తెలుసుకోవాలి. మంచి ఎక్కడున్నా గౌరవించాలి. తన మతమునే తాను పాటించాలి. పర మతమును మనము గౌరవించాలి. అది ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రతి మనిషికి తన తల్లిదండ్రులు ఎలా గౌరవనీయులో, అలాగే మాతృభాష, మాతృదేశము, మతము కూడా అత్యంత గౌరవనీయములు. వాటిని నేర్చుకోవాలి, గౌరవించాలి, పాటించాలి. కానీ, ఇతర మతములను, భాషలను, దేశములను ఎవరినీ కూడా చులకన చేయరాదు. అన్ని మతములు మంచినే బోధిస్తాయి. ఏ మార్గములోనైనా పరమాత్మను చేరటమే ముఖ్యము, సర్వమానవాళికీ హితమును కూర్చటమే ముఖ్యము. పరమత సహిష్ణుత సర్వమత సామరస్య భావన. చిన్న వయసు నుండి అందరికి అన్ని మతములు మరియు సంస్కృతులు తెలియచేసే విధానం ఉండి... అందరిని ప్రేమించు అందరిని సేవించు అన్న భావాలు పాదుకొల్పాలి.

## 18. Until 10th common syllabus (10 దాకా అంతా సమానమే)

10 వ తరగతి దాకా ఒకే దేశం ఒకే పాఠం మన నినాదం కావాలి. తద్వారా ప్రాథమిక స్థాయిలో భారతీయ విద్యార్థులకు అంతా ఒకే భావన బోధన సాధ్యం అవుతుంది. 10వ తరగతి తరవాత వారి వారి ఇష్టా ఇష్టాలను బట్టి ప్రత్యేక దారులు ఎంచుకుని ముందుకు వెళ్లొచ్చు.

## 19. Agriculture be part of curriculum (వ్యవసాయము – వ్యాపకము)

బియ్యము ఎక్కడి నుండి వస్తున్నాయి అంటే సూపర్ మార్కెట్ నుండి అనే స్థాయిలో పిల్లలున్నారు. అసలు పిల్లలకు వ్యవసాయం గురించిన అవగాహన లేకపోవడం ఒక శాపం అని చెప్పాలి. వ్యవసాయంలోనే దేశానికి సాయం వుందన్న నగ్నసత్యాన్ని పిల్లలు గ్రహించే లాగా విద్యా విధానం ఉండాలి. అప్పుడు వ్యవసాయం కూడా ఒక జీవనోపాధి అన్నది వాళ్ళకు అర్థం అవుతుంది. అది భారం కాదు భారతీయుల బాధ్యత అని గుర్తిస్తారు.

## 20. Service as part of daily routine (ప్రతినిత్యము సేవాసాధన)

గురుకుల వ్యవస్థ పునరుద్ధరించాలి. ప్రభుత్వ ప్రయివేటు విద్యాసంస్థలు అన్నింటిలో...ఆరోగ్యము, పరిశుభ్రత, పర్యావరణ సంరక్షణ, మరుగుదొడ్ల / శౌచాలయాల నిర్వహణ, వంటింటి కూరలు పండించడం, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడం, ఇంట్లో వాళ్లకు సాయం చేయడం...ఇలాంటి విషయాలలో పిల్లలు నిత్యము మమేకం అయి విద్య అభ్యసిస్తే వాళ్ళు రేపు దేశానికే తలమానికమయ్యే పనులు చేస్తారు. చిన్నా పెద్దా వ్యత్యాసం లేకుండా కేవలం మంచి చెడ్డా అన్నది గుర్తుంచుకుంటారు.

## 21. Games indoor & out door (ఆటలు)

140 కోట్ల మందున్న మన దేశంలో స్వాతంత్ర్యం సిద్ధించిన 75 ఏళ్లకు కూడా అద్భుతమయిన క్రీడా విధానం గాని, క్రీడా కేంద్రాలుగాని, క్రీడా సౌకర్యాలు గాని లేవు. అసలు పాఠశాలల్లో క్రీడలు అన్నవి ఒక విడదీయరాని అంశముగా చేయాలి. ఒక్కొక్క విద్యార్థి కనీసం ఒక క్రీడలోనైనా నైపుణ్యం సంపాదించడం నేర్పించాలి. అప్పుడు ప్రపంచానికి ముందు తరాల

వాళ్ళు లక్షల మంది క్రీడాకారులు ఇవ్వగలిగిన స్థాయి మనది అవుతుంది. వేరే సమయములో పిల్లలకు ఆటలాడుకునే అవకాశం ఉంటుందో, ఉండదో తెలియదు. కనుక పాఠశాలల్లో పిల్లలతో తప్పకుండా శరీరానికి వ్యాయామం కలిగించే ఆటలు ఆడించాలి. అది వారి ఆరోగ్యానికి చాలా మంచిది. దేశ ఆరోగ్యానికి కూడా మంచిది.

## 22. Humanities & Arts (మానవీయత & కళలు)

సంగీత సాహిత్యాలు భాషాప్రావీణ్యత ఇలా ఈ అంశాలు అన్నీ కేవలం మార్కులు రాని వాళ్ళు తీసుకునే అంశాలుగా భ్రమిస్తున్నారు. పిల్లాడికి చిన్న వయసు నుండే వాళ్ల లోని సృజనాత్మకతను వెలికి తీసే ఎన్నో రీతులలో ఇవి ప్రధాన పాత్రను పోషిస్తాయి. అసలు ఈ పాఠ్యాంశములకు సరి అయిన మెరుగులు అద్దితే...విద్యార్థులు పోటీలు పడి మరీ ఆయా కళాశాలల్లో చేరే ప్రయత్నం చేస్తారు అని నా ప్రగాఢ విశ్వాసం.

## 23. Disaster Management (వైపరీత్యాలు – ఎదుర్కొనే సామర్థ్యం)

ప్రకృతి వైపరీత్యాలు వస్తే వెన్ను చూపి భయంతో పారిపోయే వాళ్ళను తయారు చేసాయి ఇప్పుడున్న విద్యా విధానాలు. పిల్లలకు ప్రాథమిక స్థాయి నుండే, తుఫానును ఎదుర్కొవడం ఎలా, ఈత నేర్చుకోవడం, అగ్ని ప్రమాదాలను ఎదుర్కోవడం, వరదలలో ఎలా బయట పడాలి, భూకంపము వస్తే ఎలా స్పందించాలి, ఎండ దెబ్బకు ఏమి చేయాలి, భవనాలు కూలి నప్పుడేమి చేయాలి...సవాలు ఏదైనా ఏ విధంగా నిర్వహణ చేయాలి, విపత్తులను ఎదుర్కొనే వీరులుగా ఎలా అధిగమించాలన్న విషయాలు బోధించాలి.

## 24. Earning while learning (చదువుతోపాటు సంపాదన)

పాతిక సంవత్సరాలు వచ్చినా ఇంకా ఇంట్లో వాళ్ళ మీద పడి బ్రతికే వాళ్ళను చూస్తూనే వున్నాము. పిల్లలకు అతి చిన్న వయసు నుండే చదువుతో పాటుగా సంపాదన చేయడం నేర్పించాలి. పని చేయడం సిగ్గు కాదు...పని చేయడంతోనే నెగ్గుతాము అన్నది వాళ్లకు నేర్పించాలి. అప్పుడు ఎట్టి కష్టములు వచ్చినా తాను జీవితంలో ముందుకెళ్ళగలమన్న ధీమా వాళ్ళకు వస్తుంది. తమ కాళ్ళ మీద తాము నిలబడటం అన్నది గౌరవంగా, హక్కుగా చూస్తారు.

## 25. Good citizenry (మంచి పౌరసత్వము)

దేశ పౌరుడికి రాజ్యాంగం ఇచ్చే హక్కుల గురించి చెప్పి...ఎవరి కోసం చేస్తారు ప్రభుత్వం వాళ్ళు అన్న ఆలోచనా ధోరణి నుండి, దేశం అంటే మట్టి కాదు దేశం అంటే మనుషులు అన్న ధోరణిని మనము పాదుకొల్పాలి. ఈ దేశం మనది...దేశం నాకేమిచ్చింది అనడం కంటే, దేశానికి నేనిమిచ్చాను అన్న దృక్పథాన్ని పిల్లలకు నేర్పించేలా శ్రద్ధ చూపాలి. లేదంటే పిల్లలు రేపు అతి సులభంగా అసాంఘిక శక్తులుగా మారే అవకాశం వుంది.

## 26. Local / National / International languages (త్రిభాషా ప్రావీణ్యత)

మాతృభాష కాకుండా, రాష్ట్రభాష, జాతీయ భాష, అంతర్జాతీయ భాష ఇలా కనీసం 3 భాషలలో ప్రావీణ్యత సాధించేలా పిల్లలను తీర్చిదిద్దాలి. అప్పుడే పిల్లలు ఎక్కడికెళ్ళినా ధైర్యముగా బ్రతికే విశ్వాసముతో పెరుగుతారు.

## 27. దైవభక్తి – పాప భీతి – సంఘ నీతి...

ఈ 3 అంశములను చిరుప్రాయం నుండే నేర్పించాలి.

## 28. Simple Living - High Thinking

సాధారణ జీవితాన్ని సాగిస్తూ... అసాధారణమైన ఆలోచనలతో అద్భుతాలను సాధించగలిగేలా పిల్లలను తీర్చిదిద్దాలి. అందుకు ప్రధానంగా ఆచార్యులు సదా ఆచరిస్తూ... తాము నమ్మిన సిద్ధాంతాలను పిల్లలకు బోధించాలి.

# 55. తల్లిదండ్రులే నిరుత్సాహపరుస్తున్నారు




## సమస్య:

*నాకు చదువు కోవడం అంటే చాలా ఆసక్తి నేను మంచి విద్యార్థిని బాగా చదువుకుంటాను మంచి మార్కులు కూడా తెచ్చుకుంటాను. కానీ ఇంట్లో నన్ను మెచ్చుకునే వారే ఉండరు, పైగా ఈ చదువుతో ఏం సాధిస్తావ్ అని అంటుంటారు.*

*నేను ఎంత చదివినా ఎంత ప్రగతి సాధించినా లేదా నా నైపుణ్యాలను ప్రదర్శించినా వాళ్ళకవి పట్టవు. ఒక్కోసారి వాళ్ళు నిరుత్సాహ పరుస్తుంటే, నేను ఎవరి కోసం చదవాలి, చదివి ఏం సాధించాలి అన్న నిరుత్సాహం కలుగుతూ ఉంటుంది దాంతో చదువు మీద ఆసక్తి తగ్గిపోతుంది. దయచేసి నేను ఏమి చేయాలో నాకు చెప్పండి.*

## వివరణ:

పిల్లలూ, మీకు తెలిసే ఉంటుంది, వజ్రాన్ని సాన పెట్టక ముందు అది ఒక సాధారణమైన రాయి లాగా కనిపిస్తుంది. అది వజ్రం అని, ఒక నిపుణుడు మాత్రమే గుర్తించగలడు. బహుశా మీ పరిస్థితి అదేనేమో. ఇంట్లో పెద్ద వాళ్లు పెరిగిన వాతావరణం వలన కావచ్చు, లేక వాళ్ళ జీవిత శైలి వలన కావచ్చు, కొంత మంది తల్లిదండ్రులకు చదువు విలువ గురించి లేక జీవితము గురించి అవగాహన ఉండదు. ఒకవేళ ఉన్నా ముందు ముందు తమ పిల్లల్ని తాము పై చదువులు చదివించే ఆర్థిక స్తోమత ఉంటుందో లేదో అన్న సందేహంతో కొంతమంది తల్లిదండ్రులు వారి పిల్లల్ని నిరుత్సాహపరుస్తుంటారు. ఎందుకంటే మీలో ఆశ

చిగురింప జేసి చివరికి అది మీకు అందజేయ లేక మిమ్మల్ని బాధ పెట్టడం ఇష్టం లేక కావచ్చు!

నిజానికి ఈ సమస్య మరీ క్లిష్టమైన దేమీ కాదు, మీరు మీ తల్లిదండ్రులతో ఒకసారి ఏకాంతంగా కూర్చుని వాళ్ళకు వివరంగా తెలియజేయండి చదువు జీవితాన్ని ఎలా మార్చగలదు అని. మరీ గొప్ప వాళ్ళను కాకపోయినా మీ చుట్టుపక్కల వాళ్ళ ఇళ్ళల్లో ఉండే పిల్లలను ఉదాహరణగా చూపించి వాళ్ళు చదువుకోవడం వలన ఎలా బాగుపడ్డారో వాళ్ళకు తెలియజేయండి.

చదువు కేవలం ఆర్థిక స్తోమతనే కాదు, మన జీవిత శైలి మరియు సమాజంలో మన గౌరవాన్ని అన్నిటినీ పెంచుతుంది. మీరు చదువుకోవడం వలన సమాజంలో గౌరవంగా జీవించగలరు అన్న విషయం వాళ్ళకి అర్థం అయితే ఏ తల్లిదండ్రులైనా మిమ్మల్ని ఎందుకు నిరుత్సాహపరుస్తారు?

పిల్లలూ, జీవితంలో కేవలం తల్లి తండ్రులు మాత్రమే కాదు...ఇంకా చాలా మందే వున్నారు. మీ చుట్టూతా తల్లిదండ్రులతో పాటుగా, తోబుట్టువులు, పెద్ద వాళ్ళు, ఇరుగు పొరుగు వారు, స్నేహితులు, ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు ఇలా చాలా మందే ఉన్నారు కదా, వారు అందరూ ఎప్పుడు నిరుత్సాహ పరచడం ఉండదు కదా? మరి అలాంటప్పుడు ఎవరో ఒకరు నిరుత్సాహ పరిస్తే మీరు ఆగిపోవడం సమంజసమా? ఆలోచించండి.

ఒక ప్రశ్నకు సమాధానం చెప్పండి... మీరు బాగా ఆకలితో ఇంటికి వెళ్లారు. భోజన సమయంలో మీ అమ్మ నాన్న ఒరేయ్, భోజనం చేయొద్దురా...దాని వలన నీకు ఆకలి తీరదు... దానికన్నా కాసేపు టీవీ చూడు లేదా మంచి పాటలు విను తప్పక ఆనందం కలుగుతుంది అన్నారనుకోండి. అప్పుడేమి చేస్తారు? ఆకలి తీర్చుకోవడం కోసం అన్నం తింటారా? లేక వాళ్ళెవరో అన్నం తినడం వృధా అని నిరుత్సాహ పరిస్తే దాన్ని నమ్మి టీవీ చూసుకుంటూ కాలం గడిపేస్తారా? అమ్మో! నాకాకలేస్తోంది. అన్నం పెట్టు అని అడుగుతారు కదా!

అలాగే, మీకు అద్భుతంగా జీవించాలన్న ఆకలి వుంటే, ఆ ఆకలి తీర్చుకోవడానికి మీరేమి చెయ్యాలో తెలుసుంటే...ఇక మిమ్మల్ని దేవుడే వచ్చి ఆపాలని ప్రయత్నం చేసినా మిమ్మల్ని ఆపగలడా? ఆశావాదమే జీవనం...నిరాశా వాదమే మరణం అని గుర్తించండి. బాగుపడాలనుకునే వాడిని దేవుడు కూడా ఆపలేడు.

## సూచనలు:

*1. స్వతహాగా శ్రద్ధగా చదువుకోండి.*
*2. ఉన్నతి సాధిస్తుంటే మీ తల్లిదండ్రులే మారతారు*
*3. ఉపాధ్యాయులను కానీ, ప్రిన్సిపల్‌ని కానీ సహాయం కోరి వారి ద్వారా మీ తల్లిదండ్రులకు వివరించండి.*
*4. కుటుంబ స్నేహితుల సహాయం తీసుకొని తెలియజేయండి.*
*5. ఎవరు ఎంత నిరుత్సాహ పరిచినా, మీరు మాత్రం మీ ప్రయత్నాన్ని ఎప్పుడూ ఆపవద్దు.*

## ప్రేరణ మంత్రం:

*The greatest pleasure in life is doing what people say you cannot do.*

## స్ఫూర్తి:

ఒక సారి...కప్పల రాజ్యం లో పెద్ద జాతర జరుగుతోంది. కప్పలన్నీ ఎక్కడెక్కడి నుండో గెంతులేస్తూ ఉషారుగా వచ్చి అన్ని చోట్లా కలియ తిరుగుతున్నాయి. అక్కడున్న ఒక పెద్ద వాటర్ ట్యాంక్ దగ్గర చాలా హడావుడి వుండి... మంచి వయసులో ఉన్న కప్పలన్నీ అక్కడికి చేరుకున్నాయి. అక్కడ కాసేపట్లో ఒక పోటీ ప్రారంభం అవుతుంది. ఏమిటంటే...ఏ కప్ప అయితే వాటర్ ట్యాంక్ మీదకు ఎక్కగలదో అది గెలిచినట్లు దానికి మంచి

బహుమతిని ప్రకటించారు.

ఎన్నో వందల కప్పలు ఎంతో ఆశగా తమ పేర్లు నమోదు చేసుకున్నాయి. ఇంకెన్నో కప్పలు చాలా కుతూహలంగా అక్కడ జరగ బోయే పోటీని ఆసక్తి గా చూసేందుకు బారులుగా నిల్చున్నాయి. పోటీ ప్రారంభం అయింది.

ఎంతో ఆశతో పోటీలో గెలవాలన్న లక్ష్యంతో వందలాది కప్పలు పరిగెత్తడం మొదలెట్టాయి. దారి పొడవునా కాసేపు దాకా ఆశావహ దృక్పథం తో చూస్తున్న మిగితా కప్పలన్నీ తమ బెక బెక శబ్దాలతో ప్రోత్సహించాయి. కానీ పోను పోను...చూస్తున్న కప్పలకు ఏ కప్పయినా అంత పెద్ద వాటర్ ట్యాంక్ ఎక్కడం అసాధ్యమని తలచి గట్టిగా అరుస్తూ...వెళ్ళొద్దని వారిస్తూ...నిరుత్సాహ పరచడం మొదలెట్టాయి. కాస్త అటు ఇటుగా ఉన్న కప్పలెన్నో పోటీని వద్దనుకుని...చూసే వాళ్ళ మాటలను పట్టించుకొని వెను తిరిగాయి. అలా చూస్తుండగానే వందల కప్పలు కాస్తా 10 కప్పలుగా నిలిచాయి. అంతగా నిరుత్సాహ పరచాయి వేడుక చూస్తున్న కప్పలన్నీ. ఇక మిగిలిన 10 కప్పల కుటుంబ సభ్యులు శ్రేయోభిలాషులు వాళ్ళ కప్పలకు వచ్చేయమని...మనకు వద్దని...ఇది సాధ్యమయ్యే పని కాదని...మనకెందుకు సాహసం అని...రక రకాలుగా నిరుత్సాహ పరచాయి. 9 కప్పలు అవును నిజమే అనుకుని వాటర్ ట్యాంక్ దాకా వెళ్ళి వెనుతిరిగారు.

ఆశ్చర్యంగా ఒకే ఒక కప్ప మాత్రం చాలా కష్టపడి వాటర్ ట్యాంక్ మీదికి ఎక్కింది. అది చూసిన అక్కడున్న వేలాది కప్పలు హర్షాతిరేకాలతో...కేరింతలు కొడుతూ... చేతులు ఊపుతూ... జయ జయ ధ్వానాలు చేస్తూ... హడావుడి చేసాయి. పోటీలో గెలిచిన కప్పకు ఆశ్చర్యంగా వుంది. అదేంటి తనతో పాటుగా వందల కప్పలు బయలుదేరినాయి కదా... వాటికి ఏమైంది?

అసలు జరిగింది ఏమిటంటే... మిగతా కప్పలన్నీ, చూస్తున్న కప్పల నిరుత్సాహ కరమైన మాటలు విని నీరు గారి నీరసం అయ్యి విరమిచేసుకుంటే... గెలిచిన కప్పకు చెవుడు వుండటం వలన అసలు ఎవరి మాటలు వినిపించక... లక్ష్యం మీద మాత్రమే దృష్టి పెట్టడం వలన తన శక్తి యుక్తుల మీద ఎట్టి సందేహము లేక శిఖరాన్ని చేరగలిగింది.




పిల్లలూ... కప్పల కథ ఏమిటి అని అనుకోకండి. ఇది కప్పలను తీసుకుని చెప్పిన మనుషుల కథ నే సుమా...మీరు కూడా విజయపథంలో ప్రయాణిస్తూ ఉన్నప్పుడు... ఎవరి నిరుత్సాహమైన మాటల మీద మనసు నిలుపక... చెవిటి వారి వలే ముందుకు ఉరకండి. తప్పక లక్ష్యాన్ని ఛేదిస్తారు.

# 56. On Line విద్యావిధానం నచ్చటం లేదు




## సమస్య:

*అయ్యా! ఈ మధ్య వివిధ కారణాల వలన చిన్నా పెద్దా తేడా లేకుండా ఆన్లైన్‌లో తరగతులు నిర్వహిస్తున్నారు. వారు మంచి ఉద్దేశంతోనే ఆన్లైన్లో పాఠాలు నిర్వహిస్తున్నా ఆ పాఠాలు వినలేక పోతున్నాము. ఎంతసేపు ఆ స్క్రీన్ ముందు కూర్చుని ఉండడంవల్ల తలనొప్పి, కంటి నొప్పి వచ్చి ఏకాగ్రత నశిస్తోంది. ఇవన్నీ ఒక ఎత్తు అనుకుంటే మాలో కొందరి దగ్గర లాప్టాప్స్ మరియు స్మార్ట్ ఫోన్స్ లేవు. మా ఇంటి పెద్దల దగ్గర మాత్రమే స్మార్ట్ ఫోన్ ఉంది కానీ వారు పనికి వెళ్లిన సమయంలో నాకు ఫోన్ అందుబాటులో ఉండదు కేవలం రాత్రి వేళ ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత మాత్రమే నాకు స్మార్ట్ ఫోన్ అందుబాటులోకి వస్తుంది దీని వలన ఆ చెప్పే పాఠాలన్నీ కూడా వినే పరిస్థితి లేదు. నేనెలా చదువుకోవాలి? నా సమస్యకి పరిష్కారం చూపించండి.*

## వివరణ:

పాఠాలు బోధించే శాలలు కాబట్టి పాఠ శాలలు అన్నాము. పూర్వం గురుకులాలలో ప్రకృతి ఒడిలో కూర్చో బెట్టి విద్యార్థులకు భోదించే వారు. నిదానంగా, ఆ గురుకులలాలు, గురువులు, చదువులు, ప్రకృతి పులకరింతలు అన్ని మాయం అయ్యాయి. ప్రస్తుతము ఎక్కడ చూసినా సాంకేతికతకు పెద్ద పీట వేసేసి.. బోధించే గురువు కంటే కూడా టెక్నాలజీకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. మనము అందరం చూస్తూనే వున్నాము.

అయితే, కాలానుగుణంగా మారి పోతున్న విద్యా విధానం వలన అతి సులభ రీతులలో బోధన గరిపే సామర్థ్యం వుందేమో గాని, అవి విద్యార్థులపై ఎలాంటి సత్ ప్రభావం కలిగించేవిగా కాలేక పోతున్నాయి. కారణం పాఠశాల, తరగతి గది, టీచర్, విద్యార్థులతో పని లేకుండా వారి మధ్య పరస్పర సంబంధ సంభాషణ సద్విచారములు లేకుండటమే. ఎన్ని చెప్పుకున్నా, ఎంత సాంకేతికతను ఉపయోగించే సత్తా సామర్థ్యం మనకు ఉన్నా, పిల్లలకు దానికంటే కూడా ప్రత్యక్ష బోధనా పద్ధతి మాత్రమే ఎక్కువ ప్రభావితము చేస్తుంది. ఆరోజైనా, ఏరోజైనా మన పిల్లలకు ప్రత్యక్ష విద్యా బోధన మాత్రమే సర్వ శ్రేయస్కరము అని గుర్తించాలి.

పిల్లలూ! ఈ మధ్యకాలంలో (2019-20) ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలను పట్టి కబళిస్తున్న కొరోనా మహమ్మారి గురించి వినే వుంటారు కదా! ఆ... మహమ్మారి చేసిన విధ్వంసానికి ప్రపంచ వ్యాప్తంగా సుమారు కోటి మంది ప్రభావితం అయ్యారు... అందులోనూ మన దేశములో మనము పుట్టిన దగ్గర నుండి ఇప్పటి దాకా చూడని ఎన్నో సంఘటనలు చోటు చేసుకున్నాయి.

అందులో, నెలల తరబడి విద్యా సంస్థలన్నీ మూసి వేయడం ఒకటి. తరగతులు జరగడం అటుంచి, పరీక్షలు సైతం నిర్వహించలేని దుస్థితి లోకి నెట్టి వేయబడ్డాము. అప్పుడు ఏమి చేయాలి...అలాంటి పరిస్థితులలో ఎవరైనా ఎలా పాఠ శాలలు నిర్వహిస్తారు? ముందు ఇలాంటి అత్యవసర పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. మరి పిల్లలకు ఎప్పుడు విద్యా బుద్ధులు నేర్పేది? అలాంటి పరిస్థితుల్లో, సాంకేతికతను అంది పుచ్చుకుని, అంతర్జాలం సాయంతో ఇంట్లో ఉన్న పిల్లలను... పాఠశాల తరగతి గదిలో ఉన్న టీచర్‌తో అనుసంధానించడమే ఒక ప్రత్యామ్నాయ మార్గం అయింది.

నిజానికి అంత క్లిష్ట సమయంలో ఇలాంటి తరగతులు కూడా నిర్వహించవచ్చు అన్న ఆలోచన గొప్పది అది వాళ్ళ నిబద్ధతని తెలియజేస్తుంది. అంతే కాక పరిస్థితులు ఊహించలేనంతగా మారిపోయాయి కాబట్టి ఎవరికీ, ఏ విషయానికీ, ఏ సమస్యకీ, ఎటువంటి పరిష్కారం ఆలోచించే పరిస్థితి లేదు.

మీరు నిజాయతీగా ఆలోచిస్తే మీ ముందున్న సమస్యలు మరీ అంత కష్టమైనవేమీ కాదు. ఇప్పటి కాలం పిల్లలు పాఠశాల లేదా కళాశాల లేనప్పుడు కాలక్షేపానికి మొదట ఆశ్రయించేది స్మార్ట్‌ఫోన్‌నే కదా! పిన్నా పెద్దా తేడా లేకుండా గంటల తరబడి అందరూ అంటుకుని కూర్చున్నది ఫోన్‌కి మాత్రమే అన్న సత్యం మనము గుర్తుంచుకోవాలి. గంటల తరబడి సామాజిక మాధ్యమాలలో కాలక్షేపం మరియు రోజుల తరబడి మీరు ఆడే వీడియో గేమ్స్ మిమ్మల్ని ఏవిధంగా ఇబ్బంది పెట్టనపుడు కేవలం కొన్ని గంటలు ఉండే ఆన్లైన్ క్లాసెస్ మిమ్మల్ని ఎందుకు ఇబ్బంది పెడుతున్నాయి? మిమ్మల్ని మీరే ప్రశ్నించుకోండి.

నిజానికి మీకు చదువు మీద లేక పాఠాల మీద అంత ఆసక్తి లేకపోవడం వలన మీకు ఇలాంటి చిన్న చిన్న ఇబ్బందులు తలెత్తవచ్చు, ఉన్న పరిస్థితి ఎప్పటికి బాగుపడుతుందో ఎవరికీ తెలియనిది కనుక కొన్ని రోజుల పాటు చదువు అలాగే కొనసాగించవలసి వచ్చింది. ఎన్నో ఇబ్బందులు కూడా ఎదురయ్యాయి. కానీ మానవాళి మీద విరుచుకుపడిన కొరోనా మహమ్మారి నుండి తప్పించుకోవడానికి సామాజిక దూరం పాటించడమే ఉత్తమ మార్గం. అందువలన, దేశము మొత్తము మీద విద్యాసంస్థలు అన్నీ కాకున్నా చాలా మటుకు సాంకేతికతను జోడించి పిల్లలకు దూర విద్య ద్వారానే బోధించడం మొదలు పెట్టారు.

ఇక ముందు రోజుల్లో కూడా ఇలాంటి పద్ధతుల ద్వారానే విద్యాబోధన జరగవచ్చు. ఇది మీరు ఎంత త్వరగా తెలుసుకుంటే అంత మంచిది.

మీరు క్లాస్ రూంలో కూర్చుని ఉన్నప్పుడు ఉన్నంత

ఆసక్తికరంగా ఆన్లైన్లో పాఠాలు ఉండకపోవచ్చు అంగీకరించాల్సిందే, కానీ అసలు పాఠాలు లేకపోవడం కన్నా, ఏదో ఒక విధంగా వాటిని మనం వినగలగడం అనేది నిజంగా ఒక అద్భుతమైన ప్రక్రియ, ఇంక మీ దగ్గర స్మార్ట్ ఫోన్ లేక లాప్టాప్ లేదు అని అంటారా, పాఠాలు వినడానికి లాప్టాప్ అవసరం లేదు మన చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు, ఒకవేళ ఆ స్మార్ట్ ఫోన్ కూడా మీ దగ్గర లేదు అంటే మనము దానిని ఎలా సంపాదించాలో తెలుసుకుందాము. నిజానికి ఇప్పటి కాలంలో స్మార్ట్ఫోన్ ఖరీదైన వస్తువు కాదు, మూడు నుండి నాలుగు వేల రూపాయల లో మంచి స్మార్ట్ఫోన్లు దొరుకుతున్నాయి. మీ పాకెట్ మనీతోనో లేక ఏదో ఒకటి చేసి డబ్బులు సంపాదించుకొనో స్మార్ట్ ఫోన్ కొనవచ్చు. ప్రపంచమంతటా చూస్తే భారతదేశంలోనే అత్యంత అధికంగా స్మార్ట్ఫోన్ వాడేవారు ఉన్నారట కాబట్టి మీకు స్మార్ట్ ఫోన్ అందుబాటులో లేదు అనడం వట్టి మాటే అవుతుంది.

ఒకవేళ పైన చెప్పిన విషయాలు ఏవీ మీకు సాధ్యం కాదు అన్నా కూడా మీ బంధువులను లేక మీ అన్నదమ్ములను లేక మీ చుట్టుపక్కల వాళ్ళతోనూ ఫోన్ తీసుకొని కొద్దిసేపు నీ పని ముగించుకుని వాళ్ళకు తిరిగి ఇచ్చేయవచ్చు.

## సూచనలు:

పాఠాలు వినేటప్పుడు స్మార్ట్ ఫోన్ చేతిలో ఉంది కదా అని చెప్పి పాఠాల్ని పక్కనపెట్టి వీడియో గేమ్స్ లాంటి వాటికి డైవర్ట్ అవకూడదు.

ప్రకటనలలో వచ్చే అడల్ట్ కంటెంట్కి మీరు ఏ మాత్రం ఆకర్షితులు అవకూడదు.

మీరు స్మార్ట్ఫోన్ ద్వారా పాఠాలు వినడం ముగిసిన తరువాత ఒక 10 నిమిషాలు కళ్లు మూసుకుని ధ్యానం చేయడం లేక నిద్రపోవడం చేస్తే మంచిది

స్మార్ట్ఫోన్ చేతిలో కాకుండా దానిని మీ కంటి చూపుకి సమానమైన ఎత్తులో అమర్చి ఒక అడుగు దూరంలో పెట్టి వీడియో క్లాసెస్ వినాలి.

వీలయితే, ఆన్లైన్లో బోధన జరిగే టప్పుడు ఇంట్లో పెద్దలు ఎవరో ఒకరు పిల్లలతో వుండటం శ్రేయస్కరం.

మన దృష్టి ఆన్లైనా లేక ఆఫ్ లైనా? వీటి మీద కంటే కూడా inline with life and learning మీద ఉంటే మంచిది.

ఇప్పుడు ప్రపంచమంతా Online లోనే ఉందంటే అతిశయోక్తి కాదు. ఇక్కడ పేర్కొనే విషయాలు చూడండి

E Learning, E Commerce, E Videos, E Books, E Libraries, E Business...Totally E World around us

## సూచనలు:

1. *Blue Light filter apps ని వాడి మన కంటిని కాపాడుకోవచ్చు.*
2. *ఫోన్ brightness ని అవసరం మేరకు adjust చేసికొని వీడియోలు చూడాలి.*
3. *back ground లో dark screenని set చేసుకోవాలి.*
4. *Class ని వీలైతే download చేసుకొని, ఫోన్ని flight mode లో వినాలి.*
5. *Mobile రూపేణా మీ గురువులే మీ ముందు ఉన్నారని భావించి, notes రాసుకోవడం వంటివి చేయాలి.*
6. *మొబైల్ పాఠాలకు అలవాటు పడితే... మనకు పాఠశాలలు వెళ్లే సమయం, ప్రయాణ సమయం ఇలా ఎంతో సమయం ఆదా అవుతుంది. దాని వలన ఒక 2 గంటలు చదువుకోవచ్చు అన్న వివేకముతో online పాఠాలను వినండి.*

## ప్రేరణ మంత్రం:

*Online learning is rapidly becoming one of the most cost effective ways to Educate rapidly expanding work force.*

## స్ఫూర్తి:

పిల్లాలూ! మీకు తెలుసా?

సాంప్రదాయ పద్ధతులలో చదవడం మనకు ఎరుకయే కదా

దూర విద్య గురించి విన్నారా? అదే Distance Education. ఎవరైతే ప్రత్యక్షంగా తరగతులకు వెళ్ళే సౌలభ్యం లేకున్నా...చదవాలనే తపన పట్టుదల కలిగివుంటారో, వాళ్ళు దూర విద్య ద్వారా చదువుకోవచ్చు. ఎప్పుడో వారానికి ఒక సారి తరగతులు నిర్వహిస్తారు. ఇలాంటి పద్ధతుల్లో ఉన్నత చదువులు చదివే వారిని చూసాను. అలా చేయడం ద్వారా ఓ ప్రక్క చిన్న చిన్న పనులు చేస్తూ...మరో ప్రక్క చదువుకుని అభివృద్ధి పథంలో పయనించే వాళ్ళు.

ఇప్పుడు, సాంకేతికతను అంది పుచ్చుకుని...ప్రపంచ వ్యాప్తంగా On Line Classes ద్వారా ఏటా సుమారు 60 లక్షల మంది చదువుకుంటున్నారు అని తెలిస్తే మీరు ఆశ్చర్య పోతారు.

అంతే కాదు, వీరిలో సుమారు 50% మంది దూర విద్య ద్వారా పై చదువుల కోసమై పేర్లు నమోదు చేసుకున్న వారే.

సుమారు 85% మంది online learning చాలా ఉపయోగకరమైన విద్యా విధానము అని అంటున్నారు.

కొరోనా సమయంలో, దేశం మొత్తం మీద ఆన్లైన్ లెర్నింగ్ గురించే మాట్లాడటం నేను విన్నాను. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరికీ విద్యా సంస్థలు...దూరం నుండి దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారానే తరగతులు నిర్వహించారు. అంతే కాదు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వములు కూడా సమావేశములన్ని ఆన్లైన్ లోనే నిర్వహించారు. సుమారు ఒక సంవత్సరం పాటుగా ఎక్కడా సామూహిక మైన కార్యక్రమాలు జరుగలేదు అంటే అతిశయోక్తి కాదు. ముసు ముందు కూడా ఇలాంటి పద్ధతుల్లోనే విద్యా విధానం జరగచ్చేమో. కాక పోతే సాంకేతికతను ఇంకా ఉపయోగించి Virtual Class Rooms మీ ముందుకు రావొచ్చు.

కాబట్టి, కొత్త సాంకేతికతను అయిష్టంగా దూరం చేయాలనుకోవడం మానుకుని, నేర్చుకోవాలన్న కుతూహలంతో ముందడుగు వేయండి. ప్రతి విషయం నేర్చును తప్పక ఒకటి.

# సత్యశోధన

# 57. అన్ని చోట్లా పోటీనే




## సమస్య:

*అయ్యా! ఈ 21వ శతాబ్దం పెద్ద పోటీ ప్రపంచం ప్రతినిత్యం మనం ఎవరితోనో ఒకరితో పోటీ పడుతూనే ఉండాలి. ప్రత్యేకంగా విద్యార్థి దశలో అందరికన్నా ముందు నిలబడగలిగితే విజయం వరిస్తుంది. కానీ ఎవరికి వారు ప్రతిభావంతులే. ఈ పోటీ ప్రపంచంలో అన్ని చోట్లా పోటీలు ఎదుర్కొంటూ వాటి వలన కలిగే ఒత్తిడిని తట్టుకుని విజయం సాధించడం ఎలాగో మాకు సూచించండి.*

## వివరణ:

మీరు చెప్పింది ముమ్మాటికీ నిజమే పిల్లలూ! అవును అన్ని చోట్లా పోటీయే. పోటీ వుంటేనే కదా నవ్యత నాణ్యత నైపుణ్యం ఇవన్నీ కూడా ప్రపంచానికి పరిచయం అవుతాయి. అదే లేక పోతే ఇక జీవితంలో మజా ఏముంటుంది. "స్పర్థయా వర్థతే విద్యా"! ఒక్క విద్య విషయంలో మాత్రమే స్పర్థ ఉండాలి.

మనము చిన్నప్పుడు విన్నాము కదా? కుందేలు తాబేలు పరిగిత్తే పోటీ? ఏమైంది ఆ కథలో... నడక కూడా సరిగ్గా లేని తాబేలు ఎంతో శ్రద్ధతో, మరెంతో మెలుకువతో, ఇంకెంతో పట్టుదలతో విజయం సాధిస్తే...చెంగు చెంగున పరిగెత్తగలిగే కుందేలు, మితి మీరిన ఆత్మ విశ్వాసంతో, సోమరితనంతో, అహంకారంతో ఆటలో ఓడి పోయింది. అదేదో నిజమైన కథ ఎంత మాత్రం కాదు... కానీ మనము పాఠ్యాంశాములలో టీచర్ చెప్ప గానో లేక ఇంట్లో పెద్దలు చెప్ప గానో విని వుంటాము కదా...అంటే జీవిత సత్యాలు

చెప్పే చిన్న కథ ఇది... పోటీ అన్నది ఎలా వుంటుంది అని చెప్తుంది కాబట్టి మన అందరికీ ఎప్పుడో అప్పుడు ఈ కథ వినిపించి వుంటారు.

అందులోనూ ఇప్పుడు ఉన్న సాంకేతికతతో ప్రపంచం ఒక కుగ్రామంగా మారిపోయింది. కాబట్టి దేశానికి – దేశానికి, రాష్ట్రానికి – రాష్ట్రానికి, ఇంటికి – ఇంటికీ పోటీ ... ఇంకా చెప్పాలంటే వ్యక్తికి – వ్యక్తికి పోటీ. కానీ నిజానికి మీరు గ్రహించవలసింది ఏమిటంటే మీరు పోటీపడవలసింది వేరే వ్యక్తితో లేక వేరే సంస్థతో కాదు మీతో మీరు మాత్రమే పోటీ పడాలి. ఇది నిజం. మీరు పోటీపడవలసినది మీకున్న సవాళ్ళతో మాత్రమే. మిమ్మల్ని పట్టి వెనక్కి లాగుతున్న దుర్లక్షణాలతోనే.

ప్రతిరోజూ మిమ్మల్ని మీరు తీర్చిదిద్దుకుంటూ, మరింత మెరుగు పర్చుకుంటూ ముందుకు సాగాలి. మీకు తెలియనిది లేక రానిది ఏదైనా ఉంటే అదే సరిచేసుకోవాలి అని గుర్తించండి. ఉదయాస్తమానం మన దృష్టి అంతా పక్కవాడిమీద ఉంటుంది తప్ప మహాద్భుతాలు అలవోకగా సాధించగల మీ మీద వుండదు. అందుకే గట్టిగా కృషి చేసి దాన్ని తెలుసుకుని, నేర్చుకుని దానిలో ప్రావీణ్యత సాధించేవరకు వదలకూడదు. నిన్నటికన్నా ఈరోజు మిమ్మల్ని మీరు బాగు పరుచుకోవాలి అది ఒక్క శాతం అయినా పర్వాలేదు. అలా చేయడం వలన కొన్ని రోజులకి మీరు ఒక కొత్త వ్యక్తిగా ఏవైనా సాధించగల సామర్ధ్యంతో ముందుకు వెళ్ళవచ్చు. అప్పుడు మీ పక్కవాడు లేక వెనక వాడు ఏం చేసినా వాడి ప్రతిభ ఎంత గొప్పదైనా మీకు వారి పోటీ ద్వారా వచ్చే భయము ఉండదు. ఎందుకంటే మీరు ప్రతిభావంతులు అయి ఉంటారు కాబట్టి. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొని ఎటువంటి ప్రశ్నకైనా సమాధానం ఇచ్చేవాళ్ళుగా జీవితంలో నిలబడతారు. ఇక అప్పుడు ఎటువంటి పోటీ మిమ్మల్ని బాధించదు.

ఇంకొకటి కూడా గుర్తుంచుకోవాలి పిల్లలందరూ! అసలు ఓటమి లేకుంటే గెలుపుకు విలువ వుంటుందా? ఓటమి లేకుంటే గెలవాలన్న కసి తపన ఎక్కడి నుండి వస్తాయి. నన్ను అడిగితే మన అందరి జీవితాలలో పోటీ వుండాలి... ఓటమి వుండాలి...గెలుపు వుండాలి. అప్పుడే గెలుపు చరిత్రాత్మకం అవుతుంది.

మీకు తెలుసా నాకు సముద్రంలో అలలంటే చాలా ఇష్టం కారణం అవి లేచి పడుతున్నందుకు కాదు...పడినా లేస్తున్నందుకు. ఒక్క సారి మనము సముద్రం వద్దకు వెళ్ళి కూర్చున్నాం అనుకోండి...ఆ విషయం తెలుస్తుంది. అలాగే ఓటమికి కుంగి పోయి...పోటీకి భయ పడటం పిరికి వాళ్ళు చేసేది. మీరు ధైర్యంగా ముందుకెళ్ళే వాళ్ళు.

## సూచనలు:

1. *ఆరోగ్యకరమైన పోటీ వలన మీకే లాభం.*
2. *పోటీని ఎప్పుడూ స్వాగతించడం నేర్చుకోండి.*
3. *పోటీ దారుడిలో వున్న మంచిని గ్రహించండి.*
4. *మీరు గట్టిగా పోటీ ఇవ్వాలి అంటే... దానికి సిద్ధపడటం ఎలాగో తెలుసుకోండి.*
5. *మీమీద మీరే పోటీ పెట్టుకుంటూ అప్పుడప్పుడు మీ నైపుణ్యాన్ని పరీక్ష పెట్టుకోండి.*
6. *పోటీ అంటే భయ పడటం కాదు...ఒక కొత్త స్థాయిని చేరుకునే మార్గం.*
7. *జీవితములో ఎదురయ్యే ఎన్నో పోటీలకు కావాల్సింది అన్నింటికన్నా ప్రధానంగా మీ మీద మీకు నమ్మకం. అంతే తప్ప భయం మరియు ఆందోళనతో మిమ్మల్ని మీరు వెనక్కి నెట్టు కోవద్దు.*
8. *మంచి ప్రణాళికతో మిమ్మల్ని మీరు పోటీ పరీక్షలకు సిద్ధం చేసుకోండి.*
9. *కేవలం పరీక్షల లోనే కాక చాలాచోట్ల మీకు ఈ పోటీ వుంటుంది. ఆ పోటీని చూసి కుంగి పోకూడదు దానికి కావలసిన పరిశ్రమ, మానసిక*

బలాన్ని తెచ్చుకోవాలి. విజయం వస్తే సంతోషంగా ఆనందించాలి అదేవిధంగా అపజయం వచ్చినా ఇది నా మంచికే ఇది నన్ను మెరుగు పరచడానికి అని దాన్ని పాజిటివ్‌గా తీసుకొని జీవితంలో ముందుకు వెళ్ళాలి.

9. మనం గొప్ప వాళ్ళు అనుకోవద్దు మన కన్నా గొప్ప వాళ్ళు ప్రపంచంలో చాలామంది ఉంటారు.

## స్ఫూర్తి మంత్రం:

*Be a better person today than you were yesterday.*



# 58. నిజమైన స్నేహితుడు ఎవరు?




## సమస్య:

*అయ్యా! జీవితంలో ఎంతో మంది స్నేహితులున్నారు. ఒక్కో స్థాయిలో ఒక్కొక్క రకమైన మిత్రులు జత అవుతున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా కూడా ఎంతో మంది మిత్రులు, స్నేహితులు తయారవుతున్నారు. ఇంత మందిలో నిజమైన స్నేహితులెవరో నాకు అర్థం కావడం లేదు. జీవితంలో నిజమైన స్నేహితులను గుర్తించడం ఎలా?*

## వివరణ:

పిల్లలూ... మన చుట్టూ వుండే మనుషులను బట్టి మన వ్యక్తిత్వం కూడా తయారవుతుందని మీకు తెలుసా? మనము చేసే స్నేహములు, మనము వాళ్ళతో చేసే ఆలోచనలు, సంభాషణలు, ప్రవర్తన ఇలా అన్ని చేరి మన నడవడిని తీర్చి దిద్దుతాయి. మనము ఎంత మంచి వారమైనా సరే, చుట్టూ ఉన్న వ్యక్తులు మనలను ఎంతైనా ప్రభావితం చేయడానికి ఆస్కారం వుంది.

ఉదాహరణకు, బాగా చదివే పిల్లలతో మనము స్నేహం చేస్తే తప్పక మన చదువులో కూడా దాని ప్రభావం కనిపిస్తుంది. అలాగే సరియైన అలవాట్లు లేని పిల్లలతో మనం తిరుగుతూ వుంటే ఇక మనము కూడా దురలవాట్లకు లోనవడం సులభంగా జరుగుతుంది. అయినా మన బంగారం బాగుంటే ఇక వేరే వాళ్ళను అనుకోవడం ఎందుకు అనే ఇంట్లో వాళ్ళ మాటలు మీరు కూడా వినే వుంటారు. నిజంగా మీరు మచ్చ లేని వ్యక్తిత్వము ఉన్న వాళ్ళయితే... ఎలాంటి స్నేహితులు మీ చుట్టూ వున్నా మీరు మాత్రం వారి ప్రభావానికి లోనవక, చెప్పాలంటే మీ ప్రవర్తనతో వాళ్లలో కూడా

మార్పు తీసుకుని రావచ్చు.

బురద నీటితో స్నేహం చేసినంత మాత్రాన... తామరాకులు... తామర పువ్వులు తమ దివ్యమైన శోభను కోల్పోలేదు కదా? మీరు చూసే వుంటారు, చెరువులో తామర పువ్వులు బురద నీటిని కాసింత కూడా తమకు అంటకుండా చాలా స్వచ్ఛంగా ఉంటాయి. కానీ నిజజీవితములో మనలను చుట్టి వున్న చెడ్డ సన్నిహితులతో మట్టిలో మాణిక్యం లాగా భాసించడం దుర్లభమే అని చెప్పాలి. ఎందుకంటే, లోకంలో అన్నింటికీ మూలం మనము చేసే స్నేహములు మాత్రమే. అయినా తామరాకు మీది నీటిబిందువులా వాటిని మన మనసుకు అంటనీయకుండా ఉండాలి. శంకరుల వారు భజగోవింద శ్లోకములలో చెప్పారు.

సత్సంగత్వే నిస్సంగత్వం।
నిస్సంగత్వే నిర్మోహత్వం॥
నిర్మోహత్వే నిశ్చల తత్వం।
నిశ్చలతత్వే జీవన్ముక్తిః॥

ఎవరికైనా జీవిత గమ్యములను సాధించాలంటే సజ్జన సాంగత్యం అవసరము, మోక్షము రావాలన్నా సరే, అందుకు ముందుగా మంచి వారి సంగమము వుండాలి. అంటే మంచి స్నేహము, మంచి ఆలోచన చేసే బృందం అన్న మాట. సద్గుణములు కలిగి పరమాత్మతో సంగము కలవారి సాంగత్యము మనకు శుభములను కలిగిస్తుంది.

స్నేహితులెంత మంది వున్నా నిజమైన స్నేహితులు ఒక్కరో ఇద్దరో వుంటారు. కానీ వారిని గుర్తించడం ఎలా?

ఒకరు మీకు నిజంగా మిత్రుడయితే, అతనితో నిర్మొహమాటంగా ఉంటూ కూడా అతడి స్నేహానురాగాలు కోల్పోకుండా ఉండగలగాలి. ఇప్పుడు మీకున్న స్నేహాలన్నీ, కేవలం స్నేహితులిద్దరూ పరస్పరం అంగీకరించే విషయాల మీదా, సమానమైన అభిరుచుల మీదా. ఇష్టాయిష్టాల మీదా ఆధారపడి ఉన్నాయి. కానీ మీ ఇద్దరికీ యాపిల్‌కూ, నారింజకూ మధ్య ఉన్నంత భేదం ఉన్నా కూడా, మీరు మంచి మిత్రులుగానే ఉండచ్చు.

నిజమైన స్నేహితుడంటే, నువ్వు ఎంత పనికిమాలిన వాడివో నీ మొహానే చెప్పగల ధైర్యం చూపుతూనే, నిన్ను ప్రేమించి ఆదరించేవాడు. నీ లోపాలను, తప్పులను నీకు మాత్రమే తెలియజెప్తూ, నిన్ను ధర్మపథంలో నడిపించేవాడు.

సృష్టిలో తీయనిది స్నేహమే అన్నారు. ఇందుమూలంగా ప్రేమకు కూడా దక్కని గౌరవం స్నేహానికి దక్కింది.

స్నేహితుడంటే ఎవరు అని అడిగిన ప్రశ్న కు ప్రముఖ తత్వవేత్త అరిస్టాటిల్ "రెండు వేర్వేరు శరీరాల్లో నివసించే ఒకే ఆత్మ" అని జవాబిచ్చాడు. స్నేహానికీ, నిజమైన స్నేహితులకీ ఇంతటి ఉదాత్తత ఉంది మరి.

"పాపాన్నివారయతి యోజయతే హితాయ।
గుహ్యం చ గూహతి గుణాన్ ప్రకటీకరోతి।
ఆపద్గతంచ న జహాతి దదాతి కాలే।
సన్మిత్రలక్షణమిదం ప్రవదంతి సంతః॥"
అన్నారు భర్తృహరి తమ సుభాషితాలలో.

మంచి స్నేహితుడు తన స్నేహితుని చెడుపనులు, పాపపు పనులు చెయ్యనీయకుండా ఆపుతాడు, మంచి పనులు చేసేలా ప్రేరేపిస్తాడు. తన స్నేహితుని రహస్యాలను కాపాడతాడు, దుర్గుణాలను సరిచేస్తాడు. అతనిలోని మంచి గుణాలను పదిమందికీ తెలిసేలా చేస్తాడు. ఆపదలలో వదిలిపెట్టడు. సకాలంలో సహాయం చేస్తాడు. ఇవి మంచి స్నేహితుల లక్షణములు.

ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక రూపంలో స్నేహితులను కలిగే వుంటారు. అందుకే నిజమైన స్నేహితులు లేకపోవడం (ఏకాంతం లేదా ఒంటరితనం) అనేది అత్యంత దురదృష్టకరమైన విషయం అంటారు. అదో శాపం.

కొంతమంది స్నేహితులు మనం సుఖాల వెలుగులో వున్నప్పుడు మన నీడలా వెన్నంటే వుంటారు, మనం వెలుగులోంచి, కష్టాల చీకట్లోకి నడిచినప్పుడు నీడ మాయమైనట్లు మాయమై పోతారు. వీరు వారి అవసరాల నిమిత్తం మనతో స్నేహం చేసిన వారే. పని వున్నప్పుడే మాట్లాడటం, అవసరం వున్నప్పుడే కలవటం చేస్తూ వుంటారు. ప్రపంచమంతా నిన్నొదిలేసి నీకు దూరంగా వెళ్లిపోయినప్పుడు, నీ దగ్గరికి వచ్చేవాడే నిజమైన స్నేహితుడు అన్నాడొక మహానుభావుడు.

స్నేహితుడు సమస్యల్లో వున్నప్పుడు మనం ఆ సమస్యను తీర్చ గలిగిన స్థితిలో లేకపోయినా, తోడుగా వుండి ధైర్యాన్ని కలుగచేయవచ్చు. ఆ తోడు ఒక చీకటి గుహలో చిరుదీపం లాంటిది. గుహ మొత్తంలో యేముందో ఆ దీపం చూపించలేకపోయినా తరువాతి అడుగు ఎలా వేయాలనే ఆత్మవిస్వాసాన్ని కలుగచేస్తుంది. అది చాలు.

సమస్యల్ని సాధించే సహాయాన్ని అందించాలి. వీలైతే extra mile నడవగలగాలి. నాకోసం ఏమైనా చేస్తాడు అనే విశ్వాసాన్ని కలుగ చేయాలి. అవసరమైనప్పుడు వీరి మీద ఆధార పడొచ్చు అనే భరోసా ఇవ్వగలగాలి.

## ప్రేరణ మంత్రం:

*Tell me your company, I shall tell what you are!*

## స్ఫూర్తి:

పిల్లాలూ మీ అందరికి తెలుసును కదా? మహాభారత కథ! అందులో పాండవులెప్పుడు కూడా వదలక పట్టిందెవర్ని చెప్పండి? ఇంకెవరు శ్రీ కృష్ణుడు కదా! జీవితంలో ఎట్టి సుఖాలలో అయినా, దుఃఖాలలో ఉన్నా, ఎన్ని కష్టాలు వచ్చినా, కన్నీరు కార్చినా... వాళ్ళు మాత్రం శ్రీ కృష్ణుడిని విడవలేదు. ఆయన కూడా అంతే ప్రేమతో, దయతో సదా వారిని కాపాడుకుంటూ... నిజమైన స్నేహితుడిలా చివరి దాకా వాళ్ళ తోడు నీడగా వున్నాడు. భగవంతుడినే వాళ్ళు స్నేహితుడిగా చేసుకున్నందుకు వాళ్ళకి అన్నింటా విజయమే వరించింది. నిజానికి దేవుడే నిజమైన స్నేహితుడు.

కానీ, దుష్టులయిన కౌరవలను నమ్మి వాళ్ళ స్నేహానికి దాసోహమయి, తాను మంచివాడైనా సరే దుష్టచతుష్టయంలో ఒక్కడిగా చరిత్రహీనుడయ్యాడు కర్ణుడు.

ఎన్ని ఆశలు చూపినా తన లాంటి వారిని 10000 మందిని ఎరగా చూపినా సరే, మాధవా మాకు నీ స్నేహము చాలును అని, అర్జునుడు శ్రీ కృష్ణుడిని కోరాడు కాబట్టే... ఆయన నిజమైన స్నేహితుడై అన్ని రకాలుగా వారి విజయం కోసమై శ్రమించాడు. ఇంకా చెప్పాలంటే అర్జునిడి రథసారధిగా మారి పోయాడు. అదీ స్నేహం విలువ. పార్థసారథి అని కూడా పిలిపించుకున్నాడు సుమా!

పిల్లలూ, మీరు నిజమైన స్నేహితుడిని గుర్తించాలంటే అర్జునుడు శ్రీకృష్ణుడు మధ్యలో వున్న స్నేహ బంధాన్ని పరిశీలించండి. తప్పక మీ చుట్టూ వున్న వాళ్ళలో ఎవరు నిజమైన స్నేహితుడో తెలుస్తుంది.



# 59. పరిపూర్ణ మానవుడు



## సమస్య:

*అయ్యా! నాకు వ్యక్తిత్వ వికాశమునకు సంబంధించిన పుస్తకాలు, సంభాషణలు, చిత్రాలు మొ॥ వాటితో పరిచయం ఉంది. కానీ నిజమైన వ్యక్తిత్వ నిర్మాణం గురించి ఎక్కడా చదివింది లేదు. అసలు ఒక పరిపూర్ణ మైన వ్యక్తి ఎలా వుండాలి. ఏ విధమైన లక్షణాలు కలిగి వుండాలి మీరు చెప్తే వినాలి అనుకుంటున్నాను. ఇప్పుడు అందరూ చెప్పే వ్యక్తిత్వ వికాస విషయాలు ఎంత వరకు ఉపయోగముగా వున్నాయో తెలియజేయండి.*

## వివరణ:

నా చిన్న నాటి నుండి నేను ఎక్కడికి వెళ్ళినా ఎవరైనా మాట్లాడుతున్నప్పుడు చాలా శ్రద్ధగా వినేవాడిని. ఎక్కడ మంచి పుస్తకాలు చూసినా, అదేదో ఫోబియాలాగా కొనేసి చదివే వాడిని. మహాత్ములెవరైనా ఊళ్ళోకి వస్తే అందరికంటే ముందు వెళ్ళి, మొదటి వరుసలో కూర్చుని చాలా కుతూహలంగా విని నచ్చిన విషయాలు పుస్తకంలో వ్రాసుకుని మురిసిపోయేవాడిని. భక్తి విశ్వాసాలు ఎక్కువగా ఉన్న కుటుంబంలో పుట్టడం వల్లయితేనేమి, తల్లిదండ్రులు సదాచార సంపన్నులవడం వల్లనయితే నేమి, సరస్వతీ విద్యామందిరంలో చదవడం వల్లనయితే నేమి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో పాల్గొవడం వల్లనయితేనేమి... చిన్నప్పటి నుండి ఎన్నో సంస్కారములు అలవడ్డాయి అని చెప్పొచ్చు.

ఆ తరువాత కాలంలో, శ్రీ సత్యసాయి బాబా వారు స్థాపించిన బాలవికాస్ తరగతులకు ప్రతి ఆదివారం వెళ్తూ...అప్పటికే అగ్నిలా ఉండే హృదయానికి ఆజ్యం

తోడయినట్లుగా ఇంకెన్నో ఆధ్యాత్మిక భావనలు నాలో చేరాయి.

తదనంతర కాలంలో, శ్రీ సత్య సాయి బాబా వారి దర్శన, స్పర్శన, సంభాషణ, పాదనమస్కార, ప్రసాద, బోధనా భాగ్యాలు పొందే అదృష్టం వలన ఉత్తమ జీవితము గడిపే అవకాశం దొరికింది. సుమారు 5 దశాబ్దాల నుండి ఎంతో మంది అద్భుతమయిన వ్యక్తులను, సాధువులను, సంతులను, మహాత్ములను, మేధావులను, నిపుణులను కలిసే భాగ్యం కలగడం వలన...చాలా నిశితంగా అందరిని గమనించే వాడిని.

చిన్నప్పటి నుండి, వ్యక్తిత్వ వికాసమును గురించి ఆలోచించే సమయంలో ఎప్పుడూ ఈ అంశాలు కేవలం మనిషిని తయారు చేసేవిగా వున్నాయి గాని...మనిషిని మనీషిగా తయారు చేయడం లేదేమో అనిపిస్తుండేది. ఏది నేర్చుకుంటే మనిషి మహర్షి అవుతాడు? అని చాలా తీవ్రంగా ఆలోచించేవాడిని. ఎన్నెన్నో పుస్తకాలు చదివాను...ఎన్నో లెక్కలు వేశాను...ఎంతో మందితో ముచ్చటించాను...మేధావులతో చర్చించాను.

పరిపూర్ణమైన వ్యక్తి ఎలా వుండాలన్న విషయం మీద పరిశోధన చేసి...నేను తెలుసుకున్న విషయాలను క్రోడీకరించి అందరికి అర్థమయ్యే విధంగా చెప్పడం మొదలు పెట్టాను.

పిల్లలూ... మీరు అడిగిన ప్రశ్నలు నన్ను కూడా ఒకప్పుడు వేధించాయి. శోధించి నేను సాధించిన అద్భుత మయిన సూత్రాలను మీకు అందించే ప్రయత్నం చేస్తున్నాను ఇప్పుడు. మీకు నచ్చితే ఆ సూత్రాలను మీరు కూడా ఆచరించి పరిపూర్ణ వ్యక్తులుగా తయారవ్వండి.

నేను తెలుసుకున్న ఎన్నో విషయాలను సమీకరించి ఒక అద్భుతమైన మాత్రలాగా ఈ సూత్రములను తయారు చేసాను. ఇది నాకు ఎవ్వరు చెప్పింది కాదు...బోధించింది కాదు. కానీ అందరూ చెప్పే మంచి అంతా దీనిలో ఇమిడి ఉంది అని మీరు గ్రహిస్తారు. చదవండి.

## పరిపూర్ణ వ్యక్తి - Complete Personality

పిల్లలూ, మీరు ప్రతి తరగతిలో వార్షిక పరీక్షలు వ్రాసి వాటిలో ఉత్తీర్ణత సాధించిన మీదట ఆపై తరగతికి వెళ్తుంటారు కదా? ఎన్ని సబ్జెక్ట్స్ చదవాల్సి వుంటుంది? 6 కదా? పాస్ అవాలంటే ఎన్ని మార్కులు రావాలి? కనీసం 35/100. ఎవరికైనా వందకు వంద వస్తాయా? లేదనే చెప్పుకుందాం.

ఇప్పుడు నేను చెప్ప బోయే పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని సాధించాలంటే కూడా మనము 5 సబ్జెక్ట్స్‌లో విజయులు అవ్వాలి సుమా! అయితే గమ్మత్తయిన విషయం ఏంటంటే... ప్రతి పేపర్ 20 మార్కులకు వుంటుంది. మొత్తము 5 పేపర్ల కు కలిపి 100 మార్కులు సంపాదించాలి. మన పరీక్షలలో లాగా 35 మార్కులు వస్తే పాస్ అన్నది ఇక్కడ వుండదు. 100/100 మార్కులు రావాల్సిందే. అప్పుడు మాత్రమే మీరీ పరీక్షలో నెగ్గినట్లు.

జాగ్రత్తగా ఈ ప్రశ్నలను అర్థం చేసుకుని, నిజాయతీగా మీకు మీరే మార్కులు వేసుకోండి. తప్పక మీకు తెలుస్తుంది... మీరు పరిపూర్ణమైన వ్యక్తా? కాదా? అన్న విషయం.

## మొదటి పేపర్ - శ్రేష్ఠమైన వ్యక్తిత్వము:

వ్యక్తిత్వ వికాసమునకు సంబంధించిన ప్రతి అంశమును ఈ పేపర్ క్రింద ప్రస్తావించవచ్చు. ఒక మనిషి యొక్క కట్టు, బొట్టు, జుట్టు, వేష, భాష, స్థితి, గతి, రీతి, నీతి ఇలా వ్యక్తికి సంబంధించిన దేనిలో అయినా ఆదర్శం నిరూపించినప్పుడు మొదటి పేపర్‌లో మనము ఉత్తీర్ణత సాధించినట్లు.

పరిపూర్ణమైన వ్యక్తి కావాలంటే ఎవరైనా సరే మొదటి పేపర్లో పాస్ అవ్వాలి అప్పుడే మిగితా పేపర్ల విషయంలో విజయం సాధించ గలరు. అర్థం కాలేదా?

నేను ఒక కథ చెపుతాను వినండి. ఇంటికి అతిథులు వస్తున్నారని అమ్మ ఎంతో ప్రేమ తో పాయసం చేయాలని

ఉపక్రమించింది అనుకుందాము. తనకు చాలా ఇష్టమైన వంటకము...బాగా చేయగలిగింది...దానికి సంబంధించిన అన్ని దినుసులు రెడి చేసుకున్నది. ఎందుకో మరి పాయసం మాత్రం చెడిపోయింది. ఎంత ఆలోచించినా ఏమైందో అర్థం కాలేదు ఆవిడకు. మీరు కూడా ఇవన్నీ విన్నారు కదా...మరి చెప్పండి, ఎందుకు పాయసం చెడిపోయిందంటారు?

చాలా ఆలోచనలు మీ బుర్రలో తిరుగుతుంటాయి కదా...అవేవి కాదు! అన్నీ సరిగ్గా వున్నా...పాయసం చేసిన పాత్ర శుభ్రంగా లేక పోవడం వలన...ఎంతో ప్రేమగా వండిన పాయసం కాస్తా పాయిజన్‌గా మారిపోయింది. అంటే పాత్ర బాగా లేక పోతే ఒక పాయసమే కాదు...పప్పు...సాంబారు... రసం...ఇలా ఏమి చేసినా పాడై పోతుంది. భాండశుద్ధిలేని పాకమేల? అన్నారు.

ఇప్పుడు చెప్పిన దానికి, ఆదర్శ వ్యక్తి పేపర్‌కు ఏమిటి లింక్ అర్థం అయిందా? తప్పక అవ్వాలి, కారణం మీరు చాలా చురుకైన పిల్లలు కదా?

పాయసం వండి వడ్డించడానికి పాత్ర ఎంత అవసరమో...జీవితాన్ని తీర్చి దిద్దుకోవడానికి వ్యక్తి అనే పాత్ర అంత అవసరం.

అంటే, మీరు వ్యక్తిగా బాగా లేక పోతే...ఇక జీవితములో మీరేమి చేసినా ఫలితము ఉండదు. అందుకే కాబోలు...ఇప్పుడు మార్కెట్‌లో దొరికే ఏ వ్యక్తిత్వ వికాస పుస్తకం చూసినా... ఏ నిపుణిడి మాటలు విన్నా ఈ మొదటి పేపర్ లోని అంశాలు చాలా ప్రధానంగా ప్రస్తావిస్తుంటారు.

నిజానికి, ఇవన్నీ కూడా మనము ఆచరిస్తే కేవలం 20/100 మాత్రమే వస్తాయి అని గుర్తించాలి. పిల్లలూ చాలా మందికి మొదటి పేపర్ లోనే కష్టం అంతా వుంటుంది. ఇక్కడ చర్చించిన విలువలను మనము జీవిత రీతిగా మలచుకుంటే ఇక మనకు తిరుగులేదు.

వ్యక్తిగత అలవాట్లు బాగుండాలి, శుచి శుభ్రత ఉండాలి, వ్యక్తిత్వ వికాసము, వ్యక్తి శీల నిర్మాణ ముండాలి, జీవన విధానము ఇలా వ్యక్తికి సంబంధించిన ప్రతిదీ ఆదర్శంగా వుండేలా చూసుకోవాలి. మీ గురించి మీరు ఆలోచించడం మొదలు పెట్టండి. మీకు మీరే రాజు...మీరే మంత్రి. నిర్ణయం మీదే...నియమం మీదే...

## రెండవ పేపర్ - శ్రేష్టమైన కుటుంబము:

కేవలం మీరొక్కరే బాగుంటే సరిపోతుందా? మీతో పాటు ఇంకా ఎవరు బాగుండాలంటారు? ఇదే ప్రశ్న చాలా మందిని అడిగాను...నూటికి 90% మంది పిల్లలు అమ్మ నాన్న మరియు ఇంట్లో వాళ్ళు అని చెప్పారు. కానీ నిజానికి నేను వెంటనే అడుగుతుంటాను...సమావేశాల్లో! పిల్లలూ మీ అమ్మనాన్నలు ఎప్పుడు బాగుంటారు? అని. వెంటనే పిల్లలు మేము బాగున్నప్పుడు అని ముక్త కంఠంతో చెప్తారు. అప్పుడు నేను అసలు మీరు బాగుండటం అంటే ఏమిటి చెప్తారా?

ఆరోగ్యంగా వుండటం
బాగా చదువుకోవడం
మంచి అలవాట్లతో వుండటం
తల్లి తండ్రులు చెప్పిన మాట వినడం
ఇంట్లో వాళ్లకు ఇబ్బందులు పెట్టకుండా వుండటం
చేతనయిన సాయం చేయడం...
ఇలా చెప్తుంటారు.

అప్పుడు, నేను నిజాయతీగా చెప్పండి పిల్లలూ మరి మీలో ఎంతమంది ఇవన్నీ చేస్తున్నారు చేతులు ఎత్తండి అంటే వందకి 10 మంది కూడా చేతులు ధైర్యంగా ఎత్తరు. మీరైనా అంతే గా...

అసలు ఆదర్శ కుటుంబం అంటే ఇంట్లో వారందరూ ఒకే మాట మీద ఉండాలి. తల్లిదండ్రులను గౌరవించాలి... ప్రేమించాలి. అందుకే చెప్తారు A House is made by bricks where as Home is built by Values అని. అటువంటి వాతావరణం మీరు

సాధించగలిగినప్పుడు రెండవ పేపర్‌లో విజయం సాధించినట్లు. అసలు వ్యక్తిగా అద్భుతమైన ప్రతిభ చూపించే వ్యక్తి ఇంట్లో ముభావంగా ఉంటే ఎలా వుంటుంది? తల్లిదండ్రులకు సాయం చేయక పోతే ఎలాగ ఉంటుంది? భార్యాపిల్లల్ని సరిగ్గ చూసుకోలేక పోతే ఎలా ఉంటుంది? అప్పుడు మొదటి పేపర్ లో విజయం సాధించినట్లా చెప్పండి...పాత్ర బాగున్నట్లా? అక్కడ మిమ్మల్ని మీరు మోసం చేసుకున్నట్లు అని తెలుసుకోండి.

మొదటి పేపర్‌లో వ్యక్తిగా పాస్ అయిన వాడు...ఇక ఒక కొడుకులా... తమ్ముడిలా... అన్నలా... భర్తలా... తండ్రిలా... తాతలా ఇలా ఏ పాత్రలో నైనా ఆదర్శము నిరూపిస్తాడు. అంతే కాదు, వాడు రేపు డాక్టర్ అయినా...యాక్టర్ అయినా...ఇంజినీర్ అయినా...క్లర్క్ అయినా...కలెక్టర్ అయినా ఏమైనా కానివ్వండి వాడి వలన కుటుంబానికి... సమాజానికి...దేశానికి ఎంతైనా ఉపయోగం వుంటుంది.

కుటుంబాన్ని ఇంగ్లీష్‌లో ఏమంటారు? చెప్పండి... **FAMILY** దానర్థం ఏమిటంటారు? తెలుసా!

**F**ather
**A**nd
**M**other
**I**
**L**ove
**Y**ou

ఇంతటి ఆదర్శాన్ని మీరు నిరూపించారు అంటే మీరు రెండవ పాపర్లో పాస్ అయినట్లే.

## మూడవ పేపర్ - శ్రేష్టమైన చదువు /ఉద్యోగము:

ఇప్పుడు, మీరందరూ ఒకటి మరియు రెండవ పేపర్‌లో విజయం సాధించారు అనుకుందాము. అంటే మనకు 40/100 మార్కులు ఉన్నాయి. నువ్వు, నీ కుటుంబము బాగుంది అనుకుంటే...ఇంక ఎవరు బాగుండాలి? ఇదే ప్రశ్న ఎన్నో చోట్ల అడిగినప్పుడు...నాకు చెప్పిన సమాధానాలు ఎన్నో వున్నాయి...కానీ అందులో చదువు - సంధ్య లేక ఉద్యోగము - సద్యోగము అన్నవి ఎప్పుడూ వినలేదు. ఈ కారణం చేతనే మనము మన దేశము ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశాల పట్టిక లోనే వుంది.

పిల్లలూ... మీరు బాగున్నారు... మీ కుటుంబం బాగుంటే చాలా!...మీ జీవనాధారమైన చదువు లేక ఉద్యోగం అద్భుతంగా ఉండద్దా? అయ్యో కరెక్టే కదా! అని నాలుక కరుచుకునే పిల్లలను నేను చూస్తూనే ఉంటాను. ఈ రోజు మీరు పిల్లలు కాబట్టి నేను చదువులో అద్భుతాలు సాధించాలి అని చెప్తున్నాను. కానీ రేపు పెద్దయిన తరవాత జీవితములో భాగం అయ్యేది మనము చేసే వృత్తి, వ్యాపారం, ఉద్యోగమే కదా... అందుకే పరిపూర్ణ వ్యక్తిలా మనం మారాలంటే మన వ్యాపకాలు కూడా ఆదర్శముగా వుండాలి.

ఒక సారి, మేము యుక్త వయసులో వున్నప్పుడు, శ్రీ సత్య సాయి బాబా వారి సమక్షంలో మాట్లాడే సమయంలో, స్వామి వారు ఉన్నట్టుండి ఒక ప్రశ్న వేసారు.

బంగారూ! మీరంతా ఎలా పని చేస్తున్నారు?

స్వామీ, ప్రేమగా చేస్తున్నాను

నేను నిజాయతీగా పని చేస్తున్నాను

నాకు వచ్చిన జీతానికి సరి పడా పని చేస్తున్నాను

ఇలా సమాధానాలు చెప్పాము.

అప్పుడు, స్వామి వారు...ఇలా చెప్పారు, నాయనా! 10 రూపాయలు జీతానికి సరి పడా 10 రూపాయల పని చేస్తే కూలి వాడు అంటారు. కనీసం అలా చేసినా బాగుంటుంది... కానీ చాలా మంది 10 రూపాయలు తీసుకుని 8 రూపాయల పనే చేస్తున్నారు...అది 2

రూపాయలు దొంగతనం చెయ్యడమే! నిజమైన ఆదర్శం ఏమిటో తెలుసా...మీకు ఎవరైనా 10 రూపాయల పని అప్ప చెపితే మీరు చాతుర్యముతో కనీసం 2 రూపాయలు విలువ (Value Addition) దానికి చేర్చి అందించినప్పుడు మీరే పని ఇచ్చిన వాడికి లాభం చేకూర్చినట్లు. అప్పుడిక మీదే పై చేయిగా ఉంటుంది.

అప్పుడు...పనియే పూజగా మారి పోయి యజమానికి మాత్రమే కాదు...దేశానికే అది భాగ్యం అవుతుంది. పిల్లలూ! ఇది కేవలం వృత్తి...వ్యాపార...వ్యవహారాలకు మాత్రమే కాదు...ఇప్పుడు మీరు విద్యార్థులు కాబట్టి చదువుకు ముడి పెట్టుకోవాలి. అప్పుడు మీకు చదువుతో పాటు సంస్కారం కూడా వంట పడుతుంది.

నేను, చాలా సంస్థలలో ఉద్యోగులను చూస్తుంటాను... చాలా అరుదుగా అంకిత భావనతో పని చేసే వాళ్ళను చూస్తాను. అలాంటి వాళ్ళను యాజమాన్యం కూడా ఎన్నటికీ వదులుకోదు. నేను సుమారు 30 సంవత్సరాల నుండి ఒక 10 సంస్థలలో పని చేసాను... ఎక్కడా చెడ్డ పేరు తెచ్చుకోలేదు. ఆ సంస్థలలో పని మానేసినా సరే, అక్కడి యజమానులతో ఇప్పటికీ సత్సంబంధాలు కొనసాగుతూనే వున్నాయి. ఇప్పుడు 1990 లో నేను పని చేసిన వాళ్ళు కొద్దిమంది కాలం చేశారు... కానీ వాళ్ళ కుటుంబములతో కూడా ఇప్పటికి స్నేహముతోనే వుంటున్నాను. నేను ఎక్కడ పని చేసినా బాబా గారు చెప్పిన ఈ సూత్రాన్ని పాటిస్తూనే వున్నాను. ఎవరైనా ఎక్కడైనా పనికి రాజీనామా పెడితే... వెంటనే వీడ్కోలు సభ పెట్టి సాగనంపితే, మీరు పని చెయ్యనట్లే. రాజీనామా పెట్టిన మరుక్షణం యజమాని స్వయంగా మిమ్మల్ని పిలిచి మాట్లాడి... మీరు వుండాలి మీ సేవలు సంస్థకు ఉపయోగము అని నిజాయతీగా చెప్తే మీరు మూడవ పేపర్‌లో విజయం సాధించినట్లే.

## నాల్గవ పేపర్ – అద్భుత సమాజం:

నేను బాగున్నా... నా కుటుంబం బాగుంది... నా ఉద్యోగం సూపర్ గా వుంది... ఇంకేం కావాలి అంటే నాకు చాలా చోట్ల సమాధానం దొరికింది. అదే, సామాజిక దృక్పథం. వర్తమాన కాలంలో పిల్లలు పెద్దలు అందరికి కూడా ఏదో కొంత సేవ చేయాలన్న దృక్పథం వుంది. కానీ అది ఫ్యాషన్ (Fashion) గా కాకుండా ప్యాషన్ (Passion) గా చేస్తే జీవితం ధన్యం అవుతుంది.

ఏ కాలం తీసుకున్నా...ఏ నాగరికత తీసుకున్నా... ఏ మతము తీసుకున్నా... ఏ రాజ్యం తీసుకున్నా... అన్ని చోట్లా మనకు కామన్‌గా కనిపించేది... వినిపించేది సామాజిక దృక్పథం...సేవ! అనాది కాలం నుండి ఉన్నంతలో పక్కవాడికి సేవ చేయాలన్న ఆలోచన వుంది.

పిల్లలూ! మీరు కూడా సామాజిక దృక్పథముతో నిస్వార్థంగా సేవ చేస్తారా? అని అడిగినప్పుడు... నూటికి 90 మంది సమావేశాల్లో అయ్యా... మేము పిల్లలం, ఇప్పుడు మేమేమి సేవ చేయగలం అని అడుగుతారు. నేను నవ్వుతూ చెప్తుంటాను...సేవ చేయడానికి కావాల్సింది సంకల్పం కానీ డబ్బులు కావు. మీరు చేసే సాయం కేవలం డబ్బు తోనే కాదు... ఇంకా ఎన్నో విధాలుగా చేయొచ్చు. శ్రమ దానం చేయొచ్చు, NCC లో చేరొచ్చు, స్కౌట్స్ & గైడ్స్‌లో వుండొచ్చు, స్వచ్ఛంద సంస్థలలో పని చేయొచ్చు, ముసలి వారికి సాయం చేయచ్చు, ఇంట్లో ఇచ్చే పాకెట్ మనీని పొదుపు చేసి అవసరంలో ఉన్నవారికి సాయం చేయవచ్చు. చివరకు రక్త దానం చేయచ్చు. చచ్చిన తరవాత బ్రతికే అవకాశం ఉన్న అవయవ దానం చేయొచ్చు. ఆలోచించండి ఇంకా ఇలా చాలా వుంటాయి డబ్బుతో ముడిపడని విషయాలు.

మొక్కై వంగనిది మానై ఒంగునా అంటారు కదా, చిన్నప్పటి నుండి లేని సేవా గుణం పెద్దయిన తరవాత ఎలా వస్తుంది చెప్పండి!

ఇక పెద్దలు, తమ దగ్గరున్న వనరులలో కనీసం 10% అయినా సేవకోసము వినియోగించాలి. అట్టి దృక్పథం కేవలం వ్యక్తికి, కుటుంబానికి, సమాజానికే కాక

దేశమునకు కూడా సౌభాగ్యం చేకూరుస్తుంది. అప్పుడిక మీరు నాల్గవ పేపర్ లో కూడా విజయం సాధించినట్లే.

సమాజం అంటే, కేవలం మనుషులు మాత్రమే కాదు సుమా...సర్వ ప్రాణులు, పంచ భూతాలు, పర్యావరణం, ప్రకృతి ఇలా సృష్టిలో ప్రతి అంశమును మనము సమాజంగానే లెక్క వేయాలి.

## అయిదవ పేపర్???

పిల్లాలూ ఇక జీవితంలో ఏమి కావలంటారు? అన్ని అంశాలు స్పృశించాము కదా? అయినా 80/100 మార్కులే వస్తున్నాయి. ఏది మనలో చేరితే మనము పరిపూర్ణము అవుతాము? ఇప్పటి దాకా మనము చదివిన పేపర్లు అన్ని కేవలం పప్పుతో సమానం. మిగితా 20% తెలుసుకున్నప్పుడే అది ఉప్పుగా మారి, పప్పుతో కలిసి పసందైన వంటకముగా మారుతుంది. ఏమై వుంటుంది ఈ అయిదవ పేపర్?

నూటికి 5% మంది కూడా ఎక్కడా చెప్ప లేక పోయారు. ఎన్నో లక్షల మందిని ఈ ప్రశ్న వేసి వుంటాను...నగదు బహుమతి కూడా ప్రకటించి వుంటాను. కానీ చాలా అరుదుగా నా ప్రశ్నకు సమాధనం వచ్చేది.

మీరు చెప్పగలరా? ఆలోచించండి. అయిదో పేపర్ టైటిల్.

పరిపూర్ణమైన వ్యక్తి కావాలంటే తప్పక మనము చేర్చుకోవాల్సింది... కూర్చుకోవాల్సింది... నేర్చుకోవాల్సింది ఏమిటో తెలుసా ఆధ్యాత్మికత. నువ్వు ఏ మతస్థుడైనా కావొచ్చు... కానీ ఆధ్యాత్మిక భావనతో...విలువలను నీ జీవితంతో ముడి వేసుకుని...వసుధైక కుటుంబకమ్... సమస్త లోకాః సుఖినోభవంతు...అందరిని ప్రేమించు అందరిని సేవించు ఇలాంటి భావనలతో బ్రతుకు పండించుకుంటే ఇక మన జీవితం సార్థకం అయినట్లే. ధర్మాధర్మముల విచక్షణ, పాపపుణ్య విచక్షణ కలిగి, బాల్యమునుంచే దైవభక్తితో, ధర్మనిష్ఠతో, కర్తవ్యదీక్షతో, భగవదర్పణబుద్ధితో పని చెయ్యటం అలవడాలి.

ఏమతమైతే ఏమిటీ...మానవత్వముతో... దైవత్వమునకు దగ్గరగా ప్రయాణం చేస్తూ మంచి మనిషిగా జీవించు. అప్పుడిక చచ్చిన తరవాత కూడా నువ్వు బ్రతకడం తథ్యం.



# 60. జీవిత పరమ గమ్యమేది?




## సమస్య:

*అయ్యా! మీరెన్నో విషయాలు చెప్తున్నారు. చాలా సంతోషంగా ఉంది. అసలు మనిషి యొక్క పరమ గమ్యము ఏమిటి? చెప్తే వినాలని ఉంది.*

*సార్, జీవితము అంటే తినడం, తిరగడం ఇంతే అంటారా? అసలు మరి ఏదైనా గమ్యమున్నదా? పుట్టిన అందరికి చనిపోయే లోపుగా చేరుకోవాల్సిన గమ్యం ఏమిటి ?*

*అసలు నేను ఎందుకు పుట్టాను?*

*నా జీవిత గమ్యం ఏమిటి?*

*నాకు తెలిసేలా చెప్పగలరా?*

## వివరణ:

పిల్లలూ! పెద్దలూ! నిజం చెప్తున్నాను సుమా! ఇలాంటి ప్రశ్నలు ఇంత దాకా నన్ను అడిగిన వారెవరు లేరు అని చెప్పాలి. అసలు 'జీవిత పరమ గమ్యము' అనే పద ప్రయోగము కూడా ఎవ్వరూ ఈ రోజుల్లో చేయరనిపిస్తుంది. జీవిత పరమ గమ్యాన్ని మనము అందరం తెలుసుకున్న రోజు, ఈ పుస్తకంలో వివరించిన ఏ విషయము కూడా అవసరం లేదు. జీవిత పరమ గమ్యమును తెలుసు కోగలిగిన వాడు నిజంగా కారణ జన్ముడే అవుతాడు. ఇది సత్యము.

నిజానికి ప్రాపంచిక దృష్టితో చూసినట్లయితే,

జీవితములో సుఖ సంతోషములు మరియు కీర్తి ప్రతిష్టలు – ఇవి మాత్రమే గమ్యముగా గోచరిస్తాయి. శాశ్వత కీర్తిని సంపాదించిన వారు మరణించినా, కీర్తి దేహంతో జీవించే ఉంటారు. చాలా అరుదుగా మనిషి తన జన్మ యొక్క పరమ గమ్యము మోక్షముగా గుర్తిస్తాడు. అట్టి వారు భౌతిక దేహముతో లేకపోయినా సదా ప్రాతస్మరణీయులై ఉంటారు.

ప్రతి మనిషి జీవితానికి ఒక గమ్యం ఉంటుంది కదా ! అదేమిటి ? అన్నది ప్రతి మనిషికి ఎప్పుడో ఒకప్పుడు కలిగే సందేహము. మనిషి చనిపోయే లోపుగా సాధించవలసినది ఉంటుందని పెద్దలు చెప్తారు. మానవ జీవిత గమ్యము, చతుర్విధ పురుషార్థములను సాధించటమేనని మహర్షులు చెప్పారు. అవి ధర్మము, అర్థము, కామము, మోక్షము. మానవుడు ధర్మ మార్గములో అర్థము సంపాదిస్తూ, తన కోరిక కేవలం మోక్షమును సాధించుట అయి జీవితమును సాగించాలి. ఈ విధంగా చూసినట్లైతే, మనము సాధించవలసినవి రెండే అని చెప్పవచ్చునని నేను అభిప్రాయ పడుతున్నాను. అవి – ధర్మార్థము & కామమోక్షము. అంటే, ధర్మ బద్ధమైన ధనార్జనము, మోక్షకాముడై జీవించటము.

మనము మరణించినా మన పేరు శాశ్వతముగా నిలిచి ఉండాలి. ఈ భూలోకంలో మన పేరు ఎంత కాలం స్మరింపబడుతూ ఉంటుందో అంత కాలము మనము నిజంగా బ్రతికినట్లు అని చెప్పారు పెద్దలు.

భౌతికంగా మనము మరణించినా, కీర్తి శరీరాలతో చిరంజీవులుగా బ్రతికే ఉంటాము. కానీ అందరికీ కీర్తి పొందగల ప్రతిభ ఉండకపోవచ్చు. మరి కీర్తి ఎలా పొందాలి ? అంటే, త్యాగముతో, దానముతో, ప్రేమతో సమాజములో ఇతరులకు ఉపయోగపడేలా జీవించటం వలన కీర్తి ప్రతిష్టలను పొందవచ్చును. అందుకే "త్యాగేనైకేన అమృతత్వ మానసుః" అని ఉపనిషత్తు చెప్పింది. అంటే త్యాగమొక్కటే మనిషిని అమృతత్వమును పొందేలా చేస్తుంది.

భగవాన్ వేదవ్యాస మహర్షులవారు 18 పురాణాలను సంస్కృతములో వ్రాసారు. ఆయన సాక్షాత్తు శ్రీ మహా విష్ణువు యొక్క అవతారము అని అంటారు. ఒక సారి వారి దగ్గరకు నారద మహర్షి వెళ్ళి, స్వామీ! మీరు ఇన్ని పురాణాలు వ్రాశారు కదా! వీటన్నింటి సారమును రెండు మాటలలో చెప్పగలరా! అని అడిగారట. దానికి ఆయన ఇలా సెలవిచ్చారు: పరులకు ఉపకారము చెయ్యటమే పుణ్యము, బాధ పెట్టటమే పాపము.

అష్టాదశ పురాణేషు। వ్యాసస్య వచనంద్వయం॥
పరోపకారాయ పుణ్యాయ। పాపాయ పరపీడనం॥

**అర్థం ఏమిటంటే:** 18 పురాణములలోను వాటి సారభూతముగా, వ్యాస మహర్షి రెండే మాటలు చెప్పారు. అవి ఏమిటంటే పరోపకారమే పుణ్యము, పర పీడనమే పాపము.

నిజానికి మానవ జీవిత గమ్యము ఇదే కదా! గొప్ప పనులు చేయలేము అని అనుకునే వారు కూడా తమ జీవితాలను సుఖంగా, సంతోషంగా గడుపుతూ, శాంతి సంతృప్తులతో జీవిస్తే, వారి జీవితము సఫలమైనట్లే! ప్రతి ఒక్కరు కూడా తమ కర్తవ్యాలను తాము భగవదర్పణ భావంతో నిర్వహిస్తూ, భగవంతుడు ఇచ్చిన మానవ బంధాలను, అనుబంధాలను ప్రేమిస్తూ, గౌరవిస్తూ, పెద్దా, చిన్నా తేడాలను పాటిస్తూ, సత్యధర్మాలను వదిలి పెట్టకుండా, తననూ, తనవారిని, తోటివారిని ప్రేమిస్తూ, అందరికోసం జీవించ గలిగితే వారు తమ జీవిత గమ్యాన్ని చేరినట్లే! శాంతి ఉన్న మనసులో పవిత్రమైన ఆలోచనలు కలుగుతాయి, పరమాత్మ నివసిస్తాడు. పరమాత్మ సత్ చిత్ ఆనంద స్వరూపుడు. మానవ జీవిత పరమ గమ్యము ఆనంద ప్రాప్తే! ప్రతి మనిషికి ఎన్నో తాత్కాలికమైన గమ్యాలు వుంటూ ఉంటాయి. ఉదాహరణకు విద్యార్థులకు ప్రతి ఏడాది, ఏయేటికాయేడు ఆ ఏడాది పరీక్షలను పాసై పైక్లాసులకు వెళ్ళ గలగటం అప్పటికి గమ్యం.

## సూచనలు:

జీవితంలో తాము ఏమి కావలని కోరుకుంటారో అది అవటం వారి గమ్యం. దానికి ప్రయత్నించడం వారి సాధన. అలాగే జీవితంలో చదువు, వివాహము, పిల్లలు, వారి పిల్లలు, ఇలా ఎప్పట్టికప్పుడు గమ్యాలు మారుతూ ఉంటాయి. ఉద్యోగాలలో టార్గెట్లు రీచ్ అవడం అప్పటికి గమ్యాలు. ఇవన్నీ నిజంగా జీవిత గమ్యాలా? అంటే, పరమ గమ్యాన్ని చేరే ప్రయత్నంలో చేసే ప్రయాణంలో వచ్చే మైలురాళ్ళవంటివి మాత్రమే అని చెప్పాలి. కొందరికి వారి వారి భావనల ప్రకారం నిర్దిష్టమైన జీవిత గమ్యం ఉంటుంది. ఒక ఆశయం ఉంటుంది. దానిని పొందటానికి ప్రయత్నము చేయవచ్చు , సాధించవచ్చు. ఎవర్నికైతే, లౌకికముగా వారు ఏమి చేస్తున్నా, మనస్సు, హృదయము మాత్రము ఎప్పుడూ మానవ జీవిత పరమ గమ్యమైన పరమాత్మయందు లగ్నమై ఉంటుందో, వారు ధన్యులు. వారు తమ జీవిత పరమ గమ్యాన్ని చేరగలుగుతారు. మానవ సేవయే మాధవ సేవ. మానవ రూపములో మాధవుని సేవించి, తమ జీవిత గమ్యం చేరగలరు.

## ప్రేరణ మంత్రము:

'జీవితము' యొక్క పరమ గమ్యము - 'జీ - వి - త - ము' అనే 4 అక్షరాలలోనే దాగి ఉంది.

ఈ పదములలో 'వి' అనేది ప్రాణ శబ్దము. 'వి' అంటే 'విలువలు.' అది తీసేస్తే 'జీతము' మిగిలి పోతుంది. విలువైన జీతం కంటే విలువలు గల జీవితమే మంచిది.

## స్ఫూర్తి:

విశ్వదాభిరామ వినురవేమ అనే మాట వినని తెలుగు వాడు ఉండడు. వానకు తడవనివారు, ఒక్క వేమన పద్యం కూడా రాని తెలుగువారు ఉండరని లోకోక్తి. అంత ప్రఖ్యాతి గాంచిన వేమన 16 - 17 వ శతాబ్దము మధ్య కాలములో జీవించాడు. వేమన కొండవీటి రెడ్డిరాజవంశానికి చెందిన వారు. వేమన సుఖ సంతోషాలకు అలవాటైపోయి...వేశ్యా లోలుడై... ఎవరికీ కానివాడిగా మారి పోయారు. ఈ కథ అందరికి తెలుసును కదా.



ఆ కాలంలో వారి రాజ్యంలో నెలకొన్న కరువులు, పాలకుల అక్రమాలు, ఈతిబాధలు అతని ఆలోచనలకు పదును పెట్టాయి. స్వకార్యాలకు, లోకోపకారానికి ఎలాగైనా స్వర్ణ విద్యను సాధించాలని దీక్ష పూనారు. అతను ఎందరో యోగులను, గురువులను దర్శించారు. వారు చెప్పిన సాధనలు చేశారు. గురువుల మర్మాన్ని తెలుసుకొన్నారు. ప్రాపంచిక జీవితంలో ఎంత మోసం, కపటం, నాటకం, దంభం వున్నాయో గ్రహించిన వేమన

సన్యాసుల బ్రతుకులలో కూడా అవే లక్షణాలున్నాయని తెలుసుకొన్నారు. వారి వోనమును ఎలుగెత్తి ఖండించారు. ఒక సంఘ సంస్కర్తగా మారి... జీవితములోని పరమ గమ్యాన్ని తెలుసుకున్నాడు.

వేమన భార్య, కూతురి పెళ్ళి చేసి అల్లుని ప్రాపున సంసారం లాగిస్తున్న సమయంలో. వేమనను వెనుకకు రమ్మని అల్లునితో రాయబారం పంపింది కాని వేమన తిరస్కరించారు. కులాన్నీ, అధికారాన్నీ, అహంకారాన్నీ, సంపన్నుల దౌష్ట్యాన్నీ నిరసిస్తూ ఊరూరా తిరిగి తత్వాలు చెప్పసాగారు. కొందరు వెర్రివాడని తరిమికొట్టారు. తనను తానే వెర్రి వేమన్న అని అభివర్ణించుకొన్నారు. వేదాంత సారాన్ని తన చిన్న పద్యాలలో పొందుపరచి ఊరూరా ప్రబోధించారు.

ఆత్మ సంస్కారాన్ని, కుల సంస్కారాన్ని, ఆర్థిక సంస్కారాన్ని ప్రబోధించారు. గురువుల కపటత్వాన్ని నిరసించారు. జీవితంలో, తత్వంలో, దాని ఆచరణలో అంతగా సాధన చేసి బోధించినవారు అరుదు అని చెప్పాలి. అన్నీ అనుభవించి...ఏమీ పట్టని వాడిగా సర్వ సుఖాలను త్యజించి పరమ గమ్యమైన లోకోపకారమునకై నడుము బిగించి సంఘ సంస్కర్తగా మారిపోయాడు. చరిత్రలో మిగిలి పోయాడు. పోయిన తరవాత కూడా మన హృదయాలలో నిలచి పోయాడు.



# 61. జీవితంలో ఏదైనా సాధించడం ఎలా?




## సమస్య:

*జీవితంలో ఏమైనా సాధించాలంటే ఏమి చేయాలి? ఆ సాధనలో ఎదురయ్యే సవాళ్ళను ఎలా అధిగమించాలి? ఏ విధంగా అనుకున్నది అందుకోవాలి? విజయ పథంలో దారి తప్పకుండా ఎలా ముందుకెళ్ళాలి? అసలు జీవితంలో ఏదైనా ఎందుకు సాధించాలి.*

## వివరణ:

జీవితము అన్నదే ఒక సాధన! ఎలాగంటారా? పిల్లలూ... పుట్టిన దగ్గర నుండి చచ్చే దాకా మనం చేసే ప్రతి పనిలో కూడా సాధించడం వుంది. ఒక్క సారి సింహావలోకనం చేసుకోండి. అమ్మ కడుపులో నుండి విజయ వంతముగా ప్రాణాలతో బయట పడటము తోనే మొదలవుతుంది మనము సాధించేది. కానీ ప్రపంచములో పుట్టే ప్రతి ప్రాణి పుట్టటం, పెరగడం, తినడం, కృశించిపోవడం, చనిపోవడం, జరిగేవే!... ఇందులో ప్రత్యేకత ఏమీ లేదు.

జీవితంలో సాధించడం అంటే...ఏదైనా ప్రత్యేకత వుండాలి. అందరిలా జీవించి అందరిలా చనిపోతే ప్రాముఖ్యత ఏముంది చెప్పండి. పుట్టిన తరవాత అసామాన్యమైన దేదైన సాధించి నప్పుడు మాత్రమే ఎవరినైనా సరే పది మంది గుర్తుంచు కుంటారు. అందులోనూ లోకోపకారమైనది ఏదైనా చేస్తే ఇక మనము చచ్చిన తరవాత కూడా గుర్తుంచు కుంటారు.

సాధారణంగా బ్రతికి తిన్నామా...త్రాగామా... పడుకున్నామా... పోయామా అంటే అందులో ఏమీ వుండదు.

ఒక సారి సన్యాసి, చిన్నారి పిల్లలతో మాట్లాడుతున్నారు. ఉన్నట్టుండి, పిల్లాలూ నేను ఒక ప్రశ్న వేస్తాను సమాధానం చెప్తారా? అని అడిగారు. అందరూ ముక్త కంఠంతో చెప్తాము అని చెప్పారు.

సరే అయితే,

**సన్యాసి:** రామూ, మీ నాన్న పేరు ఏమిటి?

**రాము:** కృష్ణయ్య

**సన్యాసి:** పాపా మీ తాత పేరు?

**పాప:** సుబ్బయ్య

**సన్యాసి:** బాబూ, మీ ముత్తాత పేరేంటి?

**బాబు:** ????

**సన్యాసి:** జయా! మీ ముత్తాత గారి తండ్రి పేరు చెప్పగలవా?

**జయ:** చెప్పలేను స్వామి! క్షమించండి.

అప్పుడు ఆ సన్యాసి అడిగాడు...మీకు స్వామి వివేకానంద తెలుసా? పిల్లలందరూ ఏక కంఠంతో YES స్వామి తెలుసు అని అరిచారు.

అప్పుడా సన్యాసి! గాంధీ తాత తెలుసా...అని అడిగిందే ఆలస్యం, అందరూ ఓ తెలుసు మన జాతి పిత బాపూజీ అని చెప్పారు.

సన్యాసి మళ్ళీ అడిగాడు! ఒరేయ్, మీకు థామస్ ఆల్వా ఎడిసన్ తెలుసా? ఈ సారి అందరూ గట్టిగా తెలుసు అని చెప్పారు.

సన్యాసి ఈ సారి, పిల్లలూ! మీకు శంకరాచార్యుల వారు తెలుసా? పిల్లలందరూ కూడా కేరింతలు కొడుతూ, తెలుసు తెలుసు అని చెప్పారు.

అప్పుడాయన, ఇలా చెప్పాడు. పిల్లలూ! మీ తాత ముత్తాతలే గుర్తులేరు... కానీ మీకే రక్త సంబంధము కూడా లేని వాళ్ళు, కొన్ని వందల సంవత్సరాల క్రితం జీవించిన వాళ్ళు, మనము చూడని వాళ్ళు... వీళ్ళందరు ఎలా గుర్తున్నారు అని ప్రశ్నించారు. పిల్లలందరికి ఒకింత ఆశ్చర్యం అయింది. అయినా సరే చెప్పారు... స్వామీ వీళ్లంతా ఎంతో అద్భుతమైన జీవితం గడిపిన వాళ్ళు... లోకోపకారాన్ని చేసిన వాళ్ళు... వాళ్ళను మరవడం ఎలా సాధ్యం అవుతుంది?

అప్పుడాయన చెప్పాడు... పిల్లలూ! మీరుకుడా ఎదో ఒక అద్భుతం సాధిస్తేనే రేపు మీ వారసులు, మనుమలు, ముని మనుమలు, ఈ లోకం మిమ్మల్ని కూడా గుర్తుంచు కుంటుంది లేకుంటే కనీసం మీరు కన్న వాళ్ళు కూడా మిమ్మల్ని తలచుకోరు. ఇప్పుడు అర్థం అయిందా... జీవితంలో ఏమి సాధించాలో? చచ్చేలోపుగా మనము చచ్చిన తరవాత బ్రతికే పనులు చేయాలి. లేదంటే బ్రతికినా చచ్చినట్లే అని తెలుసుకోండి.

ఇంటికి పనికొచ్చే పని చేస్తే...ఇంట్లో వాళ్ళు
గ్రామానికి పనికొచ్చే పని చేస్తే...గ్రామస్థులు
దేశానికి పనికొచ్చే పని చేస్తే...దేశ ప్రజలు
లోకానికే పనికొచ్చే పని చేస్తే...లోకమంతా

మనము చేసిన పనిని మాత్రమే కాదు...మనల్ని కూడా నిరంతరం తలుస్తారు. ఎవరెవరి తాహతును బట్టి వాళ్ళేలాంటివి సాధించాలో నిర్ణయం చేస్తుంటారు.

మీరు చచ్చిన తరవాత కూడా బ్రతకాలి అనుకుంటే మాత్రం లోకమునకు ప్రయోజనం కూర్చే కార్యం ఏదైనా సాధించండి.

డబ్బులు సంపాదించడం
మంచి ఉద్యోగం చేయడం
మిద్దెలు మేడలు కట్టడం
ఆస్తి పాస్తులు కూడపెట్టడం
వృత్తి వ్యాపారాలు పెట్టడం
విదేశాలలో స్థిర పడటం
పరిశ్రమలు స్థాపించడం
ప్రభుత్వ అధికారిగా ఉండటం

శాసన సభ్యుడు గా సేవించడం
మంత్రి లేక ముఖ్యమంత్రి అవడం
ప్రధాన మంత్రి అవడం
ప్రెసిడెంట్ కావడం
ఏ రంగంలోనైనా ప్రతిభ చూపడం
మానవాళికి ఉపయోగ పడే ఆవిష్కరణ చేయడం
సన్యాసిగా సమాజానికి దిక్సూచి కావడం
సేవలలో జీవితాన్ని సార్థకత చేయడం
నిస్వార్థంగా అందరి కోసం బ్రతకడం
ఇంకా ఎన్నో వున్నాయి... కానీ

ఇవన్నీ కూడా సాధించ గలిగినవే... ఎవరి స్థాయిని బట్టి వాళ్ళు లక్ష్యాలను...జీవిత కార్యాన్ని ఎంచుకుంటారు.

ఒక్క సారి మీకు తెలిసిన అద్భుత వ్యక్తుల 10 పేర్లు ఒక పేపర్ తీసుకుని వ్రాయండి. అందులో వారు బ్రతికిన కాలాన్ని వాళ్ళ వయస్సును కూడా నోట్ చేయండి. ఇప్పుడు అందరి కంటే ఎవరు వందల సంవత్సరాలు క్రితం ఉన్న వాళ్ళు గుర్తించండి...మీకే తెలిసి పోతుంది, వాళ్ళు చేసిందేమిటి? అన్నది. ఎందుకు మీరు గుర్తు పెట్టుకున్నారు ఒక సారి ఆలోచిస్తే...మీరు కూడా జీవితంలో ఏమి సాధించాలో తెలుస్తుంది.

## సూచనలు:

*1. 50 ఏళ్ళు వచ్చే సమయానికి మీరు ఏమి చెయ్యాలో వ్రాయండి.*

*2. అది వ్యక్తిగతమా, కుటుంబం కోసమా, వృత్తి కోసమా, సమాజం కోసమా అన్నది కూడా వ్రాయండి.*

*3. మీరెంచుకున్న లక్ష్యం లోకము మిమ్మల్ని ఎంత కాలం గుర్తుంచుకుంటుందో కూడా పరిశీలించండి.*

*4. నీకు సంతృప్తిగా అనిపిస్తే...ఇక దాన్ని మీ జీవిత కార్యంగా గుర్తించుకోండి.*

*5. ఇక జీవితంలో మిగతా ఎన్ని పనులు చేసినా, మీ లక్ష్యాన్ని చేరుకోవడానికి అవి ఎలా ఉపయోగ పడతాయి అన్నది ఆలోచిస్తూ... పనికి రాని వాటి మీద దృష్టి పెట్టకండి.*

*6. ఈ లక్ష్యసాధనలో... ఆ దేవుడే అడ్డు నిలబడినా ఎదుర్కొనే దృఢ విశ్వాసాన్ని సొంతం చేసుకోండి.*

*7. అనుకున్న లక్ష్యము సాధించడం కోసమై వీలయితే నీదనుకున్న సర్వం వదిలేసే ధైర్యం నీదవ్వాలి.*

*8. నీ మీద నీకు నమ్మకం, భగవంతుని మీద నమ్మకం ఇదే మన అందరి విజయ రహస్యం.*

*9. చచ్చిన తరవాత కూడా బ్రతికే పనులే చేయడమే అసలైన సాధన అని గుర్తించండి.*

## ప్రేరణ మంత్రం:

*కోర్కె బ్రతికించు కొన్నాళ్లు కొన్నేళ్లు।*
*ఆశ బ్రతికించు నీయుండు దాకా॥*
*అశయమొక్కటేర అమరత్వ మిచ్చేది।*
*వినుర బాలచంద్ర వినయ సాంద్రా॥*

## స్ఫూర్తి:

పిల్లలూ! మీకు నేను ఒక హోమ్ వర్క్ ఇస్తున్నాను. ఈ వ్యాసం మీకు నిజంగా ఉపయోగ పడిందనుకుంటే... మీకు బాగా నచ్చిన ఒక అద్భుతమైన వ్యక్తి కథ వ్రాసి అందులో ఈ క్రింది ప్రశ్నలకు సమాధానాలు కూడా వ్రాసి నాకు ఇమెయిల్ చేయండి (balachandra70@yahoo.com)

జీవితంలో సాధించడానికి అతను ఏమి చేసాడు? ఆ సాధనలో ఎదురయ్యే సవాళ్ళను ఎలా అధిగమించాడు? ఏ విధంగా అనుకున్నది అందుకున్నాడు? విజయ పథంలో దారి తప్పకుండా ఎలా ముందుకెళ్లాడు? అసలు జీవితంలో ఆ లక్ష్యాన్ని ఎందుకు సాధించాడు.

# 62. గొప్ప వాడా? లేక మంచి వాడా?




## సమస్య:

*అయ్యా! నాకు ఎప్పుడూ ఒక కన్ఫ్యూజన్ వుంటుంది. జీవితంలో నేను గొప్పవాడిని అవ్వాలా? లేక మంచి వాడినవ్వాలా? చాలా సార్లు ఈ విషయంమీద చర్చిస్తుంటాను. కానీ సంతృప్తి కరమైన సమాధానం దొరక లేదు. చదువు కుంటున్న ఈ వయసులోనే ఇలాంటి విషయాలు తెలుసుకుంటే మంచిది అని నేను ఈ విషయం అందరి కోసం వివరించమని వేడుకుంటున్నాను.*

## వివరణ:

పిల్లలూ! నాచిన్నప్పటి నుండి చూస్తున్నాను... వింటున్నాను, గొప్పవాడవ్వాలి అని చెప్తున్న మాటలు. నాకు కూడా మీలాగానే సందేహంగా వుండేది. గొప్ప వాడవ్వాలా లేక మంచి వాడవ్వాలా అని..తికమక పడే వాడిని. అందరూ గొప్పవాళ్ళుగా మారాలని చెప్తున్నారు ఏమిటి? అని

చిన్నప్పటి నుండి RSS మరియు సరస్వతి విద్యా మందిర్‌తో సంపర్కము ఉండటం వల్లనైతే నేమి! సంస్కార వంతమైన విషయాలు వినడం వల్లయితే నేమి...సదాచార తరగతుల్లో అద్భుత విషయాలు తెలుసుకోవడం వల్లయితే నేమి, మహనీయుల చరిత్రలు చదవడం వల్లయితే నేమి మొత్తానికి మంచి వాడిగా ఉండడంలోనే ఆనందం వుందని దృఢంగా నమ్మే వాడిని.

నేను 12 ఏళ్ల వయసులో శ్రీ సత్యసాయి బాబా వారి సంస్థలో నడిపే బాలవికాస్‌కు వెళ్ళేవాడిని. అప్పుడు చాలా స్పష్టంగా గొప్ప వాడికి మంచి వాడికి తేడా బాగా

వ్యత్యాసం తెలిసింది అని చెప్పాలి. ఉదాహరణకు మహాభారతం కథ తీసుకుంటే అందులో కౌరవులు గొప్ప వాళ్లయితే... పాండవులు మంచివాళ్ళకు చిహ్నంగా చెప్పుకోవచ్చు. భగవంతువుడి దయ కూడా మంచి వాళ్ళకే ఉంటుంది అనిపించేది. ప్రతి పురాణ గ్రంథాలలో కూడా ఇలాంటి వ్యక్తులు తారసపడేవాళ్ళు. ఎందుకో చిన్నప్పటి నుండి నేను కూడా మంచివాడుగా ఉండాలని ఉవ్విళ్లూరుతుండే వాడిని. అందుకు ఎన్నో అనుభవాలు ఎదురయ్యేవి కూడా.



నాకు గుర్తు, 1985 సంవత్సరంలో (నాకు 15 సంవత్సరాలు) నాది మధ్య తరగతి కుటుంబ నేపథ్యం. RSS లో అలవడిన సేవా దృక్పథం కాస్తా బాలవికాస్‌లో చేరడం వలన ఎంతో పుష్టి పొంది నన్ను పరుగులు పెట్టేంచేది. బాబా గారి 60 వ పుట్టినరోజు పండుగ సందర్భంగా చేస్తున్న సేవల్లో భాగంగా నేను ఒక మురికి వాడకు వెళ్లి అక్కడున్న 60 మంది చిన్నారి పిల్లలకు పౌష్టికాహారం ఇచ్చే వాడిని. సుమారు 40 రోజులు సాగింది ఈ సేవ. నాకున్న చిన్న సైకిల్‌లో తాడిపత్రిలో ఉన్న బాబా గారి ఒక్కో భక్తుడి ఇంటికి వెళ్లి దినుసులు తీసుకుని, పిండిమరకు వెళ్ళి, వాటిని పొడి చేయించి ఒక డబ్బాలో వేసుకుని వెళ్లి పంచేవాడిని.

ఒక రోజు, ఒక భక్తుడి ఇంటికి (శ్రీ కుల్లూరు సుబ్బారాయుడు) దినుసులు సమీకరించడానికి వెళ్ళినప్పుడు వారు నన్ను ఎంతో సాదరంగా ఆహ్వానించి... తమ పూజా మందిరంలోకి తీసుకుని వెళ్లారు. నా క్షేమ సమాచారాలు అడిగారు. మా నాన్న గారిని వారి ఆర్థిక విషయాలు కూడా వారికి ఎరుకే అని చెప్పారు. నాయనా ఇంత చిన్న వయసులో ఎంత మంచి పనులు చేస్తున్నావు. నాకు చాలా సంతోషంగా వుంది. మీ ఇంటి పరిస్థితులు నాకు తెలుసు. నేను నీ కోసం కొన్ని పుస్తకాలు, వ్రాసుకునే సామగ్రి తెచ్చాను అని చాలా ఆనందంగా ఒక సంచిని దేవుడి దగ్గర నుండి తీసి నా చేతికందించి నమస్కరించాడు. గుర్తుంచుకోండి అప్పుడు నాకు 15 ఏళ్ళు. నన్ను ఈ సంఘటన బాగా ప్రభావితం చేసింది. అరె... జీవితంలో మంచి వాడిగా వుంటే నేను ఎదుటి వారితో ఎంత ప్రేమించబడతానో తెలుసుకున్న ఒక అనుభవం ఇది.

పిల్లలూ!... నేను చెప్తున్నాను అని కాదు, మీరు మంచి ప్రవర్తనతో వుంటే... ప్రపంచమే మిమ్మల్ని ప్రేమించడం మీరు చూస్తారు. మంచిగా ఉండటం అంటే ...మంచి బట్టలు, మంచి అలంకరణ, ఆడంబరాలు, సింగారములు బంగారములు కాదు సుమా! మంచి ఆలోచనలు... మంచి మాటలు...మంచి చేతలు. ఇంతే. మిమ్మల్ని దేవుడు కూడా ప్రేమిస్తూనే ఉంటాడు.

ఒక చిన్న పిల్లాడు, ఇంట్లో తన తల్లితో గొడవ పడి... పట్టరాని కోపంతో అమ్మను ఏమి అనలేక ఇంటికి దూరంగా వెళ్లి అక్కడున్న కొండ దగ్గరగా వెళ్లి గట్టిగా ఎలుగెత్తి "I Hate You" అని అరిచాడు. ఆశ్చర్యంగా కొండ వెనుక నుండి "I Hate You" అన్న ప్రతిధ్వని వినిపించింది. చాలా భయం వేసింది. తాను అమ్మను అంటే...ఆ కొండ వెనక నుండి ఎవరో తనను అంటున్నట్లుగా అనిపించి, ఇంటికి పరిగెత్తుకుంటూ వెళ్ళి అమ్మను రెండు చేతులతో చుట్టేసి ఈ విషయము అడిగాడు. ఎందుకలా జరిగింది...ఎవరు అలా నన్ను ద్వేషిస్తున్నారు? అని అమాయకంగా అడిగాడు.

ఆ తల్లి నవ్వుతూ చెప్పింది. నాన్నా! ఈ సారి నువ్వెళ్ళి..."I




Love You" అని చెప్పు...అప్పుడు చూడు అవతలి వాళ్లేమంటారో? ఆ పిల్లాడు అదే చేశాడు. ఈసారి ప్రతిధ్వని కూడా "I Love You"...అనే వినిపించింది. ఆ పిల్లాడికి చాలా ఆనందం అయింది.

నువ్వు లోకములో ఎలా ప్రవర్తిస్తే...లోకం కూడా నీతో అలాగే ప్రవర్తిస్తుంది. So, పిల్లలూ...మంచిగా ఉంటే... ప్రపంచమే నీతో మంచిగా ఉంటుంది.

పూర్వము, గ్రీకు రాజును అందరూ...Alexander The Great అనే వారని మీరు కూడా వినే వుంటారు కదా? కానీ చివరకి అతను కూడా వెళ్లేటప్పుడు ఎవరూ తను చేసిన మంచి చెడులను తప్ప పూచిక పుల్ల కూడా వెంట తీసుకుని వెళ్ళలేరన్న సత్యం చెప్పిపోయాడు.

## ప్రేరణ మంత్రం:

*All Good People are Great. But, not all great people are good in the society.*

## స్ఫూర్తి:

ఆ మధ్య కాలంలో దేశ వ్యాప్తంగా వినిపించిన ఇద్దరు వ్యక్తుల కథ చెప్తాను వినండి.

ఒకరు దేశంలోని సముద్ర తీరం లోని ఒక చిన్న పట్టణంలో అతి సామాన్య కుటుంబంలో జన్మించితే... మరొకరు దేశంలోని ఇంకొక సముద్రతీరంలోని ఆర్థిక రాజధానిలో జన్మించారు. ఇద్దరు కూడా ముస్లిం మతస్తులే. ఒకరు చదువులో అంత ప్రతిభ చూపించ లేక పోయేవారు. మరొకరు చిన్నప్పటి నుండి అత్యంత ప్రతిభ కనపరిచేవారు.

ఒకరు, తరవాత కాలంలో సాంకేతిక విద్యలో పట్ట భద్రుడై ప్రభుత్వరంగ సంస్థల్లో పని చేయడం ప్రారంభం చేస్తే... మరొకరు దేశంలోనే పేరెన్నిక గన్న CA కోర్సు చేసి స్వంతంగా వృత్తి నిపుణుడుగా జీవితం ప్రారంభించాడు. ఒకరు మంచి పేరు సంపాదిస్తే మరొకరు కోట్లు గడించారు, వివిధ వ్యాపారాలు చేసేవారు.



ఒకరు తనదైన ప్రతిభతో DRDA లో సంచాలకులు అయి ఎన్నో అద్భుత ప్రయోగాలు చేస్తే... మరొకరు ముస్లిం తీవ్రవాదులతో ప్రయోగములు చేసే వారు. మొదటి వ్యక్తి భారత దేశమును ప్రపంచ ప్రఖ్యాతి చెందిన దేశముగా చేయాలన్న దృఢ సంకల్పముతో అంతరిక్ష ప్రయోగాలు చేయడమే గాక...అణ్వస్త్ర పరీక్షలకు సైతము నాయకత్వము వహిస్తే...రెండవ వ్యక్తి తీవ్రవాద కార్యకలాపాలకు, ఉగ్రవాద దాడులకు ఆర్థిక సాయం అందించాడు.

ఒకరు, భారతదేశానికి తలమానికంగా అధ్యక్ష పదవిని అలంకరిస్తే...మరొకరు చేసిన తప్పులకు ఖైదు కావించబడ్డారు.

ఒకరు చివరి క్షణం దాకా ఎంతో ఆదర్శ వంతముగా...తన శేష జీవితాన్ని దేశ భవిత అయిన యువత కోసం వెచ్చిస్తూ ప్రాణం విడిస్తే... మరొకరు తను చేసిన నేరాలకు జైలు శిక్ష అనుభవిస్తూ ఉరితీయబడ్డాడు.

ఒకరు మంచి వారై గొప్ప వారిగా అమరుడయ్యాడు... ఇంకొకరు గొప్ప వాడైనా సరే మంచి వాడు కాలేనందుకు చరిత్ర హీనుడయ్యాడు.

పిల్లలూ! మీకు ఈపాటికే అర్థం అయి ఉంటుంది కదా...మొదటివ్యక్తి భారతరత్న Dr APJ అబ్దుల్ కలాం గారు. ఆయన ప్రజల అధ్యక్షుడిగా భారత జాతి గర్వించే వ్యక్తిలా వెలిగాడు. పోయిన తరవాత కూడా అందరికి ప్రాతః స్మరణీయుడుగా చరిత్రలో హీరోలా మిగిలి పోయాడు...

రెండవ వ్యక్తి యాకుబ్ మెనన్, వ్యవస్థాపకుడు మెనన్ & మెనన్, ఛార్టర్డ్ అకౌంటెంట్స్, ముంబై వ్యవస్థీకృత ఉగ్రవాద చర్యలకు ఆర్థిక ఊతం అందించి చరిత్రలో హీనుడిగా మిగిలిపోయాడు.

పిల్లలూ!... మీరు ఇప్పుడు కాస్త శ్రద్ధగా పరిశీలిస్తే ఒక విషయం అవగాహన అవుతుంది. ఎవరైనా సరే, మంచి వాడుగా ఉన్నప్పుడు మాత్రమే మనుగడ. గొప్పగా బ్రతకడం కంటే మంచి గా బ్రతకడం నేర్చు కుందాం.

గుర్తుంచుకోండి...విద్య యొక్క పరమావధి శీలమే.

# 63. విలక్షణంగా జీవించడం ఎలా?




## సమస్య:

*అయ్యా! లక్ష్యంతో బ్రతకమని అందరూ చెప్తూ ఉంటారు కానీ లక్ష్యం వున్నా విలక్షణముగా బ్రతకడం ఇంకా మంచిది అని పెద్దవాళ్ళు చెబుతూ ఉండగా విన్నాము. దయవుంచి విలక్షణముగా బ్రతకడం గురించి వివరించండి.*

## వివరణ:

అందరు మనుషులు గానే ఉన్నా...ప్రతి ఒకరి DNA వేలిముద్రలు మాత్రము వైవిధ్యంగా వుంటాయి. అవి మనలను ఇతరుల నుండి వేరుగా గుర్తించడానికి ఉపయోగ పడతాయి. మరి జీవితములో విలక్షణత లేక వైవిధ్య భరితముగా ఎలా వుండడానికి సాధ్యం అవుతుంది?

పిల్లలూ! మన దేశానికి చాలామంది రాష్ట్రపతులుగా వుండి సేవలు చేసి వెళ్లిపోయారు. మీకు బాగా గుర్తున్న రాష్ట్రపతి ఎవరు? అని అడిగితే, ఏం చెప్తారు ఎవరి పేర్లు చెప్తారు?

ఈ ప్రశ్న నేను చాలా సమావేశాలలో అడిగాను. నాకు వెంటనే వినిపించే పేర్లు Dr APJ అబ్దుల్ కలాం...లేదా Dr సర్వేపల్లి రాధా కృష్ణన్...ఇలా. ఇప్పుడు కూడా అవే పేర్లు చెప్తారు మీరు అనుకుందాం. అంతకంటే వేరే పేర్లు గుర్తుండే అవకాశం తక్కువ. మహా అయితే ప్రస్తుత రాష్ట్రపతి పేరు చెప్పొచ్చు.

ఒకే, పిల్లలూ...ఈ వ్యక్తులు ఎందుకు గుర్తున్నారు? చెప్పండి. ఇప్పటి దాకా ఎంతో మంది రాష్ట్రపతులు

దేశాన్ని సేవిస్తే కేవలం ఒకరు లేక ఇద్దరు వ్యక్తుల పేర్లు మాత్రమే గుర్తుండటానికి కారణం ఏమిటి? అందరు కూడ రాష్ట్రపతిగా వున్న వాళ్లే కదా? ఏమిటి వ్యత్యాసం? వీళ్ళు చాలా విలక్షణంగా జీవించారు. ఆదర్శమును అందరికీ పంచినారు.

లక్ష్యమున్న ప్రతి ఒక్కరూ విజయం సాధిస్తారు.

కానీ విలక్షణంగా బ్రతికిన వాళ్ళు జన హృదయములో శాశ్వతముగా నిలచి పోతారు.

విలక్షణతను ఆంగ్లములో Unique అని అంటారు. మీరు వాణిజ్య రంగములో USP అనే అక్షరాలను వాడుతుంటారు. దీని అర్థం Unique Selling Point అంటే ఒకే రకమైన వస్తువులతో బేరీజు వేసినప్పుడు ఒక దానికి మాత్రమే ఉండే ప్రత్యేకత అని చెప్పొచ్చు.

అలాగే వ్యక్తులందరూ ఒకేలా వున్నా విలక్షణంగా వుండే వాళ్ళు అరుదుగా వుంటారు. వారి దారెప్పుడూ రహదారే అవుతుంది.

ఇలా చెప్తుంటే దక్షిణ భారత చలనచిత్ర నటుడు అయిన సూపర్ స్టార్ రజనీకాంత్ గుర్తొచ్చాడు. ఎందుకు... ఆయన స్టైల్ వేరే వుంటుంది. తన అభినయం, నటన, నృత్యం, సంభాషణలు పలికే విధానం అన్ని విలక్షణమే. అందుకే ఆయనను విలక్షణ నటుడు అంటారు. అసలు అతను నడిచే విధానం, వేషము, భాష, చూపు, కళ్ళ జోడు పెట్టే విధానం, నోటిలో బబుల్గం వేసుకునే స్టైల్ ఇలా ఏది చూసినా డిఫరెంట్‌గా వుంటుంది. అందుకే అందరికీ ఆరాధ్య నటుడు అయ్యాడు.

ఇక ప్రస్తుతములోకి వస్తే... మన ప్రజల రాష్ట్రపతి గురించి మాట్లాడుకుందాం. క్రింద పేర్కొన్న విలక్షణతలను ఒక్క సారి పరిశీలిద్దాం.

1. కలామ్ నిజాయితీకి సరళమైన జీవన విధానానికీ ప్రసిద్ధి. రాత్రి 2 గంటలకు నిద్రించి, ఉదయం 6:30 – 7.00 మధ్య లేచేవాడు. అతనికి టెలివిజన్ లేదు. తన వ్యక్తిగత ఆస్తుల్లో పుస్తకాలు, వీణ, దుస్తులు, ఒక సిడి ప్లేయరు, ఒక ల్యాప్టాప్ ఉండేవి. అతను వీలునామా ఏమీ రాయలేదు.
2. అతను DRDO కు డైరెక్టరుగా పనిచేస్తున్నప్పుడు క్షిపణుల మీద దృష్టి కేంద్రీకరించాడు. అగ్ని క్షిపణి, పృథ్వి క్షిపణుల అభివృద్ధి, ప్రయోగాలకు అతనే సూత్రధారి. దీంతో అతనికి భారత దేశపు మిస్సైల్ మాన్ అని పేరు వచ్చింది
3. అతను భారత దేశపు రక్షణ మంత్రికి సాంకేతిక సలహాదారు అయ్యాడు. భారత ప్రభుత్వానికి ప్రధాన సాంకేతిక సలహాదారుగా అతనికి క్యాబినెట్ మంత్రి హోదా వచ్చింది. అతని కృషి ఫలితంగానే పోఖ్రాన్ -II అణుపరీక్షలు విజయవంతంగా జరిగాయి.
4. కలామ్ శాకాహారి, మద్యపాన వ్యతిరేకి, బ్రహ్మచారి. ఖచ్చితమైన వ్యక్తిగత క్రమశిక్షణను పాటించేవాడు
5. దేశ అత్యున్నత పౌర పురస్కారం అయిన భారతరత్నతో గౌరవించబడ్డారు.
6. చివరి క్షణము దాకా దేశ యువత తోటి మమేకం అయి జీవించారు.

ఇలాంటి జీవన శైలి వలననే కదా వారు మన గుండెల్లో నిలచి పోయారు. దీనినే విలక్షణత అంటారు. అంతే కాదు... ప్రపంచములో అద్భుత వ్యక్తులు ఎవరినైనా సరే తీసుకోండి... అది ఏ రంగములో అయినా సరే, వారికంటూ విలక్షణ జీవన శైలి వుంటుంది.

పిల్లలూ, ఎన్నాళ్ళు బ్రతికాము అన్నది కాదు...ఎలా బ్రతికాము అన్నది విలక్షణత. మీరు ఒక సారి మహాత్మా గాంధీ గురించి ఆలోచించండి... వారిలో అందరు గుర్తించ గలిగే విలక్షణత ఏమిటి ? అహింసను ఆయుధముగా చేసి భారతదేశ దాస్య శృంఖలాలు పగుల గొట్టి జాతిపితగా మారిపోయాడు కదా. ఆయన వేషము కూడా విలక్షణమైనదే. అందుకే వారు ఏమి చెప్పినా జనం తారక మంత్రంగా తీసుకున్నారు.

మీరు కూడా విలక్షణంగా బ్రతకాలి అనుకుంటున్నారా? ఒక సారి క్రింద పేర్కొన్న సూచనలు గమనించండి.

## సూచనలు:

1. మేధస్సుకు పదును పెట్టండి
2. వ్యక్తిత్వమును ఉన్నతంగా పెట్టుకోండి
3. నమ్మకాన్ని, విలువలను పోగొట్టుకోవద్దు
4. ఆశావాహ దృక్పథాన్ని పెంచుకోండి
5. పరిస్థితుల మీద అవగాహనతో స్పందించండి
6. ఉన్నత లక్ష్యంతో జీవించండి
7. జీవితానుభవాలను పరిగణలోకి తీసుకోండి
8. విలక్షణత, సృజనాత్మకతతో పని చేయండి
9. ఇష్టాయిష్టాలు ఏమిటో గుర్తించి వర్తించండి
10. ఏ విధమైన తపనతో కాలం గడుపుతున్నారో గమనించండి
11. భావవ్యక్తీకరణను అద్భుతంగా వుంచండి
12. వ్యక్తి గత, దైనందిక, అలవాట్లు ఎలా వున్నాయి చూడండి
13. తీరిక సమయాన్ని ఎలా గడుపుతున్నారో ఆలోచించండి
14. ఎంత సరదాగా జీవిస్తున్నారో గమనించండి
15. ఇతరులతో సంబంధ బాంధవ్యాలు ఎలా వున్నాయి.

ఇలా వీటిని ఆధారము చేసుకొని మనము కూడా విలక్షణముగా జీవించవచ్చు. యద్భావం తద్భవతి అన్నారు కదా...అంటే ఎట్టి భావనలో అట్టి వ్యక్తిత్వము అని. సాధారణ జీవితము అయినా పైన పేర్కొన్న గుణగణాలు మనము సాధించగలిగితే మనము ఏ రంగములో వున్నా అసాధారణ ప్రతిభ పాటవాలు ప్రదర్శిస్తూ వైవిధ్యంగా జీవించవచ్చు.

### ప్రేరణ మంత్రము

*You're born to be an original. Don't die a copy*





అంధకారం నుండి వెలుగు వైపు వెళ్ళడమే జీవితం యొక్క పరమార్థం. అజ్ఞానము నుండి జ్ఞానము దిశగా ఎక్కాల్సిన మెట్లను బాలచంద్ర ఈ పుస్తకం ద్వారా నిర్మాణం చేశాడు. విద్యార్థులు, ఉపాధ్యాయులు రోజూ ఒక అంశం చొప్పున దీన్ని క్షుణ్ణంగా చర్చించగలిగితే, మేధోమధనం చేయగలిగితే, పిల్లల నిజశక్తి సామర్థ్యాలు ఆవిష్కృతమవుతాయి అనడంలో సందేహం లేదు.

**- డా. చుక్కా రామయ్య, పూర్వ శాసనమండలి సభ్యులు, విద్యావేత్త, హైదరాబాద్, తెలంగాణ**



ఇంతటి విలువైన పుస్తకాన్ని ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాలలో ఉన్న సుమారు 10,000 ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా అందించాలన్న వారి తాపత్రయానికి అచ్చెరువొందాను. ఇంతటి మహనీయుని ద్వారా రూపు దిద్దుకున్న ఈ పుస్తకం నిజంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మరియు తల్లిదండ్రులకు జీవితములో మంచి మార్గములో నడిపించే దిక్సూచి కాగలదని నా దృఢమైన విశ్వాసము.

**- కన్నెగంటి బ్రహ్మానందం, చలనచిత్ర నటుడు, హైదరాబాద్**



63 అధ్యాయాలు. 63 సూత్రాలు. విజయానికి అడ్డదారుల్లేవు. 63 మెట్లూ ఎక్కవలసిందే. వేసిన ప్రతి అడుగూ మిమ్మల్ని మరింత బలోపేతులను చేస్తుంది. బాలచంద్ర ఒక సన్యాసి, ఒక తపస్వి, ఒక నిష్కామ కర్మయోగి. ఈయన ద్వారా భరతమాత మరింత సేవ పొందగలదని ఆశిస్తున్నాను. ఆయన స్ఫూర్తి ప్రసరిస్తున్న ఈ గ్రంథం చదువుతున్న మనం కూడా ఎంతో కొంత దూరం ఆ బాటలో పయనించే శక్తి పొందాలని సర్వేశ్వరుణ్ణి ప్రార్థిస్తున్నాను.

**- వాడ్రేవు చినవీరభద్రుడు, IAS Retd., ప్రసిద్ధ సాహితీవేత్త**



చదివినది 'జ్ఞాపకం రావడంలేదు' అన్న అంశము నుంచి, 'విలక్షణముగా జీవించడం ఎలా?' అన్న అంశము వరకు, ప్రతి విద్యార్థి, నిత్య జీవితములో ఎదుర్కొనే అంశాలే! వాటినే నేపథ్యంగా తీసుకొని, బాలచంద్ర వ్రాసిన ఈ పుస్తకములో 63 అలాంటి అంశాల గురించి వ్రాస్తూ, తను సోదాహరణంగా సూచించిన పరిష్కారములు అద్భుతం, అమోఘం. ఇవి మామూలు సలహాలుగా లేవు! ఒక ఆప్తుడు, ఒక విద్యార్థిపై ఉన్న ప్రేమతో, చేస్తున్న, మార్గనిర్దేశములా ఉండడం విశేషం.

**- కోటా శివకుమార్, B.Tech., MBA, CHRO - Oliva Clinics, India, Hyderabad**

abhaya FOUNDATION


6-3-609/140/1, Anandanagar, Khairathabad,
Hyderabad - 500004, Telangana

abhayafoundation@yahoo.com | abhaya@abhayafoundation.org

99592202450

8143707803

www.abhayafoundation.orgwww.abhayahome.org

abhayafoundationHyd | abhaya Foundation- Home of Happiness

abhayaheart | abhayaheart


Finding The Right Direction...

B.Sc., LL.B., F.C.S.